తెనాలి రామకృష్ణుని కావ్యపరిశీలనము

డాక్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య

894.82713209
కృష్ణ -- తెనాలి
67,763

ఆంధ్ర విశ్వకళాపరిషత్తు
విశాఖపట్టణము

ఆంధ్రకవిత్వవిశారదుండు నన్నయభట్టు
తిక్కనసోమయాజి

गुरुर्ब्रह्मा गुरुर्विष्णुर्गुरुर्देवो महेश्वरः।
गुरुरेव परं ब्रह्म तस्मै श्रीगुरवे नमः।।

శావ్యరసమును గొనియాడుచ

తెనాలి రామకృష్ణుని కావ్యపరిశీలనము

1480-1570.

డాక్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య

౧౧ VIII 1926 ~ ౧౭ III 1984

ఆంధ్ర విశ్వకళాపరిషత్తు

విశాఖపట్టణము

June 1996 Copies: 500

C-27496

894.827B209

67763

-500 044.

© Andhra University
Visakhapatnam

Series No. 209

Price: Rs. 200/-

Copies can be had from :

The Director
Press & Publications
Andhra University
Visakhapatnam 530 003

Printed by the Director, Andhra University Press & Publications, Visakhapatnam 530 003

డాక్టర్ ఎమ్. గోపాలకృష్ణ రెడ్డి
ఎం.ఏ. (ఆనర్స్), బి.ఎల్., పిహెచ్.డి.
ఉపాధ్యక్షులు
ఆంధ్ర విశ్వకళాపరిషత్తు

విశాఖపట్టణం
1-6-1996

పీ రి క

ఆంధ్ర సాహిత్యములో వేదార్థ ప్రతిపాదనమే ప్రధాన లక్ష్యముగా రచింపబడిన కావ్యములలో కళాపూర్ణోదయము, పాండురంగ మాహాత్మ్యము ముఖ్యమైనవి. పింగళి సూరన రచించిన కళాపూర్ణోదయ కావ్యమునకు అపూర్వమైన వ్యాఖ్యానము వ్రాసినవారు మహా మేధావి డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డిగారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తుకు సుదీర్ఘ కాలము ఉపాధ్యక్షులుగా పనిచేసిన డాక్టర్ సి.ఆర్. రెడ్డిగారి ఆ వ్యాఖ్యానమే నేటి వ్యాఖ్యాన రీతులకు మొట్టమొదటిది ; మార్గదర్శకమై వెలయుచున్నది.

తెనాలి రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యమునకు సమగ్ర పరిశోధనా గ్రంథము కూడ ఆంధ్ర విశ్వకళాపరిషత్తు నుండియే వెలువడుట ఆనందదాయకమైనది. డాక్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య డాక్టరేట్ పట్టము కొరకు వ్రాసిన పరిశోధన గ్రంథ మిది.

ఆంధ్ర సాహిత్య సరస్వతికి ఎనలేని సేవచేసిన మహాకవి తెనాలి రామకృష్ణుడు. అతడు వ్రాసిన మూడు కావ్యములలో పాండురంగ మాహాత్మ్యము అపూర్వమైనది. సరస్వతీదేవి ఆభరణములలో అది అమూల్యమైన మణిహారము. ఆ మణుల కాంతులను వర్ణించి, మూల్యము కట్టిన కృష్ణమాచార్యులవారి అమూల్య పరిశోధన యీ గ్రంథములో నున్నది.

రామకృష్ణుని కావ్యములోని రసము, అలంకారము, ధ్వని, పాత్రచిత్రణ మొదలైన కావ్య సౌందర్యములతో పాటు, వేదార్థ ప్రతిపాదకములైన రహస్యములను కృష్ణమాచార్యులుగారు వివరించిన తీరు అప్రతిమానమైనది. బీజాక్షరములు, మంత్రములు, అంగ ప్రత్యంగ దేవతలు, శరీరము అను దేవాలయములో వారి స్థానములు, న్యాసవిద్య, తీర్థ-క్షేత్ర-దైవతములు మొద

లైన ఆగమ శాస్త్ర రహస్యములు, భారతీయ జీవన విధానములో గృహస్థాశ్రమ ప్రాధాన్యము, గురుశిష్యుల సంబంధములు మొదలైన రహస్యము లెన్నియో ఈ పరిశోధన గ్రంథములో వివరింప బడినవి.

బహుముఖ ప్రజ్ఞావంతులైన డాక్టర్ సి.ఆర్. రెడ్డిగారు "కృష్ణమాచార్యుల వంటి ప్రతిభా సంపన్నుడైన కవి తన విద్యార్థిగా నున్నందుకు ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు గర్వించు చున్నది." అని లిఖిత పూర్వకముగా 1947లో ప్రశం సించిరి. ఆ తరువాత కృష్ణమాచార్యులుగారు ఈ విశ్వకళాపరిషత్తులోనే అధ్యాపకులుగా 1974 వరకు పనిచేసిరి. కవిగా, పరిశోధకుడుగా, బహుగ్రంథ రచయితగా మాత్రమే కాక సమాజ సేవకులుగా, వైద్యకళా నిష్ణాతులుగా, జ్యోతిశ్శాస్త్రవేత్తగా ఎక్కిరాల వారి సేవలు నిరుపమానమైనవి. వందల కొలది యువకులను చేరదీసి, శిక్షణమిచ్చి ఉద్యోగములపై నాధారపడని స్వయం పోషకులుగా తీర్చిదిద్దినవారు. వారి శిక్షణలో హోమియోవైద్య విద్య నభ్య సించిన అనుయాయులు నిర్వహించుచున్న వందకు పైగా వైద్యాలయములలో నేడు ప్రతివారము వేలకొలది రోగార్తులు ఉచితముగా వైద్యసేవ పొందుచున్నారు.

డాక్టర్ కట్టమంచివారు చెప్పినట్లు, బహుముఖ ప్రజ్ఞాశాలి యగు డాక్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య ఇక్కడ విద్యార్థిగా, పరిశోధకులుగా, అధ్యాపకులుగా నున్నందుకు ఆంధ్ర విశ్వకళాపరిషత్తు గర్వించుచున్నది. వారి పరిశోధన గ్రంథమును ప్రచురించుటకు సంతోషించుచున్నది.

-మద్ది గోపాలకృష్ణరెడ్డి

కంభంపాటి పార్వతీకుమార్
అంతర్జాతీయ గౌరవాధ్యక్షులు
జగద్గురు పీఠము

విశాఖపట్టణం
21-5-1996

యోగమూర్తి మాస్టర్ ఇ.కె.

ఎక్కిరాల కృష్ణమాచార్యులవారు బహుముఖ ప్రజ్ఞావంతులు. వారొనరించిన ప్రతికార్యమునందు దివ్యస్పర్శ స్పష్టముగ గోచరించును. ఒక దివ్య కిరణము రూపుగట్టుకొని వచ్చిన దన్నట్లుగ వారి చిఱునవ్వు మెరయుచుండును. వారు అసామాన్య ప్రజ్ఞావంతులైయుండి, సామాన్యునివలె సామాన్యులయందు జీవించి, వేలాది జీవప్రజ్ఞలను దివ్యత్వమున కున్ముఖులను గావించినారు. సంప్రదాయ బద్ధమైన జీవితమును సరళముగా మరలనొసగి, కుటుంబ వ్యవస్థను మధ్యతరగతి కుటుంబములలో స్థిరపరచి, పాశ్చాత్యనాగరిక ప్రభావమును అరికట్టినారు. పిల్లలకు, పెద్దలకు తగినరీతిన సలహాల నిచ్చి రక్షించినారు. సంప్రదాయము పేరున పేరుకుపోయిన మూఢ నమ్మకములను ఆచారములను ఖండించి వందలాది కుటుంబములను సన్మార్గమున నిలబెట్టినారు.

మాస్టరు సి.వి.వి. యోగమును ప్రాక్ పశ్చిమ దేశములందు సక్రమముగ పరిచయము చేసినారు. అనుయాయులకు యోగ సాధనము నందించినారు. శ్రీకృష్ణుడు, పతంజలి, మాస్టరు సి.వి.వి. అందించిన సమగ్రయోగమును జీవితమందు తానాచరించి, అనుయాయులకు మార్గదర్శకులైనారు. అంతర్యామి సాధనయందు తాము సిద్ధులై యితరులకు మానవ ధర్మము నందించినారు. దివ్య ప్రణాళికకు వాహికగ నిల్చి అనేకములైన మానవ సేవా కార్యక్రమముల నొనరించినారు. అహర్నిశలు ముప్పది సంవత్సరములు మానవసేవ గావించి పురుషమేధ మహాయజ్ఞముగ తమ జీవితమును నడపినారు. మంత్ర మార్గమున వేలాది జీవుల హృదయములలో శాశ్వతముగ నిలిచినారు. జీవితమును క్రీడాప్రాయముగ నిర్వర్తించి శాశ్వతులయినారు.

లక్షలాది రోగులకు హోమియోపతి వైద్యము ద్వారా స్వస్థత చేకూర్చినారు. ప్రాణమును సరిదిద్ది యోగమున నిలబెట్టినారు. తనవద్దకు వచ్చిన రోగులను యోగులుగ పరివర్తనము గావించినారు. దివ్యత్వమునకు ఒక వాహికగ నిలచి దివ్యజ్ఞానమును అలతి పదములలో సామాన్యుల కందించినారు.

వారు కవి, మంత్ర ద్రష్ట. క్రతు విద్యలయందు పరిపూర్ణులు. తంత్ర శాస్త్రమున మేటి. యోగము, జ్యోతిషము, వైద్యము వారి వద్దనుండి అందు కొనిన శిష్యులెందరో కలరు. వారి రచనలు, ప్రవచనములు, ప్రణాళికలు నిత్య ప్రబోధనములుగ జీవుల నాకర్షించు చుండును.

ఇతరుల సేవలో తన జీవితమును సమర్పణ చేసికొనిన యీ మహాత్ముని రచనలను, ప్రవచనములను, సంభాషణములను ప్రకృతియే కాపాడి వివిధ వాహికలు ఆధారముగ మానవుల కందించుచున్నది. ఆంధ్ర విశ్వవిద్యాలయము వారు వీరి పరిశోధనాంశమైన "రామకృష్ణుని రచనలు" ముప్పది సంవత్సరముల అనంతరము ఏ ప్రోద్బలము లేక ప్రచురించుట ప్రకృతి కార్యమే! వారి మాటలను, చేతలను, రచనలను ప్రకృతియే పొందుపరచుకొనుట మా బోంట్లకు అనుభవము. అది వారి స్వచ్ఛతకు, నిష్కామ యోగ జీవనమునకు నిదర్శనము.

గురుదేవులు కృష్ణమాచార్యులవారి జీవన శైలికూడ భవిష్యత్తులో ఒక పరిశోధనాంశము కాగలదు.

—కంభంపాటి పార్వతీకుమార్

చివుకుల రవిశర్మ
జగద్గురు పీఠము

విశాఖపట్టణం
1-6-1996

డాక్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య రచనా జీవితము

తాము నమ్మిన సత్యాలను ఆచరించే వారు కొందరు ఉంటారు. అటువంటి వ్యక్తులు కవులు, రచయితలు కూడా అయితే వారి రచనలలో జీవము, ఆత్మీయత తొణికిస లాడుతూ ఉంటాయి. అటువంటి వారిలో డాక్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య ఒకరు.

1926 ఆగష్టు 11 వ తేదీన ఎక్కిరాల అనంతాచార్య బుచ్చమ్మ దంపతులకు జన్మించిన కృష్ణమాచార్య సనాతన భారతీయ సంస్కారాన్ని బాల్యంలోనే తల్లిదండ్రుల నుండి అప్రయత్నంగానే స్వీకరించారు. 1944 లో కాశీ విశ్వవిద్యాలయం నుండి మెట్రిక్ పరీక్ష పాసయ్యారు. గుంటూరు హిందూ కాలేజిలో ఇంటర్మీడియట్ చదివే రోజుల్లో పళ్ళె పూర్ణప్రజ్ఞాచార్యుల వారి వద్ద కవిత్వం చెప్పడం అభ్యాసం చేశారు. 1946లో 'అర్పణ' అనే చిన్న కావ్యం వ్రాశారు. అదే వారి కవితా వ్యాసంగానికి ప్రారంభం.

1946-49 సంవత్సరాలలో విశాఖపట్టణం ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో బి. ఏ. ఆనర్స్ చదువుతూ ఉండగా, వైస్-ఛాన్సలర్ డాక్టర్ కట్టమంచి రామలింగా రెడ్డి గారు వివేకవిన్యాస హాస్టలు పర్యవేక్షణకు వచ్చినప్పుడు కృష్ణమాచార్య 'అర్పణ' పుస్తకాన్ని సమర్పించారు. కవితా మర్మజ్ఞులు, రసజ్ఞులు అయిన డాక్టర్ రెడ్డి గారు "ఘనుడాంధ్ర శుకయోగి వేమన వర్షించు జ్ఞానామృతము గ్రోలి" అనే భావం చదివి చాలా సంతోషించారు. తరువాత 1947 లో కృష్ణమాచార్య వ్రాసిన 'ఋతుగానము' అనే చిన్న కావ్యానికి పీఠిక వ్రాస్తూ "ఇంత చిన్న కుర్రవాడు ఇంత ప్రౌఢ కవిత్వం వ్రాయగలిగా డంటే సంతోషంగా ఉంది. కృష్ణమాచార్య వంటి ప్రతిభావంతుడైన కవి ఇక్కడ విద్యార్థిగా ఉన్నందుకు ఈ విశ్వకళాపరిషత్తు గర్విస్తున్నది." అని వ్రాశారు డాక్టర్ రెడ్డి గారు.

ఆరు ఋతువులతో కూడిన సంవత్సర పురుషుని స్పర్శతో ప్రకృతిలో వికసించే అందాలను వర్ణించడం కవుల కొక ముచ్చట. కాళిదాసు వంటి మహాకవులు సైతం ఋతు శోభలను వర్ణించారు. కృష్ణమాచార్య వ్రాసిన 'ఋతుగానము' కావ్యంలో దార్శనికత బీజప్రాయంగా కనబడుతుంది. ఆయన జీవ సంస్కారం, ఆత్మీయతా ముద్ర 'శ్రీపతి' అనే శతకంలో కనబడతాయి.

1947 లో కార్తీక పూర్ణిమ నాటి రాత్రి హాస్టలు మేడ పైనుండి వెన్నెలలో సముద్రాన్ని చూస్తూ ఉన్న కృష్ణమాచార్యులుగారికి మెరపు మెరసినట్లు ఒక అనుభూతి కలిగింది. ఆ అనుభూతిలో కృష్ణావతార ఘట్టాలతో 'రాసలీల' అనే కావ్యరచన అప్రయత్నంగా ప్రారంభమైంది. వేయి పద్యాలకు పైగా రచన సాగి తరువాత ఆగిపోయింది. వానిలో మొదటి భాగం మాత్రం ప్రచురించ బడింది. తరువాతి పద్యాలలో కొన్ని నష్టమై పోగా మిగిలినవి అముద్రితంగా ఉన్నాయి. భాగవతంలో వాచ్యంగా చెప్పబడని రహస్యా లెన్నో ఈ కావ్యంలో చెప్పబడినాయి.

జయదేవ పీయూషవర్షుని 'పీయూషలహరి' అనే శృంగారరూపకాన్ని ఆ పేరుతోనే రసమయ రూపకంగా తెలుగులో రచించారు.

1971 నవంబరులో ఒకనాటి రాత్రి కృష్ణుని కంఠసీమలో పుష్పమాల నలంకరించి నవరిస్తూ ఉన్న గోదాదేవి కృష్ణమాచార్యకు మెరపు మెరసినట్లు దర్శనమిచ్చింది. ఆ క్షణంలో కలిగిన అనుభూతిలో ఒక కావ్య రచన ప్రారంభమైంది. పన్నిద్దరు ఆళ్వారులలో 'ఆండాళ్' అని ప్రసిద్ధురాలైన గోదాదేవి కథ 'గోదావైభవము' అనే కావ్యంగా వేయి పద్యాలలో వ్రాశారు. భాగవతంలో ప్రతిపాదించబడి, వైష్ణవ సంప్రదాయంగా ప్రసిద్ధి చెందినది ప్రపన్నత అనే భక్తి మార్గ సాధన. మధుర భక్తి మార్గంలో సాగిన ఒక మాధుర్యధార ఈ కావ్యంలో కనబడుతుంది. శరణాగతిలోని సూక్ష్మ విశేషాలు దీనిలోని ప్రత్యేకత. రసము, అలంకారము, ధ్వని, పాత్రచిత్రణ, కథాసంవిధానము మొదలైన కావ్య లక్షణాలను బట్టి చూచినా తెలుగు సాహిత్యంలోని ఉత్తమ కావ్యాలలో ఇది ఒకటి. కృష్ణరూపాశ్రితమైన శృంగారభావన రూపాతీతమైన ప్రకృతి పురుషుల దివ్యశృంగారంగా పరిణతి చెందడం ఈ కావ్యంలో కనిపించే అద్భుత లక్షణం.

ఈ మార్గంలోనే సాగిన మరొక భక్తిరస కావ్యం 'సూరదాసు'. ఇది 150 పద్యాల వరకు సాగి అసంపూర్తిగా నిలిచిపోయింది.

ఇక సాహిత్య విమర్శలో కృష్ణమాచార్యుల ప్రతిభకు ఈ పరిశోధన గ్రంథమే సాక్ష్యం. తెనాలి రామకృష్ణుడు, నాచన సోముడు మొదలైన మహాకవుల కావ్యాల సమీక్ష 'కవి సన్నిధి' అనే పుస్తకంగా రూపొందింది.

విద్యకు, చదువుకు ఉన్న భేదాన్ని గ్రహించిన వారు కృష్ణమాచార్యులు గారు. నిజమైన విద్యవలన వ్యక్తిత్వం చక్కగా వికసించి, వినయం మొదలైన కొన్ని సుగుణాలను కూడా అదనంగా సమకూర్చుకుంటుంది. ఈ విద్యా విధానం భారతీయ సంస్కార ముద్రతో బాల్యం నుండి భావిపౌరులకు అందించాలనే సంకల్పంతో 'భారతీయ బాలశిక్ష' అనే పేర నాలుగు సంపుటాలు ప్రచురించారు.

ఆయన సంకల్పంతో ప్రారంభమై, ఆరు కేంద్రాలలో నడవ బడుతున్న బాలభాను విద్యాలయాలలో ఇవి పాఠ్య గ్రంథాలుగా ప్రవేశ పెట్టబడినాయి.

మానవ సేవలోనే మాధవ సేవ సాధ్యమవుతుందని నమ్మినవారు ఎక్కిరాల వారు. సాటి మానవుల యెడల చూపవలసిన సహకారం, ప్రేమ మొదలైన కళ్యాణ గుణాలను కాంతాసమ్మితంగా చెప్పే ప్రయత్నంలో ఎన్నో కథలు వ్రాశారు. 'కథాలహరి,' 'కథాసుధ' అనే పేర్లతో రెండు సంపుటాలు ప్రచురించబడినాయి. మానవ ధర్మాలను, మానవత్వపు విలువలను సూటిగా సూక్ష్మవిశ్లేషణతో ఆచరణీయంగా అందించిన ఉపదేశాలు 'ఉపదేశవాణి' అనే పేర ప్రచురించబడినాయి.

భారత భాగవత విష్ణుపురాణాదుల నుండి, దివ్యజ్ఞాన సంప్రదాయం నుండి తాను గ్రహించిన కృష్ణావతార రహస్యాలను మూలసూత్రాలుగా స్వీకరించి, కృష్ణకథా నవలా సప్తకంగా సంకల్పించి, వానిలో నాలుగు నవలలు రచించారు. 'మంద్రజాలము' అనే పుస్తకంలో మిగిలిన నవలల బీజాలు నిక్షిప్తమై ఉన్నాయి. కృష్ణావతార పూర్వరంగము, అవతారము, బాల్యక్రీడలు 'పురాణపురుషుడు' 'క్రీడామయుడు' అనే గ్రంథాలుగాను, అవతారపరిసమాప్తి ఘట్టాలను 'పురుషమేధము' అనే గ్రంథంగాను రచించారు. మిగిలిన మూడు గ్రంథాలూ రచించబడ కుండానే ఉండిపోయాయి. మంద్రజాలము, పురుషమేధము అనే గ్రంథాలను 'Mus c of The Soul' 'Man Sacrifice' అనే పేర్లతో ఇంగ్లీషులోనికి అనువదించారు.

ఇక నాటక రచన చూస్తే, కృష్ణమాచార్యులు గారు వ్రాసిన 'ప్రజాదినం' అనే హాస్యనాటిక అముద్రిత మైనా కొన్ని వందలసార్లు ప్రదర్శించ బడింది. భగవద్గీతలో ప్రతిపాదించబడినది, జనకాది రాజర్షులు అనుష్ఠించినది అయిన రాజవిద్య అనబడే యోగమయ జీవనాన్ని వ్యంగ్య మర్యాదతో ప్రతిపాదించే నాటకం 'సుభద్ర'. ఆయన అఘోర రుద్రమంత్రాన్ని అనుష్ఠిస్తూ ఉన్న రోజులలో బీభత్స రసప్రధానమైన 'అశ్వత్థామ' అనే నాటకాన్ని ఒక్కరాత్రిలో రచించారు. అది ఎన్నోమార్లు ప్రదర్శించబడింది.

విశ్వజనీనత ఎక్కిరాలవారి జీవితంలో ఒక భాగం. భిన్నజాతులను, భిన్నమతాలను వారు సమానంగా గౌరవించారు. గుంటూరులో బిషప్ అగ్నేషియస్ ముమ్మడిగారి కోరికపై పరిశుద్ధ బైబిలు గ్రంథంలోని PSALMS అనే భాగాన్ని 'దావీదురాజు కీర్తనలు' అనే పేర అనువదించి యిచ్చారు.

1962 వ సంవత్సరంలో వరాహమిహిరుని పేర 'మిహిర' అనే ఆంగ్ల మాసపత్రికను ప్రారంభించారు. అది జ్యోతిషాధ్యాత్మిక మాసపత్రిక. వ్యాసాలన్నీ వారే వ్రాశారు. పురుషసూక్తానికి, భగవద్గీతకు వారు వ్రాసిన సమన్వయం.

మొదలైనవి అపూర్వమైనవి. జ్యోతిశ్శాస్త్రం కేవలం లౌకికప్రయోజనాలకోసం కాదని, ఆధ్యాత్మికపరంగా దానికి మహత్తర ప్రయోజన మున్నదని ప్రతిపాదించినవారు కృష్ణమాచార్యులు గారు.

'మిహిర' పత్రిక ఏడు మాసాలు మాత్రమే నడిచింది. దాని ద్వారా పరిచయమైన ఆధ్యాత్మిక సాధకులు ఆల్బర్ట్ శశీ. బెల్జియం వాస్తవ్యులైన ఆ మహనీయుని కోరికపై 'Spiritual Astrology' అనే గ్రంథాన్ని 1964 లో రచించారు. వేదాలలో అంతర్భూతమైన జ్యోతిర్వేదాన్ని శాస్త్రీయమైన పద్ధతిలో, సాధకుల కనువైన రీతిలో ఈ గ్రంథంలో వివరించారు. పుస్తకరచనా కళలో పరిణతి దీనిలో కనబడుతుంది.

ఆల్బర్ట్ శశీ కోరికపైనే 1971లో 'Spiritual Psychology' అనే పుస్తకం రచించారు. ఆధ్యాత్మిక శరీర నిర్మాణము, కోశముల తీరుతెన్నులు, సాధకులకు కావలసిన ఆచరణీయ విధానాలు దీనిలో చక్కగా వివరించబడినాయి. తైత్తిరీయోపనిషత్తులోని కొన్ని అనువాకాలను స్వీకరించి ఎక్కిరాలవారు ఈ గ్రంథాన్ని రచించారని చాలామందికి తెలియదు. భారతీయ వైదిక విజ్ఞానాన్ని ఈ కాలానికి తగిన రీతిలో శాస్త్రీయంగా వివరిస్తే ఎంత అద్భుతంగా ఉంటుందో చెప్పడానికి ఈ గ్రంథమే చక్కని ఉదాహరణ.

ఆల్బర్ట్ శశీ అనుయాయుల ఆహ్వానంపైన 1972 లో బెల్జియం, ఫ్రాన్సు, స్విట్జర్లాండు, ఇటలీ, జర్మనీ దేశాలలో కృష్ణమాచార్యులు గారు ఆధ్యాత్మిక యాత్ర చేశారు. ప్రాచ్య – పాశ్చాత్య దేశాలలోని విభిన్న సంస్కృతులను, తత్త్వదృష్టిని, ప్రజ్ఞాపాటవాలను సమ్మేళనం చేయడం వారి సంకల్పం. తమ యాత్రావిశేషాలను, ఆ సాధకుల జిజ్ఞాసను వివరిస్తూ 'ప్రాక్పశ్చిమములు' అనే గ్రంథం వ్రాశారు.

వేదాలు, ఉపనిషత్తులు, పురాణేతిహాసాలు అన్నీ మానవుడే కేంద్రంగా రచించబడినాయి. మానవుని ఆధ్యాత్మిక పరిణామము, దానితోపాటు అప్రయత్నంగా లభించే లౌకికమైన అభివృద్ధి ముఖ్యలక్ష్యంగా కృష్ణమాచార్యులుగారి రచనలు కూడా సాగాయి. ఇంగ్లీషులో ఆయన వ్రాసిన 'The Science of the Man', 'The Book of Rituals', 'Wisdom of the Heavens' మొదలైన పుస్తకాలు ఆయా అంశాలలో సాధకులకు మార్గదర్శక మవుతాయి.

యోగ విద్యాసర్వస్వమై, పతంజలి మహర్షి విరచితమైన యోగసూత్రాలకు ఇంగ్లీషులో 'The Yoga of Patanjali' అనే పేర విపులమైన వ్యాఖ్యానం వ్రాశారు. పాశ్చాత్య దేశాలలోని సాధకుల కోసం శాస్త్రీయరీతిలో అంచెలంచెలుగా విభజించి, ఆచరణీయమైన పాఠాలుగా అందించారు. అవి 'Lessons on the Yoga of Patanjali' అనే పేర ప్రచురితమైనాయి.

నవయుగ యోగవిద్యా ప్రవర్తకులు, కుంభకోణం మాస్టరుగారుగా ప్రసిద్ధులు అయిన మాస్టర్ సి.వి.వి. గారు కృష్ణమాచార్యుల వారి గురుదేవులు. వారిని గురించి వ్రాసిన చిన్న పుస్తకం 'మాస్టర్ సి.వి.వి.' చాలా సరళంగా సాగిపోయే ఈ పుస్తకంలో ఏ స్థాయి సాధకునకైనా ఎప్పుడు ఏ సమస్య వచ్చినా పరిష్కారం లభిస్తుంది.

వేదాలలోను, పురాణేతిహాసాలలోను ఉన్న కొన్ని సూక్తాలను, స్తోత్రాలను భక్తిశ్రద్ధలతో చదువుకునే వారు ఎందరో ఉన్నారు. చాలామంది సరియైన అర్థం, సమన్వయం తెలియకుండానే చదువుకుంటున్నారు. వారి శ్రద్ధాభక్తుల కొక విశేషమైన ప్రయోజనాన్ని కలిగించాలనే సంకల్పంతో కృష్ణమాచార్యులవారు కొన్ని సూక్తాలకు, స్తోత్రాలకు వ్యాఖ్యానాలు వ్రాశారు. పురుషసూక్తము, శ్రీసూక్తము, రుద్రసూక్తము, విష్ణుసూక్తము, సరస్వతీ సూక్తము, సువర్ణ సూక్తము, అశ్వినుల స్తోత్రము, నారాయణ కవచము, విష్ణు సహస్రనామము ప్రచురిత మైనాయి. లలితా సహస్రనామ వ్యాఖ్యానం కాగితాలలోనే ఉండి పోయింది.

ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో చదివే రోజులలోనే తంత్రశాస్త్రగ్రంథాలు వారి దృష్టిని ఆకర్షించాయి. ఆర్థర్ ఏవలాన్ అనే ప్రసిద్ధనామంకల సర్ జాన్ వుడ్రాఫ్ మహాశయుడు సంకలనం చేసి, ఇంగ్లీషు అనువాద, వ్యాఖ్యలతో ప్రచురించిన మహానిర్వాణతంత్రము, కామకళా విలాసము, శారదా తిలక తంత్రము మొదలైన కొన్ని గ్రంథాలు అధ్యయనం చేసి, కొన్ని మంత్రాలను కూడా అనుష్ఠానం చేశారు. ద్యుమణిమాలా స్తోత్రమనే చిన్న స్తోత్రానికి చక్కని వ్యాఖ్యానం చెప్పారు. శారదా తిలక తంత్రంలోని మొదటి అధ్యాయానికి వారి చ్చిన వ్యాఖ్యచాలా అద్భుతమైనది. తంత్ర గ్రంథాలలో ఇంత మహత్తర విజ్ఞానం దాగి ఉన్నదా అని అబ్బుర పరిచే వ్యాఖ్యాన మిది. ఇవి రెండూ అముద్రితాలు.

కృష్ణమాచార్యులుగారు జ్యోతిశాస్త్రంలో నిష్ణాతులు. భారతీయ – పాశ్చాత్య శాస్త్రాలను సమన్వయించి వారు చెప్పిన జ్యోతిశ్శాస్త్ర పాఠాలు అద్భుతమైనవి. ఆ నోట్సులు వ్రాసి పెట్టుకున్న అనుచరులు 'జ్యోతిషప్రకాశము' అనే పేర మూడు సంపుటాలుగా ప్రచురించారు. భారతము, రఘువంశము మొదలైన గ్రంథాలలో దాగి యున్న జ్యోతిర్విద్యా విశేషాలను, జిజ్ఞాసువుల సందేహాలకు సమాధానాలను 'జ్యోతిర్విద్య' అనే పేరుతో ప్రచురించారు. వరాహమిహిరుని 'లఘుజాతకము' అనే గ్రంథానికి విపులమైన వ్యాఖ్యానం చెప్పారు. అది యింకా ముద్రించ బడవలసి ఉంది.

తమ కుమారుని ఆరోగ్యం నయం చేసుకోవడానికి హోమియో వైద్యం నేర్చుకొని, కుమారునికి ఆరోగ్యం చేకూర్చారు. వైద్య పరీక్ష పాసై, ఉచిత

వైద్యాలయం ప్రారంభించారు. ఒకటికి పదిగా వైద్యాలయాలు పెరిగాయి. ఆయన శిక్షణలో వైద్య విద్య నేర్చుకునేవారు వందల మంది చేరారు. వారి సౌకర్యం కోసం డాక్టర్ హానిమన్ వ్రాసిన 'ఆర్గనాన్' గ్రంథాన్ని తెలుగులోనికి అనువదించారు. హోమియో విధానము, ఔషధగుణ దీపిక వ్రాశారు. ఇంటిలోనే చిన్న చిన్న జబ్బులు నయం చేసుకోవడానికి 'గృహవైద్యము' అనే చిన్న పుస్తకం వ్రాశారు.

వివాహము, ఉపనయనము అనేవి వేడుకగా జరుపుకోవడం కాక, శాస్త్రీయమైన క్రతువులుగా అర్థం చేసుకోవడానికి వీలుగా 'కళ్యాణ సంస్కృతి' 'ఉపనయనము' అనే పుస్తకాలలో మంత్రాలకు అర్థాలు, శాస్త్రీయ సమన్వయము ఇచ్చారు.

సంవత్సరాల తరబడి పెద్దల అనుగ్రహంతో భగవద్గీతను అధ్యయనం చేసి, 'మంద్రగీత' అనే క్లుప్త వ్యాఖ్య వ్రాశారు. ఆంగ్ల భాషలో 'Mandra Scripture' అనే పుస్తకం వ్రాశారు. ఇది ఇంగ్లీషులో మళ్ళీ ఒక భగవద్గీత. మానసాతీతమైన ఒక చిత్రమైన శ్రుతి, లయ అందులో అనుభవ మవుతాయి. ఇక భగవద్గీతకు 'శంఖారావము' అనే పేర విపులమైన వ్యాఖ్యానం వ్రాశారు. ఇంతకు ముందటి అన్ని వ్యాఖ్యానాలను సమన్వయిస్తూ, తనదైన విశిష్ట భావనతో ఈ వ్యాఖ్యానం వ్రాశారు.

ఇక ఆయన వ్రాసిన వ్యాఖ్యానాలలో మహత్తర మైనది పోతనామాత్యుల భాగవతానికి వ్రాసిన వ్యాఖ్య. ఇంతకు ముందటి వ్యాఖ్యానాల కన్నా ఇది విశిష్టమైనదని ఆచార్య కె. వి. ఆర్. నరసింహం గారు వ్రాశారు. జిల్లెళ్ళమూడి సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ రాధాకృష్ణ శర్మ గారు ఈ వ్యాఖ్యను వ్యాస భాగవతానికి అన్వయింపజేస్తూ, సంస్కృతంలో 'సుధీసుధ' అనే వ్యాఖ్యానం వ్రాశారు. కృష్ణమాచార్యులు గారి ఈ వ్యాఖ్య 'భాగవత రహస్య ప్రకాశము' అనే పేర 16 సంపుటాలలో ప్రచురించబడింది. ప్రథమస్కంధం నుండి సప్తమ స్కంధంలో కొంతభాగం వరకు మాత్రమే ఆచార్యుల వారి రచన జరిగింది.

బహుముఖంగా సాగిన ఎక్కిరాల కృష్ణమాచార్యులు గారి రచన లన్నిటిలోనూ సాటి మానవుల యెడ ప్రేమ, ఆధ్యాత్మిక పరిణతి గోచరిస్తాయి. ఆనందం పంచి పెట్టిన కొద్దీ మనలో పెరుగుతుందని, గొప్పదనం కన్న సుఖాంతులు విలువైనవని వారు నమ్మిన సత్యాలు ప్రతి పుస్తకంలోనూ కనబడతాయి.

— చివుకుల రవిశర్మ

ప్రవేశిక

[డాక్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య అప్పుడప్పుడు చేసిన ప్రసంగములు, వ్రాసిన వ్యాసములు కొన్ని లభించినవి. వానిని సంకలనము చేసి, ఈ పరిశోధనా గ్రంథమునకు పీఠికగా ప్రచురించుచున్నాము.]

తెనాలి రామకృష్ణుడు

పది శతాబ్దులనుండి సుదీర్ఘముగ, సజీవముగ ప్రవహించుచున్న ఆంధ్ర వాఙ్మయము అను పుణ్యనదికి అనేక పవిత్ర ఘట్టములున్నవి. అవి యన్నియు కార్తీక మాసపు నదీ జలముల వలె రసవంతములై, తేటలై చక్కని తెన్నున చవులు చిందుచుండును. అన్నియు లలిత గంభీరములు. అందు రాయల యుగమున వెలసిన ప్రబంధశాఖలో జాతీయత యను క్రొత్త రుచి పరిణమించినది. అప్పటి కవులలో తెనాలి రామకృష్ణుడొక విలక్షణవ్యక్తి. అతని కవితా స్పర్శచే ఆంధ్ర సరస్వతీ స్రవంతి చమత్కృతియను శంఖున బోసిన తీర్థమైనది.

ఈ కవి తండ్రి పేరు గార్లపాటి రామయ్య. ఆయన తరమున వారు తమ నివాసమగు తెనాలినుండి విజయనగర ప్రాంతమునకు చేరుటచే తెనాలి వారు అని వ్యవహరింప బడుటయు, అది వారి యింటి పేరగుటయు సంభవించినది. వారిది సంప్రదాయసిద్ధమైన శైవ కుటుంబము. రామకృష్ణుడు శైవవైష్ణవ శాక్తాగమ సిద్ధులైన పరమ గురువుల నాశ్రయించి వేదవేదాంగములు, ఉపనిషత్పురాణములు, ఆగమములు అభ్యసించెను. సంస్కృతాంధ్రముల యందును, సాహిత్య పరిపోషకములైన వివిధ శాస్త్రము లందును పారంగతుడయ్యెను. యోగ విద్యను సమగ్రముగ నభ్యసించి ఇహపరసమన్వయమైన సనాతన ధర్మమునకు మూల స్తంభములలో నొకడయ్యెను. సంస్కారమునకు వన్నె పెట్టు పాండిత్యము, పాండిత్యమునకు వెలుగు నిచ్చు కవితా చమత్కృతి, కావ్యమునకు మహాకావ్యత్వము నిచ్చు సనాతన ధర్మ సంస్థాపనము ఈ కవియొక్క ప్రత్యేక లక్షణములు. నిత్య జీవితము సందలి యితని యాదర్శము కూడ నాలుగాశ్రమముల సమన్వయము గల యోగ జీవితము. అన్నిటి కన్న మిన్నగా నితడు చైతన్యస్వామి భక్తి యోగ ప్రభావమున నుత్తేజితుడై చైతన్యులతో పండరీ క్షేత్రము నుండి పాదచారియై విద్యానగరము వరకు నడచి వచ్చెను. చైతన్యుల యాదేశమున పాండురంగ విరలాగమమును స్వతంత్రముగా సృష్టించి, తన పాండురంగ మాహాత్మ్యమున స్థాపించెను.

ఈ కవికి చిన్ననాటి నుండియు రెండు పేర్లున్నవి. ఒకటి రామలింగడు ; రెండు రామకృష్ణుడు. ఇతడు రచించిన గ్రంథములలో లభ్యమైనవి మూడు. (1) ఘటికాచల మాహాత్మ్యము. (2) ఉద్భటారాధ్య చరిత్రము (3) పాండురంగ మాహాత్మ్యము. అందు మొదటిది వైష్ణవ ధర్మమును, రెండవది వేదాంతర్గతమైన శైవ ధర్మమును స్థాపించును. మూడవది త్రిరావృత్తమైన పురావృ

తము, ఇందలి మూడావరణలను యీ దిగువ విధమున దర్శింప వలెను. (1) శైవ, వైష్ణవ, శాక్తాగమముల సమన్వయము. (2) పుణ్యక్షేత్రము, పుణ్యతీర్థము, పరదైవతముల సమాగమము. (3) భక్తి, జ్ఞాన, కర్మ యోగ ముల సమన్వయము. (4) మంత్రయోగము, హఠయోగము, రాజయోగముల సమన్వయము. ఈ సమన్వయముల మొత్తము నిష్కామ కర్మయోగమైన గృహస్థుని నిత్య జీవితములోను, ప్రపన్నుని సాత్త్వీక మార్గ సమన్వితమైన బంధాతీత సుఖజీవనములోను ప్రతిబింబింప జేయ బడినది. పుండరీకుని జీవిత చిత్రణమునను, సుశీల పాతివ్రత్యమునను, ముంజభోజుని రాజధర్మాచరణము నను పై సమన్వయము సాధింపబడినది.

పాత్ర చిత్రణ వైభవము :

జీవితమును ఉత్తమ పరమార్థ సాధనముగా జేయనెంచు పాత్ర లిందు చిత్రింప బడినవి. అందు నారదుడు అజన్మ బ్రహ్మచర్యమున బంధమోచనము కలదని నమ్మి, అట్టి బంధమోచన విద్యకై మూడులోకములలో తిరిగి వెదకు లాడెను. కాని లాభము లేక పోయినది. పరమార్థము కోరి పరమేశ్వరుని ఆశ్రయింపక తప్పలేదు. "కంపల బడ్డ కాకినై తిరిగితి" ననియు "కాళ్ళుల ధావతియయ్యె" ననియు తన పరమ గురువగు పరమేశ్వరునితో వాపోయెను. కాని గురువు 'రెట్టింపుగా' గృహస్థుడు! అట్టి గురువు నాశ్రయించుటకు నారదుడు మొదట సంకోచించినను పిదప ఆశ్రయింపక తప్పలేదు. సకల ఋషులకును, కుమారస్వామికిని ఉపదేశించిన పరమార్థము తనకు కూడ నుపదేశింపుమని ఈశ్వరుని వేడెను. నారదుడు శివు నాశ్రయించిన ఘట్టమును రామకృష్ణకవి వర్ణించిన రీతిలోనే యతని చమత్కృతి యంతయు వ్యంగ్య వైభవముతో సాక్షాత్క రించును. ఏ గృహస్థాశ్రమము పై నారదునకు చిన్న చూపు కలదో, అట్టి గృహస్థుని రూపమున సాక్షాత్కరించిన పరమేశ్వరుని వర్ణనలో రామకృష్ణుని రచ నలోని కొంటెతన మంతయు కనిపించును తాను బ్రహ్మచారినను అభిమానము వలన నారదుడు గృహస్థుడగు పరమేశ్వరుడు గురుమూర్తి యని గ్రహింపలేక పోయెను. "ఓ పుర నిషూదన! నీ యనుజీవి నేను, మీ దరయక మోస పోయితి" నని యంగీకరించెను.

> "సాధుజనులతోడి సంసర్గ ముడివిన
> హాని భయము క్లేశ మావహిల్లు
> నెంత వారికైన; నిది నిక్క మనుమాట
> నన్ను మోచి వచ్చె, నాగహార!"

అని వినయముగ ప్రాధేయ పడెను. శివుడు గృహస్థుడైనను, మన్మథుని దమించిన వాడని దర్శించి "దండితానంగ" అని సంబోధించెను. పరమేశ్వరుని లో నీతనికి కలిగిన గురుదర్శనము వర్ణనము నందు సమస్త పరమార్థ సమన్వయ మున్నది. "కాంచి విరించి నందనుఁడు కన్నులు బిమ్మిటి నొంద డింది, యొక్కించుక కొంకు దేలి, కనియెన్ తదుగ్ర మహోగ్ర దీప్తిలో పంచముఖున్·

శిఖీక్షణ విభాసి లలాటు, మరుజ్ఝరీధరున్, సంచిత సత్కృపారస వశంవదు, నాదికపిన్, వృషాకపిన్."

ఇందు పరమేశ్వరుడు పంచముఖుడుగా, అనగా పంచాక్షరీ స్వరూపుడుగా, దర్శన మిచ్చెను. అగ్ని నేత్రము లలాటమునను, గంగ శిరస్సునను దర్శన మిచ్చెను. అనగా జ్ఞానము తోడి సత్కృపారసము శివుని స్వరూపమట!

"విడువని వైరవృత్తిఁ దఱివేచి రతీశుఁడు వేతికత్తి నె
క్కుడు రభసంబునన్ శిరసు గ్రుద్దిన, నయ్యలుఁగెల్లఁ బోయి లో
నడఁగ బహిఃస్థ తత్సరు పదార్పిత సూకర దంష్ట్ర కైవడిన్
జడముడిఁ జంద్రరేఖ వెదజల్లఁగ చల్లని చిన్ని వెన్నెలన్"

మన్మథుడు వైరముతో సమయము చూచి శివుడు కన్నులు మూసి యున్న పుడు తన చేతి చురకత్తిని శివుని తలలోనికి పొడిచెనట. కత్తి తలలోనికి దిగి పోయి, దాని పిడియైన అడవిపంది కోర వెలుపల కనిపించు చున్నట్లు, జడల చుట్టలో చంద్రరేఖ చల్లని వెన్నెలలు చిందెనట! ఇందలి వ్యంగ్యము గమనింప దగినది. మన్మథుని భస్మము చేసిన శివునిలోనే మన్మథ తత్త్వమిమిడి, లోబడినది. బ్రహ్మచారి ననుకొను నారదుని గర్వమున కెంతదెబ్బ! అదే సమయమున పార్వతియు గురుమూర్తి వామాంకమున నలంకరించి దర్శన మిచ్చినది. యోగమూర్తియైన గురుమూర్తి ధరించిన పులి చర్మము నారదుని కన్నులకెట్లు కనిపించెనో చూచితిరా? పార్వతి కాటుక కన్నులతో కస్తూరి తిలక ముతో నలంకరింపబడిన మొగమునకు పసుపురాచి స్నానముచేసి, యొక వస్త్ర ముతో మొగము తుడుచు కొనెను. ఆ వస్త్రమునే ఈశ్వరుడు ప్రేమతో ధరించి తన్ను హేళన చేయుచుండెనా యన్నట్లు కనుపించినదా పులి చర్మము! పోనీ ఈ గురువు కపట యోగి యనుకొందమా, యింద్రాది దేవతలు, సకల ఋషులు దండ నమస్క్రియలతో తండములై నెట్టు కొనుచున్నారు. ప్రమథనాథుల బంగారు బెత్తములు తగిలి కిరీటములు జారుచున్నను మొండితనమున సందడి చేయుచు శివ దర్శనమునకు నెట్టుకొనుచు లోనికి జొరబడుచున్నారు. వారంద రిని దయతో పండిన నిండుచూపులతో గురువు గౌరవించు చున్నాడు. ఇట్టి చిత్త ప్రవృత్తి గల నారదునికి శివుడు చేసిన మోక్షోపదేశ మేమి? ప్రకట గుప్తా కృతి యైన పరమార్థ తత్త్వ రహస్యము.

"ఈ సమస్త తత్త్వము నే నొకరుండ నెఱుంగుదున్" అని మొదటి యుపదేశము. 'నేను' అను తత్త్వమొకటే ఈ రహస్యమును తెలియగలదు. ప్రతి జీవియందు గల 'నేను' అను ప్రజ్ఞయే గుప్తమగు తత్త్వము.

"డాఁపదగువాని మిక్కిలి డాఁపగలిగి, క్షేత్రములకెల్ల
పరమమై కీర్తివడయు నా మహాక్షేత్ర రాజము నెఱుఁగ జాలు
ప్రాజ్ఞుఁడగు వాఁడు మునుగఁడు పాపజలధి"

ఈ 'నే' నను తత్త్వము దాగియున్న క్షేత్రమే దేహము. అందు జీవునిలో భగవంతు డున్నాడని తెలిసినవాడు పాపమున మునుగడట!

"పుడమికి వితస్తి మాత్రవు పొడవున నా క్షేత్రరాజము విరాజిల్లును."

మట్టి ముద్దయైన యీ శరీరమున మనము కూర్చుండు స్థానమే భూమి, దానినే యోగులు మూలాధారమందురు. దానికి పై భాగమున నీ క్షేత్ర మున్నదట!

"నడుమను జ్యోతిర్ధ్యానము వొడువున తేజోమయాభి వర్ణితమూర్తిన్"

నడుమ హృదయ మున్నది. అందు మానవ జీవిత మొక జ్యోతిర్ధ్యానము. అచట నున్న తేజోమూర్తిని నారదునకు శివు డుపదేశించెను. ఈ తత్త్వమును సాధించి తెచ్చిన పుణ్యమూర్తి పుండరీకుడు. అతడు సకల వేదవేదాంగ పారంగతుడై, బ్రహ్మచర్యము తరువాత గృహస్థాశ్రమము స్వీకరించి, సంతతిని హొంది, వారలను విద్యావినయాన్వితులుగ జేసి, తుదివరకు తలిదండ్రులను సేవించుచు సాధన చేసెను. నడి వయసు దాటిన వెనుక వానప్రస్థము స్వీకరించెను. ఒక యాశ్రమము నిర్మించుకొని తపస్సాధన చేసి బాలకృష్ణ మూర్తి నుపాసించెను. కృష్ణుడు ప్రత్యక్షమై యిట్లనెను. "నీ పితృభక్తి నీ తపము నీ వనిశంబు నొనర్చు యర్చ యుద్దీపిత హర్షు జేసె, జగతీసురనందన, నన్ను." ఇందు పితృభక్తి మోక్షసాధనకు మొదటి వ్రతముగ కీర్తింపబడినది. భూతదయ రెండవదిగ చెప్పబడినది. సజ్జనులను సేవించుటచే తాను తృప్తి చెందినట్లు విగ్రహాది రూపములలో చేసిన సేవకు తృప్తి చెందనని బాలకృష్ణుడు సెలవిచ్చెను.

సద్భక్త సేవ చేతన్
మద్భావము తుష్టిఁ గన్న మాడ్కి తరుశిలా
ద్యుద్భూత ప్రతిమార్చల
ముద్భరితము గాదు నిక్కముగఁ దలపోయన్.

ఇంకను బాలకృష్ణుని పలుకులలో రామకృష్ణు డిచ్చిన సనాతన ధర్మసందేశము ఎంత విశ్వజనీనమో గమనింపుడు!

"వలనా, యేటికి నాశ్రయించి మనగా వానీరమున్, నీరమున్?
తలవెట్టే, పచరింప నేటికి సమిద్ధానంబు దానంబు? న
చ్చలమా, యేటికి నెత్తిగొట్టు కొనగా సన్న్యాసమున్ న్యాసమున్?
గలి దేజాలు మదీయ భక్తిరుచి భక్తశ్రేణి క్రాంతమున్"

మానవునిలో దైవము చూడగల వానికి వాయుభక్షణ జలభక్షణ వ్రతములు, సమిధలను తెచ్చి హోమము చేయుట, సన్న్యాసము పుచ్చుకొనుటతో పనిలేదని లోకమునకు చాటి చెప్పు చున్నాడీ కవి. భక్తి గల మానవునకును భగవంతునకును గల సంబంధమే దేహము ప్రాణము వంటిది. అట్టి వారిలోనే దైవముండును. వానినే దర్శింపవలెను. "నా యందు భక్తుడుండున్, పాయకనే నధివసింతు భక్తుని యందున్, మాయిరువురకును గలుగును కాయ ప్రాణాను కూల్య కౌశల్యంబుల్." అంతే కాదు సాధుజనులకు కానివాడెవడో, అతడు దేవునకును కానివాడు. సాధుజనులను దైవముగ నెంచిన వాడే దైవమును చూచినవాడు.

అట్టి లక్షణములు గల పుండరీకునకు వరమిత్తునని బాలకృష్ణుడు పల్కెను. పుండరీకుడు కోరిన వరమే తెనాలి రామకృష్ణుని పరమోపదేశము. అతడిట్లు కోరెను. "నిన్ను చూచిన వానికి కోరదగిన వరము లేముండును? కల్ప వృక్షము క్రింద నిలబడి సొరకాయ యిమ్మని కోరువాడుండునా? నీవు కోరు మంటివి గనుక నొక యద్భుతమైన వరము కోరెదను. నీవిపుడు నడుముపై చేతులు నిలిపి ఠీవితో నిలుచుంటివి. ఈ రూపమున నిట్లే నిలబడిపొమ్ము. నిన్ను దర్శించిన భక్తులందరకు నాకిచ్చిన యనుగ్రహమునే యిమ్ము. ఇంతకన్న నేను కోరదగినదిలేదు." కృష్ణుడు పుండరీకుడు కోరిన వరమిచ్చి యిట్లనెను. "ఈ క్షేత్రము నీ పేర శాశ్వతముగా వెలయగలదు. నీ పేర నన్ను తలచు వారికి బంధమోచనము కలుగును."

నారదునకి పరమోపదేశము పరమేశ్వరుడు సూటిగా చేయలేదు. నారదుని చిత్త వృత్తి ననుసరించి చిన్నమెలిక పెట్టెను. పుండరీకుని కథా ప్రసక్తి తెచ్చి, మొదట పుండరీక క్షేత్రమును పొగిడి, అచ్చట నరసింహు డుండె ననియు, అతనివలన నిగమశర్మ ముక్తిచెందెననియు, నిగమశర్మోపాఖ్యానము చెప్ప నారంభించెను. గృహస్థులకుముక్తి యున్నదో లేదో యని సందేహించుచున్న నారదునకు, పాపము చేసిన వారి యెడ తీవ్రబుద్ధి యుండుట తగదని పరమేశ్వ రుని పరిహాసము. నిగమశర్మ చేయని పాపము లేదు. ఐనను క్షమించి మోక్ష మిచ్చుటకు, దేవునకే అభ్యంతరము లేకపోయినది. ఇక నీ కభ్యంతరమేల యని నారదుని హెచ్చరించుట ఇందున్నది.

ఈ కథ చెప్పిన వెనుక పుండరీకుని కథ చెప్పుటలో రామకృష్ణుని కవితా సృష్టిలోని శివగురుమూర్తి కెంత చమత్కారము గలదో తెలియు చున్నది. ఇట్లే సుశీల కథను కూడ మరి యొక ఉపదేశము కొఱకై చెప్పెను. స్త్రీలకు, పశుపక్ష్యాదులకు కూడ ముక్తి యుండునా యని నారదుని వంటి పండితులకు సందేహము కలిగినది. ఒక గోవు కృష్ణుని వేణుగానము విని క్షీరము వర్షింపగా పాలనురుగు గాలికెగిరి కృష్ణుని మౌళి నలంకరించెను. ఆ గోవు సుశీల యను పతివ్రతగా పుట్టెను. దేవాలయ సన్నిధిని పొందిన ఎలుక, కాకి, పాము కూడ సుశీల పుత్రులైన మానవులుగ పుట్టి మానవ సేవతో తరించిరి. ఇంతకన్న నుపదేశింపవలసిన పరమార్థమే మున్నది?

సుశీల తన కొడుకులకు చేసిన యుపదేశము రూపమున నారదునకు శివుడు మరికొన్ని రహస్యములను చెప్పెను. ఆమె చేసిన యుపదేశము సకలాగమసమ్మతము. ఇది కడు రమ్యమైన యుపదేశము. సాధన లేనివాని జీవితమున కీడుకలుగుట కెంత యవకాశమున్నదో గమనింపుడు. భోగమున కలవాటుపడిన శరీరము సర్పము వలె వక్రగతి మానదు. కొండలోని ధాతువులకు ఎఱ్ఱదన మెట్లు సహజమో, అట్లే దేహములోని ధాతువు లకు రాగబంధము సహజము. నూలుపోగుల అల్లికకు విరుగుట యెట్లు తప్పదో, దేహమునకు మృత్యువు అట్లు తప్పదు. అలలతో నిండిన సముద్ర జలములు దప్పిక తీర్చుట భ్రాంతియైనట్లు, అహంకారాది సంకల్పమున పట్టుదల లతో జీవనమునకు తృప్తి కలుగుటయు భ్రాంతియే! మనస్సునకు వ్యామోహము

తెగనివాడు ఎన్నిమారులు స్నానము చేసినను, తలగొరిగించుకొని సన్యసించినను దంభమే యగును గాని లాభము లేదు. అట్టివారు "తమ మొగంబు జూడు, తమ్ము జూడుము" అని విఱ్ఱవీగుదురు. వారు శాంతిని గోరుట యేనుగుమీద నున్నవానిని సున్నమడిగి తెచ్చుకొనుట వంటిది.

ఈ యుపదేశముతో కొంత కుదురు చిక్కిన నారదునకు సూటిగా గృహస్థాశ్రమము ఉత్తమ మోక్షసాధన మనియు, పదిమందితో పొత్తుకుదిరిన వాడే దైవము నెరిగిన వాడనియు చేసిన యుపదేశము గమనింపదగినది.

"పరిణీత యగు నింతి ప్రతికూల గాదేని,
తనయుండు తన యాజ్ఞ దాటడేని,
నిజసహోదరులు వినీతులై మనిరేని,
కోడ లోరుపుదక్క గొణగదేని,
కూఁతు రీలువునందు కొదవ చూపదయేని,
ఋణమను పాతకం బెనయదేని,
తేజోగరిమ పరాధీనతఁ జెడదేని,
నిందాంధకారంబు నెఱయదేని,
న్యాయమున మొల్లముల పెల్లు డాయునేని,
అతిథి సంతర్పణం బింట నమరునేని,
నముచితాచారమును కొనసాగునేని,
కలదె గృహమేధి ధర్మంబు కంటెమేలు !"

మోక్షమనగా నితర జీవులలోని దైవాంశను జూచు చైతన్య స్వరూపమే గాని జడముకాదని రామకృష్ణుని సందేశము.

"కీలారమున నుండి పాలింటికే తేర,
బహుధాన్యములు చేలఁ బండియొరగ,
యెడనెడ పెండ్లిండ్లు వడుగులు వొడమఁ, గృ
తార్థులై యర్థింప నర్థు లలరఁ,
బరివారికాకోటి పనిపాటు పాటింపఁ,
జుట్టంపు సందడి నెట్టుకొనఁగ,
గ్రామ మెంతయు నిజప్రాభవంబున మన,
సత్య నిష్ఠకుఁ దన్ను సాక్షిగోర,
నిత్య నైమిత్తికములు నిర్ద్రిద్రబుద్ధి
నాచరించుచు, హరి భక్తు మాత్మ భార్య
భక్తినిడ భుక్తి గొనుచున్కి ముక్తిగాని,
నిదుర వంటిది ఱాతి వంటిదియుఁ గాదు"

లోకమున పామరులు కథలుగ చెప్పుకొను రామలింగనికిని వాస్తవమైన రామకృష్ణుని నిజస్వరూపమునకు నెంత భేదమున్నది ! ఇతడొక యుపదేష్ట యగు ఋషి. తన జీవిత సందేశమును కావ్య మాధుర్యముతో జోడించి లోకమున కందించెను. పాండురంగ మాహాత్మ్యము పరమభాగవత చరిత్ర రూపమగు చక్కని ప్రమాణ ప్రబంధము. ఇది రామకృష్ణుని కీర్తి ధ్వజ మన వచ్చును. అతని మిగిలిన కావ్యముల కింత పరివ్యాప్తి లేదు. ఈ గ్రంథమును కొందరు వైష్ణవ గ్రంథ మనుకొనిరి. ఇందలి వైష్ణవము తెచ్చిపెట్టుకొన్న దనియు, యీ గ్రంథమున రామకృష్ణుని సహజ శైవము అప్రయత్నముగ వ్యక్తమగుచున్నదనియు కొంద రభిప్రాయపడిరి. ఈ గ్రంథము నందు శైవము వైష్ణవము చక్కని సమన్వయ స్వరూపము నందుటయే యిట్టి భ్రాంతులకు కారణము. శైవాభిమానము కలవారికిది శైవ గ్రంథముగను, వైష్ణవాభిమానము గల వారికి వైష్ణవ గ్రంథముగను కనిపించు నంతటి సహజత్వ మిందున్నది. వాస్తవమున కిది శైవ – వైష్ణవ – శాక్త సమన్వయ స్వరూపమగు వైదిక నూతనాగమ గ్రంథము.

ఇతని రచనలోని గంభీర శాస్త్రాంశములు ఇతని సహజ హాస్య ధోరణి వలన సౌలభ్యము చేకూర్చుకొన్నవి. ఇతని హాస్యము సుకుమారము, గంభీరము, కాంతా సమ్మితము. అహోబల నృసింహమూర్తి హాస్య గర్భితముగ నెట్లు వర్ణింప బడెనో గమనింపుడు.

"మిగుల కన్నొదవిన బిగువ యెక్కుడు గాని
  కరుణాకటాక్ష వీక్షణము వాడు
దంష్ట్రావిటంక వర్ధనము యెక్కుడుగాని
  ముద్దు చందురు నేలు మోము వాడు
నరమృగదేహ విస్పురణ మెక్కుడుగాని
  బహుకోటి మదన రూపంబువాడు
దైత్యుదండించు నుద్ధతియె యెక్కుడుగాని
  శ్రిత జనావళుల రక్షించువాడు
నాగ గరుడాద్రి సింహాసనమున నుండి
యెల్ల జగములనేలు లక్ష్మీశ్వరుండు
శ్రీ అహోబల నరసింహ నాయకుండు
శఠ మఠన గోత్రమంత్రి రక్షణ మొనరించు."

నిగమశర్మ కథలో నరసింహుడే నిగమశర్మకు మోక్షమిచ్చునట్లు వర్ణింప బడినది. ఈ మూర్తి పై కెంత భయంకరుడో తత్త్వమున నంత దయామయుడని యీ కథ వలన నిరూపింపబడినది. కుండల తీర్థమున నరసింహుడు కుంజరాశ నత దాల్చెనని చమత్కరింప బడినది. కుంజరాశన మనగా యేనుగున కాహారము. నరసింహుడు సింహముఖమువాడు. అత డేనుగున కెట్లా హారమగును ? ఇచ్చట కుంజరాశన మనగా యేనుగుల కాహారమగు రావిచెట్టు. నరసింహుడు రావిచెట్టు నందు వెలసెనని యీ కవి చేసిన చమత్కారమందలి హాస్యము అతి సున్నితమైనది. ఇట్టి పట్టులు గమనించినపుడెల్ల రామకృష్ణునకు కాళికాదేవి ప్రత్యక్షమయ్యెననియు, నామెతో నతడు హాస్య

సంభాషణ చేసెననియు చెప్పుకొను సన్నివేశము నిజమే యనిపించును. శాపవశమున కప్పయై పోయిన అయుతుడు శాపాంతము వఱకు నరసింహస్వామి పాలబడి నట్లు వర్ణింపబడెను. అందలి ఔచితి అపురూపమైనది. మృగరూపము ధరించు మానవులకు మోక్షమిచ్చుటకు 'నరసింహ' రూపుడే తగునని చిన్న హాస్యరేఖ!

ఒక్క స్త్రీని పెండ్లియాడుమని చెప్పిన గురువు మాటను అయుతుడు ధిక్కరించి శాపవశమున కప్పయయ్యెను. అడు కప్పలను పెక్కింటిని వివాహమాడి సంతానము బడసిన గాని శాపము తీరలేదు. ఈ కథ చెప్పుటలో శివుడు నారదుని చేసిన పరిహాసము గమనింప దగినది. గురుధిక్కారము గలవాడు తపస్సాధనము చేసినను చెడిసి కొట్టును. తగనివాడు ధర్మ నిర్ణయము చేయుటకు పూనుకొనక, యెంతవాడైనను తలవంచి ధర్మము నవలంబింపవలెను.

ఇట్టి జీవిత సందేశము శివగురుమూర్తి ముఖమున లోకమున కందించిన రామకృష్ణుడు ఆంధ్ర కవిశేఖరలోకమునకే గాక తాత్త్వికజగత్తునకును, ముముక్షుజనశ్రేష్ఠులకును చిరస్మరణీయుడు. ఇతడు చేసిన అపూర్వ కవితా కథా చమత్కృతికి సహృదయలోకము చేతులెత్తి నమస్కరింపవలసినదే! ఔచితీ పరిపోషకమైన యితని కవితా సృష్టిలో కావ్యౌచితియు, నిత్య జీవనౌచితియు నభేదము పొందినవి. సరస్వతీదేవి యితని ననుగ్రహించిన వైఖరి అతి విలక్షణము, అనూహ్యము, అనితర లభ్యము. ఆంధ్ర కవితా స్రవంతియందు గల పుణ్యఘట్టములలో నితని పాండురంగ మాహాత్మ్యము అతి గంభీరమైన పుణ్యతీర్థ సంసేవన సాధు ఘట్టము.

శ్రీ విరలాగమము

పాండురంగ మాహాత్మ్యకావ్యము కాశికాపుర వర్ణనతో ప్రారంభమగును. కావ్య కథలలో ఎక్కడను కాశీపురమునకు ప్రాధాన్యము లేదు. జగద్గురు వైన శివుడు కైలాసముననే యుపదేశము చేసెను. వర్ణితమైన ప్రధానక్షేత్రము పాండురంగ పురము. సామిమల ప్రాధాన్యము కొంచెమున్నది. మరి కాశికాపుర వర్ణనతో కావ్యమును ప్రారంభించుట యేల? రామకృష్ణుడు నిర్వహింపదలచిన విరలాగమమునకు కావలసిన బీజము లిక్కడనే యున్నవి.

'శ్రీ భాగవత చరిత్రము' అని పేరు పెట్టిన ఈ కథాక్రమమునందు రామకృష్ణుడు శ్రీ యొక్కయు, భగవంతుని శివ విష్ణుతత్త్వముల యొక్కయు దర్శనము నిమిడ్చెను. శ్రీ యనగా శ్రీవిద్య. ఈ గ్రంథ మందు శాక్తము, శైవము, వైష్ణవము సమాహారమైన దర్శనముగా ఇమడ్చబడినవి. ఈ మూడును వేదమునుండి వచ్చిన పురావృత్తములైన త్రిరావృత్తములు. ఇవి పురాణములయందు కూడ ఆఖ్యానాది రూపమున నుపబృంహణము చేయబడుటచే కృష్ణద్వైపాయను వలన మున్నెరిగినది కాదు, అని సూతుడు ప్రారంభించెను. "అంతరంగములకు వచ్చునట్లుగా విన్నవించుట" హృదయగతముగా దర్శింప

జేయుట. కనుకనే కాశీ వర్ణన మను పేర యోగమార్గము, అందు ఇమిడియున్న వెన్నెముకలోని ప్రధాన కేంద్రములు చెప్పబడినవి.

1. "శీతాహార్య సుతాళినీ వికచరాజీవంబు" అనగా శక్తి శివ సంగమమైన సహస్రారము.

2. "విశ్వేశ్వర జ్యోతిర్లింగ విశుద్ధ రత్నఖని" అనగా కాశీ యనబడు ఆజ్ఞా చక్రము. కాశీ ఖండమున కూడ విశ్వేశ్వర జ్యోతిర్లింగముగా ఆజ్ఞాచక్రము చెప్పబడినది.

3 "మోక్షోపాయ దుగ్ధాబ్ధివేలా తీరావని" అనగా అనాహత చక్రమున గల దహరాకాశము, ఈ మూడును వరుసగా శక్తి, శివ, విష్ణుస్థానములు.

4. "డుంఠినామక గజాలానము" అనగా గణపతికి స్థానమగు మూలాధారము.

5. "గంగామృత స్రోతోనిస్సృతి చంద్రగోళము" అనగా విశుద్ధి చక్రము. ఇదియే ఇరువురు గణపతుల నడుమ నున్న నీలకంఠద్వారము అని పురాణ ప్రసిద్ధము. గంగ యను పదమున గల రెండు రెండు గకారములును గణపతులు. నడుమ నున్న బిందువే ద్వారము. ఇది కంఠరూపమున నాదము వాక్కుగా వెలువడు ద్వారము. మనస్సు చంద్రుడను శాస్త్రీయకవి సమయమున కంఠనాదముతో మనస్సును లయము చేయగా, 'గంగామృత స్రోతో నిస్సృతి చంద్రగోళము' అగు ఓంకారము లభించును.

ఇదియే "ప్రాలేయాచల కన్యకా వదన సౌరభ్యము" గ్రోలగల తుమ్మెద ప్రణవస్వరూపుడగు రహస్యముగాను, నాదము, వాక్కు, తన్మూలమగు నుచ్ఛ్వాస నిశ్శ్వాసములు వదన శుంభ త్పద్మ సౌరభ్యముగా, శివశక్తి వ్యవహారమైన ప్రకృతి పురుషలీలగా, ఈశ్వరుని జీవస్థితిగా చెప్పబడినది. ఈశ్వరునకు స్వస్వరూపస్థితిలో గాని జీవస్థితిలో గాని తుష్టిలేదు. జీవుడుగా జీవించి యుండియే స్వస్వరూపుడుగా హృదయమున అనుభూతి పొందవలెను. జీవుడు క్రీడాబ్జము అనగా మొగ్గగా నున్న తమ్మి. దాని యందు సౌగంధ్య లీలాలాలిత్యము గోరువాడు ప్రణవ స్వరూపుడగు నీశ్వరుడు, అతడు తెల్ల తుమ్మెదగా చెప్పబడెను. తుమ్మెద యొక్క నలుపు ప్రకృతి స్థితిగా, అప్రాకృత మైన వెలుగు తెలుపుగా చెప్పబడినది. ఇచట భ్రమరకీట న్యాయము కేవలము కీటమును భ్రమరముగా చేయుట యందు గాక, జీవప్రజ్ఞయను నల్ల తుమ్మెదను విశ్వేశ్వర ప్రజ్ఞ యను తెల్ల తుమ్మెదగా చేయుట యని చెప్పబడినది. దీని వలన పంచ భూతమయుడు, ఇంద్రియ మనోమయుడు, విషయ గోచరుడు నగు జీవుడు శరుడు, నిరుపేద, వర్షధరుడు, భీరుడు, మలిన వర్తనుడు, మతిలేని మేదకుడుగా చెప్పబడెను. భ్రమరకీట న్యాయమున నితడు ఈశ్వరత్వమందుటయే సారూప్యమనబడు 'సితరోలంబత్వము'.

పురవర్ణనమున మఱియొక ఉపదేశము కలదు, ఇందు జీవుడు "ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ చ" అనబడు నుపాసన చేసినచో శివుని రథస్థితి

వధిగమింపగలరు. ఇందు సారథి ఛందోమయుడై, చక్రయుగము సూర్య చంద్రు లగును. రెండు చక్రములును వ్యత్యాసము గలవి గనుక, రథము పురోగమింపక, తన చుట్టును తాను తిరుగు చుండును. అనగా భూమిచుట్టును చంద్రుడును, సూర్యుని చుట్టు భూమియు మండలాకృతిగా తిరుగుటయే రథగమనము అగును. గుఱ్ఱములు ఇంద్రియములు. ఇవి పంచారములు. అనగా ఐదంచులు గలవి. మనస్సు యొక్క ఐదంచులే ఇంద్రియములు. పితృ దేవతల మార్గమగు పునరావృత్తి పథము ఐదంచులు గలదిగా ఋగ్వేదమున చెప్పబడినది. "పంచపాదం పితరమ్", "పంచారే చక్రే పరివర్తమానే తస్మి న్నాతస్థు ర్భువనాని విశ్వా". ఈ లోకములన్నియు ఐదంచుల చక్రము పరివర్తనమున పునరావృత్తి కలిగి వచ్చు చున్నని. ఆత్మ రథికుడు. ఇతడు అరమానిసి, అనగా ప్రకృతి పురుషాత్మకుడగు అర్ధనారీశ్వర తత్త్వము అతని యాత్మ ఖండఖండములుగా లోకముల యందు విస్తరించినది. ఈ ఖండములే శివుని యష్ట మూర్తులు. ఇది గుణమయమగు విరాట్ స్వరూప సృష్టిమయ ధ్యానయోగ మార్గము. ఇదియే సగుణ ధ్యాన మనబడును. భాగవతమున ద్వితీయ స్కంధమున నిది ప్రసిద్ధము. కాశియందు విశ్వేశ్వరుని తెల్ల తుమ్మెద మొదటి ధ్యానము. సృష్టియను రథమున అష్టమూర్తి సగుణ రూపము రెండవ ధ్యానము.

ఇందలి ఆగమమునకు గురువు లోపాముద్రాసమేతుడైన యగస్త్యుడు. శ్రీవిద్య యందు నిత్యాహ్నికమున రశ్మిమాలా మంత్రములలో లోపాముద్రా మంత్రము ప్రాధాన్యము వహించును. ఇది త్రిపురసుందరి అంగమంత్రములలో నొకటి. అగస్త్యుడు ఉత్తరాయణమందు జలములను ఊర్ధ్వగతికి ఆపోశనము పట్టు సూర్యుడు గను, మరల వింధ్య స్తంభనమునకు దక్షిణాయనమునకు దిగు వివేకము అనబడు నక్షత్ర మూర్తిగను ప్రసిద్ధుడు. దక్షిణాయనస్థితిలో నర ప్రజ్ఞను విషయ కర్దమము నుండి బురదలు విరిచి వివేకమునకు శరదాగమమును కూర్చు మూర్తిగా పురాణ ప్రసిద్ధుడు. లోపాముద్ర యనబడు వివేకమే అతని భార్య. ఉత్తరాయణమున తపస్సు, బ్రహ్మచర్యము అను లక్షణములతో కుంభ రాశిలో సూర్యుడుగా కుంభజుడై జన్మించును. దక్షిణాయనమున ఊర్వశి యనబడు కన్యారాశికి శరన్మూర్తియై జన్మించును. అందు కుంభమున మిత్రు నకును, కన్య యందు వరుణునకు జన్మించి మైత్రా- వరుణు డయ్యెను.

ఇతడు ఉత్తరాయణమున వారణాసీ పట్టణమున సిద్ధతటిని యగు గంగ దగ్గర సిద్ధాశ్రమము నిర్మించి, అందు తానును, లోపాముద్రయు, సూర్యుడు - కిరణమువలె వసించిరి. అనగా సవితయు, సావిత్రియు హృదయమున సిద్ధ మంత్ర రహస్యములుగా నిమిడి యుండునని భావము. అట్టి స్థితిలో ముని కోటి తన్ను భజించును. జీవులలో నితడు తారక బ్రహ్మవిద్యా రహస్య జ్ఞాతగా నుండును. తారక మనగా సముద్ర యానమున నావికులను తరింప జేయు నక్షత్రము. దేహము నావగా, సంసారము సాగరముగా, జీవికి ధ్యానము కలుగ జేయు ప్రజ్ఞ తారకగా ఋగ్వేదము నుండి యొక సంప్రదాయమున్నది. ఇదియే తారక బ్రహ్మోపాసనము, తారక రాజ యోగము అనబడును. వేదములలో సోముడు సముద్రమున ప్రజ్ఞ యొక్క యానముగా చెప్పబడెను. సోముడు

పరబ్రహ్మ యందు ప్రజ్ఞ లయమగుటకు, అనగా సమాధి యనబడు తన్మయ స్థితికి అధిపతి. తారక 'నేను' అనబడు ప్రజ్ఞకు చిహ్నము. ఇది వస్థితి నుండి పర బ్రహ్మస్థితి వరకు ధ్యానమును నడుపు తారక. పురాణములలో జీవుడు ధ్యానస్థితి యందైక్యము చెందుట – వేదములు సముద్రమున మునుగుటగా కథ కల్పింప బడినది. అందు సోముడే సోమకుడను అసురుడుగా కల్పింప బడెను. తారకయే మత్స్యముగా చెప్పబడినది. జీవప్రజ్ఞగా సమాధిలో మునిగిన వేదము – దైవ ప్రజ్ఞగా తేలుటయే మత్స్యావతారము. ఈ యుపాఖ్యానమే తారకబ్రహ్మ విద్యోపాసనకు మూలము.

కనుక అగస్త్యుడు బ్రహ్మనిభమూర్తియై హృదయమున నున్న ఋషి. దేవతలు ప్రార్థింపగా దక్షిణ దిక్కునకు వింధ్య గర్వ స్తంభనమునకై దిగి వచ్చును. దీనినే శ్రీవిద్యలో గురువు అనుగ్రహమగు సమయాచారముగా చెప్పిరి. సమయాచార మనగా సహస్రారము నుండి ప్రజ్ఞ గురుస్పర్శ రూపమున దిగువ షట్చక్రములలోనికి దిగి వచ్చుట. అగస్త్యుడు వింధ్యమును దమించి (మణిపూరక చక్రమున గర్వము, మాత్సర్యము మున్నగు వానిని దమించి), కొల్హాపురమున లక్ష్మిని సేవించి, ఆమె యాజ్ఞపై సామి మలకు బయలు దేరెను శ్రీమంత్రమును స్మరించి సుబ్రహ్మణ్య మంత్రమును స్మరించుట యిందలి క్రమము. "శ్రీం" అనునది శ్రీమంత్రము. "శరవణభవ" అనునది సుబ్రహ్మణ్య మంత్రము. దీని వలన ఉత్తరమున గంగానది వలె దక్షిణమున తుంగభద్ర దర్శన మగును. ఇది మూలాధారాది చక్ర త్రయమున వర్తించు ఆజ్ఞావాహిని. అచ్చట సుబ్రహ్మణ్యుని దర్శించి వాని నామ మంత్రములచే స్తుతింపవలెను. ఈ నామములు వ్యంగ్యమార్గమున రహస్యముగా నుపదేశింప బడినవి. (1 – 147)

స్కందుడు స్కందపురాణమును నిర్మించెనట! ఇందు నదీ తీర్థప్రశంసలు చేయబడినవి. అనగా స్కాందధ్యానమున దేహము నందలి నాడులన్నియు పరిశుద్ధములై దర్శన మిచ్చును. అందు పరిప్రశ్నము ఉద్భవించును. "క్షేత్రము, తీర్థము, దైవము కలసి యున్న తావెయ్యది?" అను ప్రశ్న ఈ గ్రంథ మందలి ప్రధానోపదేశమునకు మూలము. ఇందలి తత్త్వము "ప్రకట గుప్తాకారము" అనగా ప్రకటముగా నొక యాకారము, గుప్తముగా నొక యాకారము కలది. ప్రకటార్థమున క్షేత్రమనగా పుణ్యభూమి, తీర్థ మనగా పుణ్యనది. దైవమనగా నచ్చట వెలసి యున్న మూర్తి. గుప్తాకారమున క్షేత్రమనగా దేహేంద్రియ మనోబుద్ధ్యాత్మకమగు సమాహారము. (క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగమున నిది వివరింపబడినది.) తీర్థమనగా తరణోపాయము. ఇది జ్ఞేయము అనబడు బ్రహ్మ జిజ్ఞాసగా భగవద్గీతలో అందే చెప్పబడినది.

ఇక వేలుపు అనగా జ్ఞానమునకు ముందు జీవుడుగా నెవడుండునో, జ్ఞానము కలిగిన వెనుక జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అనబడు క్షేత్రజ్ఞులుగా నెవరు తెలియ బడునో అతడే! ఇక మిగిలిన గ్రంథమంతయు దీనికి వ్యాఖ్యానమే. ఈ మూడును ఒక్కెడ గూడి యుండుట యనగా వీని యభేద మని తాత్పర్యము. కుమారస్వామి తన లోపల ఇందలి పరమార్థమునకై చూచెనుగాని, అది ముకుర కుక్షి నిభముగా తోపకుండెనట! అనగా అద్దము నడిమి భాగము వలె నున్నది, అందు ప్రతిబింబించు తత్త్వమున్నపుడే కనిపించును. లేనిచో సర్వము అవ్యక్త

ము. దీనినే మౌన వ్యాఖ్య అనియు, దర్పణ దృశ్యమానమనియు దక్షిణామూర్తి తత్త్వముగా ఆగమశాస్త్రములు కీర్తించినవి. దీని తత్త్వ ముపదేశింపబడును గనుకనే ప్రారంభమున కాశి యందు "మౌనివర్యుల జదివించు మఱ్ఱినీడ" అని వటమూల నివాసిగా సూచ్యార్థ సూచనము చేయబడినది.

ఇట్టి రహస్యము నుపదేశించుటకు శివుడొక్కడే సమర్థుడని కుమారస్వామి ఋషులతో కైలాసమునకు బయలు దేరెను. అనగా రామకృష్ణుని విరలాగమమున అగస్త్య లోపాముద్రా విద్యలు, శ్రీమంత్రము, సుబ్రహ్మణ్య మంత్రము సాధింప బడెను. కనుక శివ మంత్రమునకు జేరు దారి యేర్పడును. శివలోక మొక విచిత్రమైన వ్యూహము. ఆరు ఋతువులతో గూడిన సంవత్సర చక్రమే ఉత్తర దక్షిణాయన రూపమగు అర్ధనారీశ్వర వ్యూహము (I – 180). అందు పంచభూతముల సూక్ష్మ బీజాక్షరముల రూపమున తదధి దేవతలు ఉమా మహేశ్వరులను ఉపచార పూజగా కొలుచు చుందురు. అచ్చట ఆకాశము గోళాకారమున పరిభ్రమించుచు, వాయువుగా ఏడు రూపములుగా దిగి వచ్చును. అందొక్కొక్కటి యేడు రూపములై నలువది తొమ్మిది మూర్తులతో జీవుల ప్రాణమూర్తులం దావేశించి, దేహములందు రసస్వరూపములైన జలధాతువు నుద్భవింప జేయును. (1 – 185) అందలి యుద్యాన తరులతా పుష్ప సౌందర్య మంతయు పార్వతీ దేవి శరీరావయవ విలాసమే. అది పరాప్రకృతి రూపము నుండి అవర ప్రకృతి రూపము లోనికి ఉద్యాన మారుతముగ, ప్రావృషేణ్య పయోధరాది స్థూలరూపములుగా రాకపోకలు చేయుచుండగా, మదనుడు హరుని పరాజితుని చేయుటకు (జీవస్థితిలో పంచేంద్రియములలోనికి గొని వచ్చుటకు) వేడుక పడుచుండును (I – 186 to 191).

అట్టి సన్నివేశమున పార్వతి క్షేత్ర–తీర్థ–దైవతముల సంప్రశ్నము చేయుచుండగా కుమారస్వామియు, ఋషులును కైలాసమునకు ఆగమనము చేయుదురు. అనగా అంతరప్రజ్ఞలో పరాప్రకృతి రూపమున పరిప్రశ్నము పుట్టుచుండగా, బాహ్యప్రపంచమున బ్రహ్మజిజ్ఞాసయు, తత్ప్రయత్నము ప్రారంభమగును. జీవుల యందు పరతత్త్వ రహస్యము కొరకు జప తపాదులచే యత్నము చేయు బుద్ధి పొడముటయు, దైవానుగ్రహము ఉత్తమ ప్రకృతిగా జీవునిలోనికి దిగివచ్చుటయు నొక లీల యని యిందలి ధ్వని. ఈ బాహ్యాంతర ప్రయత్నములు రెండు కావు. రెండును కలసి యొకే దివ్యలీల.

అప్పుడు శివుడు "మము నీయర్థము వేడుచున్నయది యుష్మన్మాత" అని హెచ్చరించి పరతత్త్వ వ్యాఖ్యాన మారంభించెను. పుండరీకాక్షుడు పుండరీకుడను నొక భక్తునకు ప్రత్యక్షమై ఆ క్షేత్రమునకు తీర్థమునకు పౌండరీకములను నామములను కల్పించి నిలిచిన వాడు. వాని ప్రయత్నము ఇందలి సంప్రశ్నమునకు సదుత్తరమగునని శివు డుపదేశ మారంభించును. ఈ యుపదేశము కుమారునకును, వాని శిష్యులగు ఋషులకును, పార్వతికి నొక్కమారే జరిగినది. అనగా జీవులకు, గురు శిష్యన్యాయమున జరుగు పరమోపదేశము వారి లోని పరాప్రకృతి యందు పరమేశ్వరుడు చూపు ననుగ్రహమే యని చెప్పబడినది.

ఉపాసనామార్గము

ఇందు పుండరీకుని పేర నుపాసకుని పద్ధతి చెప్పబడినది. పుణ్యకర్మా చరణము, శీలసంపద, వివేకము, సత్య దయా శాంతి దాంతు లనబడు దివ్య ప్రకృతుల సాధనము తొలుత జీవున కావశ్యకము. చక్కని గృహస్థాశ్రమమున సత్సంతతి పొందుటయు, వారిని ప్రబోధ విధేయమతులనుగా నొనరించుటయు, తలితండ్రులను, పెద్దలను సేవించుటయు కూడ ముఖ్యము. సత్కర్మాచరణ మున కామక్రోధములను జయించుట, సత్యవాక్కు, సాత్త్విక భోజనము, అష్టాంగ యోగమార్గము, సత్త్వగుణ ప్రకృతి నవలంబించుట, ముప్పది రెండు తత్త్వముల దర్శనము అవశ్యకము. యోగసాధనను మూడు మార్గములలో నాచరించవలెను. (1) దేహారోగ్యమునకు హఠయోగము (2) జపతపములకు మంత్రయోగము (3) ఆత్మాను సంధానమునకు రాజ యోగము. ఇందు శబ్ద స్పర్శ రూప రస గంధములు మంత్ర దేవతా విగ్రహాకృతి లీలా చేష్టాదికముల రూపమున సమన్వయింపబడినవో, వెన్నెముక నాశ్రయించి యున్న ఆది తత్త్వము సంచలనము నొంది చక్కని మార్గము చూపునని సమన్వయింపబడినది. రెండవ ఆశ్వాసము 8 వ పద్యమున ఈ దిగువ సమన్వయము గమనింప దగినది. మూలాధారము మూలాలవాలము అని చెప్పబడినది. మూల మనగా వేరు. సంసారవృక్షమునకు మూలము కామవాంఛ. దానికి సంబంధించిన అవయవము లుండు స్థానమును నియమించు వెన్నెముకలోని వివరిభాగము ఈ మూలమున కాధారము గనుక మూలాధారము. అందుండి కామక్రోధ రూపములైన సంకల్పములును, కర్మలును ఆలవాలముగా నల్లుకొని యున్నవి. అనగా పాదు కుదురు వలె నున్నవి. అందు వెన్నెముకలోని రంధ్రము గహ్వరమని చెప్ప బడినది.

భారతీయ సంప్రదాయమున ఆగమము అను పదము ఒక పవిత్రమైన సంకేతార్థమును సూచించును. ఆగమశాస్త్రము వేదమునందలి పూర్వ మీ మాంసా శాస్త్రమునకు ఆచరణరూపము, ఉపబృంహణరూపము అగు ఒక స్వయం సంపూర్ణశాస్త్రము. అందు చక్కని యంగములు కలవు. అందు దైవతము, ప్రతిష్ఠ, అర్చా విధానము ముఖ్యములు. తత్ప్రధానాంగములుగా మూల దైవ తము, అంగ ప్రత్యంగ దైవతములు, వాని మంత్రములు, దిక్కులయందు వాని న్యాసము, అందు నొక్కొక్క దానికే ప్రత్యేకముగా అనుష్ఠానక్రమము, తదంతర్గతములైన యోగ సాధనాత్మక రూపములగు ఆచారకాండలోని సూక్ష్మ ములు ఆగమశాస్త్రమున ముఖ్యాంగములు. ఆదికాలము నుండియు శైవ వైష్ణవ శాక్తాగమములు పెక్కులు ప్రసిద్ధములై యున్నవి. అవికాక నూతనముగ నొక యాగమమును సృష్టింప గలవారు కలియుగమున నిద్దరే కనిపించుచున్నారు. అందొకరు అవతారమూర్తియగు శంకర భగవత్పాదులు. చతుష్షష్టి తంత్రము లుండగా స్వతంత్రమగు సౌందర్యలహరీ తంత్రమును వారు భూమి కవతరింప జేసిరి. దీనికిని అద్వైత సిద్ధాంతమునకును సంబంధము లేదు. మరల అట్టి సృష్టి నూతనముగా చేసి విరలాగమమును భూమి కవతరింప జేసిన గౌరవము తెనాలి రామకృష్ణకవికే దక్కినది. దీనిని గమనింపక శైవము, వైష్ణవము

అను సులోచనములతో నీ కవిని పరామర్శించుట తెనుగువారి దురదృష్ట మన వచ్చును.

వేద సంప్రదాయమును సారము పిండి శైవ వైష్ణవ శాక్తాగమముల సమన్వయముతో నితడు విరలాగమమును సృష్టించుట గమనింప దగినది. క్షేత్ర తీర్థ దైవతములను పేర త్రయీవిద్యను సమన్వయపరచుట యిందు గమనింపదగును. ఈ యాగమము నవ్య కవిత్వ కథాలాపమను కుందనమున ఘటించి యొక క్రొత్త సొమ్ము రచించుటకే పాండురంగ మాహాత్మ్య రచన సాగినది. ఇందు కావ్య కళాసృష్టి యంతయు తన యాగమసృష్టికి అంగభూతముగా కూర్చెనని ద్రష్ట లంగీకరింపక తప్పదు. ఇది కేవల సాహిత్య విమర్శకులకు రససిద్ధాంత వాదులగు సాహిత్య విశ్వకర్మలకు, అలంకారాదులను పరిగణనము చేయు సాహిత్యగణకులకు, సంభాషణ చమత్కారాదులకు పద్య రచనా శిల్పమునకు మురిసిపోవు అల్పసంతోషులకు మాత్ర మందునది కాదు. కాని ఈ యంశము లలో కూడ రామకృష్ణుడు అనన్య సామాన్య ప్రతిభ చూపించుట యొక ప్రమాద ముగా పరిణమించినది. ఆగమశాస్త్రకర్తలగు పూర్వాచార్యుల వలెనే కవితా శిల్పము లేని సాదారచన చేసి యున్నచో పాఠకులలో నింతమంది అంగభూత మగు కావ్యసృష్టిలో చిక్కుకొని యిట్లు మెచ్చుకొని సరిపెట్టుకొని యుండెడి వారు కారు.

ఇందలి విరలాగమమున పరమగురువగు పరమేశ్వరుడు నారదునకీ విద్య నుపదేశించిన ఘట్టము పంచమాశ్వాసమున నున్నది. శ్రీకృష్ణుని మదనగోపాల మంత్రమిందు ప్రధాన దైవతము. దానికి కృష్ణుడు ఋషి. మహావిష్ణుడు దేవత. వేయిమారులు జపించుట నియమము. ధ్రువస్థితి దీనికి ఫలితము. మంత్రోప దేశ మీవిధముగా చేయబడినది.

"స్వర్ణాద్యం సత్యనామాద్యమ్
షష్ఠషష్ఠం సదీర్ఘకమ్ ।
షష్ఠం షష్ఠాది సత్యంతమ్
సమారం తం విదుర్బుధాః ॥"

కవిత్వమునకు ధ్వని ఎట్లో మంత్రమునకు గోపనమట్లు. దానివలన నుపాసకునకు ఏకాగ్రత లభించును. దేవతలు పరోక్షప్రియులని వేదము. పదముల యందలి నిఘంటు గతార్థము, వాచ్య గౌణార్థములు ప్రత్యక్షములు, వ్యంగ్యార్థము ప్రత్యక్ష పరోక్షరూపము. మంత్రార్థము పరోక్షరూపము, అనగా అక్షరముల ధ్వనులకును చైతన్యమునకును గల గుప్తమైన సం బంధము, నిఘంటు గతార్థము దీనిని గోపనము చేసి అజ్ఞానముగా నావరించి యుండును. దానిని భేదనము చేయుట మంత్రార్థము. పరిణామ దశలో అర్థ గ్రహణము చేయు సాధకునిలో నున్న యంతర్యామినే మంత్రము సూచించును. ఈ క్రమమును రామకృష్ణుడు చక్కగా వివరించెను.

పై శ్లోకమున స్పర్శాద్యము అనగా హల్లులలో మొదటిది కకారము. సత్యనామాద్యము అనగా సత్యము అను పదమున మొదటి యక్షరమగు సకారమునకు అది యందు వర్ణ క్రమమున నున్న షకారము. ఇట్లు శ్లోకమును భేదింపగా 'కృష్ణాయ' అను పదము వచ్చును. సత్యంతము అనగా నమః అని అంతమున నుండవలెను. సమారము అనగా మారునితో కూడినది. మారుడనగా మన్మథబీజము. అదియే 'క్లీం' అను వర్ణము. ఈ మంత్రమూర్తితో వెలయు క్షేత్రమూర్తి గుప్తాకృతిలో శరీరము, ప్రకటాకృతిలో పాండురంగ క్షేత్రము. "ఇదం శరీరమ్ కౌంతేయ క్షేత్ర మిత్యభిధీయతే" అని గీతా శాస్త్ర నిర్వచనము. ఇక తీర్థమూర్తి యనగా జ్ఞేయము, విజ్ఞానము అను వానితో గూడిన జ్ఞానము, అదియే "నే" నను ప్రజ్ఞ.

ఈ మూల దైవతమునకు పరివార దేవతలు చక్కగా వర్ణింపబడినారు. పశ్చిమమున శంఖపద్మనిధులు. అందు రావిచెట్టు రూపమున నున్న నరనారాయణులు, వారి కవ్వల మూడుకోటు లమరాంగనలు. మూడు కోటు లనగా మూడంచులని చమత్కృతి, త్రిభుజాకారమైన యంత్రము. అందు మూడు కోణముల యందు 'అమర' అను అక్షరములు, నడుమ ఉమ పనపాడి తడి యొత్తిన మూడురంగుల వస్త్రమును ధరించినట్లు శార్దూల చర్మాంబరమును ధరించిన శివుడు. ఉమ యనగా ఉకారము. శివుడు అనగా అకార, ఉకార, మకారములను కంఠ గతమైన రేఫముతో నుచ్చరించు ఓంకారము. ఇది ప్రధాన మూల పీఠము. ఇది శివ విష్ణు శక్త్యాత్మకము. ఇట్లు పురావృత్తమును త్రిరావృత్తముగా, ప్రకటగుప్తాకారముగా వర్ణించెను.

తూర్పు దిక్కున స్వామి కుండలములు శిలలో దాగి యున్నవి. శిల యను పదమునకు శ్వాస లయమగుట యని సంకేతము. అందు దాగియున్న "సోహం" అను రెండక్షరములును కుండలములు. ఇందలి హల్లులగు సకార హకారములను తొలగించినచో లోపల 'ఓం' అను అక్షరమున్నది గనుక, దానిని కుండలాకృతిగా చుట్టుకొనియున్న కుండలములే సకార హకారములు. అచట కుండల తీర్థమున్నది. దాని సమీపమున మంత్రరాజ నృసింహమూర్తి ముప్పదిరెండు బాహువులతో నున్నాడు. అనగా ముప్పది రెండక్షరముల అనుష్టుభనృసింహమంత్రము. తూర్పుదిక్కున ద్వారము కడ ముప్పది రెండక్షరముల క్షేత్రపాలకుడున్నాడు. వానికి దిగువ పది యక్షరముల సరస్వతి యున్నది. దక్షిణ ద్వారమున సింహము వీపుపై శ్రీచరణద్వయ మున్నది. అనగా రెండు శ్రీకారములతో నుచ్చరింపబడు లక్ష్మీ నృసింహ మంత్రము. పశ్చిమ ద్వారమున హ్రీమూర్తియై భువనేశ్వరి యున్నది. అనగా "హ్రీం" కారముతో నారంభించు మంత్రము. ఇట్టి వ్యూహము నడుమ పాండురంగని శరీరమున వెలుగొందు వర్ణరాశి సమస్తము శ్రీమంత్ర రాజము. ఇట వర్ణరాశి యనగా అకారాదిక్షకారాంతమగు వర్ణమాల యనియు, రంగుల రాశి యనియు నర్థము, సూర్యాంతర్వర్తి యగు స్వామి సూర్యకిరణాంతస్థ వర్ణములు శ్రీమంత్ర పీఠముగ చెప్పబడినవి. వర్ణ మనగా గ్రహమని జ్యోతిశ్శాస్త్ర సంకేతము. గ్రహాదులును, వాని నధిష్ఠించిన రంగులును ధ్వనులును మంత్ర తేజ

స్పుగా స్వామి శరీరరూపమై క్షేత్రరూపము వెలుగొందుచున్నదని యర్థము. సాధకుని శరీరమున మూలాధారాది సహస్రార పర్యంతము రంగులు, ధ్వనులు, గ్రహాధిపతులు మను, హర, రాజయోగముల మార్గములుగా నున్నవి. కనుక వానిని దర్శింపనగు వాని దేహమే పుణ్యక్షేత్రము.

ఇట్లు కొన్నివేల రహస్యములు శరపరంపరలుగా నీ విరలాగమమున సంకేతించబడినవి. స్థూల నిర్దేశముగా కొన్నిటిని మాత్రమే యుదాహరించితిని.

—ఎక్కిరాల కృష్ణమాచార్య

విషయ సూచిక

పుట

1. కవి పరిచయము

ఉపోద్ఘాతము ... 3

రామలింగఁడు – రామకృష్ణుఁడు ... 7

రామకృష్ణుని కాలము ... 10

రామకృష్ణుఁడు అష్టదిగ్గజములలోని వాఁడా ? ... 20

రామకృష్ణుని కుటుంబము ... 22

రామకృష్ణుని సమకాలికులగు మతాచార్యులు

కందాళప్పయ్యగారు ... 25

భట్టరు చిక్కాచార్యుఁడు ... 26

పాలగుమ్మి ఏలేశ్వర గురువు ... 30

చంద్రశేఖర వాచంయముఁడు .. 30

తాతాచార్యుఁడు ... 31

ఈరదేవయ్య .. 33

విరూరి వేదాద్రి . 33

రామలింగని కథలు ... 34

2. కావ్య పరిచయము

ఇతని కావ్యముల యానుపూర్వి ... 45

కావ్యముల కృతిపతులు ... 50

రామకృష్ణుని రచనలోని పురాణ లక్షణములు ... 54

పాండురంగమాహాత్మ్యము ప్రబంధమనఁదగునా ? ... 58

ఘటికాచలమాహాత్మ్యమును ప్రబంధమనఁదగునా ? ... 64

ఉద్భటారాధ్య చరిత్రము ప్రబంధమనఁదగునా ? ... 65

అలభ్య గ్రంథములు ప్రబంధములై యుండవచ్చునా ? ... 65

3. కావ్యపరిశీలనము

రామకృష్ణుని కావ్యముల పర్యాలోకనము 67

ఘటికాచలమాహాత్మ్యము ... 67

కథ ... 68

సమీక్ష 69

ఉద్భటారాధ్య చరిత్రము ... 73
కథ 74
సమీక్ష ... 76
పాండురంగ మాహాత్మ్యము
కథ ... 80
సమీక్ష ... 88
రామకృష్ణుని కవిత్వము ... 91
రామకృష్ణుని పద్యరచనా వికాసవైఖరి ... 94
రామకృష్ణుని వర్ణనలు ... 104
రామకృష్ణుని శైలి 131
రామకృష్ణుని కథాసంవిధాన చాతురి
వస్తునిర్మాణము ... 152
కథోన్మీలనము ... 155
రామకృష్ణుని కావ్యమునందలి పాత్రలు ... 173
రసము
ఘటికాచలమాహాత్మ్యము ... 207
ఉద్భటారాధ్య చరిత్రము ... 208
పాండురంగ మాహాత్మ్యము 211
రామకృష్ణుని హాస్యము ... 228
అలంకారములు ... 241
శబ్దాలంకారములు ... 262
అలంకారములలో వివాదగ్రస్తములైన తావులు ... 265
ఛందోవ్యాకరణ విశేషములు ... 267

4. పాండురంగ మాహాత్మ్యము – ప్రత్యేక పరిశీలనము
విట్ఠల సంప్రదాయము ... 273
విట్ఠల దైవతము ... 274
విట్ఠల శబ్దము ... 274
పాండురంగ శబ్దము ... 278
విట్ఠలుని యర్చామూర్తి వృత్తాంతము ... 284
మూర్తి వివరణము ... 284
పాండురంగ సంప్రదాయము 286
పాండురంగమూర్తి స్వరూపము ... 288

	విట్ఠలాగమము	...	290
	పాండురంగ మాహాత్మ్య కథ – మూలములు	...	291
	పాండురంగ మాహాత్మ్యము – పాఠభేదములు	...	299
	పాండురంగ విజయుని పదగుంఫనము	...	312
	రామకృష్ణుని మతము, ఆత్మీయత, తత్త్వదృష్టి	...	319
5.	పాండురంగ మాహాత్మ్య వ్యాఖ్యాన సమీక్ష	...	328
6.	అనుబంధములు		
	పాండురంగస్తోత్రములు	...	424
	ఖిలరచనలు		
	కందర్పకేతు విలాసము	....	440
	హరిలీలా విలాసము	...	441
	రామకృష్ణుని చాటువులు	...	444
	వసుచరిత్ర రచనాకాలము	...	456
	Extracts from Historical and other Records		
	Pandharpur		
	Appendix	...	469
	Evidence showing the spread of Vittala Cult.	...	473
7.	గ్రంథముల పట్టిక	...	475

హరిః ఓమ్

సహనావవతు

సహ నౌ భునక్తు

సహవీర్యం కరవావహై

తేజస్వినావధీతమస్తు

మావిద్విషావహై

ఓం శాంతిః శాంతిః శాంతిః

1. కవి పరిచయము

ఉపోద్ఘాతము

ఆంధ్ర వాఙ్మయమునఁగల విశిష్టప్రక్రియలలోఁ బ్రబంధశాఖ యొకటి. ఆదికవి యగు నన్నయతోఁ బ్రారంభమై, తిక్కనాదులచేఁ బోషితమైన యాంధ్ర సాహితీలత శ్రీకృష్ణదేవరాయల కాలమునఁ బరిణతినంది ఫలోన్ముఖమైనది. ఆ పరిణతికి ఫలమే ప్రబంధము. అది సర్వలక్షణలక్షితము, స్వయంసంపూర్ణము నగు నొక ప్రక్రియావిశేషము. ఈ ప్రబంధములు రచించిన మహాకవులలో సాహితీ సమరాంగణ సార్వభౌముఁడు రాయలుకూడ నుండుట యీ ప్రక్రియకుఁ గల ప్రత్యేకతను స్పష్టము సేయుచున్నది. ఇంకను బ్రముఖ ప్రబంధ కర్తలలో నొకఁడొకఁడే యనన్యుఁడు. అందెవని కవితారీతి వానిదే. ఎవ్వని శైలివానిదే. కవులు సమకాలికులను కారణము చేతఁగాని యితివృత్తము సజాతీయమను కారణముఁచేగాని యాకవులలోనొక్కని నింకొక్కనితోఁ బోల్చుటకు వీలుపడదు. కావున నొక ప్రబంధకవి ప్రత్యేకతను గ్రహింపవలెనన్నచోఁ దత్కవి కృత గ్రంథములే మనకు ముఖ్యాధారములు. తులనాత్మక పరిశీలనము వలనఁ గవులయందలి లోపాలోపములు కొంతవఱకు వ్యక్తముకావచ్చును. కాని తద్విశిష్టతను గ్రహించుట కాపరిశీలన మంతగా నుపయోగపడదు. అట్లని తులనాత్మక పరిశీలనమే వ్యర్థమని యభిప్రాయపడరాదు, దాని విలువ దానికున్నది. సంపూర్ణమగు స్వయంవ్యక్తిత్వముగల కవుల విషయముననే మీఁది వాక్యములు చెప్పఁబడినవి. స్వయం సంపూర్ణమగు ప్రతిభా విశేషముచేఁ గావ్యనిర్మితికి దొరకొనిన ప్రబంధ మహాకవులలోఁ దెనాలి రామకృష్ణుఁడొకఁడు.

ఈ కవి రచించిన గ్రంథములలో మనకు లభించినవి మూఁడు. ఘటికాచల మాహాత్మ్యము, ఉద్భటారాధ్యచరిత్రము, పాండురంగ మాహాత్మ్యము. అందు మొదటిది వైష్ణవ గ్రంథము, రెండవది శైవగ్రంథము. మూఁడవది శైవవైష్ణవ శాక్తసంప్రదాయములను వేదవేదాంత మార్గములతో సమన్వయించు గ్రంథము.

ఇవిగాక మరి మూఁడు గ్రంథము లితఁడు రచించినట్లు తెలియుచున్నది. లింగపురాణము, కందర్పకేతు విలాసము, హరిలీలా విలాసము. ఇందు మొదటిది నేఁడలభ్యము. పేరును బట్టి ఇది సంస్కృత లింగపురాణమున కనువాద మని యనుకొనవచ్చును, కందర్పకేతు విలాసమునుండి నాలుగు పద్యములు, హరిలీలా విలాసమునుండి ఇరువది యొక్క పద్యములు మాత్రమే లభించినవి. పెదపాటి జగ్గనచే సంకలితమైన ప్రబంధరత్నాకర మనఁబడు గ్రంథమునందివి లభించినవి. గ్రంథనామమును బట్టియుఁ బద్యములను బట్టియుఁ †గందర్పకేతు విలాసము శృంగార రస ప్రధానమగు ప్రబంధమని యూహింపనగును. హరిలీలావిలాసము విష్ణుపరమైన గ్రంథము కావచ్చును. శివపరముగా శ్రీనాథుఁడు హరవిలాసమును రచించిన పద్ధతిలో నితఁడీ గ్రంథమును విష్ణుకథల సంపుటీకరణముగా రచించెనేమో !

పైఁ జెప్పిన గ్రంథములనే గాక నితఁడు చాటువు లనేకములను జెప్పి యున్నట్లు తెలియుచున్నది. శ్రీనాథుఁడును, రామకృష్ణకవియు నాంధ్రమునఁ

జాటువుల వలనఁ గూడఁ బ్రసిద్ధివహించిన కవులు. రామకృష్ణుని పేరనున్న చాటువులలో నేఁటి వఱకు లభ్యములైనవి యెనుఁబదియేడు. అందుఁగొన్ని వర్ణనలు, కొన్ని కవి ప్రశంసలు, కొన్ని యవహేళనములు, కొన్ని స్తోత్రములు, కొన్ని సమస్యాపూరణములు. మఱికొన్ని కేవల కవితా చమత్కృతి గలవి. ఇవి యన్నియు రామకృష్ణునివి కావేమో యని కొందఱు విమర్శకులు సందేహమును వెలిబుచ్చియున్నారు. ఇతర కవులపైఁ గల రామకృష్ణుని చాటువుల వలన నితని సమకాలిక కవులను దెలిసికొనుటకు, నితని కాలమును నిర్ణయించుటకుఁ గొంత వసువు పడును. కొన్నిఁటి వలన నితని జీవిత విశేషములను, గవితా వైవిధ్యమును దెలిసికొనవచ్చును. అల్లసాని పెద్దన, ముక్కుతిమ్మన, భట్టుమూర్తి, ధూర్జటి, కృష్ణరాయలు, పింగళి సూరన, తాతాచార్యులు, తిరుమలరాయలు చిన్నన్న, పెదతిరుమలయ్య యను ప్రసిద్ధులేగాక పగడరాజు నరసయ్య, పసరము గోవిందరాజు మున్నగు నితరులు గూడ నీతని చాటువులలోఁ బేర్కొన బడినారు. ఈ చాటువులలోఁ జెప్పఁబడిన వారందరించుమించుగా డెబ్బది యైదు సంవత్సరముల కాల వ్యవధిలో జీవించియున్నవారు. కనుక రామకృష్ణుఁడే యీ చాటువులన్నియుఁ జెప్పియుండుట సాధ్యమాయను సందేహమున కవకాశమున్నది. చెప్పియుండుటయు సంభావ్యమే.

శష్పవిజయమను బూతుల పుస్తకమొకటి యీ కవిపేర నున్నది. రచనను బట్టియది యర్వాచీనుఁడగు నెవఁడో యొక క్షుద్రునిదని యూహించుట సులభము. హాస్యరసప్రధానమైన కథలీ కవిపేరఁ బ్రసిద్ధికెక్కియుండుటచేతను, నితఁడు వికట కవి యను జనశ్రుతి యుండుట చేతను నెవఁడో యీ గ్రంథమును రచించి యీ కవిపేరుపెట్టి యుండవచ్చును. పాండురంగమహాత్మ్యాదిగ్రంథముల పరిశీలనము వలన నితఁడు తక్కువ తరగతికిఁ జెందిన హాస్యకవి కాఁడని స్పష్టమగును. కేవల పరమార్థ దృష్టి, మోక్షధర్మము, యోగసాధనము, మంత్రతంత్రాది శాస్త్ర పాండిత్యము, వేదాంతనిష్ఠ, వర్ణాశ్రమాది ధర్మాదరణము, సంప్రదాయముపై భక్తి, శైవవైష్ణవశాక్తాగమ పారంగతత్వము, వానిని సమన్వయింపఁగల సామర్థ్యము, ప్రసన్న గంభీర విసర్గోదాత్త కవితాశక్తియు నీ కవికి జీవలక్షణములని యితని రచనలే చాటుచున్నవి. ఇట్టి కవిసత్తముఁడు శష్పవిజయమనఁబడు క్షుద్ర గ్రంథ రచనకుఁ గుతూహలపడుట యసహజము. మఱియొకమాట. ఒక మతమునుగాని, మార్గమునుగాని దైవతమునుగాని దూషించుట యితని మూఁడు గ్రంథములలో నెచటను గానుపింపదు. రాయలకన్న వైష్ణవమును హెచ్చుగాఁ జిత్రించిన ఘటికాచల మహాత్మ్యమున శివదూషణయు లేదు. శివకవుల కన్న రమణీయముగా శైవమును జిత్రించిన యుద్భట చరిత్రమున విష్ణుదూషణయు లేదు. శైవవైష్ణవశాక్తమార్గముల త్రివేణీ సంగమ మనఁదగు పాండురంగ మాహాత్మ్యమునఁ బార్వతీ పరమేశ్వరులు, వాణీ హిరణ్యగర్భులు, లక్ష్మీనారాయణులు నొకే దివ్య తేజమునఁ బొడకట్టునట్లు నిరూపింపఁబడినారు. ఈ కావ్యమునకుఁ గృత్యాదియందుఁ గూడ లక్ష్మీనుతితో పాటు సరస్వతీ పార్వతీస్తుతులు, విష్ణుస్తుతితో పాటు శివస్తుతియు నున్నవి. ఈ విధమైన కృత్యాది స్తోత్రము రాయల యాముక్తమాల్యద యందుఁగాని, ధూర్జటి కాళహస్తీశ్వర మహాత్మ్యము నందుఁగాని కానుపింపదు. ఇట్లు సర్వసంప్రదాయములను బ్రకట గుప్తాకారములగు

రీతులలోఁ బాండురంగమహాత్మ్యమున నిరూపింపఁగల్గిన యుదాత్తతవలన మతాచార్యుఁడు, ద్రష్టయు ననఁదగు నీకవి వతంసుఁడు పరదూషణకుఁగాని యుదాత్తత లేని క్షుద్రమైన ఇతివృత్తమును గ్రహించుటకుఁగాని సిద్ధపడెననుట సహజముకాదేమో!

ఈ కవి జీవిత చరిత్రకు సంబంధించిన యాధారములు పెక్కులు లభింపలేదు. దీనినిఁగూర్చి పలువిధములైన కథలు జనశ్రుతిగా వచ్చుచున్నవి. వానిననేకులు వచనముగా రచించినారు. ఈ కథలయందును గృష్ణరాయలు, పెద్దన, తాతాచార్యులు మున్నగు వారందఱుఁ బేర్కొనబడిరి. అందుఁ గొన్ని కథలు పైఁజెప్పిన చాటువులతో సంబంధించియున్నవి. కొన్ని సంబంధింపనివియు నున్నవి. ఈ కథలన్నియు సత్యములనుటకుఁగాని, కాదనుటకుఁగాని యాధారము లేదు. కొన్ని మాత్రము నిరాధారముగాఁ గన్పట్టుచున్నవి. ఈతనినిఁ గూర్చిన కథలలోఁ గూడ నితని జీవిత విశేషములు సప్రమాణముగా లభింపవు. వివిధాధారముల వలన లభించినంత వరకు వీని జీవితవిశేషములను కీ. శే. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు మున్నగు పరిశోధకులు సేకరించిరి. తొలుత వీకవి పూర్వులు తెనాలి గ్రామ వాస్తవ్యులు, రామలింగేశ్వర స్వామిభక్తులు తెనాలిలో నేఁటికినిఁ బురాతనమైన రామలింగేశ్వరాలయమొకటి గలదు. దాని పరిసరమునకు నేఁడును రామలింగేశ్వర పేఁటయనియేపేరు. ఆ యాలయములో వీరి పెద్దలు చేసిన దానమునుగూర్చి లభించిన శ్లోకము ననుసరించి వీరి యింటిపేరు గార్లపాటి వారనియుఁ గొంత కాలమునకుఁ బూర్వము ఈశ్వరప్రెగ్గడ వారనియుఁ దెలియుచున్నది. స్వగ్రామమును విడచి వీరి కుటుంబము కొండవీడు, పెనుగొండ ప్రాంతములకుఁ బోయినప్పుడచట తెనాలి వారని వ్యవహరింపబడిరి. కాలక్రమమున నిదియే వారి యింటిపేరై యుండును.

ఈ కవి రచించిన కొన్ని చాటువులను, వీని కుటుంబమునందలి యితర కవులు రచించిన గ్రంథములను, వీని కావ్యము లంకితము పుచ్చుకొనిన వ్యక్తులను గూర్చి సమన్వయదృష్టితోఁ బరిశీలింపఁగా నీ కవి కృష్ణరాయల వార్ధక్యమునుండి వారి యనంతరము కొంతకాలము వఱకును జీవించియుండెనని తేలును. అనఁగా క్రీ. శ. 1514 ప్రాంతము నుండి 1571 – 80 ప్రాంతము వఱకు రామకృష్ణ కవికాలమని చెప్పవచ్చును. ఇతఁడు కృష్ణరాయల యాస్థానమందలి యష్టదిగ్గజములలో నొకఁడని కూడ జనశ్రుతి యున్నది. కృష్ణరాయలకితఁడే గ్రంథము నంకిత మొసంగక పోవుటచే నాతనియాస్థానమున నితఁడు కవిగానుండెనా యని కొందఱు సందేహించుచున్నారు. కాలనిర్ణయము చేసిన విమర్శకుల ప్రకార మితఁడు కృష్ణరాయల వార్ధక్యమునఁ జిన్నవాఁడనియుఁ గవిత్వమారంభించినను నప్రౌఢదశలో నుండి యుండుననియు, దిగ్గజములలో నొకఁడుగా నుండఁదగిన స్థితికి రాలేదనియుఁగూడ నూహింపనగును.

ఈకవి రచించిన గ్రంథములు మూఁడును ప్రబంధ లక్షణ లక్షితములు, ప్రబంధములయందు శృంగార రసము ప్రధానముగా నుండవలెననియు,

వస్త్వైక్యము సిద్ధింప వలెననియుఁ జెప్పిన ప్రబంధ ముఖ్య లక్షణము లీకావ్యము లకు సూటిగా సమన్వయింపవు. ధూర్జటి కృతమగు కాళహస్తీశ్వరమాహాత్మ్యము నకును, కృష్ణరాయకృతమగు నాముక్తమాల్యదకును గొంతవఱకుఁ పెద్దన రచించిన మను చరిత్రకు నీక్లిష్ట సమస్యయే వర్తించును. పాండురంగమాహాత్మ్యము, ఘటికాచలమాహాత్మ్యము క్షేత్రతీర్థ దైవతముల మహిమనుగ్గడించు కథా వస్తువు కలవి. ఇవి క్షేత్ర మాహాత్మ్యములైన స్థలపురాణముల జాతికిఁజెందును. పాండురంగమాహాత్మ్యము పండరిపురమున వెలసిన పాండురంగఁడనఁబడు శ్రీ కృష్ణదైవతమునకు సంబంధించినది. పుండరీకుఁడను మహాభక్తుఁడు తపస్సు చేసిన భూమి పౌండరీక క్షేత్రమై యచటి దైవతము పౌండరీక నాథుఁడని పిలువఁబడి క్రమముగాఁ బాండురంగనాథుఁడు, బాండురంగఁడు నను పేర్లఁ బ్రసిద్ధుండై యుండవచ్చును. ఈ క్షేత్రమిప్పటి షోలాపురికి సమీపమున నున్నది. ఘటికాచల మాహాత్మ్యము దక్షిణభారతమున ద్రవిడ దేశమునఁగల ఘటికా చలమను బుణ్యక్షేత్రము యొక్క మహిమాను వర్ణనము. ఈ క్షేత్రము చోళంగిపురము – నేఁటి షోలింగర్ – పేరఁబరగినది. లక్ష్మీనృసింహస్వామి యందలి దైవతము. ఈస్థలమాహాత్మ్యముల కథలు పురాణములలో సూటిగా లభింపవు. పుండరీకుని కథ సంగ్రహముగాఁ బద్మపురాణమున నున్నది. నేఁటి స్కందపురాణ గ్రంథమునఁగూడ నీకథకు సంబంధించినవి కొలఁది శ్లోకములు, నొక స్తోత్రము కనుపించుచున్నవి. గ్రంథ పీఠికలో రామకృష్ణుఁడు తనకథా వస్తువును స్కందపురాణము నుండి కొంత గ్రహించినట్లు చెప్పినాఁడు. ప్రబంధ ములోని కథలో శివునివలనఁ గుమారస్వామి ఈ కథనుపదేశమందినట్లున్నది అందువలనఁ గవి చెప్పిన స్కంద పురాణమన్నది చమత్కృతియుఁ గావచ్చును. ఈ కావ్యమందలి శ్రీకృష్ణుని కథలలో నెక్కువ భాగము సర్వపురాణ ప్రసిద్ధమైన వస్తువే. భక్తుల కథలలోఁ బెక్కులు దేశమునఁ బరంపరగాఁ జెప్పుకొను కథల నుండి గ్రహింపఁబడినవిగాఁ దోచును. "శ్రీభాగవతచరిత్రంబు" – పాండు. 1 – 18 – అని యీ గ్రంథమును గూర్చి కవి చెప్పినదియు దీనికి సూచనయే కావచ్చును. ఉద్భటారాధ్య చరిత్రము శివగురువులో నొకఁడగు నుద్భటుఁడను మహనీయుని చరిత్రము. ఈ కథ తెనుఁగున బసవపురాణమునందును, గర్ణాట మునఁ గొన్ని శైవగ్రంథములందును గలదు.

రామకృష్ణుని యుత్తమ రచనా గుణములలోఁ బదగుంఫనము ప్రత్యేక లక్షణము. ఇతని కావ్యములలోఁ బ్రతిపదము నిగూఢము, భావగర్భితమై యొప్పుటవలన నొక్క వ్యర్థపదమైనను గానుపింపదని పెద్దల యభిప్రాయము. పద్యరచనయందును సమాస ఘటనమందు ననన్యమైన ప్రత్యేకత యుట్టి పడు చుండును. వీని కావ్యములను బరిశోధించి తాళపత్రగ్రంథములను బర్యాలోకించి కడుజాగరూకతతో సందిగ్ధ స్థలములయందుఁ బాఠ నిర్ణయము చేయవలసి యున్నది పెక్కు ప్రతులు ప్రాచీనములైనవి లభింపకుండుట వలన నిది కష్టసాధ్యమైన యుద్యమము. కనుకనే నేఁటి వఱకును సుపరిష్కృతములైన ముద్రిత ప్రతులు లభ్యము కాలేదు. పాండురంగమాహాత్మ్యము మిక్కిలి ప్రౌఢ మగు కావ్యమగుట వలనఁ గవి హృదయమును స్పష్టముగా సహృదయుల కందఁజేయఁగల సమగ్రమగు వివరణ యుండితీరవలెను అది గూడ నింతవఱకు

రచింపఁబడలేదు. ఉద్భటారాధ్యచరిత్రము నందు గొలఁది గ్రంథపాతము లున్నవి. పాఠనిర్ణయము జరుగలేదు. సాధ్యపడినంతవరకు వేటూరు ప్రభాకర శాస్త్రిగారు చక్కఁగాఁ బరిష్కరించినారు. ఇంతవఱకొకే ముద్రణము జరిగినది. ఘటికాచలమాహాత్మ్యము మిక్కిలి యసమగ్రముగా లభించినది. దానికినిఁజెక్కులు గ్రంథపాతములు, సందిగ్ధములైన పాఠములు, నసమగ్రమైన పద్యములు, పద్యపాదములు పరిష్కరింపఁబడవలసినవి యున్నవి. ఇంతవఱకొక్కమాటే ముద్రితమైన యీ కావ్యము ప్రతిగూడఁ దొత్తిగా సపరిష్కృతము. చివరి రెండు గ్రంథములును మూల మాత్రముగా ముద్రితములు. వీనికినిఁ జక్కని వివరణ మావశ్యకము. మూఁడు గ్రంథములును విశదమైన వివరణముతో వెలువడి నప్పుడుగాని యాంధ్రలోకమునకీ, కవి యొక్క సర్వతోముఖమైన ప్రతిభయు, జీవిత సందేశమును దేట పడవు.

రామలింగఁడు – రామకృష్ణుఁడు

వికటకవి యని ప్రసిద్ధికెక్కిన యీ కవిని గూర్చిన సమస్యలన్నియు వికటములు. ఇతని పేర్లలో నొకటి రామలింగఁడు. ఇతని ప్రధాన రచనలోని కథానాయకుఁడు పాండురంగఁడు. ఈ రెంపు పేర్లకుఁ జివర " డుజ్జగు, నుత్వంబు రాదు' ; దీని నే వ్యాకరణము సాధించునో తెలియకున్నది.

ఈ కవి రామలింగఁడు, రామకృష్ణుఁడు, బాచిగాఁడు నను నామములతో వ్యవహరింపఁబడుచున్నాఁడు. చాటువులును హాస్య కథలును రామలింగని పేరనే యెక్కువ చెల్లుబడిలో నున్నవి. పండిత విమర్శకలోకమున రామలింగ, రామకృష్ణ నామములు రెంపును వ్యవహారముననున్నవి. ఉద్భటారాధ్య చరిత్రము రామలింగకవి కృతమనియుఁ, బాండురంగమాహాత్మ్యము రామకృష్ణకవి కృతములనియుఁ గవి రచించిన గ్రంథ పీఠికలను బట్టియే తెలియుచున్నది. దీని నాధారముగాఁగొని రామలింగ రామకృష్ణులు భిన్న వ్యక్తులని కొందఱభిప్రాయపడిరి.

ఉద్భటారాధ్య చరిత్రమున గ్రంథ పీఠికలో "రామలింగనామ విఖ్యాతుఁ గావ్య నిర్ణయ ధురీణు" : ఉద్భట. 1 – 24 ననియు, గ్రంథాంతగద్యయందు "రామ లింగయ ప్రణీతము" అనియు నున్నది. పాండురంగమాహాత్మ్యమున గ్రంథ పీఠికలో "ననురామకృష్ణకవిని" అనియు, "రమ్యగుణకృష్ణ రామయ రామకృష్ణ" యనియు, "రామకృష్ణ కవి చంద్రా ! సాంద్రకీర్తీశ్వరా" అనియున్నది. ఘటికాచల మాహాత్మ్యమున వెంకటగిరీంద్రుఁడు రచించిన గ్రంథ పీఠికలో "తెన్నలి రామకృష్ణ సత్కవి" యని రామకృష్ణుని మనుమఁడు చెప్పినట్లును, "కావున రామకృష్ణ కవి కర్పిత కావ్య మొకండు" అని వెంకటగిరీంద్రుడు చెప్పినట్లున్నది – (గ్రంథ పీఠిక, పద్యములు 14–20 –.) ఇతనినిఁగూర్చి యెవరో చెప్పిన యొక చాటువునందు రామలింగకవి యని యున్నది.

"లింగనిసిద్ధుఁగల్వల చెలింగని, మేచకకంధరున్ ద్రిహా
లింగని, సంగతాళి లవలింగని, కర్దమధూళి తన్మృణా
లింగని, కృష్ణ చేలుని హలింగని, నీలకచన్ విధా తృవా
లింగని, రామలింగ కవి లింగని కీర్తిహసింపదిక్కులన్"

రామలింగ రామకృష్ణ కవులు భిన్న వ్యక్తులని తలఁచువారీ క్రింది యాధారములఁ జూపినారు.

1. నామభేదము గ్రంథములలోనుండుట.
2. ఉద్భటారాధ్య చరిత్రమున గవి బిరుదు కుమార భారతి, పాండు రంగ మాహాత్మ్యమున "శారద నీరూపము" అని యుండుట.
3. ఉద్భటారాధ్య చరిత్రమున రామలింగని గురువు పాలగుమ్మి యేలేశ్వరుఁడనియుఁ, పాండురంగ మహాత్మ్యమున రామకృష్ణుని గురువు భట్టరు చిక్కాచార్యులనియు నుండుట.

ఈ భేదము వలన నీ రెండు కావ్యములును భిన్న కర్తృకములని వీరి నిర్ణయము. ఈ రెండు నామము లొకే వ్యక్తివని పండిత విమర్శకులు నిర్ణయించి తెల్పినారు.

"తెనాలి రామలింగకవి యని, తెనాలి రామకృష్ణ కవియని యొక్కనినే యటునిటు గూడ లోకము పేర్కొనుట గలదు – విశ్వకర్మ వంశీయుఁడు, ధీరజన మనోరంజన కర్త, తెనాలి రామలింగకవి యొకఁడున్నాఁడు. అతఁడు వేఱు – ఆ రెండు పేళ్లు నొక్కనివేయని నేను విశ్వసించుచున్నాఁడను.......... అపూర్వముగాఁ గొన్ని యాధారములు నా కగపడినవి."[1]

"కొందరు రామకృష్ణుడు వేరు – రామలింగడు వేరు అని చెపుతారు. అదిన్నీ విశ్వాసనీయం కాదు. ఇతని మొదటి పేరు రామలింగ మనడానికి ఏవిధమైన సంశయమున్నూ లేదు.........పాండురంగమాహాత్మ్య రచన నాటి కితడు వైష్ణవం పుచ్చుకోవటం చేత రమ్యగుణ కృష్ణరామయ రామకృష్ణగా మార్పు చెందినాఁడు."[2]

మతము మార్చుకొనినచో గురువు మాఱుదురు. కనుక నిద్దఱు గురువుల పేర్లు కావ్య పీఠికలలో నుండుట సంభవము. లేదా శైవ వైష్ణవ పురాణావళి నానార్థములను గరతలామలకముల నొనర్చు కొనిన యీ కవి శైవ వైష్ణవ గురువుల నుపాసించి రెండు విధములైన దీక్షలను సమానముగా వహించియుండ వచ్చును. బిరుదులును గవిసామర్థ్యమును బట్టియు, వయస్సునుబట్టియు

---

[1] వేటూరు ప్రభాకర శాస్త్రి, ఉద్భటారాధ్య చరిత్ర పీఠిక, పుట. 1.

[2] వెళ్లపిళ్ల వేంకటశాస్త్రి – కథలు, గాథలు, వాల్యూము 1, పుట. 799

మాఱవచ్చును. "శారద నీ రూపము" అన్నది ప్రశంసయే కాని బిరుదుకాదు. ఇదియుఁ బూర్వమాతని కున్న కుమార భారతి బిరుదమును సూచించును. ఉద్భటారాధ్యచరిత్రము, పాండురంగ మాహాత్మ్యము భిన్న కర్తృకములు కావనుటకుఁగూడ గ్రంథ పీఠికలే సాక్ష్యము. ఈ పీఠికల ననుసరించి ఈ దిగువ యంశములు తేలినవి :

1. ఉద్భటారాధ్య చరిత్ర కర్తపేరు రామలింగకవి. గోత్రము కౌండిన్యసగోత్రము. శాఖ శుక్లయజుర్వేదీయము. తండ్రిపేరు రామయ్య. తల్లి పేరు లక్ష్మమ్మ, బిరుదము కుమార భారతి.

2. పాండురంగ మాహాత్మ్య గ్రంథకర్త పేరు రామకృష్ణుఁడు. గోత్రము కౌండిన్యస గోత్రము. శాఖ శుక్లయజుర్వేదీయము. తండ్రిపేరు రామయ్య. తల్లి పేరు లక్ష్మమ్మ. బిరుదము సరసకవితా సనాథుఁడు.

ఒకేకాలమున నిట్టి వ్యక్తులిరువు రుండిరనుట కన్న నిరువురు నొక్కఁడే యనుట సమంజసము. ఇతఁడు తొలుత శైవుఁడై యుండి రామలింగఁడను పేరును, దఱువాత వైష్ణవమును స్వీకరించి రామకృష్ణుఁడను పేరను బరగెనని విమర్శకులు నిర్ణయించినారు. ఒకవేళ వీరిరువు రన్నదమ్ములై యుండవచ్చు ననుట యొక సంభావ్యత. ఒకే కుటుంబమున శైవుఁడు, వైష్ణవుఁడు నన్న దమ్ములుగా నుందురా యన్నచో నా కాలము నందలి మఱికొందఱు చారిత్రక వ్యక్తుల పేర్లను బట్టి యది సాధ్యమే యనిపించును. తుళువ నరసింహనాయకుని వంశమున సందరి పేర్లును వైష్ణవములే. కాని నరసానాయకుని మనుమఁడు సదాశివ రాయలను పేరుగలవాఁడున్నాఁడు. విజయనగర రాజులలో వైష్ణవ మతావలంబనము నారంభించిన రాజుపేరు విరూపాక్షరాయలు. మతము మాఱినను పేరు మాఱలేదు. చివరి వఱకు వంశదైవతము విరూపాక్షుఁడు. రాజముద్రలు శ్రీరామ నామాంకితములు. సుప్రసిద్ధ వైష్ణవ మతావలంబకుఁ డైన కృష్ణరాయల రాజముద్ర విరూపాక్షముద్ర. ధూర్జటికవి మనుమఁడగు కుమారధూర్జటిపేరు వెంకటనాథుఁడు. ఇట్టి యంశములను బరిశీలించగా నొకే కుటుంబమున నన్నదమ్ములకు రామకృష్ణ రామలింగ నామములుండుట యసంభవముకాదు. మఱియు రామకృష్ణుని కుటుంబమే వైష్ణవమును స్వీకరించె ననుకొన్నను వారు తెనాలి నుండి వచ్చిన వారు గనుక వారి వంశ దైవతమగు తెనాలి రామలింగేశ్వర స్వామి పేరు కొన్ని తరముల వఱకు నుండవచ్చును.

మత విషయమున నిట్టి యభేద ప్రతిపత్తి వారి కుటుంబమున నున్నచో నొక్కనికే చిన్నప్పటి నుండియు రెండు పేర్లుండవచ్చును. రెండు పేర్లతో వ్యవహరింపఁబడుచున్న వారి నెందఱినో నేఁడు మనము చూచుచున్నాము. ఇదియే సత్యమైన సందర్భమున కవి తన పేర్లలో శైవగ్రంథమునందు రామలింగఁ డను పేరును, వైష్ణవ ప్రాధాన్యముగల గ్రంథమునందు రామకృష్ణుఁడను పేరును నిలిపి యుండవచ్చును. ఇతఁడు సంప్రదాయ సిద్ధములైన శైవవైష్ణవ గ్రంథములు రచింపఁగలవాఁ డనుటకు సందేహములేదు. "శైవవైష్ణవ పురాణావళి నానార్థములు నీకుఁగరతలామలక విధములు" – పాండు. 1 – 23 –

అని విరూరి వేదాద్రి ఇతనినిఁగూర్చి పల్కినాఁడు. మతము మార్చుకొనుట జరిగినచో దానినిఁగూర్చి తరువాత గ్రంథములలోఁ జెప్పుకొనకుండుటకు హేతువు లేదు. మతమునకుఁ, బేరునకు సంబంధము లేని సందర్భములు కవుల యందే యున్నవి. ఈశ్వరార్చన కళాశీలుఁడైన శ్రీనాథుఁడే యిందుకుఁబ్రము ఖోదాహరణము. రెండు పేర్లున్నంత మాత్రమున మతము మార్చు కొనెనని నిర్ణయింప నక్కఱలేదు. మొదటి మత పరివర్తన కథన మొక స్థూల దృష్టిపై నాధారపడి తలయెత్తినది. అది యేమనఁగా నుద్భట చరిత్రము శైవ గ్రంథము గనుక దానిని రచించిన కవి కేవల శైవుఁడై యుండుననియుఁ, బాండురంగ మాహాత్మ్యము వైష్ణవగ్రంథము గనుక – వాస్తవమునకిదియుఁగాదు – దానిని రచించు కవి కనీస మా కాలమున కైన వైష్ణవుఁడై యుండుననియు నూహించుట. కాని యీ గ్రంథము లిందుకు భిన్నముగా నున్నవి. ఇంకను ఘటికాచల మాహాత్మ్యముతోపాటు మొత్త మీ మూఁడు కృతులను సూక్ష్మముగాఁ బరిశీలించి నచో వీనికర్త మతదృష్టి శైవ వైష్ణవ శాక్త మార్గముల సమన్వయ మవధిగాఁ గలది యని నిరూపితమగును.[3] ఈ కారణముచే మతము మార్చుకొనెననుట సత్యము కాదు. ఇక నిరువు రన్న దమ్ములుండుట సంభవమే గాని యాధారము లేదు. కనుక రామలింగ రామకృష్ణులొకే వ్యక్తియని నిర్ణయింపవచ్చును. పైని వివరించినట్లు మొదటినుండి రామలింగ రామకృష్ణ నామములు రెండును కవికుండి భిన్న గ్రంథములందు భిన్ననామములఁ నీ వికటకవి పేర్కొనినట్లు గ్రహింపనగును. ఇంతకు రామలింగ రామకృష్ణ కవు లొకేవ్యక్తి యగుటకుఁ బ్రాచీన ప్రమాణమే కలదు. వల్లూరి నరసింహకవి తన నాగ్నజిత్తీ పరిణయమున రామలింగకవి పాండురంగమాహాత్మ్యమును రచించెనని తేల్చి చెప్పినాఁడు.

"రంగుగఁబాండురంగని తెఱంగలరంగ రచించి వేడ్క మీ
ఱంగ భలోక్తులన్ నృపుఁగరంగ నొనర్చు హూరంగు నింగి ము
ట్టంగ మెలంగు నేరుపు గడంగి చెలంగు సభంగసద్యశో
లింగుని రామలింగ శశిలింగ కళానిధిని గణించెదన్"

రామకృష్ణుని కాలము

ఆంధ్రలోకమున జనశ్రుతిగాఁజెప్పుకొను గాథలను, చాటువులను బట్టి రామ కృష్ణుఁడు కృష్ణరాయల వారి రాజ్యపరిపాలన కాలములో నుండెనని తెలియ నగును. వీని చాటువులలోఁ బేర్కొనఁబడిన వారందఱు వీనికి సమకాలికులని స్వీకరించినచో నీదిగువ నుదాహరింపఁబడిన వ్యక్తుల పట్టిక యేర్పడును.

1. కృష్ణరాయలు – "నరసింహకృష్ణరాయని..."
"కలసందావక "
"శత సంఖ్యలొక్కటైనను....[4]
అను చాటువు లాధారములట.

---

[3] చూ. శీర్షిక, రామకృష్ణుని మతము, ఆత్మీయత, తత్త్వదృష్టి.

[4] చూడుడు : అనుబంధము – చాటువులు.

2. అల్లసాని పెద్దన – "కవి యల్లసాని పెద్దన...."[5]
అను చాటువు ఆధారము

3. ముక్కుతిమ్మన – "కవి యల్లసాని పెద్దన..."
"నీ కవితా మాధుర్యంబే..."[5]
అను చాటువు లాధారములు.

4. భట్టుమూర్తి – "వీఁపర వాఁపరతీఁగల....[5] అను పద్యమాధారము

5. పింగళి సూరన – "తెన్నాలి రామలింగఁడు...[5]
అను చాటువాధారము.

6. ధూర్జటి – "స్తుతమతియైన యాంధ్రకవి...[5] అను పద్యమాధారము

7. చిన్నన్న, పెద్దతిరుమలయ్య – "చిన్నన్న ద్విపద కెఱుగును...[5]
అను చాటువాధారము.

8. కాకుమాను మూర్తికవి – "ఓయమ్మలారమందులు...[5]
అను చాటువాధారము.

పైఁజాటువులన్నియు రామకృష్ణుని వైనచో వీరందఱతనికి సమకాలికులు కావచ్చును. కృష్ణరాయలు, పెద్దన, తిమ్మన, ధూర్జటి, చిన్నన్నయు సమకాలికు లగుట నిర్వివాదాంశము. +రామరాజభూషణుఁడు, సూరన, మూర్తి కృష్ణసంగతి సందిగ్ధము. వీరందఱు రాయల యాస్థానమున నుండిరని జనులు చెప్పుకొనుట కలదుగాని యాధారములు లేవు. రామరాజభూషణుఁడు కృష్ణరాయల మేనల్లుఁడగు రామరాయల యాస్థానమున భూషణమని యతని బిరుదమే సూచించును. ఈ రామరాయల పరిపాలనాకాలము క్రీ.శ. 1541 నుండి 1565 వఱకు. పింగళి సూరన, నంద్యాల కృష్ణభూపతి సమకాలికుఁడు. ఈ భూపతి నిశ్చయముగాఁ గృష్ణరాయల తఱువాతివాఁడు. కృష్ణరాయలకాలమున రామకృష్ణుఁడుండినచోఁ బింగళి సూరన, భట్టుమూర్తి కాలమున నుండుట సంభావ్యమా ? సంభావ్యము కావచ్చునుగాని చాటువులను బట్టి యీ నిర్ణయము జరుగరాదు. కొన్ని చాటువులు సందేహాస్పదములు. కనుకఁ గాల నిర్ణయము నకు బలవత్తరమైన యాధారము లావశ్యకములు.

"తెనాలి రామలింగకవియొక్క కాల నిర్ణయముఁ జేయుటకుఁదగిన సాధనము లేమియు దొరకలేదు."[6]

"అతఁడు రాయలకాలమున నుండెనో లేదో జెప్పఁజాలను ." అని చెప్పి యతనిని దిగ్గజములలో నొకఁడుగా నంగీకరించిన వారొకరు.[7]

---

[5] చూడుడు : అనుబంధము – చాటువులు.

[6] కొమఱ్ఱాజు లక్ష్మణరావు, హైందవ చక్రవర్తులు, పుట. 123

[7] మాతలపాటి వేరరాజు, విజయనగర సామ్రాజ్యము, పుట. 158, 156

+ ప్రబంధాంకం శారదా మూర్తి

ఈ కవి కృష్ణరాయల సమకాలికుఁడని యంగీకరించియు దిగ్గజములలో నొకఁడు కాఁడని కొందఱు చెప్పుచున్నారు.[8]

ఈ కవి కృష్ణామండలములోని తెనాలి గ్రామమునందు శాలివాహనశకము 1384 – క్రీ. శ. 1462 – సంవత్సరమున జననమొందెననియు, నితని యింటిపే రీశ్వర ప్రెగ్గడవారనియును గొందఱూహించుటయే గాక కవి జననమునకు సంబంధించిన తిథి వార నక్షత్రాది వివరములను, జాతకమును గూడ సాధింప యత్నించినారు.[9]

"అయినను మన కితనికాలము గూర్చి యిప్పుడు దొరకిన నిదర్శనములను బట్టిచూడఁగా పూర్వోక్తకాలము సరియైనదని నమ్ముటకు వలనుపడదు ..... రామకృష్ణకవి అప్పయ్య దీక్షితులవారితోను తిరుమల తాతాచార్యులతోను సమకాలికుఁడయి చంద్రగిరి రాజులను వేంకటపతి రాయల ప్రభుత్వకాలములో నుండినవాఁడైనట్లు కొన్ని నిదర్శనములు కనఁబడుచున్నవి. ఈ వేంకటపతిరాయలు వసుచరిత్రమును కృతినందిన తిరుమల దేవరాయల యనంతరమున తనరాజధానిని విజయనగరమునుండి చంద్రగిరికి మార్చుకొని క్రీ. శ. 1585 మొదలుకొని 1614 వఱకును రాజ్యముచేసినాఁడు. కృష్ణరాయని మరణానంతరమున నేఁబదియైదు సంవత్సరములకు రాజ్యమునకు వచ్చిన వేంకటపతిరాజు యొక్క రాజ్యకాలములో నున్న రామకృష్ణకవి నిజముగా నొక వేళ కృష్ణదేవరాయల కాలములోఁగూడ నుండుటయే తటస్థించిన పక్షమున, అతఁడప్పుడు బాలుఁడైయుండవలెను గాని ..వయసు మీఱిన వాఁడై యుండఁజాలఁడు... రామకృష్ణకవియు 1560, 1570 సం. ప్రాంతము నుండి కవియై యుండవచ్చును... పాండురంగమాహాత్మ్యము రచియింపఁబడిన కాలము 1650 కంటెఁ బూర్వమైయుండదు."[10]

ఈ వీరేశలింగము గారి వాక్యముల లోని యంశములకు బాధకములైన యాధారములు కొన్ని లభించినవి. మరియు నీకవి వేంకటపతిరాయల కాలము వాఁడైనట్టు వీరు చెప్పిన "కొన్ని నిదర్శనములు" ఎట్టివో యెవరికిఁ దెలియదు.

లభించిన యసంగిద్ధములగు నాధారములను సేకరించి, పరిశీలించి వేటూరి ప్రభాకరశాస్త్రి యొక నిర్ణయముసేసినారు. ఉద్భటారాధ్యచరిత్ర పీఠికలో వారీ యంశమును విపులముగాఁ జర్చించినారు. వారు గ్రహించిన యాధారములు మూఁడు విధములు.

---

[8] పింగళి లక్ష్మీకాంతము, తెనుగు విజ్ఞానసర్వస్వము, సంపుటము. 3, పుట. 606–620.

[9] కావలి వెంకటరామస్వామి – Poets of the Deccan.

[10] కందుకూరి వీరేశలింగము – ఆంధ్రకవులచరిత్రము, పుటలు : 165 నుండి 173 వరకు.

1. రామకృష్ణుని గ్రంథముల పీఠికలు
2. వాని బంధుగులు రచించిన గ్రంథ పీఠికలు
3. కొందఱు చారిత్రక పురుషులు, శాసనములు.

ఈ యాధారములతో వారు నిర్ణయించిన యంశము లైదు

1. రామకృష్ణుని జననము క్రీ. శ. 1505 ప్రాంతము
2. ఆ కవి మరణము క్రీ. శ. 1575 - 1580 ప్రాంతము
3. ఉద్భటారాధ్య చరిత్ర రచనాకాలము 1525 – 1535
4. పాండురంగమాహాత్మ్య రచనాకాలము 1565 ప్రాంతము
5. ఈకవి కృష్ణరాయల యాస్థానమున నుండుట యసంభవముకాదు.

వీరుచేసిన నిర్ణయ సారాంశ మీ దిగువరీతిగా నున్నది :

1. రామలింగకవియను పేరుతో నితఁడు రచించిన యుద్భటారాధ్య చరిత్రము నూర దేవయ్యకుఁ గృతి యొసఁగెను. ఈ దేవయ్య నాదెండ్ల గోప మంత్రికి సమకాలికుఁడై యతనిచే నగ్రహారాది సన్మానములు వడసెను. కృష్ణరాయలు క్రీ. శ. 1515 సం గొండవీఁటిని జయించి దానినిఁ బాలించుటకుఁ నాదెండ్ల గోపన్నను నియమించెను. గోపన్నకడ నగ్రహార దానముఁబొంది ప్రసిద్ధుఁడైన వెనుకనే దేవయ్య యుద్భట చరిత్రమును గృతినందినాఁడు. కనుకవాకాల మించుమించు క్రీ. శ. 1525 నుండి 1535 లోపున జరిగి యుండును.

2. రామకృష్ణకవియను పేరుతో నితఁడు రచించిన పాండురంగమాహాత్మ్య కావ్యమును విదూరి వేదాద్రి కంకితము చేసెను. ఈ వేదాద్రి కందాళప్పలాచార్యుల శిష్యుఁడు. పరాభవ సంవత్సరమున – క్రీ. శ. 1545 – గండికోట ప్రభువు కందాళ అప్పలాచార్యులకు భూదాన మొసఁగినట్లు శాసనమున్నది. దీనికిఁగొంచెము తరువాత నించుమించు 1550, 1565 ప్రాంతమునఁ బాండురంగమాహాత్మ్యరచన జరిగి యుండును.

3. రామకృష్ణుని వైష్ణవ గురవు భట్టరు చిక్కాచార్యులు, కామందకము గృతినొందిన వేంకటాద్రి యీ చిక్కాచార్యుల శిష్యుఁడు. కామందకమును గృతి గొనుటను గూర్చిన యీ దిగువ పద్యము వలన శక సంవత్సరము 1506 – క్రీ. శ. 1584 లో నిది జరిగి యుండవలెను.

"రమణీయంబుగ శాలివాహశక వర్షంబుల్ గతంబై సహ
స్రము నేనూరును నాఱునై వెలయఁగాఁ బ్రౌఢిందెనింగించి రా
ర ! మహిందమ్మయ వేంకటాద్రి విభుపేరన్ వేడ్కఁగామందకీ
యము శ్రీ వేంకట రామకృష్ణులు స్వభాస్వబ్ధంబువన్ రూఢిగన్"

దీనిఁబట్టి చూడఁగాఁ బాండురంగ మాహాత్మ్య రచనాకాల మించుమించు 1565 ప్రాంతమే యై యుండవలెను – మానవల్లి రామకృష్ణ కవిగారు ఆంధ్రపత్రిక 1914 సంవత్సరాది సంచికలోఁ బ్రచురించిన వ్యాసమునఁగూడ నివియే యాధారములను గొని యీ యంశములనే నిరూపించినారు.

నాదెండ్ల గోపమంత్రి సాళువ తిమ్మరుసు మేనల్లుఁడు. ఇతఁడు రాయల కన్నఁ జిన్నవాఁడైనను సమకాలికుఁడను సంశము చరిత్ర సిద్ధము. కనుక నితనిచే నగ్రహార సన్మానము లందిన దేవయ్య యీయన సమకాలికుఁడే. దేవయ్యకు గ్రంథ మంకితము చేసిన రామలింగకవి రాయల సమకాలికుఁడు కావలెను. ఈ కవి కావ్యరచనాసమర్థుఁడైన దశలోఁ గృష్ణరాయల జీవిత కాలమున నున్నాఁడనుట నిశ్చయమని ప్రభాకరశాస్త్రి తేల్చినారు.

వైజయంతీ విలాస కర్తయగు సారంగు తమ్మయ్య కందాళ అప్పలా చార్యులు గారి శిష్యుఁడు. పాండురంగమాహాత్మ్య కృతిపతి వేదాద్రియు వారి శిష్యుఁడే కనుక వేదాద్రికిఁ గావ్యము నంకితముచేసిన రామకృష్ణుఁడు, సారంగు తమ్మయ్యకు సమకాలికుఁడు కావలెను. ఈ తమ్మయ్య కాలమున మహమ్మదు శాహి గోలకొండను బాలించుచుండెనని యీ తమ్మయ్య పద్యముల వలనఁ దెలియుచున్నది. మహమ్మదు శాహి పరిపాలనాకాలము క్రి. శ. 1581 నుండి 1611 వఱకును. ఈ కాలమునందే రామకృష్ణుండు జీవించి యుండవలెనని వీరేశలింగముగారు వ్రాసినారు. కాని తమ్మయ్య రామకృష్ణునికన్నఁ జిన్నవాఁడై యుండవచ్చును. వీరూరి వేదాద్రియు, సారంగు తమ్మయ్యయు నొకే గురువు శిష్యులైనంతమాత్రమున నమవయస్కు లనుట కాధారములేదు. గురువుల వార్ధకమున తమ్మయ్య బాలశిష్యుఁడై యుండవచ్చును. అతనికి రామకృష్ణుఁడు తాతవయస్సున సమకాలికుఁడై యుండవచ్చును గదా!

"గురువరాజు కొడుకైన నంగభూపాలుఁడు పదునారవ శతాబ్దము యొక్క కడపటి భాగమందు రాజ్యము చేసినట్టే యూహింపఁదగియున్నది. అతని యాశ్రితుండగుట చేత రామకృష్ణకవియు 1560–1570 సంవత్సరముల ప్రాంతమునుండి కవియై యుండవచ్చును[11] అని వీరేశలింగముగారు మరి యొక యూహ చేసినారు. ఇందు గురువరాజు సదాశివరాయలనుండి గ్రామములను సంపాదించిన సంవత్సరమునుండి క్రి. శ. 1545 యీ యూహ చేయఁ బడినది. దీనిఁబట్టి గురువరాజు వయస్సు, ఆయన కుమారునివయస్సు లెక్క వేయుటకు సాధ్యము కాదు. ఈ యూహలకుఁ గార్యకారణసంబంధము సిద్ధింపదు. దీనిపై నాధారపడి రామకృష్ణుఁడు కవిత్వారంభము చేసిన ముహూర్తమును నిర్ణయింపఁ బొసఁగదు. మరియుఁ బాండురంగమాహాత్మ్యము రామకృష్ణుని రచనలలో మొదటిది కాదు, చివరిది యనుటకు వీలున్నది. కనుక దానినిఁ గృతి నందినవాని కాలమున రామకృష్ణుఁడు కవిత్వారంభము చేసెననుట సంగతము కాదు.

---

[11] కందుకూరి వీరేశలింగము, ఆంధ్రకవుల చరిత్రము. పుట: 170.

లభించినంత వఱకుఁగల ప్రబల నిదర్శనము లన్నియు రాయల సమకాలికత రామకృష్ణునకుఁ గలదనియే తెలియఁజేయుచున్నవి. మానవల్లి రామకృష్ణ కవి, వేటూరి ప్రభాకర శాస్త్రి తమతమ చర్చల ఫలితముగా నీ యంశమునే నిర్ణయించిరి. వేటూరివారి ప్రకార మీ కవి సుమారు 1505 ప్రాంతమున జన్మించి 1575 – 80 ప్రాంతమువఱకు జీవించియుండెను. కృష్ణరాయలు రాజ్యమునకు వచ్చినది 1519 జూలై 22 – 26 తేదీల నడుమ ననియు. పట్టాభిషేకము 1510, జనవరి 23 – 24 తేదీలలో ననియు, మరణించినది 1530 ఫిబ్రవరిప్రాంత మనియు డాక్టర్ ఓరుగంటి రామచంద్రయ్యగారు నిర్ణయించినారు. వేటూరి వారి ప్రకారము 1525 – 35 ఉద్భటారాధ్య చరిత్ర రచనము 1565 ప్రాంతము పాండురంగ మాహాత్మ్య రచనము జరిగియుండవలెను. అనఁగాఁ పాండురంగ మాహాత్మ్య రచనాకాలము నాఁటికి రాయలు మరణించి సుమారు ముప్పదియైదు సంవత్సరములు. ఉద్భటచరిత్ర రచన రాయల మరణమునకు ముందుగాని, తఱువాతగాని జరిగియుండవలెను.

ఈ వాదమునందొక స్వల్ప విషయము చర్చనీయమై యున్నది. పాండురంగ మాహాత్మ్యమున వసుచరిత్రయు, నాముక్తమాల్యదయు స్మరింపఁబడినవి.

"గిరికానుషక్తబుద్ధిను, పరిచరునింబోలు నొక్కపన్నగమొకనాఁ
వరడొాడి నెచ్చటనుండియు, బురమర్దను దివ్యభవనమున కేతెంచెన్"
—పాండు. 4 – 242.

"యమదండ చండమగుభుజ
గమునకు వెఱచఱవి యాఖుకన్యక కమలా
రమణాంఘ్రిఁజేరి గురుభీ
తమతికి నాముక్తమాల్యదకు నెనయగుచున్"
—పాండు. 4 – 244

కనుక నీ రెండు గ్రంథముల రచనయు జరిగిన వెనుకనే పాండురంగ మాహాత్మ్య రచన పూర్తియై యుండవలెను. వసుచరిత్ర నంకితమందిన తిరుమల రాయలు 1570లో రాజై 1571 లోఁ జనిపోయినాఁడని యొక మతము. ఈ కాలముననే వసుచరిత్ర కృతి ప్రదానము జరిగియుండ వలెను. వేటూరి వారి ప్రకారము పాండురంగ మాహాత్మ్యము వసుచరిత్ర కన్న ముందె రచింపఁ బడియుండవలెను.

ఈ విప్రతిపత్తిని సమన్వయించుట కిందు స్మరింపఁబడిన వసుచరిత్ర-రామరాజ భూషణుని ప్రబంధము కాదనియును, భారతములోని కథయనియును గొందఱు చెప్పుచున్నారు. కాని ఇది సమంజసముగాఁ దోపదు. ఆముక్తమాల్యద, వసుచరిత్రలు ప్రశంసింపఁబడిన పద్యములు వరుసనే యున్నవి. ఇందొకటి ప్రబంధము, రెండవది భారతకథ యనుటకుఁ బ్రమాణము లేదు. గిరికానుషక్త పద్యమునందలి శ్లేషను గమనించినచో నిది భారతకథ ప్రభావము గాక వసుచరిత్ర ప్రభావమని స్పష్టమగును. రామకృష్ణుఁడు పాండురంగ

మహాత్మ్య రచనము పూర్తిచేయునాఁటికి వ్యాప్తిలోనికి వచ్చిన రెండు మహా ప్రబంధముల నతఁడు స్మరించె ననుటయే సంగతము. ఈ యంశములు పొసఁగుటకుఁ బాండురంగ మహాత్మ్యము 1571 తఱువాతఁ బూర్తియై యుండ వలెను. ఈ యాధారము లన్నిటివి నిరపాయమగు కాలనిర్ణయము చేసినచో కవి యించుమించుగా 1510 ప్రాంతమున జన్మించి 1571 తరువాత పాండు రంగ మహాత్మ్య రచనను బూర్తిచేసి యావిష్కరించి యుండవలెను. 1580 – 1585 వఱకు జీవించి యుండవచ్చును. చాటువులలోఁ గూడ రామకృష్ణునిచే స్మరింపఁబడినవారిలో భట్టుమూర్తియే మిక్కిలి యర్వాచీనుఁడు కావున నిదియును నై నిర్ణయమునకు బాధకము కాదు. ఈ నిర్ణయమువలననే యా కవి యష్ట దిగ్గజములలో స్థాన మలంకరింపఁబడకుండుటకుఁ గూడ హేతువాతని బాల్యావస్థయే యని స్థిరమగుచున్నది. చాటువులను మాత్రము చెప్పుచు నాస్థానమునఁ బ్రవేశము గలిగి రాకపోకలను జేయుచుండుట సంభవ మగుచున్నది. ఈ సంభావ్యత లోని కతిపయ సన్నివేశములు తఱువాతిచాటు, కథా బాహుళ్యము నకు మూలములై యుండవచ్చును. వసుచరిత్ర రచనాకాలము నిర్ణయింపఁబడిన సంవత్సరముపై నాధారపడియే యీ నిర్ణయము చేయవలసి యున్నది.

వసుచరిత్ర రచనాకాలము నిర్ణయించుటలో నొక వివాదాంశ మున్నది. అది యీ దిగువ విధముగా నున్నది.

1. "వసుచరిత్రము 1577వ సంవత్సరము తరువాతనే ముగింపఁబడి నట్లు స్పష్టమగు చున్నది. తిరుమలదేవరాయఁ డే సంవత్సరమునందు మృతి నొందెనో స్పష్టముగాఁ దెలియదుగాని 1574వ సంవత్సరము వఱకు నాతఁ డిచ్చిన దానశాసనములు కనఁబడుచున్నవి.[12]

2. .. ..ఆదిల్ షా పెనుగొండను 1577 సంవత్సరమున ముట్టడించినట్లును నందు ఆదిల్‌షా పరాజితుఁడై పోయినట్లును దెలియఁబడు చున్నది. ఇదియే,

"తిరుమలరాయశేఖరుని ధీరచమూభటరాణియాణి భీ
కర యవనేశ్వర ప్రహితఖాన బలంబులఁ జిక్కుసేయద
ద్ధరఁ బెనుఁ గొండకొండలు మదద్విప చర్మకపాలమాలికా
పరికర భూషణంబులయి బర్విడిఁ గాంచె గిరీశభావమున్"

వసు. 1–59

అని వసుచరిత్రమునందుఁ జెప్పఁబడినది........ ...... తిరుమల రాయలు పెనుగొండయందుఁ బాలనము సేయునపుడు 1577వ సంవత్సరమున జరిగిన పెనుఁగొండ యుద్ధమును జెప్పఁబడినది...........[13]

---

[12] వీరేశలింగము, ఆంధ్రకవులచరిత్రము – 1–7వ ముద్రణము పుట. 138.

[13] వసుచరిత్రము తం. రే. పెరుమాళ్లయ్య వ్యాఖ్యాసహితము 1948 ముద్రణము – ఉపోద్ఘాతము, పుటలు, 7,8.

3. "........భట్టుమూర్తి..... క్రీ.శ. 1577 పైనను 1580కు గొంచెము పూర్వమునను వసుచరిత్రము తిరుమల దేవరాయల కంకితము గావించెననియు విశ్వసింపవచ్చును......"[14]

4. "వసుచరిత్ర క్రీ.శ. 1599-70 ప్రాంతమున పెనుగొండలో తిరుమలదేవరాయని పట్టాభిషేకా నంతరమున రచితమైనది."[15]

పై యభిప్రాయము లన్నియు నట్లుండగాఁ జరిత్రకు సంబంధించిన యాధారములీ దిగువరీతి నున్నవి :

1. "......శాలివాహనశకం 1486 అగు నేటి రక్తాక్షి సంవత్సరమున తురకలు అళేరామరాజుతో యుద్ధము. అళేరామరాజును ముంచి దేశం స్వాధీనం చేసుకున్న అయొక్క అపాంత్రలో దేశము పాడై వుండెను.

—Kaifiyat of Kamalapuram L.R.I , p. 49[16]

2. "హళియ రామప్పయ్యగారు...... దఖణిబాదుషాహులవల్ల....... ములిగిపోయిన వెనుక సదాశివరాయలవారికి రాజ్యము స్వాధీనమై వారితట్టు నుండి యీ సీమనం దేలతింమరాజుగారు ప్రభుత్వం చేస్తూవుండినప్పుడు......"

—Kaifiyat of Jambulamadugu L.R.I., p. 225[17]

3. "అళియ రామరాయలను దఖని పాదువాలుగద్ది చేసిన తరువాత సదాశివరాయలు 6 యేండ్లు ప్రభుత్వము చేస్తూ వుండెను......"

—Kaifiyat of Kamalapuram. L.R.I., p. 15[18]

4. "శాలివాహన శకం 1494 వరకు తిరుమల దేవమహారాయలు ప్రభుత్వము చేసిరి......"

—Kaifiyat of Kondavidu, Mac. Mss. 15-4 40[19]

"అటుతరువాత ప్రమోదూత నామ సంవత్సరాన తిరుమలరాయలు పెనుగొండ అనే పట్నం గట్టుకొని యేలిన నెలలు 11"

—Virappayya's Kalagnana Mac. Mss. 12-19-3 f. 51[20]

---

[14] వసుచరిత్రము, వావిళ్ల రామస్వామిశాస్త్రులు ప్రతి. శేషాద్రి రమణకవుల పీఠిక, పుట, 5.

[15] పైఁ జెప్పిన ప్రతియందే నిడుదవోలు వేంకటరావుగారి పీఠిక, పుట. 18.

[16] Further Sources of Vijayanagara History by K.A. Nilakantha Sastri and N. Venkataramanayya, Vol. II, page 290.

[17] Ibid, p. 292.

[18] Ibid, p. 294.

[19] Ibid, p. 299.

[20] Ibid, p. 18.

ఈ కైఫీయతుల ననుసరించి యీ దిగువ యంశములు తేలుచున్నవి :

1. శకసంవత్సరము 1486 అనఁగా క్రీ.శ. 1564. రామరాజు మరణము.

2. సదాశివరాయల పరిపాలనము, క్రీ. శ. 1564 నుండి 1570 వఱకు.

3. తిరుమల దేవరాయల ప్రభుత్వము శకసంవత్సరము 1494 వఱకు అనగా క్రీ.శ. 1572 వఱకు.

4. తిరుమల రాయల పరిపాలనాకాలము, 11 నెలలు.

పై యంశములవలనఁ తిరుమలరాయలు క్రీ. శ. 1570–71 నుండి 1571–72 వఱకని తేలినది. కనుక వసుచరిత్ర రచనాకాల మంతకుఁ దరువాతి దగుటకు వీలు లేదు. వసుచరిత్ర 1-5లో వర్ణించిన పెనుగొండయుద్ధము 1577 నాఁటి దనుట పొసఁగదు. వర్ణింపఁబడిన యుద్ధమున "యవనేశ్వర ప్రహితఖాను బలంబులఁ ఐక్కుసేయుట" వర్ణింపఁబడినది. అట్టి పెనుఁగొండయుద్ధము 1568 లో నొకటిజరిగినది.[21]

"తిరుమల దేవరాయలు క్రీ.శ. 1571 – క్రీ శ. 1572 –, ... క్రీ.శ. 1568 లో ఎత్తి వచ్చిన అలీ ఆదిల్ షా రాజును హిందూసేనలను తరిమికొట్టి కోనేటి కొండ్రాజును ఆదోనినుండి వెలికిరాకుండ ముట్టడించెను. ముస్లిం సర్దారు మాలి ఖానుడు పెనుగొండనే చేరబారెను. సవరము చెన్నప్ప ఆదుకొనుటతో పెనుగొండదుర్గము ముస్లిములబారినుండి రక్షితమయ్యెను. పండుముదుసలి తిరుమల దేవరాయలు ఎక్కువకాలము పాలింపలేదు. పదునొకండు నెలలపాటి యితని శాసనము క్రీ.శ. 1572 ఏప్రిల్ ప్రాంతములో ముగిసిపోయెను..."[22] కనుక నీయాధారముల ననుసరించి వసుచరిత్ర రచనాకాలమే కాక యావిష్కరణ కాలము కూడ క్రీ.శ. 1572 ఏప్రిలుకు పూర్వమే కావలయును. మఱికొన్ని శాసనాధారముల ననుసరించి క్రీ.శ. 1578 వఱకును దిరుమలరాయలు జీవించి యున్న ట్లూహింపనగును.[23] కనుక మెకంజీసంకలనము ననుసరించి హిరాసు అను చరిత్రకారుడు మున్నుగువారు నిర్ణయించిన తిరుమలరాయల మరణకాలము తప్పక వివాదగ్రస్తమనియు సందేహాస్పదమనియు నంగీకరింపక తప్పదు. ఈ

---

[21] పెనుగొండ యుద్ధము వివరములు, వసుచరిత్ర రచనాధారములను గూర్చిన మఱికొన్ని యంశము లనుబంధము 2 లో "వసుచరిత్ర రచనాకాలము" అను శీర్షిక క్రింద శ్రీ నేలటూరి వెంకటరమణయ్య వ్యాసవాక్యము లుదాహరింపఁబడినవి.

[22] ఒరుగంటి రామచంద్రయ్య "అరవీటి వంశము", తెలుగు విజ్ఞాన సర్వస్వము. పుట. 409 – 410.

[23] See Neelakantha Sastri and Venkata Ramanayya: "Further sources of Vijayanagara History" – University of Madras, 1946, Vol. I, p. 297, 301.

విషయమునకు సంబంధించిన ప్రామాణిక వివరములు అనుబంధము 2 లో "Penugonda War – time of Tirumala : Sources" అను శీర్షికలోఁ జూపఁబడినవి. ఎట్లైనను తిరుమలుని పరిపాలనము క్రీ.శ. 1570 – 72 అనుటకు విప్రతిపత్తిలేదు. తిరుమలరాయల పట్టాభిషేక కాలముననే యీ కావ్య మంకితము చేయఁబడి యుండుటయు సంగతము. దీని తరువాత సుమారు క్రీ.శ. 1572 నుండి 1575 నడుమ పాండురంగ మాహాత్మ్యము విదూరి వేదాద్రి కంకితమైనట్లు "గిరికానువక్తబుద్ధి" పద్యమునుబట్టి నిర్ణయ మగుచున్నది. ఈ నిర్ణయము వలన రామకృష్ణుడు "క్రీ శ. 1485 - 1599 ప్రాంతమున జన్మించి 60 - 65 సంవత్సరములు జీవించి 1560 – 1570 నడుమఁ గాలధర్మము నొందెనని [24]" చెప్పిన వాగంటి శేషయ్య యభిప్రాయము పొసఁగదు.

వాగంటివారు రామకృష్ణుని కాలనిర్ణయమునం దొక నూతనమార్గ మవలంబించినారు. పాండురంగ మాహాత్మ్య కృతిపతి వేదాద్రి కాల నిర్ణయము నిమిత్తము పెదసంగని కాలమును జర్చించుచుఁ దన్నిమిత్తముగాఁ జిన సంగరాజు వేయించిన శాసనకాలమును వీరు సాధించిన మార్గము ప్రామాణిక మనుటకు భయమగుచున్నది. శ్రీ నేలటూరి వెంకటరమణయ్య యీ శాసనము క్రీ.శ. 1516 నాఁటిదని యందలి ప్రమాది సంవత్సరము ననుసరించి నిర్ణయింపఁగాఁ జాగంటివా రది 1571 నాఁటిదని చెప్పినారు. దానికి వారు చూపిన ప్రమాణము[25] లూహపై నాధారపడిన వనుట సాహసముకాదు. ఈ యాధారమునఁ బాండురంగ మాహాత్మ్య కృతిప్రదానము క్రీ.శ. 1550 అని నిర్ణయించినారు.

శ్రీ నేలటూరి వెంకటరమణయ్య, చిన సంగరాజు శాసనములను గూర్చి చర్చించుచు "పెదసంగరాజు శాసన మేదియు నింతవఱకు లభించకున్నను నతని తమ్ముఁడగు చిన సంగరాజువలెనే కడపమండలమున నెచ్చటనో క్రీ శ. 1519 వ సంవత్సరమునుండియు రాజ్యపరిపాలనము సేయుచుండె ననుట నిశ్చయము. కావున నాతని వ్రాయసకాఁడైన విదూరి వేదాద్రి మంత్రి కంకిత మీయఁబడిన పాండురంగ మాహాత్మ్యము కృష్ణరాయలవారి రాజ్యకాలము తుదనో తరువాత నచిరకాలమునకో విరచిత మయ్యెనని యూహించుచున్నాను" [26]. ఊహింప వచ్చును గాని యీ కాలనిర్ణయము వలన వసుచరిత్రకన్నఁ బాండురంగ మాహాత్మ్యము ముందు రచింపఁబడినదని యంగీకరింపవలెను. ఈ యూహపై నాధారపడి నిర్ణయించుటకన్నఁ బ్రత్యక్షమగు "గిరికానుషక్త బుద్ధి" యను పద్యము స్వీకరించి యిది వసుచరిత్రకన్నఁ దరువాతనే యనఁగా 1572 – 1575 ప్రాంతముననే యావిష్కృతమైనదని స్వీకరించుట సమంజసము. కాఁగా రామకృష్ణకవి క్రీ.శ. 1510 ప్రాంతమున జన్మించి, 1572 తరువాతఁ బాండురంగ మాహాత్మ్య

---

[24] ఆంధ్రకవితరంగిణి, ఎనిమిదవ సంపుటము, పుట 8.

[25] " పుట 24.

[26] ఆంధ్ర కవితరంగిణి, ఎనిమిదవ సంపుటము, పుటలు 25, 26 లలో నుదాహరింపఁబడిన వ్యాసభాగము.

మావిష్కరించెనని నిశ్చయముగాను, 1580 – 1585 ప్రాంతమువఱకు జీవించి యుండవచ్చునని స్థూలముగాను నిర్ణయింపవచ్చును.

రామకృష్ణుఁ డష్టదిగ్గజములలోనివాఁడా ?

కవితా పితామహుల వాఙ్మయ ప్రశంసల సత్యలోక సీమలలో స్వైర విహారము నొనర్చి, ముక్కు తిమ్మనార్యుని ముద్దుపలుకులలోఁ గులుకాడి, యెదురైనచోఁ దనమద కరీంద్రము డిగ్గి సరస్వతీ మూర్తులను గేలూఁత యొసఁగి యెక్కించుకొని గండపెండేరముల నలంకరించి సువర్ణాక్షతలఁ బూజించిన సాహితీ సమరాంగణ సార్వభౌముని సారస్వతాంగణమున నెనిమిదిమంది కవిదిగ్గజములు తమ కరాగ్రములపై నాంధ్రోక్తిమయ ప్రపంచము నుద్ధరించిరని యొక చక్కని ప్రతీతి కలదు. ఈ ప్రతీతి వినువారి కెంతతీయని యంశమో విమర్శకుల కంత తీరని సమస్య.

రాయల యాస్థానమునం దష్టదిగ్గజము లుండిరా? ఉన్నచో నెవ్వరు? ఈ సమస్య నేఁటికిని దగినరీతిని బరిష్కరింపబడలేదు. దిగ్గజముల యునికి యసత్యమని నమ్మిన పెద్దలు కొంద ఱాంధ్రసాహిత్యోపాసకులలోఁ గలరు.

“ఈ యష్టదిగ్గజముల కథలో నేమైన సత్యమున్నచో నాఁటి కావ్యములలో నొకదానిలోఁగాకున్న మరియొకదానిలోనైన నీ విషయమేల ప్రస్తావింపఁబడి యుండలేదనుట పెద్ద ప్రశ్న…. …… అష్టదిగ్గజముల కథలలో నేమాత్రము సత్యమున్నను వారిలోఁ బెద్దగజమైన పెద్దన్న మాత్రము మనుచరిత్రలో నెక్కడనో యొక చోట నాకథ నిరికించి యుండునని నా యూహ! విజయనగర పతనానంతరము ఈ గజముల కథ నెవ్వఁడో యొక బుద్ధిమంతుఁడు సృష్టించియుండును. రాయల నాఁటి కవులలో కందుకూరి రుద్రకవి యొకఁడు రాయల యాస్థానమున నీశాన్య దిక్కున నీతని యాసన ముండెడిదఁట! . …… రుద్రకవి సంపాదించి కొన్న యీశాన్య సింహాసనము కవిత్వమునకుగాదని నా యూహ.”[27]

పైవాక్యములను బల్కిన నోటితోనే సరస్వతీ పుత్రు లీ క్రింది వాక్యములను గూడఁ బలికినారు.

“అష్టదిగ్గజముల దైనిక జీవితమున పరస్పర స్నేహభావము లెటులుండెనో చెప్పలేము. వారును కొంచెముగనో గొప్పగనో కీచులాడుకొనుచున్నట్లే జనశ్రుతియున్నది.[28]

ఇందలి స్వవచోవ్యాఘాతమునకుఁ గారణ మష్టదిగ్గజము లుండిరను జనశ్రుతిలోని సత్యమే యనవలెను. “అతఁడు-రామకృష్ణుఁడు అష్టదిగ్గజాలలో ఒక

---

[27] పుట్టపర్తి నారాయణాచార్యులు : రామకృష్ణుని రచనావైఖరి. పుటలు 3–5

[28] వైది : తెన్నాలి రామకృష్ణుని తెనుఁగు 'కవిత తెలుఁగు' రీతులు, పుట 27.

డన్న ప్రతీతి ఊరకే రాదు".[29] ఈప్రతీతికిఁ బ్రామాణ్యము వహించు శ్లోకము నొకదానిని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సేకరించి యుదాహరించినారు.[30]

"యత్కీర్తిర్భువనైక భూషణమభూద్యస్యప్రసాదాన్నరా
స్పర్వేరాజసమానరామునగతాస్సంప్రాప్యవిత్తంబహు
యస్యాష్టాకవిదిగ్గజాః పృథుయశోభారాజగచ్ఛోభనాః
యద్దానోదక సామ్యమేవ జగతామాసేతు శీతాచలమ్"

ఈ శ్లోకము మైసూరు నందిదుర్గ సోమేశ్వరాలయమున శాసనమందున్నది. ఈ శాసనము క్రీ. శ. 1528వ సంవత్సరము ప్రాంతమని చారిత్రకులు నిర్ణయించినారు. ఈ శ్లోకము ననుసరించి యష్టదిగ్గజములు జగత్తునకు శోభ కల్గించు పృథుయశోధారులగు కవులేగాని శాస్త్రాది పండితులగుటకు వీలులేదని నిర్ణయము.

ఈ దిగ్గజము లెవరైయుందు రను ప్రశ్నయున్నది. "అల్లసాని పెద్దన్న, నంది తిమ్మన, అయ్యలరాజు రామభద్రుడు. ధూర్జటి, మాదయగారి మల్లన పింగళి సూరన, రామరాజభూషణుఁడు, తెనాలి రామకృష్ణుడు అష్టదిగ్గజములని పేరందిరి. ఇందు మొదటఁ బేర్కొనిన యేవురును రాయల సమకాలికు లనుట నిర్వివాదాంశము. పింగళి సూరన, రామరాజభూషణుఁడు కృష్ణరాయల జామాతయగు అళియ రామరాజు కాలమున నున్నవారని స్పష్టమగుటవలన నీ యిరువురును రాయల సమకాలీనులు గావచ్చును.... ఇఁక తెనాలి రామకృష్ణుని కాలనిర్ణయమునకుఁ దగిన యాధారములు దొరకమింజేసి, యాతఁడు రాయల కాలమున నుండెనో లేదో చెప్పఁజాలను...... ఏది యెట్లున్నను పైఁ బేర్కొనఁబడిన కవులే యష్టదిగ్గజములని వ్యవహరింపబడుచున్నారు."[31]

"ఎంత తరచి చూచినను అష్టదిగ్గజములలో ఐదుగురు మాత్రమే ఆంధ్ర కవులు కానవత్తురు. వారు అల్లసాని పెద్దన, నంది తిమ్మన, అయ్యలరాజు రామభద్రుడు, మాదయగారి మల్లన, ధూర్జటి కవి, తక్కిన మువ్వురును ఇతర భాషాకవులనుకొనుటయే న్యాయము."[32]

ఈ విధముగా రాయల కాలమున రామకృష్ణుఁ డుండెనని రుజువైనను నితఁ డష్టదిగ్గజములలోనివాఁ డగునా కాదా యను సంశయము తేలలేదు. కాఁడని కొందరి యభిప్రాయము. దీనికివారు చూపిన హేతువులు :

1. ఇతఁడు దిగ్గజస్థాన మలంకరించి యుండినచోఁ దన కావ్యములలో నొక్కటి యైనను రాయలకుఁ గృతి యిచ్చి యుండఁడా ?

---

[29] ఆరుద్ర ; సమగ్ర ఆంధ్రసాహిత్యం, పుట 39.

[30] సరస్వతి పత్రిక, సంపుటము 6, సంచిక, 8

[31] నూతలపాటి పేరరాజు, ; విజయనగర చరిత్రము, పుటలు 158–159.

[32] పింగళి లక్ష్మీకాంతము : ప్రబంధయుగము, తెనుగు విజ్ఞాన సర్వస్వము, సంపుటము 3.

2. ఇతఁడు తన కావ్యములం దెచటను రాయల ప్రశంస చేయలేదు. దిగ్గజములలో నున్నచో నిది యెట్లు సంభవించును ?

మరికొందఱు విమర్శకులు భిన్నమార్గముల నూహించుచున్నారు.

"రామలింగఁడు రాయల యాస్థానమును జేరి రామకృష్ణుఁడై యతని మన్ననను బొంది యష్టదిగ్గజములలోఁ బ్రముఖుఁడై వర్ధిల్లెనని యవిచ్ఛిన్నముగ తరతరములఁ బడివచ్చు గాధ విశ్వాసపాత్ర మేల కారాదు ?"[33]

ఏలకారాదనఁగాఁ గృష్ణరాయలు మరణించునాఁటికి రామకృష్ణుఁడు బాల్యావస్థయందుండుట సందేహమునకుఁ దావిచ్చుచున్నది. అంతియే కాని గ్రంథము లంకితము చేయకుండుటయు, రాయలను బ్రశంశింపకుండుటయుఁ గాదు ; ధూర్జటియు, అయ్యలరాజు రామభద్రకవియును కూడఁ జేయలేదు. సప్రమాణ ములైన యాధారములు లభించువఱకు జనశ్రుతినిఁ గొట్టివేయుటలో హేతువు లేదు, బాల్యావస్థయం దంతటిస్థానము రామకృష్ణునకుఁ గాని మఱి యే కవికిఁ గాని లభించుట సంభావ్యము కాచేమో యని మాత్ర మూహింపవలసి యున్నది, రామకృష్ణుని కావ్యములలోఁ గాకున్నను జాటువులలోఁ గృష్ణరాయలను బ్రశంసించిన పద్యము లున్నవి. ఎంత చిన్నకవియైనను జాటువులను జెప్పవచ్చును, అంతమాత్రమున నతఁడొక దిగ్గజమని నిర్ణయింపలేము గదా!

రామకృష్ణుని కుటుంబము

రామకృష్ణకవి కుటుంబమును గూర్చిన కొన్ని యంశములను వేటూరి ప్రభాకరశాస్త్రి పరిశోధనచే లభించినంతవఱకు సేకరించినారు. మొట్టమొదట నీ వంశమువారు తెనాలిగ్రామ వాస్తవ్యులు. సంప్రదాయశుద్ధి, దైవభక్తి కలిగిన బ్రాహ్మణవంశము, శైవ, వైష్ణవభక్తి గల వంశము. వీరి యింటిపేరు మొదట యాశ్వరప్రగ్గడవారు, తరువాత గార్లపాటివారు, పిమ్మట తెనాలివారు. గార్లపాటి రామయ్య లక్ష్మయ్యలను నన్నదమ్ములు ప్రసిద్ధమైన నడవడి, దాతృత్వము గలవారు. అందు లక్ష్మయ్య దాతృత్వము, నౌదార్యము కథలుగాఁ గూడఁ జెప్పుకొనఁబడినవి. లక్ష్మయ్య వీరభద్రవిజయ మను కావ్యమును రచించినారు. వీరినిగూర్చి పోలిశెట్టి లింగకవి తన నవచోళచరిత్రలో నిట్లు వర్ణించినాఁడు :

"వీరభద్రేశుని విజయసాహసము, విరరసంబుగ విరచించితానె,
దాతయై కవులకు ధాత్రిలో నుతవి, ధాతయై మరినెఱదాతయై మిగులఁ,
బాటల సద్భక్తిపరులు నుతిసేయఁ, బాటి కెక్కిన గార్లపాటి లక్ష్మనుని
వెలయఁగానుతియించి విజ్ఞానమునను, గల్గుఁగనాదిమ శివకవుల భజించె"[34]

---

[33] 'అష్టదిగ్గజములు' అష్టదిగ్గజ వర్ధంత్యుత్సవోపన్యాస సంపుటి, పుట 13.

[34] పోలిశెట్టి లింగకవి : నవచోళచరిత్రము, ఆ.1 ప. 79-82.

తెనాలిలోని రామలింగేశ్వరస్వామి వీరి కులదైవతము. శుక్లనామ సంవత్సర మాఘశుద్ధ పంచమి, గురువారమునాడు రామలింగేశ్వరుని విగ్రహమును రామయ్యగారు చేయించి ప్రతిష్ఠించిరి. నేటికిని రామలింగేశ్వర విగ్రహము పీఠముపై నీ విషయమును దెలుపు శ్లోక మొకటి యిట్లున్నది :

"శ్రీ తెనాలి నగరే వ్యరాజయత్ గార్లపాటి పురరామ పండితః
శుక్ల మాఘ శిత పంచమీగురౌ రామలింగముమయోత్సవాకృతిమ్"

ఈ శ్లోక మెప్పుడు రచింపఁబడినదో తెలియదు గాని పంచాంగ గణితము ననుసరించి మాఘశుద్ధ పంచమినా డా సంవత్సరమున గురువారము సరిపోవుట లేదు. ఈ రామయ్యగారి కుమారుఁడే రామకృష్ణుఁడను నామాంతరము గల రామలింగకవి. పై రామయ్య లక్ష్మమ్మల తరమునందే స్వగ్రామమును విడిచి కొండవీఁడు ప్రాంతమునకు వీరి కుటుంబము వచ్చి యుండవచ్చునని కొందరు విమర్శకులు నిర్ణయించినారు. ఈ కారణమున వీరు తెనాలివారని వ్యవహరింపఁ బడుట సంభవించి యది కాలక్రమమున నింటిపేరుగా మాఱి యుండవచ్చును.

వీరిది కౌండన్యసగోత్రము, శుక్లయజుర్వేదశాఖ యనఁబడు ప్రథమశాఖ. శైవోపాసనయందు రామలింగని గురువు పాలగుమ్మి ఏలేశ్వరుఁడు. వైష్ణవో పాసనయందు రామకృష్ణుని గురువు భట్టరు చిక్కాచార్యులు. ఈ కవికిఁ గుమార భారతి యను బిరు దున్నది. "శారద నీరూపము" అని వేదాద్రిమంత్రి పల్కినది వేరుగా బిరుద మనుకొనుటకన్న నది యొక సంబోధన మనుకొనుటయే సమంజసము.

గార్లపాటి రామయ్య, లక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. అందు రామకృష్ణకవి పెద్దవాఁడు. రామకృష్ణుని పెద్ద తమ్ముఁడు శ్రీగిరికవి. ఇతఁడు శ్రీశైలమాహాత్మ్య మను కావ్యమును రచించినట్లు వాని వంశమువాడగు రామభద్ర కవి తన యిందుమతీ పరిణయమునఁ జెప్పినాఁడు. శ్రీశైలమాహాత్మ్య మిప్పటికి లభింపలేదు.

రామకృష్ణుని రెండవ తమ్ముఁడు అన్నయకవి. ఇతని నన్నప్ప యనియు వ్యవహరింతురు. ఈ కవి సుదక్షిణాపరిణయ మను నైదాశ్వాసముల ప్రబంధ మును వ్రాసినాఁడు. ఈ కావ్యము పులిజాల సోమయ్య కంకితము. ఈ సోమయ్య బాదలి పట్టణమునఁ గోనేటి రామరాజు – అళియ రామరాయల పెద్దతండ్రి మునిమనుమఁడునొద్ద నుద్యోగము చేయుచుండెను. రామకృష్ణుని పెద్దతమ్ముఁడగు శ్రీగిరి కుమారుఁడు ఇమ్మడి రామకృష్ణుఁడు. ఇతఁడు సంస్కృతాంధ్ర పాండిత్యము లందుఁ బేరొందిన వాఁడని రామభద్రకవి యిందుమతీ పరిణయమునఁ జెప్పినాఁడు. ఇతఁడు రచించిన గ్రంథములేమో తెలియరాకున్నవి.

ఇమ్మడి రామకృష్ణుని జ్యేష్ఠపుత్రుడు వీరరాఘవుఁడు. ఇతఁడును సరస కవితారచనలోఁ దాతతండ్రులను మించినవాఁడని రామభద్రకవి చెప్పినాఁడు. ఇతని కావ్యములను గూర్చి కూడ నేమియుఁదెలియదు.

వీరరాఘవుని తమ్ముఁడే రామభద్రకవి. ఇతఁ డిందుమతీ పరిణయ మను నాలుఁ గాశ్వాసముల కావ్యమును రచించి పాలకూరి కృష్ణరాజున కంకిత మిచ్చి నాఁడు. ఈ కావ్యమింకను నముద్రితము.

రామకృష్ణకవి యల్లుఁడు లింగమగుంట రామయ్య. ఇతఁడు బహు గ్రంథకర్తయని తెలియుచున్నది. అం దాఱు కావ్యముల నామము లుపలభ్య ములు.

1. ఆనంద కానన మాహాత్మ్యము
2. చతుర్వాటికా మాహాత్మ్యము
3. మత్స్య పురాణము
4. వామన పురాణము
5. వేంకట మాహాత్మ్యము
6. లక్షణ తిలకము

ఇందు మొదటి రెండు గ్రంథములును మాత్రము లభ్యములై నేటికిని లిఖితరూప మున నున్నవి. మొదటిది శైవ వైష్ణవ సమన్వయమయిన కాశీమహిమాను వర్ణనము. ఇందలి కథ వాయు పురాణాంతర్గతము.

లింగమగుంట రామకవి తాత లింగమగుంట సర్వకవి. ఈయనకుఁ గవిసార్వభౌముఁడని బిరుద మున్నట్లు రామయ్య చెప్పినాఁడు. ఇతని గ్రంథముల నామములును లభింపలేదు. ఆదిపురాణము, విరాటము నను రెండు గ్రంథముకు నుండి సేకరింపఁబడిన కొన్ని పద్యముల నీ కవి రచించెనని కొందఱు విమర్శలకు లూహించుచున్నారు. తెనాలి రామకృష్ణుని యల్లుని తమ్ముఁడు లింగమగుంట తిమ్మకవి. ఇతడు సులక్షణసారము, బాల బోధచ్ఛందము రచించెను. అందు రెండవది ముద్రితము కాలేదు.

ఈ విధముగా రామకృష్ణుని వంశము పరంపరాగతమైన పండిత వంశము. పైఁ జెప్పిన కవుల పేరులును, వారి పరస్పర సంబంధములును రామభద్రకవి యిందుమతి పరిణయమున నొక సీస పద్యమునందు స్పష్టముగా వర్ణించినాఁడు.

"ప్రౌఢి మీ పెదతాత పాండురంగాది సత్
కృతులు చేసెను రామకృష్ణ సుకవి
యనుజుఁ డన్నప్ప నీ పినతాత రచియించెఁ
బరగ సుదక్షిణా పరిణయంబు
మీ తాత శ్రీగిరి చాతురీవిఖ్యాతి
శ్రీశైలమాహాత్మ్య కృతి యొనర్చెఁ
గడిమి మీ తండ్రి యిమ్మడి రామకృష్ణార్యుఁ
డన కీర్తిగనె నంస్కృతాంధ్రములను

వీరలను మించె మీ యన్న వీరరాఘ
వాఖ్యకవి సర్వకవితామాహాత్మ్యమునను
నిన్న నూచాన సంతాను నెన్నఁదరమె
ప్రాజ్ఞహృదయాబ్ధి రవి రామభద్రసుకవీ"

రామకృష్ణుని సమకాలికులగు మతాచార్యులు

కందాళప్పయ్యగారు

పాండురంగ మాహాత్మ్యమునఁ బీఠికలోఁ బేర్కొనఁబడిన పెద్దవారిలో గందాళప్పయ్యగా రొకరు. ఈయన యా కాలమందుండిన మహనీయులైన యాచార్య పురుషులలో నొకరని యీ రామకృష్ణకవి పద్యములవలనఁ దెలియు చున్నది.

"వేదమార్గ ప్రతిష్ఠాదైవతజ్యేష్ఠుఁ
డభ్యస్త సద్దర్శనార్థ రాశి
యతిరాజ రచిత భాష్య గ్రంథ నిర్ణేత
యఖిలపురాణేతిహాస కర్త
బంధుర దివ్య ప్రబంధాను సంధాత
పంచ సంస్కార ప్రపంచ చణుఁడు
వాధూలముని చంద్రవంశవర్ధనమూర్తి
సకల దేశాచార్య నికరగురువు
పట్టమేనుంగు శ్రీరంగ పతికి నణ్ణ
గారి గర్భాంబు రాశినీహార రశ్మి
సరస సాహిత్యశయ్య నేఁటి
యాళువందారు కందాళయప్పగారు"

—పాండు. 1-77.

వైష్ణవ సంప్రదాయమునకు నీయన రెండవ యామునాచార్యుఁ డనియు, లోకా చార్యుఁ డనియు వర్ణింపఁబడినాడు. అంతమాత్రమున రామకృష్ణకవి ప్రశం సకుఁ బాత్రుఁడు గాడు. జిజ్ఞాసాశయమై, మరియొక యాదర్శ మీయన యందున్నది. అది వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్యత్వము. ఇది సిద్ధించిన చోట వైష్ణవమైనను, శైవమైనను, శాక్తమైనను నీ కవికి నొక్కటియే.

ఈ యప్పలాచార్యులుగారు వాధూల వంశము వారు. పాండురంగ మాహాత్మ్య కృతిపతియగు విదూరి వేదాద్రికి గురువు. వైజయంతీ విలాసమును రచించిన సారంగు తమ్మయ్య కూడ నీయన శిష్యుఁడే. ఇంకను జరిగొండ ధర్మన్న రచించిన చిత్రభారతమునకుఁ గృతిభర్తయైన యిమ్మలపల్లి పెద్దనా మాత్యుని తండ్రి మాధవునకుఁ బెదతండ్రి నారనకుఁగూడఁ గందాళప్పయ్యగారు గురువు.[35]

---

35 చూ. చిత్రభారతము, పుట 4, పద్యసంఖ్య 24, 25.

ఈ యప్పలాచార్యుల మహత్త్వమును గూర్చి తెలియఁజేయు శాసన మొకటి యున్నది. క్రీ. శ. 1542 న గండికోట ప్రభు వొకరు కందాళప్పలాచార్యులకు భూదానము చేసిన నాటి శాసన మది, ఈ శాసనమును గూర్చిన వివరములు దేవస్థానము శాసన పట్టికలలో శ్రీ సాధుసుబ్రహ్మణ్యశాస్త్రిగారిచే నొసంగఁబడినవి.[36]

భట్టరు చిక్కాచార్యుఁడు

ఈయన రామకృష్ణకవికి వైష్ణవ గురువు. రామకృష్ణుని యల్లుఁడగు లింగమకుంట రామకవికిని, వానితమ్ముఁడు తిమ్మకవికిని, గామందకము కృతి పతియగు వేంకటాద్రికిని గూడ గురువు.

1. రామకృష్ణుఁడు భట్టరు చిక్కాచార్యుల నిట్లు కీర్తించినాఁడు ;

"వాక్కాంతాశ్రయు, భట్టరు
చిక్కాచార్యుల మహాత్ము శ్రీగురుమూర్తిన్
నిక్కపు భక్తి భజించెద
నిక్కావ్యకళా కలాప మీఁదేరుటకున్"

---

36 "With the services of the father and son recorded in no. 354 G.T. are included, those of Appan, son of Kandadai Appan of Vadhula gotra Apastamba Sutra and Yajus Sakha, who granted half the village of Punyam in the Nagarisimai... The father Appan must be the paramacharya of the father of Tiruvengalanadha, the fourth son of Peda-Tirumalayyangar and the author of Ashtamhishi Kalyanam which records this relationship. From the date of the records (5-7-1545) it appears possible that the son Kandadai Appan was identical with Aluvandaru Kandadai Appagaru whom Tenali Ramakrishna mentions in his Telugu Kavya Pandurangamahatmyam as the Guru of Viruri Vedadrimantri, the patron of the poet. The same Kandadai Appa must also have been the guru of the poet Sarangu Tammayya......who was the Karanam of Golkonda during the reign of Mahmmadu Sahi its Nawab, between 1511 and 1681 A.C and Madan and Narana, the father and the elder father of Immadi Peddanamatya, "... Report on the inscriptions of the Devasthanam collection (T. T. etc. Devasthanam epigraphical series) by Sadhu Subrahmanya Sastry, B. A., pages. 295 to 296.

2. లింగమకుంట రామకవి ఇట్లు స్తుతించినాఁడు :

"గురురాయపట్టభద్రుని
నరహరు శ్రీరంగనాయకాంశభవున్ భ
ట్టరు చిక్కాచార్యుల, మ
ద్గురులఁ దలఁచి యడుగులకు నుతుల్ గావింతున్"

3. లింగమకుంట తిమ్మకవి యిట్లు చెప్పుకొనినాఁడు :

"శ్రీవైష్ణవహితుఁడఁజిక్కయ భట్టరు శిష్యుఁడ"

4. వేంకట రామకృష్ణకవులు తమ కామందకమునఁ గృతిపతిని గూర్చి యిట్లు చెప్పినారు :

"శ్రీ చందర్భట్టరు చి
క్కాచార్యవర్య శిష్యః యతులితశౌర్య......."

కామందక కృతిపతి యగు నీ వేంకటాద్రి పెద్ద సింగభూపాలునకుఁజెల్లెలి కొడుకు. కొండ్రాజు తిమ్మరాజను వాని కుమారుఁడు. ఈ వేంకటాద్రి కామందకమును గృతిగావిన సంవత్సరము శా. 1506 – క్రీ. శ. 1584 అని యీ దిగువ పద్యము వలనఁ దెలియుచున్నది :

"రమణీయంబుగ శాలివాహశక వర్షంబుల్ గతంబై సహ
స్రము పేనూఱును నాఱుఁనై వెలయఁగాఁ బ్రౌఢిదెవింగించి రా
ర ! మహిందిమ్మయ వేంకటాద్రి విభువేరన్ వేడ్కఁగామందకీ
యము శ్రీ వేంకటరామకృష్ణులు స్వభావ్యబ్దంబునన్ రూఢిగాన్"

ఈ చిక్కాచార్యులను గూర్చిన చారిత్రకాధారములు సరిగా నింతవఱకు లభింపలేదు. సంప్రదాయ గ్రంథములలో నందంది పేరుగల యాచార్యులు భట్టరు వంశవృక్షమునఁ గనుపింతురు. దక్షిణదేశ వైష్ణవాచార్యుల వంశములలో మూఁడు వంశములు ప్రసిద్ధములైనవి. 1. తిరుమలై వంశము. 2. కందాడై వంశము, 3. భట్టరు వంశము. అందు మొదటి వంశమువారు గుంటూరు సీమకును, రెండవ వంశము వారు రాజమహేంద్రము కడ నున్న కోరుకొండకును, మూఁడవ వంశమువారు సింహాచలమునకును వచ్చినట్లును శాసన ప్రమాణముల వలనఁ దెలియుచున్నది.[37] వీరిలో భట్టరు వంశమువారి మూల

[37] See History of Reddi Kingdom by M. Somasekhara Sarma, pages 314 to 316.

పురుషులలో నొకఁడీ చిక్కాచార్యులు. ఇప్పటికిని గోరుకొండలోని భట్టరువంశీయులకడ నీ వంశవృక్షములు కొన్ని వ్రాతప్రతులుగా నున్నవి. అందు 'తనియన్లు' అనఁబడు శ్లోకములలో నొక్కొక్క మహనీయుని జన్మ తిథి వార నక్షత్రాది వివరములు లభించుట కవకాశమున్నది. చిక్కయాచార్యుల వారికి సంబంధించిన దింతవఱకు లభింపలేదు. ఈ రామకృష్ణకవి గురువగు చిక్కయ, పరాశరభట్టు కుమారుఁడని మానవల్లి రామకృష్ణకవిగా రూహించినారు. [38]ఆచార్య సూక్తిముక్తావళిలో నీయఁబడిన భట్టరు వంశవృక్షమున నీ యంశము పొసఁగుట లేదు. పరాశరభట్టు కుమారుఁడు శ్రీరంగనాథభట్టు.

ఆచార్య సూక్తిముక్తావళియను వైష్ణవ గ్రంథమున భట్టరు వంశవృక్షము పరాశర భట్టరు నుండి యిరువది తరములవఱకుఁ జెప్పఁబడినది. అందు మొదటి పదునొకండు తరములలోఁ జిక్కయనామధేయు లిరువు రున్నారు 1. సాధు భట్టార్యుని కుమారుఁడు పెరియ చిక్కయాచార్యుడు 2. ఈ చిక్కయ మనుమఁడు పెద్దయాచార్యుని కుమారుఁడు నగు చిక్కనాచార్యుఁడు. "ఇద్దరు చిక్కయలు, నిరువురు రంగనాథులును లేరు. కాలవ్యత్యాసమును సరిపుచ్చుటకై కవిగారు–మానవల్లి రామకృష్ణకవిగా రూహించి ఇఁక నొక చిక్కయార్యుని, మరియొక రంగనాథుని కల్పించిరో వారి కేదైన యాధారము కనఁబడినదో దెలియదు.[39] అవి చాగంటివారు చెప్పినమాట సత్యము కాదని యీ వంశవృక్షము నరసినఁ దెలియును. అట్లే వారిచ్చిన వంశావళియు నూహాకల్పితమై దోషయుక్తమై యున్నది. అందు రంగగురువు కుమారుఁడు చిక్కయ్యయని చెప్పబడినది. "సూక్తిముక్తావళి" లోని వంశవృక్షమునం దొక రంగగురువు-శ్రీరంగనాథ భట్టారకుఁడు-కుమారుడు భట్టపరాశరార్యుఁడు. రెండవ రంగగురుని-శ్రీరంగరాజు భట్టు కుమారుడు సాధుభట్టు. వీరుకాక మఱి యిద్దరు రంగగురువులు వంశవృక్షమున నున్నారు. శేషము తిమ్మకవికి గురువగు రఘునాథ దేశికునిపేరిందు లేదు.

వంశవృక్షములోని యొక చిక్కయ మనుమడగు రెండవ చిక్కనార్యుని కుమారునినామ మిందు లేదు. ఒకవేళ ఈ చిక్కనాచార్యుని కుమారుడే శేషము తిమ్మకవికి గురువగు నేమో! శరకోపయతి–పెద్దన గురువు–, కందాళప్పగారు–సారంగు తమ్మయ్య గురువు–భట్టరు చిక్కాచార్యుఁడు–రామకృష్ణుని గురువు–నవలంబించిన వైష్ణవము శైవశాక్తాగమములతో భేదభావము కలిగినదికాదని వారి శిష్యుల రచనలవలన దెలుచున్నది. ఈ వంశవృక్ష మీ దిగువ విధముగా నున్నది.

---

[38] ఆంధ్రపత్రిక, సంవత్సరాది సంచిక 1914 పుట 100.

[39] ఆంధ్రకవి తరంగిణి, ఎనిమిదవ సంపుటము. పుట 17.

భట్టరు వంశము

పరాశర భట్టాచార్యుఁడు
|
శ్రీరంగనాథ భట్టారకుఁడు
|
భట్ట పరాశరార్యుఁడు
|
శ్రీరంగ భట్టారకుఁడు
|
సుదర్శన భట్టార్యుఁడు
|
శ్రీరంగరాజ భట్టార్యుఁడు
|
సాధు భట్టార్యుఁడు
|
పెరియ చిక్కయాచార్యుఁడు

- శ్రీరంగరాజ భట్టార్యుఁడు
- పెద్దయాచార్యుఁడు
  - చిక్కనాచార్యుఁడు
  - శ్రీరంగరాజు భట్టాచార్యుఁడు
    - తిరువేంగళ భట్టాచార్యుఁడు
    - పెరియభట్టరు

ఈ ముగ్గురాచార్యులును "వేదమార్గ ప్రతిష్ఠాదైవత జ్యేష్ఠు" లై యుండ నెచ్చును. వీరి శిష్యులగు ముగ్గురు కవుల రచనలందును శైవము కూడ వైష్ణవముతో నభేదము నంది వర్ణింపఁబడినది. రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యమునందలి యిష్టదేవతా స్తుతియందు లక్ష్మీనారాయణులు, పార్వతీ పరమేశ్వరులు, వాణీ హిరణ్యగర్భులు నున్నారు. పరివారదైవతములుగా గరుడ విష్వక్సేనులు, శేషుఁడు నుతింపఁబడిరి. సారంగు తమ్మయ వైజయంతీ విలాసమున దేవతాస్తుతియందు సీతారాములు, సుదర్శనము, శేషుఁడు, గరుడుఁడు, విష్వక్సేనుఁడు, గజముఖుఁడు, సరస్వతి, గిరీశుఁడు, పన్నిద్దరుసూరి వర్యులు నుతింపఁబడినారు.

పెద్దన మనుచరిత్రలోని దేవతాస్తుతిలో విష్ణువు, కిరాతవేషధారి శివుఁడు, బ్రహ్మ, గజాననుఁడు, వాణియు నుతింపఁబడినారు.

తాతాచార్యుల శిష్యుఁడగు కృష్ణరాయలు వైష్ణవేతర దైవతములను నుతింపలేదు. ధూర్జటికవి శివునిదక్క నితర దైవతములను స్మరింపలేదు. జైన బౌద్ధ మహమ్మదీయ ప్రాబల్యములున్న కాలమున శైవవైష్ణవాద్యాగమములు వేదపథమున నైక్యము సాధింపవలెనుగాని, యవి భేదకారణములు కారాదు. వీరశైవ, వీరవైష్ణవములవలన నట్టి యవకాశమున్నది. దీనిని గ్రహించి కొందఱా చార్యులు సమన్వయోద్యమమును గాలకాలములలోఁ జేసియున్నారు. ప్రభువులు నట్టి యత్నములు చేసినారు. ప్రభువులలో రాజరాజనరేంద్రుఁడు, మనుమ సిద్ధియు, నాచార్యులలో శంకరరామానుజ చైతన్యులును, గవులలోఁ గవిత్రయ మును బూర్వ మీ యుద్యమమునఁ గడు ప్రసిద్ధులు. కృష్ణరాయల కాలమున వైష్ణవ గురువులలో నట్టివారు శఠకోపయతి, కందాళప్పయ్య, భట్టరు చిక్కయ యుఁ, గవులలో నీ గురువుల శిష్యులగు పెద్దన, పారంగు తమ్మయ్య, రామ కృష్ణుఁడు ననియు శైవగురువులలోఁ బాలగుమ్మేలేశ్వరులు మున్నగువారనియు మన మూహింపట కీ గురువుల శిష్యుల గ్రంథ పీఠికలే మనకుఁ బ్రమాణములు. దేవయ్య గురువగు చంద్రశేఖర వాచంయమియు నీ మార్గమునకుఁ జెందిన వాఁడే.

పాలగుమి ఏలేశ్వర గురువు

ఈయన రామలింగకవికి శివదీక్ష నిచ్చి యుద్భట చరిత్ర రచనాకారకుఁడైన గురువు. రామలింగకవి సోదరుఁడగు తెనాలి యన్నయకవి పాలగుమి భీమయ శిష్యుఁడు. అతఁడు సుదక్షిణా పరిణయము వలన నీ గురువును నుతించినాఁడు. ఈ యేలేశ్వర, భీమేశ్వర గురువు లిరువురు నన్నదమ్ములో, తండ్రి కొడుకులో గావచ్చునని వేటూరి ప్రభాకరశాస్త్రిగా రూహించినారు.

"పాలగుమివా రారాధ్యులు గాఁబోలును. రామలింగకవి కింకను నూఱేండ్లకుముం దొకఁ డా యింటిపేరివాఁడు శైవాచార్యుఁడు; కొండవీటిరెడ్డి రాజ్యమున నున్నట్టు శాసన మున్నది.

> "పాల్గుమి శ్రీకంఠగురోః పంచాక్షరమంత్ర పావనరుక్మన్య
> శిష్యాయ శిష్యపరిపద్రక్షా దాక్షిణ్యసత్కటాక స్య"
>
> —వేటూరి. ఉద్భటారాధ్యపీఠిక, పుట 5.

దీనినిఁబట్టి పాలగుమి వంశమనాదిగా శైవాచార సంపన్నమయిన శివగురుల వంశమని తెలియు చున్నది. అయినను నీ శైవము పాలకురికి సోమనాథాదుల శైవమువంటిది కాదని రామలింగని యుద్భట చరిత్రలో శైవేతర మతదూషణ లేకపోవుటనుబట్టి తెలియుచున్నది.

చంద్రశేఖర వాచంయముఁడు

ఉద్భటారాధ్య కృతిపతియగు నూరదేవయ సాహిత్యమునందు లొల్ల లక్ష్మీధర పండితునకును, మోక్షవిద్యకుఁ జంద్రశేఖర వాచంయమునకును

శిష్యుఁడు. దేవీ పంచస్తమీ వ్యాఖ్యానమునఁ జంద్రశేఖరులను గూర్చి యతఁ డిట్లు కీర్తించెను :

...యస్మాదస్త్రీశమాదాదఖిలమను పతిం
దేవయామాత్యవర్యః సోయం శ్రీచంద్రమౌళి
ర్జయతిగురువరః ప్రోలనారాధ్యవంశః"

రామలింగకవి యుద్భట చరిత్రమున నీ గురుశిష్యుల నిట్లు స్తుతించినాఁడు :

"శ్రీ చంద్రశేఖరాహ్వయ
వాచంయమచంద్ర పాదపసరుహసేవా
శ్రీ చతురాత్మున కన్నయ
దేవమాత్యునకు సత్యధీనిత్యునకున్" – ఉద్భట. 1-15.

ఈ రచనలనుబట్టి యీ వాచంయమి ప్రోలనారాధ్యుని గురువనియు, దేవయకుఁ బాశుపతమంత్ర దీక్ష నిచ్చినవాఁడనియుఁ దెలియవచ్చును ఇట్టి గురువునకు శిష్యుఁడై మోక్షధర్మ పరాయణుఁ డయిన కారణముననే రామలింగకవి తన యుద్భటచరిత్రమను సంప్రదాయపూతమైన కావ్యము నితని కంకితము చేయు టయుఁ, బ్రభువుల కెవ్వరికి నంకితము చేయకుండుటయు జరిగి యుండవచ్చును.

తాతాచార్యుఁడు

రామకృష్ణకవి కథలలోఁ బెక్కు లీ యాచార్యునితో సంబంధించినవి యున్నవి. ఈ యాచార్యుఁడు రామకృష్ణుని రాయల యాస్థానమునఁ బ్రవేశింప నీయక యభ్యంతరపెట్టెననియు, వైష్ణవేతరమత దూషణము మిక్కుటముగాఁ జేయువాఁడనియు నీ కథల సారాంశము. ఇది సత్యమగునేని రామకృష్ణుఁడు మతము మార్చుకొనుట యసత్యము కావలెను. శైవము విడిచి వైష్ణవము నవలంబించినవాని నీయన యేల ద్వేషింపవలెను? శైవుఁడుగా నున్నంతకాలము ద్వేషించెనందుమా– రామకృష్ణకవి యీ యాచార్యుని ప్రాపకము, రాయలవారి ప్రాపకము నందుటకై మతము మార్చుకొనవలెను. అట్లని రామకృష్ణుఁడు తన కావ్యములలో నొక్కటియుఁ దాతాచార్యులకుఁగాని, కృష్ణరాయలకుఁగాని యంకితము చేయలేదు. రాయలవారి గురువు పేరు తాతాచార్యుఁడు. ఆయనకును రామకృష్ణునకును వ్యక్తిగత భేదభావము లేమైన నుండిన నుండవచ్చును గాని యిందుల కాధారములు, ప్రామాణికములు లేవు. ప్రజలలోఁబ్రచారమున నున్న కథలే యాధారములు. రాయలగురువగు తాతాచార్యుఁ డా కాలమున వైష్ణవ మతమునకు సంబంధించియే గాక రాయల కితర విషయములయందును గురువై యఖండ గౌరవము నంది ప్రముఖస్థానము నధిష్ఠించి యుండెనని శాసన ప్రమాణములున్నవి. ఈ తాతాచార్యుఁడే రామకృష్ణుని కథలలోని వాఁడా కాదా యనున దొక సమస్య. ఐదుగురు తాతాచార్య నామధేయు లొకేవంశమువారు విజయనగర చరిత్రకాలమున కున్నారు. పడుగవంబి వంశీయుఁడగు వసంతా

చార్యులు రచించిన ప్రపన్నామృత మను గ్రంథమందలి వంశవృక్ష మీ దిగువ విధముగా నున్నది :[40]

1. నృసింహార్యుఁడు
2. తాతాచార్యుఁడు
3. శ్రీశైల పూర్ణుఁడు
4. శ్రీనివాసార్యుఁడు
5. తాతదేశికుఁడు
6. వేంకటార్యుఁడు
7. సుందరదేశికుఁడు
8. శ్రీనివాసార్యుఁడు
9. తాతాచార్యుఁడు – పంచమతభంజన గ్రంథకర్త –
10. లక్ష్మీకుమారతాతాచార్యుఁడు
11. వేంకట వరదాచార్యులు
12. రంగనాథార్యుఁడు

శ్రీరంగదేశికుఁడు – ఎ –
అహోబలాచార్యుఁడు – బి –
తాతాచార్యుఁడు – సి –

విరూపాక్షరాయల కాలమున నృసింహార్యుఁడు, శ్రీరంగ దేశికుఁడునను సోదరులు ఏట్టూరు గ్రామమునుండి విజయనగరమునకు వచ్చినారు. ఆ సమయము నుండియే విరూపాక్షుఁడు వైష్ణవము స్వీకరించినాఁడు. నృసింహార్యుని వంశమున నేడవ తరమువాఁడగు తాతాచార్యుఁడు పంచమత భంజన కర్త. ఈయనయే కృష్ణరాయల గురువని కొందఱి యభిప్రాయము. కాని క్రీ.శ. 1541 నుండి 1565 వఱకుఁ బరిపాలించిన రామరాయల కీయన గురువు. ఈయన కుమారుఁడు లక్ష్మీకుమార తాతాచార్యుఁడు వేంకటపతిరాయల గురువు. వీరిరువురకు రాయల సమకాలికత సరిపడకున్నది. 2, 5వ తరములలోని తాతాచార్యులతోను సరిపడకున్నది. ఇఁక శ్రీరంగదేశికుని మనుమఁ డొక తాతాచార్యుఁ డున్నాడు. ఆయన కృష్ణరాయల సమకాలికుఁడు.

విరూపాక్షరాయల మరణమునకుఁ గృష్ణరాయల రాజ్యారంభమునకు నడుమ 23 సంవత్సరము లంతర మున్నది. ఈ యంతరమునకు సరిగా

---

40 ప్రపన్నామృతము, అధ్యాయము 126, 127.

సరిపోవుచున్నది శ్రీరంగ దేశికుల మనుమఁడు, నహోబలాచార్యుల కుమారుఁడు నగు తాతాచార్యులకాలము. ఈయనయే రాయలవారి గురువగుట సంభావ్య మని తోచుచున్నది. ఈయనతో రామకృష్ణుని సమకాలికత సరిపోవుటలేదు. రాయల కాలమున బాల్యదశయందున్న రామకృష్ణునకును, రాయలకు గురువగు వయస్సున నున్న తాతాచార్యులకును సమకాలికతయే కొంతవఱకు సిద్ధించిన పక్షమున రామకృష్ణుని కథలలోఁ గల తాతాచార్యుని సంబంధము సంభావ్యము కాదు. మఱియొక యంశము కూడ నిటఁ బరికింపఁదగినది యున్నది. కృష్ణ రాయల ఘనత యెట్టిదో జగద్విదితమే. అట్టి మహానుభావునకుఁ బూజ్యస్థాన మలంకరించిన తాతాచార్యుల మహిమానుభావము లనల్పములై యుండవలయు ననుట నిస్సందేహము. ఆయన కొంతపట్టుదల గల వైష్ణవులకోవకుఁ జెందిన వాఁడైన నైయుండవచ్చును. అంతమాత్రమున నీ కథలలోఁజిత్రింపఁబడినంత యీర్ష్యాళువు, దీనుఁడునై యుండెననుట సహజము కాదు. ఐనను, గాకున్నను రామకృష్ణుఁడే గాదు, పెద్దనయైనను దాతాచార్యుల నవమానించి రాయలదృష్టిలో క్షంతవ్యుఁ డగుట యసాధ్యము. రామకృష్ణుని ప్రవృత్తినిబట్టియు నిది యసహజముగాఁ గనుపించును. కాఁగా నొక తాతాచార్యుఁ డప్రసిద్ధుఁ డెవఁడేని రామకృష్ణుని హాస్య గర్భిత సంస్కరణకు గుఱియై యుండవచ్చును. పంచమత భంజనకర్తయగు తాతాచార్యుఁడో, యతని కుమారుఁడును వేంకటపతిరాయల గురువు నగు లక్ష్మీకుమార తాతాచార్యుఁడో యీ కవి సమకాలికుఁడు కావచ్చును. నామసామ్యముచేఁ గృష్ణరాయల గురువగు తాతాచార్యుఁడే యితఁడని యర్వా చీనులు భావించియు నుండవచ్చును. అంతేకాని రాయలకన్న వృద్ధుఁడగు రాయలగురువుతో – రాయల వార్థకమున బాల్యదశలోనివాఁడైన రామకృష్ణుఁడు స్పర్థపహించుటయు, రాజగురు పీఠమును ధిక్కరించుటయు, సంభావ్యములు కావని తోచుచున్నది. కావ్యములనుబట్టి విదితమగుచున్న రామకృష్ణ కవి స్వభావముగూడ నీ జన శ్రుతి కథలకు విరుద్ధముగా నున్నదనుటలో సందేహము లేదు.

ఊర దేవయ్య

సాళువ తిమ్మరుసు మేనల్లుఁడగు నాదెండ్ల గోపనకడ నితఁడు "రాజ్య సంరక్షణ క్రియారబ్ధబుద్ధిగోచరుఁడు." అనఁగా నతనికిఁ గార్యనిర్వాహణోద్యోగి (Personal secretary) కావచ్చును. ఈ దేవయ్య గొప్పదాత, యందగాఁడు, మునీంద్రులవంటి మనస్సు గలవాఁడు, చక్కని వాక్సిద్ధి గలవాఁడునట! మఱియు నితఁడు మంచిపండితుఁడు. లొల్ల లక్ష్మీధరుల యొద్దను, జంద్రశేఖర వాచంయములయొద్దను శుశ్రూష నెఱపినవాఁడు. దేవపంచస్తవికి వ్యాఖ్యానము చేసినవాఁడు. కౌండిన్యసగోత్రుఁడు, ఆపస్తంబసూత్రుఁడు నగు నార్వేల నియోగి. "ఊర" యను నగ్రహార మీయన నివాసము. ఇతఁ డుద్భటారాధ్యచరిత్ర కృతికర్త.

విదూరి వేదాద్రి

ఇతఁడు "షట్సహస్రాన్వయేశుఁడు – ఆర్వేలనియోగి – అగు నైష్ఠిక బ్రాహ్మణుఁడు. వేదమార్గ ప్రతిష్ఠాపకుఁడైన కందాళప్పలాచార్యుల శిష్యుఁడు. పెద్ద

సంగభూపాలుని కథ వ్రాయసకాఁడు. చక్కని సంప్రదాయము, పాండిత్యము, సరసత, దాతృత్వము కలవాఁడు. ఇతని దస్తూరి ప్రత్యేకసౌందర్యము గలది యని పొగడ్తలు కలవు. ఇతఁడు పాండురంగమాహాత్మ్య కృతిభర్త.

దేవయ్య వేదాద్రులతో రామకృష్ణునికిఁ గల సంబంధ మార్థికమైనదిగాఁ గనుపింపదు. అది మిత్ర ధర్మ ప్రధానమనిపించును.

రామలింగని కథలు

రామలింగని పేర దేశ వ్యాప్తముగా వినఁబడుచున్న కథలన్నియు సత్యములా? కల్పితములా, యను సమస్య నేఁటికిని దీరలేదు. అందుఁ గొన్ని కథలు సంభావ్యములు కావని యా కథాంశములే చెప్పుచున్నవి. కొన్ని సంభావ్యములు కావచ్చుననుట కభ్యంతరములేదు, జరిగిన వనుటకు జనశ్రుతిని మించిన యాధారములు లేవు. అన్నియు సంభావ్యములను టెట్లు సమంజసముగాదో యట్లే యన్నియు నసత్యములనుట యసహజము. ఏమియు లేనిచోట జనశ్రుతి యెట్లు పుట్టును? ఇతర కవులను గురించి యిట్టి కథలు పుట్టలేదేమి? తెనుఁగున శ్రీనాథ రామకృష్ణులను గూర్చియు సంస్కృతమునఁ గాళిదాసును గూర్చియు, మలయాళమున తోలన్ కవిని గూర్చియు నిట్టి కథలే యున్నవి. కవి గాకున్నను బీర్బల్‌ను గూర్చిన కథలసంఖ్యాకము నిట్టివి యున్నవి. రాజులలో విక్రమార్కునిగూర్చి యిట్టి కథలుండుటే గాక వానికిఁ గావ్యత్వము కూడ నబ్బినది. రామలింగని కథలకు నితరుల కథలకును గల భేద మేమనఁగా రామలింగని కథలలో నతని జీవిత విశేషములే గాక యితర కవులు పెక్కండ్ర జీవిత ఘట్టములతో ముడిపెట్టుకొని యున్న వీ కథలు.

ఈ కథలన్నియు నసత్యములని నమ్మువారు కొందఱు. "అతఁడు కృష్ణదేవరాయల యాస్థానమునందలి కవుల నాక్షేపించెనన్న కథలన్నియు నసత్యములనుట స్పష్టము."[41] "......అతని పేరిట నాంధ్ర దేశమున ప్రచారములో నున్న హాస్య కథల కంతులేదు, వాని నన్నిటిని నిజమని నమ్మినచో – మనము పిచ్చివారమై పోవుదుము,"[42] కొన్ని కథలు జరిగియుండునని విశ్వసించినవారు కొందఱు. "అతడు హాస్య చతురుఁడై యుండవచ్చును. నిజముగాఁగొన్ని కథలాతనికి సంబంధించినవే కావచ్చును. లోకులు మరియు ననేకాద్భుత కథలాతని తలకుఁ దగిలించియు నుందురు, పెక్కు కథలు శ్రీ కృష్ణదేవరాయలగోష్ఠిలో జరిగినవిగా వినవచ్చును. రామలింగఁడు రాయల సమకాలము వాఁడే! కావున నివి సంభావ్యములు గావచ్చును."[43]

ఇట్లు విమర్శకలోకమున నీ కథలను గూర్చి వివిధాభిప్రాయము లున్నవి. వేటూరివారి యభిప్రాయమే సమంజసమైనదిగాఁ గనుపించును. ఈ కథలను

---

[41] కందుకూరి వీరేశలింగము ; కవులచరిత్రము, పుట 173.

[42] పుట్టపర్తి నారాయణాచార్యులు ; రామకృష్ణుని రచనావైఖరి, పుట 6.

[43] వేటూరి ప్రభాకరశాస్త్రి ; ఉద్భటారాధ్యచరిత్ర, పీఠిక, పుటలు 15, 16.

బరస్పరాశ్రయములు. కథలయుఁ బద్యములయు సరసత, సంభావ్యత, పద్య రచనాపద్ధతుల నీతని కావ్యములలోని ధోరణితోఁ బోల్చి చూచితిమేని వ్యక్తిత్వమున వ్యత్యాసము గనుపించును. అట్టి తావులందుద్భట, పాండురంగ మాహాత్మ్య ములను రచించిన కవి యీ కథలకు నాయకుఁడనియు నంగీకరింప మనసొప్పదు. కొన్ని యితనికి సంబంధించినవే యనిపించును. కొన్నిపట్ల నితనితో సమకాలిక తను సందేహింపవలసిన వ్యక్తులు గనిపింతురు.

కథలలోఁ గొన్ని యే చాటువులతోను సంబంధింపక యున్నవి. కొన్ని యితర చారిత్రక వ్యక్తులకు సంబంధింపక యున్నవి. కొన్ని యతని జీవిత వృత్తాంతమునకు సంబంధించినవి యున్నవి. ఇతనికి సంబంధించిన కథలలో నొకటి చెప్పుకొనినచో నేడు కథలైనఁ జెప్పుకొనవలెనను విచిత్రమైన యాచార మున్నది.

సరళతకొఱకీ కథల నీ దిగువ విధముగ వర్గీకరింపవచ్చును :

1. జీవిత విశేషములను వర్ణించిన కథలు
2. కృష్ణరాయలకుఁ దాతాచార్యులకు సంబంధించిన కథలు
3. కవిపండిత గోష్ఠుల కథలు
4. అప్రధాన వ్యక్తులతో సంబంధించిన కథలు.

ఈ వర్గీకరణము ననుసరించి సంగ్రహముగాఁ బరిగణించి చూచుటవలనఁ గొంత ప్రయోజనమున్నది. ఈ ప్రయత్నము వలన నతని స్వభావాదులను గూర్చిన సందిగ్ధములైన యంశములయెడ నొక నిశ్చయాత్మకబుద్ధి నేర్పరచుకొన వచ్చును. కవియాత్మీయతను గ్రహించుట సులభతరము కావచ్చును.

జీవితాంశములు గల కథల పరిగణనము

తపతీసంవరణోపాఖ్యానమును రచించిన నాదెండ్ల యప్పయామాత్యుని కుమారునికి మనుమరాలు లక్ష్మాంబ. ఆమె భర్త రామయ్య. రామయ్య లక్ష్మమ్మలు పేదకుటుంబమువారు. వారికి రామలింగఁడు జన్మించెను. చిన్న తనమున నితని పేరు భాస్కర రామలింగము. బాచిగాఁడనియు, రామలింగ మనియుఁ బిలువఁబడువాఁడు. ఇతఁడు పుట్టినవెంటనే తండ్రి మరణించెను. కనుక మేనమామల యూరగు గార్లపాడులో బెరిగెను. విద్యయందాసక్తి లేక యిష్టము వచ్చినట్లు తిరుగుచుండెను. ఒక సిద్ధపురుషుఁడు వానికి దేవీమంత్ర ముపదేశించెను. ఆ రాత్రియే దాని నతడుపాసింప దేవియాలయమునకుఁ బోయెను; అచ్చట నెవ్వరో పశుబలి చేయఁబోవుచుండఁగా వారికి హితబోధ చేసి యా హింసాకాండను వారించెను. అటుపై దేవి నుద్దేశించి మంత్రజపము సేయుఁగా దేవి ప్రత్యక్షమై రెండు గిన్నెల నతనిముదుంచినది. ఒకదానిలోఁబాలు

నొకదానిలోఁ బెలుగు నున్నవి. అందొకదానిని గ్రోలిన సంపదలును, మఱియొక దానిని గ్రోలిన విద్యలును వచ్చును. రామకృష్ణుఁడు రెంటిని గ్రోలినాఁడు. దేవి కోపించి వికటకవి వగుదువని శపించినది. మఱల నతని ప్రార్థనవలనఁ గరుణించి వరము నిచ్చినది.

రామకృష్ణుని బాల్యమునఁ బాఠశాల కొక పండితుఁడు వచ్చి బాలురను "మీలోఁ దెలివిగలవాఁ డెవరో లేచి నిలుచుండుఁ డనెను. ఎవ్వరును లేవక పోవుట చూచి రామలింగఁడే లేచి నిలఁబడి యా పండితుని ప్రశ్నలకు సమాధాన మిచ్చెనట! దేవివరమువలన నతనికిఁ దెలివి, విద్య వృద్ధి పొందినవి. యుక్త వయస్సున నతనికిఁ గమలాంబయను నామెను దెచ్చి వివాహము చేసిరి. కొంత కాలమున కతఁడు విజయనగరమునకు రాజాస్థాన గౌరవ మాశించి యేగెను. అచ్చట రాజగురువగు తాతాచార్యుల నాశ్రయించెను. తన్నిమిత్తమై వైష్ణవుఁడై రామకృష్ణుఁడని పేరు మార్చుకొనెను. ఐనను దాతాచార్యులు సహాయము చేయలేదు. అందువలనఁ గోపించి రామకృష్ణుఁడు స్వయముగనే రాజదర్శనము చేయుటకును, దాతాచార్యులను బరాభవించుటకును నిర్ణయించుకొనెను. రాయల విద్యాగోష్ఠి జరుగుచుండఁగా రామకృష్ణుఁడు ద్వారముకడ నిలిచి ఘంటను మ్రోగించెను. సభలోనికిఁ బ్రవేశము లభించినది. పండితు లతని వివిధ విద్యల కౌశలమును బరీక్షించినారు. అతఁడు విజయము నొంది సభలో స్థాన మలంకరించినాఁడు. అష్టదిగ్గజములలో నెనిమిదవస్థానము లభించినది, దేవీ వరప్రసాదమున నతఁ డాడినది యాట, పాడినది పాటగా సాగినది.

రామకృష్ణుఁడు రాయల యాస్థానమునఁ బ్రవేశించుటను గూర్చి మఱియొక కథ యున్నది. తొలుత నాతఁడు నూతన పండితుఁడుగా వచ్చినపుడు కృష్ణరాయల యాస్థానమున నున్న పండితులు వానిని జ్యోతిషమునఁ బరీక్ష చేయుటకు స్వర్గ లోకమున జరుగు విషయముఁ దెలుపుఁడని యడిగిరఁట! అపుడతఁడు రంభ కాలి యందె జారి యచ్చటి సభలోఁ బడఁబోవుచున్నదని చెప్పి కాళికను బ్రార్థింపఁగా నొక యందె ఘల్లుమని సభామధ్యమునఁ బడెనట. వెంటనే కృష్ణరాయ లతనిని గౌగలించుకొని సన్మానించెనఁట; ఉపాసకులైన కవులు, పండితులు మహిమలు చూపుటను గూర్చిన కథలు చరిత్రలోఁ జాల కలవు.

కృష్ణరాయలకుఁ దాతాచార్యులకు సంబంధించిన కథలు

(ఎ) రాయల యాస్థాన ప్రవేశమును గోరి రామలింగఁడు మొదటఁ దాతాచార్యుల నాశ్రయించి, మతము మార్చుకొని రామకృష్ణుఁ డయ్యెను. అయినను నాచారుఁ డనుకూలింపలేదు. కనుక నతనిని దండింపఁజేయుటకు నవమానించుటకు నీ కవి పాల్పడెనట.

(బి) తాతాచార్యుల గుట్టొకటి రట్టు చేసెదనని చెప్పి భయపెట్టి రామకృష్ణుఁ డాయన భుజములపై నెక్కి పోవుచుండెనట. రాయలవా రది

దూరమునుండి చూచి యాభుజములపై నున్న వానిని దండింపుఁడని భటుల నాజ్ఞాపించెనట. ఇంతలో రామకృష్ణుఁడు దిగి తాతాచార్యులను దన భుజములపై నెక్కించుకొనెనఁట. భటులాచార్యుని దండించిరట. రాయలది గ్రహించి రామకృష్ణునకు మరణదండనమును విధింపఁగా నతఁడు యుక్తితోఁ దప్పించు కొనెనట.

(సి) తాతాచార్యులకు స్మార్తుల మొగముఁ జూచినవారు గాడిదలై పుట్టుదురని నమ్మకము. రామకృష్ణుఁ డొకనాఁడు రాయలవారి యెదుట గాడిద లను నిలబెట్టి యొక్కొక్క గాడిదకు సాష్టాంగ నమస్కారము చేసి వీరందఱుఁ దాతాచార్యుల పూర్వులనియు స్మార్తులఁ జూచి యిట్లైరనియు నుల్లసమాడెను.

(డి) అపవిత్రవస్తువు తాకినంతవఱకును శరీరభాగమును ఖండించుకొన వలెనని తాతాచార్యులు పలికెనఁట! రామకృష్ణుఁ డొక యపవిత్రస్థానము నేర్పఱచి యందుఁ దోఁటకూరను బెంచి తాతాచార్యులను గొని పొమ్మనఁగా నతఁడు వచ్చియందుఁ గంఠ దఘ్నముగా దిగఁబడెనట. కంఠమువఱకు ఖండింపవలెనని యతఁ డుల్లసమాడెనఁట.

(ఇ) రాయలవారు, రామకృష్ణుఁడు నొకమాఱు వాహ్యాళిలో నుండఁగాఁ బసరము గోవిందరాజను శత్రురాజాకస్మికముగా రాయలపైఁ గలియఁబడి చంప నుద్యుక్తుఁ డయ్యెనఁట. రామకృష్ణుఁడు కాళికను దలచి "బసవనకుఁ బుట్టినవ్వాడె" యను చాటువును జెప్పఁగా శప్తుఁడై గోవిందరాజు మరణించెనఁట. నాటినుండి రామకృష్ణుఁ డే తప్పు చేసినను శిక్షింపనని రాయలు వరమొసఁగెనఁట.

(ఎఫ్) రామకృష్ణుని తెలివిని బరీక్షింపఁగోరి కృష్ణరాయలు కొందఱు బంధితులగు గజదొంగలను బిలిపించి "మీరు రామకృష్ణునియింట నగలు దొంగిలించి చూపినచో మిమ్ము విముక్తులను జేసెదనని పంపెను. వారు రామకృష్ణుని పెరటిలో దాగి యుండిరి. అతఁ డది కనిపెట్టి, నగలను దొంగల బారినుండి రక్షించుకొనుటకు బావిలో దాచుకొందమని భార్యతోఁ బెద్దగాఁ జెప్పెను. కొన్ని రాళ్లతో నింపిన యొక పెట్టెను బావిలోఁ బడవైచెను. దొంగలు పెట్టె కొఱకై బావిలోని నీళ్లన్నియుఁ దోడి విఫలమనోరథులు కాఁగా నతని పూల మొక్కలకుఁ జాలినంత నీరు లభించినది.

(జి) కృష్ణరాయలతల్లి మామిడిపండ్లను దినవలెనను నాశతో మరణించినది. ఆమె యాత్మ శాంతికి రాయలు బంగారు మామిడిపండ్లు పంచిపెట్టుచుండఁగా వానినిస్వీకరించిన బ్రాహ్మణులకు రామకృష్ణుఁడు వాతలు పెట్టించెను. రాయలు కోపించి ప్రశ్నింపఁగాఁ దన తల్లి వాతరోగమునఁ జనిపోవునప్పుడు వాతలు పెట్టిన బ్రదుకుదు నని వాపోయి చచ్చినదనియు నామె యాత్మశాంతి కిట్లు చేయుచున్నా ననియుఁ బదులు చెప్పి నవ్వించెను.

(హెచ్) రాయల భార్య లక్షవత్తుల నోము నోచుచుండఁగా రామకృష్ణుఁడు బ్రాహ్మణులకడకుఁబోయి తాను కౌపీనధారియై మిగిలిన మేనిపైఁ గల వస్త్రములను జింపి వత్తులను జేయుచు, నొత్తి కొక దీనారము బహుమానమును రాయలొసఁగు

నని చెప్పెను. అందరు బ్రాహ్మణులు నట్లే వస్త్రములను జింపి యొత్తులను జేసిరి. రాయలు కరుణించి వారికి వస్త్రములను దీనారములను దానము చేసెను.

ఇంకను తాతాచార్యులకు సంబంధించినవి, రామకృష్ణుని యాస్థాన ప్రవేశమునకు సంబంధించినవి యసంఖ్యాకములైన కథలు గలవు. వానియందు సభ్యతగాని, విశ్వసనీయతగాని యేమాత్రము లేదు. ఇట దిఙ్మాత్రముగా బై నుదాహరింపబడిన కథలవలననే వాని సత్యాసత్యముల నూహింపనగును. రామకృష్ణుని జీవిత చరిత్రమునకు సంబంధించిన కథలు సత్యములయినను, గాకపోయినను సంభావ్యత నెవరికివారు నిర్ణయించుకొనవచ్చును. సభ్యతకు లోపములేని కథలవి. ఇఁక తాతాచార్యుల కథలు కాలక్షేపము వారెవరో కల్పించినవి యనుటే సమంజసము. ఈ యూహకుఁ గారణములు.

1. కృష్ణరాయల గురువుతో రామకృష్ణునకు సమకాలికత సందేహాస్పదము.

2. కావ్యములవలనఁ దెలియనగు రామకృష్ణుని స్వభావమున కిట్టి ప్రవర్తనము విరుద్ధము.

3. ఈ కథలు రచింపఁబడిన పరంపరలో విశ్వసనీయములైన యాధారములకు స్థానము లేదు.

కవిపండిత గోష్ఠుల కథలు

(ఎ) అల్లసాని పెద్దనకు సంబంధించినవి :

1. "శరసంధాన బలక్షమాది వివిధైశ్వర్యంబులన్ గల్గి దు
ర్భర షండత్వ బిల ప్రవేశ చలన బ్రహ్మఘ్నతల్ మానిసన్
నరసింహక్షితి మండలేశ్వరుల నెన్నన్వచ్చు నీసాటిగా
నరసింహక్షితి మండలేశ్వరుని కృష్ణా! రాజకంఠీరవా!"

అని రాయలపైఁ బెద్దనార్యుఁడొక చాటువును చెప్పెనఁట. సింహమునకు బిల ప్రవేశ దోషము చూపి "రాజకంఠీరవా" అని సంబోధించుట దోషమని చెప్పుచు రామకృష్ణుఁడు "కలనం దావక ఖడ్గఖండిత " యను పద్యమును జెప్పెనఁట. పెద్దనగూడ దానిని మెచ్చెనట. ఈ కథ యెట్లున్నను నీ రెండు చాటువులును వరుసగాఁ బెద్దన, రామకృష్ణులవియని యంగీకరింపవచ్చును.

2. "కలనాటి ధనములక్కఱఁ
గలనాటికాదాచఁ గమలగర్భుని వశమా" యను రాయల పద్యమును బెద్దన
"నెలనడమనాటి వెన్నెల
యలవడు సేవాడు బోయనమవననిసికిన్" అని పూరించెనఁట.

రామకృష్ణుఁడు "అమవసనిసియను ప్రయోగము తప్పని పరిహసించుచు," ఏమి తిని సెపితివి కవితము" అను పద్యము చెప్పెనఁట. పెద్దన పద్యమునందు దోషములేక పోవుటవలనను, రామకృష్ణునిదని చెప్పఁబడిన పద్యమునందుఁ దప్పు లుండుటవలనను నీపద్యము, నీకథయు విశ్వసనీయములు గావు.

3. మనుచరిత్రమునందు రాయల వారి నీ విధముగాఁ బెద్దన సంబోధించినాఁడు.

"శ్రీవేంకట గిరివల్లభ
సేవాపరతంత్ర హృదయ ! చిన్నమదేవీ
జీవితనాయక ! కవితా
ప్రావీణ్యఫణీశ ! కృష్ణరాయమహీశా"

ఇందుఁ "జిన్నమదేవీ జీవితనాయక" యనుచోట నొకరిభర్తయని గొప్పవానిని సంబోధించుట యేమియని యాక్షేపించుటకు రామకృష్ణుఁడు విష్ణువుపై నీ దిగువఁ పద్యమును సభలోఁ జదివినాడఁట ;

"లచ్చి మగఁడ నీకు లక్ష నమస్కృతుల్
సీత మగఁడ నీకు సేవఁజేతు
సత్యభామ మగఁడ సన్నుతించెద నిన్ను
మిత్రవింద మగఁడ మేలొసంగు
లక్షణకు మగండ లాలింపుమా నన్ను
నీలమగఁడ నాకు నీవె దిక్కు
జాంబవతికి మగఁడ జాలంబు సేయక
యెల్లి మగఁడ నన్ను నేలుకొనుము"

సభలోఁ గేవలము హాస్యకాలక్షేపమునకీ పద్యమును రామకృష్ణుఁడు చెప్పి యుండవచ్చును. ఎవ్వరికిని దీనివలన బాధ గలుగదు. ఇందుఁ బెద్దన ప్రసక్తి లేదు. పై మనుచరిత్ర పద్యముతో నెవరో ముడి పెట్టియుందురు. సంస్కృతాంధ్రములందు మహాకవుల రచనలో మహనీయులను దైవతముల నిట్లు స్తుతించిన స్తోత్రములు వందలున్నవి. "లక్ష్మీనాథ సమారంభామ్" అను గురుస్తుతియు, "లక్ష్మీనాథ త్వమసి శరణం" అను కురంగీ పంచకములోని శ్లోకమును, "సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపమ్" అను రామస్తోత్రమును, పార్వతీపతియని శంకరుని సంబోధించుటయుఁ దప్పులని రామకృష్ణుఁడు పరిహసించుట సత్యమే యయినచో "శ్రీదయిత చరణసేవా .." - పాండు 2-65 "శ్రీరమణీ మనోరమణచేత" -పాండు 1-93-, "లక్ష్మీవల్లభ చరణాంబుజ సేవా హేవాక శీలశీలన మునికిన్" -పాండు 1-87 -అనియు దానే పాండురంగమాహాత్మ్యమునఁ జేసిన ప్రయోగముల, గతియేమి ?

4. రాయలవా రొసంగిన గండపెండేరమును ధరించి పెద్దన గర్వించుచుఁ దనశిష్యులతో
"వదలక మ్రోయు నాంధ్రకవి వామపదంబున హేమనూపురం
బుదిత మరాళ కంఠనినదోద్ధతి నేమని పల్కు పల్కెరా?"

అని పలుకుటయు, రామకృష్ణుఁడు

"గుదియల కామినున్ననగు కోమల కంధర భాగ్యరేఖ నీ
నుదుటనులేదు లేదనుచు నూలుతెలుంగులనొక్క పల్కెరా"

యని పూరించెననియుఁ జెప్పు కథకుఁ దల తోక లేదు. ఇందు గుదియలకామి యెవ్వరో దానిమెడలోని భాగ్యరేఖ పెద్దన నుదుట నెందులకు లేదో యెవ్వరికిని దెలియదు. ఈ పూరణమునకుఁ బెక్కు పాఠ్యభేదములును గలవు.

5. రామకృష్ణుఁడు "అల్లసానివాని యల్లిక జిగిబిగి" యను పద్యమును జెప్పినట్లున్న కథయు నసత్యము. ఈ పద్యము కాకుమాని మూర్తికవి రచించినది.

(బి)+ భట్టుమూర్తికి సంబంధించిన కథలు :

1. భట్టుమూర్తికిని రామకృష్ణునకును బ్రబల విరోధమున్నట్లు కొన్నికథ లున్నవి. భట్టుమూర్తి "కుంజర యూథంబు దోమకుత్తుక సొచ్చెన్" అను సమస్య నిచ్చెనట. రామకృష్ణుఁడు :

"గంజాయి త్రాగి తురకుల
సంజాతులఁగూడి కల్లు చవిగొన్నావా!
లంజలకొడకా! యెక్కడ
కుంజరయూథంబు దోమ కుత్తుక సొచ్చెన్"

అని పూరించెనట, రాయలు బాగు లేదనగా మరల రామకృష్ణుఁడు :

"రంజన సెడి పాండవు
లరి భంజనులై విరటుఁగొల్వ పాల్పడిరకటా
సంజయ! యేమని సెప్పుదుఁ
గుంజర యూథంబు దోమకుత్తుక సొచ్చెన్"

అని పూరించెనట. రాజాస్థానమునకును, కీనీచాస్థానమునకును భేదము తెలియని పామరుల కల్పన లిట్లే యుండును. మఱియు రామకృష్ణుఁడు భట్టుమూర్తిని "పేపర పాపరతీగల" యను పద్యమునఁ బరిహసించెనట. ఇదియు నమ్మ రానిదే. నా భట్టుమూర్తి యెడల రామకృష్ణునకు గౌరవమున్నది. తన పాండు రంగ మాహాత్మ్యమున "గిరికాను ప క్షబుద్ధి" 4 - 242 - యను పద్యము నందు శ్లేషతో వసుచరిత్రను బ్రశంసించి శ్లేషకవియగు రామరాజ భూషణుని శ్లేషలోనే యితఁడు మెచ్చి యుదాహరించినాఁడు. రామకృష్ణునకు మతద్వేషమే

+ ప్రబంధాలంకారాలకారుశాస్త్రాకారుదాం మూర్తి కవి.

గాక జాతిద్వేషము గూడ లేదనుటకును జాతుర్వర్ణ్య వ్యవస్థయం దత్యంతా దరముతో పాటు సర్వజాతులయందును సమదర్శనము గలదనుటకు నతని కావ్యములే నిదర్శనములు. ఇతని కావ్యములందలి చాతుర్వర్ణ్య వర్ణనమున శూద్ర వర్ణనము పరమ పవిత్రముగా నున్నది. ఇతర ప్రబంధములలో నెందు నింత యుత్తమ స్థాయికిఁ జెందిన శూద్రవర్ణనము కనుపింపదు. పాండు. 1 – 111.

పెద్దన రచించిన "పాటున కింతులోర్తురె" యను మనుచరిత్రలోని పద్యమును, తిమ్మన రచించిన "ఈసునఁబుట్టి డెందమున" యను పారిజాతాప హరణములోని పద్యమును, భట్టుమూర్తి రచించిన "ఆ జాబిల్లి వెలుంగు" అను వసుచరిత్రములోని పద్యమును విమర్శించుచు రామకృష్ణుఁడు.

> "అల్లసానికవి యటునిటుకాకుండ నేడ్చెను. ముక్కు తిమ్మన ముద్దు ముద్దుగా నేడ్చెను. భట్టుమూర్తి బావురుమని యేడ్చెను."

అని విమర్శించెనఁట.

సి. పింగళి సూరన : రామకృష్ణుఁడు పింగళిసూరనను హేళనచేయఁగా నతఁడు రామకృష్ణునిఁ దిట్టఁదలఁచి యొక పద్యము నిట్లు సగమువ్రాసి యెటో పోయెనఁట :

"తెన్నాలి రామకృష్ణుఁడు
తిన్నాఁడుగ తట్టెడంత........"

దానిని రామకృష్ణుఁడిట్లు పూరించెనఁట.

"తీయనిబెల్లం
బెన్నఁగమన పింగళిసూ
రన్నకు వోరంతఁ బేడయైపోయెకదా"

ఈ పద్య మెవరో వాదపూరణకవి రచించినదని తెలియుచున్నది :

డి. ధూర్జటి : కృష్ణరాయలు ధూర్జటి కవిత్వమును మెచ్చుకొనుచు.
"స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కేల కల్గెనో
యతులిత మాధురీ మహిమ?"

యని ప్రశ్నించెనఁట. రామకృష్ణుఁడు వెంటనే లేచి–

"హా తెలిసెన్ భువనైక మోహనో
ద్ధర సుకుమార వారవనితా జనితాపహారి సం
తత మధురాధరోదర సుధారసధారలఁ గ్రోలఁగాఁజుమీ !"

ధూర్జటియు రామకృష్ణుఁడు సమకాలికులు గావచ్చును. రాయలు ధూర్జటిని సన్మానించి యుండవచ్చును. కాని ధూర్జటి జితేంద్రియుడు, వైరాగ్య సంపన్నుఁడు, పోతనవలెనే తన సరస్వతిని నరాంకితము చేయని తపస్వియు. అట్టి యద్వైత స్వరూపునకు వ్యభిచారము నంటఁగట్టుటయు, నదియు వైష్ణవ దైవతోపాసకుఁడైన పాండురంగ మహాత్మ్యకర్త చేసెననుట సాధ్యముకాదు. ధూర్జటి వంటివాని నట్లు పరిహసించినచో సభలో నది సహింపఁబడుటయు సంభావ్యము కాదు.

ఇ. ముక్కుతిమ్మన : ముక్కుతిమ్మనతో నీ కవికిఁ గల సంబంధమునుఁ దెలుపు కట్టుకథ యున్నది. రామకృష్ణుఁడు తిమ్మనను.

"తాతా ఈతునా" యని యీయెల నూవు నర్థమున నడిగి, వాని మొగమున నుమిసినట్లును, అతఁడు పాదుకతో రామకృష్ణునిఁమూతిపై దన్నగా నతనిపన్ను రాలిపోయినట్లును అతఁడు దుప్పికొమ్ముతోఁ బంటిని జేయించుకొని సభకు వచ్చినట్లును, భట్టుమూర్తి యతనిని "అరవి వీరభద్రచరణాగతి" యను పద్యమునఁ బరిహాసము చేసెనని నీ కథ చెప్పుచున్నది. రామకృష్ణునకు ముక్కుతిమ్మనపై నత్యంత గౌరవమున్నట్లు "నీ కవితా మాధుర్యం" బను చాటువు చాటుచున్నది. ఈ చాటువు రామకృష్ణునిది కావచ్చును. తిమ్మన కావ్యమాధుర్యము వాస్తవముగా నట్టిదే.

ఎఫ్. ప్రగడరాజు నరస కవి : ఈ కవిపండితుని రామకృష్ణుఁ డోడించిన కథ యొకటి యున్నది. ఈ నరసయ్య యెవరో తెలియదు. ఇతనికి సహస్రఘంట కవియను బిరుద మున్నదఁట. తాను జదివిన పద్యము నెవ్వరు వ్రాయలేరట.

రామకృష్ణుఁడు "త్రువ్వట బాబా తలపై" యను పద్యమును జెప్పి యాయననే వ్రాయమనెనఁట. అతఁడు వ్రాయలేకపోయెనఁట. మరియు నతఁడే పద్యమున నైనఁ దప్పులు పట్టగలనని ప్రతిజ్ఞ సేయగా రామకృష్ణుఁడు "గగనీహారగు" అను పద్యమును వ్రాసియిచ్చెనట. ఈ పద్యమంతయుఁ దప్పులతో నిండియున్నదని నరసయ్య నిందింపఁగా రామకృష్ణుఁ డా పద్యమున కర్థము చెప్పి యతనిని "తెలియనివన్ని తప్పులని, "ఒకని కవిత్వమందెనయు" నను చాటువులతోఁ బరిహసించి నిందించెనఁట.

రామకృష్ణుఁడు నీచు నొకనిని నిందించినను దుర్భాషలాడియుండుట సందేహము. వాని కావ్యములం దెచ్చటను బరమత దూషణగాని వ్యక్తిదూషణ గాని కనుపింపదు. కుకవినింద చేసినపుడు గూడ—

"తప్పు గలిగినచోటనే యొప్పుగలుఁగు
వరస కవితావశోక్తుల సరణియందుఁ
గప్పు గలిగిన నీహార కరునియందు
నమృతధారా ప్రవాహంబు లదరుఁగాడె" —పాండు. 1-14.

"కానదోషాత్ములైన దుష్కవులకతన
గరిమ వహించుఁ గవిరాజు కావ్యమహిమ
బహుళ పక్షంబు చీకటి బహుళమగుటఁ
జాయ వెన్నెల తరితీపు సేయు కరణి" – పాండు. 1 – 15.

అని పరుషవాక్కు లేకుండ నడిపినాఁడు. ఉద్భటారాధ్యచరిత్రమున కుకవి నిందయే లేదు. ఇట్టి సుకుమార మనఃప్రవృత్తిగల యీ కవి వరనయ్యపై నిట్టి కఠిన నిందాత్మకములగు పద్యములనుఁ జెప్పెనా యనిపించును. మఱియు నొకరిని నిందించునపుడు తన పద్యమునఁ దప్పులుండరాదు కదా!

"నిక మొదలంటఁగోఁతు" నన్నప్పుడు 'కోఁతు' నను ప్రయోగము వ్యాకరణ దుష్టము.

౩. ఒక చమత్కారకథ : ఒకనాఁడొక పండితుఁడు సభలో నాశువుగా—

"రాజనందన రాజ రాజాజులు సాటి" యను పద్యమును నాలుఁగు పాదము లొకేవిధముగా నుండునట్లు శ్లేషతోఁ జెప్పెనఁట. రామకృష్ణుఁడు దాని కర్థము లేదని నిరూపించుచు—

"మేకతోకకు మేక" యను పద్యమును జెప్పి గెలిచెనఁట.

రాయల బంధువులలోఁ దిరుమలరాయఁ డనువానికి నొక్కటే కన్నఁట. అతఁడు తనపైఁ బద్యమును జెప్పుమనఁగా రామకృష్ణుఁడు "అన్నాతిఁగూడ హరుఁడు" నను పద్యమును జెప్పెనఁట. ఇందలి చమత్కృతి రామకృష్ణుని కావ్యములలోని చమత్కృతిని బోలియే యున్నది. తిరుమలరాయలకు యుద్ధమునఁ గన్నొకటి పోయెనని యొక వాడుక కలదు.

4. వేశ్యల కథలు : ఇంకను రామకృష్ణుఁడు వేశ్యల నోడించినట్లున్న కథలు కొన్ని యున్నవి. 1. ఒకవేశ్య కతఁడు స్వర్ణయోగము నుపదేశింతునని బైరాగి వేషము ధరించి వేశ్యయింట నుండెనని యొక కథ గలదు. ఇతని "పదబింబాధరమున్" అను చాటు వీ సందర్భములోని దందురు. న్యాయమున కా పద్యమతని యలభ్యగ్రంథములలో నొకదాని యందలి స్త్రీవర్ణన మనిపించును. 2. నెల్లూరి నెఱజాణల కథలు కొన్ని చెప్పఁబడుచున్నవి. అవియన్నియుఁ బామరజన వినోదార్థము పుట్టియుండుననుట సత్యము.

5. వివిధ కథలు : రామకృష్ణుడు పిశాచ వేషము ధరించిన కథ. యుప్పరవాని వేషము ధరించినకథ, పంచాంగములకథ మున్నగు కథలు పెక్కులు. లెక్కలు మిక్కిలిగా నీ కవికి సంబంధించినవి కలవు. అందలి సంభావ్యతకు సహృదయహృదయములు దప్ప నిర్ణాయకములైన యాధారము లేమియు లేవు.

సమీక్ష చేయఁగా నీ వివిధ కథలలో నన్నియు రామకృష్ణునివి కాదనుట సాధ్యము కాదు. ఏకారణము లేక యిన్ని కథలు పుట్టవు. మిగిలిన కవుల

సందర్భమున నిట్టి కథలు పుట్ట లేదుకదా! సంస్కృతమునఁ గాళిదాసు, తెనుఁగున శ్రీనాథుఁడు నిట్టి కథలకు గుఱియైన కవులు. వీరిలో నేదోయొక విశేష ముండి యుండవలెను. రామకృష్ణుఁడు సముచిత పరిహాసకౌశలము, లోకోత్తర వాక్చమత్కృతియు గలవాఁడనియు, దీవ్రము, స్వతంత్రమునగు బుద్ధిబలము, సాటిలేని ప్రతిభయుఁ గలవాఁడనియు నతని కావ్యములే చాటిచెప్పుచున్నవి. అట్టివాఁడు చిన్నతనమునుండియుఁ దన విలక్షణమగు గుణమును బ్రకటించి యుండవచ్చును. విద్వద్గోష్ఠులలోఁ బలువుర నోడించి శ్రీనాథునివలె సమకాలికులలోఁ బ్రాధాన్యము వహించియుండవచ్చును. సాంఘికముగను, మతవిషయముగను నతని విశ్వాసములు కొన్ని కొంతమందికిఁ గష్టము, కొంతమందికి సంతోషము కలిగించి యుండవచ్చును. తత్కారణముగాఁ గాలక్రమమునఁ గొందఱి యనురాగమువలనఁ గొన్ని కథలును, గొందఱి కోపమువలనఁ గొన్ని కథలును బుట్టి యుండవచ్చును. ఇవి జరిగిన కథలతో గలసిపోయి యొక వస్త్వైక్యములేని గ్రంథమువలెఁ బరిణమింపఁగా నితఁ డొక 'గ్రంథసాంగుఁడు' గాఁ దేలియుండవచ్చును. ఇందొక విశేషము మనకు గోచరించును. ఎన్ని కథలున్నను, నన్నిటియందు నితని విజయమే కొనియాడఁబడుచున్నది. పండిత గోష్ఠులలోను, వినోద గోష్ఠులలోను, వేశ్యల విషయమునను నితఁడు గెలిచినట్లు చిత్రింపఁబడిన కథలే ప్రచారమున నున్నవి. దీనిని బట్టి యానాఁ డతఁడు విజయవంతము, ప్రతిభాన్వితమునగు జీవితమును మిక్కిలిగాఁ జవిచూచినాఁడనియు, సమకాలికఖ్యాతి ననుభవించినాఁడనియుఁ దలఁచుటలో విప్రతిపత్తిలేదు.

దైవతోపాసనములయందు జంతుబలుల నితఁడు నిరసించెనని యితని బాల్యమును గూర్చిన యొక కథ చెప్పుచున్నది. జాతరలు మున్నగు సందర్భమున జంతుబలులను గ్రామదేవతలకుఁ బ్రీతిగాఁ జేయుట సర్వదేశములయందును సర్వజాతులయందు నాచారము. రామకృష్ణకవి పాండురంగ మాహాత్మ్యమున నిగమశర్మోపాఖ్యానమందు జాతరను వర్ణించినాఁడు. అందొక చమత్కారయుతమైన వర్ణనమున్నది:

"బత్తులునునువాకత్తుల
మొత్తిరి పశునమజముండములు చండములౌ
నెత్తురు ధారలు దొరచి
పత్తిమిరనవారుణ ప్రభలు ప్రబలంగాన్" – 3 – 78.

పశువుల యాపదలను జీకటులకు సూర్యోదయకాంతులవలెఁ బశువుల కంఠరక్తధారలు వెలువడినవను నీ వర్ణనమున వ్యంగ్యముగాఁ బశుబలిని నిందించుట యున్నది. ఈ యభిప్రాయము బాల్యకథలోని యభిప్రాయముతో సరిపోవుచున్నది. ఇతని కావ్యములు మనకు లభించిన ప్రమాణములలో బలమైనవి గనుక నిట్టే యందలి వివిధ సన్నివేశములలో వెలువడు కవివాక్కు లవగతము చేసికొనుచుఁ గథల సారాంశమును బోల్చుకొన్నచో సత్యమునకుఁ గొంత సమీపముగ నీ కథల స్థానమును నిర్ణయించుకొనుట జరుగును.

2. కావ్య పరిచయము

ఇతని కావ్యముల యానుపూర్వి

ఒక్కొక్క కవి యంతరంగమునకు సంబంధించిన సంస్కార మా కవి రచనలోఁ బ్రతిబింబింపకమానదు. ఈ సంస్కారము స్వాభావికము, పరిణామశీలమునని రెండు తెఱఁగులు. అందు మొదటిది యా కవి రచన లన్నిటియందును గనుపించు సామాన్య ధర్మముల సముదాయముగను, రెండవది యొక రచనకును, దదనంతర రచనకును గల భేదముగను బ్రతీయమానమగుచుండును. ఒకని రచనల యానుపూర్వియు, నతని సంస్కార వికాసమును బరస్పరాశ్రయములు. ఆనుపూర్వి తెలిసినపుడు వికాసము జక్కఁగాఁ బరిశీలింప ననువుపడును. శైలి మున్నగు నంశములలో భేదము స్పష్టముగా నున్న గ్రంథముల పరిశీలనమువలన నొకప్పుడు సందిగ్ధమయిన యానుపూర్విని నిర్ణయించుటయు సాధ్యము.

రామకృష్ణుని గ్రంథములు మూఁడింటిలో రెండింటి రచనానుపూర్వి సునిశ్చితము. ఉద్భటారాధ్యచరిత్రము రచించిన కొంతకాలమునకుఁ బాండురంగ మహాత్మ్య రచన జరిగినది. మూఁడవదియగు ఘటికాచల గ్రంథ రచనానుపూర్వి వివాదగ్రస్తమై యున్నది. ఉద్భట పాండురంగ గ్రంథముల యానుపూర్వికి ననుగుణముగనే వానిలోని కవితావికాస మున్నది. చదువరు లెవ్వరైన నుద్భటగ్రంథమందలి రచనప్రౌఢము, మధురమునై యున్నదని యంగీకరింపక తప్పదు. అట్లే పాండురంగ మాహాత్మ్యములోని రచన దానికన్న మిక్కిలి ప్రౌఢము, మధురమునై యున్నదని యంగీకరింపక తప్పదు. అంతియ కాదు. ఈ రెండు గ్రంథముల నడుమ కవియాత్మీయతలో గొప్ప పరిణామము మనకు గోచరించును. ఈ పరిణామము బీజమునుండి వృక్షము పరిణమించినట్లున్నది గాని జీవలక్షణములో విభిన్న ప్రవృత్తి యెంతమాత్రము గన్పింపదు. అందు మొదట గ్రంథమునం దొకే మతము, తత్సంప్రదాయములు, తదవలంబకులైన యాచార్య పురుషులు, భక్తులు, దీక్షలు చిత్రింపఁబడియున్నను నితరమత దూషణము లేకుండుటలోను, వేదమార్గప్రాధాన్యములోను రెంటియందును బోలిక లున్నవి. కాశీవాసనము మూలమున స్థాపింపఁబడిన పరతత్త్వ ప్రతిపాదనము రెండిటియందు నొకటిగానే యున్నది, ఎట్టి పాపాత్ములైనను బుణ్యతీర్థ దేవతావ్యక్తి సాంగత్యములవలనఁ దరింతురను నంశము రెండుగ్రంథముల యందును నర్థవాద కథారూపమునఁ బ్రతిపాదింపఁబడినది.

కవితాపరిణామమునందు మాత్రము రెండింటినడుమ మరికొన్ని వికాస దశలు గల కావ్యము లుండి యుండవలెనను నంశమును నిరూపించుచున్నది. ఈ యంతరమును బూరించిన గ్రంథము ఘటికాచల మహాత్మ్యమా, కందర్ప

కేతు విలాసమా, హరిలీలా విలాసమా యనునది యొక పెద్ద సమస్య. రచనను బట్టి చూచినచో లభించిన పద్యముల యాధారము ననుసరించి యిది హరిలీలా విలాసమై యుండునని యూహించుటకు వీలగుచున్నది. కల్పనాపద్ధతి, భావములు, పద్యపాదముల యెత్తుగడలు నుద్భటారాధ్య గ్రంథమునందుకన్న నెక్కువ పరిణామముఁ గల్గి కొంచెము తక్కువగాఁ పాండురంగ మాహాత్మ్య రచనతో సామీప్యముగల్గి వర్థిల్లుచున్నవి.

ఉదా :

1. పద్యరచనా సామ్యము :

"వీటి మహానుభావుఁ డిహిహి జమదగ్ని తనూజుఁడు"
—హరిలీలావిలాసము

"ఈ కడజాతినాతికి హిహి మహదేవుఁడు చిక్కెనంచు"
—పాండు. 3 – 98

"చంగునదాటు ధేయనిన సప్తసముద్రములైన వేగ వా
గెంగుదియింప నిల్చు నడు గెంటనె శబ్దనివాతధీగతిన్"
—హరిలీలావిలాసము

"కెరలక క్రమ్మఱించు నడుగెంటన్ నిల్చు నొకింత నూకినన్ శర
నిధులేరుదాటు...... .. .." —పాండు. 1 – 114

2. భావసామ్యము :

"ఆకరి వేల్పుసామి చరణాబ్జములన్ జనియించినారు మం
దాకినితోడు నీడలయినారు నిజంబుగఁ గమ్మకట్టి దా
మైక మనీయ కీర్తి మహిమాతిశయంబును మించినారు భ
ద్రాకృతులద్రిధీరులు ప్రభాద్రులు మాద్రులు శూద్రులవ్వారిన్
—హరిలీలా విలాసము

"హరి మౌళిహీన మచ్యుత
చరణాబ్జమరంద ధార జాహ్నవి లోకే
శ్వరి తమ సోదరి యగునఁట
పురి వెలమల భాగ్యమహిమఁ బొగడఁగవశమే"—పాండు. 1-112

"తెలతెలవాఱ నొయ్య నరుదెంచు నిశాంతరతాంత తాంత లా
వెలువలకింపుగా మెలఁగుఁ డెక్కలఁగూరిన చూర్ణకుంతలా
వళి సరసంబుగా జడియు వాడిన సెజ్జలమీఁది ప్రావిరుల్
దొలఁగఁగఁజేయు నూడిగపుఁదొయ్యలు లందరివేఁగుదెమ్మరల్"
—హరిలీలావిలాసము

"తెలతెలవార నొయ్య నరుదెంచి నితాంతరతాంతతాంత లొ
చెలువలకింపుగా మెలఁగి చెక్కులఁగూఱిన చూర్ణ కుంతలా
వళి సరసంబుగా జడిసి వాడిన సెజ్జలమీఁది బ్రావిరుల్
దొలఁగఁ బ్రభాత వాయువులు దోఁచుఁబురింబరిచాకాకృతిన్"
—పాండు. 1-119

పరిశీలింపఁగా నీ కవి పాండురంగ మాహాత్మ్యముకన్న ముందుగ హరిలీలా విలాసమును రచించెనని యూహింపనగుమ. వర్ణన ప్రణాళికనుబట్టి చూచినఁగూడ నిది యొక పెద్దకావ్యమే అయి యుండవచ్చును.

ఇఁకఁ గందర్పకేతు విలాసము రచన యుద్భట గ్రంథమందలి మదాలస చరిత్రలోని పద్యరచనకు దగ్గఱగానున్నట్లు తోఁచును.

"కామిని చంద్రుఁజూచి మదిఁగందు.........." —కందర్పకేతు
విలాసము.
"ఈవికరాజి యీ శుకములీశశికాంతులు... .. .. .. గావుమీ
యెడన్" ఉద్భట. 2-189.

లభించిన మూఁడు పద్యములలోను కందర్పకేతువిలాస పద్యరచనావైఖరి యుద్భట చరిత్రమునకు సమీపముగానున్నది. మఱియు రామకృష్ణుని చాటువులని పేరుపడిన పద్యములలో స్త్రీవర్ణనమునకు సంబంధించిన పద్యములుకొన్ని యీ కందర్పకేతు విలాస పద్యములతో సామ్యము నొందియున్నవి. అందుగొన్ని యీ కావ్యమునందలివై యుండవచ్చునేమో. ఇట్లు లభించినంతవఱకు సూక్ష్మ పరిశీలనమునఁ దేలిన దేమనఁగా రామకృష్ణుఁడుద్భటచరిత్ర తఱువాతఁ గందర్పకేతువిలాసము, నటుపైని హరిలీలావిలాసము, పిమ్మటఁ బాండురంగ మహాత్మ్యము రచించి యుండవచ్చును. ఇఁక ఘటికాచల మహాత్మ్యము నెప్పుడు రచించి యుండవలెనను ప్రశ్న మున్నది. చాలవఱకు గ్రంథభాగము లభించినను గవి రచించిన పీఠిక లేకపోవుటవలన రచననుబట్టి యీ విషయము నొనర్చుట యుత్తమము. ఇందలి పద్యరచనయు, నలంకార పద్ధతియు పైఁ జెప్పినగ్రంథములందన్నిటికన్న నప్రౌఢముగ నుండి యీ కవిప్రారంభదశయందలి రచనను సూచించుచున్నది. కనుక గుణమునుబట్టి యిది యుద్భటచరిత్రకన్న ముందు రచింపఁబడియుండెనని తేలుచున్నది.

రామకృష్ణుఁ డుద్భట గ్రంథరచనకుఁ దఱువాత శైవమతమును విడిచి వైష్ణవమును స్వీకరించెనని విమర్శకలోకమున నొక యభిప్రాయ మున్నది. రామకృష్ణునకు రెండుపేళ్ళుండుట దక్క మఱియొక యాధార మీ యభిప్రాయమును రుజువుచేయునది లేకపోవుటచేతను నా యభిప్రాయముపై నాధారపడి ఘటికాచల గ్రంథరచనాకాలమును నిర్ణయించుట సమంజము కాదని తోఁచును. పై యభిప్రాయమును విశ్వసించువారిట్లు దలఁచుచున్నారు.

ఘటికాచలగ్రంథము వైష్ణవమత సంబంధమైనది. అట్లే పాండురంగ మహాత్మ్యమును. ఈ యభిప్రాయము సరియైనది కాదని యీ గ్రంథమే రుజువు

పఱచును. కనుక నీ వైష్ణవగ్రంథములు రెండును శైవగ్రంథమగు ఉద్భటా రాధ్య చరిత్రమునకుఁ దఱువాత రచింపబడినవి. కాఁగా పాండురంగమహాత్మ్య మును రచించిన తఱువాత కవి కడు వృద్ధుఁడై యున్నప్పుడు ఘటికాచల మాహాత్మ్యమును రచించి, గ్రంథపీఠికను బూర్తిచేయకమునుపే చనిపోయి యుండును. ఈ గ్రంథము పాండురంగమహాత్మ్యమునకుఁ దరువాత రచింపఁ బడినను, రచన తీసికట్టుగా నుండుటకు రామకృష్ణకవికి ముదిమిచేత శక్తముగాని మేధ కారణము కావచ్చునని యావిమర్శకుల యభిప్రాయము.

ఇందు స్పష్టపడిన విషయ మేమనఁగా రచనావికాసవైఖరినిఁ బరిశీలించి ఘటి కాచల గ్రంథమును మొదటిగ్రంథముగా నంగీకరించినచో రామకృష్ణుని మతము మార్పుకథకు భంగముకల్గును. మతముమార్పుకథను నమ్మినచో గ్రంథస్థమగు వికాసము యొక్క యసహజతను గవి ముదిమి కాపాడింపవలసియుండును. ఈ రెండవ సమన్వయమెంతవరకు సమంజసమో పరిశీలింతము.

శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యములోని రచన యిట్టిభ్రమనే కల్గించును. కానియది యతఁడు పద్యోపన్యాసముగా శివరాత్రినాఁడు శ్రీశైలమునఁజెప్పిన యాశుకవిత్వప్రబంధము. ఆ శ్రీనాథుఁడే ప్రాయము మిగులఁగ్రైవాలిన వెనుక రచించిన కాశీఖండము వాని రచనలలో మకుటాయమానమైన శృంగార నైషధముతో సరితూఁగి యుండలేదా? తిక్కన సోమయాజి భారతము రచించు నాఁటికిఁ దిన్నఁగా చూపానని వయస్సుగుటవలన గురునాథుఁడు ప్రాయనకాఁడై నట్లున్న జనశ్రుతియేగాక వాని జీవితాంశముల నరసినను వార్ధకమునసే భార తము రచించెననుట స్పష్టము, అట్లయ్యునది నిర్వచనోత్తర రామాయణ రచన కన్న వేయి మడుంగులు మిన్నగానున్న దనుటకు సందేహమేమి? పాండురంగ ఘటికాచల మాహాత్మ్యములను బోల్చినపుడు ఘటికాచలమునఁ గనుపించు లోపము రచనలోని లేఁతఁదనమువలనఁ గల్గినదేగాని మరియొకటి కాదని విశద మగును.

కవియొక్క మత వికాసవైఖరినిఁ బరిశీలించినను ఘటికాచల గ్రంథమందలి వైష్ణవము దక్షిణదేశ సంప్రదాయమునకు సంబంధించిన యాళ్వార్లమార్గము నను సరించినది. అట్లే యుద్భట గ్రంథములోని శైవమారాధ్యుల మార్గము ననుసరించి నది. ఈ రెండు గ్రంథములను వరుసగాఁ గృష్ణరాయ లవలంబించిన వైష్ణవమును, బాల్కురికి సోమన యవలంబించిన శైవమును సూచించును. కాని యితని రెండు గ్రంథములయందును బరస్పర మతదూషణ మెచ్చటను మందునకైనఁ గానరాదు. వాని జీవలక్షణ మట్టిది. ఈ రెండు మార్గముల సమన్వయమే పాండురంగ మహాత్మ్యమునఁ గనుపించును. ఈ విధమైన కవిసంస్కార వికాసమును జూపించు గ్రంథములలో ఘటికాచల గ్రంథము చిట్ట చివరిదియైనచో నీ కవి శైవవైష్ణవ సమన్వయానంతరము మరల దాక్షిణాత్య వైష్ణవము నవలబించినాఁ డనవలెను. ఇదియసహజము, కనుక తప్పనిసరిగా ఘటికాచల మాహాత్మ్యము రామకృష్ణుని మొట్టమొదటి గ్రంథమై యుండవలెను. దీని సంభావ్యత యా దిగువ జెప్పిన రీతి నుండవచ్చును.

కృష్ణరాయల పార్థకమున రామకృష్ణుఁడు చిన్నవాఁడు. కవిత్వ మారంభ దశలోనున్నది. నరసింహ కృష్ణరాయని కరమరుదగు కీర్తి గూర్చి చమత్కరించు చున్న స్థితిలో నున్నదేగాని యుత్తమ ప్రబంధరచనా సహమింకను గాలేదు. కవికిఁ జిన్నతనమునుండియు శైవవైష్ణవములు రెంటియందును సమానగౌరవ మున్నది గనుక రాయలవారికి వినిపించుటకు ముచ్చటపడి యొక దాక్షిణాత్య సంప్రదాయ వైష్ణవగ్రంథమును నూటయెనిమిది దివ్య తిరుపతుల పరిగణనముతో నింపిన స్థలమాహాత్మ్యము రూపమున రచించుటకు బాలరామకృష్ణుఁడు పూను కొని యుండును. అది సమాప్తమునందుచున్న దినములలో గృష్ణరాయలు దివి కేఁగి యుండును. దానితో రామకృష్ణుఁడంకిత మొనర్పని యా గ్రంథమునకు పీఠికను రచింపక మూలఁ బడవైచి యుండును. తన కవిత్వము వికసించిన కొలఁది వాగ్రంథమునం దాదరము తొలఁగియుండును.

పైఁ జెప్పిన విధముగా శైవ వైష్ణవ భేదము లేక కావ్యరచన చేసిన కవి రామకృష్ణుఁ డొక్కఁడేకాఁడు. అంతకుముందిట్టి యుదాహరణములు పెక్కు లున్నవి. "మహేశ్వరాంఘ్రి కమలధ్యానైక శీలుండ" – నిర్వచనోత్తర రామాయణము 1–13. నని చెప్పుకొనిన తిక్కన రామకథను రచించెను గదా!

"యామము లెన్మిదింట నియతాకృతిఁ బ్రత్యహమున్ శివార్చ నా
రామతయొప్ప నిత్య శివరాత్రివ్రతంబుగఁ బూని భవ్య యో
గామృత తృప్తిమైఁ ద్రిజగదర్చిత లీలఁ దనర్చు శంకర
స్వామి మునీంద్రుఁ భక్త జనవత్సలు మద్గురు నాశ్రయించెదన్"
—నృసింహపురాణము, 1–11.

అని చెప్పి శంభుదాసుఁడు నృసింహపురాణమును రచించి యిట్టి రామకృష్ణులకు మతము మార్చుకొనకుండ కావ్యరచన చేయుటకు మారదర్శకుఁడై శైవ వైష్ణవ విమర్శకుల స్వయంకృత కల్పనాకథలను వమ్ము చేయుట లేదా!

ప్రస్తుతము లభ్యమైన ఘటికాచల మాహాత్మ్య ప్రతిని రామకృష్ణుని మనుమఁడు కొంత "సవరణగా రచించి" నాఁడని వేంకటగిరి పీఠికవలనఁ దెలియుచున్నది. అనఁగా మూల గ్రంథ మింకను గొన్ని లోపములతోఁగూడి రామకృష్ణుని మనుమఁడు సవరింపవలసినంతటి బాల్యరచనగా నుండియుండె ననుట స్పష్టము. ఇంతకన్న నీ కావ్యము బాలకావ్య మనుటకుఁ గావలసిన ప్రబల నిదర్శన మేమి యుండును? కనుక రామకృష్ణుని గ్రంథముల యాను పూర్వి యీ దిగువరీతిని నిర్ణయమగుచున్నది:

1. ఘటికాచల మాహాత్మ్యము
2. ఉద్భటారాధ్యచరిత్రము
3. కందర్పకేతు విలాసము
4. హరిలీలావిలాసము
5. పాండురంగ మాహాత్మ్యము.

లింగపురాణము గ్రంథము లభింపవలకును నానుపూర్వి నూహించుట సాధ్యపడదు. పాండురంగ విజయమను నొక గ్రంథము పాండురంగ మాహాత్మ్యముకన్న వేఱుగా నుండినచో దాని విషయము నింతియే. శషప్రవిజయ మీతని రచన కాదని నిర్ణయింపఁబడుటవలన నిటఁ దత్ప్రసక్తియే లేదు.

రామకృష్ణుని కావ్యములకుఁ గృతిపతులు

లభ్యములైన మూఁడు ప్రబంధములలో రెండింటినే రామకృష్ణు డంకితము చేసెను. అందుద్భటారాధ్యచరిత్రము సూరదేవమంత్రికిని, పాండురంగ మాహాత్మ్యమును విరూరి వేదాద్రిమంత్రికిని గృతి యొసఁగెను. ఈ కృతిపతు లిరువురిలో నొక్కఁడును రాజు కాదు. రాజాస్థానములలోఁ గవిపండిత పోషణము విశేషముగా జరిగి కవులపై లక్ష్మీకటాక్షము వెల్లివిరిసిన దినము లవి. ప్రబంధ కవులు పలువురు తమ కావ్యములను భూపాలాగ్రేసరుల కంకితము చేసి వారి మన్ననలఁ బడసి యిహపరములను సాధించుకొనినారు. అట్టి స్వర్ణయుగమునఁ బుట్టియు రామకృష్ణుఁడు తన కృతుల నేప్రభువునకు నంకితము సేయకుండు టొక వింత. ఇందేదియో విశేష ముండి యుండును. దేవయ్య నాదెండ్ల గోపమంత్రికడ నొక యుద్యోగి. వేదాద్రిమంత్రి పెదసింగ భూపాలునొద్ద వ్రాయనకాఁడు. ఈ యంశమును గూర్చి కందుకూరి వీరేశలింగము తమ కవుల చరిత్రమున నిట్లు ప్రస్తావించినారు :

"ఇతఁడు సాధు స్వభావము కలవాఁడు కానందునను, పరుల వంచించుట యందును, బరిహసించుటయందును ఆసక్తి కలవాఁడయినందునను, ఏవో కొంటె పనులు చేయుచు వచ్చి పలుమారు రాజుల యాగ్రహమునకుఁ బాత్రుఁడగుచు వచ్చెనఁట! ఇందుఁ గొంత సత్యముండకపోదు. అట్లు గానియెడల నితఁడు తన గ్రంథములను పేరుగల రాజుల కెవ్వరికి నంకితము చేయక యొక వ్రాయస కాని కంకితముసేయుట తటస్థించియుండదు."[1]

పై వాక్యములను రచించినవారే రామకృష్ణునిఁగూర్చిన కథలను విశ్వసించుటలేదు. ఈ సందర్భమున వా రిట్లు వ్రాసినారు :

"అతఁడు కృష్ణదేవరాయల యాస్థానమునందలి కవుల నాక్షేపించెనన్న కథలన్నియు నసత్యము లనుట స్పష్టము."[2]

ఇతఁడు సాధుస్వభావము కలవాఁడు కాదనుట కిక నాధారమేమి? సాధు స్వభావము కలవాఁ డనుట కితని కావ్యములే నిదర్శనములు. జనశ్రుతిగా వచ్చు

---

[1] కందుకూరి వీరేశలింగము : ఆంధ్రకవుల చరిత్రము, పుటలు, 177-178.

[2] కందుకూరి వీరేశలింగము : ఆంధ్రకవుల చరిత్రము, పుట, 173.

మున్న కథలవలన నిట్టి యభిప్రాయము నేర్పఱచుకొనుట సరికాదు. ఎంత కొంటెగా నున్నను నతఁడు తన కొంటెతనమును లోకసంస్కరణమునకే వినియోగించినట్లా కథలే రుజువు పఱచుచున్నవి.

మహాకవులు తమ కావ్యములను ప్రభువులకుఁ గృతియిచ్చు టెంత యాచారమో మంత్రుల కిచ్చుటయు, నితర పుణ్యపురుషుల కిచ్చుటయు నంతియే యాచారము. శ్రీనాథకవి సార్వభౌముఁడు బెండపూడి అన్నయ్యకు, మామిడి సింగనకు, నవచితిప్పయ శెట్టికిఁ గృతు లిచ్చుటేల? ప్రభువుల కెందుల కీయ లేదు? మున్నగు ప్రశ్నల కుత్తరముగా నా కవి యా కాలమున రాజాగ్రహము నకుఁబాత్రు డయ్యెనని చెప్పవచ్చునా? రసికత, సహృదయత, పాండిత్యము, మిత్రధర్మము కలసినచోట మహాకవుల గ్రంథము లంకితమగుట సహజముకాని కేవలము రాజులను జూచి మురిసి యిచ్చుటే యందఱు కవుల విషయమునను సత్యమగునా? రాజుల కంకితమైనను, మంత్రుల కంకితమైనను గవీంద్రులకుఁ గృతిపతులతోఁ గల సంబంధము తెనుఁగునందు మామయల్లుండ్ర సంబంధము వంటిది. కొందఱు కవుల సందర్భమున నిది భక్తునకు భగవంతునితోఁ గల సంబంధము. మఱికొందఱు కవుల కిది పూజ్యులగు మానవుల గుణములలో దివ్యత్వము చూచు సాధక మగుచున్నది. తాత్త్వికులగు మహాకవులు రాజుల కంకితమిచ్చిన తావులందుఁగూడ వారి యుత్తమ లక్షణములను జూచి మెచ్చి వారికిఁ గృతి నొసఁగుదురే కాని కేవలము పొట్ట నింపుకొనుట కొఱ కట్లు చేయరు. రాజరాజనరేంద్రుఁడు రాజగుటవలన మాత్రమే నన్నయ భారత మంకితము చేసె ననరాదు. ఎఱ్ఱన తన కాలమున జీవించియుండని రాజరాజ నరేంద్రుని పేర నారణ్య పర్వమును బూరించుటలో నా ప్రభువుపైనను, నన్నయ పైనను, గవికిగల భక్తియే కారణము గాని వేఱుగాదు. తనకాలముననున్న రాజు లాదరింపకుండుటవలన నెఱ్ఱన యిట్లు చేసె ననరాదు గదా!

రాజరాజనరేంద్రుఁడు, నన్నెచోడుఁడు, శ్రీకృష్ణరాయలు, రఘునాథ రాయలు మున్నగు నల్పసంఖ్యాకులను విడిచి లెక్కించినచోఁ బ్రభువులకన్న వారి మంత్రులలో, వారి యుద్యోగులలోఁ బండితులు, కవులు, సహృదయులు నుండుట యెక్కువ సంభావ్యము. ఒక ప్రభువునకుఁ గృతిప్రదాన మొనరింపఁ బాటుపడిన కవికన్నఁ బ్రభువైనను, గాకున్నను సజ్జనశ్రేష్ఠుఁడగు నొక సహృదయున కిచ్చిన వాఁడు స్తుతిపాత్రుఁడు. అల్లసాని పెద్దన, ముక్కు తిమ్మన మున్నగువారు కృష్ణరాయలపై రచించిన కృతిపతి ప్రశంసలలో నతని యుదాత్త గుణములకే ప్రాధాన్యమున్నది. ప్రభువులు కాకున్నను నుత్తమగుణములుగల యూరదేవయకు, విరూరి వేదాద్రికిఁ దన కావ్యము లంకితము చేసినాఁడు రామకృష్ణుఁడు.

గ్రంథప్రమాణముల ననుసరించి రామకృష్ణుఁడు మహాతాత్త్వికుఁడనియు జీవితమున నుత్తమ యోగసాధకుఁడనియు విదితమగును. అట్టికవి యెట్టివారిని గృతిపతులుగా నెన్నుకొనెనో మనము గమనించినచో నీ యంశము సుబోధక మగును. సత్ప్రవర్తనుఁడు, దైవభక్తిసంపన్నుఁడు, శౌర్యధైర్యములతోపాటు శాంతి, దాంతి, యౌదార్యము దానగుణము మున్నగు లక్షణములు కలవాఁడు

కృతిపతి కావలెనని రామకృష్ణునివంటివాఁడు కోరుటలో నాశ్చర్యము లేదు. అతఁడట్లే కోరినాఁడు. ఉద్భటచరిత్రమున దేచమంత్రి నితఁడు వర్ణించిన పద్ధతియే దీనికి నిదర్శనము. ఆదేచ మంత్రి "మహనీయ మనీషి మనః కమల దివాక రుండును...రసనాగ్రగజాగ్రదశేష విద్యా సందర్భుండును, నభంగురప్రతిభాపద్మ గర్భుండును విశుద్ధస్వాంత విక్రాంత వీరభద్రుండును " గా వర్ణింపఁ బడినాఁడు. అంతియ కాదు. పుండరీకునిపాత్రను సృష్టింపవలసిన మనః ప్రవృత్తిగల రామకృష్ణుఁడు దేచయపై మక్కువపడుటకు ముఖ్యకారణములా దేచయ్య "మాతాపితృభక్తియుక్తి మహిమాఢ్యుడు, కాతరజన సురశాఖి, వాతాశన సార్వభౌమ వాగ్వైఖరి . సత్కీర్తినిధి, ధీసన్నిధి, గీష్పతి నిభమతి" యనియును దక్కినవానికన్న మిక్కుటముగా శ్రీ చంద్రశేఖర వాచంయమ చంద్రులపాద సరోరుహసేవా చతురాత్ముఁ డనియును మఱియుఁ బ్రణవాత్ముఁడగు గిరిజాప్రాణేశు నెల్లప్పుడును బంచాక్షరీమంత్రమున నుపాసించువాఁడనియును గదా!

పాండురంగ మాహాత్మ్యమున గృతిపతికి నిట్టి లక్షణములుండుటయే కవి కోరినాఁడు. వేదాద్రిమంత్రి కంకితమొనర్చుటకుఁ గారణ మతఁడు "లోకోత్తర గుణోత్తరుఁడు, జలజాక్షాంఘ్రిసరోజ షట్పదమునై యుండుటేగాక "తత్త్వార్థగ్విభ ప్రభావ నిధియు, నితాంత శాంతియుతుఁడునగు కందాళప్పగారిని గొల్చుచుఁ దదాశీర్వాద లబ్ధోన్నతిని హత్తినవాఁడు. ఈకృతిభర్త గురువగు కందాళప్పగారు చరిత్రప్రసిద్ధుఁడు, వేదమార్గ ప్రతిష్ఠాపకుడు, షడ్దర్శనీపారగుఁడు, యతిరాజ భాష్య నిర్ణేత, పురాణేతిహాసకర్త, దివ్యప్రబంధాను సంధాత, సకల దేశాచార్య నికరగురువు. ఈ విధముగా రామకృష్ణకవి కృతిపతులలోఁ జూచినది వారి రాచరికము గాదు. పాండిత్యము, సంప్రదాయము మున్నగు సల్లక్షణములు.

ఈకృతిపతి ప్రశంసలు యాదృచ్ఛికముగాఁ జేయఁబడినవిగావు. ఆ కృతి పతులు వాస్తవముగా నట్టివారే. ఊరదేచయ చంద్రశేఖర యతీంద్రులకును, లొల్ల లక్ష్మీధర పండితులకును శిష్యుఁడై పంచస్తవీవ్యాఖ్యను రచించెనన్న సామాన్యుఁడైయుండునా? కందాళప్ప గారి శిష్యుఁడగు వేదాద్రి మంత్రి సంప్రదాయమును జక్కగా నాదరించు కర్మిష్ఠి, దైవభక్తి సంపన్నుఁడు.

ఈ లక్షణములు లేక ప్రభుల చెంతఁదిరుగు వారిని రామకృష్ణుఁడు మెచ్చఁడని యీదిగువ పద్యమువలనఁ దెలియుచున్నది.

"చేతులు ద్రిప్పుచున్ బ్రభులచెంతల నూరక దుర్వినీతులై
యేతులఁబోవుచుండిరుగునిప్పటి మంత్రులు తంత్రులిందఱున్
భూతల కల్పవృక్షముఁబ్రభూతగుణాఢ్యుని సర్వలోక వి
ఖ్యాతు వినీతు వేదగిరిఁగాతరచిత్తులు పోల నేర్తురే!" —పాండు. 1 -73.

కనుక నీ కవి రాజులప్రాపకము లభింపక తన గ్రంథములను రాజులకుఁ గృతి యొసఁగలేదనుట సత్యము కాదు. "ఒక వ్రాయసకాని కంకితము చేయుట" న్యూనతగా విమర్శకారులు భావించినారు. సంప్రదాయము, సంస్కారముగల మహనీయుఁడు వ్రాయసకాఁడైనను, బ్రభువైన నొక్కటేగదా! కాక విరూరి వేదాద్రి

వ్రాయసకాఁడనఁగాఁ గేవలము లేఖకుఁ డనియుఁ "విరూరిపట్టణపతి" యనఁగాఁ గరణమనియు నర్థము చెప్పుటకు వీలులేదు. ఇతనినిగూర్చి రామకృష్ణుఁడు వర్ణించిన యితర పద్యములను బరిశీలించినచో నితఁడు నీతిశాస్త్ర వేత్త – 1 - 20 – యనియు, నితని వ్రాయనము ప్రజలకుఁ బ్రాణరక్ష – 1 – 20 – యనియుఁ దెలియుచున్నది. "కవులుంబాఠకులున్" – 1 – 21 – అను పద్యమునుబట్టి యితఁడు ప్రాథవము కలవాఁడని చెప్పక తప్పదు. ఇంకను "మంత్రిమాత్రుండె దుర్మంత్రమథనకథన చారు చర్యా చమత్కార చక్రవర్తి, యద్రి విభుఁడు విరూరి వేదాద్రిమంత్రి" - 1 – 74 – యనుటనుబట్టి యితనికి మంత్రాంగమునందును బ్రమేయమున్నట్లు తెలియుచున్నది. "ఇప్పటి మంత్రులు తంత్రులిందఱున్.... వేదగిరిఁ గాతర విత్తులు పోల నేర్తురే" – 1 – 73 – యనుటనుబట్టి యితఁడు మంత్రులకంటె మాన్యుఁడని తెలియుచున్నది. ఈ యంశము లన్నిటిని బరిశీలించి చూచినచో నీ వేదాద్రిమంత్రి వెనుకటి కాటయవేముని సమక్షమందలి రాయన ప్రభుని బాచనివంటి వ్యక్తి యని వ్యక్తము కాఁగలదు.

"కలయఁబసిండి గంటమునఁగాటయ వేమ సమక్షమందు స
త్ఫలముగ రాయన ప్రభుని బాచఁడు వ్రాసిన వ్రాలమ్రోఁతలున్
గలుగలు గల్లుగల్లు రనఁ గంటకమంత్రుల గుండెలన్నియున్
జలు జలు జల్లు జల్లురనె సత్కవివర్యులు మేలు మేలనన్"

ఈ చాటువును బరికించుట వలన రాయనప్రభుని బాచఁడు వ్రాయసకాఁడు. మంత్రాంగదక్షుఁడునని తెలియవచ్చును. ఈ రాయల భాస్కరుఁ డనవేమారెడ్డి కాలమున దుర్గాధిపతికూడనై యుండెను.[3] విరూరి వేదాద్రిమంత్రి కూడ నిట్టి యధి కార విశిష్టత గల వ్యక్తి యనుట స్పష్టము. రాయన భాస్కరుఁడు, కాటయ వేమా రెడ్డిలేక కుమారగిరిరెడ్డికి మంత్రియైనట్లు విరూరి వేదాద్రి మంత్రి పెద్దసంగభూపా లుని మంత్రికావచ్చును. రామకృష్ణుఁడు వలుతావులం దీయనను మంత్రియని వ్యవహరించి, యితర మంత్రులతోఁ బోల్చి గుణోత్తరునిగా వర్ణించెనుగదా!

మంత్రులును లేఖన ధురంధరులగుట ప్రసిద్ధమే, శ్రీనాథుఁడు అల్లాడ, వేమ, వీరభద్రారెడ్ల మంత్రియైన బెండపూడి యన్నయామాత్యుని గురించి—

"అన్నయ మంత్రిశేఖరుఁ డహమ్మదుషా సురధాణ భూమిభృ
త్సన్నిధికి స్గడున్నముచితంబుగ వేమ మహీసురేంద్ర రా
జ్యోన్నతి సంతతాభ్యుదయ మొందఁగఁ బారసి భాష వ్రాసినం
గన్నులపండువై యమరుఁ గాగితమందలి వర్ణ పద్ధతుల్"
—భీమేశ్వర పురాణము. 1–74

అని వర్ణించెను. రామకృష్ణుఁడు వేదాద్రిమంత్రిని మొదటి పద్యమునందే "విరూరి పట్టణపతిన్" అని పేర్కొనెను. దీనిని బట్టి వేదాద్రి కరణమని తలంపవచ్చును.

---

[3] M. Somasekhara Sarma: History of Reddi Kingdoms, page 511.

కాని పైయంశములను బరిశీలింపఁగా గ్రామాధికారిమాత్రమేకాక పెద్ద సంగభూపాలుని రాజ్యాంగమునం దధికార సంబంధముగల యే దండనాయకునివంటి వాఁడో కావచ్చును. అయినను నతని ప్రాభవముకంటెఁ బైని వివరించిన యాధ్యాత్మిక ప్రతిపత్తి రామకృష్ణుఁ డంకిత మిచ్చుటకు ముఖ్యకారణము. దేశమంత్రి. వేదాద్రి మంత్రి – ఈ యుభయుల సామ్యము గమనార్హమైనదే!

రామకృష్ణుని రచనలోని పురాణ లక్షణములు

ఉత్తమ కావ్యములను బ్రబంధ మార్గములలో సంతరించినవాఁడయ్యు నీ కవి పురాణములయం దత్యంతాదరము గలవాఁడు. కృతులందుఁ గావ్యత్వమునకు భంగము గలుగనీయని విధమునఁ బురాణత్వమును గూడ సుప్రతిష్ఠితము చేయుటయొక శోభగా నీతఁడు భావించినాఁడు.

"ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని" యను నన్నయ పద్యములోని క్రాంతదర్శన మీ కవిదృష్టి నాకర్షించియుండును. పూర్వకవిస్తుతులతోఁగూడ నితఁడు పురాణకావ్యకర్తలగు వ్యాసవాల్మీకులను, వారికృతులను "నేర్పుమీఱంగ నిజ కావ్యదర్పణముల బాలబోధకముగ నేరుపఱచు కీర్తిధవుల నన్నయభట్టాదికవుల"ను -1-12- బ్రశంసించినాఁడీ కవి. ఉద్భట చరిత్రయందుఁగూడఁ గవిస్తుతి వేయుచోఁ బురాణకావ్యకర్తలైన యాదికవులనే స్మరించినాఁడితఁడు.

"సంసారాహ్వయసింధు పోతము జగత్సంబోధదీపాంకురున్
కంసారాతిపదాబ్జ బంభరము సాక్షాత్పద్మ గర్భున్ బుధో
త్తంసంబున్ శ్రుతి సంకరోద్ధరణ పాథః క్షీరభేదక్రియా
హంసంబున్ బరిశీలితప స్మృతిరసున్ వ్యాసున్ బ్రశంసించెదన్"

"శ్రీరామాయణదుగ్ధాం భోరాశి సుధామయూఖు బుధవినుతగుణో
ధాః రుధాః నఘమత్తవారణ, వారణరిపుఁబ్రస్తుతింతు వాల్మీకమునిన్"
—ఉద్భటారాధ్యచరిత్రము. 1-10, 11.

వ్యాసవాల్మీకుల రచనామార్గమునందును, శ్రుతిస్మృత్యుదిత భారతీయ సంప్రదాయమునందు నీ కవికిఁగల యాదరాభిమానములను దెలియఁజేయుటకీ కవిస్తుతులు నిదర్శనములు. ఒకప్రక్కనురసాలంకారధ్వన్యాత్మకమైన, గుణసమగ్రమైన ప్రబంధరచనామార్గమునందెంతవిలువయున్నదో మఱియొకప్రక్కఁ బురాణాత్మకమైన వేదమార్గప్రతిష్ఠాపనాధృతియు నంత యున్న దీ కవికి. ఇతనికి "శైవ వైష్ణవపురాణావళి నానార్థములు గరతలామలకములు"-1-23-, "గీతార్థసారసంకేతవేదు"లను, "దివ్యప్రబంధానుసంధాత"లను, "నవ్యవైష్ణవ పురాణచతుష్టయజ్ఞ" లను, "నిజసమయావన నిపుణబుద్ధు" లను, "సరసరామాయణనవకాండజ్ఞాత" లను స్మరించుటే కవికెంతయు నంతసము నొనగూర్చును-1-38-, "వేదమార్గప్రతిష్ఠాదైవతజ్యేష్ఠు"లు, "నభ్యస్తషడ్దర్శనార్థరాశు" లు, "నఖిల పురాణేతిహాసకర్త"లు నీయనకుఁ బూజనీయులు -1-77-, "బహువేద వివేక పవిత్రభావ

సంకలితములైన వాక్యములఁ గావ్యముఁ జెప్పఁగనేర్తువ" నియు, "నాదికావ్యల కవితానిగుంభన సమున్నతిఁ గాంచినవాఁడవౌదు" వనియు ననిపించుకొనుట యీ కవీంద్రునకు జీవితాశయముగాఁ గనుపించును. ఈ సంప్రదాయశుద్ధమగు కవితా సిద్ధివలన నీయన లేఖిని సకల పురాణ సంప్రదాయము లనెడి పొంగుపయో నిధులను దనకావ్యకలాపమును పుడిసిటఁబట్టినది.

1. ఈయన రచనలలోఁ గనుపించు పురాణ సంప్రదాయములలో మొదటిది నైమిశారణ్యము, సూతుఁడు, శౌనకాది మునులును. తన మూఁడు ప్రబంధములకును గధా కథనభూమిక యిదియే. ఘటికాచల మాహాత్మ్యము మొదటి పద్యమునే యిట్లారంభించినాడు.

"శ్రీలన్ రాజిలు నైమిశంబునఁ దపస్వి శ్రేణి పౌరాణిక
త్వాలంకార సమేతు సూతుఁగని పద్మాధీశ సద్మంబునన్
శ్రీలీలానిరవద్య మాద్యము మారుత్సేవ్యంబు భవ్యంబుగా
నాలోకించి యొకండు గల్గిన మహాత్మ్మ తెల్పవే నీవుడన్" –ఘటి.1–1.

ఉద్భటారాధ్య చరిత్రము కథారంభము మొదటి పద్యము :

"గణ్యము దండక ప్రముఖ కానన కోటులయందు నర్వవై
గుణ్యని వారణక్షమ మకుంఠిత వైభవ శోభితంబు స
త్పుణ్య ఫలాది కారణము భూనుతిపాత్రమునైన నైమిశా
రణ్యము – తేజరిల్లు – మునిరాజ నికేతన భాసమానమై"
—ఉద్భ. 1 – 53.

అచ్చట సూతుఁడు శౌనకాది మునులకు "బాలశశాంక శేఖరుని భవ్య చరిత్రము" తెలుపును. ఇకఁ బాండురంగ మాహాత్మ్యము కధారంభము.

"తులితోక్షధ్వజసూతుఁడై వెలయు సూతుంగాంచిమున్ శౌనకా
దులు క్షేత్రంబును వేల్పుఁదీర్థము బుధస్తుత్యప్రభావంబులై
దశతైన స్థిమిరంబులై యిహపరార్థప్రాప్తి మూలంబులై
యిలపై నొక్కెడఁ గల్గెనే ననఘమూర్తీ ! తెల్పవేనావుడున్" —1 – 96.

"ఆ ఋషుల ప్రశ్నమంగీ, కారంబొనరించి పలుకుఁగథకుఁడు శ్రీనా
థారాధసహిత చర్యున్, బారాశర్యుందలంచి ప్రాంజలియగుచున్"
—1 – 97

"... ....వినుండని సూతుండిట్లనియె" —1 – 98.

ఈ పురాణ సంప్రదాయము ప్రబంధముల పెక్కింటియందుఁ గన్పించును. వసుచరిత్ర మున్నగు బహు గ్రంథములలో సూతుఁడే కథకుఁడు. శౌనకాదులు శ్రోతలు. అయా కవులకుఁగూడఁ బురాణమార్గములయెడల గౌరవమే యిందు లకుఁ గారణము.

2. పురాణ రచనా సంప్రదాయములలో రెండవది కథాప్రస్తావనము. కవిప్రత్యక్షముగాఁ గథ నారంభింపఁడు. తొలుతనే యీ వృత్తాంతము నొక రొకరితోఁ జెప్పియుండిరనియు, నదేవిధమునఁ దాను రచింతుననియు నారంభించును. ఉదాహరణకు వ్యాసరచిత భారతము ఋషులు యాగసమయమునఁ జెప్పుకొనినట్లున్నది గదా! ఈ యాఖ్యానము జనమేజయునకు వైశంపాయనుఁడు చెప్పినట్లున్నది! అట్లే యారణ్య పర్వమునఁగల నలోపాఖ్యాన సావిత్ర్యుపాఖ్యానములను గ్రంథకర్త సూటిగాఁ జెప్పక ఋషులు ధర్మజునకుఁ జెప్పినట్లున్నది. మఱియుఁ బెక్కు కథలు భీష్ముఁడు ధర్మజునకుఁ జెప్పినట్లున్నది.

పాండురంగ మాహాత్మ్యమున నీ సంప్రదాయము పాటింపఁబడినది. సూతుఁడు శౌనకాది మునులకుఁ జెప్పిన యీ కథాకథనము వ్యాసరచితముగాఁ గల్పింపఁబడినది. మఱల నా కథాకథనము శివుఁడు పార్వతికిని, గుమారునకును, ఋషులకును జేసినట్లున్నది.

"కృష్ణద్వైపాయనువలన మున్నెఱింగినయది కలదు" —1 - 98. "ఆగో కర్ణకుండలుండు సకుమారంబుగాఁ గొండరాఁ మాలింగనుంగొని" —2 – 3.

3. ప్రస్తావిత కథకు యుగ పరిభాషలోఁ గాలనిర్దేశము చేయుట. "అదికల్పంబు నందలి పదునెనిమిదవ ద్వాపరంబు కడకందువ శతానందాది... ......పుండరీకాక్షుండు పాండురంగాహ్వయమునం బుండరీకుండను........" 2 – 4, శైవ వైష్ణవ, శక్తి తత్వముల యొక్కయు, మంత్ర, హఠ, రాజయోగముల యొక్కయుఁ బరిపూర్ణతత్వ వివరణము.

భక్తుల కథలు ప్రాధాన్యము వహించుట, భగవదవతార వర్ణనము, తత్కారణములు, లీలలు ప్రధానముగ వర్ణింపబడుట. జగద్వ్యూహములను, సృష్టిస్థితిలయములను, లోకాలోకాంతరములను వివరించుట, వర్ణాశ్రమ ధర్మములను స్థాపించుట, బహువిధములైన శాస్త్ర పరిజ్ఞానమును గ్రంథమునఁ బ్రతిపాదించుట.

ఈ లక్షణముల సమాహారమువలన పాండురంగ మాహాత్మ్యమునందుఁ బురాణ లక్షణములు యథాతథముగా రూపొందినవి. ఘటికాచల మాహాత్మ్యమునకూడ నున్నంతలో గ్రంథపరిణామము ననుసరించి ఈ లక్షణములున్నవి. నూటయెనిమిది దివ్యతిరుపతుల వర్ణనము, ఆ క్షేత్రముల మహిమలు, లక్ష్మీనృసింహావతార వర్ణనము పురాణలక్షణములే. ఇఁక నుద్భటారాధ్య చరిత్రమునఁ గొంతవఱకును గేవల ప్రబంధకావ్య లక్షణములు ప్రాధాన్యము వహించినవి. అయినను గంధర్వులు శాపము బొందుట, యుద్భటుఁడు శివుని సంకల్పమువలన భూమికి మరల దిగివచ్చి శివధర్మమును లోకమునఁ బ్రతిష్ఠాపనము చేయుట పురాణకథాకథన లక్షణములే.

ఇఁకఁ బద్యరచనలో మాత్రము మూఁడు గ్రంథములును గేవల కావ్యమార్గముననే నడచినవి. కథాకథనము పురాణ సంప్రదాయముననను, రచనా పద్ధతి

కావ్యసంప్రదాయమునను నడువుటలో నిట్టి కవులందఱకుఁ గవిత్రయమే మార్గదర్శకులు. రచనలో నెక్కువ భాగము ప్రబంధోచితముగను, దక్కువభాగము పురాణోచితముగను గనుపించును. కవిత్రయము వారి రచనలోఁగల పురాణోచితమయిన స్వచ్ఛ సరళ శైలి మాత్రము కవిత్రయము వారికివలె వీరిలో నెవ్వరికి నలవడలేదనుట సత్యము. రచన యలంకార, చమత్కార ప్రధానమైనప్పుడు గ్రంథము ప్రబంధవైఖరినే యెక్కువగా నలవరచుకొనును. ధ్వని, యర్థ గంభీరత, శబ్దార్థ సరళత, ప్రసాదగుణము కథాకథనమందుఁ బ్రసన్న మందగమనము ప్రాధాన్యము వహించి గ్రంథము వస్తుప్రధానమైనప్పుడు రసపోషణముగూడ మిక్కుటముగ నున్నను రచన పురాణ గౌరవమును బొందును. ఈ లక్షణములన్నియు గల్గియు వస్త్వైక్యము, అలంకారిక ప్రౌఢశైలి నెలకొనుటచే ఎఱ్ఱన నృసింహపురాణము పురాణగౌరవముతోపాటు ప్రబంధగౌరమును గూడఁ బుణికిపుచ్చుకొనినది. అంతకన్నఁ దక్కువ పురాణత్వము, నెక్కువ ప్రబంధత్వము శ్రీనాథుని భీమేశ్వర పురాణమునఁ గనుపించును. అంతకన్నఁ దక్కువ పురాణత్వము పాండురంగ మాహాత్మ్యము, కాళహస్తీశ్వర మాహాత్మ్యములలోఁ గనుపించును. భీమఖండములోని రచనలో నిస్సందేహముగాఁ బురాణోచితమైన ప్రసన్నతయున్నది. అనువాదములు కానట్టి స్వతంత్ర రచనలలోఁ బురాణమార్గమును దీర్చి దిద్దుట ఏ కారణజన్ముఁడైన కవికో గాని సాధ్యపడు విషయము కాదు.

కథాకథనమున గ్రంథారంభమునందు నగస్త్యలోపాముద్రల ప్రయాణవర్ణనము కొంతవఱకుఁ బురాణశైలిలో సాఁగినది. అందు భీమఖండములోని అగస్త్యుని దక్షిణాపథాగమన ప్రయాణము ననుసరించిన ఛాయలు పొడకట్టును. "పుడిసిట బట్టెనే తపసి" – 1 – 122 –, "వనితాచూచితే మాల్యవంతము" – 1 – 130, "ఓ లలితాంగి యిందు సుఖముండు" – 1 – 133, "భూరితరాభ్రవిభ్రమము" – 1 – 135, "పద్మినీపద్మాతపత్రంబు" – 1 – 136, "గంగా సంగమ మిచ్చగించునె" – 1 – 139 "అని కొనియాడి" – 1 – 141 – యను పద్యములు మాత్రము సత్వగుణప్రధానమయిన చక్కని పురాణశైలిలో నడచినవి. ఈ ఘట్టమునందలి కుమారాగస్త్య సంవాదమునఁ గూడఁ బురాణోచితమయిన రచన యున్నది. సుశీలవృత్తాంతమున నెక్కువ భాగము, అయుతనియుతోపాఖ్యానమునఁ జివరిభాగము, వివిధక్షేత్ర తీర్థముల మహిమాను వర్ణనములు పురాణోచితశైలిలోనే నడచినవి. ఘటికాచల మాహాత్మ్యమున నెక్కువ భాగము పురాణమార్గమున నడచినను, బురాణ కవిత్వమునకుఁ గావలసిన గాంభీర్యమెక్కువగా సిద్ధింపలేదు. దీనికిఁ గారణమది యతని యప్రౌఢదశలో రచనమగుటయే. మూఁడు కావ్యములలోను – బురాణత్వము పాండురంగ మహాత్మ్య రచనలోనే యెక్కువగా గనిపించును. అది యతని ప్రౌఢనిర్భర వయస్సు, దివ్యతత్త్వాన్వేషణము నతడు నెఱపిన సాధనమునఁ బరిపూర్ణత కావచ్చును. ఈ కావ్యములోని పురాణమార్గానుసరణమునఁ గవిత్రయము ప్రభావమేగాక, పోతన ప్రభావము కూడ స్పష్టముగాఁ గనిపించును. "వనితాజూచితె మాల్యవంతము" – 1 – 130 – మున్నగు పద్యము లిటఁ బరిశీలింపఁదగినవి. లక్ష్యమెంతవఱకు

సిద్ధించినను నీ కవికిఁ బురాణ రచనాసంప్రదాయము నెడ గౌరవము మిక్కుటమని స్పష్టముగాఁ దెలియుచున్నది.

పాండురంగ మాహాత్మ్యము ప్రబంధ మనఁదగునా ?

రాయల యుగమున వెలువడిన విశిష్టమైన యొక కావ్య ప్రక్రియకుఁ బ్రబంధమను సంకేతము విమర్శకు లెల్లరచే నంగీకృతమైనది. ఆనాటి కావ్య జాలమును బర్యాలోకన మొనర్చి యందలి సమాన గుణములను బ్రాధాన్యవివక్షచే నిర్ణయించి, ప్రబంధ శబ్దము నా గుణసమాహారమున కుపలక్షణముగా స్వీకరించి లక్షణలక్షితమగు నిర్వచన మేర్పఱచినవారు పింగళి లక్ష్మీకాంతము. ఆ యుగమునందలి పెక్కు ప్రబంధములలోఁ బ్రముఖములలోఁ బాండురంగ మాహాత్మ్య మొకటిగా గుర్తింపఁబడినది. కాని స్థలమాహాత్మ్యము, బహుకథల సంపుటమునగు నీ కావ్యమునకుఁ బ్రబంధత్వము సిద్ధించునాయని శంకించిన వారును గలరు. ఈ శంక కాళహస్తీశ్వర మాహాత్మ్యము, ఆముక్తమాల్యదలకును, గొంతవఱకు మనుచరిత్రకునుగూడ వర్తించును. ఈ సందర్భమునఁ బెద్దలగు నాధునిక విమర్శకులు నిర్దేశించిన ప్రబంధ లక్షణములను బరిశీలించి యీ కావ్యమున కవి యెంతవఱ కన్వయించునో నిర్ణయించుకొనవలసి యున్నది.

1. ప్రబంధ శబ్ద నిర్వచనము : ప్రబంధమను పదము సంస్కృత వాఙ్మయమున నతి ప్రాచీనమైనది. అలంకారికులు, కవులు, వ్యాఖ్యాతలు నీ పదమును గావ్య శబ్దమునకుఁ బర్యాయముగా వాడినారు. అంతియకాని యొక నిర్దిష్టమగు సారస్వత ప్రక్రియను సూచించుటకు వాడలేదు. సాహిత్యదర్పణ గ్రంథకర్తయగు విశ్వనాథుని ప్రకారము మహాభారతము, రామాయణము, మాలతీమాధవాది రూపక జాలమును బ్రబంధములుగాఁ జెప్పఁబడినవి. తన యలంకార గ్రంథముగూడఁ బ్రబంధమనియే చెప్పినాఁడు.

కాళిదాసు తనకంటెఁ బూర్వులైన భాస, సౌమిల్లక, కవిపుత్రాదుల నాటకములను బ్రబంధపదమునఁ బేర్కొనినాఁడు. శృంగార ప్రకాశమును రచించిన భోజుని ప్రకారము ప్రబంధము ప్రేక్ష్యము, శ్రవ్యము కూడను. కావ్యభేదముల పట్టికలలోఁ బ్రబంధమను ప్రక్రియ వేఱుగాఁ గనుపింపదు. ఆనందవర్ధనాచార్యుఁడు మాత్రము "సమాప్తయామ ప్యవాంతరక్రియాయాం వసంతాద్యేకతమవస్తు వర్ణనాత్మకః ప్రబంధః" అనియు, "ఆఖ్యాయికా క్వాచిత్క వక్త్రపరవక్త్రాదిచ్ఛందస్క ఉచ్ఛ్వాసాశ్వాసాదిద విభాగభాగే గద్య ప్రచురః ప్రబంధః" అనియు, పేర్కొని నాడు. "కథా సజ్జనదుర్జన వృత్తాంత వర్ణనపరః క్వాచిత్కార్యావక్త్రాయుక్త ఆశ్వాసాది శూన్యో గద్యమయః ప్రబంధః" సర్గాదిబంధయుతమైన నిబద్ధ కావ్యమును సంస్కృతాలంకారికులు, కవులును బ్రబంధమనినా రనుట నిజము.

సంస్కృతమున దండి తన కావ్యాదర్శమున సర్గబంధమనఁబడు మహా కావ్యమునకుఁ జెప్పిన లక్షణములు చాలవఱకుఁ దెనుఁగున బ్రబంధమను

ప్రక్రియకు సరిపడును. అప్పకవికూడఁ బ్రబంధమును సర్గబంధమునకు సమాన మనినాఁడు.

"అట్టి కావ్యము ద్వివిధమై యతిశయిల్లుఁ
బరువడిఁ బ్రబంధ చాటు ప్రబంధములన
సర్గముల సంస్కృతమున నాశ్వాసములను
దెనుఁగునఁ బ్రబంధ మనునది తనరుఁ గృష్ణ! — అప్పకవీయము 1–27.

సర్గబంధలక్షణ మిట్లున్నది.

"సర్గబంధోమహాకావ్యముచ్యతేతస్యలక్షణమ్
ఆశీర్నమస్క్రియావస్తు నిర్దేశోవాపితన్ముఖమ్ ॥
ఇతిహాసకథోద్భూత మితరద్వాసదాశ్రయమ్
చతుర్వర్గఫలో పేతం చతురోదాత్తనాయకమ్ ॥
నగరార్ణవ శైలర్తు చంద్రార్కోదయవర్ణనైః
ఉద్యానసలిలక్రీడా మధుపానరతోత్సవైః ॥
విప్రలంభైర్వివాహైశ్చకుమారోదయవర్ణనైః
మంత్రదూతప్రయాణాదినాయకాభ్యుదయైరపి
అలంకృతమసంక్షిప్తం రసభావనిరంతరమ్
సర్గైరనతివిస్తీర్ణైః శ్రవ్యవృత్తైః సుసంధిభిః ॥
సర్వత్ర భిన్నవృత్తాంతైరుపేతంలోకరంజనమ్
కావ్యంకల్పాంతరస్థాయి జాయేత సదలంకృతిః ॥
న్యూనమప్యత్రయైః కైశ్చిదంగైః కావ్యంనదుష్యతి"
— కావ్యాదర్శము, దండి –పరి. 11 – శ్లో. 14 నుండి 20 వఱకు

పాండురంగ మాహాత్మ్య మీ లక్షణమునకు సూటిగా సరిపోవును. ఇం దాశీర్వాదముతోఁ గావ్య మారంభింపఁబడుట – శ్రీకాంతామణియను పద్యము –, పద్మపురాణ కథయగు పుండరీకుని కథ. సదాశ్రయములైన యితర కథలు – సుశీలకథ మున్నగునవి – చతుర్వర్గఫలోపేతములగు కథలే యీ గ్రంథమున నున్నవి. పుండరీకుఁడు, సుశీల కథలలో ధర్మాచరణము మూలమున, కాకి కథలో నర్థార్థియగుట మూలమున, నిగమశర్మకథలోఁగామార్థియై యీషణత్ర యమున బద్ధుఁడై తద్విశ్లేష నిమిత్తముగాఁ "బార్వసంస్కారము పదేశిమ" మగుట మూలమున జీవుఁడు తరించుటను వర్ణించు కథలీ కావ్యమునఁ బ్రాధా న్యము వహించును. చతురోదాత్తనాయకుఁడు పుండరీకుఁడు. నగరాది వర్ణన లన్నియు లీరుబోక యిందు వర్ణింపఁబడినవి, కాశీపురము, వైకుంఠము నగర వర్ణనములు, పార్వతీ పరమేశ్వరుల యుద్యాన విహారము, మేరు వింధ్య హిమాలయాది శైలములు, వసంత గ్రీష్మ వర్షా శరదృతువులు, జాతర సం దర్భమునఁ జంద్రోదయము, పానోత్సవము, నిగమశర్మ పరముగా రతివర్ణనము, జాతరగా నుత్సవ వర్ణనము, నిగమశర్మ జననమునఁ బుత్రోత్సవ వర్ణనము, పియుతుని వివాహము మున్నగు లాక్షణికోక్త వర్ణనములిందున్నవి.

"క్రైశ్చికేదం గైఃసూన" మను విధమునఁ గొన్ని వర్ణనలు విడువఁబడినవి. అలంకృతమైన రచన. అసంక్షిప్తమైన కావ్యము, రసభావములు పుష్కలముగా నైరంతర్యము వహించినవి. సర్వత్ర భిన్న వృత్తాంతమగు నుపాఖ్యానజాల మున్నది.

ఇఁక "సుసంధిభిః" యని దండి చెప్పిన లక్షణమును గూర్చి యించుక పరిశీలింప వలసియున్నది. సంధి శబ్దమునకుఁ గథాగతములైన పంచసంధులని చెప్పినచోఁ బాండురంగ మాహాత్మ్యము నందలి ముఖ్యమైన కథలలో నొక్కొక్క దానియందవి వేఱు వేఱుగా సిద్ధించినవి. పుండరీకుని కథయందును, సుశీల కథయందును నీయుతుని చరిత్రమందును సమగ్రముగాఁ బంచసంధు లున్నవి. రాధకథయం దంతకన్నఁ దక్కువగా సిద్ధించినవి. నిగమశర్మకథ యందును గించిదూనముగాఁ బంచసంధుల నిర్మాణ మున్నది, సుశర్మోపాఖ్యానము మున్నగు చిన్న కథలలోఁగూడ నీ సంధులు నెలకొనినవి.

ఇఁక నీకథల కన్నిటికినిఁ బరస్పర సంబంధ మేర్పఱచుటలోఁగూడఁ జక్కని కార్యకారణక్రమ ముండుటవలన మొత్తము కావ్యమునకే సుసంధులు వర్తించిను. సర్వకథలును శ్రీకృష్ణుని యవతారకథతో సుశ్లిష్టమైన సంధిబంధ మును గలిగియున్నవి. పరమేశ్వరుఁడు గురువుగా స్కందున కుపదేశింపఁబడిన దేవకీనందను సత్కథోద్యమమైన యుపదేశము ప్రధాన వస్తు వగుటవలన దానికి స్కందపురాణ నీరనిధిత్వ మనఁదగు వస్త్వైక్యమునందు "సుసంధి" శబ్దము సమగ్రముగా వర్తించును.

విష్ణువు పాండురంగాకృతినిఁ బుండరీకునకు బ్రత్యక్షమైనప్పు డతఁడు కోరిన వరము నందే యీ కావ్యమందలి సత్కథోద్యమమున కెల్ల సుశ్లిష్టమైన సంధి బంధ మేర్పడినది. అతఁడిట్లు కోరినాఁడు :

> ".. ....అద్భుతార్థ మర్థింతు
> విపుడున్నయట్ల యన్మన్నామ చిహ్నితైతన్మహాక్షేత్రతీర్థ
> మధ్యతలమున నిలువు నామనవిఁజేసి సకలజనులకు మోక్ష రాజ్యంబు
> నొఁగుచు"
>
> —పాండు. 4 – 110.

ఈ వరము ననుసరించి మోక్ష రాజ్యము నొసఁగబడినవారే తక్కిన కథలలోని ముఖ్యపాత్ర లెల్లరును. కనుక నీ యుపాఖ్యానము లన్నియు నీ వరమున నుసంధినిఁ గనుగొనినవి. కనుక నీ కావ్యము సంస్కృత లాక్షణికులు వర్గబంధమని చెప్పిన లక్షణమునకు సరిపోవుచున్నది.

ఇఁక నవ్యవిమర్శకాచార్యులు నిర్వచించిన ప్రబంధ లక్షణములకు సరిపడు చున్నదేమో పరిశీలింతము. వారు చెప్పిన ప్రబంధలక్షణము లిట్లున్నవి :

"ప్రబంధములకేక నాయకాశ్రయత్వముతోపాటు వస్త్వైకమును నపరిహార్యమైన ధర్మము .... ప్రబంధమునకు శృంగారము జీవగఱ. మిగిలిన

రసములు గౌణములు. రసముతోపాటు తదుద్దీపన విభావములగు నుద్యానవన విహారాదులు, చంద్రాద్యుపాలంభనములు, విరహవేదనలు, శిరోపచార ములు – నన్నిగాని, కొన్నిగాని యుండుననియే తలంపనగును. శృంగారరస ప్రాధాన్యముతోపా టాలంకారికమయినరీతి వీరికి ప్రాణము......కథైక్యమును, నష్టాదశ వర్ణనలును గలిగి, శృంగారరసప్రధానమై, యర్థాతిశాయియైన శబ్దమును గ్రహించి. యాలంకారిక సాంకేతికములకు విధేయమై, యనతి విస్తృతిగల యితివృత్తముతో భాషాంతరీకరణము గాక, స్వతంత్రరచనయేయైన తెనుఁగు కావ్యము ప్రబంధము."[4]

1. "ప్రబంధమునకు ఏకనాయకత్వము, దానితోపాటు వస్త్వైక్యము ప్రధాన ధర్మములు.

2. ప్రబంధము అష్టాదశ వర్ణనాత్మకమై యుండవలెను.

3. అందు శృంగారము ప్రధానరసము, ఆవశ్యకతనుబట్టి తక్కిన రస ములు గౌణములు కావచ్చును.

4. అలంకారికమైన శైలి ప్రబంధమునకు జీవము.

5. ప్రబంధము భాషాంతరీకరణము కాకూడదు."[5]

పై లక్షణములలో 2, 4, 5వ లక్షణములు పాండురంగ మాహాత్మ్యమునకుఁ బూర్తిగా వర్తించును. 1, 3 లక్షణములు వర్తింపకున్నను నిది ప్రబంధ మగునా? వస్త్వైక్యము విషయమున మనుచరిత్ర, ఆముక్తమాల్యద, కాళహస్తీ శ్వర మాహాత్మ్యములకుఁగూడ నీ సమస్య యున్నది. కనుక "పదునారవ శతాబ్ది ఆది నుండి వెలువడిన మనుచరిత్రాదికావ్యము లన్నిటికి పైన పేర్కొనిన లక్ష ణము లన్నియు సమగ్రముగా పట్టినను, పట్టకున్నను స్వతంత్ర రచన లగుట చేతను, అలంకారిక శైలీశోభితములగుటచేతను అవన్నియు ప్రబంధములు గానే పరిగణింపఁబడినవి."[6]

"ప్రబంధయుగము యథార్థముగాఁ బ్రవర్తిల్లిన పిమ్మట కూడ ప్రబంధ లక్షణములన్నియు పట్టని కావ్యములు కొన్ని కలవు. ఉదాహరణార్థము పాండురంగ మాహాత్మ్యము, శ్రీ కాళహస్తీశ్వర మాహాత్మ్యము గైకొనదగును. ఈ రెండును క్షేత్ర మాహాత్మ్యములు. వీనిలో మను, వసుచరిత్రలలోవలె వస్త్వైక్యము లేదు. అయినను అట్టి క్షేత్ర మాహాత్మ్యములు స్వతంత్ర రచన

---

[4] ఆచార్య కె. వి. ఆర్. నరసింహము ; ఆంధ్రప్రబంధము – అవతరణ వికాస ములు, పు. 12, 13.

[5] ఆచార్య పింగళి లక్ష్మీకాంతము ; ప్రబంధయుగము, తెనుగు విజ్ఞానసర్వస్వము, సంపుటము 3, పుట 608.

[6] – పైది –

లగుటచేత, ప్రాబంధికమైన ప్రౌఢశైలిలో రచింపఁబడుటచేత, యథోచితములైన వర్ణనలతో కథలు అలంకరింపఁబడుటచేత ఈ యుగమునందలి యథార్థ ప్రబంధములతోబాటు వీనిని కూడ ప్రబంధములుగానే పరిగణించిరి."[7]

ప్రబంధ లక్షణమున కిట్టి వ్యాఖ్యానము చేయుటవలన 2, 4, 5వ లక్షణములే ప్రాధాన్యము వహించును. వస్త్వైక్యము లేదని కొందఱు శంకించుటచేఁ బాండురంగ మాహాత్మ్యము నవ్యాంధ్ర లక్షణాచార్యుల ప్రణాళిక ననుసరించి "యథార్థ ప్రబంధము" లలోఁ జేరక "ప్రబంధముగాఁ బరిగణింపఁ బడుచున్నది." ఈ నవ్యలాక్షణికులు చెప్పిన వస్త్వైక్యము వాస్తవమునకు వసుచరిత్రలోనున్నంతగా మనుచరిత్రలోలేదు. మనుచరిత్రలో నున్నంత పాండురంగ మాహాత్మ్యమున లేదు. ధూర్జటి రామకృష్ణాదికవులు ప్రాచీనులగుట, యీ వస్త్వైక్యము ఆ కవుల కర్వాచీనులగు లాక్షణికులు ప్రతి పాదించిన దగుటయే దీనికిఁ గారణము. ప్రబంధ శబ్దమును బ్రత్యేకార్థమున నా కవులెవ్వరును గైకొనలేదనుట స్పష్టము. రామకృష్ణకవి పాండురంగ మహాత్మ్య రచనను గూర్చి "యభినవ ప్రబంధ నిర్మాణ" మనియుఁ, "గావ్యకళాకలాప" మనియు "శ్రీ భాగవత చరిత్రం" బనియుఁ జెప్పినాఁడు. దీనినిబట్టి యితఁడు కూఁడ ప్రబంధమును గావ్య సామాన్యవాచిగనే వాడె ననుట స్పష్టము.

వస్త్వైక్యము : ఈ పదము నవ్యవిమర్శకాచార్యులచేఁ బ్రతిపాదితము. సంస్కృతాంధ్ర ప్రాచీనాలంకారికుల నిర్దేశములం దిది కనుపింపదు. ఆంగ్ల వాఙ్మయ విమర్శకుల రచనలలో Unity of Plot అనునది దీనికి సమానార్థకమైనది యున్నది. ఒకే ప్రధానకథావస్తువుండి యందలి భిన్నాంశములకుఁ గార్య కారణ సంబంధము సూటిగా నుండుట దీని లక్షణము. కొన్ని యుపాఖ్యానము లున్నను బరిమిత విస్తృతి గలవియై యుండి ప్రధాన కథతో సంగాంగిభావ సంబంధమును గలిగి యుండవలెను.[8] రసవిషయమునఁ గూడ నిట్టి సంబంధమే యుండవలెను. భారతీయ వాఙ్మయలక్షణకారులు నాటకకథావస్తువున కిట్టి నియమము చేయుట, కవులు యథా సంభవముగాఁ బాటించుటయు జరిగినది. సంస్కృత మహాకావ్యములలో నగ్రస్థానము వహించు రఘువంశాది కావ్యములలోఁ గూడఁ బెక్కింటిలో నీ నియమములేదు. కనుకనే పింగళి లక్ష్మీకాంతము మున్నగు నవీన లక్షణకారులు కూడ "పదునారవ శతాబ్ది ఆదినుండి వెలువడిన మను

---

[7] పింగళి లక్ష్మీకాంతము : ప్రబంధయుగము, తెనుగువిజ్ఞాన సర్వస్వము, సంపుటము 3, పుట 609.

A Plot does not have unity...simply because it deals with a single hero. Many and indeed innumerable things happen to an individual, some of which do not go to make up any unity, and similarly an individual is concerned in many actions which do not combine into a single piece of action.

—Aristotle, "The Poetics" VIII, 1. (Loeb Classical Library).

చరిత్రాదికావ్యము లన్నిటికి పైన పేర్కొన్న లక్షణములన్నియు సమగ్రముగా పట్టినను, పట్టకున్నను స్వతంత్రరచన లగుటచేతను, అలంకారికశైలీశోభితము లగుటచేతను అవన్నియు ప్రబంధములుగానే పరిగణింపబడినవి" అనియును, "వస్త్వైక్యము లేదు. అయినను అట్టి క్షేత్రమాహాత్మ్యములు స్వతంత్ర రచన లగుటచేత, ప్రాబంధికశైలిలో రచింపబడుటచేతఁ యథోచితములైన వర్ణనలతో కథలు అలంకరింపబడుటచేతఁ ఈ యుగమునందలి యథార్థప్రబంధములతో పాటు వీనినికూడ ప్రబంధములుగానే పరిగణించిరి" యనియును నిర్ణయించి చెప్పిన తావులందు వస్త్వైక్యము ప్రబంధములకుఁ దప్పనిసరి కాదనియు, మిగిలిన లక్షణములే యెక్కువ ప్రధానములనియు సూచించియున్నారు.

వస్తువు విషయమున క్షేత్రమాహాత్మ్యములకు సామాన్యముగాఁ బురాణ పద్ధతి సహజము. ఇరువురి సంభాషణ క్రమమునఁ గథలు వరుసగా వ్రాయఁ బడుట పురాణ పద్ధతి. ఈ కావ్యమున శివునకుఁ బార్వతితోను, గుమార స్వామితోను, నారదునితోను జరిగిన సంభాషణల క్రమమునఁ బౌండరీకక్షేత్ర ప్రశంస, తన్మహిమాను వర్ణనములైన కథలును రచింపఁబడినవి. ఆ కథలన్నిటి కిని లక్ష్య మొక పాండురంగ ప్రసక్తియే. ఉదా: పుండరీకుని కథ, రాధాదేవి కథ, అయుత నియుతుల కథయు నిట్టివే. ఇందు దేని కదియే యొక ప్రత్యేక ప్రబంధ మనవచ్చును. వీని కన్నిటికినిఁ బుండరీకుఁడు కోరిన వరమునందును, శివుఁడు చేసిన యుపదేశమందును మొత్తము కావ్యమునకు వస్త్వైక్యము సూక్ష్మ మార్గమున సిద్ధించినది.

పుండరీకుని కథ ప్రధానకథవలెఁ గనుపించును. దీనితో నొకవైపు, రాధాదేవికథతో నొకవైపును శ్రీ కృష్ణావతారవిషయ మంటిపెట్టుకొని యున్నది.

సుశీలకథతోఁ గాకి, చిలుక, హంసకథలు సంబంధము గలిగి యున్నవి. నిగమ శర్మ కథ పుండరీకుని వరముతో సంబంధించినది. అయుత నియుతుల కథయు నట్టిదే. అన్ని కథలయందును శివుఁడును, బాండురంగఁడు సమానమైన సంబంధము గలిగి పూసలలో దారమువలె నంతర్యామిత చెందియున్నారు. ఒకవైపు కృష్ణావతార కథతో రాధాదేవీ పుండరీకులకథలను జతపఱచి మఱి యొకవైపు సుశీల కథతోఁ గాకము, హంస, చిలుక, పాము, తేనెటీఁగ, ఆవుకథ లను గూర్చుచేసి మరల సుశీల కథలను గృష్ణావతార వృత్తాంతముతో నేక సూత్రత సాధించినాఁ డీ కవి. ఈ విధమైన వస్త్వైక్యము మిగిలిన క్షేత్రమహా త్మ్యములయందు సిద్ధింపలేదు. పెక్కు కథ లుండియు నిట్టి వస్త్వైక్యమునఁ బొసఁగుట ప్రశంసనీయము. ఆముక్తమాల్యదకథలో యామునాచార్య చరిత్రము, ఖాండిక్య కేశిధ్వజ సంవాదము, మాలదాసరి కథయుఁ బ్రధాన కథతో సంబంధించినవి కావు. అట్లేశ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యముననే రెండు కథల కును బరస్పర సంబంధము కల్పింపఁబడలేదు.

ప్రబంధము శృంగార రస ప్రధానము కావలెనను నియమము కూడ రాయల యుగమున వెలువడిన సర్వ ప్రబంధములకును వర్తింపదు. క్షేత్ర మాహాత్మ్య

ములకు మొదటే వర్తింపదు. దీని కొక్క యాముక్తమాల్యద యపవాదము. అందు గోదా శ్రీరంగనాధుల శృంగారమే ప్రధానము. మిగిలినవి యన్నియు భక్తిభావము, శాంతరసము ప్రధానముగాఁ గలవియే. క్షేత్రమాహాత్మ్యములు కాని ప్రబంధములలోఁ గూడ స్వారోచిష మనుసంభవము శృంగార ప్రధానము కాదు. దక్షిణాంధ్ర యుగమున వెలసిన ప్రబంధములలో నెన్ని శృంగార ప్రధానములో రాయల యుగమున నన్ని కావు. పాండురంగ మాహాత్మ్యమునఁ బార్వతీపరమేశ్వరుల యేకాంత విహారమునఁ బక్కని యుత్తమ శృంగార రసపోషణ మున్నది. ఇది కుమార సంభవములోని పార్వతీపరమేశ్వరుల శృంగారముతోఁ దులదూఁగుచున్న దనుటకు సందేహము లేదు. నిగమశర్మో పాఖ్యానమున వర్ణింపఁ బడిన శృంగారమంతయు"

"అనౌచిత్య ప్రవృత్తత్వే త్వాభాసోరస భావయోః"
"అనుచిత విభావాలంబనత్వం రసాభాసత్వం"

అను విశ్వనాధ జగన్నాధుల నిర్వచనానుసారముగ రసాభాసమే కాని రసముకాదు. అది దూషణభావముతోఁ గవి చేసిన వర్ణనము గదా! ముక్తకేశియను గోపిక కథలోఁ బోషించినది యాశ్చర్యజనకమగు దివ్యశృంగారము. అంతకుమించి యీ కావ్యమున శృంగారరస పోషణ మెచ్చటను గనుపింపదు. కనుక నిది శృంగారరసప్రధానకావ్య మనరాదు.'

శృంగారరస ప్రాధాన్యము లేదుగాని యీ కావ్యమున నాలంకారిక రచన మున్నగు నితరాంధ్ర ప్రబంధ లక్షణములు పరిపూర్ణముగా నన్వయించినవి. సంస్కృత సర్గబంధకావ్యలక్షణము ననుసరించి పూర్తిగా సరిపడినవి.

ఘటికాచల మాహాత్మ్యమును బ్రబంధ మనఁదగునా ?

పీఠికాకారుఁడగు వేంకటగిరి నిర్ణయము ప్రకారమిది ప్రబంధము. "ఘటికాచల మాహాత్మ్యంబను మహాప్రబంధంబు నకుంగధారంభం బెట్టిదనిన" – పీఠిక, వచనము. 60 –ఇందలి కథ యేకనాయకముకాదు. ధవళాంగుని కథ, నారదుని కథ, సప్తర్షుల తపస్సు, విఖనసుని యుత్పత్తి యను నాలుగు కథలున్నవి. మొదటికథకు మిగిలినవానితోఁ గార్యకారణ సంబంధములేదు. రెండవ కథకును లేదు. మూఁడు నాల్గు కథలకు లక్ష్మీనృసింహదేవునితో సంబంధ మున్నది. ఈ విధముగా నొక నాయకుఁడుండుటగాని, వస్త్వైక్యముగాని యిందు సిద్ధింపలేదు. శృంగారరసము ప్రాధాన్యము వహించినదిగాని కథ శృంగార రసప్రధానము కాదు. ఇదియే పురాణమునకును భాషాంతరీకరణము కాదు. బ్రహ్మకైవర్త పురాణమున నీ కథ యున్నదని కొందఱు చెప్పుదురు గాని యది ఘటికాచల నామసామ్యమువలనఁ గల్గినట్టి భ్రమయే. దక్షిణ భారతదేశప్రసిద్ధమగు నొకస్థల మాహాత్మ్య కథ. రచన యాలంకారికమైనది. సర్గబంధాంగములైన లక్షణములలోఁ గొన్ని యున్నవి. స్థలపురాణములకు రచనాపద్ధతినిబట్టి ప్రబంధత్వ మంగీకరించుటచే నిదియుఁ బ్రబంధమే.

ఉద్భటారాధ్య చరిత్రము ప్రబంధ మనఁదగునా?

దేచమంత్రి రామలింగనిని బిలిచి "రచింపుము కావ్య మొకటి వర్ణన కెక్కఁగ" -1-28- అనినాఁడు. రామలింగకవి "నా యొనర్పంబూనిన యీ మహాప్రబంధంబునకుఁ గథాక్రమం బెట్టిదనిన" -1-52- యని కావ్యారంభము చేసినాఁడు.

ఈ కావ్య మేకనాయకము. ఉద్భటారాధ్యుఁడు నాయకుఁడు. ముంజభోజునికథ, మదాలసునికథ యిందలి వస్త్వైక్యమునకుఁ గొంత ప్రతిబంధకము లేమాత్రము కావు. కథల కన్నిటికినిఁ జక్కని కార్యకారణ సంబంధమున్నది. మదాలసుని కథ వలన శృంగారరసపోషణముకొంత జరిగినది కాని కావ్యము శృంగారరస ప్రధానము కాదు గదా! ఇందలి కథయుఁ బురాణాదులనుండి గైకొనఁబడినది కాదు. భాషాంతరీకరణమునందినదియుఁగాదు. చరిత్ర ప్రసిద్ధుడైన యొక శివగురువుకథ, బసవపురాణాది శైవగ్రంథములలోఁ బ్రసిద్ధమైనది. రామలింగని రచనలో నుత్పాద్యవస్తువు పుష్టిగాంచినది. కనుక నిది స్వతంత్ర రచనగనే యెన్నబడును. రచనయాలంకారికమై రమ్యమైయున్నది. కావ్య గుణముల దృష్టితోఁ జూచిన నిది ఘటికాచల మాహాత్మ్యముకన్న గొప్పది. పాండురంగ మహాత్మ్యముకన్నఁ దక్కువది. లభ్యములయిన మూఁడు గ్రంథములలో నీ గ్రంథమును నిస్సంశయముగాఁ బ్రబంధమని యాంధ్రవిమర్శకుల సంకేతార్థమున వ్యవహరింపవచ్చును.

అలభ్య గ్రంథములు ప్రబంధములై యుండవచ్చునా?

1. హరిలీలావిలాసము: పేరునుబట్టి యిదియు శృంగార ప్రధానము కాఁదనిపించును. హరవిలాసమువలె నిదియు భక్తిభావప్రధానమైన విష్ణుగాథా సంపుటియై యుండవచ్చును. లభించిన పద్యములలో నొకటి పుష్పలావికా వర్ణనము. అయినను శృంగారరసప్రధానమని చెప్పలేము. ఆముక్తమాల్యద లోను బుష్పలావిక లున్నారు. మిగిలిన పద్యములలో శృంగారచ్ఛాయలులేవు. "కాలధనంజయుండు" అనుపద్యములోని కల్పననుబట్టి యది యుత్తమశ్రేణికిఁ జెందిన గంభీరప్రబంధమై. యుండుననియు. వర్ణనాత్మకమనియు, నాలంకారికమైన కావ్యమార్గమున సానలుదీరిన కావ్యమనియు నూహింపవచ్చును. వస్త్వైక్యము, భాషాంతరీకరణము విషయమున నేమియు జ్ఞేయము గాకుండుటచేత నది ప్రబంధ మనఁదగిన గ్రంథమని నొక్కిచెప్పఁజాలము.

2. కందర్పకేతు విలాసము[1]: పేరునుబట్టి శృంగారరసప్రధాన కావ్యమేమో యనిపించును. లభ్యములయిన నాలుగు పద్యములలో విరహవర్ణన ప్రాధాన్యము వహించియున్నది. ఇందు సంయోగవిప్రలంభశృంగారములు పరిపూర్ణముగాఁ బోషింపఁబడి యుండవచ్చును. రచన వర్ణనాత్మకము. అలంకార

[1] సుబంధుని వాసవదత్తా కథం స్వతంత్ర

ప్రధానము, కథ తెలియక పోవుటచేత భాషాంతరీకరణమగునా కాదా యను విషయముగాని, ఓాస్తైక్యము విషయముగాని నిరయింప ననువుపడదు.

లభ్యమైనంతవరకు నీ కవి కావ్యములన్నియు వర్ణనాప్రధానములు. నాలంకారికములునై ప్రబంధనముచితమైన రచన ఇతని ప్రధానలక్ష్యమని స్పష్టముగాఁ తెలుపుచున్నవి. కవి జీవించినదికూడఁ బ్రబంధయుగమునఁ గనుక నితఁడు సమకాలిక సామాన్యమైన రచనాపై ఖరి నాదరించె. పూర్వకవుల మార్గములను వికసింపఁ జేసితన వ్యక్తిత్వమును విస్పష్టముగా నిలబెట్టుకొనిన ప్రబంధకవియని నొక్కి చెప్పవచ్చును.

3. కావ్య పరిశీలనము

రామకృష్ణుని కావ్యముల పర్యాలోకనము

ఘటికాచల మాహాత్మ్యము

ఘటికాచల మాహాత్మ్యము మూఁడాశ్వాసముల వైష్ణవ గ్రంథము. చివరి పద్యములనుబట్టి ఇది సమగ్రముగా లభింపలేదనియు మఱి కొన్ని పద్యములు చివరిభాగమున నుండవలెననియుఁ దోఁచును. ఒక సీసపద్యము మూఁడవ పాదముతోఁ బ్రస్తుత లభ్య గ్రంథ మంతమగుచున్నది.

ఈ గ్రంథమునకుఁ గృత్యాదిని రామకృష్ణుడు రచింపలేదు. కనుక నప్పటి కతని పేరు రామలింగఁడనియో, రామకృష్ణుఁడనియో, దేనిని గ్రంథమున నిలుప దలఁచెనో చెప్పలేము. చిఖండోజీ విచిత్రరాయండను ప్రభువున కిది యంకితము. ఈ ఖండోజీ యెవఁడో తెలియుటకుఁ జారిత్రకాధారములు లభింపలేదు[1]. దక్షిణాంధ్రదేశప్రాంతమును బరిపాలించిన మహారాష్ట్ర వంశీయులలో నొకఁడని ఈ పేరునుబట్టి యూహింపవచ్చును. వీని యాస్థానకవియగు వేంకటగిరీంద్రుని సోదరుఁడు గిరిరాజకవి, శాహ, శరభ రాజేంద్రుల యాస్థానకవి. ఖండోజీయా రాజుల కించుమించుగా సమకాలికుండు గావచ్చును. చుట్టమైనను గావచ్చును. విచిత్రరాయని యాస్థానకవియగు వేంకట గిరీంద్రుఁడు 'రుక్మాంగద చరిత్రము' అభినయ దర్పణము నను గ్రంథములను రచించినట్లు తెలియు చున్నది. ఇంటిపేరు దర్భవారు. తండ్రి యోబయఁడు. తల్లి జానికమ్మ. వీరిది లోహిత గోత్రము. ఆపస్తంబసూత్రము. వీరు నలుగు రన్నదమ్ములు. గోపన, గిరిరాజు, వేంగన, వేంకటగిరి యను వారలు. ఈ వేంకటగిరియే ఘటికాచల మాహాత్మ్యమునకుఁ గృత్యాది పీఠికను రచించినాఁడు. విచిత్రరాయఁడు సభ నలంకరించి యొకనాఁడు పురాణాదులు వినుచుండఁగా "వెదురాకువంటి తిరుమణినుదుటంగల విప్రుఁ డొకండు"[2] "నూతనకావ్యంబది గైకొని చెంతకుఁ జని" యిట్లనెను. "విచిత్ర వాక్కునకుఁ బ్రసిద్ధుఁడైన రామకృష్ణుఁడు రచించిన ఘటికాగిరినాథమహాచరిత్ర మును నేను నవరణగా రచించి, దీనికిఁ గృతిపతి యొకఁడు లభింపక బాధపడు చున్నాను. నీ కీర్తి విని కొని వచ్చినాను. దీనిని స్వీకరింపుము" అని యిచ్చెను. ఆ ప్రభువు తన యాస్థాన కవియగు వేంకటగిరినిఁ బిలిపించి యా కావ్యాదినిఁ దన

---

[1] Insc. of 17th century A.D. in the North Arcot Dt. A.R.E. 1900. para. 188.

[2] ఇతఁడు రామకృష్ణుని మనుమడనని చెప్పుకొనెను. రామకృష్ణుని కాలమునకు, సంభావ్యమగు ఖండోజీకాలమునకుఁ గల వ్యవధానమునుబట్టి మనుమఁడనఁగాఁ బౌత్రుడని కాక, వంశీయుఁడని గ్రహింపవలసియుండును.

వంశావళిని రచించి నిలుపుమని కోరెను. అతఁ డట్లే యొనరించెను. షష్ఠ్యంతములతోఁ గూడ నలువది పద్యములు కృత్యాదికాఁగాఁ గథాప్రారంభముతో రామకృష్ణుని కావ్యము మొదలగును.

కథ : నైమిశారణ్యమున సూతుని శౌనకాదిమునులు మహిమాన్వితమగు పుణ్యక్షేత్రములలో నుత్తమమైనదానిని గూర్చి తెలుపుమని కోరిరి. సూతుఁడు నారద భృగు సంవాదమను వృత్తాంతమును జెప్ప నారంభించెను. మానస సరసీతట భూమిని భృగ్వాశ్రమమున్నది. అందు హరిపదసేవాతత్పరుండైన భృగువుకడ కొకనాఁడు నారదుఁడు వైకుంఠమునుండి వచ్చి భృగువుచేఁ బరిప్రశ్నము చేయఁబడినవాఁడై సకల వైష్ణవ దివ్య క్షేత్రముల పరిగణనము చేయుచు ఘటికాచల ప్రశస్తి చేసెను.

ప్రథమాశ్వాసము : ధవళాంగుఁడను రాజయోధ్యను బరిపాలించుచుండెను. అతఁడొకనాఁడు తన నిజరూపమును గోలుపోయి కిరాతుఁడయ్యెను. ఒంటరిగా బయలుదేరి వశిష్ఠాశ్రమముఁ జేరెను. వానిని జూచి వశిష్ఠమహర్షి "రాజా! ఇదిమీకు విశ్వామిత్ర శాపమువలనఁ గల్గినది" అని చెప్పునంతలో రాజునకు శాపవిముక్తి కలిగెను. ఈ కథ చెప్పి నారదుఁడు తన జన్మకథను వినిపింప నారంభించెను. ఇచటఁగొంతగ్రంథ పాఠముతోఁ బ్రథమాశ్వాసము పూర్తి యగును.

ద్వితీయాశ్వాసమున నారద జన్మకథ యున్నది. హరిచక్రపురమున గోవింద శర్మయను వైష్ణవుఁ డుండెను. అయన భార్య భద్రాంగి. ఆ దంపతులకు నలుగురు కొడుకులు కలిగిరి. వా రందరు వైష్ణవ నిష్ఠాపరులు. ఆ యింటిలోఁ దరళ యను పరిచారిక, నవయౌవనాంగి కలదు. వారి వసతికి సమీపమున హరిశర్మ యను బ్రాహ్మణుఁడు గలడు. అతఁ డామెను గామించి సంగమింపఁగా నారదుఁడు జన్మించెను. నారదుని బాల్యమునఁ గౌండిన్యమునీంద్రుఁడు శిష్య సమేతుఁడై హరిచక్రపురమునకు వచ్చెను. నారదుఁ డాయనను శుశ్రూషించెను. నారదుని కతఁడు మంత్రోపదేశము చేసి శంఖచక్ర చిహ్నముల నొసఁగి తపస్సు చేయుట కాజ్ఞయిచ్చెను. ఆ బాలుఁడు ఘటికాచలమున ఘోరతపస్సు చేసెను. కొంతకాలమున కశరీరవాణి "నీకు జన్మాంతరమునఁ గాని హరిదర్శనము కాదు" అని తెలిపెను. వెంటనే యోగమార్గమున నారదుఁడు శరీరము విడిచి బ్రహ్మ కుమారుఁ డయ్యెను. "సజ్జనసాంగత్యమిట్టిదిగదా" యని నారదుఁ డీ కథ చెప్పఁగా భృగువు ఘటికాచల మహిమమును దెలుపుమని కోరెను. సప్తర్షు లొకమాఱు శతశృంగ పర్వత శిఖరమున శౌరినిగూర్చి తపస్సు చేయుచుండఁగా నింద్రుఁడు వారి తపోభంగము నుద్దేశించి యప్సరసలను బంపెను. రంభ యప్సరసలను దోడుగాఁ గొని యా పర్వతమునకుఁ బోయి కొంత తడవు వనవిహార మొనర్చి జలక్రీడ లాచరించి, ప్రొద్దస్తమింపఁగా వెన్నెలలో విహరించి యా మునుల ధైర్యమును సడలింపఁజేయలేక వెనుదిరిగిపోయెను. కొంతకాలమునకు నశరీర వాణి, "మీరిచ్చట యెంతకాలము తపస్సు చేసినను విష్ణువు ప్రత్యక్షము కాఁడు. ఘటికాచలమేగుఁడు. మీ తపస్సుసఫలమగును;" అని యా మునులతోఁ బలికెను. అప్పుడు ఋషులు పుణ్యక్షేత్రములు దర్శించుకొనుచు జగన్నాథము, శ్రీకాకుళము.

కృష్ణా తీరము, శేషశైలముమీఁదుగాఁ గాంచీపురము చేరిరి. వశిష్ఠుఁడా పట్టణ వైభవమును వర్ణించెను. వా రా పురము వెలువడి ఘటికాచలమును బ్రవేశించిరి. అందుఁ దపస్సు చేయుచున్న మునులకు నమస్కరించి వారి యాజ్ఞను ఘటికాచలముపైఁ దపస్సు చేసిరి. అనాయాసముగనే శ్రీ నృసింహదేవుఁడు వారికిఁ బ్రత్యక్షమయ్యెను.

తృతీయాశ్వాసము : ఆ ఋషులు నృసింహుని నొక వరము కోరిరి. "నీయుగ్రరూపమును మేము చూడలేము. శాంతస్వరూపమున నీవు మాకుఁ గనిపింపుమ"ని వారు కోరిరి. ఇంతలో నొక విమాన మచ్చటికి వచ్చెను. ఆ విమానమున నచ్చటివారు ప్రసవాయుధవైరిని ప్రమథగణములతోఁగూడ దర్శించిరి. ఋషులు నృసింహుని స్తోత్రము చేసిరి. నృసింహుఁడు వరము లిచ్చెద కోరు మనెను. ఋషులు మోక్షధర్మముతోపాటు తరుగని మహిమగల తావుగా ఘటికాచలము వెలయవలెననియు, జీవరాసులకు వైరాగ్యము, భక్తి, సకల సమృద్ధులు గలుగవలెననియుఁగోరుకొనిరి. ఇంతలో వైఖానసులు వచ్చి నృసింహుని స్తుతించుటయు, సప్తర్షులు స్వామి సేవచేయుచు నచ్చటనే నిలిచి యుండునట్లు వరము కోరుటయు, లక్ష్మీనృసింహుఁ డాంజనేయుని బిలిపించి యా ప్రాంతమంతయు సమతలముగను, వాసయోగ్యముగను జేయుమని కోరఁగా నతఁడు సంతోషముతో నట్లొనరించెను. సకలజనులు పరమానంద భరితులై లక్ష్మీనృసింహులకుఁ గల్యాణమహోత్సవ మొనరించిరి.

ఈ ప్రబంధమునకు సంస్కృతమున మూటియైన మూలగ్రంథము లేదు. తొంబదిపాళ్లు స్వతంత్ర ప్రబంధ మనియే చెప్పవలెను. ద్వితీయాశ్వాసమందలి నారదజన్మవృత్తాంతమున బ్రహ్మవైవర్త పురాణమందలి నారదవృత్తాంతపు ఛాయ లున్నట్లు తోచును.

రామకృష్ణుని మూఁడు గ్రంథములలో నిది యప్రౌఢము. పద్యరచనలోగాని, కథాకథనమునఁగాని, సంభాషణలు నడుపుటలోఁగాని, యనుభవము చాల తక్కువగాఁ గనుపించుచున్నది. పాండురంగ మాహాత్మ్యముతోనేగాక, దానికన్నఁ దక్కువ పరిణతి చెందిన యుద్భటారాధ్య చరిత్రతోఁ బోల్చినను, దీని రచన యెంతమాత్రము తులతూఁగుటలేదు. కథాసంవిధానచాతురి (formal beauty) కొంచెమైనను లేదు. ధవళాంగుని కథలో నొక లోప మున్నదని కొందఱు చెప్పుదురు. అది యేమనఁగా విశ్వామిత్రుఁడు శాపమిచ్చిన వెంటనే ధవళాంగుఁడు కిరాతుఁడుగాక తిరిగి వచ్చి సింహాసనమున నుండఁగా నగుట లోపముగా నున్న దనియు, నీ విధముగా నీ కథకు సందర్భశుద్ధి లేదనియుఁ జెప్పుదురు. ఇది యొక గుణమే గాని దోషము కాదు. శాపమిచ్చిన క్షణముననే యది వర్తింప నక్కఱలేదని రామకృష్ణుని యభిప్రాయము కావలెను. పాండురంగ మాహాత్మ్యమునఁగూడ పాధూల మహర్షిచే శపింపఁబడిన యయుతుఁడు వెంటనే భేకమైనట్లు చెప్పఁబడలేదు. శాపమందిన యయుతుడు శాపావసానమును విని, వాధూలుని యుపదేశములను గ్రోలి, పాండురంగ క్షేత్రమునకు దారిలో పెక్కు దైవతములను గాంచుచు వచ్చి, యందలి

సర్వ దైవతములను దర్శించి, పుణ్యతీర్థమున స్నానమాడి, నృసింహు నర్చించి యటదన నివాస మేర్పఱుచు కొనుచుండఁగా క్రమముగ నతనికిఁ గప్ప లక్షణములు పట్టుపడుచుఁ దుదకుఁ గప్పగా మారినాఁడు. శాపఫలమును గూర్చి రామకృష్ణుని యభిప్రాయ మిట్లుండుటలోఁ దప్పేమి? ఉద్భటారాధ్యచరిత్రలోని గంధర్వుల శాపానుభవము గూడ నించుమించుగా నిట్లే వర్ణింపఁబడినది. లభించిన గ్రంథములో శాపవృత్తాంత మున్నచో నీ సంశయమునకుఁ దా వుండెడిది కాదు.

నారదుని కథతో గోవిందశర్మకథ యంత సంబంధించినది గాదని, గోవిందశర్మ యునికియే నారదుని భావ్యభివృద్ధికి మార్గమైనదని కొందఱు భావింతురు. నారదుని భావ్యభివృద్ధికి మార్గమైనది గనుకనే నారదుని కథతో నీ కథ సంబంధించి యున్నది. గోవిందశర్మ దంపతులు పరమ భాగవతోత్తములని చిత్రించుచు, వారి దినచర్యను వర్ణించుటలోనే రామకృష్ణుఁడు నారదుని జన్మమునకు ప్రపత్తి చూపినాఁడు. "తదార్యదంపతిసేవాతరలమతిఁదద్గృహమ్ముసఁదరలక వర్తించు నెంచఁదగు వర్తనలన్" 1 - 20. అని తరళను వర్ణించెను. ఇట్టి భాగవతుల యిండ్ల సేవ లభించుటవలననే హరిశర్మ యను నొకభాగవతయువకుఁడు నిమిత్తముగాఁ దరళగర్భమున నారదుఁడు జన్మించి వర్ధిల్లినాఁడు. ఋషుల తపస్సును భంగపఱచుట కప్సరసలు చేసిన యత్నము భంగమైనది. కనుక నిట నింత సుదీర్ఘమైన యప్సరోవర్ణనము బాగుండలేదని కొందఱి యభిప్రాయము. గాని ఇందొక సూక్ష్మమైన శిల్ప రహస్య మున్నది, అప్సరసల రూపలావణ్యాది వైభవము లెంతగాఁ గవి వర్ణించునో, వారి విభ్రమములకుఁ జలింపని ఋషుల యాత్మనిగ్రహ మంతగా రాణించును. కుమార సంభవమున నకాల వసంత వర్ణనమిట్టిదే గదా! తపస్సు చేయుచున్న శివునకుఁ బరిచర్య చేయఁబోయిన పార్వతి శివుని మనస్సును రూపముచే నాకర్షింపలేక పోయినది. అంతమాత్రముసఁ బార్వతి వర్ణనము వ్యర్థమగునా? కాకపోవుటయే కాక పరమేశ్వరుని మహత్త్వమునకుఁ బరిపోషక మగుచున్నది, ఎట్లును రాముని చేతిలోఁ జచ్చువాడే గదా యని రావణుని వైభవమును వర్ణింప మానినాఁడా వాల్మీకి? ప్రవరుని వలపింపఁ జేయలేకపోయిన వరూధినిని బెద్దన వర్ణించుట యంతయు నిట్టే వ్యర్థ మన లేము. అయుతనియుతో పాఖ్యానమున నయుతిని తపస్సెట్లును భంగము కాఁబోవుచున్నది గనుక రామకృష్ణుఁడు 'జటిలవ్యాఘ్రమైన' యయుతుని తపస్సును విశేషముగా వర్ణింప మానెనా? ఇఁట దీర్ఘ వర్ణనము కథయందలి యెడతెగనితనమును పాడుచేసినదని కొందఱు భావించిరి. వర్ణనము సందర్భించి యున్నది గనుకఁ గథ కడ్డము కాదు. మనుచరిత్రలోని వేట వర్ణనము, పారిజాతాపహరణములోని వెన్నెల వర్ణనము, నాముక్తమాల్యదలోని ఋతు వర్ణనము కావ్యధర్మముల దృష్టికి వ్యర్థములు కావు. వాల్మీకి, కాళిదాసులలో నిట్టి వర్ణనములు కొల్లలు.

వశిష్ఠుఁడు కాంచీపురమునందలి స్త్రీ వర్ణన, సౌధవర్ణన చేయుట యనుచితమని కొందఱు భావించిరి. ఇందు స్త్రీవర్ణనమునందుఁ గొంత శృంగారస్పర్శ

యున్నది కనుక వశిష్ఠుఁడట్టి వర్ణనము చేయుట సహజము కాదని తోఁచవచ్చును. కాని యరుంధతి యా పట్టణమును జూడవలెనని కుతూహలపడి కోరెనట ! ఇందలి కవివాక్యము గమనీయము.

"తదాలోకన పరయగు నిజవధూటి కాంక్ష యెఱిఁగి
యవ్వనితామణికి వశిష్ఠుండనియెన్ మందస్మితాన నాబ్జుండగుచున్"
—2-162.

దంపతు లిరువురు వేఱుగా నా పట్టణమును జూడఁబోయినారు. అదియు నామె కోరికను జెల్లించుటకు వశిష్ఠుఁడు వేడుక పడుటవలన జరిగినది. ఇక వారి నడుమ జరుగు సంభాషణలును, వర్ణనములును ధర్మ విరుద్ధములు కారాదు గాని శృంగార గర్భితము లేల కారాదు ? విమానమునుండి దిగుచున్న యీశ్వరుఁడు శంఖచక్రములు ధరించినట్లిందు వర్ణింపఁబడినదనియు నిది వింతగా నున్నదనియుఁ గొందఱ అభిప్రాయపడినారు. ఇం దీశ్వరుఁడు విమానమునఁ గనుపించెనని వర్ణింపఁబడినదిగాని వానికి శంఖచక్రములు వర్ణింపఁబడలేదు చూడుడు :

"రత్నరాజి ప్రదీప విరాజమాన
మైన యెక్కవిమానంబు గానఁబడియె........." 6

"వారంగఁదద్విమాన
ద్వారము సొత్తెంచి నిలువ దక్షిణదిశగాఁ
జేరి వెసం బ్రసవాయుధ
వైరి నిరీక్షించి ప్రమథ వైభవ మెసఁగన్......" 7

'కరముల శంఖచక్రములు దాల్చినవాని
మురువైన లేఱునోటి యొరపువాని
....
....

"బాలచంద్రునివై నున్న బాలచంద్రుఁ
బోలునలికోర్ధ్వపుంద్రంబు పొలుపువాని
....
....
గనకనవెలుంగు నంగారకవిధమునను
గాననయ్యెడి మిక్కుటి కంటివాని......" 8

వ. .... శ్రీ నరసింహదేవునాలోకించి............. ... 9

—ఘటికాచల మాహాత్మ్యము, ఆశ్వాసము 3.

ఇందు శంఖచక్రములు ధరించినట్లు వర్ణింపఁబడినది నృసింహుఁడుగాని, శివుఁడు కాఁడు. నృసింహుఁడు మిక్కిలి కంటివాఁడుగా వర్ణింపఁబడుటవలనఁ

గొంద టిట్లు తలఁచి యుండవచ్చును. నృసింహుఁడు త్రినేత్రుఁడని సంప్రదాయ గ్రంథము లన్నియుఁ జెప్పుచున్నవి.

"సత్యజ్ఞానమఖండరూపమమలం క్షీరాబ్ధిమధ్యస్థితం
యోగారూఢమతి ప్రసన్నవదనం భూషా సహస్రోజ్జ్వలమ్
త్ర్యక్షంచక్ర పినాక సాభయవరాన్ బిభ్రాణమర్కచ్ఛవిం
ఛత్రీభూత ఫణీంద్ర మిందు ధవళం లక్ష్మీనృసింహంభజే"
—లక్ష్మీనృసింహ సహస్రనామస్తోత్రధ్యానము

ఉదాహృత గ్రంథ భాగమున నేఁడవ పద్యమున ఋషులు ప్రసవాయుధ వైరిని దర్శించినట్లున్నది. తక్కిన పద్యములలో నృసింహుని వర్ణన మున్నది. ఇందు మిక్కిలి గ్రంథపాతమైనదనియుఁ గొన్ని ఘట్టములే లోపించునంత గ్రంథ భాగ మింకను లభింపవలసియున్నదనియు నేను విశ్వసించుచున్నాను. ఈ గ్రంథపాతము వలననే మిగిలిన ఘట్టము సందర్భించుటలేదు.

బాలచంద్రునిపై నున్న బాలచంద్రుఁబోలు నలికోర్ధ్వపుండ్రంబు అను దాని యర్థమేమో విచార్యమని యొక రనిరి. ఇందలి యర్థము స్పష్టమే. నృసింహుని ఫాలము బాలచంద్రునివలె నున్నది. దానిపై నూర్ధ్వపుండ్రము మరియొక బాలచంద్రునివలె నున్నది.

ఈ కావ్యమందలి కథాంశములలో గమనింపఁదగినది యొకటి యున్నది. నారదునకు మంత్రోపదేశము చేసిన గురువు కౌండిన్యఋషి యని యిందుఁ జెప్పఁబడినది. రామకృష్ణుని గోత్రకర్త యీ గురువు. ఈ కల్పనమువలన రామకృష్ణునకు సంప్రదాయము నెడఁ గల శ్రద్ధాభక్తు లవగత మగుచున్నవి. ఎడనెడఁ గల గ్రంథ పాతములు సవరింపఁబడి సమగ్రమైన గ్రంథము లభించినఁ గాని పూర్తిగ దీని గుణదోషము లెన్నుట సాధ్యము కాదు. మొత్తము మీఁద సప్రతిమానమైన ప్రతిభగల యొక మహాకవి చేసిన ప్రప్రథమప్రయత్న మిది యని గ్రంథ మంతయు చెప్పక చెప్పుచున్నది. మిగిలిన రెండు గ్రంథ ములలోని సంభాషణచాతురిగాని, సన్నివేశ నిర్మాణమార్మికతలోని సత్త్వ గుణముగాని, చదువరుల మనోవీధులకుఁ బాత్రలను స్పష్టముగ రూపొందించు నట్టి నిలుకడగాని ఈ గ్రంథమున గనుపింపవు.

ఈ కావ్య మింతవఱకు నొకే ముద్రణ మొందినది. రాజమహేంద్ర వరమునందలి కళావతీ ముద్రాక్షరశాలలో క్రి.శ. 1902లో ముద్రితము. ప్రకాశకులు తాళపత్ర గ్రంథముల లభ్యతను గూర్చిన విశేషములను గాని, యావశ్య కాధారములనుగాని పొందుపరుపలేదు. (రెండు తాళపత్ర ప్రతులు తంజావూరు సరస్వతీమహల్‌లో నున్నవి. రెండును మిక్కిలి శిథిలావస్థలో నున్నవి.) గ్రంథ పాతములు, లేఖక ముద్రణా స్ఖాలిత్యములు లెక్కకు మిక్కిలి. పద్యసంఖ్యాపరిగణనము గూడ తిన్నఁగాలేదు. సుపరిష్కృతమైన, వ్యాఖ్యాన సహితమైన ముద్రణమెంతయు నావశ్యకము.

ఉద్భటారాధ్య చరిత్రము

ఇది మూఁడాశ్వాసముల ప్రబంధము. కవి రచించిన పీఠికలోఁ గవినామము రామలింగఁ డని యున్నది. కృత్యాది పీఠిక పద్యాంతములతోఁ గలిసి 52 గద్యపద్యములు. మొదటి తొమ్మిఁది పద్యములలో గ్రంథపాతము లతిమాత్రముగా నున్నవి. గ్రంథము నందుఁ గూడ నందందు గ్రంథపాతము లున్నవి. తొలుత దేవతాస్తుతిలోఁ జంద్రశేఖరుఁడు, హిమశైలాత్మజ, వాణీ హిరణ్యగర్భులు, వీరశరభమూర్తి, గణపతి, మైలనాహ్వయుండగు గురువు, లక్ష్మీదేవి, శారద స్తుతింపఁబడినారు. కవిస్తుతిలో వ్యాసుఁడు, వాల్మీకి, భారత సంప్రదాయ ప్రవర్తకులగు సత్కవులు స్తుతింపఁబడినారు. అటుపైని గొంద వీటి వర్ణనము, నాదెండ్ల గోపవిభుని ప్రశస్తి యున్నవి. తరువాత గోపన మంత్రికి "రాజకార్య నిర్వాహకుఁడు", ఈ కావ్యమునకుఁ గృతిభర్తయగు నూరదేవయ్య ప్రశంసింపఁబడినాఁడు. అతఁ డొకనాడు నిండుకొలువున రామ లింగకవిని సబహుమానముగ రావించి సన్మానించి ఇట్లు కోరినాఁడు :

"భవపాశత్రుటనక్షమంబులగు నా పాలక్షు గాథావలుల్
చెవులారన్ వినుమందు నెవ్వఁడదాతఁ డీక్షింపన్ మహాభాగుఁ డ
ట్లవుటన్ మామక బుద్ధి యెల్లపుడు దివ్యశైవ శాస్త్రార్థ సం
భవ సాంద్రామృత సేవఁ దృప్తిఁ గనుచున్ భాసిల్లు నిస్తంద్రమై

హరునికంటెను దద్భక్తు లధికులంచు
వేదవిదులును వివరింప విందు మెపుడు
గానఁదద్భక్త సత్కథాఖ్యాతమైన
భవ్యచరితంబు వినువారు ప్రాజ్ఞతములు

హరభక్తులందు నుద్భట
గురుఁడధికుఁడు తత్ప్రసిద్ధగుణగణవి
స్ఫురణాభిరామమున్ నీ
వ రచింపుము కావ్య మొకటి వరస కెక్కన్"

—1-27, 28, 29.

ఇందు మొదటి పద్యము రాజరాజు నన్నయ్యను భారతము నాంధ్రీకరింపుమని కోరుచుఁజెప్పిన "ఇవియేనున్ సతతంబు" అను పద్యము ననుసరించి రచింపఁ బడినది. భారతమన్నను, బురాణములన్నను, భారతకవులన్నను వేదమార్గ మన్నను రామకృష్ణున కానందాతిశయము హెచ్చు.

ఈ పీఠికలోనే రామలింగని తల్లిదండ్రులు, కుటుంబ విశేషములు వివరింపఁబడినవి – 1 – 24. ఊరదేవయ్య కోరిక తరువాత నతని వంశావ ళార వర్ణన మున్నది. కౌండిన్య మహాముని వంశమునఁ బెద్దనమంత్రి పుట్టెను. వానికిఁ దిప్పన, దేచన యనువారు పుట్టిరి. అందుఁ దిప్పన మహోదాత్త అతనికుమారుఁడు దన్నవిభుఁడు. అతనికిఁ బర్వతయ్య, మైలమంత్రి దేవమంత్రి

కొండయ్య యను నల్వురు కుమారులుదయించిరి. ఇందలి దేవమంత్రియే యీ కావ్యమునకుఁ గృతిపతి.

ప్రథమాశ్వాసమందలి కథ : నైమిశారణ్యమున శౌనికాదిమునులు ద్వాదశవార్షిక సత్రము ననుష్ఠించుచుండఁగా సూతుఁడు వచ్చెను. వా రతనిని "శైవధర్మ సదాచారసరణి" ని వినుపింపుమని కోరిరి. అతఁడు సంతసించి శివుని మహిమము వాఙ్మానసగోచరము కాదని కీర్తించుచుఁ జెప్ప నారంభించెను. పూర్వము కైలాసగిరిమీఁద నొక వసంతాగమమునఁ బార్వతీ పరమేశ్వరులు విహారము సేయుచుండిరి. అదే సమయమునకు గంధర్వులు కొందఱు విమానములమీఁద వచ్చి పార్వతీ పరమేశ్వరుల యేకాంతమునకు భంగముఁగల్గించిరి. అపుడు పరమేశ్వరుఁడు వారినిఁ పిశాచములయి పోవునట్లు శపించినాఁడు. గంధర్వులు దుఃఖించి శాపవిమోచనము నను గ్రహింపుమని ప్రార్థించిరి. వారలను పరమేశ్వరుఁడు వల్లకీపురములోని రుద్రభూమిలోఁ గొంతకాలము వేఁచి యుండవలసిన దనియు, భోజుఁడను రాజునకు గురువుగా ముదిగొండ యుద్భటారాధ్యుఁడు వర్ధిల్లుననియు, నతఁడు కాలగతి చెందినపు డతని చితాగ్నిధూమ మాఘ్రాణించుటవలన వారికి శాపవిమోచనము గ్గలుననియుఁదెలిపెను. చిత్రరథుఁడు పిశాచరూపులైన గంధర్వులతోఁ దానును వజ్రదంష్ట్రుఁడనుపేరఁ బిశాచపతియై వారలను వల్లకీపురమునకుఁ గొనిపోయి యచట నొక మఱ్ఱిచెట్టుపై నివాసము చేయుచుఁ బిశాచాధిపత్యము వహించి యుండెను. వల్లకీపురము నధిపతియగు ప్రమథేశ్వరుఁడు మహనీయుఁడైన శివభక్తుఁడు. అతని పరిపాలనమున శివుని సారూప్యముతో మహిమాస్పదుఁడైన యొక మహనీయుఁడు జన్మించెను. వానితేజోవిశేషములు చూచి "యో యుద్భట ! యిటు రమ్ము " అని శంభుఁడు సంబోధించి తన మానస పుత్రునిగా వానిని లోకమునకు వ్యక్తము చేసి యిట్లు చెప్పెను : "కొందఱు ఖేచరులు నన్ను విసిగింపఁగా బిశాచులార ! పొండని పల్కితిని ఆ పల్కునకు వారు పిశాచములై పోయిరి. తలవనితలంపుగాఁ గల్గిన యీ దురవస్థకుఁ బరిహారముగా నన్నుఁ బోలిన యీ నిన్ను సృష్టింతుననియు, నీ వలన వారు పరిశుద్ధులు గాఁగలరనియుఁ బల్కితిని. నీవు సంసారయోగివై హింసావిదూరుఁడవై జీవోత్తముఁడవై వారల నుద్ధరింపుము. వారు నివసించుచున్న వల్లకీపట్టణము నేలు ప్రమథేశ్వరునకుఁ గుమారుఁడైన ముంజభోజ మహారాజు నీకుఁ బ్రియశిష్యుఁడై యఖండకీర్తియు, సారూప్యము నందఁగలఁడు. ఇటుపైన ముదిగొండ పట్టణము నీకును నీ వంశీయులైన శివధర్మ పారంగతులకును నివాసము కాఁగలదు"

ద్వితీయాశ్వాసకథ : పరమేశ్వరుఁడిట్లు పలుకఁగా నుద్భటు డనుజ్ఞగొని యదృశ్యుఁడై భూమిపైఁ బొడగట్టెను. ధర్మమార్గమున జీవయాత్రనడపుచు శైవాగమములను స్థిరపరచెను. స్పర్శవేదిచే లోహము బంగారమైనట్లు వాని మహిమా సంస్పర్శమునఁ బలువురు మోక్షమార్గమును బొందిరి.

వల్లకీపుర ప్రభువగు ప్రమథేశ్వరునకుఁ జిరకాలము సంతతి గలుగలేదు. కనుక నతఁడు ధర్మ సాధనమునకై సంతతిఁబడయుటకుఁ గాశీపురమునకుఁ బోవ

సమకట్టెను. భార్యానమేతుఁడై రథమెక్కి బయలుదేరి తన కులగురువగు కౌండిన్యముని యాశ్రమమునకుఁ బోయి యాయనను దర్శించి తన పూనికను దెలిపెను. ఆయన సంతసించి కాశీమహిమము నుగ్గడించుచు, మదాలసుని వంటి దుర్మార్గ సంచరణోదగ్రులు గూడ కాశియందు మృతులైనచో శివసారూప్యము నందఁగలరని పలికెను. ఆ మదాలసుఁడెట్టివాఁడని ప్రమథాధిపతి యడుగఁగా నతని వృత్తాంతమును గౌండిన్యుఁ డిట్లు చెప్పెను.

కుంతలదేశమున రత్నగర్భపురి కధిపతి చంద్రకేతుఁడనువాఁడు గలఁడు వానికడ ధీనిధి యను సద్బ్రాహ్మణుఁడు, సకలశాస్త్ర పారంగతుఁడు, యజ్ఞయాగాదు లాచరించినవాఁడు గలఁడు. వానికి చిరకాలము సంతతి లేకపోఁగాఁ బూజా వ్రతాదికముల నాచరించి యొక్క కుమరునిఁ గాంచెను. వాని పేరు మదాలసుఁడు. అతఁడు యౌవనమున దుష్కర్ముఁడై వ్యభిచారాది దోషములకు లోనయ్యెను, జూదము, చౌర్యము మొదలగునవన్నియుఁ బట్టుపడెను. అతఁ డొకనాఁటి రాత్రి యూరు విడచి దేశాంతరముపోవ సమకట్టి శివాలయములోని దేవస్వమందలి యొక రత్నముల పెట్టెను దొంగలించుకొనిపోయెను. ఒక పట్టణముఁ జేరి రహస్యముగా నొక్క బేహారికడనాసొమ్ము లుంచికాలముఁ గడపుచు మరల వేశ్యాలోలుఁడయ్యెను. ఆ పురమునఁ గగనకలత యను వేశ్యను జూచి మోహించి పరభావవేదియను గ్రొత్త మిత్రుని సహాయముతో నామెను జేపట్టెను. ధనమంతయును గోల్పోయి వేశ్యమాతచే వెడలఁ గొట్టఁబడి యాతఁడు మరల ధనార్జన యత్నమున బయలు దేరెను. వింధ్యాచలపార్శ్వ పట్టణములు ధనవంతుల కాస్పదములని విని దారులు కొట్టి కన్నమువేయు సాధనములతో నా ప్రాంతములకుఁ గాలినడకను బయలుదేరెను. దారిలో వడదాఁకి యొక తెరువునఁ బడియుండఁగా విద్యాపాలుఁడను నొక బ్రాహ్మణుఁడు సపుత్రకుఁడై యటుపోవుచు మదాలసుని యవస్థఁ జూచి యన్న పానీయము లిచ్చి రక్షించెను. మదాలసుఁడును వారితోఁ బ్రయాణము చేయుచు వారికడ రాజసత్కృతి నందిన ధన ముండుట నెరిఁగి, వారిని నిద్రపోనిచ్చి చంపి ధనము గైకొని దారితప్పి కాశీపట్టణపు హద్దులలోఁ బ్రవేశించెను. మార్గాయాసమున నతఁ డచ్చట నిద్రించుచు నురగద్రష్టుఁడై చనిపోయెను. యమభటులు వానిని గొనిపోవుటకు వచ్చి కాశీపతినిఁ జూచి తిరిగిపోయిరి. యముఁడే స్వయముగా వచ్చి శివునకు నమస్కరించి "స్వామీ: యిక ధర్మమునకుఁదావేది ? నాయమత్వ మింకేల" యని వాపోయెను. కాశీపట్టణమునఁ బ్రాణోత్క్రాంతి నందిన యెట్టి పాపాత్ముఁడైనను ముక్తి నందునని చెప్పి విశ్వనాథుఁడతనిని సాగనంపెను.

తృతీయాఖ్యానకథ : ఈ కథ విని యా రాజు గురువు ననుజ్ఞ వడసి సభార్యుఁడై కాశికి వచ్చెను. అతఁడచ్చట నిశ్చల తపస్సు నొనరించఁగా భుజంగమహారుఁడు వాని మ్రోలఁ బొడకట్టి యొక ఫలమిచ్చి వాని భార్య కొనఁగుమనెను. అతఁ డట్లే యొనర్చి కొంత కాల మటనుండి రథమెక్కి తన పురమునకు మరలి వచ్చెను. అతని భార్య గర్భవతియై పంచగ్రహోచ్చ యందొక కుమారుని గాంచెను. అతఁడు దినదినప్రవర్ధమానుఁడై యా గర్భ

శైవుఁడై కలిదోష గర్వహరణుఁడై రాజయ్యెను. ఒకనా డతనికి వైరాగ్యము గల్గి యుద్భటుని గురువుగా వరింపఁగా నతఁడు ధర్మమార్గమున రాజ్యపరి పాలనము చేసి తుదకు శివసాయుజ్యము నొందుమని యానతిచ్చి శై:దీక్ష నొసఁగి లింగధారణము చేయించెను. అతనికిఁ బరమేశ్వరుఁడే స్వయముగా స్వప్న మున సాక్షాత్కరింప యుద్భటుఁడును దన వచ్చిన పనివి స్మరించి యొకనాఁడు స్నానము చేసి శైవ చిహ్నములు ధరియించి ప్రాణలింగమును హస్తాబ్జమున సంగ్రహించి పద్మాసనాసీనుఁడై సోమ సూర్యాగ్ని మూర్తులం దైక్యమై కపాలమును భేదించుకొని శరీర బంధమును బాసెను. అతని శిరస్సున బుట్టిన యోగవహ్నిలో శరీరము భస్మ మగుచుండఁగా ధూమము సర్వ దిక్కులను గ్రమ్ముచున్నది తాకినంతమేర వేచియున్న పిశాచరూపులగు గంధర్వులకు శాపవిమోచనము గలిగినది. చిత్రరథుఁడుమాత్ర మా సమ యమున కాహారము నర్థించి యెటకో పోయెను. దిరిగివచ్చునరికి పనియంతయు ముగిసినది. చిత్రరథుఁడు విలపించి ముంజభోజునితో మొఱపెట్టుకొనెను. భోజుఁడు ధ్యానింపఁగా శివుఁడు స్వయముగా నుద్భటునితోఁ గూడ దిగివచ్చి చిత్రరథుని శాపము నుండి విముక్తునిఁ జేసెను. ఉద్భటుని మరికొంతకాలము భూమిపైనుండి ధర్మసంస్థాపన మొనరింపుమని యాజ్ఞ నొసఁగెను. ఆ యుద్భటుని వంశము వారే యిప్పటి ముదిగొండవారు.

ఈ కథకు సంస్కృతమూల మున్నట్లు కనుపింపదు. పాల్కురికి సోమన బసవ పురాణమున సంగ్రహముగ ముప్పది యెనిమిది ద్విపదలలో నుద్భట చరిత్ర మున్నది. రామలింగకవి పాల్కురికి సోమన ద్విపదలనుండి యందందు గొన్నిటిని గ్రహించినాఁడు.

"ఎలమి నొక్కటి సాలకేఁణ్ణూరు భూత
ములు నుద్భటుని గొల్చు పొగదాఁక దదవ
కైలాసమున కేగ గతిచెడితాన
భూలోకమునఁ జిక్కి పొగిలెదఁ దండ్రి !
గ్రచ్చుల వీసంగగాచి నక్కలకు
నిచ్చినయట్లయ్యె నీడిత క్కి" —బసవ. 7-612-617

"మోచితి నుగ్రశాపభరమున్ శతదివ్య సమంబులన్నియున్
జూచితి సప్తభోగములు చూచినవారలు నవ్వనుద్భట
శ్రీ చరణాంగ ధూమములు చెందుటగానమి యానునంతకున్
గాచి వృక్షాల కిచ్చిన ప్రకారముఁ దోచె మదీయ సిద్ధికిన్"
—ఉద్భట. 3-260

బసవపురాణములోని యుద్భటకథ చాల సంగ్రహము. ఇందలి కథ చాల విస్తృ తము. ఇందుఁగొన్ని క్రొత్తకథలు వాఖ్యానములుగాఁ గల్పింపఁ బడినవి.

ముంజభోజునితండ్రి పరిపాలనను వర్ణించుట, యతని పట్టణమును వర్ణిం చుట, యతఁడు సంతానము లేక విలపించుట, సభార్యుఁడై కాశికిఁ బయలు

దేరుట, గురువగు కౌండన్యముని దర్శనము, అతఁడు చేసిన కాశీమాహాత్మ్య వర్ణనము, అతఁడు చెప్పిన మదాలసునికథ, ముంజభోజుని జననము, శైశవబాల్య వర్ణనము, పట్టాభిషేకవర్ణనము, అతని విరక్తి, ఉద్భటుని యుపదేశములు, ఒంటివిల్లి రాకాసి విలాపము, ఇందలి క్రొత్త కల్పనములు. కౌండిన్యముని ముంజభోజుని తండ్రికి గురువుగా రామకృష్ణుఁడు కల్పించుటలో నొక విశేష మున్నది. ఈ కవియుఁ, గృతిభర్తయుఁ గౌండిన్య గోత్రోద్భవులు. తమ గోత్రకర్తయైన ఋషిపాత్ర నీ విధముగాఁ గల్పించి, గౌరవము చెల్లించుట ముదావహము. బసవపురాణమున భోజుఁడని చెప్పబడిన రాజు రామలింగని కావ్యమున ముంజభోజుఁ డనీ వ్యవహరింపఁబడినాఁడు.

ఇతఁడు శైవవాఙ్మయ గ్రంథములలోఁ బలుతావులందు స్మరింపబడినాఁడు.

1. శివతత్త్వసారమున నుద్భట స్తుతియున్నది.

> "హరలీలా స్తవరచనా
> స్థిరనిరుపమ భక్తిఁదనదు దేహముతోడన్
> నురువిర విమానమున నీ
> పురమున కుద్భటుఁడు ప్రీతిఁబోవఁడే రుద్రా"
>
> --శివతత్త్వసారము 410

2. నన్నెచోడుని కుమార సంభవమున నుద్భట స్తుతియున్నది.

> "క్రమమున నుద్భటుఁడు గవి
> త్వము మెరయఁగుమార సంభవమ్మనలంకా
> రము గూఢవస్తుమయ కా
> వ్యముగా హరలీలఁజెప్పి హరుమెప్పించెన్" -కుమార, 1-21

ఇందు నన్నెచోడుఁడు పేర్కొనిన యుద్భటారాధ్య గురువైన ముదిగొండ యుద్భటుఁడౌనో కాదో చెప్పుట కాధారములులేవు. కాశ్మీర రాజులలో నొకఁడగు జయాపీడుని సభలో నుద్భటుఁడను విద్యాపతియొకఁ డున్నాడు. ఇతఁడు క్రీ.శ. 779 నుండి 813 వఱకు పరిపాలించినట్లుకొందఱు చరిత్రకారులు వ్రాసి యున్నారు. అట్లే భోజుఁడు క్రీ.శ. 10, 11వ శతాబ్దములవాఁడని యొకప్రతీతి. కనుక నుద్భటుఁడు భోజునకు శివదీక్ష నిచ్చుట యెట్లని శంకించినవారు కలరు. కాని చరిత్రలో స్థిరపడని విషయములను గూర్చి యీ నిర్ణయమెట్లు జరుగును? ముదిగొండ యుద్భటుఁడే విద్యాపతి యుద్భటుఁ డనుట హాస్యాస్పదము. శబ్దము స్వభావమునుబట్టి యుద్భటుఁ డన్నది బిరుదము కావచ్చును. నన్నెచోడుఁడు స్మరించిన యుద్భటుఁడు శాంతరసమును బ్రతిపాదించిన యాలంకారికుఁడు, కవియునగు నుద్భటుఁ డగుట సంభావ్యము. కాని, ముదిగొండ

యుద్భటుఁడు వీరశైవాచార్యుఁడగు దాక్షిణాత్యుఁడనుట తప్పదు.[3] అట్లే భోజుఁడన్నదిగూడ బిరుదనామమే కాని యొకరాజు పేరు కానట్లు కనుపించును. ముంజభోజుఁడే చరిత్రలోని భోజుఁడని కాని, ధారానగరము నేలిన భోజుఁడని కాని చెప్పలేము కదా. ఇంతకును గల్పితకథలోని రెండు పాత్రలకు నడుమఁ గాల శంకింప విరోధమును నావశ్యకత లేదేమో.

ఈ కావ్యమందలి కవిత్వమునందు ఘటికాచల కవిత్వముకన్న నెక్కువ పరిణతి స్పష్టముగాఁ గనుపించుచున్నది. పద్యరచన మధురము, ప్రౌఢతరము. శయ్య మరికొంత నునుపుతేలినది. చక్కనివికాసము నందినది. సాంగోపాంగమైన ప్రబంధరచన సుంకులు తేలినది. వాక్కులో మాధుర్యము, ప్రౌఢియు, కూర్పు, నేర్పు, తీర్పు బాగుగా వికసించి రచనలో నొక తాపీదన మేర్పడినది. ఏ చిన్న పాత్రయైనను, జదువరుల మనోవీధికి స్ఫుటముగా గోచరించుటయున్నది. ఘటికాచల గ్రంథమున నీ గుణములేదు. పుర వర్ణనాదులయందు సందర్భశుద్ధి బాగుగా నున్నది. పద్యరచన దగ్గఱనుండి ఘట్టములను దీర్చి దిద్దుటవరకు నన్నయ, శ్రీనాథుఁడు, నెఱ్ఱన, నాచనసోముఁడు దర్పణములో వలె గావ్యమందెల్లెడలఁ బొడకట్టుచున్నారు. ఘటికాచల పద్యరచనలో వ్యర్థపదము లేకుండ రచించు ప్రయత్న మడుగడుగునఁ గనుపించును. ఉద్భటమున నవ్యయత్నముగా సార్థక పదప్రసిద్ధమగు ధారాప్రవాహము గనుపించును. పాండురంగ మాహాత్మ్యమున ననితర సాధ్యమైన, వ్యంగ్యపరిపూర్ణమైన, విలక్షణమైన, పదగుంఫనము కవి వాక్కునకు సహజమై కనుపించును. మతము, తత్త్వము, యోగసాధనము, భక్తి, మోక్షము, చతురాశ్రమ వ్యవస్థ మున్నగు పరమార్థ విషయములయం దత్యంతాదరము ఘటికాచల గ్రంథమునఁ బొడగట్టును. ఈ యంశముల నొకమూసలో గఱిగించి తనమార్గము నేర్పఱచుకొను యత్న ముద్భట గ్రంథమున గనుపించును. శైవ వైష్ణవశాక్తాత్మకమైన కవి యుపదేశమార్గము పాండురంగ మాహాత్మ్యమున వ్యక్తమగును. ఇతని కవితాపరిణామము పువ్వు, కాయ, పండువలె వరుసగా నీ మూఁడు గ్రంథముల యందును గోచరించును.

ఉద్భట చరిత్రమున దీర్ఘసమానభూయిష్ఠమైన యోజోగుణ రచనయు, నలతి యలతి తునియల తీయని పదబంధము గల రచనయు సమపాళముగ

---

[3] ఉద్భటుని కథలు కర్ణాటభాషలోఁగూడ కలవు. సోమరాజు కవి, బసవాంక కవి యను కవులు వానిని రచించిరి. "పాల్కురికి సోమనాథుఁడు కుమారపాలఘూర్జరు నిదిగాఁ జెప్పిన కథనే కర్ణాటకవులుద్భటుని కథగాఁ జెప్పిరి........ ఆ కర్ణాటక కవులకంటె మన సోమనాథుఁడు పూర్వుఁడు. కుమారపాలున కుద్భటదేవుఁడని నామంతరముగా నా యుద్భటదేవచరిత్ర పీఠికలో శ్రీ శ్యామాచార్యులుగారు వ్రాసిరి. అదె యెట్లో ? మల్లికార్జున పండితారాధ్యుఁడు, సోమనాథుండు వారి నిరువురను వేర్వేఱుగాఁ జేర్కొనిరి. కుమారపాలుని చరిత్రమున నాతని కా నామాంతర మున్నట్లు చెప్పరయిరి. పాల్కురికి సోమనకథ చొప్పున రచియింపఁబడిన ఈ యుద్భటారాధ్య చరిత్రమునకును, నా కర్ణాట ప్రబంధములకును నేమియు సంబంధము గానరాదు.

—పీఠిక, పుట. 17–18.

నున్నవి. అచ్చతెలుఁగులు సంస్కృతముతో మిశ్రితము చేయఁబడినపుడు శ్రీనాథుని పాకమున్నది. కథచెప్పుటలో, సన్నివేశములను పొందుపఱచుటలో నిందుఁ గల నిర్మాణమార్మికత ఘటికాచల గ్రంథమున లేదనుట స్పష్టము.

ఈ కావ్యమందలి గ్రంథపీఠికలో నితఁడు చేసిన గురుస్తుతిలో నొక విశేష మున్నది. ఏఁడవ పద్యమున – "సాధ్వసభావమద్గురుఁబసన్ను భజించెద నైలనాహ్వయున్" అని యున్నది. ఇరువది నాల్గవ పద్యమున –

"పాలగుమ్మేలేశ పదపయోజద్వయీ
ధ్యానధారణ సముదాత్త చిత్తు"

అని యున్నది. విమర్శకు లెల్లరును బాలగుమ్మేలేశ్వరుఁడే రామకృష్ణుని గురువని నిర్ణయించినారు. ఈ రెండు పద్యములలోఁ జెప్పబడిన యిరువురు నితనికి గురువులో, ఐలనయొ, ఏలేశ్వరుఁడో తెలియదు. ఇందైలనను గీర్తించిన పద్యము సగమున కెక్కువగా గ్రంథపాతమైనది. లభించిన మొదటి పాదము,

"అధ్వరకర్మకౌశల సమంచితు, మానసపద్మ కీలితో
క్షధ్వజ.... ...."

అని మాత్రమున్నది. ఇరువురు భిన్నవ్యక్తులైనచో నైలన శైవ సంప్రదాయమునకు సంబంధించిన వేదోక్త యజ్ఞకర్మాచరణమునకు గురువనియుఁ, బాలగుమ్మేలేశ్వరుఁడు ధ్యానధారణాత్మకమైన యష్టాంగ యోగమార్గమునకు గురువై యుండుననియు నూహించుటలోఁ దప్పు లేదు. లేదా రామలింగేశ్వరస్వామివలెనే పాలగుమ్మేలేశ్వరుఁడు గూడ నితనిచే నుపాస్యమానుఁడై, పాలగుమ్మి గ్రామమున వెలసిన యొక దైవతము గావచ్చును.

ఈ గ్రంథ మింతవఱ కొకే ముద్రణము పడియున్నది. మహిష్మతీ ముద్రణాలయము, ముక్త్యాల, 1926. ఇందు మూలము మాత్రము ముద్రితము. దీనికి కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పీఠిక పదునెనిమిది పుటలలోను, ముదిగొండ బసవయ్యశాస్త్రిగారి విజ్ఞప్తి యొకటిన్నర పుటలలోను జతపరువఁబడినది. వేటూరివారి పీఠికలో నమూల్యములైన యంశములు పెక్కులు చర్చింపఁబడినవి.

శ్రీ ముదిగొండ బసవయ్యశాస్త్రిగారి విజ్ఞప్తిలో నీ గ్రంథ సంపాదనను గూర్చిన ముఖ్యాంశము లున్నవి. ఈ చరిత్రము నైజాం మండలమునుండి సంపాదించి నా కొసంగినవారు . ములుగు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. వీ రొసంగిన తాళపత్రగ్రంథము శిథిలావస్థనంది, మఱియొక ప్రతియుండినఁగాని వ్రాయుటకు వలనుపడని స్థితిలోఁ బ్రత్యంతర మొసంగినవారు... ముదిగొండ నాగలింగశాస్త్రిగారు. ఈ రెండవ ప్రతియందు 1,3 ఆశ్వాసము లొకింతశిథిలమై యున్నవి. ద్వితీయాశ్వాస మసలే లేదు. ఈ 1,2 ప్రతుల సంప్రతింపుతోఁ గొఱతపడిన పద్యభాగము లట్లనే యుంచి లభించినంతవఱ కున్నదున్నటుల నొక ప్రతి నెత్తి

వ్రాసితిని.... మల్లంపల్లి మల్లికార్జునశాస్త్రిగారు లేఖక ప్రమాదముల సవరించి లుప్తభాగములఁ జాలవరకుఁ బూరించి దయచేసిరి... వేటూరి ప్రభాకరశాస్త్రి గారు... గ్రంథపరిష్కారమున కీయగొని చక్కగఁ బరిశోధించి కవిహృదయ మెరింగినంతమట్టు పూరణముల సంస్కరించి మఱింత మెఱుగు పెట్టుటయే కాక పాండురంగ మాహాత్మ్యాది కృతులు రచించిన రామకృష్ణుఁడే రామలింగకవియని సిద్ధాంతీకరించు విపులమైన పీఠిక వ్రాసి యొసంగిరి." —విజ్ఞప్తి పుటలు 1–2.

పాండురంగ మాహాత్మ్య కథ

ప్రథమాశ్వాసము: కృత్యాది పీఠికలో మొదటి తొమ్మిది పద్యములును దైవస్తుతి. ఇందు వరుసగా శ్రీకృష్ణుఁడు కథానాయకుడు; లక్ష్మి, బ్రహ్మ, సరస్వతి, శివుఁడు, పార్వతి, విష్వక్సేనుఁడు, గరుడుఁడు, అనంతుఁడు స్తుతింపఁ బడినారు. ఇందుఁ బార్వతీ పరమేశ్వరులు కావ్యమున కంతటికిని శ్రోతయు, వక్తయునై యున్నారు. కథలో బ్రహ్మపాత్రకుఁ బ్రసక్తి యున్నది. సరస్వతియు మంత్రమూర్తిగాఁ బెక్కు తావులందుఁ బ్రసక్తమైనది. వీరికుమారుఁడు నారదుఁడు పాండురంగవిద్యను సమగ్రముగా నుపదేశ మందిన ప్రథమ శిష్యుఁడుగాఁ జిత్రింపఁబడినాఁడు.

కవిస్తుతిలో నుద్భటచరిత్రమునందువలెనే వాల్మీకి, వ్యాసుఁడు, "నన్నయ భట్టాది కవులు" స్మరింపఁబడినారు. తరువాత సత్కవి ప్రశంసయు, దుష్కవుల యావశ్యకతయుఁ జెప్పఁబడినవి. భట్టరు చిక్కాచార్యులను పేరుగల శ్రీ గురు మూర్తినిం దలఁచి యొక భాగవత చరిత్రము రచింపఁ బూనియున్న సమయమున సంప్రదాయజ్ఞుఁడు, మహనీయుఁడు నగు విరూరి వేదాద్రిమంత్రి పండితసభలో వివిధామ్నాయ పురాణ కథలను వినుచు రామకృష్ణకవిని బిలిపించి ఇట్లని కోరెను: "నీమ్రుదు విశదోక్తులఁ బౌండరీకవిభుచరిత నాపేర నుడువుము. స్కందపురాణ నీరనిధికౌస్తుభమై ప్రభవించు దేవకీనందనుని సత్కథలను నీ నవ్య కవిత్వకళా కలాపమను కుందనమునఁ బొదిగి క్రొత్తగు సొమ్మొనరించి వైష్ణవకోటి నలంక రింపుము". ఇట్లు కోరుచు సన్మానించి సారస్వతమగు తాంబూలమును సమర్పించెను. రామకృష్ణుఁడు రచన కుపక్రమించి కృతిపతి వంశాభివర్ణనము నొనర్చెను.

పూర్వము శఠమర్షణుఁ డను ఋషి కలఁడు. వాని వంశమున విరూరి యన్నయ మంత్రి పుట్టెను. వానికిఁ దిప్పరాజు, రంగరాజు, గుండమరాజు ననుసుతులు గలిగిరి. అందు రంగరాజు పరమ వైష్ణవుఁడు. వాని కొడుకు శ్రీరామమంత్రి. అతనికి నృసింహుఁడు, రామానుజయ్య, రంగరాజు, వరద రాజును నలుగురు కొడుకులు. వారిలో నృసింహునకు వెంగళుఁడు, కోనప్ప యను సుతులు గలిగిరి. రంగరాజునకు వరదయ్య, రాఘవయ్య యను సుతులు గలిగిరి. వరదయ్యకు గనుగొంతన, యొబళయ్యయను కుమారులు కలిగిరి, రామానుజయ్యకు వేదాద్రిమంత్రి, రామకృష్ణమంత్రి, తిరుమలయ్య, లక్ష్మయ్య

యను నలుగురు సుతులు, వీరిలో వేదాద్రిమంత్రియే యీ గ్రంథమునకుఁ గృతిపతి. ఆయన చక్కని వ్రాయసము. వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్యుఁడు, షడ్దర్శనీపారగుఁడు, వాధూలగోత్రోద్భవుఁడు నగు కందాళ అప్పయ్యగారు వేదాద్రిమంత్రి గురువు. ఈ వర్ణనమయిన వెనుక వేదాద్రిమంత్రి కుటుంబము వివరములు, షష్ఠ్యంతములు గలవు. ఈ గ్రంథపీఠికలోఁ దొంబదియేఁడు గద్య పద్యము లున్నవి. ఇటనుండి కథారంభము :

పూర్వము శౌనకాదిమునులు సూతునిగాంచి "మహాత్మా ! పాపహరములు, ప్రభావయుతములు, నిహపదార్థప్రాప్తిమూలములు నగు క్షేత్రము, వేలుపు, తీర్థము నొక్కెడఁ గూడియుండినచో మాకుఁ దెలుపుమ"ని కోరఁగా నతఁడు కాశీమహిమాను వర్ణనాపూర్వకముగా వారి ప్రశ్నకు నుత్తర మొసఁగెను. ఇటఁ బదునెనిమిది పద్యములు కాశీవర్ణన మున్నది. కాశిలో నివసించుచున్న యగస్త్య మహర్షి దేవతల ప్రార్థనలపైని వింధ్యాద్రిగర్వ మడఁచుటకు సభార్యుఁడై దక్షిణా పథమునకు బయలుదేరెను. వింధ్యము నడఁగించి యతఁడు కొల్హాపుర మేగి లక్ష్మిని వేదమంత్రములతో నారాధించి యామెయాజ్ఞను సామిమలకుఁ బయన మయ్యెను. దారిలోఁ జెంచులవారి పూజ లందుకొనుచుఁ గుంతలదేశమునఁ బంపాతీరమునకు వచ్చెను. ప్రయాణమువలన నలసటఁ జెందిన లోపాముద్రకుఁ గాలక్షేపముగా మాల్యవంతము, నందలి ఋష్యాశ్రమములు, మతంగాశ్రమము, పూర్వ మచ్చట రాముఁడు చేసిన వనవాస సంచారము వర్ణించి యాయా ప్రదేశములను జూపెను. అటనుండి సాఁగి తుంగభద్రానదిని దాటి హేమకూట నివాసుఁడగు శివుని దర్శించి స్వామిమలకు వచ్చి షణ్ముఖుని దర్శించి స్తుతించెను. అచటఁ గొన్ని దినములుండి యతఁడు రచించిన మహాస్కాంద గ్రంథమును విని "మహాత్మా ! సర్వోత్తమమగు క్షేత్రము, తీర్థము, దైవతము నొక్కెడ నున్నచోఁ దెలుపుమని ప్రార్థించెను. కుమారుఁడు నట్టి విశేషమునుఁ దాను మున్ను విని యుండమింజేసి తండ్రి నడిగి తెలిసికొనవలెనని యగస్త్యునితోను, బరివారముతోను గైలాసమున కేగెను. ఇట నిరువది పద్యములతోఁ గుమారుని ప్రయాణ వర్ణన మున్నది. అది మహాప్రతిభావంతము, నాశ్చర్యకర కవితావిభూతి గలదియునై యొప్పుచున్నది.

ఆ సమయమునకుఁ బార్వతీ పరమేశ్వరులు వనవిహారముఁ జేయుచుండిరి. అందుఁ బార్వతియు క్షేత్ర తీర్థ దైవతములను గూర్చిన పరిప్రశ్నమే పరమేశ్వరుని జేసినది. అతఁడు వివరింపఁ బోవుచుండగాఁ గుమారస్వామియు నగస్త్యుఁడు పరివారము వచ్చి యదియె ప్రశ్నము నడిగిరి. శివుఁ డుపదేశపూర్వకముగాఁ బాండురంగక్షేత్ర మహాత్మ్య రూపమున వారికి సదుత్తర మొసఁగెను.

ద్వితీయాశ్వాసము : ఘర్మవీరానదియు, భీమరథీనదియుఁ గలసిన ప్రదేశము నకు దక్షిణమున నొక యోజనమున నొక పుణ్యక్షేత్రమున్నది. దానిపేరు, నాతీర్థముపేరును బౌండరీకములు. అచటఁ బాండురంగఁ డను పేర లక్ష్మి విభుఁడు వెలసియున్నాఁడు. అది కల్పమునఁ బదునెనిమిదవ ద్వాపరము చివరఁ బుండరీకుఁ డను నొక బ్రాహ్మణునకుఁ బ్రత్యక్షమై కృష్ణుడు పాండురంగఁ డను పేర భోగమోక్షప్రదుఁడై యున్నాఁడు.

అప్పుండరీకుఁడు తపశ్శాలియు, శాంతుఁడు, దాంతుఁడై, శీలవంతుఁడై, జితేంద్రియుఁడై, వర్ణాశ్రమధర్మ నిష్ఠుఁడై విష్ణుభక్తుఁడై విలసిల్లుచుండెను. సర్వ యోగమార్గముల మార్గము లెఱిఁగి యనుదినము మాతాపితృసేవనము, హరి ధ్యానము విడువక యుండెను. చలిది చిక్కము దాల్చిన బాలకృష్ణమూర్తి యతని ధ్యానమున నిలచెను. కాలక్రమమునఁ బరలోకమున కేఁగిన తలిదండ్రులకు "గంగ నస్తి గయఁబిండంబు" నర్పించి, బుద్ధిమంతులగు సుతులను బడసి నడిమి వయస్సు దాఁటఁగనే యీషణదూషణ మొనర్చి పుండరీకుఁడు హరినిగూర్చి నిశ్చల తపస్స మాధి మగ్నుఁడయ్యెను. వాని తపస్సునకుఁ గృష్ణుని మనస్సు గోపికలు పెట్టు వెన్నవలెఁ గరఁగెను. వెంటనే నెమిలిపింఛముతో, శ్రీవత్సాంకములతో దిగంబరుఁడైన నీలవర్ణుఁడై బాలకృష్ణాకృతిగా నతనికిఁ బ్రత్యక్షమయ్యెను. పుండరీకుఁడు దశావతారాది స్తుతులతో వానినిఁ బ్రసన్నుని జేయఁగా నా దేవుఁడు వరము గోరుమనెను. అపుడు పుండరీకుఁడు "ఈ లలితరూపముతో నిచట వసింపుము, ఏ క్షేత్రము నెట్టి తీర్థమును జెందని యున్నతి వహించి ఈ క్షేత్ర తీర్థములు నా పేరఁ బఱఁగుఁగాక!" స్వామి యా వర మొసఁగి ప్రకట గుప్తాకారమునఁ బశ్చిమాభిముఖుఁడై యచట వెలసెను.

ఇచటఁ బౌండరీకమందలి క్షేత్రతీర్థముల విశేషములు, నర్చా మార్గములు, మంత్ర తంత్రాది విధివిధానములు వర్ణింపఁబడినవి. ఇచట నొక గోపిక హరినిగూర్చి తపస్సు వేసెను. స్వామి ప్రత్యక్షము కాఁగా నామె నిర్నిమేషనయనయై నిలఁబడెను. శరీరము పులకింపఁగాఁ గ్లేశపాశముతోఁ గూడఁ గేశపాశము విడిపోయినది. స్వామి మందహాసము చేసి "ఇట్లు నిలఁబడితివేమి" యని ప్రశ్నింపఁగా నామె యతని పాదములను విడువఁజాలనని పాదములపైఁబడి "ఇవి యిట్లే నా కరస్పర్శఁగల్గి సలాంఛనములై వెలయుఁగాక" యని కోరెను. స్వామి యంగీకరించి "నీ విట్లే ముక్తకేశివి యనంబరఁగా నిలిచి యుండు" మని యాన తిచ్చెను. ఇప్పటికి నామె యా క్షేత్రమునం దీశాన్యమున వంగిన శరీరముతో నిలిచియున్నది.

భైమి యను నదీకన్యక యలలతోఁ గులుకుచుఁ బర్వెత్తుకొని వచ్చి యా క్షేత్ర బహిఃప్రదేశమున భీతయై నిలిచిపోయెను. అపుడు స్వామి తన పాదములపైకి వచ్చి ప్రవహింపుమని యజ్ఞాపింపఁగా నామె యటు లొనర్చెను. అగస్త్యుఁడు తపస్సుచేసి యా జలాంతరమున నొక దివ్య లింగాకారముగా శివునిఁ బ్రతిష్ఠించెను. ఇంకను బహు విధములైన తీర్థములు, దైవతములు, ఋషులు నా క్షేత్రము నలంకరించిరి. ఈ క్షేత్రమే తీర్థ క్షేత్ర దైవతముల పవిత్రతకు సంగమము," అని శివుఁడు చెప్పిన విధానమంతయు మహామునులకు సూతుఁడు వినిపించెను. శౌనకుఁడు మరల నిట్లు సూతుని బ్రశ్నించెను. "ఆద్యుఁడైన హరి, నందావత్య మెట్లయ్యెను? వాని చరిత్ర యేమి? రాధ యెవ్వతె? ఆమె కోరికయేమి? శంకరుని దేహమున భీమరథీనది యెట్లుద్భవిల్లినది? శ్రీకృష్ణుని మంత్రమయ శరీర రహస్య మెట్టిది?" నావిని సూతుఁడు పూర్వము నారదునకు శంకరుఁడు చెప్పిన పుండరీకుని చరిత్రమును సరహస్యముగాఁ జెప్పఁ దొడఁగెను. శివుఁడు చెప్పిన పాండురంగ మాహాత్మ్యమును విని కుమారస్వామియు,

మనులును సంతృప్తులై యేగిరి. ఇంతలో నారదుఁడు కైలాసమునకు వచ్చుచు వెనుదిరిగి పోవుచున్న కుమారస్వామిని, ఋషులను జూచి తన దివ్యదృష్టితో వారు వచ్చిన పనిని దెలిసికొని తానును శివునిచేతఁ బరమ రహస్యము నుపదేశ మొందలేకపోయితినని మిక్కిలి విచారించి యిపుడైనఁ గరుణామయుఁడు శివుఁడు న న్ననుగ్రహింపకుండునా యని పోయి దర్శించి స్తుతించి యిట్లు వేడుకొనెను: "నేను నీ యను జీవిని. అయినను సమయమునకు లేక మోసపోయితిని. కాళ్లు నొప్పిపుట్టునట్లు పనిలేక లోకములు దిరుగుట నా కలవాటైనది. ఏ శ్రమ లేకయే యగస్త్య కుమారాదులు నీ నుండి పరమార్థము నుపదేశము నందిరి. నా యందు దయఁజూపుము." ఇట్లు ప్రార్థించిన నారదునితో శివుఁడు మఱల సరహస్యమగు పౌండరీక క్షేత్రమహిమమును వివరించుచు దక్షిణద్వారమందలి శ్రీ నృసింహుని పాపహరత్వమునకు నిదర్శనముగా నిగమశర్మ కథ చెప్పెను.

తృతీయాశ్వాసము : కళింగదేశమునఁ బిఠాపురమునందు సభాపతియను నొక యహితాగ్ని కలఁడు. వానికిఁ బురుషసంతతి లేకపోఁగా బహు పూజ లొనర్చి లేకలేక యొక కొడుకును బడసెను. అతనిపేరు నిగమశర్మ. అతఁడు యౌవనమున వేద వేదాంగ పారంగతుఁడయ్యుఁ బూర్వకర్మ వశమున మనస్సు మూఁడవ పురుషార్థమువైపునకేఁ బ్రొగ్గెను. దుస్సాంగత్యము నొంది వేశ్యలు, ద్యూతము, పానము నభ్యసించి ధనమంతయు దుర్వ్యయము చేసి, గడువక ఋణములు చేసి చివరకుఁ జౌర్యమునకుఁ గూడఁబాలుపడెను. వాని దుర్నయ ములను విని శీలవతియగు నతని యక్కగారు వానిని సరిదిద్ది కుటుంబమును జక్కఁబెట్టుటకై భర్తతో, బిడ్డలతో వచ్చి కొంతకాలముండి వానికి నీతులు గఱపఁజూచెను. వాఁడును బుద్ధిమంతునివలె నటించుచు నొకనాఁటి రేయి యింటిలోని నగలన్నియు దొంగిలించుకొని యరణ్యమార్గమునఁ బోవుచుండఁగా దొంగలు బావమోది దోచుకొనిపోయిరి. తెలివితప్పి పడియున్న నిగమశర్మ నొక కాపు రక్షించి తన యింటికిఁ గొనిపోయెను. అటఁ గొంతకాలముండి యతఁడు కాపుకోడలిని లేవదీసికొనిపోయి బోయకులమునఁ గలసి స్వేచ్ఛగా మద్య మాంసభక్షణ చేయుచుఁ గాలముఁ గడపెను. ఆ కాపు కోడలు చనిపోఁగా నతఁ డొక చండాలకన్యను జేపట్టి సంతానమును బడసెను. అతఁ డొకనాఁడు వేటకుఁ బోయి తిరిగి వచ్చుసరికి దారాపుత్రులతో గృహము దగ్ధమయ్యెను. నిగమశర్మ దుఃఖావేశమున విలపించి నిశ్చేష్టుఁడై యనుద్దిష్ట ప్రయోజనుఁడై బహు యోజనములు నిర్భోజనుఁడు, నిరంబుభజనుఁడునై తిరుగుచుఁ బూర్వపుణ్య వశమునఁ బాండురంగక్షేత్రము దక్షిణద్వారమున నున్న నృసింహాది యాలయము నెదుట సంగమ తీర్థమున మునిగి వచ్చి నృసింహుని యెదుటఁ బ్రాణములను విడచెను. వానినిఁ గొనిపోవ యమదూతలు రాఁగా నతఁ డాక్రోశ మొనరించెను. అది విని సుదర్శనచక్రము వచ్చి యమదూతలను బాఱద్రోలెను. విష్ణుకింకరులు వానిని గరుడాంచితయానమున శ్వేతద్వీపమునకుఁ గొనిపోయిరి. అందీతఁడు కుముదుఁ డనుపేర స్వామి సారూప్యముతో నిప్పటికినిఁ బార్శ్వచరుఁడై యున్నాఁడు. ఇటుపైని శివుఁడు మరల నారదునకుఁ బుండరీకుని తపశ్చర్యను వర్ణించి చెప్పినాఁడు. పుండరీకుఁడు తపస్సు చేయుచున్న కాలముననే భూమి దుష్టుల భారమును సహింపనోపక నారాయణుని దర్శించుటకు

శ్వేత ద్వీపమునకుఁ బోయెను. ఆమె మొర విని దుష్కృతుల వినాశముకొఱకును బుండరీకునివంటి సజ్జనుల ననుగ్రహించుట కొఱకును దాను శ్రీకృష్ణుఁడై యవతరింతునని మాట యిచ్చి పంపి కృష్ణావతార మెత్తి బాల్యలీలలను జూపుచు పెరిగెను.

కృష్ణావతార మెత్తిన విష్ణునకు మనఃప్రీతిఁ గావింపఁదలఁచి బ్రహ్మ నిఖిల భువనమోహినియగు నొక శక్తి నుత్పాదించెను. ఆమె నందుని మఱదియగు శతగోపునకుఁ బుత్రియై రాధ యనుపేరఁ బరఁగుచు యౌవనారంభమున మనస్సు పరమాత్మయందు లగ్నముచేసి వాసుదేవ తత్త్వమును మనస్సున నిల్పి ఋణవిమోచన తీర్థమునఁ దప మారంభించెను.

చతుర్థాశ్వాసము : ఆమె తపస్సున నొక్క హేమంతము, వసంతము, గ్రీష్మము, వర్షము గడచినవి. శరదృతువున శ్రీకృష్ణుఁడు "ఫలిత కల్పతరు లీల" రాధయగ్రమున నిలిచి శంకరుఁడు పార్వతి నేలినట్లు తా నామె నర్ధశరీరముగా ననుగ్రహించెను.

ఇంతకాలము తపస్సమాధిమగ్నుఁడై యున్న పుండరీకునకుఁ దొలుత బ్రహ్మ ప్రత్యక్షమయ్యెను. పుండరీకుఁడు వానినిఁ బరమాత్మగా స్తుతించెను. బ్రహ్మ సంతసించి వరముఁ గోరుమనెను. అతఁడు విష్ణువుపై మనస్సు నిలుచుటను, విష్ణుసాయుజ్యమును, ధర్మమార్గ నిశ్చితబుద్ధియుఁ గోరెను. ఆ వరములిచ్చి బ్రహ్మ యనతికాలముననే విష్ణువు ప్రత్యక్షమగునని చెప్పి యంతర్ధానమందెను. దాని కనుగుణముగా మరునాఁడు పుండరీకుఁడు షట్చక్రములలో స్వామిని న్యాసము చేసి కుండలిని నుద్బోధించి ధ్యానము చేసెను. వెంటనే విష్ణువు బాలకృష్ణుని రూపమున సాక్షాత్కరించెను. వానినిఁ బుండరీకుఁడు నానావిధ ఛందోమయమూర్తిగా వివిధ ఛందస్సులలో స్తుతించి ధన్యుఁ డయ్యెను. స్వామి వరముఁ గోరుమనఁగా "నిపుడున్నయట్లయన్మన్నామ చిహ్నితైతన్మహాక్షేత్రతీర్థ మధ్యమున సకల జనులకు మోక్షరాజ్యము నొసఁగుచు నిలువుము" అని కోరెను. కృష్ణుఁ డనుగ్రహించెను. అప్పటినుండి యచట ననేక రూపములతో స్వామి విహరించు చుండెను.

ఒక కార్తిక పూర్ణిమనాఁడు కృష్ణుఁడు వేణుగానము చేయఁగా వినిన ధేనువొకటి మైమఱచి యపరిమిత దుగ్ధములను గురిసెను. ఆదుగ్ధఫేనము గాలి కెగసి వచ్చి కృష్ణుని మౌళి నలంకరించెను. తత్ఫలితముగా నవర జన్మమున నా ధేనువు మశీలయను బ్రాహ్మణకన్యగా నుద్భవించెను. రూపహీనుఁడు, లోభి, మత్సరుఁడు, చపలుఁడు, బంధువిరోధి, శఠుఁడు నగు నొక బ్రాహ్మణున కిచ్చి యామెను వివాహము చేసిరి. ఆమె కడు పతిభక్తిఁ గలిగి యతనినే దైవముగాఁ గొలుచుచుండెను. ఒకనాఁ డతఁ డూరలేని సమయమున నొక బ్రహ్మచారి వచ్చి భోజనము పెట్టుమని యడిగెను. ఆమె యున్న యన్నమును వడ్డింపఁగాఁ దిని చాలదని రచ్చచేసి యత డింటిలోని సమస్త భోజన పదార్థములను భక్షించెను. ఆమె నమస్కరించి భక్తితోఁ బ్రార్థింపఁగా నా వటువు బాలకృష్ణుఁడై పాదకట్టి

యామె వస్త్రవర్తనమునకు మెచ్చితిననియు, బూర్వకర్మవశమున నామె భర్త దుష్టుఁ డయ్యెను గాని యిట నుండి సద్బుద్ధి యగుననియుఁ జెప్పి చిరకాలము గర్వము లేని వినయముతోఁ దన్నుగొలుచుచు సంసారధర్మమును నిర్వహించి కడు వృద్ధురాలైన వెనుక శరీర పరిత్యాగమునకై భర్తతోఁ బాండురంగ క్షేత్రము నకు రమ్మని యంతర్ధానమయ్యెను. అప్పటినుండి యామెయు, భర్తయు సుఖముగ నుండిరి.

ఒకనాఁ డొక కాకి పాండురంగని యాలయము చేరువ రావిచెట్టునుండి బలి పీఠమునకు వచ్చి బలిమెతుకులు దిని రెక్కలు విసరఁగా నాలయప్రాంగణ మున ధూళి తొలఁగినది. తత్పుణ్యమున నది సుశీలపుత్రుఁడై జన్మించెను.

ఒక హంస యొకనాఁడు మండుటెండకుఁ దాళఁ జాలక తటాకమున మునిఁగి యాలయములోనికి వచ్చి రెక్క లల్లార్పఁగా నీటితుంపురులు చల్లని వాయువులతో స్వామి కుపచర్యఁ జేసినవి. ఆ ఫలమున హంసము సుశీలకు రెండవ కుమారుఁడై పుట్టెను.

ఒకసారి దాసి పెంచుచున్న చిలుక పంజరమునుండి తప్పించుకొని యాదాసి ముత్యాల హారమును ముక్కునఁ గఱచుకొని యెగిరిపోయి గుడిలోపలి యొక దండెముపై వ్రాలి ముత్యములను ముక్కుతోఁ బొడిచి చితిపెను. అవి యాలయ ప్రాంగణమున రంగవల్లికలై యొప్పారెను. ఆ పుణ్యమునఁ జిలుక సుశీల మూఁడవ కుమారుఁడై పుట్టెను.

పా మొకటి యెలుకను దరుముకొనుచు గర్భాలయములోనికి వచ్చి స్వామి పాదపీఠమున నున్న మొగలిరేకు పరిమళము నాఘ్రాణించెను. ఆ వాసనచే నా సర్పము సుశీలకు నాల్గవ కుమారుఁడై పుట్టెను.

తేనెటీఁగ యొకటి స్వామి కర్పింపఁ బడిన పుష్పములోని మధువును గ్రోలఁగా శ్రీపాదతీర్థము గ్రోలిన ఫలమిచ్చి యది సుశీలకుఁ గనిష్ఠపుత్రుఁడై పుట్టెను. ఇట్లు సుశీల పుత్రవతియై మనుమలు, మునిమనుమలు గలిగినందాక గృహస్థధర్మమును నిర్వర్తించి తుదకు భర్తతోఁ గలసి దివ్యవిమానమెక్కి పాండురంగనిలో లీనమయ్యెను.

పాండురంగక్షేత్రమున క్షేత్రపాలుఁడు నిలిచి భక్తిహీనుల నందుండనీక పోఁద్రోలు చుండును. ఒకనాఁ డొక ఖేచరుఁడు భార్యలతో విమాన మెక్కి పాండురంగని గుడి మీఁదుగా నెగిరెను. వెంటనే క్షేత్రపాలుఁడు కోపించి డేగవలెఁ బైకెగసి వాని విమానమును బట్టి నేలఁగూల్చి గర్వభంగ మొనర్చెను. వెంటనే వాసుదేవుఁడు వారించి యెట్టి దుష్కర్మునైన లొంగినవానిని, దర్ప ముడిగినవానిని, జంపరాదని విడిపించెను. ఆ గంధర్వుఁడు లక్ష్మీశునిఁ జూచి తప్పు క్షమింపుమని ప్రార్థించి వెడలిపోయెను.

పంచమాశ్వాసము : సుఖమాలికా భీమరథీనదులు కలిసినచోటు గొప్ప తీర్థము. తత్ప్రాంతమునఁ బూర్వద్వారమున సిద్ధేశ్వరలింగ మున్నది. ఇంకను దీర్థాదుల వివరములు వర్ణింపఁబడినవి. ఒక బోయవాఁ డొక జింకను దరిమి బాణమునువేసెను. ఆ జింక బాధతోఁబర్వెత్తుచు సంగమ తీర్థమున మునిఁగి చనిపోయెను. అందువలన దానికి విద్యాధరత్వము గలిగెను. దాని నెఱిఁగి యా బోయ యచ్చెరువుపడి యందు స్నానము చేసి నీరములఁ గ్రోలి దేహాంతర మున దివ్యత్వము నందెను.

సంగముఁ డను రాక్షసుఁ డొక రాతి క్రింద దాఁగఁగా విష్ణువు వానిని నీవలి కీడ్చి చంపెను. ఆ సమీపమునఁ బశ్చిమ ద్వారమున భువనేశ్వరియు, నుత్తర ద్వారమున మహిషమర్దనియు నున్నారు.

బ్రహ్మమానసపుత్త్రుఁడగు సనందనుఁడు హస్తినాపురి కేఁగి ధర్మరాజును జూచి యతఁడు బంధువధ జనిత దుఃఖమునఁ గ్రుంగుటెఱిఁగి పౌండరీక క్షేత్రము నకుఁ బొమ్మని యాజ్ఞాపించెను. ధర్మరాజు తమ్ములతో నచటి కేఁగి స్వామిని దర్శించి దుఃఖవిముక్తుఁ డయ్యెను.

సుశర్మాఖ్యుఁ డను నొక బ్రాహ్మణుఁడు, శూద్రస్త్రీభర్త మహాపాపము లొనర్చి బాటసారులను జంపి జీవించుచుండెను. వాఁ డొకనాఁడు నలుగురు వ్యాధులతో దారులు గొట్టఁబోయి మధ్యాహ్నమునఁ దాపమున జలార్థియై వెదకి పద్మ తీర్థమున నొడలు గడిగికొని, నీరములు గ్రోలి యేఁగెను. వాని పాపము లను దినదినము నొక పటమున వ్రాయుచున్న చిత్రగుప్తుఁడు వాని మరణా నంతరమున నా పటము తీసి చూడఁగా శూన్యమై యుండెను. యముఁడు తిన్నఁగాఁ బరీక్షింపఁగాఁ బద్మతీర్థ ప్రభావమున నితఁడు చేసిన పాపములును దొల్లిపుట్టువుల పాపములతోఁ గలసి క్షాళన మయిపోయెనని యక్షరపంక్తి కనుపించినది. యముఁడు పాండురంగని మహిమమును బొగడి సుశర్మను మెచ్చుకొనెను. వాని నింద్రుఁ డర్థాసనమున గౌరవించెను. సుశర్మ మరల భూలోకమున బ్రాహ్మణ వంశమునఁ బుట్టి పాండురంగని యాలయము నూడ్చుచు జీవితముఁ గడపెను. ఆ సుకృతమునఁ జంద్రలోకమున కేఁగి సుఖించి మరల సుకీర్తి యను రాజుగాఁ బుట్టి గొప్ప భక్తుఁడై తగువయస్సున సన్యసించి మోక్షము నందెను.

మాయావి యను రాక్షసుఁ డొకఁడు కలఁడు. వానికిఁ గృతయుగమున నొకటి, త్రేతయందు రెండు, ద్వాపరమున మూఁడు కోఱలు. కృతయుగమునఁ బార్శ్విగ్రాహి యనుపేర హిరణ్యకశిపునకుఁ బుత్త్రుఁడై పుట్టి నృసింహునిచేఁ జచ్చెను. త్రేతలో నతికాయు డనుపేరఁ బరగి రామునిచేఁ జంపఁబడెను. ద్వాపరమునఁ ద్రిదంష్ట్రుఁడై పుట్టి పాండురంగని మీఁదికి గద విసరెను. దాని వేగమునకుఁ గృష్ణుని మొలనున్న గచ్చకాయలసంచి తెగి పడెను. వెంటనే మందహాసమున స్వామి యా రాక్షసుని దునిమెను. ఈ కథ చెప్పి శివుఁడు నారదునకుఁ బాండు రంగ సాధకమగు మంత్రము నుపదేశించెను. పూర్వము బలరాముఁ డీ మంత్ర

మహిమ నెఱుఁగఁగౌరి ఘోరతపస్సు చేసెను. కృష్ణుఁడు నంతసించి యీ మంత్ర ముపదేశించెను. రుక్మిణి యీ మంత్రము నుపాసించి మన్మథుని బుత్రునిగాఁ బడసెను. త్రిలోకములను బూవుటమ్ములచే మన్మథుఁడు జయించుట కీ మంత్ర బలమే కారణము.

త్రిపురాసుర సంహార కాలమున శివునిమేనఁ బుట్టిన శ్రమవారి యొక ప్రవాహమై భీమరథియను నది యైనది. ఆ నది పొంగి పాండురంగ క్షేత్రము మీఁదికి వచ్చు చుండఁగాఁ బ్రజలు భయపడి విష్ణుని శరణుజొచ్చిరి. అతఁడు తన పదములపైనుండి ప్రవహింపఁజేసి యాపివైచెను.

ఈ కథలన్నియు విని నారదుఁడు సంసారమున మునిఁగియున్న సుశీల మున్నగు గృహస్థులకు మోక్షము లభించుట యెట్లని ప్రశ్నించెను. దానికిఁ బరమేశ్వరుఁడు గృహస్థధర్మము సలక్షణముగా సాఁగినచో నది సూటిగా మోక్ష ధర్మమే యని చెప్పి తన్నిదర్శనముగా నయుతనియుతో పాఖ్యానముఁ జెప్పెను.

అగస్త్య మహర్షికి నయుతనియుతులను ప్రియశిష్యు లిర్వురు గలరు. వారికిఁ బెండ్లి చేయుటకు నగస్త్యుఁడు సావిత్రి, గాయత్రి యను నిరువురు కన్యలను బ్రహ్మకడ నుండి గొని వచ్చెను. అయుతుఁడు మోక్షము కావలెనని వివాహ మాడ నిరాకరించి, గురువును దిరస్కరించి, తపస్సు చేయుటకై హిమాలయమున కేగెను. నియుతఁ డిరువురు కన్యలను బెండ్లియాడెను. ఇంద్రుఁ డయుతుని తపస్సు భంగము సేయఁదలచి వృద్ధ బ్రాహ్మణ వేషమున వచ్చి గృహస్థాశ్రమమే మంచిదని వాదించెను. కాని లాభము లేకపోయెను. కామధేనువును వాని తపోభంగమునకు నియమించి ఇంద్రుఁడు వెడలి పోయెను. కామధేను వొక ముసలియావు రూపమున నయుతు నాశ్రమము నెదుటఁ బడియుండఁగా నయుతుఁడు చూచి కరుణించి కాపాడెను. దానిని బోషించు యత్నమున నతని తపస్సు నడలెను. కొన్నాళ్లకుఁ దన తపోభంగమున కదియె కారణమని తలఁచి క్రూరముగాఁ గొట్టి వెన్నాడి వెడల నడచెను. అది పర్వెత్తుచుఁ దపోనిష్ఠలో నున్న వాధూలమహర్షి శిరస్సును ద్రొక్కెను. అతఁ డదరిపడి లేచి తన సమాధిని భంగము చేసినందుల కయుతుని భేక మగునట్లు శపించెను. గురు ధిక్కారముచేసి గృహస్థ ధర్మమును నిందించుటవలన నిట్టి కీడు కలిగెనని యెఱిఁగి మరల నొక కప్పతో నతనికి వివాహము జరిగి సంతతిని బడసిన క్షణమున శాపవిమోచన మగుననియు, నంతవఱకుఁ బాండురంగక్షేత్రమున నున్న నృసింహుని యాలయమున గాలముఁ గడుపుమనియుఁ జెప్పెను. అయుతుఁడు కప్పయై తదాజ్ఞానుసారము వర్తించుచుండఁగాఁ గన్యాకుబ్జ రాజపుత్రిక చెలులతో నచ్చటికి వచ్చి యా కప్పనుబట్టి యాడుచుఁ జాపల్యమున నెగురవైచుచు నట జపము చేసికొనుచున్న యొక వృద్ధ విప్రుని మీఁదఁ బడవైచి తచ్ఛాప వశమున సఖీజనులును, దానును గప్పలై యయుతునకు భార్యలైరి. సంతానము గల్గిన క్షణముననే వారలకు వానితో శాపవిమోచనము గలిగెను. కనుక గృహస్థధర్మ మను కవచమును ధరింపలేనివాఁ డిట్లు పాటుపడును. దైవభక్తితో గృహస్థ ధర్మము నిర్వర్తించువాఁడు భవముగడచు వాఁడగును.

సమీక్ష

రామకృష్ణుని కావ్యములలోఁ బాండురంగ మాహాత్మ్యము మకుటాయమాన మగు ప్రబంధమని చెప్పవచ్చును. ఆంధ్ర వాఙ్మయమున నీ కవికిఁ గల యనన్యత దీని వలననే సిద్ధించినది. "పాండురంగ విభుని పదగుంఫనము" అను మూర్తికవి సూక్తి లోకోక్తిగా వెలసిన దీ కావ్యము వలననే. ఘటికాచల మాహాత్మ్యముకన్న నుద్భట చరిత్రము, దానికన్నఁ బాండురంగ మాహాత్మ్యము గుణోత్తరములైన కావ్య రచనలు. "మృదువిశదోక్తులు" అని యిందలి ఉక్తి వైచిత్రినిఁ గూర్చి వేదాద్రిమంత్రి పల్కిన పల్కెంతయో సత్యము. పరిమాణ మునుబట్టి చూచినను మిగిలినవి రెండును మూఁడాశ్వాసముల ప్రబంధములు. ఇది యైదశ్వాసముల ప్రబంధము. మిగిలిన రెండు కావ్యములందును జెప్పు కొనఁదగిన పాత్రసృష్టియే లేదు. ఈ కావ్యమునఁ బుండరీకుఁడు, రాధ, నిగమ శర్మ, వానియక్క, సుశీల, యయుతనియుతులు సజీవములైన పాత్రలు. ఇందలి యాఖ్యానములు, వానినిఁ గవి చదువరులకందించిన విధానమును విలక్షణములై యనన్యములై యాంధ్ర వాఙ్మయమునకు గర్వకారణములైన కతిపయోదాహరణములలోఁ జేరుచున్నవి. పద్యరచనలోని ప్రసాదము, మాధుర్యము, కథా గమనములోని గాంభీర్యము, వస్తువునం దాపాదింపఁబడిన పవిత్రతయు దీని కొక పురాణ గౌరవమును జేకూర్చుచున్నవి.

స్థల మాహాత్మ్య గ్రంథములలో నెన్నిన నృసింహ పురాణమునకుఁ దరువాత నిదియే గుణమున మిన్నగా నున్న దనుట సాహసముగాదు. శ్రీనాథుని భీమేశ్వర పురాణమున గవిత్వ మనన్యమైనను నిందలి కథాగౌరవ మందుఁ గనుపింపదు. కాశీఖండ మనువాద మగుట వలన దీనితోఁ బోల్పలేము. శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము కేవల శైవ గ్రంథ మగుటవలన శైవ వైష్ణవ శాక్తాత్మకమై సర్వధర్మస్వరూప నిరూపణమై వేదమార్గ ప్రతిష్ఠాపనోద్యమమునకు ఫలమైన పాండురంగ మాహాత్మ్యమునకుఁ గల్గిన గౌరవము దానికిఁ గలుగ దనుటయుఁ దప్పుగాదు. విల్లిపుత్తూరు, శ్రీరంగక్షేత్ర మాహాత్మ్యముల నుగ్గడించు విష్ణుచిత్తీయము కొంతవఱకు స్థలపురాణమని యంగీకరించినచోఁ జాలవఱకుఁ బాండురంగ మాహాత్మ్యమున కున్నంత పురాణ గౌరవము, పవిత్రత, యా గ్రంథమునకు నున్నవి. కాని యది సిసలైన స్థలమాహాత్మ్యము కాదు. ఎక్కువ భాగము గోదాదేవికి సంబంధించిన కావ్యము. మఱియుఁ గేవల వైష్ణవ కావ్యము.

ఈ కావ్యమునందుఁ గవి చూపిన రచనాస్వతంత్రత శ్లాఘ్యమైనది. పద్య రచనలోఁ దనకు గురుతుల్యులైన పూర్వకవుల యనుకరణ మున్నను, ఘట్టములను సృష్టించి నడపుటలో, వర్ణనములలో, నలంకారములలోఁ, దత్త్వదృష్టిలో, మోక్షధర్మోపదేశములో రసోత్పాదన ప్రక్రియలో, వస్త్వైక్య సాధనలోఁ, బాత్ర పోషణములోఁ గవి యీ గ్రంథమున నూటికి నూఱుపాళ్లు నూతన మార్గములను సృష్టించుకొనినాఁడు.

"సామాన్యముఁగఁ బ్రబంధములను రచించు కవులు కొంతవఱకు ప్రయత్నపూర్వకముగా తమ శక్తిని ప్రదర్శించి, యా పిదప నట్టి యత్నమును సడలింతురు. కావుననే మనుచరిత్రము, వసుచరిత్రము, పారిజాతాపహరణము మున్నగు ప్రబంధములలోఁ గొన్ని యాశ్వాసములే రసవంతములుగ నుండి, తక్కినభాగము సామాన్య పద్ధతిని గానవచ్చును. కాని పాండురంగ మాహాత్మ్యము తొలుతనుండి కడవఱకు నొక పద్ధతిలోనే యున్నది. హృదయంగమములగు వర్ణనములును, కథలును, ఆశ్వాసము లన్నింటను గలవు. మొదటి యాశ్వాసమున అగస్త్యముని, కుమార వృత్తాంతములును, ద్వితీయాశ్వాసమున పుండరీక వృత్తాంతమును, మూఁడవ యాశ్వాసమున నిగమశర్మో పాఖ్యాన, రాధికా వృత్తాంతాదికములును, చతుర్థాశ్వాసమున రాధాతపశ్చరణ, సుశీలాది వృత్తాంతములును, అయిదవ యాశ్వాసమున సుశర్మోపాఖ్యానము, అయతనియుత వృత్తాంతమును చాల చక్కఁగాఁ గూర్పబడినవి. ప్రతి వృత్తాంతమునను ప్రత్యేకత గలదు. కొన్ని విషయములు చర్వితచర్వణములే యైనను క్రొత్తదనము గలిగి పాఠకులకు విసుపు గలిగింపక ఆసక్తినే గూర్చుచుండును."

—బులుసు వేంకటరమణయ్య, పాండురంగ మాహాత్మ్య పీఠిక, పుట 27.

బులుసువారి యీ వాక్యము లెంతయు సత్యములు. ఈ కావ్యమునందలి రసవద్ఘట్టము లన్నియు నీ కవి కల్పించినవే గనుక నితని సృజనాత్మకమైన కల్పనాచాతురికి కావ్యము నికషోపలము. ఇందలి ప్రధాన కథలైన పుండరీకుని కథ, నిగమశర్మ కథ, సుశీల కథ, యయుత నియుతోపాఖ్యానము ప్రత్యేకమైన ప్రయత్నముతో సృష్టింపఁబడినవి. పుండరీకునికథ పద్మపురాణమునందును, సంస్కృత పాండురంగ మాహాత్మ్య సంకలన గ్రంథమునందును లీలగానున్నది. జనశ్రుతిలోఁ గొంత యున్నది. దాని నాధారముగాఁ గొని ఈ కవి సజీవమైన పుండరీకుని ప్రాణప్రతిష్ఠ యొనర్చి చిరకాల మాంధ్రవాఙ్మయమున స్థిరపరచినాఁడు. కవి చిత్రించిన పుండరీకుని శీలము, మాతాపితృభక్తి, యాస్తిక్యము, సత్త్వసంశుద్ధి, యాత్మనిగ్రహము, తపోనిష్ఠ, వైరాగ్య సంపత్తి, వేదపురాణశాస్త్ర పారంగతత్వము చదువరులను బునీతులఁ జేయకమానవు. ఈ కథలోఁ జక్కని యాఖ్యానశైలికి సంబంధించిన మర్మము లున్నవి. ఈ కథ రెండు తావులందుఁ జెప్పఁబడియుఁ బునరుక్తము గాక రెండు విధములైన విశేషములను వేఱువేఱుగా వెల్లడించుచు మిగిలిన కథలతోఁ జక్కని సంబంధము నేర్పఱచుకొని కావ్యమునఁ బ్రాధాన్యము వహించి వస్త్వైక్యమునకు మిక్కిలిగాఁ దోడ్పడినది. ఈ కథలోఁ బ్రధానపాత్ర పుండరీకుఁ డొక్కఁడేయయ్యుఁ జదువరులకు విసువు పుట్టింపక నవనవోత్సాహమును గల్గించు నూత్న కల్పనములతో నిండియున్నది. కథ యేకపాత్రక మగుటవలన సంభాషణాచాతురి చూపుటకు మాత్ర మిందుఁ దావు లేకపోయినది. పెద్దనామాత్యుని ప్రవరాఖ్యునితోపాటు, రామకృష్ణుని పుండరీకుఁడు గూడ నాంధ్రప్రబంధనభస్సున నైష్ఠికులలో ధ్రువతారగాఁ జిరకాలము వెలుఁగొందును. విష్ణుదూతలు. జాతరకాపు, నిగమశర్మతండ్రి, యమదూతలును జూడ వచ్చిన రెడ్డివారి భార్యలు మున్నగు నప్రధానపాత్రలు గూడఁ జదువరులకు విస్పష్టముగా సచేతనముగాఁ బొడకట్టునట్లు చిత్రింపఁ

బడినవి. నిగమశర్మ యవసాన కాలమునఁ జేపట్టిన ప్లవకన్య పాత్ర యొక్కటి మాత్రమే హెచ్చుగా వర్ణింపఁబడియు, విస్పష్టముగాఁ బొడకట్టుచున్నది.

నిగమశర్మకథలోని జాతర వర్ణనము మిక్కిలి సహజమై ప్రతిభావంతమై యున్నది. మనుచరిత్రములోని వేట వర్ణమువలె దీనికిని సూటియగు ప్రయోజనము గనుపట్టకున్నను, నిగమశర్మ కాపుకోడలి నెత్తుకొనిపోవుట కుపకరించినది. ఈ కావ్యమందంతట నెక్కువ రచనతోఁ దక్కువ ప్రయోజనమును సాధించిన దీ జాతరఘట్ట మొక్కటే. రాధాదేవి వర్ణనము ప్రబంధ మార్గము ననుసరించిన స్త్రీవర్ణనమునం దుత్తమము. సంస్కృత కావ్యములలోఁ గుమారసంభవము, నైషధము, కాదంబరి, తెనుఁగు కావ్యములలో మనుచరిత్ర, వసుచరిత్రలు రామకృష్ణుని రాధావర్ణనారీతులలోఁ బ్రతిబింబించుచున్నవి. రాధ యౌవనావిర్భావ వర్ణనమునను, దపోవర్ణనమునను, గాళిదాసకవి కుమార సంభవములోని పార్వతి వర్ణనముయొక్క రేఖ లున్నవి.

పార్వతీ పరమేశ్వరుల వనవిహార వర్ణనమున దివ్య శృంగార పరిపోషణ మున్నది. ఇందుఁ గాళిదాసుని కుమార సంభవములోని పార్వతీ పరమేశ్వర శృంగారచ్ఛాయ లున్నవి. పార్వతి పరమేశ్వరున కొక యెడ భర్తురాలును, నొక్కెడ దాసియు, నొక తావున శిష్యురాలును, నొక సందర్భమున దివ్య శృంగారరస సర్వస్వమై, యతని సంహారకళను రసికకళగా మార్చి వేయఁగల కామేశ్వరియగు శ్రీమహారాజ్ఞిగను దర్శింపఁబడినది. పరమేశ్వరునిపాత్రయందు వేదములోని, శైవాగమములలోని రుద్ర, శివతత్త్వములును, పార్వతిపాత్ర యందు వేదములలోని, పురాణములలోని, యాదిశంకరుల తాంత్రిక రచనలలోని శ్రీవిద్యాహృదయము రామకృష్ణుని దార్శనిక భావనాసముద్రమును మథించుకొని యతని ప్రతిభా మంథానము విసురున నమృతోద్భవములై వెలసినవి. ఇట్లే పాండురంగని తత్త్వమును స్థాపించుటలో వేదోక్తమైన నారాయణతత్త్వము, భాగవతోక్తమై, రామానుజులచే దర్శితమైన వాసుదేవ తత్త్వమును, చైతన్యులచే దర్శితమైన బాలగోపాలనీలమణి తత్త్వమును నొక్కమూసలో మూర్తి కట్టి తెనుఁగువారి కందించఁబడినవి.

రామకృష్ణుని రచనాప్రణాళిక ననుసరించి "ప్రకటగుప్తాకారమగు త్రిరావృత్తమైన పురావృత్తము" ఈ కావ్యమునఁ గల వస్త్వైక్యము. అందుఁ బ్రకటాకారమగు త్రిరావృత్తము. 1. క్షేత్రము, 2. తీర్థము, 3. దైవతము. గుప్తాకారమగు త్రిరావృత్తము. 1. పార్వతి, 2. పరమేశ్వరుఁడు, 3. పాండురంగఁడు. ఇం దొక్కొక్క త్రిరావృత్తములోని మూఁ డంశములకు నభేదము సాధించుటయే ఈ కావ్యములోని పరమావధి. ఈ దర్శనము మొత్తమును భావనాపథమునఁ బ్రతిబింబింపఁజేసి కవితాసృష్టి కున్ముఖము గావించుటలో నింపిలి బ్రహ్మపాత్ర భావింపఁబడినది. దాని వాఙ్మయావతారముకొఱకు బ్రహ్మ "ముఖప్రఖాణ తలముల" లోనికి నలుమూలల బోరు తల్పులను దెంచుకొని సరస్వతి వాక్కుగా వెలువడినది. రామకృష్ణుని కావ్యోన్మీలనమునకుఁ బూర్వరంగము నీ విధముగా మనము సమన్వయము చేసికొనవచ్చును.

1. పార్వతీ పరమేశ్వరులను దర్శనము చేయుట
2. బ్రహ్మను భావన చేయుట
3. సరస్వతిని వ్యక్తము చేయుట
4. పాండురంగని తనుసౌధమునందు నివాసము చేయుట.

పాండురంగ మాహాత్మ్య మింతవఱకుఁ బెక్కుమాఱులు ముద్రింపఁబడినది. కొన్ని ముద్రణములు మూలమాత్రములు. కొన్ని లఘు, లఘుతరటీకాసమేతములు. తెన్మఠము శ్రీరంగచార్యుల టీక చాల యసమగ్రము. అందు దోషములను జూపుచు బులుసు వేంకటరమణయ్య రచించిన టీక యంతకంటె విస్తృతమైనను నిదియుఁ జాల యసమగ్రము. "ఆచార్యులవారి టీక అతి లఘువు. బులుసువారిది అంతకంటెను కొంచెము విపులము. కాని, వీరి పరిష్కరణములోను, టీకలోను ఆ లోపములు తొలగలేదు. మరి కొన్ని క్రొత్తవియును చేరినవి."[1]

ఈకావ్యమందలి రచన మిక్కిలి ప్రౌఢ మగుటవలన విపుల వ్యాఖ్యాన సహితమై, సుపరిష్కృతమైన ప్రతి యాంధ్రలోకమున కత్యంతావశ్యకము. ఇందలి పాఠములు కొన్ని పద్యాన్వయమున కడ్డు తగులుచున్నవి. తంజావూరు సరస్వతీ మహల్ ప్రతులలో గొన్ని పాఠము లీ తావులందు సరిపోవుచున్నవి.

రామకృష్ణుని కవిత్వము

దేశకాలాతీతమైన తత్త్వమునకు ద్రష్ట లెందఱుందురో — దృశ్య మన్ని విధముల భాసించును. భావించువా రెంద ఱుందురో యన్నివిధములైన భావన యీ సృష్టిలో వర్తించును. ఎన్ని జీవులు కంఠధ్వని చేయునవి పుట్టునో యన్ని కంఠధ్వనులు బుట్టును. భాష నెంతమంది వాడుదురో యన్ని విధములైన వాక్కు భాసిల్లును. కవిత్వ మెంతమంది స్రష్టలై, ద్రష్టలై వాడుదురో యన్ని విధము లైన కవితాసృష్టియు, దృష్టియు వాఙ్మయ లోకమున భాసించును. దానికిఁ దగినన్ని కవితాలక్షణ నిర్వచనములు కూడ విమర్శక లోకమున వెలువడును.

పై మార్గములలో నే యొక్కటియు నసత్యము కాదు గాని, సత్యమును బూర్తిగాఁ దనలో నిమిడ్చుకొను శక్తి యే యొక్కకవి కావ్యమునకుఁగాని, విమర్శ కుని నిర్వచనమునకుగాని యుండక యది సత్యదర్శనమునకుఁ దా నేర్పరచు కొన్న బాటగా నుండును. రామకృష్ణుని కవితామార్గ మనన్యమయిన మార్గము లలో నొకటి. లోకమందలి కావ్య రచనలలోని విధానము లన్నిటిలోఁ గొన్ని శబ్ద ప్రధానములు, కొన్ని యర్థ ప్రధానములు, మరికొన్ని యుభయ ప్రధాన

[1] పాండురంగ మాహాత్మ్యము — లఘుటీకలు : దీపాల పిచ్చయ్యశాస్త్రి, కృష్ణాపత్రిక, వజ్రోత్సవసంచిక, పుట 137.

ములు. కొందఱి రచనలు రసప్రధానములు, మఱికొందఱి రచనలు ధ్వని ప్రధానములు. వ్యాస, వాల్మీకి, కాళిదాసులవంటి కవుల రచనలలో నెక్కువ భాగము రసధ్వని ప్రధానములు. వివిధములైన కవితామార్గముల వికాసము మన యాంధ్ర వాఙ్మయమునకు నన్నయనాఁటినుండి సంప్రదాయబద్ధముగా సంక్రమించినది. నాఁటినుండి యొక్కొక్క ప్రక్రియలోని యాంధ్రకవికిఁ దత్పూర్వకవు లందరి మార్గములు క్రమవికాసమునకుఁ దోడ్పడినవి. నాటక మందలి నాందీశ్లోకమున శబ్దార్థములయందుఁ గావ్యార్థ సూచన మున్నట్లు కవిత్ర యము వారి రచనలో రాఁబోవు నాంధ్ర వాఙ్మయ కవితా లక్షణములన్నియు బీజప్రాయముగా నిక్షిప్తమైనవి. నాచన సోముడు, శ్రీనాథుడు, పోతనలయొక్క రచనలలో నా బీజములు నాటక ప్రస్తావనలోవలెఁ జక్కగా వికాస మందినవి. అటుపైన సుప్రసాదితమైన యాంధ్ర కవితారంగమున సమగ్రమైన ప్రదర్శనము నకుఁ బాత్రప్రవేశము ప్రబంధ కవులతోఁ జరిగినది.

అనిర్వచనీయమైన యక్షర రమ్యత, ప్రసన్న కథా కలితార్థయుక్తి, నానారుచిరార్థ సూక్తివైభవము, నన్నయ రచనలోని యనన్య గుణములు. అల్పాక్షరముల ననల్పార్థ రచన, తెనుఁగుదనము, నాటకీయమైన శైలియు, నర్థ గాంభీర్యమును దిక్కన రచనలోని లక్షణములు. కావ్యోచితమైన వర్ణ నాత్మక రచనావిధాన మెఱ్ఱాప్రగడ రచనలోని ప్రత్యేకత. ఈ మూఁడు మార్గములను సమన్వయించుకొనుచుఁ దమ ప్రతిభను నిరుపమానముగ నెల కొల్పినవారే తక్కిన మహాకవులు. అందు నాచన సోముఁడు, శ్రీనాథుఁడు, పోతనయు నన్నయ రచనలోని పద్య రచనా సౌందర్యము నుపాసించినారు. నాచన సోమన పదప్రయోగమునందును, వాక్యనిర్మాణ చాతురియందును, సం భాషణల నాటకీయతయందును, దిక్కన నారాధించినాఁడు. శ్రీనాథుఁడు నన్నయ పద్యరచనలోఁ సౌందర్యమును దిక్కన నాటకీయతను, నెఱ్ఱన వర్ణనావైభవమును గలిపి సమగ్రమైన యొక క్రొత్త పాకము సాధించినాఁడు. ఎఱ్ఱన, నన్నయల గుణములకుఁ బోతన నాదబ్రహ్మము ననుసంధించినాఁడు.

ప్రబంధ కవులలోఁ బెద్దన యీ లక్షణముల సమపాళమునఁ బెట్టినాడు. వాని యల్లికయందు జిగి, బిగి యున్నవి. ముక్కు తిమ్మన తిక్కనపాలు కొంత తగ్గించి ముద్దుపలుకును సాధించినాఁడు. మతమునందువలెనే, కవిత్వమునందు గూడ రామకృష్ణుఁడు సర్వమార్గ సమన్వితమైన గడుసుతనపుఁ బ్రౌఢ రచనను సాధించి మెప్పుకొనినాఁడు. ఇతని రచనలోని రహస్యమంతయుఁ బదగుంభనము (Mutual relationship of words) నందున్నదని ప్రాచీన కవులు మెచ్చు కొనినారు.

లోకమందలి కవితా రచనయందు రెండంశము - లిమిడి యుండును. 1. ప్రజ్ఞ (Intellect) 2. ఆవేశము (Emotion). సిద్ధుఁడైన కవిలో నీ రెండు నొకే శక్తినుండి యుద్భవించును. ఆ శక్తినే లాక్షణికులు 'ప్రతిభ' (Brilliance) యని పేర్కొని, శక్తియనియు, నిపుణత యనియు వివరించి పూర్వ సద్వాసనావల సర్వస్వమని నిర్వచించినారు. ఇది పాండిత్యాదుల వలనఁ

గల్గునది కాదు. ఇట్టి ప్రతిభలోఁ గల రెండంశములలో నొకటి ప్రధానము, రెండవది యించుక యప్రధానముగా వర్తించుట సర్వకవి సామాన్యము. రెండును విడదీయరాని విధమున నేకాకృతిగనే కవిత్వమం దవతరించుట సృష్టిలో యుగమున కొకఁ డిద్దరు కవులకుఁదప్ప సిద్ధింపదు. అట్టి సిద్ధికి వాల్మీకి యొక యుదాహరణము. రెండును సమపాళమున వ్యక్తము చేయఁ గల కవుల రచనలలోఁగూడ నొకతావున నొక యంశము, మఱియొక తావున మఱియొక యంశము ప్రాధాన్యము వహించుట కొందఱియెడల జరుగును. షేక్స్పియర్ రచనలు దీని కుదాహరణములు. ఈ దృష్టితోఁ బరిశీలించినచో రామకృష్ణుల రచనలోఁ బ్రజ్ఞయే ప్రాముఖ్యము వహించిన దనవలెను. సహజముగా నిట్టి కవులు చేయు రచనలు రసప్రధానములు కాక రచనాప్రధానములై యుండును. రామకృష్ణుని రచన యీ మార్గమున నడచినది. పెద్దన రచనను రామకృష్ణుని రచనను బోల్చి చూచినచో నిది స్పష్టమగును. ఈ రచనాప్రధాన లక్షణము వలననే రామకృష్ణుని రచన యొక ప్రధాన రసపోషణమునకు మాత్రమే దారితీయక రచనలోని గడుసుఁ దనము ద్వారముననే భిన్నరసముల సిద్ధిని గూడ నేర్పరచుకొనుట జరిగినది. వేదమార్గ ప్రతిష్ఠాపనమువంటి యొక తాత్త్వికమైన కర్తవ్యము దృక్పథములో నున్న కవుల రచన సహజముగా ప్రజ్ఞకే ఎక్కువ తావొసఁగును. దీని కపవాదము కాళిదాసుని కవిత్వ మొక్కటియే.

కావ్యమున కాత్మధ్వని యని యొక యాచార్యుఁడును, రసమని మరి యొకఁడును మొదట నిర్వచనము చేసినారు. ఈ దృక్పథములోని భేద మా యాచార్యుల జీవలక్షణములకు సంబంధించినదని సులభముగా నూహింప వచ్చును. రామకృష్ణుని రచన ధ్వనిప్రధానమైనది. ఇతని ధ్వని ఇతని వాక్య నిర్మాణమువలనను, సామాన్య శబ్దములను గూడ విచిత్రమైన స్థానములందు పొదుగుటవలనను, సామాన్య సన్నివేశములను గూడ విలక్షణమైన కూర్పు చేయుటవలనను నిష్పన్న మగుచున్నది.

రసపోషణమునందు గూడ నితఁ డితర ప్రబంధ మహాకవులకుఁ దీసిపోఁడు. కావ్యమునకంతకు నొక ప్రధానరస ముండవలెనని శ్రవ్యకావ్యముల విషయముగ నే లక్షణాచార్యుఁడును శాసింపలేదు. ఏక రసప్రధాన్యము కథా వస్తువునకుఁ బరముగా శ్రవ్యకావ్యమునఁ గూడ నావశ్యకమైనచో రఘువంశము రసహీన కావ్యము కావలెను. 'వాక్యం రసాత్మకం కావ్యం' అను విశ్వనాథుని నిర్వచనము ప్రకారము కావ్యమునం దెన్ని రసఘట్టములైన సహృదయునకు రససిద్ధినిఁ గలుగఁజేయవచ్చును. ఇచ్చట రస శబ్దమునకు నవరసములలో నొకటియని శాసింపరాదని జగన్నాథ పండితరాయలు విశ్వనాథుని పాపమును ఖండించిన దీ కారణముననే. ఈ ప్రమాణముల ననుసరించి చూచినచో రామ కృష్ణుని కావ్యములలోఁ బరిణతి చెందిన కావ్యరాజమగు 'పాండురంగ మహాత్మ్య మున రసాత్మకము కాని వాక్యమే లేదు. కావ్యము భిన్నకథల సంపుటీకరణమై నప్పు డొక్కొక్క కథ నాశ్రయించి కొన్ని కొన్ని రసములు సిద్ధించును. ఇట్టి రసవైవిధ్యము 'హరవిలాసము' శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము' మున్నగు

కావ్యములందువలెఁ బాండురంగ మాహాత్మ్యముననుఁ, ఉద్భటారాధ్య చరిత్రమునను గూడ సిద్ధించినది.

రామకృష్ణుని పద్యరచనా వికాసవైఖరి

ఈ కవియొక్క మూఁడు కావ్యములలోను రచనాసామ్యము గల పద్యములను బోల్చి చూచినచో రచనలోని పరిణామము వ్యక్తమగును. అట్లు వ్యక్తమైన పరిణామము వలన నితఁడు ఘటికాచల మాహాత్మ్యమును జిన్నతనమున నప్రౌఢదశలో రచించెననియు, నుద్భటారాధ్య చరిత్రమును మధ్యదశలోను, బాండురంగ మాహాత్మ్యమును బరిణతదశలోను రచించెనని తేటతెల్లమగును. స్థాలీపులాక న్యాయముగా నీ దిగువ యుదాహరణములు పరిశీలింపఁదగినవి :

1. "ఆనందమయ విమానం
బానందము గరిమ దాన నలరారు యశో
దానంద తపఃఫలమగు
నానంద విహారి నంజనాచల శౌరిన్" —ఘటికా. 1-62.

"ఆనంద కాననంబున
నానందక పాణి కేశవాహ్వయమునఁ బెం
పౌనందగు ముక్తి ప్రమ
దానందిత హార నీలతరశోపముఁడై" —పాండు. 1-102

ఇందు రెండవ పద్యము పరిణతరచన.

2. "ఆతంక పంకశంకా
పేతంబై నిత్య సత్య హితపూతంబై
శీతాతప సహయోగి
స్ఫీతంబై తెల్లదీవి వెలఁగును దానన్" —ఘటికా. 1-22.

"ధూతాతంకి మపేతపంకము బుధస్తుత్యంబు సత్యంబు వి
ఖ్యాతంబాతప శీతవాత సహసాంద్రానంద యోగీంద్ర సం
కేతం బాతత భూతి భూతిలక లక్ష్మీకారితోరంబునై
శ్వేత ద్వీపము దీపితంబగు జగత్సేవ్యైక భవ్యోన్నతిన్"
—పాండు. 3-152

ఇందు మొదటి పద్యములోని భావము రెండవ పద్యమునాటికి పల్లవించి వివృతమైనది. పద్య రచనయు నట్లే.

3. "ఇవి కావు నీలంబు లివి కావు తుమ్మెద లవియు గావివి కుటిలాలకంబు
లిందు నిబింబంబు లివి కావు నెత్తమ్ము లవియు గావివి మోహనాననంబు
లిభకుంభ పాళిక లివికావు జక్కవ లవియుగావివి మెఱుఁగారు చన్ను
లింప విల్తుని దొన లివికావు కాహళ లవియుగావివి జంఘలరసి చూడ
ననుచు జనములు సంశయం బధిగమింప, ముదుముకతమున విడివడ్డ మదనురాణి
ముద్దురావిల్కు బోదల మురువు చూపి, భామినులు మింతు రమ్మహాపట్టణమున"

—ఉద్భట. 1 - 162.

"ఇంద్రచాపంబుగా దిది మౌళితలమున సవరించు బర్హిపింఛంబు గాని
బిదుర ఘోషంబు గాదిది పాంచజన్య సంజాత గంభీరఘోషంబు గాని
యాశ్రయించిన బలకావళి గాదది హారిముక్తాహార యష్టిగాని
ఇది కోలమెఱుఁగుగా దుదిరి బంగారంబుఁ బనిమి గ్రమ్మెడు పచ్చపట్టుగాని
వృష్టిగా దిది కరుణాంబు వృష్టిగాని, నీలమేఘంబుగా దిది నీల వర్ణుఁ
డౌర నామ్రోలఁ బ్రత్యక్షమయ్యె ననుచు, హర్షపులకిత తనువయ్యె నవ్వధూటి"

—పాండు. 4-31

ఈ రెండు పద్యముల రచనకును శ్రీనాథుని ముద్ర యున్నది. హరవిలాసము 6 - 89. పద్యములో చేసిన వేశ్యావర్ణనమునకు దాదాపు మక్కికి మక్కియైన యనుకరణమే యుద్భటారాధ్య చరిత్రలోని పద్యము. రెండిటియందును స్త్రీ వర్ణనమే వస్తువు. గీతపద్యమున మాత్రము శ్రీనాథునితోఁదూగలేదు రామ కృష్ణుని రచన. ఇకఁ బాండురంగ మాహాత్మ్య రచనలో శ్రీనాథుని యనుకరించుటగాక శ్రీనాథుని యెడ గురుభావము చూపుటయై యున్నది. వస్తుగౌరవము గల తావున శ్రీనాథుడు సాధించిన సమత, యలంకారపుష్టియు రామకృష్ణుఁడు సాధించుటయే గాక గీతపద్యమున మెఱుఁగులు దిద్దినాఁడు. "ఇంద్ర చాపంబు గా దిది" యను నీ పద్యము భీమఖండము 2 - 42 "కాదు కాదుదయాద్రి కనకకూటంబిదిదంబైన పానవట్టంబుగాని" యను పద్యము ననుసరించి వ్రాయఁబడినది.

ఇట్లే యీతని మూఁడు కావ్యములలో నొకే వర్ణనమునకు సంబంధించిన యొకే విధమైన పద్యరచన కొన్ని తావులందుఁ గనిపించును. వానియందును రచనా వికాస క్రమము మనకు స్పష్టమగును.

"ఉపధానీకృత హస్త తామరస సంయుక్తోత్తమాంగంబు ప
ద్మపుటాంతర్నివ సన్మద భ్రమర రమ్యంబై విరాజిల్ల భ
క్త పరాధీనత లంకదిక్కుమొగమై కాకోదరాధీశ శ
య్యపయిన్ భాసిల్లు రంగధాముని సహస్రాదిత్యభాధామునిన్"

—ఘటికా. 1 - 28

"కలదోః కంకణ ఝుంకృతంబుల మరుత్కన్యల్ సుధాబిందు పి
చ్ఛిల నీహారమయూఖ బింబసదృశ స్వీన్నానన శ్రేణివ
ర్తిల నొయ్యొయ్యన నూఁవనూఁగు ఫణిభృత్ ప్రేంఖోళికన్‌లచ్చిని
ట్టిలపుంజన్గవఁబోలు మున్నీరగుమున్ డాచేసి యుల్లాసియై"

పాండు. 3 – 160

ఈ రెండు పద్యములను బోల్చినవుడు మొదటిది యప్రౌఢ రచనయని స్పష్టమగును. 'సహస్రాదిత్య ఖాధామునిన్' అను తావున రీతి లోపించినది. ధారా శుద్ధియు, నర్థగాంభీర్యము చాల సామాన్యముగా నున్నవి. 'కలదోః కంకణ' యను పద్యమునందలి ప్రతిపదము నందును రీతి, శయ్య, ప్రౌఢి భావగాంభీర్యము, నిరుపమాన రూపచిత్రణము తొణికిసలాడుటయే గాక రచనధ్వని ప్రధానమై యున్నది.

"మొకరి తేటులు మూతిముట్టవు తేనియల్ శ్రీమధుశాసి కర్పించి గాని
కోకిలమ్మలు చిగురాకులు గొరుకవు శ్రీవనమాలి కర్పించిగాని
లేబచ్చికల్ గబళింపవు హరిణముల్ శ్రీ నీలమూర్తి కర్పించిగాని
ఫలభుజి క్రియలకుఁ జిలుకలు దలఁపవు శ్రీ మాధవునకు నర్పించిగాని
యితర జంతువులును హరిమతిఁ దలంచి, కానియే వర్తనములకు బూనవనిన
నాతపోవన మాహాత్మ్య మభినుతింప, నలవియే, వే మొగంబుల చిలువకైన"

—ఘటికా. 1–13.

ఇందలి పద్యరచన యప్రౌఢము. ఇదే విధమైన పద్య ముద్భటారాధ్య చరిత్రమునఁ బ్రౌఢిని జేకూర్చుకొనినది.

"అచల సుతాభర్త కర్పించి మఱికాని మృగములు లేఁబూరిమేయ వచట
అసమలోచననకు నర్పించి మఱికాని యళులు క్రొవ్విరి తేనెయానవచట
అంధకధ్వంసికి నర్పించి మఱికాని కోయిల చిగురాకుఁ గొఱుక వచట
అంగజరాతికి నర్పించి మఱికాని చిలుకలు పండ్లు భుజింపవచట
తక్కుఁగల జంతువులు శంభుఁదలఁచి గాని, యుచిత వర్తనముల
గోరియుండ వచట
వదనములు వేయుఁగలయంతవానికైన నా యరణ్యంబు గొనియాడ
నలవి యగునె"

—ఘటికా. 1–54.

మొదటి పద్యములోని "ఏ వర్తనములకుఁ బూనవు" అనుటకన్న రెండవ పద్యములోని "ఉచిత వర్తనములఁ గోరి యుండవు" అనుటయు, "వేమొగంబుల చిలువకైన" యనుట కన్న "వదనములు వేయుఁగలయంతవానికైన" యనుటయు విజ్ఞానమును, పద్యరచనలోని పరిణామమును సూచించును.

"శశికరద్రుతసార శశికాంతవాః పూర పరితః ప్రపూరిత పరిసరంబు
జలచరాశనకేళి జలచరద్విహగాళి కలరవోద్ధుత కలకల ధురంబు
సురమునీశక్ష్మా సురదుర్లభాతి మానసరముక్త మౌక్తికనర (?) వరంబు
కమనీయ మకరంద కమలకైరవ బృంద వరిలసద్రోలంబ పరికరంబు
ఘటిత కిసలయ సమజటాపట లనిటలఫలక తిలకితశశిసిత భసితలసిత
రసితపరమ సమాధి మద్విసరరుచిర, రసచరభరంబు వొల్చుమానససరంబు"
—ఘటికా. 1-3.

ఇందు 1-3 పాదములలో గల సమత మిగిలిన పాదములలో నిలువలేదు. దీనికన్న నదే కావ్యమందలి యీ దిగువ పద్యము కొంత ప్రౌఢముగా రచింపఁ బడినది.

"శ్రీకరానేక రత్నాకర ప్రాకార గోపుర ప్రసారదీపితంబు
సౌధాగ్ర సంచరజ్జలజముఖీ ముఖ, మణిదర్పిత చంద్రమండలంబు
కనక నికేతనా కలిత కేతన పటా పల్లవాంకిత దిశాపతి పురంబు
ప్రతిమంది రాళింద భాగముక్తాఫల రంగవల్లీ విభారాజితంబు
నీలమణి జాలకిలితోన్మిల దభ్రచుంబిహర్మ్యకదంబ నీలాంబు దభ్ర
మప్రదాలోక నర్తితామరానావే భుగ్వితానంబు కాంచికాపురవంబు"
—ఘటికా. 2-161A

ఈ పద్యమునందు గూడఁ బదప్రయోగము కొంత పటువుగా నున్నది గాని భావపుష్టి విషయమున "సకల ప్రవృత్తి" లేదు. ఇదే రచన యుద్భటారాధ్య చరిత్రమున నిట్లున్నది :

"శ్రీకందరాచలోర్జిత సముజ్జ్వలకూట సంకాశవిధుకాంత సౌధకులము
శాతమన్యవశిలాశకలధామజదామ కల్పిత గాడాంధకారబలము
చంద్రశాలా శరచ్చంద్ర బింబాననా తారహారీ భవత్తారకంబు
వితత గవాక్ష నిర్గత న[illegible] గరు ధూప సారభవాసితాశాముఖంబు
విమల పరిఖాజలాంతర వికచకుముద, కమలకల్హారకింజల్క కలితలలిత
గంధవహధూతరతి ఖేదకాముకంబు, గోపురోపమమగుపల్లకీపురంబు"
—ఉద్భటా. 1-149.

ఇందలి "శాతమన్యవశిలాశకల" ప్రయోగము ఘటికాచల రచనవాటికిఁ గవి కలవడలేదు. ఇది శ్రీనాథుని పలుకుబడి. దీనికితో దర్శగౌరవము గూడఁ బరిపుష్టి నొందిన పద్యము పాండురంగ మాహాత్మ్యమున నున్నది.

"శ్రీకరోదయ వధూ లోకానన ప్రభా నాటిత బహుచంద్రనాటనంబు
సమ్మార్గగళిత భూషారత్నమంజరీ యోజితరథ్యాప్రపూజనంబు
కైలాసశైల సంకాశసౌధనివేశ కౌముదీకవచిత గగనతలము
విస్తీర్ణ విపణి విన్యస్త వస్తు వ్రజ ప్రకటిత రత్న గర్భజఠరము
విపుల పవమాన తాండవ వేపమాన లాంఛన ధ్వజపట్టపల్లవలలామ
మౌశిరచిత కళాకృత్య హేళిహయము దీపితంబగు శ్రీకాశికాపురంబు"
—పాండు. 1-103.

ఈ పద్యము దీని కనుకరణకు మూలమైన "కల్హార మకరంద కలితమందాకినీలా హరీపరీ తకోలాహలంబు" అను నాచన సోముని పద్యముతో – ఉత్తరహరి వంశము 2–173 కుడి యెడమగా మాత్రము తులతూగుచున్నది.

ఇట్లే ఘటికాచల మాహాత్మ్యమున హరిశర్మ వర్ణనముతోఁ బాండురంగ మాహాత్మ్యమున నిగమశర్మ వర్ణనమును బోల్చి చూడవచ్చును.

"నునుపుగాదు వ్వివైచిన శిఖాబంధంబు ఘన లీలన పటు భాగమున వ్రేల
మేలిమి విద్దంపు జాళువాపోఁగులు వికిలి లే జెక్కుల జిగిదొలంగ
ధవళ యజ్ఞోపవీతంబు తేటలు దుకూలోత్తరీయద్యుతి నొత్తి కలయ
వెలిదమ్మిరేకుల వికవికనగు నూర్ధ్వపుండ్రంబు నుదుటిపై మురవు చూపఁ
జిలుగు నీర్కావి ధోవతి చెరఁగు చరణనఖరమ కాచ్ఛాదనంబుగాగఁ
గొదమ ప్రాయంపుమేని నిగ్గులు కడాని పొళ్ల వెదఁజల్ల
విప్రుఁడు పురిఁజరించు"
—ఘటికా. 2–28.

కలదు లేదను వాదమున కోర్చి మీనుమీసముపంటి యొంటెజందెము
మెఱవఁగ
బహుసంకుమద పంక పాణింధమంబైన తాళిగోణపుఁజుంగునేల జీరఁ
గడలేని వీడ్యంపుఁ గప్పుఁజందురుకాని మోవిపల్లొత్తుల ముసుగుదన్న
నానతాఁకులు గల్గు సూనాస్త్ర శంఖంబుగతి నఖరేంఖాంకగళము దనర
సఖులు పరిహాసకులు వెంటఁ జనగ యువతిభుక్త నిర్ముక్త పరిధాన
యుక్తుఁడగుచు
నగర ఘంటాపథంబున నగుచుఁ దిరుగు నొఱవుగలఠీవి జాతిమాత్రోపజీవి"
—పాండు. 3–10.

ఇందు మొదటి పద్యమునఁ గేవలము వాచ్యమైన వర్ణన యున్నది. రెండవ దానిలో నలంకార భూషితమైన ప్రౌఢ వర్ణనకు వెనుక నిగమశర్మ శీలమంతయు ధ్వనించు చున్నది.

అట్లే హరిశర్మ నిగమశర్మల పాత్ర ప్రవేశము చేయు పద్యములను బోల్చి చూడనగును. అందు హరిశర్మ :.

"ఆచెంతన్వసియించు భూసురుఁడొకండౌదార్యకర్ణుండు రే
ఖాచేతోభవమూర్తి కాంతిజిత రాకాకోక విద్వేషివి
ద్యాచాతుర్య ఫణీశ దేశికుఁడు ప్రేమాయత్త చిత్తుండు త్ర
య్యాచారాచరణప్రచారి హరిశర్మాఖ్యుండు దారోన్నతిన్"
—ఘటికా. 2–26.

ఇందుఁ బద్యరచనను మించిన విశేష మేమియు లేదు. ఇఁక నిగమశర్మ :

"వనితామానస సూననాయకుఁడు జీవత్తాతపాదుండు భూ
జనసమ్మాన్యవిశుద్ధ వర్తనుఁడు దంవిత్త్యాగశీలుండు చం
ద్రుని పెన్నుద్ది సమగ్ర కాంతిమహిమన్ నూనూఁగు మీసాలలే
గొన బుంబ్రాయపుఁదేజు కూన యతఁడు తోఁచుండు వాచాలతన్"

—పాండు. 3-6.

ఇట్లనుటలో నతని రాఁబోవు కథాంశములకుఁ దగిన చిత్తవృత్తి యెంతయు ధ్వనింపఁజేయఁబడినది.

తరళయుఁగాపుకోడలును జూపిన కామవికారముల వర్ణనలలో నిట్టి భేద మున్నది. తనయం దభిప్రాయమును జూపిన హరిశర్మను జూచి తరళయను పరిచారిక.

"నును వెండికడియముల్ మినుమినుక్కన సారెకు నుదుర్విపంకించి కొప్పు
వెట్టు
గబ్బిగుబ్బలు బైలుగాఁగఁ బైఁట వెలఁగు జాడించి సవరించు సారె సారె
కప్పుదంతపుడాలు గార్కొమ్మ తళుకుటద్దముఁజూచి నాభియందముగ దిద్దుఁ
పనిలేని పని కనుంగొను నేటవాలుగ వాలుఁగన్నుల గరువమ్ము వదల
ముద్దుముద్దుగఁ గడు పొద్దు వన్నెపుట్టములు గట్టి విటిపోటిపూతసొమ్ము
వెట్టుమట్టెల రవళికన్పట్టఁ దిరుగుఁ జిరుగు సిగ్గునఁ బొరుగు భూసురుని
యెదుట"

—ఘటికా. 2 – 35.

తనయందు మరులుగొన్న నిగమశర్మను జూచి దుశ్చేష్టితయగు కాపుకోడలు ప్రవర్తించిన విధానము ప్రౌఢతరము.

"పలువికారంబుల కలగల్పు చూపుల రాకపోకలు బయల్ ప్రాకఁజేయు
దమకంబు గనుకంబుఁ దత్తరంబును హత్తి మనసు నాఁగినవజ్ఞఁజొనుపు
గోర్కి
కుదురు పాలిండ్లపై గొంగు జారఁగఁ గొప్పువీడ నూలక నవ్వు వెట్టినవ్వు
నేరాలివట్టి బిట్టత్తె చెక్కిలి నొవ్వఁగఱచి వాఁడేడ్చినఁ గౌఁగిలించు
దండ నకిమెడఁ బుంజాల దండఁబెట్టుఁదీట్టు మెట్టెలు బిగువంచుందెగి
కఱాదు
వనిత చిన్నారి పొన్నారి వయసువాని విప్రనందనుఁ గన్నంత వెకటి
యగుచు"

—పాండు· 3 – 62.

ఇందేరాలి బిడ్డ నెత్తుకొని చెక్కిలి నొవ్వఁగఱచుట మున్నగు చేష్టలలోఁ దనకు బిడ్డలు లేరనియుఁ, దన భర్త రసికుఁడు కాఁడనియు నిగమశర్మకు సూచించుట మున్నగు వ్యంగ్యము ఇమిడియున్నది.

హరిశర్మ నిగమశర్మలు సిగ్గు వదలి గడి తీలిన వరనమునందీ రచనా భేదములు కన్పించును :

"విద్దెయుఁగులమును శీలము
పెద్దఱికము గట్టి పెట్టి విప్రుఁడు గడుసై
పెద్దల పెను పలవాటగు
సుద్దులు వెలమెత్తుటయును సుదతిని మఱగెన్" మటికా. 2 - 37.

"వెడవెడ దుర్వ్యవహారపు
నడవడి గడి దేలి గురుజనము శిక్షింపన్
గడుసువడి విప్రతనయుఁడు
సడి కోరివి వంక పొరక బాటున్ మానెన్" —పాండు. 3 - 14.

ఇందు మొదటి పద్యమున "సుదతిని మఱగెన్" అను వాచ్యముకన్న "సడికోరివి వంక పొరక బాటున్ మానెన్" అను వ్యంగ్యమునం దెంతయో పరిణతి యున్నది.

"నుతులంచున్నతులంచుఁ గాంచనములంచున్ దేరులంచున్ బురో
హితులంచున్ బో ....
సతముల్గా మదినమ్మి మూఢుఁడు దురాశాపాశబద్ధాత్ముఁడై
శితకందున్ భజియింపలేఁ డహహ కాశీపుణ్యదేశంబునన్"
—ఉద్భట. 2 - 81.

"కందర్పాస్త్రములంచు నంచిత తటిత్కాండంబులంచున్ సుధా
మందస్యందములంచుఁ గాంచనలతా మత్తల్లు లంచున్ సుధీ
బృందంబుల్ ధ్వని నిందలం దెగడు నీబింబోష్ఠులంబెల్ల నా
నందాభాసమె కాక భాసిత చిదానందంబు పెంపొందునే"
—పాండు. 5 - 225.

ఇందు రెండవ పద్యములో శయ్య గాఢపదబంధములతోపాటు భావగాంభీర్యము, ధ్వనియు, పదగుంఫనము, పలుకులో గడుసుఁదనము పరిణామము వెందినవి.

త్రీవమైన స్వతంత్రబుద్ధి గల యీ కవి సాధించిన స్వతంత్రమైన యుపమానములతోఁ గూడిన పద్యము లుద్భటారాధ్య చరిత్రము, పాండురంగ మాహాత్మ్యములందు మాత్రమే కలవనుట సాహసము కాదు. ఉదాహరణము :

"పవడంపుఁ బొదరింట బాలహంసమువోలె జడముడి శశిరేఖ గడలు కొనఁగ
నాకాశమండలి నంగారకుఁడు వోలె నిటల పట్టిక కన్నినేత్ర మమర
వలుద శంఖములోనఁ బొలుచునీలము వోలెఁ గంధరమున మచ్చకానుపింప
నమృతాంబురాశి నీరాసు. మేఘమువోలె నెమ్మేన గరివర్మ మెమ్మె మీఱ
బలము మీఱిన భాగ్యదేవతయ పోలె శ్రీ విశాలాక్షి వెంగటఁ జెలుఁవు మిగులఁ
గాశికాపురిఁబట్టంబు గట్టుకొన్న విశ్వపతిఁ గొల్వ సౌఖ్యంబు శాశ్వతంబు"
ఉద్భట. 2 - 82.

"శశిరేఖఁ గైకొన్న సౌవర్ణగిరివోలె మినుకుఁజేడియఁగూడి మెఱయు వాని
నసురేజ్యుఁ బాటించు హాటకాద్రియుఁబోలె నంచవెంగటనుండ నలరువాని
శారదాభ్రములంటు భూరిశైలముఁబోలెఁ దెలుపుఁ గైసేఁతలనలరు వాని
కకు బిభంబుల మీఁది కాంచననాగముఁబోలె వెలిదమ్మి గద్దియ వెలయు వానిఁ
బొడవులన్నియుఁ దనయందఁబొడము వాని కడయు నడమును మొదలు నేర్పడ నివాని
సచ్చిదానంద కందమై హెచ్చు వాని నలువఁ జూఁకిత పాథోధి తెలచె నుతుల:"

—పాండు. 5-174.

"అరచంద్రులోని చిహ్నాంశకంబును బోలె నుదటఁ గస్తురి బొట్టుపదను కొనఁగ
గగనంబునందలి ఖరమరీచియుఁబోలె నురమునఁ గేస్తుభం బౌరపు మీఱ
సురభూజశాఖలఁ జుట్టు తేఁటులఁ బోలెఁగలఁబచ్చల కడియాలు మెరయఁ
గొదమ సంపెఁగ మొగ్గతుదఁబొన్నవిరిఁబోలె ముక్కున ముంగర ముత్తె మమర
నీలగిరిఁగప్పు వెన్నెల నిగ్గుఁబోలె నవకమగుమేన హరిచందనంబు వొదువ
వివిధ మణిభూషణ ప్రభల్ వెలయ ఫలిత కల్పతరు లీల రాధయగ్రమున నిలిచి"

—పాండు. 4-33.

"అంభోధరము క్రింద నసియాడు నైరావతియుఁబోలె సిడివ్రేలెఁదెఱవయొర్తు
చెందమ్మి కొలన రంజిల్లు నంచయుఁబోలె నిప్పుటేట నటించె నెలతయొర్తు
తొలుసంజ యెండ వర్తిలు జక్కవయుఁబోలె నీఁగె బందిరిగుండమింతియొర్తు
జలనీలిపై నిక్కు కలువమొగ్గయుఁబోలె ననఁటాఁకు నర్తించెనతివ యొర్తు

—పాండు. 3-77.

. .. .

ఇందుఁ బాండురంగమాహాత్మ్యములోని పద్యములలో భావస్వాతంత్ర్యమే కాక భావపరిపుష్టియు సమగ్రతయుఁ గనుపించును.

"కొలువుండు నొక వేళఁ గుణపశీర్షోపల కవితోన్నత కేలిఁశైలి శిఖల
విహరించు నొకవేళఁ గహకహ ధ్వనులతోఁ దడము లొక్కటఁగొల్వ నడికిరేల
వినుఁబ్రేమ నొకవేళ వీనుల కింపైన కూశ్మాండ గాయక కులముపాట
దండెత్తు నొకవేళ దర్పిత భేతాళ మండలంబుల మీఁదజండ దాడిఁ
బనుచు నొకవేళఁ బసువులు తనకుఁ దిరుగఁబడినవారల సంపద నాడిచికొనఁగ
భూనభోంతర సంచరద్భూతలోక దండనోద్గ్రుఁడగు వజ్రదంష్ట్రుఁ డెలమి"

ధ్వ,ట. 1-156.

"మువ్వంకమురువుతో మురళి యొక్కొకవేళ మ్రోయించు భువనైక
మోహనముగఁ
గ్రీడించు నొకవేళఁ దోడిబాలురఁ గూడి యక్షిణగతిఁ గుబేరాక్షకేళి
సవరించు నొకవేళ జలవిహారము వాలఁ బ్రేమ భీమరథీ గభీర వారిఁ
గొలువుండు నొకవేళ నళిన సంభవ పుండరీకాక్ష్యదాదులు ప్రీతిఁగొలువ
నురగరిపు వాహనమున నొక్కొక్కవేళ వేడ్క వెంచేసి మెఱయుఁ
దిర్విధులందు
నెన్నిగల్పంబు లరిగిన వేన యేండ్ల వెలయు ప్రాయంబుగల కొయ్య
విట్ఠలయ్య"
—పాండు. 4–134.

ఇందు మొదటిదానిలోకన్న రెండవ పద్యములోని సమతకుఁ గవిత్రయమునకు దానిపైన చక్కని పరిణతి యున్నది.

"తనుఁజాకుండఁ బ్రోచినాఁడనక వృద్ధ బ్రాహ్మణుం డిన్నవాఁ
డని కొంకింతయు లేక త త్తనయునిన్ బ్రాణంబులంబిట్టు వా
వినయంబింతయు లేక చేరి వెర బెంచేలైన తద్విత్తమున్
ధనకాంక్షాపరుఁడైన వానికి నిషేధంబేలఁ జూపట్టెడిన్ ?"
—ఉద్భట. 2–256.

"తలపుండ్లుఁ గడిగింపి తనుఁ బ్రదికించెగా యడవిఁజోరాహతుండైన దెబ్బ
కన్నబిడ్డలకన్న గారవంబునఁ జనవిచ్చెఁగా నిచ్చలు నింటిలోన
గ్రాసవాసః క్లేశ కశ్మలత్వ మడంచి యనురక్తిఁ బెనిచెఁగాయను దినంబు
గురువుగా వేల్పుగాఁ గూర్చు చుట్టంబుగా భావించి కొలిచెఁగా భక్తియుక్తి
నెవ్వఁడా రెడ్డి యింటికి నెగ్గువాలఁ జేయు గుడినుండి గుడిరాళ్లు తీయు కరణిఁ
గపట నటనానటుఁడు త్రాటఁగట్టు బోయ కాయజామేయ సాయకాఘాతభీతి"
—పాండు. 3–68.

ఇందు విశ్వాసహీనత యను నొకే భావమున్నది. రెండవ పద్యమున వివరణతోఁ గూడిన చక్కని రూపకల్పనము చదువరుల నాకర్షించును. మొదటి పద్యమున భావము సంగ్రహము చేయబడినది.

"అరుణాక్షుల్ – గురుకుక్షులున్వికటదం – ష్ట్రాభీలవక్త్రాంతరుల్
శరదాభుల్ కరవాలహస్తులు ఖరచ్ఛాయోర్ధ్వ కేశచ్ఛటుల్
ధరితా హంకృతు లంతకాను చరులాపాపాత్ముఁబారున్ మహో
ద్ధుర వేగంబునఁ బట్టి తేరఁ జని రెంతో పంతముల్ పల్కుచున్"
—ఉద్భట. 2–263.

"కరుణాదూరులు ఘోరులంధతమసాకారుల్ పరార్థ హృతి
త్వరితాంతః కరుణుల్ దురాసదులు విశ్వద్రోహులుద్వాహులై
తెరువాకుక్కమ్మడిఁగ్రమ్మిఁబొమ్మఁగల సందీప్తాసిగ్రశ్రేణినే
సిరి ధాత్రీసుర నూనుఁగార్మకరవాళిష్టులై యానునన్"
—పాండు. 3–52.

ఘటికాచల మాహాత్మ్యమున యమదూతలు భయంకరముగా వర్ణింపబడినారు. పాండురంగ మాహాత్మ్యమున యమదూతలు దండధరుని యనుచరులు గనుక భయంకర వర్ణన లేదు చోరులు భయంకరులుగా వర్ణింపఁబడినారు. ఇందలి భావపరిణతి గమనింపఁదగినది.

"నునుగాలి దూది పానుపు లెన్నియో కాని యందఱు శయనీకృతాహిపరులు
సురలోక వాహి నిర్ఝరము లెన్నియొ కాని యందఱు దివ్యతీర్థాంబుపదులు
నీట జనించు మానికము లెన్నియొ కాని యందఱు కౌస్తుభహారయుతులు
చలివేఁడి వెలుఁగుల సాము లెందఱొ కాని యందఱు నిందు కంజాప్తదృశులు
ఖగకులాధీశు లెందఱు గలరొ కాని యందఱును బుల్గురాలెక్కు యములవారు
నారువోసిన రీతి నున్నారు ధీరులన్నగరియందుఁ గొపురంబున్నవారు"
—ఘటికా. 1–25.

"అభ్రరంగా ప్రవాహంబు లెన్నియొ కాని – తలధరియింతు – రందఱును
నదులు
పదినూరు పడగల పాములెన్నియొ కాని యందఱు సురగేంద్రహార
యుతులు
డాలొందు చంద్ర ఖండంబు లెన్నియొ కాని యందఱు ధరియింతు –
దమృతకరుని –
– విషరాసిఁ బుట్టిన విషము లెన్నియొ కాని యందఱు హాలాహలాంకగళులు
గంధగజదైత్యు లెందఱో కాని యందఱతుల పరిచర్మాపటధారులైన వారు
కర్మబంధంబు . క్రాలుకొనకుండ నిద్రింపజాలు ఘనులు"
—ఉద్భట. 2–87.

"బలుపాపతలచుట్ట లలవరించినవారు లేఁతచందురులఁ దాలిచినవారు
వునుకతమ్మంటులఁ బోలుచు వీనులవారు నొసల మిక్కిలి చూపు లెసఁగు
వారు
బూదు వారగ మేన బూదిఁ బూసినవారు త్రిముఖాస్త్రములు కేలఁ ద్రిప్పు
వారు
పులితోలు హొంబట్టు పుట్టముల్ గలవారు కొమ్ము తేజుల నెక్కి గువియు
వారు
ఘోరతపముల హరుఁదక్కఁ గొన్నవారు కరటిదైతేయ కుంభముక్తా
లలామ
హారి భుజమధ్యములవారు దారయశులు ప్రమథవీరులు కొలిచిరా
బాహులేయు"
—పాండు. 1 – 165

మొదటి రెండు పద్యములయందును భక్తులకు దైవముతోఁ గల సారూప్యయుక్తి వాచ్యముగాను, మూఁడవ పద్యమున వ్యంగ్యముగాను వర్ణింపఁబడినది. పద ప్రయోగమునఁ గూడఁ గ్రమోన్మీలనమైన గడుసుఁదనము గనుపించును. ఘటికాచల మాహాత్మ్యమందలి పద్యమున నాలుఁగవ పాదమందు భావపుష్టి లోపించి

నది. అందులను గరుడవాహనారూఢులైనచో "ఖగకులాధీశ లెందఱు గలరో" యనుట సమంజసముగాని టెక్కియమునకు గరుడులు హెచ్చు మంది యుండు టెందులకు ?

రామకృష్ణుని వర్ణనలు

ప్రాధాన్య వివక్షచేఁ బ్రబంధము లన్నియు వర్ణనా ప్రధానములు. రామ కృష్ణుని ప్రబంధములు మూఁడు నట్లే వర్ణనా ప్రధానములు. కథా కథనము నకుఁగాని, నాటకీయతకుఁగాని, రసపోషణాది ప్రధానాంగములకుఁగాని ప్రతి బంధకములు కాని సముచితములైన వర్ణనలు కావ్యమునందుండి తీరవలెను. సంస్కృత కావ్యములలో వాల్మీకి రామాయణము మొదలుకొని సర్వ కావ్య ములందును వర్ణనా ప్రాధాన్యమున్నది. అట్లే యాంధ్ర ప్రబంధములలోఁ బురవర్ణనము, సూర్యచంద్రాది వర్ణనలు మున్నగు లాక్షణికోక్తములైన యంశములే గాక తత్తత్కవి ప్రతిభ ననుసరించి కథా కథనమునకు రసపోష ణమునకు నుపకారములగు వర్ణనములు ప్రబంధములందుండును. ఆంధ్ర ప్రబంధములలో నాముక్తమాల్యదయందు వర్ణనలు హెచ్చు. పాండురంగ మాహాత్మ్యమునందుఁగూడ వర్ణన లందందు హెచ్చుగానున్నను నూటికి తొంబది పాళ్లు కథాగతముగనే యవి నడచుటచేఁ గథలో నంతర్భూతములై యుండును. ఈ లక్షణము ఘటికాచల గ్రంథమునకన్న, నుద్భటారాధ్య చరిత్రయందును, దానికన్నఁ బాండురంగ మాహాత్మ్యమునందును బరిణతమై కనుపించును.

కావ్య సంప్రదాయము ననుసరించి చేసిన పురవర్ణనము మూఁడు కావ్య ములందును గలదు. ఘటికాచలమునఁ గాంచీపుర వర్ణన మున్నది. కానీ యది బాల్యమున రచింపఁబడిన కావ్య మగుటచేఁ గథతో హెచ్చుగా సంద ర్భించి యుండుటగాని, కార్య కారణమైన కూర్పు నందియుండుట గాని కన్పింపదు. దానిని దొలఁగించి చదువుకొన్నను గావ్య పఠనమున కేమాత్ర ము భంగము కలుఁగదు. ఉద్భటారాధ్య చరిత్రమునఁ గల వల్లకీపుర వర్ణ నము నందు దీనికి భిన్నమైన లక్షణ మున్నది. అనఁగాఁ బ్రమథేశ్వరుని పరిపాలనాదికమును వివరించుటచే నిది కథకు సందర్భించి యున్నది. అట్లే యీ కావ్యమునందలి కాశీపుర వర్ణనము మిక్కిలి ప్రాధాన్యము వహించును. ప్రమథేశ్వరుఁడు కాశికిఁ బోవుట శివధర్మ సంస్థాపకము, ముంజభోజుని జననమునకుఁ గారణము గనుక రెండు ప్రధాన కథాంశములతో నిది సంద ర్భించి యున్నది. పాండురంగ మాహాత్మ్యములోని కాశీపుర వర్ణనము, వైకుంఠపుర వర్ణనము గూడ సుసందర్భితములే. ఈ నాలుగు పుర వర్ణనములు నుత్తరోత్తరము గుణోత్తరములై భాసిల్లును.

రామకృష్ణుని పుర వర్ణనములందు చాతుర్వర్ణ్య వర్ణనము, గజాశ్వ సుభట దుర్గపరిఖా వర్ణనములు, నుద్యాన మలయ మారుత వన వర్ణనములు, వేశ్యావర్ణనము సంప్రదాయాను గతములై భాసిల్లినను, గవి ప్రతిభా సమన్వి తత్వముచే నవ్యములై యొప్పారును. ఉన్నంతలో వేశ్యావర్ణనమే చాల

తక్కువగ కన్పించును. పుష్పలావికాది వర్ణనములు లేవనియే చెప్పవచ్చును. ఇది యీ కవి యొక్క నిసర్గోదాత్త కల్పనాభిలాషకు సూచకమేమో·

సామాన్యముగా నొక సుదీర్ఘ సమాస ఘటితమైన సీసపద్యముతో నితని పురవర్ణనము మారంభమగును.

ఉదా. :

"శ్రీకంధరాచలోర్జిత సముజ్జ్వల కూట
సంకాశవిధుకాంత సౌధకులము
....
.... పల్లకి పురంబు" —ఉద్భటా. 1-149

"శ్రీకరోదయ వధూలోకానన ప్రభా
నాడితబహుచంద్రనాటనంబు
. ...
....శ్రీకాశికాపురంబు" —పాండు. 1-103

విప్రవర్ణనయం దుద్భటారాధ్య చరిత్రమందలి వల్లకీపురమందలి వర్ణనమే పాండురంగ మాహాత్మ్యమునకన్న నెక్కువ శ్రద్ధతోఁ గల్పనా, చమత్కృతితో నుత్సాహముతోఁ జేయఁబడినది.

"కడఁగి దీవించి యక్షతలు పైఁజల్లి వ
ట్టిన మ్రాఁకు లిగురు పట్టింతురనఁగఁ
బ్రతిఘటించిన బ్రహ్మవట్టంబుఁ దిగఁద్రోచి
యొక పూరిపై సృష్టియు నుతుర సాఁగఁ
బ్రౌఢవాద క్రీడ ఫణిలోక పతినైనఁ
బొత్తిఁగన్నులు గప్పిపుత్తురనఁగఁ
ద్రినయనుఁడే దైవమని రహస్య స్థితి
నిగమంబులకుఁ దెల్పనేర్తు రనఁగ

సఫల వాక్సిద్ధి బ్రహ్మవర్చస సమృద్ధి
శబ్దపరిశుద్ధి శివదత్తశాంత బుద్ధి
తారతముఁ బోలఁ దగుఁగాక తత్పురంబు
బ్రాహ్మణులఁబోలఁ వ్యాసనంభవుని వశమె" —ఉద్భట. 1-154

"చదువులపుట్టినిండ్లు శమసంపద యిక్కలు పుణ్యలక్ష్మికిన్
మొదలి దివాణముల్ సురసమూహము నాఁకటిపంటలంచితా
భ్యుదయ నిసర్గ బంధువులు ప్రోడతనంబుల రాణముల్ పురిన్
బొదరెడు భూసురోత్తముల భూరిపవిత్ర శరీరవల్లరుల్"
పాండు. 1-190

క్షత్రియ వర్ణనమునఁగూడ నిట్టి భేదమే గోచరించును. వైశ్య వర్ణనమున స్థూల దృష్టికి పల్లకి పురమువారును సూక్ష్మదృష్టికిఁ బాండురంగ మాహాత్మ్యములోని కాశీపట్టణవాసులును ఘను లనిపించు కొందురు.

ఉదా:

"ధన సమృద్ధుల ధననాథు తాత లనఁగ
వర్తకంబునఁ గీర్తి ప్రవర్తులనఁగ
ననృత లాభంబు లోభంబునపనయించి
వీటఁబొగడందఁగలరు కిరాటపతులు" —ఉద్భట. 1–156

"బలయు రత్నాకరములు సంచులుగఁజేసి
పొదివి నిధులెల్లఁ గొని సంచిమొదలుచేసి
బేరమాడెడు పాటియుదారలక్ష్మి
బచ్చులప్పురి నున్నారు పెచ్చు పెఱిగి" పాండు. 1–111

ఇందలి రెండవ పద్యమున రత్నాకరశబ్దమందలి శ్లేష యీ బచ్చులకు గాంభీర్యము నొడఁ గూర్చినది. అట్లే నిధిశబ్దమందలి శ్లేషవలనవారు సంచకరువు పెట్టిబేరమాడఁగాఁ గుబేరుఁడు కూడఁ బ్రతిఘటించి యేమియుఁ గొనఁజాలఁ డను నర్థమున్నది. "ఉదారలక్ష్మి" యనుట వలన వారి దాన ధర్మాది గుణములు, లక్ష్మిప్రసన్నతయు వ్యక్తమగుటయే గాక "యనృత లాభంబు లోభంబునపన యించి" యను వాచ్యార్థ మిందు వ్యంగ్యమైనది.

రెండుకావ్యములందును శూద్రవర్ణనము విలక్షణము. మిగిలిన కవులెవ్వరు నింత పవిత్రముగా శూద్రధర్మమును గమనించినట్లు తెనుఁగు కావ్యములలోఁ గనుపింపదు. ఉద్భటారాధ్య చరిత్రమందలి శూద్ర వర్ణనము చాల పవిత్రముగా నున్నది.

"చూడా భూషణరత్నమై వెలయుమన్ శ్రుత్యుత్తమాంగంబులన్
జూడంగాఁదగు విష్ణుపాదమునకున్ సూనుల్ - బలోద్భాసితుల్
తోడంబుట్టువులభ్రగంగకు మఱందుల్ వాలమున్నటికిన్
బ్రోడల్ కీర్తిధనార్జనంబునఁ బురిన్ బొల్పారు శూద్రోత్తముల్.
—ఉద్భటా. 1–157

ఇందు వేదశిరస్సులు పుట్టినచోటఁ బుట్టుటవలనఁ గర్మసిద్ధియు. గంగకుఁ దోబుట్టువులగుటవలనఁ బవిత్రతయుఁ బాలమున్నీటికి మఱందు లగుటవలన స్వచ్ఛమైన నడవడియు గాంభీర్యము వ్యక్తము లగును.

పాండురంగమాహాత్మ్యమున—

"హరమౌళిహార మచ్యుత
చరణాబ్జ మరంద ధార జాహ్నవి లోకే
శ్వరి తమసోదరియగునఁట
పురివెలమల భాగ్యమహిమఁ బొగడఁగవశమే" —1–112

యని వర్ణించుటలో శివ విష్ణుభక్తియుఁ బరమ పవిత్రతయు వ్యంగ్యముగా వర్ణింపఁబడినవి.

కాశీవర్ణనమున వర్ణింపఁబడిన శివసారూప్య ముక్తియితని పురవర్ణనలోని విశేషము. ఇది యుద్భట చరిత్రమునఁ జమత్కార ప్రధానముగను, పాండురంగమాహాత్మ్యములోఁ దత్త్వప్రధానముగను వర్ణింపఁబడినది.

"దర్వీకరంబైన దర్వీకరముఁ జుట్టు
మృగమైనఁ గెంగేల మృగముఁ బట్టు
శార్దూలపతియైన శార్దూలపతిఁ దీరుఁ
గరియైనఁ గరితోలుఁ గట్టిమీరు
... .
నెద్దన వెలిబాయ యెద్దుఁ బూన్చు
బోయవాఁడైనను బోయవానీరాడు
నవియైనఁ గావించు నవిన వీడు

పునుకయైనను విధిఁగొట్టుఁ బసుకదుల్ల
నెముకయైనను మెడఁదాల్చు నెముక పేరు
గాశికాపురిఁ బ్రవహించు గగనగంగ
నీటఁ దోఁగిన మాత్రమె నృపవరేణ్య" —ఉద్భట. 2–79

"ఒకనాఁడు దీర్థోపయోగికాని శరుండు
నౌఁదల ధరియించు నభ్రగంగ
నాప్రొద్దుపోయి రాఁజనట్టి నిర్వేదయు
భోగించు నైశ్వర్యము లెనిమిదియుఁ
బుష్కరాక్షుల పొంతఁబోని వర్షధరుండు
దేహార్థమునఁ దాల్చుఁ దివఁబోఁడి
నాయుధప్రభఁగాంచి యలఁగు భీరువుఁ బూను
వాడి ముమ్మొనముల వేఁడి యలుగు

మలినవర్తనుఁడును సుధాలలితమూర్తి
మించి వర్తించు మతిలేని మేదకుండు
మౌనివర్యులఁ జదివించు మల్లినీడఁ
బంచముఖు వీట మేనొనరించెనేని"

—పాండు. 1–101.

ఉద్భటచరిత్రమందలి కాశీపుర వర్ణనమున శ్రీనాథుని కాశీఖండ భీమఖండము లలోని ఛాయలు హెచ్చుగా నున్నవి. పాండురంగ మాహాత్మ్యమందలి కాశీ వర్ణనము స్వతంత్రమైన మార్గమున నడచినది.

అశ్వగజాది వర్ణనములును బరిఖాది వర్ణనములును బ్రబంధ సామాన్య పద్ధతిలో సాగినవి. పాండురంగ మాహాత్మ్యమందలి కాశీపుర వర్ణనమున రథ వర్ణనము నవ్యముగా నున్నది. — 1 – 115.

శ్వేతద్వీప వర్ణనము

ఘటికాచల మహాత్మ్యమునఁ బ్రథమాశ్వాసమునందు నారదుఁడు భృగువుతో సంభాషించుచుఁ దాను శ్వేత ద్వీపమునకుఁ బోయి వచ్చితినని చెప్పును. ఈ సందర్భమున శ్వేత ద్వీప వరవ మున్నది – అశ్వా. 1. పద్య. 21 నుండి 27 వఱకు –. పాండురంగ మాహాత్మ్యములో మరల శ్వేతద్వీపము వర్ణింపఁ బడినది. పుండరీకుఁడు తపస్సు చేయుచుండఁగా భూదేవి ముకుందుని దర్శించుటకు శ్వేతద్వీపమునకుఁ బ్రయాణమైన సందర్భ మది – తృతీయాశ్వాసము పద్యము 141 నుండి 170 వఱకు. ఘటికాచల గ్రంథమునఁ గల వర్ణనము సంగ్రహము, ప్రసాదగుణ మనోహరము. అయినను బాండురంగ మాహాత్మ్య మునఁ జేసిన విస్తృత వర్ణనమున కిది సర్వవిధముల బీజప్రాయమై యున్నది. ఇందున్న యంశము లన్నియు రామకృష్ణుని కవిత్వ పరిణామముతోపాటు విప్పారి పాండురంగ మాహాత్మ్యమున వివిధ శాఖల రచనామార్గములుగా నల్లుకొనినవి.

ఘటికాచల గ్రంథమునఁ దొలుత క్షీరసాగర మొక పద్యమునను దెల్లదీవి యొక పద్యమునను, వైకుంఠపురము రెండు పద్యములను, విష్ణు సారూప్య మందినవా రొక సీసపద్యమునను, లక్ష్మీనారాయణు లొక పద్యమునను వర్ణింపఁబడినారు. ఘట్టమంతయు సహజమైన రచనతో నొప్పారును. పాండురంగ మాహాత్మ్యమున క్షీరాబ్ధి యెనిమిది పద్యములలో నొక సుదీర్ఘమైన వచనములోఁ గడు విస్తృతముగా వర్ణింపఁబడినది. శ్వేతద్వీపము రెండు పద్య ములలోను, వైకుంఠపురము నాలుఁగు పద్యములలోను, నొక్క దీర్ఘ వచనములో వర్ణింపఁబడినది. విష్ణు వర్ణనము పదునొకండు పద్యములలో వర్ణింపఁబడినది. రెండుకావ్యములందును వర్ణితవస్తు వొక్కటే. రెండవ కావ్యమునఁ జిలువలు వలువలు నైన ప్రౌఢతర కల్పనలు, వర్ణనములు గడుసరి పలుకుబడులు, పలు విధములైన పూర్వకవుల పోకడలు నున్నవి. ఈ దిగువ పద్యములలోని రచనా సామ్యము గమనార్హము.

"ఆతంకపంక శంకా
పేతంబై నిత్య సత్యహితపూతంబై
శీతాతప సహయోగి
స్ఫీతంబై తెల్లదీవి చెలఁగునుదానన్" —ఘటికా. 1–24.

"భూతాతంక మపేతపంకము బుధస్తుత్యంబు నిత్యంబు వి
ఖ్యాతంబాతప శీతవాతసహ సాంద్రానంద యోగీంద్ర నం
కేతం బాతత భూతి భూతిలక లక్ష్మీ కారితోరంబునై
శ్వేత ద్వీపము దీపితంబగు జగత్సేవ్యైక భవ్యోన్నతిన్"
—పాండు. 3 – 152.

మిగిలిన పద్యములలో నిట్టి సామ్యము సిద్ధింపలేదు. పాండురంగ మాహాత్మ్యము నందలి క్షీరాబ్ధి వర్ణనమునందీ కవి రచన యనన్య సామాన్యము. అలంకారములు

కడు స్వతంత్రములు, ప్రౌఢములు, రమణీయములు. శైలి పటిష్ఠము, పరిపూర్ణము. శబ్దార్థ పరిపుష్టికి నికషోపలమైన యిందలి వచన రచన కాదంబరి లోని పోకడల నన్నింటిని బుణికిపుచ్చు కొన్నది. ఇంకను దనివితీరక శ్రీనాథుని పోతన రచనములందలి వచనముల, సొగసును రీవిని దర్పణమునందు వలె ప్రతిఫలింపఁ జేసికొన్నది.

ఉదా. :

"ఇట్లగణిత గుణాభిరామంబగు సమ్మానధామంబు...
వీరభద్ర గదావిదారితంబగు పూషాగ్రదన్త వదనగహ్వరం
బును బోలెఁ బలువరుస బిగిదెరల నొరలి..." —పాండు. 3 – 150.

"రత్నాకరంబునుం బోలె ననిమిష వాహినీవిభ్రతంబై,
శ్రుతి వాక్యంబునుం బోలె నకల్మష సువర్ణ ప్రభూతంబై.. "
—భాగ. స్కంధము 8, వచనము.

"...కార్తవీర్యార్జున మూర్తియునుంబోలె నవిరళ కర
భూషితంబును, నృసింహలీలాడంబరంబునుం బోలెఁ

బ్రథిత హిరణ్యకశిపుక్షయంబును..." —భీమఖండము. 1 – 110.

ఈ ఘట్టమందలి విలయ హరివర్ణనము కడు విలక్షణమై యితని వర్ణనలలోని ప్రత్యేకత కుదాహరణ మగుచున్నది. సకల జగద్వ్యాపియగు విష్ణువు విలయ వేళ "మంచి లక్షణముల పుట్టుమచ్చవాఁడు, నేత్రములు విప్పునట్టి యీ నెత్రుగందు వరద నేతెంచె నెవ్వారివాఁడొ" యనుటలోఁ బ్రతిపదమందును సకల పురాణసారము ధ్వనిగర్భితముగా నిమిడి యున్నది. ఇట్టి తావులం దచ్చ తెనుఁగులు జాతీయము గాపాడుటయం దితనికి మక్కువ యెక్కువ. మహత్తర విషయములను దేట తెనుఁగునందుఁ గతిపయి పదములలోను, స్వల్ప విషయ ములను గంభీరమైన పదగుంఫనలోను వర్ణించి యణువునందును, బ్రహ్మాండ మందును జదువరుల కొకే విధమైన నిష్ఠ గల్గించుట యాతని యాశయముగాఁ బెక్కు తావులందు గన్పట్టును.

పాండురంగ మాహాత్మ్యమునందలి శ్వేతద్వీప వైకుంఠ వర్ణనముల కాధారము చాలవఱకు రామానుజాచార్యుల వైకుంఠగద్యము. ఇందుఁ గొన్ని పద్యములకు సూటియైన సంస్కృత మూలములందుఁ గనుపించుచున్నవి.

1. "ఎన్నఁగ నింతరత్నచయ మింతగభీరిమ యింతదాన సం
పన్నత యింత శుద్ధియని బ్రహ్మయు నోరు మెదల్ప లేని య
త్యున్నతిఁగన్న వెన్నడలి మద్దితమై వెలిదీవి చెన్నగున్
వెన్నెల యేటిలోనఁ బ్రభవించిన కప్రపుకొండకైవడిన్"
—పాండు. 3–151.

శ్వేతద్వీప వర్ణనము

ఘటికాచల మహాత్మ్యమునఁ బ్రథమాశ్వాసమునందు నారదుఁడు భృగుపుతో సంభాషించుచుఁ దాను శ్వేత ద్వీపమునకుఁ బోయి వచ్చితినని చెప్పును. ఈ సందర్భమున శ్వేత ద్వీప వరవ మున్నది – అశ్వా. 1. పద్య. 21 నుండి 27 వఱకు –. పాండురంగ మాహాత్మ్యములో మరల శ్వేతద్వీపము వర్ణింపఁ బడినది. పుండరీకుఁడు తపస్సు చేయుచుండఁగా భూదేవి ముకుందుని దర్శించుటకు శ్వేతద్వీపమునకుఁ బ్రయాణమైన సందర్భ మది – తృతీయాశ్వాసము పద్యము 141 నుండి 170 వఱకు. ఘటికాచల గ్రంథమునఁ గల వర్ణనము సంగ్రహము, ప్రసాదగుణ మనోహరము. అయినను బాండురంగ మాహాత్మ్య మునఁ జేసిన విస్తృత వర్ణనమున కిది సర్వవిధముల బీజప్రాయమై యున్నది. ఇందున్న యంశము లన్నియు రామకృష్ణుని కవిత్వ పరిణామముతోపాటు విప్పారి పాండురంగ మాహాత్మ్యమున వివిధ శాఖల రచనామార్గములుగా నల్లుకొనినవి.

ఘటికాచల గ్రంథమునఁ దొలుత క్షీరసాగర మొక పద్యమునను దెల్లదీవి యొక పద్యమునను, వైకుంఠపురము రెండు పద్యములను, విష్ణు సారూప్య మందినవా రొక సీసపద్యమునను, లక్ష్మీనారాయణు లొక పద్యమునను వర్ణింపఁబడినారు. ఘట్టమంతయు సహజమైన రచనతో నొప్పారును. పాండురంగ మాహాత్మ్యమున క్షీరాబ్ధి యెనిమిది పద్యములలో నొక సుదీర్ఘమైన వచనములోఁ గడు విస్తృతముగా వర్ణింపఁబడినది. శ్వేతద్వీపము రెండు పద్య ములలోను, వైకుంఠపురము నాలుఁగు పద్యములలోను, నొక్క దీర్ఘ వచనములో వర్ణింపఁబడినది. విష్ణు వర్ణనము పదునొకండు పద్యములలో వర్ణింపఁబడినది. రెండుకావ్యములందును వర్ణితవస్తు వొక్కటే. రెండవ కావ్యమునఁ జిలువలు వలువలు నైన ప్రౌఢతర కల్పనలు, వర్ణనములు గడుసరి పలుకుబడులు, పలు విధములైన పూర్వకవుల పోకడలు నున్నవి. ఈ దిగువ పద్యములలోని రచనా సామ్యము గమనార్హము.

"ఆతంకపంక శంకా
పేతంబై నిత్య సత్యహితపూతంబై
శీతాతప సహయోగి
స్ఫీతంబై తెల్లదీవి వెలఁగునుదానన్" —ఘటికా. 1–24.

"భూతాతంక మపేతపంకము బుధస్తుత్యంబు నిత్యంబు వి
ఖ్యాతంబాతప శీతవాతసహ సాంద్రానంద యోగీంద్ర నం
కేతం బాతత భూతి భూతిలక లక్ష్మీ కారితోరంబునై
శ్వేత ద్వీపము దీపితంబగు జగచ్ఛ్రేష్ఠైక భవ్యోన్నతిన్"
—పాండు. 3 – 152.

మిగిలిన పద్యములలో నిట్టి సామ్యము సిద్ధింపలేదు. పాండురంగ మాహాత్మ్యము నందలి క్షీరాబ్ధి వర్ణనమునందే కవి రచన యనన్య సామాన్యము. అలంకారములు

కడు స్వతంత్రములు, ప్రౌఢములు, రమణీయములు. శైలి పటిష్ఠము, పరిపూర్ణము. శబ్దార్థ పరిపుష్టికి నికషోపలమైన యిందలి వచన రచన కాదంబరి లోని పోకడల నన్నిఁటిని బుణికిపుచ్చు కొన్నది. ఇంకను దనివితీరక శ్రీనాధుని పోతన రచనములందలి వచనముల, సొగసును రీవిని దర్పణమునందు వలె ప్రతిఫలింపఁ జేసికొన్నది.

ఉదా. :

"ఇట్లగణిత గుణాభిరామంబగు సమ్మోనధామంబు...
వీరభద్ర గదావిదారితంబగు పూష్కోద్కు వదనగహ్వరం
బును బోలెఁ బలువరుస బిగిదెరల నొరలి..." —పాండు. 3 – 150.

"రత్నాకరంబునుం బోలె ననిమిష వాహినీవిశ్రుతంబై,
శ్రుతి వాక్యంబునుం బోలె నకల్మష సువర్ణ ప్రభూతంబై... "
—భాగ. స్కంధము 8, వచనము.

"...కార్తవీర్యార్జున మూర్తియునుంబోలె నవిరళ కర
భూషితంబును, నృసింహులీలాడంబరంబునుం బోలెఁ

బ్రథిత హిరణ్యకశిపుక్షయంబును..." —భీమఖండము. 1 – 110.
ఈ ఘట్టమందలి విలయ హరివర్ణనము కడు విలక్షణమై యితని వర్ణనలలోని ప్రత్యేకత కుదాహరణ మగుచున్నది. సకల జగద్వ్యాపియగు విష్ణువు విలయ వేళ "మంచి లక్షణముల పుట్టుమచ్చవాఁడు, నేత్రములు విప్పనట్టి యా నెత్తుగందు వరద నేతెంచె నెవ్వారివాఁడొ" యనుటలోఁ బ్రతిపదమందును సకల పురాణసారము ధ్వనిగర్భితముగా నిమిడి యున్నది. ఇట్టి తావులం దచ్చ తెనుఁగులు జాతీయము గాపాడుటయం దితనికి మక్కువ యెక్కువ. మహత్తర విషయములను దేట తెనుఁగునందుఁ గతిపయి పదములలోను, స్వల్ప విషయ ములను గంభీరమైన పదగుంఫనలోను వర్ణించి యణువునందును, బ్రహ్మాండ మందును జదువరుల కొకే విధమైన నిష్ఠ గల్గించుట యాతని యాశయముగాఁ బెక్కు తావులందు గన్పట్టును.

పాండురంగ మాహాత్మ్యమునందలి శ్వేతద్వీప వైకుంఠ వర్ణనముల కాధారము చాలవఱకు రామానుజాచార్యుల వైకుంఠగద్యము. ఇందుఁ గొన్ని పద్యములకు సూటియైన సంస్కృత మూలములందుఁ గనుపించుచున్నవి.

1. "ఎన్నఁగ నింతరత్నచయ మింతగభీరిమ యింతదాన సం
పన్నత యింత శుద్ధియని బ్రహ్మయు నోరు మెదల్ప లేని య
త్యున్నతిఁగన్న వెన్నడలి మద్దితమై వెలిదీవి చెన్నగున్
వెన్నెల యేఁటిలోనఁ బ్రభవించిన కప్రపుకొండకైవడిన్"
—పాండు. 3–151.

"...బ్రహ్మాదీనాం వాఙ్మనసాగోచరే తేషామపి ఇయత్త్వ
మాణ మియదైశ్వర్య మీ దృశ స్వభావ మితి పరిచ్ఛేత్తు
మయోగ్యే .."

2. "నారసువర్ణ నీలమయసాల విశాలము నీలవర్ణ సం
చార చమత్క్రియాచరణశాలియు నైపురి చెన్నగున్..."
—పాండు. 3-154.

"నవసుధాపరిఖాంబు నివహ ముప్పెడుచోట
మెఱుఁగుఁ బుత్తడికోటమించుచోట
నిగిడి యాఁగుల కెంపు నెలకట్టుగలచోటఁ
గల్వకావిరి కారు గ్రమ్ముచోట
నలరు ముమ్మొనల కట్టావు లూరెడు చోటఁ
గెలఁకుల కొలఁకులు దొలఁకు చోట
గంధర్వ గాంధర్వ గంధ మింపగుచోట
గరుడ కేతనములు గ్రాలుచోటఁ"

"బరమయోగివరేణ్య నిర్భర సమాధి
సౌఖ్య సంపద నిరపాయ సంప్రదాయ
సిద్ధి తులకించుచోట నశేష భువన
వివిధ ధర్మంబు లావిర్భవించు చోట"

"బహుయోజన విస్తీర్ణము
బహునారీజన యుతంబు బహువిధ మహిమా
వహమునగు నొక్క కేళీ
గృహమున నానందకోరకిత మానసుఁడై"
—పాండు. 3-158, 159.

"...దివ్యావరణ శతసహస్రావృతే, దివ్యకల్పతరూప శోభితే, దివ్యోద్యాన శతసహస్ర కోటి భిరావృతే . ...పాదపస్తైశ్చ నానాగంధవర్ణైర్దివ్య పుష్పైశ్శోభ మానైర్దివ్య పుష్పోప వనైరుప శోభితే .....అతిరమణీయ దర్శనైః అతి మనో హరమధురైః అకులైరంతస్థ ముక్తామయ దివ్య క్రీడాస్థానోపశోభితైః దివ్య సౌంగంధిక వాపీ శతసహస్రైః......ఆవృతే"

3. "కలదోః కంకణ ఝంకృతంబుల మరుత్కన్యల్ సుధాబిందు పి
చ్ఛిల నీహారనమయూఖ బింబద ృశ స్విన్నానశ్రేణి వ
ర్తిల నొయ్యొయ్యన నూఁప నూఁగు ఫణి భృత్ప్రేరిఖోలికన్ లచ్చిని
ట్టలపుంజన్నవఁబోలు మున్నీరగుమున్ డాచేసి యుల్లాసియై"
—పాండు. 3-160.

".... మహతి దివ్యయోగ పర్యఙ్కే అనంతభోగిని శ్రీమద్వైకుంఠైశ్వర్యాది దివ్యలోక మాత్మకాంత్యా విశ్వ మాప్యాయ యంత్యా......శేష భోగే శ్రియాసహా సీనం......"

వైకుంఠ గద్యములోని వర్ణనములను గైకొని యితఁ డుత్ప్రేక్షాద్యలంకార భూషితములు చేసి పెక్కు తావులందుఁ జక్కని వివరణమువంటి కవితాకల్పన మును జేసినాఁడు. మూలములోని వర్ణనాంశములను గొన్నిఁటిని గ్రమము మార్చి కూర్పు నేర్పుఁ జూపినాఁడు. కొన్ని సంస్కృత సమాసములలోని వర్ణనములను దీయని తెనుఁగు పలుకుబడులలోనికి దింపినాఁడు. కాశీఖండమున శ్రీనాథుఁడు మయూరుని సూర్య శతకము ననువదించుటలోఁ జూపిన నేర్పునం దీతఁడు చూపినాఁడు. కూర్పు మార్పుటలో నంతకంటె స్వాతంత్ర్యము వహించినాఁడు. కొంతభాగమున నూత్నకల్పనముఁ గూడఁ జేసినాఁడు. ఘటికా చల గ్రంథమందలి వర్ణనలో నిట్టి సంస్కృతమూల మేమియులేదు.

హిమాలయ వర్ణనము

నారదుఁడు మేఘసరణి డిగ్గి ధరణికి నేతెంచు సందర్భమునఁ గైలాస మార్గానుగతమైన హిమవత్పర్వత వర్ణన మున్నది. ఇది చాల ప్రతిభాన్వితముగ, నుత్తమ నూత్న కల్పనావిభూషావహముగ రచింపఁబడినది. అందలి వనముల శోభ మనోహరము. ఆ యడవులలోఁ ద్రోవల నారదుఁ డేఁగుచుండగా నిరు పార్శ్వ ములను మారేడుచెట్లొత్తుగాఁ బెళిగి యున్నవి. వానియందు లతలు కొన్ని చాందినీలవలె నల్లుకొనినవి. ఆ లతలనుండి పూలు రాలి తేనెలు కురియు చుండును. ఆ తేనెలతోఁ దడిసిన పుష్పాదుల వాసనలు వనదేవతల కుచద్విత యములం దలంకరించిన యక్ష కర్దమముతోఁ గలసి సారవుఁదావులై త్రోవ లాఁగుచుండును. ఇందలి వర్ణ్యవస్తువుల కూర్పు వాల్మీకి రామాయణమందలి వర్ణనల పద్ధతిలో నున్నది. ఉరగసతులుచిత నేపథ్యయుతలై రేలయం దభిసరింప దరిగి యరితి తిరుగుమొగ మగుచుండునంత చిక్కుల తెరవులా హిమా లయముల' వనవీథులయం దున్నవని కల్పించుట రామకృష్ణకవి యనమాన వర్ణనాకౌశలమునకును, వాస్తవిక కళాపరిపోషణ సామర్థ్యమునకును నిదర్శన ములు. అందలి సింహములను వర్ణించుటలోఁ గాళిదాసు కుమారసంభవమందలి హిమాలయ వర్ణనమునకు సజాతీయమగు వర్ణన మున్నది. రాజతాచలమును గోరాజమునకు గంగడోలువలె గంగ యున్నదని వర్ణించు టత్యద్భుత రూప చిత్రణము.

ఈ వర్ణనము మనోహరమే కాక మిక్కిలి సముచితము, సందర్భితము, నారదుని ప్రయాణ మొక సంకేతముగా, నతఁ డధిరోహించుచు దర్శించిన మార్గ మందలి విశేషములన్నియు ననుభూతములైన ప్రజ్ఞలకు సంకేతములుగా నుప మింపఁబడినవి. భవిష్యత్కథలో నారదుఁడు శివుని దర్శనము చేయుఁబోవును గనుక నిది మిక్కిలి సందర్భితమైన వర్ణనము. శ్వేతద్వీప వర్ణనమందలి పద్ధతి కన్న నిందలి పద్ధతి యెక్కువ సహజము, వాస్తవికమునై యున్నది. ప్రకృతి వర్ణనమునందు రామకృష్ణుఁడు పాటించునట్టి ముఖ్యమైన కావ్య శిల్పధర్మ మొకటి గలదు. అది సందర్భోచితమైన వర్ణనావిధానము. కవియొక్క ప్రతిభావశమున వర్ణ్యవస్తువు నియత స్వభావమును గోలుపోవునను సత్య మితని వర్ణనలయందుఁ

దేటతెల్లమగును. నిగమశర్మోపాఖ్యానమున నరణ్య వర్ణనముతో హిమాలయా రణ్యవర్ణనమును బోల్చినప్పు డిది స్పష్టమగును.

"కాఁబోలు నివిగణగ్రామణి కల్పితా
నల్పవిహార గేహాంగణములు
కాఁబోలు నివి చరత్తచర చారున్తనీ
నమ్మర్దగళిత భూషాస్రజములు
కాఁబోలు నివి దక్షకన్యాంఘ్రి విన్యాస
ధన్యానకృత్కేళి మాన్యగుహాలు
కాఁబోలు నివి మోదక ప్రియ ప్రబలదం
తవ్రాత నిర్భిన్నధాతు ఖనులు
తెలియఁ గాఁబోలు నివి వహ్నితిలక చలక
పర్ద నిర్ఘోష సుర సరిద్బహుళలహరి
గహన కుసుమాయమాన శీకర నిపాత
శీతలక్ష్మాతలోర్ధ్వద్రుపోతకములు" —పాండు. 2-176

"కఠిన కంఠీరవాక్ష తనఖక్షత జర
త్కరిశిరశ్శుక్తి శార్కరిలతలము
లావాంత జంతు కంఠాస్రుగుగ్ర వ్యాఘ్ర
ముఖగుహాభాంకార ముఖరితంబు
లశ్వద్ద్విషద్విషాణాగ్ర నిగ్రహవహత్
ప్రస్తర ప్రసవ సౌరభమయంబు
లజ్ఞాతర వికర వ్యాపార భూరుహ
చ్ఛాయానపాయాతి శైత్యఖనులు
గహన ఘంటా పథంబులు .. ..
.... — పాండు. 3-83

ఇందు రెండు నరణ్య వర్ణనములే యైనను, వర్ణింపఁబడిన వస్తుసంపద వేఱు. అందు మొదటిది కైలాసోన్ముఖమైన మనస్సు కలవానికిఁ గనుపించు నరణ్యము. రెండవది ధర్మచ్యుతునకుఁ బొడకట్టు తప్పుదారి. అందువలననే రచనలోని ప్రసన్నత విషయమునఁ గూడ భేద మున్నది.

జాతర వర్ణనము

నిగమశర్మోపాఖ్యానమునందలి జాతర వర్ణనము మాత్రము ప్రధానకథతో నెట్టి సంబంధము లేనిది. కేవలము కవి వర్ణనాకౌశలమును జూపుటకు మాత్రమే యేర్పడినదనియు ననరాదు. మద్య మాంసభక్షణము, విశృంఖల విహారము మూలమునఁ దుష్టి నన్వేషించుచున్న నిగమశర్మ చైతన్యముయొక్క స్థితిని సంకే తించుటకై యీ జాతర యిట నిక్షేపింపఁబడినది. కావుననే పశురక్త మాంస బలియు, మద్యముయొక్క చొక్కు పెచ్చుపెరిగి యావేశపరులైన విశృంఖల

భక్తులు తమలోని క్షుద్రశక్తులను దేవిగుడిముందుఁ బ్రదర్శనము చేయుచున్న ట్లుగా వర్ణింపఁబడినది.

ఈ వర్ణనమున 'భూతద్దము' వంటి యొక్క వైచిత్రియున్నది. ఇది కడు విస్తృతముగా నెక్కువ పరిణామమున వర్ణింపఁబడినట్లు చదువరుల మనస్సునకుఁ బొడకట్టును. వి యెంచి చూచినచో నాలు పద్యములు, నొక చిన్న గద్యయు నిందున్నవి. ఇది యిట్టిభ్రాంతి పుట్టించుట కొక కారణమున్నది. వర్ణిత వస్తువు నందలి సూక్ష్మాంశము లధిక సంఖ్యాకములుగాఁ జదువరుల మనఃఫలకమునకుఁ బొడకట్టు నట్లల్పాక్షరములతో నిబద్ధము చేయఁబడినది. ఈ కుదింపు కొంత శ్లేషవలనను, గొంత వ్యంగ్యపరిపుష్టివలనను గొంత జాతీయమైన సులభశైలిలో వస్తువర్ణనము మిక్కుటముగాఁ జేయుటవలనను జరిగినది.

ఈ జాతర వర్ణనమునఁ దెనుఁగుదేశములోని పల్లెపట్టులందలి యావార వ్యవహారములు చక్కగాఁ జిత్రింపఁబడినవి. పర్వదినములలోఁ బామరప్రమద లుత్సవమునకుఁ బోవునపుడలంకరించుకొను వైఖరివాల వాస్తవికముగా వర్ణింపఁ బడినది.

"గోర్వెచ్చచము రంటు కొనిరి మస్తకముల
జలకమాడిరి నిగామిళిత వారిఁ
గట్టిరి చిఱుత చౌకముల కొ్ంబుట్టముల్
కాటుకఁ దీర్చిరి కన్నుగవల
దిద్దిరి సిందూర తిలకంబు బటువుగా
నిక్కుఁగొప్పుల విరుల్ గ్రుక్కి రర్థి
నింబ ప్రవాళమాల్యంబులు వైచిరి
చిట్టిబొట్టు ధరించి రిట్టునట్టు

తరుణధావణ ధగధగద్దశన మణుల
హత్తుకొలిపిరి లేఁతపీడ్యముల డాలు
పర్వదినములఁ బామరప్రమదలు దిత
నియమ సంభావనారంభ నిభృత బుద్ధి" -పాండు. 3-74

అట్లే పురుషులు వర్ణింపఁబడిన విధానము హాస్యగర్భితముగాఁ గన్నులకుఁ గట్టునట్లున్నది.

"ఎడ్డెతనవుఁగయి సేఁతల
రడ్డులు నడచిరి పురస్పరద్భార్యముగా
గుడ్డంబు చక్కఁగట్టం
బడ్డ మహాశక్తి దివ్యభవనంబు నకున్" పాండు. 3 – 75.

ఇందలి వాస్తవిక కల్పనము, సహజమైన లోకపరిశీలనాసామర్థ్యము, సంప్రదాయ జ్ఞత యీ ఘట్టమును జారుతరముగాఁ బరిష్కరించినవి. ఇందలి చిన్ని వచనమునఁ గల విర్ఘోధా భాసాలంకార గుంభనము కవి పదగుంఫన సామర్థ్యమునకు

సూటియైన నిదర్శనము. సత్కవిత్వమెట్లుండవలె నను నంశము గూడఁ బ్రసంగ వశమున వ్యాఖ్యానింపఁబడినది. అసాధువర్ణములు సత్కవిత్వమున నుండరాదు. ఇందసాధువర్ణము లనఁగా సందర్భోచితములు కానివి యని గైకొన్నచో రామకృష్ణుని యీ ప్రబంధమే యీ లక్షణమునకు లక్ష్య మగుచున్నది.

ఈ ఘట్టమున నితని యలంకార కల్పనలోని ప్రతిభావిశేషముగూడఁ జూపఁబడినది. ఉపమాలంకార మీ దిగువ పద్యమున నిరుపమానముగా వాడఁబడినది :

"అంభోధరము క్రింద నసియాడు నైరావ
తియుఁ బోలె సిడి వ్రేలఁదెరవ యొర్తు
చెందమ్మి కొలన రంజిల్లు నంచయుఁబోలె
నిప్పటేట నటించె నెలఁత యొర్తు
తొలు సంజయెండ వర్తిలు జక్కవయుఁబోలె
నీఁగెఁ బందిరి గుండ యింతి యొర్తు
జలనీలిపై నిక్కు కలువ మొగ్గయుఁ బోలె
ననఁటాఁకు నర్తించె నతివ యొర్తు
.. .." —పాండు. 3 – 77.

ఈ ఘట్టము వివరఁ గూర్చిన సహోక్త్యలంకారముగూడ నచ్చెరువు గొలుపునదియై జీవుల నడవడికిని, బ్రకృతిలోని లీలకును సామ్యమును సాధించి చూపినది.

"పెలుచఁగలుబొక్కు చెలువల తలకు నెక్కఁ
దోన దిక్కుల తలకెక్కఁ దొడఁగెఁదమము
దేవిగుడిలోన నొక్కొక్క దివియ దోఁపఁ
దోన నొక్కొక్క చుక్కయుఁ దోఁచెమింట" —పాండు. 3 – 79.

ఈ సహోక్తులలో మొదట జాతరతోఁ బ్రకృతి వర్ణనము, పిదపఁ బ్రకృతితో జాతర వర్ణనము పోల్పఁబడినది.

ఈ ఘట్టము కావ్యమందలి శోభాస్పదములైన వర్ణనలలో నొకటియని చెప్పక తప్పదు. నిగమశర్మోపాఖ్యానమునకు దీనివలన నెక్కువ ప్రాధాన్యము చేకూరినది.

ఋతువర్ణనము

ప్రాచీన భారతీయ కావ్య సంప్రదాయమున ఋతువర్ణనము ప్రాధాన్యము వహించును. ఆంధ్రకవులలోఁ గూడ దీనిని స్పృశింపనివా రరుదు. రామకృష్ణకవి పాండురంగ మాహాత్మ్యమున నీ యంగ మర్థవంతముగను, సప్రకరణముగను బరిపుష్టి నందినది. రాధ తపస్సు చేయుచున్న సందర్భమున "శితుకందువయు,"

"జితహేమంతమగు వసంతము". వేసవి, కారుకాలము, శరత్సమాగమమును వరుసగా వర్ణింపఁబడినవి ఇవి కేవల వర్ణనములు గాక కథాగతిని గర్భితము చేసికొని నడచుట వలన నర్థవంతములై సహృదయ హృదయరంజకములై పాఠకుల కనివార్య పఠనీయములై యొప్పారినవి. కృష్ణునిగూర్చి తప మొనరించు రాధచే ననుభూతములైన యీ ఋతువుల శోభ యెక్కువ భాగము రాధతపస్సుగను, గృష్ణుని ప్రసన్నతా చిహ్నముగను వర్ణింపఁబడినది.

అ. హేమంతము :

ఇది విత్తానందమునందు భోగులకు నిస్త్రింశోగ్రసంపాతమైనది. ఐహిక సుఖలాలసులగువారికిఁ గరంబుద్వేగ మందించినది. కొండలందు ధూమానుమాన కలన నగ్ని యస్తిత్వమును సాధించు పండితులవలె రసికులు కాలాగురూద్వర్తనముల వలన సతులచన్నుఁగొండల నూష్మాగ్నిని సాధించిరఁట. ఆ ఋతువున వెచ్చని తావులు లోభ నీయములు గదా. ఇట్లు శీతోష్ణముల యింద్రజాలమునకు లొంగిన భోగుల నీ ఋతువు త్రిప్పలు పెట్టినది. కాని శీతోష్ణముల సంస్పర్శజమైనస్థితిని జయించి తపస్సు చేయుచున్న రాధ నేమియుఁ జేయలేక పోయినది.

"చంద్ర బింబాస్య కుచశైల జన్మభూమి
గాన రారూపువోతె నక్కడిఁదిచలికి
నించు కంతయుఁ గంపింపదివముగొనుచు
ముజ్జగంబులు పచరింప మూటిలెక్క" —పాండు. 4 – 6.

రాధ మేను రంగున మాత్రమే కాక గుణమునను బంగారమని యీ ఋతువున రుజువైనది.

"పాదదంబునఁదోఁచిన పసిఁడి తీగ
పగిది రాజిల్లె రాధ చంపక సవర్ణ
వర్ణమగు మేను కుముద ధవళతుషార
పటలకంచుక వేల్లన ఘటనకలిమి" —పాండు. 4 – 6.

కమలములన్నియుఁ మంచుతో ముడుచుకొనిన కొలఁకులు గూడ "హరిధ్యాన నిమీలితలోచనయౌనల రాధావధూటి" తో సామ్యమును జేకూర్చుకొనినవి. తపఃప్రభావమునఁ బరిసర ప్రాంతములు ప్రభావితము లగుటను బ్రతీయమాన మొనర్చు నీ హేమంత వర్ణన మొంతయు గణనీయము. ఇందిహపర సౌఖ్యముల తూలనము చేయఁబడినది. భోగుల విశృంఖల సౌఖ్యము, తపస్విజనుల నిర్లిప్తతయుఁ దిలతండుల న్యాయముఁ జేయఁబడుటలోఁ బ్రకృతి యందలి జీవులు పలు పోకడలు గలవారై యుండఁగా వారియం దంతర్లీనమైన ప్రకృతి భగవంతుని జేర యత్నించుచుండునను దాత్త్విక పరామర్శ యీ ఋతు వర్ణనమం దంతర్వాహినిగా నున్నది.

అ. వసంతము :

ఇది రెండు పద్యములలో సంగ్రహముగా వర్ణింపఁబడినది. "జితహేమంతము" వసంత మనుటలో హేమంత శిశిర ఋతువులు రెండును హేమంత శబ్దముచే గ్రాహ్యములు.

మదించిన తుమ్మెదలచే నాక్రమింపఁబడి, యురు పుష్పరసవేశంతమై సర్వవృక్షముల విజృంభణము సూచించియు, నీ ఋతువు తపస్సు చేయుచున్న రాధ యాకృతినే యనుకరించుట ముదావహము. తపోబలము బలవత్తరమైనది. విపిన భూములలో మధూలక్ష్మియుఁ దపోదీక్ష గైకొన్నది.

"కెంజిగురాకుడాలు దులకించిన ధాతు పటంబుచయఁ జే
యదు జంకెక్కు పుప్పొడుల నంటిన తేఁటులు భూతిభృజ్జటా
పుంజముఁ బోలఁగా విపిన భూములలో మధులక్ష్మి పొల్చె నీ
లాంజమవర్ణుఁగోరి తపన ట్లొనరించు మృగాక్షి కైవడిన్"

—పాండు. 4-14.

వసంత ఋతు వర్ణనమున వైరాగ్య లక్షణము నుపమించుట కవుల కల్పనలలో నరుదైన యంశము.

ఇ. గ్రీష్మము :

ఇది కొంత విస్తృతము చేయఁబడినది కాని వర్ణనమునం దెక్కువ భాగమునకు రాధ తపస్సుతో సంబంధములేదు. అయినను వ్యంగ్యమగు సంబంధమున్నది. ఆ వేసవి సూర్యుని నవ్వు వికసించుటగా నుపమించుటచే లోకముల కాత్మయగు సూర్యాంతర్వర్తి నుపాసించువారి కది వికాసకరమైన ఋతువే యని హెచ్చరిక. కథకుఁడగు శివుఁడే "నీలగ్రీవాలిక కీలకీల కేవల నహమై" యని యా వేసవిని వర్ణించుటచే రాధ యొక్క యోగ సాధన స్థితిలో గ్రీవము – విశుద్ధి చక్రము, అలికము. ఆజ్ఞాచక్రము స్థానములుగా నామె ప్రజ్ఞ వర్తించుచున్ననాఁటికి గ్రీష్మఋతువు వర్ణించినదని ప్రతీయమానమగును. ఆమె "పద్మిని" యని చెప్పఁబడినది – 4-17. పద్మిని యనఁగా నుత్తమజాతి స్త్రీ యనియే గాక పద్మములు – మూలాధారాది పట్పద్మములు – కలది యని విశేషము. ఇఁక దినకర కరతాపమున కోర్వకుండుట యెట్లు జరుగును ? శ్రీపతియడుగులే యామె యెండకు గొడుగులు. ఆకాశమున "విష్ణుపదము" – శ్రీపతియడుగు – అనఁబడు స్థానమే యామెకు గొడుగైనప్పుడు తాపము కలుగుట యెట్లు ? ఈ గ్రీష్మ వర్ణనమున నెంత చమత్కృతి యున్నది :

ఒక పెద్ద వచనమునఁ గథకు సంబంధము లేని గ్రీష్మ ఋతు వర్ణనము చేయఁబడినది. ఈ వచన రచనలోఁ గాదంబరి, దశకుమార చరిత్ర ముద్రలున్నవి. పోతన భాగవతమందలి వచనచ్ఛాయలు మున్నవి. తెన్గుఁగు పద్ద

ముల పొంకమునను, స్వభావోక్తుల బింకమునను కృష్ణరాయని కవిత్వము నెడల నీ కవికిఁ గల గౌరవము స్పష్టముగాఁ గనుపించును.

"విచికిలమాలికాలంకృత మౌళిభాగులును, నారంజిత
ధాతుపట పరభాగులు నగు భోగుల బాగున గుబ్బుమోదు
నెఱచీమలబారులు చెమ్మయిమ్ములం గుమ్మరం దొడంగె"

—పాండు. 4-16.

నను పమానమున కృష్ణరాయల యాముక్తమాల్యదయందలి గ్రీష్మఋతు వర్ణనమున,

"తోఁటఁ బగలుండి మల్లెలు దురిమి కావు
లమరమాపైన నిక్షుయంత్రముల కొయ్యఁ
జేరు వ్రజవాల్చె భావిదృష్టికిని గుబ్బు
తో మధురిమేచ్చదిగు నెఱ్ఱచీమ లనఁగ"

—ఆము. 2-71.

అను పద్యములోని భావమున కుపమానమున్నది. "వియోగి లోకంబులు విషయ విముఖంబులయ్యె" నని వర్ణించుటలో "అభ్యుపశాంతమన్మథః నిదాఘకాలః" అను కాళిదాసుని ఋతుసంహారమందలి గ్రీష్మర్తు వర్ణనములోని భావము తోంగి చూచును. తపస్సును వర్ణించుచున్న ఘట్ట మగుటవలన నిది యిం దెక్కువ యర్థవంతమై యున్నది.

ఈ. వర్షర్తువు :

ఈ ఋతువును వర్ణించుటలోఁ గూడఁ గవి మిక్కిలి ప్రత్యేకతను జూపినాఁడు. శబ్దార్థపరములైన కావ్య గుణములపై నీ ఘట్టమున నెక్కువ శ్రద్ధ చూపఁబడినది. అలంకారములు ప్రతిభావంతమైన నవ్యతను జూపుచున్నవి. దీప మారినప్పుడు చీకటివలె గ్రీష్మంతమునౌవచ్చిన మేఘావరణమును గోపము తగ్గిన వెంటనే కలిగిన శాంతగుణముతోఁ బోల్చుట మిక్కిలి యరుదైన యలంకారము. ఆకాశతత్త్వతనుఁడగు శంకరుని కంఠ కాళిమ వలె జలధర కాంతి వ్యాపించినదని శంకరుఁడే వర్ణించుట యాశ్చర్యము. ఆకాశతత్త్వతనుఁ డనఁగా శబ్దతత్త్వమే శరీరముగాఁ గలవాఁడని యర్థము. కనుకనే మేఘములు గర్జించుచున్నవి. వర్ణనానుకూలమగు శయ్య యిందు హెచ్చుగాఁ బాటింపఁబడినది. ధారాపాతమైన వర్షమును వర్ణించుచు దుష్కరప్రాసలో నోజోగుణ ప్రధానమైన వృత్తమును రచించెను.

"అద్రిగ్రావము లుర్విరాల బరఘోషాడంబరంబుల్ వియో
గిద్రోహంబొనరింప వారినిధి కెంగేలంటఁగా వాహినుల్
భద్రేభ ప్రతిమానమూర్తి యగుచున్ బాధోధర శ్రేణి కుం
భద్రోణంబులు గుమ్మరించె విమలాంభః పూరధారావళిన్"

—పాండు. 4-26.

పడిన వర్షమునకు, వర్ధిల్లిన సంపదను బరిగణన మొనరించుటలో నలఁతి యలంతి తునియల జానుతెనుఁగు పదములలో మణులకూర్పువలె తేటయైన రచన చేయఁబడినది.

"ప్రబలు వడగండ్లు నింద్రగోపములు జంబు
ఫలములును బొల్చెఁ బచ్చిక పట్టులందు
వనధి నీరాన దొరలు నమ్మణుల నెల్ల
నంబు దంబులు వెలిగ్రాసె నలుగకనఁగ"

—పాండు. 4-23.

స్వభావోక్తులలో సూక్ష్మతరాంశముల ప్రకృతి పరిశీలనము కడు రమ్యముగాఁ జేయఁబడినది. తొలివాన వినుకులు పయన మొనరించిన తెఱువు రామకృష్ణుని ప్రకృతి పరిశీలనమును దెలియఁజేయును. ఈ పరిశీలనము కథతో నంబంధించుట మఱియొక విశేషము.

"పావట తెఱువు నదిగి నా
సాపుట ముక్తాఫల ప్రచారంబై రా
ధాపృధు వక్షోరుహముల
పైపైఁ బ్రథమోదబిందు పటలము నిగిడెన్

—పాండు. 4-27.

వర్షా నంపదలోని వివిధ విశేషములను వర్ణించి రాధతపోనిరూఢిని, వర్ణించి వర్ణ్య వస్తువుల కొక విచిత్రమైన యైక్యము సాధింపఁబడినది. నెమళ్లు, నీలాకాశము, మేఘఘోష, యింద్ర ధనుస్సు, మెఱపు తీగ, వృష్టియుఁ, దనువులు పులకరించుటయు వేర్వేఱుగా జీవులకు గోచరింపఁగా రాధ కందలి యఖండ పురుషాకృతియగు ధ్యేయరూపము గోచరించినది.

"ఇంద్ర చాపంబు గా దిది మౌళితలమున
 నవరించు బర్హిపింఛంబు గాని
ఛిదుర ఘోషంబు గాదిది పాంచజన్య సం
 జాత గంభీర ఘోషంబు గాని
యాశ్రయించిన బలాకావళి గా దిది
 హారిముక్తాహార యష్టిగాని
యిది కోలమెఱుగు గాదు దిరి బంగారంబుఁ
 బసిమిఁ గ్రమ్మెడు పచ్చపట్టుగాని

వృష్టి గా దిది కరుణాంబు వృష్టి గాని
నీలమేఘంబు గా దిది నీలవర్ణుఁ
డౌర ! నామ్రోలఁ బ్రత్యక్ష మయ్యెననుచు
హర్షపులకిత తనువయ్యె నవ్వధూటి"

—4-31.

ఇట్లు కథా సందర్భితమైన వర్షర్తువున "నిఖిలజగద్వలయంబును విష్ణుమయంబు-గాఁ దోచినది.

కవిసమయములలో వర్షర్తువున రసస్వరూపుఁడగు నారాయణుఁడు భూమికి దిగివచ్చుట యున్నది. తదనుసరణముగా వర్షర్తువునందు రాధకుఁ గృష్ణుఁడు ప్రత్యక్షమైనట్లు వర్ణింపఁబడినది. రాధాకృష్ణుల సమాగమమందలి యను భూతియే శరత్కాల సంపదగా వర్ణింపఁబడినది. చక్కని స్వభావోక్తులతోడి తేటయైన మాటల మేటి రచన యీ శరత్తునఁ గ్లుప్తముగా వర్ణింపఁబడినది.

ఉ. శరదృతువు :

ఇం దెక్కువ భాగము కథాగతముగా నడచినది. "కలఁశ నీ రెంతయు గత కల్మషముఁ జేసెఁ గతకాఫలమురీతిఁ గలశసూతి" యను సీసపద్య మంతయు స్వచ్ఛమైన ప్రకృతి వర్ణనము. ఇందలి రచనయు, వర్ణిత వస్తువిన్యాస మును వాల్మీకి రామాయణమందలి ఋతు వర్ణన మార్గమున నడచినవి. మిగిలిన పద్యములలోఁ బ్రకృతి సౌందర్యముకన్న నలంకారముల ధాటి హెచ్చుగా నున్నది.

వనవిహార వర్ణనము

ఇది ఘటికాచల మహాత్మ్యమున, నుద్భటారాధ్య చరిత్రమునఁ, బాండురంగ మహాత్మ్యమునను జేయఁబడినది. అందు మొదటి కావ్యమున నప్సరసలు, ఋషుల తపస్సును భంగపరచుటకు యత్నించు సందర్భమున నున్నది. ఇందుఁ గేవల వర్ణనము తప్ప మఱి యే విశేషమును లేదు. ఈ వర్ణనము గూడ సామాన్యముగనే యున్నది ఉద్భట చరిత్రమునఁ బార్వతీ పరమేశ్వరుల విహార వర్ణనము రమణీయముగా, శృంగార రసపోషకముగా నౌచితీవారువుగా నున్నది. ఇందుఁ గొంత తిక్కన నిర్వచనోత్తర రామాయణమందలి సీతా రాముల వనవిహారవర్ణన వైఖరి యవలంబింపఁబడినది. పాండురంగ మహాత్మ్యమున శృంగారగర్భితమైన రచనలోఁ బరతత్త్వము ధ్వనింపఁజేయఁబడినది. స్థూలదృష్టి కొకే విధమైన వర్ణనము చేయఁబడినట్లున్న యీ దిగువ రెండు పద్యములను బోల్చి చూచినచో నీ రెండు కావ్యములలోని సూక్ష్మభావముల గౌరవములఁ గల భేదము గోచరించును.

"అల్లనమావి కొమ్మ చిగురాకు నిజాంచిత చంచుధారచేఁ
జిల్లులు పుచ్చి తద్రస విశేషము నాలుక సోఁకఁ జొక్కుచున్
దుల్లపికంబుఁ జూడుమని ధూర్జటి చూపినఁ జూచి పార్వతీ
హల్లక గంధివం చెపదనాబ్జము కన్నుల నవ్వు దేరఁగాన్"

—ఉద్భ. 1-93.

"విమల మయూఖరేఖయు నవనతరోత్పలష్మతమున్ బ్రవా
ళమణియు నొక్కటీవయ బలాకృతిఁ దాల్చెనటన్న వించు వి
భ్రమ శిథిలాంగి యయ్యుఁగుచభార వితంబకపోల గోపన
క్రమకలనాకులాత్మయయి కన్నులనీశునదల్చె గౌరియున్"

—పాండు. 1-186

కేవల శృంగారరస పరిపోషణమునే పరిగణించి పరిశీలించినను, రెండవపద్యమందలి రసధ్వని మొదటిదానిలోఁబరిపుష్టి పొందలేదు. వర్ణనాకౌశలము మాత్రముద్భట చరిత్రాంతర్గత వర్ణనమందుఁ గూడఁ బరిణతమై ప్రత్యేకత వహించినది. ఈ వర్ణనమం దెచ్చటను రసభంగకారకమగు వర్ణనము మచ్చునకైనఁ గానఁబడదు. శృంగార, హాస్యరసపోషకములైనఁ ఘట్టములలో ననౌచిత్యము, దొరలకుండఁ దీర్చిదిద్దుట యరుదైన సంపద. ఈ సంపద రామకృష్ణుని రచనయందున్నది. మొత్తముమీద నుద్భట చరిత్రమందలి విహార వర్ణనము రసపరిపోషకముగ, నుత్తమ చమత్కారయుతముగ నలంకార ప్రధానముగఁ దిద్దఁబడినది. పాండురంగ మాహాత్మ్యమందలి విహార వర్ణనము రసధ్వని ప్రధానముగ రచింపఁబడినది.

"తరుణశశాంక శేఖర మరాళమునకు
    సారగంభీర కాసారమగుచుఁ
గైలాసగిరినాధ కలకంఠ భర్తకుఁ
    గొమరారు లేమావి కొమ్మయగుచు
నురలోక వాహినీధరవట్టదమునకుఁ
    బ్రాతరుద్బుద్ధకంజాతమగుచు
రాజరాజప్రియ రాజకీరమునకు
    మానిత పంజరస్థానమగుచు

నురగవల్లభహార మయూరమునకుఁ
జెన్నుమీటిన భూధర శిఖరమగుచు
లలిత సౌభాగ్యలక్షణలక్షితాంగి
యద్రినందన వొల్చె విహారవేళ"

—ఉద్భటా. 1 – 94.

"విగురులు దెరఁజేసి విరివిక్కని చక్కని పువ్వుగుత్తులన్
బిగువుచనుంగవంబొదివి వ్రేలెడు విల్కులఁజోపి తేనియన్
బొగపిన పల్కులం బొగడి భూతపతిన్ బతిమెచ్చఁజేసె న
య్యగజ తదుద్యమర్హ వినయానునయాధి నయానుకూలతన్"

—పాండు. 1 – 190.

సందర్భము, నౌచితియు ననుకూలించు పట్టులలో విహారమున నీ కవియు నితర ప్రబంధ కర్తలకువలెనే శృంగారరస పరిపోషకమగు రచనను విస్తారముగానే వేయును. ఆయుతుఁడు కప్పురై యుండఁగా నృసింహాలయమునకు వచ్చిన

కాన్యకుబ్జ రాజకుమారికయుఁ జెలులును విహరించిన విధానము నరసినచో నీ యంశము స్పష్టమగును.

"గంధవాహమున కాగారంబు లివియంచు
    వీజనంబులఁ జూచి వెగటుగదిరి
మరుబాణముల సహోదర వర్గమిదియంచు
    నలరుమొగ్గలఁ జూచి యలంతనొంది
కమలారిసోమంబు గైకొన్నవి వియంచుఁ
    బుల్లతీగలఁ జూచి పుల్లసిల్లి
శుకయుగంబులుఁ దాము నొకచాయ వివియందు
    నవశుకంబులఁ జూచి నయముదలిగి

కాన్యకుబ్జేశ కన్యపైఁ గలుగు చెలువ
భావముల పెంపు నొలవులు మోవఁజేయ
బరిమినిజధైర్యములు వికక్కఁబట్టియున్న
మును లొనర్పుదు రొకరీతి ముఖ్యవిధులు" —పాండు. 5 – 292.

స్త్రీ వర్ణనము

రామకృష్ణకవి స్త్రీ వర్ణనమునం దౌచితిని, యోగ్యతను మున్నిడుకొని రచన సాగించును. అధిక ప్రసంగము మందునకైనఁ గానరాదు. సుశీల, రాధ, నిగమ శర్మ యక్కయు వర్ణింపఁబడిన పద్ధతి యతి సుకుమారమైనది. అందు రాధ శరీర వర్ణన మంతయుఁ గృష్ణపదార్పితమై యౌచితి నుత్తమరీతిలోఁ బోషించు కొనినది. మిగిలిన యిరువురి విషయమునను భౌతిక శరీర వర్ణనమే లేదు. ఇతని కావ్యములలో స్త్రీ పాత్రలు చైతన్యవంతములు. పవిత్రతాప్రతిపాదకములు, నుత్తమ గృహస్థ ధర్మభూషితములు. రాధలో దివ్యత్వము హెచ్చు. మిగిలిన యిరువురిలో మానవత్వము హెచ్చు. నిగమ శర్మ యక్క చదువరులందఱకు జ్యేష్ఠసోదరియై హితబోధ చేయును. సుశీల వాత్సల్యశీలయయిన పెద్ద ముత్తయిదువ.

ఈ కవి స్త్రీ వర్ణనమందుఁ గచకుచాది వర్ణనము బొత్తిగాఁ జేయలే దన లేము. కాని చేసిన తావున నౌచితీ పరిపోషకమగు నొక శిల్పమాత్ర సంస్కారము చదువరుల మనః ప్రగ్రహమున నింద్రియాశ్వములను సంయమనమున నిలుపును.

1. నిగమశర్మ యక్కను వర్ణించుచు,
   "తన సంతానముచంట వెంటసందడి చేయన్"
   "బిడ్డ చనుద్రావనిట్లను బిసరుహాక్షి"

ననుట మాతృత్వ పరిపోషకము.

2. రాధ యౌవనమును వర్ణించుచు,

" కమల కోరక కనకకలశ కరి కుంభ ప్రముఖంబులగు నుపమాద్రవ్యంబుల క్రొవ్వడంచి పంచారించి, పిక్కటిల్లి పెరిగి నిక్కకక్కసించి, కవజక్కవలఁబెక్కువలలంబెట్టుచుఁ జూపట్టి దోర్మూలకూలంకషంబులగు కుచలి కుచంబులును,..."

—పాండు. 3 – 179.

"మానపతిల లామ తను మధ్యమమన్ గజవైరిరెకుల్కిత
ద్యాన మరున్మదావళము యౌవనపుఁ బొదరిండ్లుదూఱఁబైఁ
గానఁగవచ్చు కుంభములు కావుగదా కుచకుంభయుగ్మకం
బౌ, నటులైన వల్లభనఖాంకుశరేఖలు గల్గు మీఁదటన్"

—పాండు. 3 – 186.

"చంద్ర బింబాస్య కుచశైల జన్మ భూమి
గాన రారూపు వోలె నక్కడిఁది చలిక
నించుకంతయుఁ గంపింప దివము కొనుచు
ముజ్జగంబులు పచరింప మాటిలెక్క"

—పాండు. 4 – 5

ఇట్లు ప్రస్తావించుట కృష్ణపాదార్పితజీవనయైన వస్తు వగుటవలనఁ బారకులనుఁ బవిత్రమైన దివ్యశృంగారరేఖకు సామాజికులనుగా నిలుపును. దేవపూజకుఁ దెచ్చు పుష్పముల పరిమళమువలె, నైవేద్యమునకుఁ గొనిపోవు పిండివంట గుమగుమవలె నిది చదువరుల యుత్తమ సంస్కారములను జూరఁగొనును.

3. నిగమశర్మోపాఖ్యానమునఁగాపుఁగోడలిని వర్ణించును,

"కుదుర పాలిండ్లపైఁగొంగుజాఱఁగంగొప్పు
వీడనూఱకనవ్వు వెట్టి నవ్వు"

—పాండు. 3–62.

'బళిరా ! తేరకుఁదేరదక్కొనిటులీబంగారు కుండంచుఁజం
కలుదాటించుచుఁగెంపుమోవి దొడుకంగాగుబ్బవారిండ్లు బి
ట్టలమంగా ముఖగంధపారణము సేయంగాఁగటిసీమను
త్పలపత్త్రాళి ఘటింపఁగాఁదివురు మిత్త్రద్రోహిమోహాంధతన్"

—పాండు. 3–71.

"వడనున్న పండ్ల సంపద వెంపు వాలిండ్ల బీరంబు"

— పాండు. 3–72.

"గతి మధ్య స్తనకుంతలస్తబక వీక్షా గర్వదుర్వార, యీ
సతిచేమాన మె యూనమయ్యెనిఁక నిస్సారంపుఁ బ్రాణంబు దా
ల్చుతగుల్ గాదని రోసియావృషని వాలుందూవుఁ ఁగామ్మంటకా
హతియా బర్హిమృగేంద్ర కుంభిచమరీయూథంబు నేణంబులున్"

—పాండు. 3–86.

మున్నగు తావులందుఁ జేసిన వర్ణనలో నెక్కువభాగము దూష్యము. క్షుద్రుల ప్రవృత్తి వర్ణన మిది. అందువలననే మృగములుగూడ "మానమెయూన మయ్యెనిక నిస్సారంపుఁ బ్రాణంబు దాల్చుతగుల్ కాదు" అని రోసినవని ధ్వని గర్భితముగా నిందించినట్లు చెప్పఁబడినది.

4. ఉద్భట చరిత్రమునఁగనకలతయను వేశ్యను వర్ణించుటయున్నది. అదియుఁ గావు కోడలి వర్ణన వంటిదే.

5. పాండురంగ మాహాత్మ్యమందలి యయుతనియుతోపాఖ్యానమునఁ గాన్యకుబ్జ రాజకుమారియుఁ, జెలికత్తెలును వచ్చినప్పుడు వారి వర్ణనమునందుఁ గొంత భౌతికమగు నంగ వర్ణన మున్నది.

"మార్గ ఖేదశిథిలమతులంగనలు చొచ్చి
భీమరథిగలంచు టేమి క్రొత్త?
వారిగోరువెచ్చ వక్షోజములకాంతి
లవమమృజ్జగముల దవిలి కలఁప"

"వనజనాభుని యభిషేకమునకె కాని
కనకగర్భాదులకు వాడు కొనఁగరాని
తీర్థకుండాంబు నికరంబు తెలివపిండు
గబ్బిచనుజక్కవలచేతఁగలఁపఁబడియె"

—పాండు. 291-293

ఇందు వివాహము కాఁబోవుచున్న కన్యలు వారు. అందును గప్పరూపుననున్న వానితో బెండ్లికాఁబోవుచున్నవారి యౌవనమదమునుగూర్చి కవి హాస్యగర్భిత ముగాఁ జెప్పిన వర్ణనము. ఈ వర్ణనమువలన నెవ్వరి కెట్టి యనౌచిత్యము కలుగదు. పైఁగా నిందరి హాస్య ధోరణియే యీ వర్ణనమునఁ బ్రాధాన్యము వహించి చదువరుల నీ గబ్బిగుబ్బలకన్న హెచ్చుగా నాకర్షించును. ఇట్లే కవి భౌతికముగా స్త్రీ వర్ణనము చేసిన తావులందెల్ల నౌచితీపరిపోషక మగు నొక శిల్ప సూక్ష్మ మున్నది.

పాండురంగ మాహాత్మ్యమందలి యప్రధాన స్త్రీపాత్రలలోఁ జిలుకకథ యందలి హరిదాసి వర్ణన మతి స్వాభావికము, మనోహరము, ప్రాణవంతము. చిత్రకారుని కుంచెల వన్నెలయెదుగులలో వెలువడిన యుత్తమ శిల్పమునకుఁ బ్రాణము పోసినట్లున్న దీమె వర్ణనము. ఆ చిలుక యీ హరిదాసి కడ నంత మచ్చికపడుటకుఁ గారణమేమో కడు చమత్కారముగా, రసభావరేఖతోఁ జెప్పఁబడినది.

"కలహంసోపమయానఁ జక్రకుచఁ బ్రంఖత్కంజరీటాక్షిఁ గో
కిలసారస్వర బర్హివికురఁ గీర ప్రియాలాపఁ దా
య్యలిఁ జాలన్ మరిగెన్ శుకంబది గరీయః ప్రేమగావించుచున్
బలుగుం బొందున నంది పొందిన గతిన్ బొత్తొత్తులన్ హత్తుచున్"

—పాండు. 4-22.

విలుక తప్పించుకొని పోఁగా వెంటఁబడిన హరిదాసి వర్ణనములో నవురూపమైన పరిశీలనము, శిల్పధర్మము, సహజతయు నిమిడియున్నవి.

"కటిఁజేలార్థము చుట్టిఁ యిక్కనది వేగంజుట్టి పాలిండ్లమీఁ
దట సంధించును నార్ద్రదేహలత మాద్యద్వర్షధారావల
త్తటిదాకారముఁ జూపఁదోపి కొనుచున్ ధమ్మిల్లబంధంబు ముం
గిటికిన్ సుస్తని వచ్చె గోస్తనహరత్కిరగ్రహవ్యగ్రయై"
—పాండు. 4-234.

స్నానము చేయుచు వచ్చిన యా హరిదాసి చంద్రునితోఁ బోల్పఁబడినది. ఇది రమ్యమైనను. నసాధారణము కాదు. కాని యామె విలుకను వెన్నాడుచుఁ, బర్వెత్తుచుండగా నింద్ర ధనుస్సును వెన్నాడు శశివోలె నున్న దనుట యసామాన్యము. పరుగునఁ బోవు హరిదాసి వర్ణనము సుదీర్ఘముగా నొక వచనమునఁ జేయఁబడినది – పాండు. 4-237. కాని యీ వర్ణన మంతయుఁ గేవల రచనా చమత్కారముతో నిండియున్నది గాని, వర్ణనమందు విశేషమేమియు లేదు. ఈ వచనమునకుఁ జివర రచించిన యొక సీసపద్యమందలి వర్ణనమద్భుతావహము. తటిదుజ్జ్వలమగు విభ్రమము సాక్షాత్కరించినట్లును, చైతన్య పూరితమైన మూర్తి రేఖలు చదువరుల మనఃఫలకమున నాశ్చర్యావహములుగా హత్తుకొను రీతిగా నీ పద్యమందలి స్త్రీ వర్ణన మున్నదనుటలో విప్రతిపత్తి లేదు.

"మదఘూర్ణదురు సంకుమదమలీమసకుచ
ద్వీపము హెూద్దతిఁగొనుఁదీ గనులించు
ఘనసారపుండ్రక గ్లౌబింబవికట ఘ
ర్మహిమాప్తిమోముఁ దామర చలింప
నాసికానూత్నగంధ ఫలియూరువుఁదావి
నధరదంతవదమత్తాళి విరియఁ
గింకిణీక్వణన శంకిత గర్వితస్రస్త
కాంచి చంచలగతి యంచజడియ
.. .."
—పాండు. 4-238.

రామకృష్ణుని స్త్రీ వర్ణనలో నొక గౌరవమున్నది. స్త్రీకి సంఘమున నొక పూజ్య స్థాన మావశ్యకమని యితని పాత్రలు చూపు వినయవివేకాదులు, శీలమందలి యాధ్యాత్మిక, ధర్మ ప్రవృత్తియుఁ దెలియఁజేయును. స్త్రీజాతికిగల రమ్యత, సౌకుమార్యము, పూజ్యతయుఁ గేవలము భౌతికములు కావనియు, నాత్మగుణములకుఁ హెచ్చుగా సంబంధించిన వనియు నీ యుత్తమ పాత్రలు చాటును. ఆ ధర్మ మాదరింపఁబడనపుడు సృష్టిలో జరుగు నేహ్యాభావ మెంత బాధాకరమో యను యంశమును గాపు కోడలి పాత్ర నిరూపించును. ఇతని పాత్రసృష్టిలోని పరదారలు దూష్యలే గాని వేశ్యలు కారు. వేశ్యలకు విద్యాపరిపుష్టియు, మాననీయ గుణమండనములు నున్నవి.

"చదివెంగామకళారహస్యములు, శిక్షంగాంచె వీణాదులన్
బదిలంబయ్యె సమస్త నాట్యకలనాపాండిత్య హేలన్మదిన్
గదియించెన్ గరువంబు జాణతనమున్ గాంభీర్యమున్ సిగ్గునన్
బొదలెన్ బాలిక కేళికాజితమరుత్పూర్ణేందు బింబాస్యయై

సానికులంబులోనఁ గల సానుల కెల్లనవావతంసమై
మానినిమాననీయగుణమండన కొండిక ప్రాయమొప్పఁగా
సానలఁ దేరిసట్టి మరుశస్త్రియపోలెవిటాలిజాలికిం
దేనెలీఁగెన్ విలాసరసదేవతయై తగనాఁడునాఁటికిన్"

ఉద్భటా. 2–145, 146.

అన్నిటికన్న మిన్నగాఁ దక్కిన తెనుఁగు కావ్యములందుకన్న నెక్కువ తెనుఁగుఁదన మీతని స్త్రీ పాత్రలలో నున్నది. పూర్తిగాఁ దెనుఁగుదేశపు స్త్రీ వర్ణనమిందున్నది.

ప్రకృతివర్ణనము

ఇతని ఋతు వర్ణనమువలెనే ప్రకృతి వర్ణనము కూడ నవ్యము, రమ్యము, చమత్కారయుతము, పెక్కుతావులందు వర్ణించుచున్న ప్రకృతికిని, ప్రకరణ మందలి ఘట్టమునకును బరిపోషక పోషిత సంబంధమితని కావ్యములలోఁ గాననగును.

1. నిగమశర్మ కథలో జాతరను వర్ణించుచు నంధకారమునకును, జాతరలోని జనుల కల్లుమత్తునకును సంబంధమును గూర్చుట.

"పెలుచఁగలుబొక్కుటెలువల తలకునెక్కఁ
దోన దిక్కుల తలకెక్కఁ దొడఁగెఁదమము,
దేవిగుడిలోన నొక్కొక్క దివియ దోఁపఁ
దోన నొక్కొక్క చుక్కయుఁ దోఁచెమింట" –పాండు.3–78.

2. జారుఁడగు మదాలసుఁడు మోహనాంగియగు వేశ్యయందుఁ గామము వహించి విరహియై బాధపడునప్పటి సూర్యాస్తమయ, చంద్రోదయవర్ణనములు.

"......................................
జారులకు మోద సంపతి బాల నొదవెఁ
జోర సంచారమున కెల్లఁ జోట గలిగెఁ
జరమ పాథోనిధాన నీర్ఫలతరంగ
సంగమంబునకిన మూర్తి జాఱుటయును
....

ప్రమదముతోడ నస్తమితభానుని వేషముఁ దాల్చిరాగవి
భ్రమమెునఁగూడఁ జంద్రుఁడు కరంబుల నంటినఁ జల్వదాఁ కియో
కమలిని మోము పంచెన దిగన్గొని – ప్రక్కనఁదాను – నవ్వెలోఁ
గుముదిని దాన సిగ్గుపడి గొబ్బున వెల్వెలనయ్యె నాతఁడున్"

–ఉద్భటా. 2–179, 181.

నిసర్గ గంభీరమై వర్ణ్య వస్తు వొప్పారు తావు నీ కవి యా వస్తువుయొక్క సహజ శోభ నలంకార భారమునఁ జరింపఁజేయక స్వభావోక్తిగా, నూటియైన భాషలో వర్ణించును.

"పద్మినీ పద్మాత పత్రంబు శిథిలసత్రాగ్రమై రాయంచ యాశ్రయించెఁ
దాలస్రపత్పేస జాలంబుతో ఘోణి పంచలరొంపిఁ గలంచియాడె
దూరోద్గమద్దావ ధూమమంబుదబుద్ధి లెమ్మిలో పొదరింట నిక్క చూచె
జఠరస్థ జలమునాసానాళమునఁ బీల్చి నామజం బిరుప్రక్కఁ జల్లుకొనియె
సరసిపై నీరు నలనల తెరలె, విపిన సకల వీథులు నిర్మనుష్యములయ్యె
మట్టమధ్యాహ్న మిది సుధామధుర వాణి యర్థమిచ్చోఁ బథిశ్రమ మపన
యింప" –పాండు. 1–136.

పాఠకులకు లోకమున ననుభూతములు కానట్టి దివ్య దృశ్యముల వర్ణనమున నుపమానముల సారూప్యముచే వస్తు పరిచితి సాధింపఁబడును.

"తరిద్రాడు సీద్రంపుఁ బొరలంటి గాలిచే
బడియు చందమున నంచలు భ్రమింప
సుదలు బంతులు సాగి సుధమిధన్పృహందాగు
తీంద్రఁచేఁటులు పూవుఁ దేనెలాన
నా మహావిషమాను నామూర్తులనజంబు
ఫలములం దెల్ల విక్కలు భుజింప
నాశ్రితాభ్రములభ్రమనుముఁ గూకలు వెట్టు
క్రియమయూరంబులు కెరలి పలుక

నబ్ధి మధియింప నొక్కటనవతరిల్లు
నాఁటిసిరివొల్చు వాడ్పున నవనవర్తు
లక్ష్మిఁ దిలకింప నుల్లసన మొనఁగు
మందరంబున మున్నేనుమయును గూడి" –పాండు. 2–208.

ఈ వర్ణనమునఁ బ్రకృతమగు మందరమున కుపమానములుగా నమృతమధన వృత్తాంత ఘట్టములు స్పృశింపఁ బడినవి. వానివలన వర్ణ్య వస్తువు విశదముగఁ బొడకట్టుట, పూర్వగాథాఘట్టములు రసానుగుణముగఁ బాఠకుల హృదయవీధికిఁ దోచుట యొక్కమాఱుగాఁ జరుగుటకే యీమార్గ మవలంబింపఁబడును.

కథలోఁ గాలనిర్దేశమును వాచ్యము చేయకుండ సూచింపఁదలచినపు డాయా కాలనిర్దేశాత్మకములగు ప్రకృతి వర్ణనముల నుపమానాదికముగాఁ గైకొని

వర్ణించుటయుఁ గాననగును - అలంకారములవలన వస్తుధ్వని యిట సాధనముగాఁ గైకొనఁబడును. నిగమశర్మ కాపుకోడలితో వ్యభిచరింప నారంభించి, యామె నపహరింపఁ బాలుపడిన సందర్భమున.

"హిన్నాకుపైఁదేనె సన్న చెంద్రిక మోవి
    మాధుర్య మనక వేమాఱుఁ బొగడి
యమనిబు గబుగలంగ చంపకదాసు
    గంధంబనక పెక్కు గతుల నెన్ని........" -పాండు. 3-72.

"అకుమఱుంగుపిందెయటులంతిపురంబునఁ బోలె..." -పాండు. 3-82

అను నుపమానములలోఁ బ్రకృతిని వర్ణించుటలో నొక శిల్ప మున్నది. అది వసంతకాల మనియుఁ, దదనుగుణముగనా దుశ్శీలుర కోరికలు కార్యరూపము ధరించు నున్మాద మా ఋతువు కలిగించినదనియు సూచన ప్రకరణగతమై సిద్ధించుట యిందలి లక్ష్యము.

దశావతార స్తుతి

విష్ణుపరమైన కథలు గల ప్రబంధములలో దశావతార స్తోత్ర మొక యంగముగా నేర్పడినది. మొట్టమొదటి ప్రబంధమగు మనుచరిత్రము ననే స్వారోచిషమనువునకు నారాయణుఁడు ప్రత్యక్షమైనప్పుడు మనువు దశావతార స్తుతిఁ జేసినాఁడు. పారిజాతాపహరణమున నారదుఁ డొక సీసపద్యమున దశావతారములతోఁ గృష్ణుని స్తుతించినాఁడు. ఆముక్తమాల్యదలో రాయలు విష్ణుచిత్తునకు గరుడ వాహనుండు ప్రత్యక్షమైన ఘట్టమున దశావతార స్తుతి నిమిడ్చినాఁడు. ఆ పద్యములలో నెక్కువభాగము మనుచరిత్ర ననుకరించియే యున్నవి. ఘటికాచల మాహాత్మ్యమున దండకమునందు నృసింహుని ఋషులందఱు స్తుతించుచు దశావతారమూర్తిగాఁ గొనియాడినారు. పాండురంగ మహాత్మ్యమున శ్రీకృష్ణుఁడు విట్ఠలుఁడుగాఁ బ్రత్యక్షమైనప్పుడు పుండరీకుఁడు దశావతారస్తుతిఁ జేసినాఁడు. ఆ స్తుతికిఁ జివర నొక సీసపద్యమున మఱలఁ బది యవతారములును నలంకార గర్భితముగా స్తుతింపఁబడినవి. నిగమశర్మ ప్రాణోత్క్రాంతి సమయమున నతఁడు సారూప్య ముక్తిని బొందుటను సూచించుచు విష్ణుని పది యవతారముల యవస్థల ననుకరించెనని కవి చమత్కారముగాఁ జిత్రించినాఁడు. ఇతని దశావతారక్రమము మిగిలిన ప్రబంధకవుల మార్గముకన్న కొంత మార్పుగ నున్నది. 1. మత్స్యావతారము, 2. కూర్మావతారము, 3. వరాహావతారము, 4. నారసింహావతారము, 5. వామనావతారము, 6. పరశురామావతారము, 7. రామావతారము, 8. బలరామావతారము, 9. బుద్ధావతారము, 10. కల్క్యవతారము. ఇందుఁ గృష్ణుఁ డవతారముగాఁ గైకొనఁబడలేదు. పాండురంగ మాహాత్మ్యమునఁ బుండరీకుని స్తుతిలోఁ గూడ నీ క్రమమే పాటింపఁబడినది. నిగమశర్మ కథలోఁ గూడ నిట్లే యున్నది. ఇది యొక సంప్రదాయము. శ్రీకృష్ణుఁడు సమగ్రమైన పర దేవతామూర్తి యనియు, నవతారములలోఁ జేర్చుటకు వీలు లేదనియు నిందలి భావము కావచ్చును.

పాండురంగమూర్తి కథలో బుద్ధావతారము వర్ణింపఁబడుట కొక సంప్రదాయ మున్నట్లు కనుపించును. చరిత్రకారులలోఁ గొందరు పండరీపురములోని విట్ఠల విగ్రహము తొలుత బుద్ధదేవుని విగ్రహమనియుఁ, దరువాత హిందువులు దానిని విష్ణుదైవతముగా నిరూపించి రనియు సంశయించినారు. అవతారములలోని బుద్ధమూర్తికిని, గపిల వస్తుపురమున జనించిన గౌతమ బుద్ధునకును భేదము తెలియకపోవుటవలన జరిగిన స్ఖాలిత్య మిది. బుద్ధుఁ డనఁగాఁ బరమాత్మ యనియు నతని యవతారతత్త్వము ధర్మసంస్థాపనార్థమై భూమికి మఱల మఱల దిగి వచ్చుచుండుననియు, బౌద్ధులలో నంతశ్శాఖకుఁ జెందిన త్రివిష్టపబౌద్ధాచార్యుల నాటినుండియు బోధించుచున్నారు. అట్టి యవతారములలోఁ గపిలవస్తు బుద్ధమూర్తి యొకఁడని వారి మతము. ఇట్టి బుద్ధులకు మూలమగు నొక తత్త్వము – స్థితి – బుద్ధమూర్తి యని భారతీయ పురాణములును జెప్పుచున్నవి. భాగవతమున నారాయణుని బహుమూర్తులలో బుద్ధమూర్తి యొకఁడుగాఁ జెప్పఁబడినాఁడు. ఈ బుద్ధు నారాధించువారు "సుగతులు, తథాగతులు" ననఁబడుదురు. వారును విట్ఠలమూర్తిని దొలుత బుద్ధమూర్తిగా నారాధించి యుండవచ్చును. ఈ తత్త్వము నెఱిఁగిన రామకృష్ణకవి తన కావ్యమున దశావతారములలో బుద్ధావతారమును గూడ వర్ణించి యుండవచ్చును. ఈ కవి బుద్ధునిగూర్చి చెప్పిన తావులలో "సౌగతమతధుర్యుఁ" డనియు —పాండు. 2 – 64, నతని సిద్ధాంతమును "సౌగతాగమ" మనియుఁ —పాం. 2 – 66 పేర్కొనినాఁడు. శైవ వైష్ణవ శాక్తములయందున్న సమానభావమే రామకృష్ణునకు బౌద్ధ రహస్య సంప్రదాయములయందుఁ గూడ నుండి యుండుట సంభవము. దీనిని సరిగాఁ బరిశీలింపక యీ కవి బౌద్ధము నపహాస్యము చేయుచు బుద్ధావతార వర్ణనము చేసెనని కొందఱభిప్రాయపడినారు. పుండరీకునకుఁ బ్రత్యక్షమైన దైవతము నతి భక్తియుక్తితో నుతించుచున్న పుండరీకుఁ డొక యవతారమును నిందాపూర్వకముగఁ గొలుచుట యసంగతము. పాత్రౌచితికిఁ, గావ్యత్వమునకును భంగకరము.

ఈ కవి చేసిన దశావతార స్తుతిలో ఘటికాచల మాహాత్మ్యమున నే ప్రత్యేకతయుఁ గనుపింపదు. కేవలము అవతారదశకమునందలి భగవల్లీలలను దెలియఁజెప్పునట్టి స్తోత్ర మది. పాండురంగ మాహాత్మ్యమునఁ గల దశావతార స్తుతి చాల ప్రత్యేకత గల్గినది. వర్ణన, యలంకారములు, శయ్య మున్నగున వన్నియు మత్తమస్థాయి నందుకొన్నవి. కనుకనే యీ వర్ణనము పెద్దన కృష్ణరాయల దశావతార వర్ణనముతోఁ దులదూఁగుచుఁ గావ్యమున నొక యలంకారమై భాసిల్లుచున్నది. మత్స్యావతార వర్ణనమున సోమకాసురుఁడు దొంగిలించిన వేదములను మఱలఁ గొనివచ్చుటయే గాక రాక్షసుని పొట్టలోని ప్రేగు లంటుకొని దుర్వాసన గల్గిన యపకీర్తి వేదముల కంటనీయక విష్ణువు తన కీర్తి యను గంగచే క్షాళనము చేసి బ్రహ్మముఖ పద్మమున గంధము నంటునట్లు చేసెనని వర్ణింపఁబడినది. ఈ రూపకమునఁ గృష్ణరాయల కల్పన జ్ఞప్తికి వచ్చును. కూర్మావతార వర్ణనము సామాన్యముగా నున్నది. అయినను గమఠమూర్తిని "ఈఁతకాయరూపై పృథుకర్పరంబమర" యని క్రొత్త యలంకారముఁ జేకూర్చినాఁడు కవి – 2–57. వరాహావతార వర్ణనము నను ప్రత్యేకత లేదు. నృసింహావతార వర్ణనములోని యలంకారము చాల ప్రత్యేకత గల్గి యద్భుతదైవ

యలంకారాదులతో వర్ణింపఁబడినది. ఇది సర్వస్వతంత్రమైన రచన. శత్రువులను మదపుటేనుగులకు సంకుశములైన గోళ్లను నాగళ్లతో హిరణ్యకశిపుని భుజాంత రాళమను జాంగలమహినిజాళ్లుగా దున్ని నృసింహుఁడు నెత్తురు నీళ్లు పెట్టినాఁడఁట! ఈ కృషి తన కీర్తి యనుకూలమాంకురములు మొలచుటకు, నింద్రుని సంపద ఫలించుటకును నుపయోగించినదఁట! ఇందు నఖములు హస్తిఘటలకు సంకుశ ములుగను నఖాగ్రములు లాంగములకు నుపమానములు. కనుకనే లోకమున మదభంజనము భక్తరంజనము వేఱుగా సూచింపఁబడినవి. మఱలఁ బరశు రామావతార వర్ణనము కడు విచిత్రము నప్రతిమాన ప్రతిభావిలసితమునై యున్నది. పరశురాముని పరశువును హంసిగా నుపమించినది యీ కవి యొక్కఁడే. తన తల్లి కంఠము నుండి తన కఠోరతవలన కారుచున్న రుధిరమే యీ హంసి ముక్కున నున్న యొఱ్ఱఁదనమఁట! మఱి యాహారములైన మృణాళము లెవ్వి యన్నచో రాక్షసస్త్రీల జడలపైనను, మెడలలోను గల హారములేనఁట! ఆ రక్కసి మగువలు పులుముకొనిన ఏణమదకర్దమమునం దీ హంసి పెరిగి పెద్దదైనదఁట. ఇందలి యుపమేయము రౌద్రమునకు బీభత్స మునకుఁ బరిపోషకము. ఉపమానమగు హంసి శృంగారమునకుఁ బరిపోషకము. ఇం దొక రసము ఉపమానము మూలమున వాచ్యము కాఁగా మఱియొక రస ముపమేయమందు ధ్వనింపఁజేయబడినదీ. రసముచేత రసధ్వని చేయు నరుదైన ఘట్టము: కాళిదాసు రచనలో నొక్కతావునమాత్ర మిట్టి విరుద్ధ రసములలీల పరిపోషింపఁబడినది. రఘువంశమున రాముఁడు తాటకను వధించినట్లు చేసిన వర్ణనమది:

"రామమన్మథ శరేణ తాడితా దుస్సహేన హృదయే నిశాచరీ
గంధవ ద్రుధిర చందనోక్షితా జీవితేశ వసతిం జగామ సా"
—రఘువంశమ్. 11–20

ఇట్టితావులందు రూపకాలంకారము మాత్రమే ఇట్టి రసపరిణతినిఁ గల్గించుట కర్హమగుచున్నది. ఇదియే యుపమాలంకారమైనచో రసము వాచ్యమగును. విరుద్ధ రసములను గలుపుటలో నీ దిగువ శ్రీనాథుని పద్యములోని కల్పన మీ పైఁ జెప్పిన తరగతికి భిన్నమైన యుదాహరణము.

"కరవల్లపంబులు గబళింపఁ గబళించి ప్రబల నితంబభారముల వ్రాలుఁ
జెక్కుటద్దములపైఁ జెరలాడుఁ జెరలాడి శ్రవణావతంసమంజరులు ముట్టు
వలిచన్నుగవలపైఁ బొలసాడుఁ బొలసాడి నాభిరంధ్రములపై నటనసేయు
వేణీభరములపై విహరించు విహరించి బింబాధరములపై బిత్తరించు
నఖముకరముక్తనారాచనాత్రువహ్ని కాముకుని కోమలాంతసంగంబు పగిదిఁ
దెగువ మీరంగఁ ద్రిపురదైతేయరాజ సదన శుద్ధాంత భామినీ జనములందు"
—భీమఖండము. 4–140

ఇట్లే దీనికి మూల శ్లోకమనఁదగు నీ దిగువ శ్లోకమునందును వాచ్యమైనది.

"క్షిప్తోహస్తావలగ్నః ప్రసభమభిహతోఽప్యాదదానోంఽశుకాంతమ్
గృహ్ణన్ కేశేష్వపాస్తశ్చరణ నిపతితో నేక్షిత స్సంభ్రమేణ।
ఆలింగన్యోఽవధూత స్త్రిపుర యువతిభిస్సాశ్రునేత్రోత్పలాభిః
కామీవార్ద్రాపరాధ స్స దహతు దురితమ్ శాంభవో వశ్శరాగ్నిః।"

రాయల పరశురామావతార వర్ణనమునఁగూడ రామకృష్ణుని పద్యమందలి ప్రత్యేకత వంటి ప్రత్యేకత భంగ్యంతరమున భాసించుచున్నది

దుష్టసంహారము లలితముగా వర్ణించుటయే యిట్టి రచనల కుద్దేశమై యున్నది. రామకృష్ణుఁడు రామావతార వర్ణనమందలి రావణవధ వర్ణనము గూడ రూపక వైచిత్రివలన లలితముగనే వర్ణించినాఁడు. రాముని చేతి ధనుస్సు ను వారణరాజు బాణపాత మదధారలు గారఁగా దశవక్త్రముఖాంబుజవాటిఁ గూర్చె నదఁట! లౌకికమైన వారణరాజునకు సాధ్యముగాని మఱి యొక విశేషము గూడ నీ ధనుర్వారణరాజు సాధించెను అది బృందారకుల హృత్సరోజములు వికాస మొందఁజేయుట.

బలరామావతార వర్ణనమునం దాదిశేషునితో బలరామునకు రూపకాలం కార సాధన చేయఁబడినది. ఇదియు నవురూపమైన ప్రతిభను, రామకృష్ణునకు సహజమైన పదగుంఫనమును జాటుచున్నది. ఈ పద్యమున 2 – 63 ప్రతిభ యున్నంతగా సొబగు లేదు. ఆదిశేషుఁడు సర్పమైనను విషము, భయంకర త్వము, క్రూర నిరీక్షణము వానికి సహజములు గావు.

బుద్ధావతార వర్ణనమునఁ గల విశేషములు స్పష్టములుగా నున్నవి. ఇంద లి భావమే పూర్తిగాఁ బొడఁగట్టుటలేదు. ఈ పద్యమునకుఁ బాఠాంతర భాగ ము లుండవచ్చును. ఉన్నంతవఱకుఁ జమత్కారముగ నున్నది. కల్క్య వతారము గూడఁ బ్రతిభానిత్యమై ధర్మసంస్థాపన మనఁబడు వసంతాగమముగా వర్ణింపఁబడినది.

పై వర్ణన మంతయు నొకెత్తు, దశావతారమూర్తి యగు కృష్ణుని సంసార తారకమగు నావగా వర్ణించిన పద్యములోని వైచిత్రి యొకెత్తు – 2 – 66. ఈ పద్యమునం దెక్కువభాగ మవతారతత్వము ప్రతీయమానమే గాని వాచ్యము గాదు. "సౌగతాగమ మాలిమి శాస్త్రసరణి" యను నొక్క తావు నందు మాత్రము బుద్ధావతారము వాచ్యమైనది. ఈ పద్యమువలెనే నిగమశర్మ యవసాన దశను వర్ణించు నప్పటి దశావతార విధానము గూడ వ్యంగ్యముగనే వర్ణింపఁబడినది – 3 – 102. కాని "దానవారాతికాఁబూని తదవతారదశకమును మున్నెత్తాల్చె నా ధరణీసురుఁడు" అనుటలో మొత్తము బాహ్యమైపోయినది. ఈ పద్యమున పోతన భాగవతములోని ఛాయ లున్నవి.

ఉదా. "తోయంబు లివియని తొలఁగక జొచ్చెదు తలచెదు గట్టిన దరల నెత్త
మంటితో నాటలు మానవు కోరాడె దున్నత స్తంభంబు లూఁపఁబోయె
దన్యుల సల్పంబు లడుగంగఁ బాటెదు రాచవేఁటలఁ జాలఁబవ్వదెచ్చె
డలయవు నీళ్లకు నద్దంబు గట్టెదు ముసలివై హరివృత్తి మొనయఁ జూచె
దంబరంబు మొలకు నడుగవు తిరిగెద, వింతఁ గల్కితనములేల పుత్ర
నిన్ను వంపగవ్రాల్ప నే నేరననియొ నీ విటులు క్రిందుమీఁదుల నెఱుఁగకునికి"

—భాగ. స్క. 10, పూర్వభా. ప. 378

రామకృష్ణుని శైలి

బహుముఖప్రజ్ఞాసమన్విత మీతని కవితామార్గము. విభిన్నము లయిన యాత్మీయత లేకమై యద్భుతావహమగు నొకే గుణముగా వ్యక్తీకరణము చెందిన దితని కవితా కళ. రచనలో వేగము, మెఱపుతీఁగవంటి తళుకు, భావనా పథమున కవ్వలి యంచులు తాకించు ప్రతిభ, హృదయధర్మము లోతులలోఁ బ్రజ్ఞను గాలూనఁజేయు భావము వీని కవితాత్మకుఁ గల జీవలక్షణములు.

వేగవంతమైన రచన

ఇది యితని కావ్యములందలి కథా కథనమున హెచ్చుగాఁ గనుపించును. ఘటికాచల గ్రంథమున ధవళాంగుని కథ యెంత శరవేగముగాఁ జెప్పఁబడినదో గమనింపఁదగినది. ధవళాంగుఁడను రాజయోధ్య నేలుచుండెను.

"...... .. .. అతఁడు
నిండుకొలువుండి యొక్కనాఁ డుండునటుల.
మాణిక్యమకుటంబు మాటు మస్తకమందుఁ
బట్టియాకల నట్టె ముట్టిపడియెఁ
దారహారముల కుద్యాపనం బొనరించి
యొరపి వోఁచలదండ లురము నిండె
నంగుళీయకముల కపజయంబు ఘటించి
చిగురుఁగండెలు కేలఁ దగులు కొనియె
జాళువా పైరాణి కాల్వఁ మూలఁగఁజేసి
గదురులో ల్కటిసీమఁ గుదురు కొనియె
నక్కటా యిదియేమి యున్నటుల యుండి
యనుముఁ జెన్ను భేదమున సభాజనము చూడ

మేలిచీకటు లీను నెమ్మేనితోడ
భూతలాధీశనేత కిరాతుఁడయ్యె"   –1-88, 89

ఈ కిరాతత్వమునకుఁ గారణము, పరిహారము కూడ నింత వేగముగనే చెప్పఁబడినవి.

"......... .. ..వశి
ష్ఠఋషి తపోవనముఁ జేరఁ జనఁగనే మునియున్
కనుగొని వీని రాక కిటఁ గారణ మేమొకొ? మామ కాశ్రమం
బని యిది వీఁ డెఱుంగఁడొకొ? యౌర! భయంబరిరాఁబనేమి? మా
వనికిఁ గిరాత కీటమని వచ్చిన కోప మడంచి యాతపో
ధనమణి దివ్యదృష్టిఁ గని తద్దశఁ దద్దయుఁ బ్రేమ నిట్లనున్
భూమీశా యొకనాఁడు నీవు మృగయుల్ మున్నాడ వేటాడ వి
శ్వామిత్రాశ్రమ వాటి కేఁగి మృగహింసానక్తవర్తింపఁగా
నా మౌనీంద్రుఁడు శాప మిచ్చె నిటుగానైతే మరేమింకిటన్
సేమంబౌనని పల్కుమాత్ర మతఁడుంజెన్నొందెఁబూర్వాకృతిన్"
–1-91, 92, 93

శాపము కలిగినదని తొలుతఁ జెప్పక కిరాతుఁడుగా మారెనని వర్ణించుటయుఁ తరువాత వశిష్ఠుని నోట నా శాపకారణమును జెప్పించుటయు, సేమంబౌనని పల్కుమాత్రమున నా రాజు పూర్వాకృతిని జెన్నొందుటయు, నితని యాఖ్యాన పద్ధతిలోని వేగమును దెలియఁజేయును. ఇదే వేగము పాండురంగమాహాత్మ్యమందలి యుపాఖ్యానముల కథాకథనము నందుఁ గనుపించును. కాని యచ్చట నీ వేగమున కొక ప్రత్యేక ప్రయోజనము సాధింపఁబడినది. అప్రధానములగు నుపాఖ్యానములను సంగ్రహముగాఁ, బరిస్ఫుటముగాఁ జెప్పుట కిది యుపయోగించినది. ఆ పట్టులందుఁ పద్యరచన గూడ నొక యవ్యక్త వేగము నలవఱచుకొన్నది.

ఉదా.

"గద సారించి త్రిదంష్ట్రనాముఁడగు రక్షఃసాలుఁ డొక్కండు చి
ట్టదరుల్వాఱ మురారి యెడ్మబరివ్రేయన్ దాన నద్దిక్కు నా
చ్చె దళింపఁబడియెన్ దదుగ్రహతిగాసిన్ క్షుల్లకాశిక్యమునా
మృదుసంరంభముతోడ నవ్వుచును దున్మెన్వాని నద్దేవుఁడున్"
–పాండు. 2-103

ఈ పద్యమునం దొక యుపాఖ్యానము మొత్తము విశదముగా, వేగముగాఁ జెప్పఁబడినది.

ఒక్కొక్క యప్రధానపాత్రను జదువరుల మనోవీథికి సుస్పష్టముగా గోచరించునట్లు వర్ణించు సందర్భమున నితఁ డీ వేగమునుఁ బద్యరచనయం దిముడ్చును. అట్టి తావులం దొకే పద్యమునఁ బాత్రచిత్రణమంతయు నిమిడిపోవును. ఈ తావులఁ బద్యములు గూడ సుదీర్ఘములైన సీసములో వృత్తములో కాక చిన్న పద్యములై యుండును.

ఉదా.

నిగమశర్మోపాఖ్యానమునఁ గావు కోడలి పాత్రప్రవేశము.

"కలదా శూద్ర వసతి శశి
కల దాననఁజాలు నొక వికారవుఁ గోడల్
గల దాలోల కటాక్షాం
చలదామ నిబద్ధతరుణ జనఖంజనయై" -పాండు. 3-60

ఇందలి నిబిడమగు సమాసఘటనము రూపకాలంకారము గూడ వర్ణనలోని వేగమునకుఁ దోడ్పడినవి. ఇటఁ గావుకోడలి చూపులు చంచలములై కటాక్షము లెల్లెడల వలలు విసరునట్లు తిరుగుచుండునట. ఆ వల(త్రాళ్ల)లో యువకులను కాటుకపిట్టలు పడి చిక్కుకొందురఁట. ఈ కథలోఁ జిత్రింపఁబోవు సన్నివేశములకు సరిపడిన యామె శీలమంతయు నీ చిన్ని పద్యముగ మొగ్గయందు పూరేకులవలె నిమిడియున్నది.

ఉదా.

సుశర్మ ఉపాఖ్యానమున సుశర్మ పాత్రయు నొక రెండు కందపద్యములలో నిట్లే యతి వేగముగ వర్ణింపఁబడినది.

"ఒకఁడు సుశర్మాఖ్యుఁడు ఘా
తుకుఁడు గలఁడు, కల్లుఁదాగుఁ, దునుము ధరామ
ర్త్యకులుల నఱదలఁచుం గురు
నకుఁ గనకము దొంగిలుం దినము నజపుత్రా!
అవృషలీ పతి యావ
జ్జీవంబుగ నంతనంతఁ జేసిన నానాం
హోవిసరంబులు పటమునఁ
గోవలుపడ వ్రాసి చిత్రగుప్తుఁడు డాఁచెన్ పాండు. 5-73-74

ఇందు ఘాతుకుఁడు, కల్లుద్రాగు, ధరామర్త్యకులులఁ దునుము, గురునకు నఱదలఁచును, గనకము దొంగిలునని యైదు లక్షణములను బరిగణనము చేసిన వేగమునకు "దినము" నను పదము మఱింత వేగమును గూర్చినది. వృషలీపతి యను పదమున నతఁడు ధర్మము తప్పి శూద్రస్త్రీని వివాహమాడె నను జీవితాంశమంతయుఁ బదాల్పముగ నిముడ్చుటతో సంగ్రహ రచన యందు విస్తారమైన వస్తువు నిముడ్చుట జరిగినది.

ఇదే వేగమున నితఁడు సన్నివేశములను రసవంతములుగఁ దీర్చి దిద్దఁ గలఁడు. ముక్తకేశి యను గోపికకుఁ గృష్ణుఁడు ప్రత్యక్షమైన సందర్భమున నిట్టి వేగముతోఁగూడిన రచనలో రసపోషణమున్నది. మూఁడు పద్యములలో కథ చెప్పుమనే స్థాయి కెక్కిన శృంగార రసపోషణము జరుగుట యిట మిక్కిలి యాశ్చర్యము.

"గోపిక యోర్తు తొల్లి హరిఁ గూర్చి తపం బొనరింప దాని ని
ష్ఠాపరతన్ మదిం గరఁగి శౌరియుఁ దోఁచినఁ జూచి......"

ఈ సగము పద్యమునఁ గథను బ్రారంభించి కొంత నడుపుట జరిగినది. మిగిలిన పద్యభాగమున నప్పుడే శృంగారరసాలంబనోద్దీపన విభావములు, ననుభావము కూడఁ బోషింపఁబడినవి.

“...... ... ... వేడ్కతో
నా పసిగాఁపు పూపవయసాకె త్రిలోక విమోహన క్రియా
రోప నిరూపణంబగు సరోరుహలోచను రూపుఁ జూచుచున్”

—పాండు. 2 – 128

తరువాతఁ జిన్న పద్యమున శబ్దార్థాలంకార సహాయమున రసపోషణము చేయఁబడిన వేగము గమనింపఁదగినది.

“వైషమేషవ విషమేషు శోషణమున
వేష మొకరీతిగా నిర్నిమేషనయన
యగుచు నెరగొంటఁ గదలని పొగరుమీను
దోయిఁ జూపట్టు సుప్తసింధువునుబోలె”

—పాండు. 2 – 129

విరహతాపమునఁ జిక్కిన మేనితో వేష మొక రీతిగా నుండి, రెప్పవేయక యా గోపిక చూచినది. ఆహారము తిని మత్తెక్కి కదలకున్న రెండు చేపలవలె నున్న కన్నులతో నామె యొక కదలని నది వలె నిలిచినదఁట. ఇందుఁ బ్రతి పదము సమర్థము, రసపోషకము. ఇందలి శబ్దాలంకారము చదువరులపై మంత్రముగ్ధమగు కాంతిని బ్రసరింపజేయును. అర్థాలంకారము పోషింపబడిన రసభావమునకు గాంభీర్యమును, నిశ్చలత్వమును గలుగఁజేయును. నిర్నిమేష శబ్దము వలనను, పొగరుమీనుదోయి యను నుపమానమువలనను ననిమిష శబ్దము ద్యోతకమగును. ఈ శబ్దమునకుఁ జేప యనియు, రెప్పపాటులేని స్థితి యనియు, దేవత్వ మనియు నర్థములు స్ఫురించుటవలన నామె యనుభవించిన దివ్య శృంగారము పరిపుష్టమగును. తరువాత—

“క్లేశపాశంబుతోఁ గూడఁ గేశపాశ
మురలి బర్హవతంసుంతు కరుణనిచ్చు
నీవి యెఱుఁగక యొక్కింత నీవి జాఱఁ
దచ్చరణములు మదినంట మచ్చకంటి”

—పాండు. 2 – 130

అను పద్యమునఁ గూడఁ గేశపాశము విడిపోవుట, నీవిజాఱుట యను వర్ణనము వలనఁ బరవశత్వము పుష్టమగును. ఇది శృంగార స్వరూపమైన యోగస్థితి. చైతన్యుల మధుర భక్తి కిది చక్కని రసమయమైన వ్యాఖ్యానమగు రచన. పరిమితమైన పద్యరచనలో నింతటి యనుభూతి నిముడ్చుటకే యిచ్చట వేగవంతమైన రచన చేయఁబడినది. ఈ ఘట్టము నందలి యలంకారములు — శబ్దార్థాలంకారములు రెండును — రసపరిపుష్టికొఱకే వాడఁబడుట యుత్తమ కవితా

లక్షణములలో నొకటి! ఈ కవి యలంకారములను గద్యాగత రచనయందు వాడినవు డెక్కువ తావులయం దిట్లే వాడుట గమనార్హము, కమనీయము. “కామం సర్వోప్యలంకారోరసమర్థే నిషించతి” యని కదా దండి కావ్యాదర్శము !

శైలి

ఈ కవి శైలి సందర్భోచితము లైన యొదుగులు చూపును. సంభాషణలలోఁ దిక్కన యడుగుజాడలలో నడచునట్టి చక్కని నాటకీయశైలి యున్నది. అందుఁ దెనుఁగు దనపుఁ బోకడలు, కాకువులు కొల్లలు, మాటలలోనే పాత్రల హావభావములు, రూపరేఖలు పొడకట్టఁజేయుట యీ కవికి వెన్నతోఁ బెట్టిన విద్య.

ఉదాహరణములు : ఉద్భటారాధ్య చరిత్రయందలి మదాలస కథలో వేశ్యమాత సంభాషణము గమనింపఁదగినది. మదాలసునితో వేశ్యమాత యిట్లను చున్నది :

“మన్నన నామరండలగు మంజులవాణికిఁ జుట్టమైన వి
ట్టన్నమ భట్టునందనుఁడ వల్లుఁడవౌదువు వావి నాకు నీ
వెన్నఁడు మా గృహంబునకు నేటికి రావిదె నీకు వింతయే
విన్నవు గాన కూరుముల పెంపు దలంపవుగాక భూసురా !

వానకునో వలపునకో
పూనిక నీ రాక వింత పొడమెన్ నాపై
మానెనె యిన్నాళ్లకు నీ
మానసమునఁ గొంత కూర్మి మంచిద యయ్యెన్.

. .. .

ఓడగట్టిన దూలమై యుండవలయు
మీకు మాకును నెనరైన మైత్రభావ
మింటికిన్ వచ్చుచుం బోవుచుంట మేలు
నీకు మే మెంతవారము నీతి దెలుప ?
చేయంజేయఁగఁ బొంకగుఁ
బాయంబాయంగ నెడలు బాంధవ మెందున్
మా యన్నగారి కైవడి
మా యందులఁ బొందు నిలుపుమా విప్రవరా !”

—ఉద్భటా. 2 - 203 నుంచి 212

ఇవి స్వాభావికము, చమత్కారయుతము, ప్రసాదమాధుర్య గుణాన్వితము నగు చక్కని తెనుఁగు రచన. సంభాషణలయం దిట్టి రచనలలోని జాతీయము, కాకువు కారణముగనే యీ పాత్రలు చేతనవంతము లగుచున్నవి. పైఁ జెప్పిన వేశ్యమాత పలుకులకు సముచితమగు నుత్తర మొసఁగిన యనుభవశాలియగు రభావపవేది పలుకు లింతకు మించి యున్నవి.

"ఇంటికి వచ్చినఁ జుట్టము
లింటికి రాకున్నఁబరులె ? యెనసిన యెదలో
నందిన మచ్చిక గల్గినఁ
గంటం గనుఁగొంటకేమి కమలదళాక్షీ!"

—ఉద్భటా. 2 - 214

సంభాషణ చేయు పాత్రల కాపాదింపఁబడిన సంస్కారము ననుసరించి కూడ నీ కవి శైలీ భేదమును బాటించును. నిగమశర్మ యక్క వేదము చదివినవారి యింటి యాడుపడుచు. కనుక నామె సంభాషణములలోఁ గొంత సంస్కృత సమాసయుతమైన రచన యున్నది.

"ప్రారంభించిన వేదపారమునకున్ బ్రత్యూహ మౌ నంచునో
యేరా తమ్ముడ! నన్నుఁ జూడఁ జనుదే వెన్నాళ్లనో యుండి చ
క్షూరాజీవయుగంబు వాఁచె నినుఁ గన్గోకున్కి మా బావయున్
నీ రాకల్ మదిఁగోరుఁ జంద్రుఁపొడుపున్ నీ రాకరంబుంబలెన్.

శ్రీలాలిత్యము నిత్యశుద్ధియు గుణోత్సేకంబునుం గల్గి యు
ద్వేల స్ఫూర్తిఁ దలిర్చు తండ్రి యను నబ్ధిం జంద్రుఁడై తోఁచినన్
బోలుంగాక భవాదృశుం డితరుఁడై పుణ్యంబులం బాసినన్
సాలగ్రామఖనిన్ జనించునె కదా జాత్యల్పపాషాణముల్ ?

నాదు సహోదరుండు సుజనస్తవనీయనయ ప్రసక్తి బ్ర
హ్మాదుల మెచ్చఁడే నతని యజ్ఞమునం గడుఁ బూజ్యురాలనై
వేది యలంకరింతునని వేవురిలోపల నాడుకొందు నీ
వేదియు లేక సర్వగుణహీనుఁడ వౌట యెఱుంగఁ దమ్ముఁడా!

—పాండు. 3 – 33, 34, 36

ఇందు రాకయను శబ్దమునఁ బూర్ణిమయను శ్లేషవలన నీవు మా యింటికి వచ్చిన వాఁడు మా బావకుఁ బున్నమినాటి చంద్రుఁపొడుపువలె నుండునను నర్థము వచ్చును.

ఇట్లే వేదశాస్త్రపారంగతుఁడగు నయుతుని సంభాషణమునను సంస్కృత భూయిష్ఠమగు పటుతర శైలి యున్నది.

"కంపశాస్త్రములంచు నంచిత తటిత్కాండంబు లంచున్ సుధా
మందస్యందములంచుఁ గాంచనలతామత్తల్లు లంచున్ సుధీ
బృందంబుల్ ధ్వని నిందలం దెగడు నీ బింబోష్ఠలం దెల్ల నా
నందాభాసమె కాక భాసిత చిదానందంబు పెంపొందునే?"

—పాండు. 5–225

ఈ పద్యమునం దయుతుని సంస్కృతపాండిత్యమే కాక బహుముఖప్రజ్ఞ గోచరించును. అతఁడు చూపిన ధ్వని నిందలం దతఁ డభ్యసించిన యలంకార శాస్త్రము, ధ్వని సిద్ధాంతము ప్రకటమగును. "సుధామందస్యందములు" – సుధా + లమందస్యందములు, సుధా + మందస్యందములు అను ప్రయోగమున

నతని వ్యాకరణ చమత్కృతి, "అనాదాభాసమె" యను పలుకున నతని తర్క వేదాంత పరిజ్ఞానము వెల్లడి యగును. అగస్త్యునికడ నతఁ డభ్యసించిన విద్యలలో దాదాపు సగ మీ పద్యమునఁ బ్రదర్శింపఁబడినవి.

నిందించుచునే స్త్రీలను గూర్చి యింతగాఁ బ్రసంగించుటవలన నయుతుని వయ స్సహజమగు చాపల్యము, మనస్సులోని కలవరపాటు ప్రతీయమానము లగుచున్నవి. రామకృష్ణకవి సంభాషణమునందలి సార్థకత యెల్లెడల నిట్లుండును.

రామకృష్ణుని వర్ణనలయందలి శైలి రెండు విధములుగా నుండును. 1. సంస్కృత సమాసములతోఁగూడిన పటుతర రచన, 2. తేట తెనుఁగులతోడి జాతీయ రచన.

1. సంస్కృత సమాసములతోఁగూడిన రచన.

అ. దైవతములను వర్ణించునప్పు డితఁ డెక్కువగా నిట్టి రచన చేయును.

"భూరితరాభ్రవిభ్రమము పుష్కరరమ్యకరంబు దానల
క్ష్మీరుచిరంబు సత్వగుణకీర్తితమూర్తియు వాలిసాలసం
హారవిహార కారణము నౌ రఘుకుంజరభర్త మున్ను సం
చార మొనర్చె నీయచలసానుతలంబున నంబుజాననా!
— పాండు. 1 – 135

వ. ఇవ్విధంబునఁ ద్రిభువన పవిత్రీకరణ సమర్థచరిత్రంబగు నయ్యుదధికళత్రంబున ససతీభ్రాతృండై యంచితకృత్యంబు లాచరించి నీవారముష్టిం బంచవారంబులుండి తద్వారిపూరంబు వినిర్గమించి మించుఁబోఁడియునుం దానును బంచాక్షరీగుహాహర్యక్షంబగు విరూపాక్షు నుక్షధ్వజు దాక్షాయణీ విభు వళక్షమయూఖరేఖామకుటు భ్రుకుటిమాత్రవిద్రావితత్రిపుర నిశాటు హేమ కూటనివాసు వాసుకీ వలయు వలయు తెఱంగునం బ్రస్తుతించి సమస్త కలుష నిరసన లలిత మూర్తియై చని చని ముందట నమందమణికందళసందోహ దంతురంబయి మహిమందగమన కేళీకందుకంబునుంబోలె నుత్తాలంబగు స్వామిశైలంబు నధిరోహణంబు చేసి యక్కుధరమ్మునందు.

"షణ్ముఖశి[illegible]ంపత్త హిరణ్మయనిభవర్ణుఁ గేకిరాడ్ధ్వజుఁ గొలిచెన్
షాణ్మాతురుఁదపసి తురాషాణ్ముఖసుఖదప్రభావు సతియుం దానున్
— పాండు. 1 – 153, 143

కాంచి విరించినందనుఁడు కన్నులు బిమ్మిటి నొంద డిందియొ
క్కించుక కొంకుదేఱి కనియెం దదుదగ్ర మహోగ్రదీప్తిలోఁ
బంచముఖున్ శిఖీక్షణ విభాసిలలాటు మరుజ్ఝరీధరున్
సంచితసత్కృపారస వశంవదు నాదికపిన్ వృషాకపిన్."
— పాండు. 2 – 190

(ఆ) స్తోత్రములయందు నిట్టి పద్యరచన హెచ్చుగాఁ జేయును.

"అలఘుజగద్విప ద్విపఘటాంకుశ శాతనఖాంకురాగ్రలాం
గలముల మున్ను నీ వసురఘస్మర! వైరిభుజాంతరాళజాం
గలమహిఁ జాలువట్టి పయిఁ గ్రమ్మెడు నెత్తురు నీరు పెట్టి యం
దలుకవె కీర్తి ఘాస్త్రకలమాంకుర మిం దరమాఫలార్థివై

—పాండు. 2 – 59

మాతృకరోరకంఠ బిలమార్గగళ ద్రుధిరారుణాననం
బైతళుకొత్తు దోః పరశుహంసిత మేఁత యొసంగవే రిపు
క్ష్మాతలనాథ మేచకకచా కుచహారమృణాళనాళ సం
ఘాతము నూతనైణమద కర్దమవర్ధన సంప్రభూతమున్,

—పాండు. 2 – 61

"వికటోత్తంభిత సీరభోగపటలీ స్ఫూర్తిమస్ఫూర్తికం
ఛకనిర్మోక భయానకంబు వికృతాశుక్ష్వేళ మగ్నిచ్ఛటా
వికిరక్రూరనిరీక్షణంబు నగు నీవేషంబు శేషానుకా
రికళన్ గ్రాలదె? క్రోలదే? సమదవైరిప్రాణవాతూలముల్."

—పాండు, 2-63

దైవతస్తుతులయందు సంస్కృతపదబాహుళ్యము గల రచనతోపాటు వృత్తవైవిధ్యము కూడ నెడనెడ సిద్ధించును.

"విధి శివ సనకాదుల్ వేదముల్ గూడి నిన్నో
మధుమథన! యితం డిమ్మాడ్కివాఁడంచు నెన్నన్
విధురు లయినచోటన్ నేర్చునే గాఢమోహాం
బుధి వడిఁబడుచు న్నాచోఁటి నీ వాట మెన్నన్.

—పాండు. 4 – 81

స్ఫురన్నాభిగర్త ప్రభూతాంబుజాతో
దరక్షోణిలో వేల్పుతాతన్ విధాతన్
నిరాతంకసర్గైక నిర్ణేతఁ గంటన్
హరీ! తాతకుం దాతవై యుంట యొప్పన్.

నీలిమై వైన్యభూనేతవై రత్నసం, ఘాతదివ్యౌషధి గ్రామముల్ భూతహృ
త్ప్రీతిఁగన్పట్టవే స్ఫీతహర్షోత్కటన్, భూతధాత్రీగవిన్ బూతనాఘాతనా!
ఆగమ సముద్ధరణ రాగరసలంపట సుధాగమ నియామకర
సాగరిమాకరీ
భోగపదవీనిహిత భాగవత భూగగన భాగపరిపూర్ణపర భాగవపుర గ్రా
త్యాగగుణధుర్య మునియాగ పరిరక్షక హలాగతసమిద్విజయ సాగ
తమతార్థో
ద్యోగ కలికాలకలుషాగకులిశాంక కొనసాగిన కృపన్ మనుపు
యోగిహిత

—పాండు. 4 – 83, 84. 85

జగత్పతి ! భవత్పదాబ్జయుగ భక్తి సంయుక్తితో
గగుర్పొడువ నన్యథాగతి యెఱుంగ కెవ్వాఁడు నీ
యగణ్యగుణకీర్తనం బధిగమింపటన్ మించెనే
నగాధభవసాగరం బతఁడు దాఁటు నొక్కేత్తునన్"

—పాండు. 4 - 89

ఇట్టి ఛందోవైవిధ్యము చూపఁబోవుచుఁ దొలుత "విధిశివసనకాదుల్ వేదముల్ గూడి... "యని యారంభించుటలో నొక విశేష మున్నది. వేదమునకు ఛందస్సు పర్యాయ నామమున్నది. ఛందస్సుల నడకలు వేదపురుషుని పదవిన్యాస మని వేదములందలి కవిసమయము. వేదములలోని మంత్రభాగమందు శస్త్రము లనఁబడు దైవశంసనాత్మకములైన మంత్రములలో ఛందో వైవిధ్యము విశేషముగ నుండును. ఆ సంప్రదాయమున ఛందో వైవిధ్యము గల స్తుతి చేయుచు "వేదముల్ గూడి నిన్నో మధుమథన!" యని యారంభించుట సాభిప్రాయమని తోచును.

(ఇ) నగర వర్ణనము సంస్కృతభూయిష్ఠ రచనతో సామాన్యముగా నీకవి యారంభించును.

"శ్రీకరానేక రత్నాకర ప్రాకార
గోపుర ప్రాసాద దీపితంబు
సౌధాగ్రసంచరజ్జలజ ముఖీముఖ
మణిదర్పిత చంద్ర మండలంబు
కనక నికేతనాకలిత కేతన పటా
పల్లవాంకిత దిశాపతి పురంబు
ప్రతిమందిరాళింద భాగముక్తా ఫల
రంగవల్లీ విభా రాజితంబు
నీలమణి జాల కీలితోన్మీల దభ్ర
ముంబి హర్మ్యకదంబ నీలాంబు దభ్ర
మప్రదా లోక నర్తితా మరానా హి
భుగ్వితానంబు కాంచికాపురవరంబు"

—ఘటికా. 2 - 161

"శీతాహార్యసుతాళినీ వికచ రాజీవంబు విశ్వేశ్వర
జ్యోతిర్లింగ విశుద్ధరత్నఖని మోక్షోపాయదుగ్ధాబ్ధివే
లాతీరావని దురితనామకగజా లానంబు గంగామృత
స్రోతోనిస్సృతి చంద్రగోళ మన మించున్ గాశి శ్రీరాశియై.

—పాండు. 1 - 99

"శ్రీకరోదయ వధూలోకాననప్రభా, నాటితబహుచంద్రనాటనంబు
సమ్మర్దగళిత భూషారత్న మంజరీ. యోజితరథ్యాప్రపూజనంబు
కైలాస శైల సంకాశసౌధనివేశ, కౌముదీకవచిత గగనతలము
విస్తీర్ణ విపణివిన్యస్త వస్తువ్రజ, ప్రకటితరత్న గర్భాజరరము"

—పాండు. 1 – 103

(ఈ) సంభ్రమమును జిత్రించు వర్ణనమునను నితఁడు సంస్కృత సమాస భూయిష్ఠమగు రచన చేయును.

"మదఘూర్ణ దురుసంకుమ దమరీఘనకుచ, ద్విపమహాద్ధతిఁ గానుఁదీఁగనులియ
ఘనసారపుండ్రక గ్లాబింబనికటఘు, ర్మహిమాప్తి మోముదామర చలింప
నాసికానూత్నగంధఫలియూరుపుఁదావి, నధరదంతపదమత్తాళి విరియఁ
గింకిణీక్వణన శంకితగర్భితస్రస్త, కాంచి చంచలగతి యంచ జడియ
బంధనిర్ముక్తశుకసక్తభావయగుచు. నలపరాశరనుతుచంద మధిగమించు
మించుననఁబోఁడి చందంబు మేలుకనిన, వాఁడు తలపోయు కలలోని వార్తయయ్యె."

—పాండు. 4 - 238

"ఉద్యదుత్తానసముద్యోగమాత్రావ. శిష్టచేతప్సారదష్టదర్భ
క్షతికృదుగ్రధ్వాంక్ష తతినివారణవిధా, త్వరమాణపాలాగ్రదళశపిహిత
నావృతాధశ్శయనారంభ విస్రంభ, గళకంబళాభోగఁగాతరాక్షి
నేకపార్శ్వస్థితిస్వీకారనిర్భగ్న చరమోరుకరశల్య పాంద్రబాష్ప
దుగ్ధసేవాసమయబోధముగ్ధవత్స, పీడితా పీనపర్యంతపృథులదామ
వేష్టితగ్రీవ నట చూచె విప్రుఁడొక్క, యర్జుని నికోటజప్రభూణాంతరమున

-పాండు. 5–232

ఇందు మొదటి యుదాహరణమున నంభ్రమించినది హరిదాసి. ఇది స్త్రీ వర్ణనము గనుక సమాసములలోని వర్ణ సందర్భమున నొక విధమైన లాలిత్య మొదఁ గూర్పఁబడినది. రెండవ యుదాహరణమున సంభ్రమ మందినది వికలాంగమై పడియున్న ముసలియావు కనుక వర్ణ, పదసందర్భము తదవస్థోచితముగాఁ గ్రమరహితముగాఁగటువుగాఁ జేయఁబడినది.

2. తేఁట తెనుఁగులతోడి జాతీయ రచన.

(అ.) పాత్రల చేష్టాదికములను వర్ణించునపుడీ కవి యిట్టి పద్యరచన చేయును.

"ఎలయు సీత్కారములతోడ నీళ్లుగ్రుక్క, యంటుసంటులు పరికించి యంట్లఁ
బొడిచె
గోరుముక్కల దిగదువ్వి తూముపెత్తి, నెఱులఁ గలిగినపేల నన్నింటిఁ
దిగిచె.
మెడమన్ను నలఁచి యలకలు, మాడి గొని నిజపాణిపద్మములు గరగరగాఁ
గడిగికొని తనకు మఱఁదలు, విడె మొసఁగుచుఁ బసిమిపసిఁడి వీవన వీవన్"
—పాండు. 3-30, 31

"నర్మగర్భోక్తులునక్కటక్కులు వింత, నయగారములు బహునాటకములు
పిలుపిచ్చువిద్యలు పీఁకవన్నియలును, బెలుచందనంబులు ప్రేలడములు
వక్రభావంబులు వలకారిబాగులు, వలసియొల్లములును వట్టిపసలు
కేరడంబులు నాళగింపులు కిల్బిషా క్రీడనంబులు నడకించువగలు
బానపోసనములు విడంబములు భ్రమలు, లేనిమచ్చిక లివి యాదియైన వివిధ
దుర్గుణంబులప్రోవులు ద్రోహమతులు, వారకాంతలఁ దడవిన వచ్చుఁ
గీడు. —పాండు. 3-43

(ఆ) పాత్రల సంభాషణమునఁ బరిహాసముగాని రోషాద్యావేశములు గాని చిత్రింపవలసివచ్చినపుడు లోకోక్తులు, సామెతలు, జాతీయములతోఁ గూడిన పద్య రచన కనుపించును.

ఇంద్రుఁ డయుతునితో గెలువలేక కోపమునఁ జేయు నిందాపూర్వకమైన సంభాషణమున :

"వ్యాసశుకాదులం దలఁచి వాసికి మంగలికత్తి మ్రింగె దా
నాసల నట్టువాచె దదె యందని పంటికి, బొందెతోనె కై
లాసముఁజేరఁజూచెదు, చలంబది యేమి ఫలంబటంచు" —పాండు. 5-230
ఇట్టి లోకోక్తులు కనుపించును.

అగస్త్యుఁడు వివాహమాడుమని తన్ను బలవంతము చేసెనని యయుతుఁడు హాస్యగర్భితమైన యనాదరమునఁ బలికిన పలుకులలో నిట్టి రచన యున్నది.

"కావె తన సౌమ్ము షామకకాయకర్మ
గతులు, మొఱ్ఱోయనంగ లింగంబుకట్టు
జంగమున నంగనలఁగూర్పఁ జనదుగాక; " పాండు. 5-184

రామకృష్ణుని రచనలో సంభాషణములయందుఁ బాత్రోచితశైలియు వర్ణనములలో సందర్భోచిత శైలియుఁ దత్తదనుగుణ పద ప్రయోగవైఖరియుఁ గలవని నిహ

పింపఁబడినది. దీనినిబట్టి యితని కవిత్వమున సర్వత్ర సామాన్య గుణములు గల యొక ప్రత్యేక శైలి లేదనరాదు. దానిని నిరూపించుటకుముం దితని యాఖ్యాన శైలిని గూడఁ బరిశీలింపవలసియున్నది.

ఆఖ్యానశైలి

ఘటికాచల మహాత్మ్యమున నాఖ్యానశైలి మిక్కిలి యపరిణతము. కథా కథనముగూడ నెక్కువ భాగము వర్ణనాత్మకముగనే నడిచినది. ఇది కొంత వరకు ఘట్టముల, యుపాఖ్యానముల సంవిధానమునం దస్పష్టతను గలిగించినదని చెప్పవలెను. తత్ఫలితముగానే యే పాత్రలు వర్తించుచున్నవో గ్రహించుట చదువరులకుఁ గష్టతరమైపోయినది. కొన్ని యెడలఁ గథలో నే ఘట్టము నడచుచున్నదో యను నంశము గూడ దృక్పథము నుండి జారిపోవును. పాత్రల ప్రవేశము, నిష్క్రమణము క్రమబద్ధముగా లేవు. కనుకనే కావ్యము నెన్నిమాఱులు చదివినను మొదటినుండి తుదివరకుఁ గథాగమనము సూటిగాఁ బొడగట్టదు. నిజమునకిం దాఖ్యానాత్మకశైలి లేదనియే చెప్పవలెను. స్వల్ప కథను నిమిత్తముగాఁ గొని కవి వర్ణనాత్మకమైన యొక ఖండకావ్యమును రచించి నట్లున్నది.

అఖ్యానాత్మకశైలి పరిణత మగునపుడు కథ చెప్పుచున్న ఘట్టములలో వాక్యనిర్మాణము వర్ణనములలోఁ బడి సుదీర్ఘము, దుర్గ్రాహము కారాదు. ఘటికాచల మాహాత్మ్యమున నట్లే యయినది. ఒక్క భృగునారద సంవాదమునందు మాత్రము కొంత కథాకథన సరళత యున్నది. ద్వితీయాశ్వాసమున నది మొదలే లోపించినది. ఋషులు తపస్సుచేయుట, యప్సరసలు ఋషుల తపోభంగము నకై యింద్రునిచేఁ బంపఁబడి విహారము చేయుట, విఫల మనోరథులై వెడలి పోవుట యను మూలఘట్టములును గలసిపోయి యేర్పఱుప రాకున్నవి. తపస్సు చేయుచున్న ఋషులతో నాకాశవాణి ఘటికాచలమునకుఁ బొమ్మని చెప్పిన యంశము కథాగతిలోఁ జాల ముఖ్యముగదా! అది వర్ణనములలో గర్భితమై మిక్కిలి యప్రధానమైయున్నది. ఘటికాచలమునకు ఋషులు చేసిన ప్రయాణ మొక ఘట్టముగను, కాంచీపుర వర్ణన మొక ఘట్టముగాను రచింపఁబడక యవ్యక్తముగాఁ గలసిపోయినవి. ఈ రెండుఘట్టములకన్న మిక్కిలి ప్రాధాన్యము వహింపవలసిన ఘట్టము సప్తర్షులు ఘటికాచలమునఁ జేసిన తపస్సు. కాని ఇది దానికన్నఁ జాల నప్రధానముగా వర్ణింపఁ బడినది. లక్ష్మీనృసింహుడు ప్రత్యక్షమైన వెనుక ఋషులు చేసిన స్తోత్రము గల ఘట్టము కేవల వర్ణనాత్మకము గనుకఁ జక్కఁగాఁ బోషింపఁబడినది. మరల విమానము వచ్చుట మొదలుగాఁ గల తావులందు మిక్కిలిగా గ్రంథపాత మున్నది గనుకఁ గథాగతి, తదనుగుణమైన యాఖ్యాన శైలియు నెటున్నవో చెప్పలేము. ఇటనుండి తుది వఱకు లభ్యమైన గ్రంథమే యసమగ్రము.

రామకృష్ణుని యాఖ్యానాత్మకశైలి యుద్భటారాధ్య చరిత్రలోఁ జాలవఱకు వికసించి పరిణతమైనది. ఈ కావ్యమునం దెల్లెడల వర్ణనాత్మకశైలియు నాఖ్యాన

శైలియు సమ ప్రాధాన్యము వహించి సముచితముగా నడిచినవి. ప్రథమాశ్వాస మున నెక్కువ భాగము వర్ణనాత్మక శైలి. ఇది కథనుబట్టి యేర్పడినది. ద్వితీయా శ్వాసమున వల్లకీపురాధిపతి బిడ్డలు లేక విలపించుటయు, గురువును దర్శింప నేగుటయు, గురువు మదాలసుని కథ చెప్పుటయు నున్నవి గనుక నెక్కువ భాగ మాఖ్యానాత్మక శైలియుఁ దక్కువభాగము వర్ణనాత్మకశైలియు నున్నవి. మదాలసుని కథలో సగమాఖ్యాన శైలియుఁ దక్కిన సగము సంభాషణాత్మకమైన నాటకీయశైలియు నున్నవి. మూఁడవ యాశ్వాసమున మరలఁ గథాగతి ననుసరించి యాఖ్యాన వర్ణనాత్మకశైలులు సమప్రాధాన్యమును వహించినవి. ఎట్లైనను నీ మూఁడువిధములైన శైలియు నీ కావ్యమునఁ జక్కని వికాసదశ నందు కొన్నది. కనుకనే కథాఘట్టములు పాత్రలు పరిస్ఫుటముగాఁ జదువరులకు గోచరించును.

పాండురంగమాహాత్మ్యమునఁ బైఁ జెప్పిన మూఁడువిధములైన రచనా మార్గములును గోటి కెక్కినవి. అగస్త్యమహర్షి ప్రయాణము చక్కని యాఖ్యాన శైలిలో నడచినది. వర్ణనలలో నెక్కువభాగము పాత్రల సంభాషణ మూలమున జరిగినది గనుక నాఖ్యానాత్మకము నాటకీయమునగు శైలియే హెచ్చుగా నున్నది. రంగములుగా విభజింపఁబడిన దృశ్యప్రబంధమువలె నీ ఘట్టమంతయు నడిచినది.

పుండరీకుని కథయు రాధకథయుఁ గేవల మాఖ్యానాత్మకములు. నిగమ శర్మోపాఖ్యానము, నయుతనియుతోపాఖ్యానము నాటకీయ రచనాప్రధానములు. చిన్నదైనను సుశర్మ కథ ఏకాంకదృశ్య కావ్యమువలె రచింపఁబడినది. పార్వతీ పరమేశ్వరుల ఏకాంతము, నారదషణ్ముఖపాత్ర ప్రవేశ నిష్క్రమణాదులు చక్కని రంగప్రసాధన గల రూపక పరిపుష్టినిఁ జూపు చున్నవి. సుశీల కథ సత్వగుణ ప్రధానమై, గంధగజయానసదృశమైన ప్రసన్న గంభీరాఖ్యాన శైలిలో నడచుటచే నిది యొక్కటే యొక ప్రబంధ మనఁదగి యున్నది. అందంతర్భాగ ములైన చిలుక, కాకి మున్నగు తిర్యక్కుల కథలు కవి వాక్యగత కథాకథనము గలిగినవయ్యు నాటకములోని రంగములవలెఁ బాత్రప్రవేశ వైచిత్రినిఁ జూపు చున్నవి. ఇట్టి కావ్యమునందు రామకృష్ణుఁడు త్రిరావృత్తమైన కావ్యరచనా శైలి ననేక సమన్వయములతో సమ్మేళనము చేసి పలురీతుల శబలీభవి నందించి నాఁడు.

సామాన్యముగా నాఖ్యానాత్మకశైలి వర్తించుచున్నప్పు డతని రచనలో వృత్తముల సంఖ్య హెచ్చుగా నుండును.

ఉదా.

"ప్రాసఁగు విత్తువంటి నెఱపాలుకొలంబునఁ బుట్టి వేదముల్
వోసినగాదె శాస్త్రములు పుట్టిన యిల్లు కళాకలాపముల్
డాసినరచ్చ యంచు నఖిలంబుఁదనుం గొనియాడ నొప్పు ను
ద్భాసితభాసితద్యుతి సభాపతినా నొకఁ డాహితాగ్నియై"

—పాండు. 3 – 3

"వనితామానససూనసాయకుఁడు జీవత్త్రాతపాదుండు భూ
జనసమ్మాన్య విశుద్ధవర్తనుఁ డుదంచత్త్యాగశీలుండు చం
ద్రుని పెన్నుద్ది సమగ్ర కాంతిమహిమన్ నూనూఁగు మీసాలలే
గొనబుం బ్రాయపుఁ జేజుకూన యతఁడుత్కోచుండు వాచాలతన్"
—పాండు. 3 – 6

"తలగడు గంగమర్దనము ధౌతపటావరణంబు సంస్కృతో
జ్జ్వలకలమాన్నభోజనము చందనచర్చ ప్రసూనదామకం
బును గపురంపు వీడ్యమును భూషణపంక్తులుఁగల్గి నిచ్చలున్
బుఱకడుగంగఁబడ్డ నునుముత్యముఁబోలుచు వాలుచుం బురిన్"
—పాండు. 3 – 9

కథను సంకోచము చేసి కాలమానమును దాటింపఁదలఁచినపుడు వేగముతోఁ గూడిన కందముల రచన చిందులాడును.

ఉదా.

"వెడవెడ దుర్వ్యవహారపు, నడవడి గడిదేఱి గురుజనము శిక్షింపన్
గడుసువడి విప్రతనయుఁడు, సడికోర్చి వంకపరక చాటున్ మానెన్"
—పాండు. 3 – 14

"అరుదెంచి జముపురికిఁజను, తెరువున మరలించి తెల్లదీవితెరువునన్
హరిభృత్యులు నడిపించిరి, గరుడాంచితయానమున నిగమశర్మాఖ్యున్"
—పాండు. 3 – 109

ఘటికాచల మాహాత్మ్యముతోఁ బాండురంగ మాహాత్మ్యమును బోల్చి చూచినపుడింకొక భేద మీతని వర్ణనాత్మక శైలిలోఁ గనుపించును. ఈ రెండును స్థలమాహాత్మ్య గ్రంథములు గనుక పుణ్యక్షేత్ర తీర్థాది పరిగణన మెడతెగక యడ్డువచ్చుచుండును. ఘటికాచల గ్రంథమున నీ పరిగణనము కేవల గ్రంథ పట్టికవంటి పరిగణనముగా నుండి యంగాంగి భావమును బొందక చదువరులకు మిక్కిలి విసుగు గొలుపుచుండును.

"అరుదుగఁ గరంబసూరను
పురవరమునఁ బురహరాబ్జభూసుత్రాముల్
పరివేష్టింపఁగ నిలిచిన
యురుకరుణాపాంగ సీము మత్తమనామున్
తిరువెళ్లరపురి శ్వేతశి
ఖరిపై నౌరసైన దివిజకాంతలు గొలువన్
వరవైభవంబులను బొ
ల్చు రమాధవుఁ బుండరీకలోచన దేవున్
తెల్లముగఁ గుంభఘోణపు
రోల్లసదనిలాళి రెండుక్రోసుల నేలన్
బుళ్లన్ బుదకుడి నాండెడు
బల్లిదు-రఘునాథు హృతకబంధ విరాధున్

ఉర్విరంగస్థలమునకు యోజనమునఁ
బూర్వహరిదంచలమున నపూర్వమహిమఁ
దివిరి తిరువేర్న్న హర్పుర దివ్యధామ
మందుఁ దగు పద్మనయను ననంతశయను.

కుంభఘోణంబు వాయుదిక్కోణభూమి
నమిత వైభవ సామగ్రి నమరు నాద
నూరఁబ్రహ్లాదముఖులను గారవించు
జిష్ణుయోగీంద్ర యోగవర్ధిష్ణు విష్ణు.

కుంభఘోణపు తూర్పునఁ గొమరు మీఱు
తిరుందళూరఁ బావక దేవునకుఁ బ్ర
సన్నుఁడైయున్న దేవతా సార్వభౌము
వనజనయనుని గోపికావల్లభునిని.

పరికించి కుంభఘోణ న
గరి కాగ్నేయాశఁ గడుఁ బ్రకాశించు విరు
ప్పురినున్న శేషపన్నగ
వరదున్ ఫణితల్పశాయి వైభవదాయిన్.

వరవిభవములన్ సిరిచి
ర్పుగమునఁ బురహర సురేశ్వరుల్ భజియింపన్
ధరకుం బ్రత్యక్ష్యంబౌ
గిరిధరణ సహిష్ణు బాలకృష్ణున్ జిష్ణున్.

చొక్కాణ్ణూరుపురంబున
నక్కౌశికయజ్ఞవేదియం దుద్భవమై
రక్కసులఁ దునిమి దాసుల
యక్కఱఁ దీరుచు జనార్దనాహ్వయమూర్తిన్.

ఘనమగు కుంభఘోణమునఁ గాంచన పుష్కరిణింజనించు కాం
చనిదలజాత నాయికను సన్నుతవైఖరిఁబెండ్లి యాడి కాం
చనమునికిం బ్రసన్నుఁడగు సారసపాణిని శార్ఙ్గపాణి స
న్మని వరమన్త్రకోపరి సముజ్జ్వల వాణిని దేవతాగ్రణిన్.

తిరుకండి యూరునాఁదగు
పురవరమునఁ దనుజసమితిఁ బొలియింప సురో
త్కరముల ననువన్నినిచిన
నరరక్షాచణుని నాదినారాయణునిన్.

తిరువిణ్ణహర్పుర దివ్యధామంబున
     విలసిల్లు జగదీశు వేంకటేశుఁ
దిరుకణ్ణపురవరాంతర విమానమ్మున
     నిలుచు చతుర్బాహు నీలదేహుఁ
దిరుమంగ యాళ్వారు వరయుతిర్నగరి నృ
     హరిని లక్ష్మీశు నారాయణాఖ్యుఁ
దిరువాటి మణవాళ దివ్యనామమున శో
     భిలు నాగ పట్టణ వేంకటేశుఁ
దిరునరయ్యూరఁ దనరారు ద్విభుజపరిఘుఁ
బంకజనికేతనాధీశు వేంకటేశు
మహిమ నొప్పు నంది పురవిణ్ణహరనగరిఁ
జేరియున్న జగన్నాధు శ్రీననాధు.

     తిరువిందళూర సకలా
     మరపరికరముల్ తపస్సమాధి భజింపం
     గరుణామతి వారలకున్
     వరము లొసంగిన సుగంధ వరనాధుహరిన్.

చిత్రకూటమ్మునఁజెందమ్మి కొలని చెం
     తం దనరారు గోవిందరాజు
శ్రీరామవిణ్ణహరీపురమేలు స
     ద్భావుఁ ద్రివిక్రమదేవ దేవుఁ
దిరు కూడ లూర్పురాధిపు నుపమాతీతు
     వరదయాంబుధిరాజు వరదరాజు
ఖలసంహరుని దిరుక్కణ్ణంగుడి వసించు
     శ్రీసౌఖ్యవర్ధిష్ణుఁ జిన్ని కృష్ణు
గరిమఁ దిరుకణ్ణమంగాఖ్య కటకమేలు
భక్తవత్సలదేవు దివ్యప్రభావు
హనుమ మనుపంగ విన్నలమ్మునను వెలయు
నింద్రశాత్రవవరదు గజేంద్ర వరదు.

     భరతాద్యనుజులు సీతా
     తరుణీమణి గంధవాహ తనయుఁడు గొలువం
     దిరువెళ్లియంగుడి నగరి
     వెరగొప్పఁగనేలు దేవనిభ రాఘవునిన్.

తిరునాంగ పత్తనాంతర సీమమాణిమా
దక్కోవెలఁ దిరువెళ్లక్కొళంబు
తిరుమణిక్కూడవణ్పురుషోత్తమములశం
బొజైకోవెలయును బురుడు లేని
యల్లపొత్తంపల్లి యరివేయవిణ్ణహ
రముకావళంబాడి యమిత విభవ
షహిమువైకుంఠ విణ్ణహరంబు నాతిరు
గేవనార్తోహము సేవకనిధి
యగితిరుత్తెత్తియంబలంబనఘ వచ్చి
దామహోమహిమారీతిఁ దనరి భక్తిఁ
గొలుచు దాసులకోర్కు లీఁగోరి ధరణిఁ
దనరు నేకాదశోజ్జ్వల ధామములను.

విలయాంబుధిమగ్న మహా
వలయంబు సముద్ధరించువరకీర్తియె యు
జ్జ్వలమూర్తిఁ బ్రవర్తిలెనా
నలరెడు శ్రీకృష్ణదేహు నాదివరాహున్.

నతజనాధారు మన్నారు కోవెలయేలు
వ్రజసంచరిష్ణు శ్రీబాలకృష్ణు
పాపనాశనపురీ భర్మహర్మ్యంబున
వసియించు నతరాజు వరదరాజు
నలపాండ్య నలధర నలహర్తిరుమలయన్
వీటవసించు శ్రీ వేంకటేశుఁ
దిరుకోటియూర నిందిరఁగూడి వర్తిల్లు
కృష్ణావినుతభావు గృష్ణదేవు
విపుల విభుతఁదిరుమ్మెయి విణ్ణపురము
నెలమిఁబాలించు సత్యగిరీశునీశు
మునులతోఁ దిరుపుల్లాని పురిని సలిల
ధామ దీక్షానమున్నిద్రు రామభద్రు.

దళితాఘమగు తిరుతంగాల్పురంబున
శ్రీయుక్తుఁడైన నారాయణ విభు
మునిసుతుండై తిరుమోహూర్పురి వసించు
ఖండిత చండాఘుఁ గాలమేఘు
నలదక్షిణ మధురాస్థలమున భక్తపా
లకుఁడైన కూడల సకియనాము
శ్రీమించు కురువిత్తురీపురంబున నతి
ప్రేమదాసులఁబ్రోవ కృష్ణదేవు

గరిమశ్రీవిల్లి పుత్తూరు సురలు మునులు
సన్నుతులుసేయఁ జెన్నారు మన్ననారు
నగణితైశ్వర్యమునఁ దిరునగరియేలు.
నాదిలక్ష్మీసనాథు నయ్యాదినాథు.

తులవెళ్ళి మంగళాద్భుత పట్టణంబున
    విలసిల్లు నయ్యరవిందనేత్రు
శ్రీవరమంగ పురీనాథు నతసాధు
    నమృతాంబు నిధితనయాసనాథుఁ
బిదిరుప్పేర్పురియందుఁ జెన్నొందుపు
    రందరస్తుతుఁగేళి నేందసంజ్ఞ
వైకుంఠపట్టణ వాస్తవ్యభవ్యవై
    కుంఠసంధాత వైకుంఠనేతఁ
గూర్మిమీఱఁ దిరుప్పుళిగుడిపురమ్ము
భూరివైభవమున నేలు భూమిపాలు
మంగపట్టణమణిమంట పాంగణమున
నలరు నతదేవు విజయాసనాఖ్యదేవు.

నగవుఁ జూపులఁ గుళింద నగరినున్న వ
    ర్ణితశౌర్యశ్రీ నవనీతచౌర్యుఁ
దిరుకురుంగుడి మహాపురసౌధవీధిక
    వఱలు బృందారక వైరి వైరిఁ
బాలితనూరిఁ దిర్కోలూరి పురిహాస
    ధవళాన్య భక్తనిధాన శౌరి
నయ్యనంతపురంబునం దహిశయ్యపై
    మీరు మురారిఁ జాణూరవైరి
సాధు జనయిత్రి వన్పరిసరధరిత్రి
మునుమీఱ వసించు శ్రీవత్స వక్షు
నాతిరుక్కాత్కరపురంబు నాదరించు
నఖిలభక్తనిధాను నన్నాభిధాను.

తిరుమూడి కలను దివ్యస్థలంబునఁ
    గ్రీడించు నల పుండరీకనేత్రు
సురలెన్నఁ గుట్టనాడ్తిరు పుళియూర్పుర
    మున వసియించు నపూర్వనాథుఁ
దిరుచెంగణూరను పురవరమ్మునఁ నొప్పు
    దివ్యభూవాస్తవ్య దేవసేవ్యు
నలువగొల్వఁగఁ దిరుణాలై నగరిని వ
    ర్తిలు ధీరనుత భావ దేవదేవు

వార్త కెక్కిన తిరుణ్ణవార్నగరిని
నున్న నతజనమందారు మన్నవారు
నుతి యొనర్పనగుఁ దిరుమందూర్పురమువ
వాత్తనరసఖ్యు నల ప్రవాళాధరాఖ్యు.

అలతిరువత్తూరమను పత్తనంబున
హరిశయ్యఁదగు కేశవాభిధాను
నుత్తచుక్కొండనా నొప్పు పత్తనమున
నలరెడు నలయనన్య గతినాథుఁ
బూని తిరుక్కుడిస్థానంబున వసించు
నలనరసఖ్యు నారాయణాఖ్యుఁ
దిరుపారనెడు పురవరమునఁ గ్రీడించు
పాటిత జిష్ణు శ్రీ బాలకృష్ణు
వినుతిసేయంగఁ దిరుమంది వెళ్లి నగరి
దేవపతిఁ గొల్వనున్న శ్రీ దేవనాథు
నాతిరుక్కోవలూర్నగరాగ్రసౌధ
వీధి సర్వస్వతంత్రుఁడై వెలయు కృష్ణు.

అలకాంచితమై తనరెడు
నల కాంచిపురిన్ వరించి యధ్వర వేదీ
స్థలి వెలసి కరినగంబున
నిలచిన శ్రీ వరదరాజు నిరుపమ తేజున్.
ఆ కాంచికాపురంబున
శ్రీకర వేగవతి సుప్రసిద్ధాంబువులన్
లోకములు మెచ్చ జనులకు
వేకాచించిన రమేశు వేగవతీశున్.

పరమేశ విణ్ణహ్రప్వాంత కాంచీస్థలి
నున్న చోళాధీశుఁ జిన్ని కృష్ణు
నటఁదిరుప్పాడహంబను నెడ వసియించు
పార్థసారథినాముఁ బద్మనేత్రు
నత్తిరురంగస్థలావాసమునఁ బొల్చు
దీప్తప్రభావాఖిల ప్రదీపుఁ
గామాక్షి కాగార భూమధ్య మస్థిత
తిరునర్థరస్థలదేవ విభుని
గామాక్షి బిలరతింగళ్తుండ ధామధా
ముఁదదీయనాము సంపూర్ణకాము
నచట నెవళుక్కు మనుచోట నధివసించు
శ్రితజనావన కృతరంహు శ్రీ నృసింహు
నందతిరువరసరమున నలరునఘవి
దారిఁ జోశహరందాభిధాన శౌరి.

వరుసఁగా రహికల్ప నూర్పుదమనంగ
దీనుల నిధానమైన కార్వానమనఁగ
వరలు జగదేక నిశ్చల వైభవముల
నలరు శ్రీహరి ధామము లందమరయ

వీక్షా మాత్ర ఫలప్రదంబయిన యా వీక్ష్యా వనాఖ్యాక పు
ణ్యక్షేత్రంబున శాలిహోత్రముని హర్యక్షంబు రక్షింపఁ బ్ర
త్యక్షంబై నిటలేక్షణుండు నుతిసేయ స్వీరకోటీరధా
ధ్యక్షుండై తగువీరరాఘవు సమిత్కాండోల్ల సల్లాఘవున్.

అలకాంచి చేరువ నష్టభుజంగమ
నిలయధరాధ్యక్షు నీరజాక్షుఁ
దిరునిన్నయూర్పుర దివ్యసౌధమ్మున
వివిధ భోగ నివేశు వేంకటేశు
లీలఁదిరుప్పుక్కు లీ గ్రామమున నున్న
విజయాభిరాఘవోర్వీతలేశు
నత్తిరు నిర్మలాఖ్య పురంబు నేలెడు
వైరి వారణ సింహు నారసింహుఁ
దిరుపదవ్వందపత్తన స్థితి వసించు
నాదిభూదారమూర్తిఁ బద్మానువర్తి
నత్తిరుక్కడమలనున్న యమరలోక
మన్యునాపల్లి గొండ పెర్మాళ్లదేవు."

—ఘటికా. 1–33 నుంచి 59 వరకు

కావ్యపరనమున నూటయెనిమిది దివ్య తిరుపతులను దాఁటి యెంత సహృదయుఁడైన పాఠకుఁడైనను ఘటికాచలమును చేరలేఁడు. కనుక నా దారిని విడిచి యడ్డుదారిని ఘటికాచల వర్ణనమునుండియే యెక్కువమంది చదువుకొందురు. ఇది యాతని యనుభవములేని రచనాపద్ధతిని జాటును. పాండురంగ మాహాత్మ్య మున నింతకంటె హెచ్చు సంఖ్యగల తీర్థములును క్షేత్రములును వర్ణింపఁబడిన తావు లున్నవి. అం దొక్క పద్యమునందైన నాఖ్యానమందలి కవితాగుణము నడలలేదు. రసవద్ఘట్టములలోఁ బ్రసన్నమైన రచనయుఁ, దీర్ఘాది పరిగణనము చేయు ఘట్టములలో నత్యాశ్చర్యకరమైన ప్రతిభను బరిణతిని జాటు ప్రతిపద్య చమత్కార రమణీయ రచనయు గనుపించును.

ఉదా.:

"కుఱుచలై గుమురులై గొనబులై లేఁబాప
కొమ్మఁ జుట్టిన జడ లుమురుకొనఁగ
మెఱుపులై మిట్టలై మిక్కిలి బటువులై
గ్రాలు కన్నుల చెన్ను గబ్బు దేరఁ
జిక్కనై చెలువమై విన్నారియై యొప్పు
మోము దంష్ట్రాటంకములఁ దలిర్ప

నీలమై నిబిడమై సిద్ధమై నింగి క్రిం
దుగ నున్న బలుమేని పొగరుమెఱయఁ
బత్రిపతి కేతనుని పురఃక్షేత్రమూఁది
యున్న శ్రీ క్షేత్రపాలకు యోగిలోక
రమణు ముప్పది రెండక్షరముల మంత్ర
రాజము జపించి కొల్వ దొరకు సుఖములు" —పాండు. 2 - 91

"బ్రహ్మతీర్థంబుఁ గలశ తీర్థంబుఁ బొగడ
నేరరెవ్వారు చంద్రికా గౌరమయ్యుఁ
దత్పయోధార ముక్తి నిధానమునకు
సంజసచ్ఛాయయై దోఁచుటద్భుతంబు" —పాండు. 2 - 154

పై రెండు పద్యములలో మొదటిదానియందుఁ గల క్షేత్రపాల వర్ణనము· పద్యములోని విరుపులు, చదువరుల నాకర్షించును. రెండవపద్యమందలి విరోధాభాసాలంకారము ముచ్చటగొలుపుచుఁ దీర్ఘ పరిగణనమువలన వినుగు గల్పింపకుండును. సామాన్యముగా నిట్టి తావులందలి యధిష్ఠాన దైవతమును వర్ణించుచు నీ కవి యరుదైన కవితా చమత్కృతిఁ జూపును.

ఉదా. :

"వరసింహమధ్య ! యచ్చో
నర సింహుఁడు కుంజరాశనతఁ దాల్చుట య
చ్చెరు వద్దేవుఁడు నిజమం
త్రరాజపూజైక శాసతాయుతుఁ బ్రోచున్" —పాండు. 2 - 124

ఇందు సింహము కుంజరాశనతఁదాల్చుట విరోధము. కుంజరాశన మనఁగా రావిచెట్టు. ఈ విధముగా విరోధా భాస మగుటయే గాక పద్యములోని శబ్దా లంకారముతోఁ గూడిన పదలాలిత్యము తీర్థమంత్రాది వర్ణిత వస్తువువలన గల్గిన భారమును జదువరుల మనస్సునకు సోకనీక కావ్యము నామూలాగ్రముగా రసవంతము చేయును.

మొత్తము మీఁద రామకృష్ణుని శైలి యప్రతిమాన కావ్య గుణము కలదియై స్థల మాహాత్మ్య గ్రంథమును నిరుపమాన ప్రబంధముగా రూపొందించినదిఁ సర్వతోముఖమైన ప్రతిభావ్యుత్పత్తులతోఁ గూడిన యభ్యాసపాటవమే దీనికిఁ గారణము. శబ్దప్రయోగము, భావనావైచిత్రి, భావౌదాత్యము నితని తీవ్ర స్వతంత్రబుద్ధికౌశలమునకుఁ దోడ్పుట వలన బంగారమునకుఁ బరిమళ మబ్బి నట్లైనది.

రామకృష్ణుని కథా సంవిధాన చాతురి

వస్తు నిర్మాణము

ఘటికాచల మాహాత్మ్యమునఁ గథల విస్తృతిగాని, కథల సంఖ్యగాని యల్పము. ఈ విస్తృతివలెనే యప్పటి కవితా పరిణామముగూడ నల్పమగుటచే సంవిధాన చాతురియు ఈ కావ్యమునఁ గనుపింపదు. కథల కొక వరుస లేదు. రచనలోని కథాక్రమమున కొక నిబిడ బంధము గాని, యర్థవంతమగు కూర్పు గాని లేదు. నారదుఁడు ధవళాంగుని కథ చెప్పుట కొక ప్రయోజనము సాధింపఁ బడలేదు. గోవిందశర్మ, హరిశర్మల వృత్తాంతములు పరస్పర సంబంధము గలిగి నారదుని జన్మవృత్తాంతముతో నంటిపెట్టికొని యున్నను, రచనలో మాత్రము సంవిధానము లేక వేర్వేరు కథలవలెనే కనుపించును. కార్యకారణ సంబంధమును గల్పింపలేకపోవుటయే దీనికిఁ గారణము. అట్లే మిగిలిన కథా ఘట్టములన్నియు భిన్నమైన కథాపరిగణనముగనే గ్రుచ్చఁబడిన పుష్పములవలెఁ గాక కుప్పపోసిన పువ్వులవలెఁ గనుపించును. కార్యకారణ మను నేక సూత్రత సాధింపఁబడకుండుటయే దీనికిఁ గారణము.

ఉద్భటారాధ్య చరిత్రమునఁ గథలన్నియు సూటిగా నొకే వరుసలోఁ జెప్పఁబడి కార్యకారణభావ ముండుటవలన నేకసూత్రత సిద్ధించినది. ఏ కథతోఁ బ్రారంభించినను గ్రమము తుది దాకఁ గొనిపోవును. ఒక్క మదాలస చరిత్ర మాత్రము ప్రధాన కథతో సంబంధించినది కాదు. అయినను గాశీనగర గమనోన్ముఖులైన దంపతులకుఁ గాశీమహిమ నిరూపించు నర్థవాదముగాఁ జెప్పబడినది గనుక నా దంపతుల యౌత్సుక్యమును, సంతానము గలుగు నను నాశాభావమును బెంపొందించునది గనుక, ఇటఁ బ్రసక్తమైనది. గంధర్వులు శాపము నంది భూలోకమునకుఁ బిశాచములై వచ్చి శాపవిమోచనమునకై వేచి యుండుట యొక కథాక్రమము. వల్లకీపుర రాజు సంతానార్థియై విశ్వనాథు నర్చించి ముంజభోజుఁ డను కుమారుని బడయుట, యతఁడు జ్ఞానోదయము నంది శివసాక్షాత్కారము నందుట రెండవ కథాక్రమము. ఇందలి చివరి యంశమునకు సద్గురు వొకఁడు కావలయును. గంధర్వుల శాపవిమోచనకుఁ గారణ జన్ముఁ డొకఁడు కావలయును. ఈ రెండు కథాక్రమములను గలుపుట కుద్భటుని శివుఁడు సృష్టించుట మూఁడవకథాక్రమము. ఈ విధముగా నీ కావ్యమందలి కథాక్రమముల సంవిధానమునం దొక శ్లిష్టమైన బంధము గలిగి, యంగాంగిభావ మేర్పడినది. ఒక్క మదాలస చరిత్ర మాత్ర ముపాఖ్యానముగా నీ కథలకు నడుమ నెలవుకొనినది. ఇట్టి కథల కూర్పు నిస్సందేహముగా ఘటికాచల గ్రంథమునందుకన్నఁ గవి రచనలోని పరిణామమును జూపుచున్నది. ఇక నొక్కొక్క కథను జెప్పునట్టి సూక్ష్మాంశములలో మాత్ర మెట్టి వైచిత్రి లేక కథాకథనము సూటిగా సాగి పోయినది.

పాండురంగ మాహాత్మ్యమున నీ లోపముగూడఁ దీరినది. అనఁగాఁ గథల కూర్పులోని నేర్పుతోపాటు సూక్ష్మాంశముల చేర్పునం దొక తీర్పు నెలకొనినది. ఇందు మొదటి యంశమే తొలుతఁ బరిశీలనార్హము. అగస్త్యుఁడు సామిమలకు

వచ్చుట యిందలి మొదటి కథ. అతఁడు సుబ్రహ్మణ్యుని దర్శించి స్కాంద పురాణమును వీనులఁ గ్రోలెను. అందు బహుతీర్థముల, క్షేత్రముల ప్రసక్తి యున్నది. తత్కారణముగ వేల్పు, తీర్థము, క్షేత్రము ప్రశస్తమై యొప్పారునది యెచ్చటనని యగస్త్యుఁ డడిగెను. ఆ సందేహము తీరుటకై వారు తక్కిన ఋషులతోఁ గూడి కైలాసమునకు శివుని బ్రశ్నింపఁ బోయిరి. ఆ సమయమునకుఁ బార్వతియు శివుని బ్రశ్నించుచున్నది యీ విషయమును గూర్చియే. వారలకుఁ బ్రత్యుత్తరముగా శివుఁడు పాండురంగ క్షేత్రమును గొనియాడి తద్వృత్తాంత మును జెప్ప నారంభించుటతోఁ బుండరీకుని కథ ప్రసక్తమైనది. ఇది యీ కావ్యమందలి మొదటి కథాక్రమము.

షణ్ముఖుఁడును, ఋషులును, బుండరీకుని కథ విని మరలి వచ్చు చుండఁగా, నారదుఁడు చూచి వీ రంద ఱేదో పరమార్థము నుపదేశమంది పోవు చుండిరని గ్రహించినాఁడు. తానును శివుని దర్శించి యా విషయమును జెప్పు మని వేడినాఁడు. దీనితోఁ బుండరీకుని కథయే రెండవకథా క్రమముగా నారంభ మగును. కాని ఈ మాఱు క్షేత్రతీర్థమహిమాను వర్ణనముతో నారంభించుటచే శివు డందలి సంగమతీర్థమహిమమును గొనియాడుటలో నిగమశర్మ కథ ప్రసక్త మైనది. నిగమశర్మ సంగమ తీర్థమున మునుఁగుటవలనఁ దరించినాఁడుగదా! ఆ కథ విని నారదుఁడు కుతూహలపడి తనకును బుండరీకుని కథను సరహస్య ముగాఁ జెప్పుమని యార్తుఁడు, జిజ్ఞాసువునై ప్రాధేయపడినాఁడు. ఇట రెండవ మాఱు పుండరీకుని కథ చెప్పుటలో నీ కవి సాధించిన యాశ్చర్యకరమైన కథా సంవిధాన మున్నది. పుండరీకుని కథలోని సంప్రదాయ రహస్యములను రెండు భాగములుగాఁ జేసి, మొదటియంశములతోఁ గుమారాదులకును, దక్కిన రహస్యములతో నారదునకును శివుఁడు చెప్పుటవలనఁ, జదువరు లీ రెండు తావులలోని కథాక్రమమును జదివిననే గాని సమగ్రత యేర్పడకుండునట్లు కవి తీర్చినాఁడు. అంతేకాదు; రెండవకథనమున వేఱొక కథల వరుస యేర్పడినది. పుండరీకుఁడు తపస్సు చేయుచున్న కాలముననే భూదేవి దుష్టుల భారమును సహింపలేక నారాయణునితో మొఱలిడుటకు శ్వేతద్వీపము నకుఁ బోయినదని చెప్పుటలోఁ గృష్ణావతార కథాప్రసక్తి కలిగినది. పాండు రంగ క్షేత్రాధి దైవతమగు విట్ఠలుఁడు కృష్ణావతారమూర్తి కదా!

కృష్ణుఁడు భూమి కవతరించు కాలముతో సరిపోవుటకే పుండరీకుని తపస్సు "ద్వాపరంబు కడకందువ" యందు జరిగినట్లు వర్ణింపఁబడినది. కృష్ణుం డవతరించునపుడు భువనమోహినియగు మాయ రాధగా జన్మించెనఁట. కనుక నిచ్చట రాధ తపోవర్ణనము ప్రసక్తమైనది. కృష్ణుఁడు రాధ నను గ్రహించిన వెనుకనే పుండరీకునకుఁ బ్రత్యక్షమయ్యెనఁట. ఈ కథాంశము కుమారాదులకుఁ జెప్పిన పుండరీకోపాఖ్యానమున లేదు. ఈ కథాక్రమము వలనఁ బుండరీకునకును మోక్షసాధనకును రాధకును ప్రకృతికిని స్వామి యనుగ్రహమునకును గల పరస్పరాధ్యాత్మిక సంబంధ మహా రహస్యములు వ్యంగ్యముగా నిటఁ బ్రతిపాదింపఁబడినవి. సాధకుని శరీరమే క్షేత్రము. త్రిగుణాత్మకమైన యాతని ప్రకృతియే రాధ. భౌతిక శరీరమే శ్వేతద్వీపము

వలుకు నారోహణ మొందవలసిన భూమి. ప్రకృతి స్వామి యనుగ్రహము నందుటవలన భూభార నిర్వాపణము జరుగుటయుఁ బుండరీకుని తపస్సిద్ధి వలన దైవము భూమి కవతరించి క్షేత్ర తీర్థములను బవిత్ర మొనరించుటయు శివుఁ డుపదేశించిన గుప్తాకారమగు పాండురంగ మాహాత్మ్యము. ఇది బహిర్లోక మునఁ బ్రకటాకారముగా నెలకొనిన పాండురంగక్షేత్ర తీర్థ దైవతముల త్రిరా వృత్తమైన పురావృత్తము. కనుక నీ రెండవ కథా క్రమము పుండరీకుని కథతో నారంభమై మరల నా కథలోనికే పర్యవసించి నడుమ కృష్ణావతారము, రాధకథ యిమిడిపోవుట సంభవించినది.

అవతార మెత్తిన కృష్ణమూర్తి యూరకుండక మూఁడవకథాక్రమము నారంభించినాఁడు. అతఁడొక కార్తిక పూర్ణిమనాఁటి రేయి వేణుగానము చేయు చుండగా నొక యావు పయస్సులను వర్షించినది. తత్పయఃఫేనము కృష్ణుని మౌళి నలంకరించుటవలన నా ధేనువు సుశీలయై జన్మించినది. ఒక జంతువు పుణ్యకర్మ వశమున మానవజన్మ మందుచుండఁగా, దాని నాధారముగాఁ గొని మరి కొన్ని పుణ్యజీవులైన తిర్యక్కు లామె గర్భమున సుతులై జన్మించిన చిన్నకథలలోని సంవిధానము చదువరుల నాశ్చర్యచకితులఁ జేయకమానదు. కృష్ణుని కరుణావిశేషమున దుర్లభమైన నరజన్మ మందిన ఈ జీవుల కుటుంబ మునకు పాండురంగఁడు బ్రహ్మచారి రూపమున నాతిథ్యమందుటయుఁ బౌండరీక క్షేత్రము వారికి మోక్షధామ మగుటయు సహజమేగదా!

ఇట్టి యుత్తమ గృహస్థుల కుటుంబమునకు సూటిగా మోక్ష మబ్బుట బ్రహ్మచారియగు నారదునకుఁ గొంత సందేహము కలిగించెను. తన్నివారణకై శివుఁ డయుత నియుతోపాఖ్యానము చెప్పినాఁడు. విభిన్న కథాక్రమములను గార్యకారణ సంబంధమునఁ గరఁగించి ఇ టైక్యపరచుటలో రామకృష్ణుని ప్రతిభ నిరుపమానము. ఏ యగస్త్యునితో నీ గ్రంథమందలి కథల సంపుటి యారం భింపఁబడినదో వాని శిష్యుఁడే యయుతుఁడు. గృహస్థ ధర్మమును నిందించి గురునకుఁ గోపము గలిగించి, యొప్పునది యొప్పదని పలుకు నుద్ధతుఁడగు నయుతుఁడు శప్తుఁడైనాఁడు. శాపావసానమువఱకుఁ బాండురంగ క్షేత్ర మున నృసింహుని పాదపద్మములకడఁ గాలము గడపినాఁడు. ఉద్భటారాధ్య చరిత్రమున శప్తులైన గంధర్వుల కిట్టి పవిత్ర స్థలమున వేచి యుండుటను గవి కల్పింపలేదు.

ఈ విధముగా నిందలి ప్రధాన కథలన్నియు సుశ్లిష్టములై నిబిడ వస్తు బంధము, వస్త్వైక్యము గలిగి "శార్ఙ్గితను సౌధము"వంటి పాండురంగ దేవాలయ నిర్మాణాంగములై భాసించుచుండఁగా, నందలి గోపురముపైని వినోద శిల్పము లవలె సుశర్మోపాఖ్యానము, త్రిదంష్ట్రవధ, ధర్మరాజు పాండురంగని దర్శిం చిన కథ, జింకయు, బోయయుఁ దరించిన కథ మున్నగు చిన్న చిన్న యుపా ఖ్యానములు సహృదయుల మనస్సుల నాకర్షించును.

కథోన్మీలనము

ఇఁక గథలోని సూక్ష్మాంశముల కథన వైఖరి యెట్లున్నదో యుదాహరణ ప్రాయముగాఁ బరిశీలింపవలసి యున్నది. రామకృష్ణుని కథాంశ వికాస పద్ధతి సుమనోవికాసము వలె నొక యనన్యమైన క్రమోన్మీలనము గలిగి యుండును. ఈ యున్మీలనము కథను నిత్యనూతనముగా నొనర్చును. ఈ దృష్టితో మూఁడు కథలు పరిశీలనార్హములు. అవి నిగమశర్మకథ, పుండరీకుని రెండు కథలు. నయుత నియుతోపాఖ్యానము. ఈ గ్రంథమందలి వస్త్వైక్య మీ మూఁడింటి మీఁదనే యాధారపడియున్నది.

నిగమశర్మోపాఖ్యానము

పీఠికాపురమున సభాపతి యను విప్రుఁడు గలఁడు.
"ఆ మహీసురు లేమకు నతులనిష్ఠ
నింగి వేల్పులనేలకు, నేలవేల్పు
కొలము నింగికిఁ దెచ్చుచుఁ గొలువఁ బుత్రుఁ
డొక్కఁ డుదయించెఁ దత్కృపాభ్యుదయమహిమ"

—పాండు. 3 - 5

ఈ పద్యము చదివినప్పుడు సభాపతికి బిడ్డలు లే రనిపించును. నిగమశర్మ పుట్టి పెరిగి చెడిపోయినపుడు వాని యక్కగారు శిక్షింపవచ్చెనఁట. సభాపతికిఁ దొలుత స్త్రీ సంతతి యుండెననియుఁ బురుష సంతతికై పూజ లొనర్చి రనియు, నప్పుడుగాని తెలియదు. ఇట్లే యక్కగారు నిగమశర్మను నిందించుచు, "నేలలో వెడలని తమ్ముఁగుఱ్ఱల" ను గూర్చి "వెన్కనెవ్వారున్ లేరె సహోదరాదులు?" అని హెచ్చరించినప్పుడు దప్ప నిగమశర్మకుఁ దమ్ములు జన్మించిరను విషయము చదువరులకు తెలియదు. అక్కగారు తమ్ముని దుశ్శీలత వలనఁ బాటు దప్పిన యింటిని సంస్కరించిన విధమును జదువుచున్నప్పుడు తప్ప సభాపతి యింట గొప్ప గ్రంథాలయ మున్నదనియు, ననుదినము పలువురు విద్యార్థులు వచ్చి చదువుసంతలు సాగించుచుండిరనియుఁ దెలియదు. నిగమశర్మ దొంగిలించిన నగల పట్టికను చదువునప్పుడు తప్ప వారియింట నిన్నివిధములైన సొమ్ము లున్నవని తెలియదు. నిగమశర్మ తన బావగారి "నవగ్రహాకర్ణవేష్టనము" ను గత్తిరించికొనిపోయెనని చెప్పినప్పుడు మాత్రమే బావగా రంతటి కర్మిష్ఠియని తెలియును. నిగమశర్మను జూచి కామవికారము నందిన కాపుఁగోడలు వెకలియ గుచు నతఁడు చూచునట్లుగాఁ దన తోడికోడలి బిడ్డను గట్టిగాఁ గౌగిలించి బుగ్గ కరచెనని కవి చెప్పినప్పుడు తప్ప, నామెకు సంతతి లే దనియుఁ బరపురుషులపై మనస్సు చలించుట కది యొక కారణమనియుఁ దెలియదు. అర్ధమరేయి దాక పొలమారని వచ్చిన భర్త నామె సుఖపెట్టకుండుటకుఁ గారణ మప్పుడు మాత్రమే గోచరించును. బోయకులమునఁ గలసి యామె వేటాడుచుండెనని కవి చెప్పి నప్పుడు తప్ప నామె కంతటి శరీరదార్ఢ్యము గలిగి భర్తను తిరస్కరించి, వచ్చిన

వాని వెంట వచ్చుటకుఁగారణము విశదము కాదు. వేటాడునప్పు డామె "గతి మధ్యస్తన కుంతలస్తబక వీక్షాగర్వ దుర్వారతలతో" చరించినప్పుడు తప్ప నామె యంతటి యందకత్తెయని తెలియదు. రామకృష్ణుని కథాంశ కథనము లోని క్రమోన్మీలన మిట్లుండును. ఒక వ్యక్తికివలెనే రామకృష్ణునిచే రచింపబడిన కథకు నొక పుట్టుక, పెరుగుదల వివిధావస్థలు, అంగోపాంగ విస్తృతి, యొక పర్యవసానము కనుపించును.

పుండరీకుని కథలు

పుండరీకుని కథలోని యంశముల యున్మీలన మింతకన్న నుత్తమస్థాయి లో నున్నది. ఈ కథ స్కందాదుల కొక్కమాఱును, నారదున కొక్కమాఱును జెప్పఁబడినది. రెండుతావులందును నుపదేష్ట పరమేశ్వరుఁడే. ఉపదేశ మొక్క టియే. ఐనను వారిపాత్రతలోని తారతమ్యము ననుసరించి కథాగమనము మార్పు చెందినది. స్కందుఁడును. నారదుఁడును బ్రహ్మచారులే. పరమేశ్వరుఁడు స్కందున కర్ధనారీశ్వరుఁడుగాను, నారదునకుఁ దొలుత నొక తేజస్సుగను దఱు వాత కేవలము శివుఁడుగను దర్శన మిచ్చెను. స్కందుఁడు ముత్యము నుపాయ నముగా సమర్పించినది, "యచలసుతకు" "శితికంధరునకు". ఒక ముత్యము నిరు వురకెట్లిచ్చును ? దాని నలంకరించుకొని మెచ్చుకొనుచున్న పరమేశ్వరుని యర్ధ నారీశ్వర రేఖ యెంత వ్యంగ్యముగాఁ జిత్రింపఁబడినదో గమనీయము.

"హరుఁడు శిరంబునం, జెవిఁ. గరాంబురుహంబునఁ దాల్చెఁ జంద్రికాం
కురపరభాగమై యురగకుండలమై, స్ఫటికాక్ష సూత్రమై
గిరిజకచాళి, గర్ణమునఁ, గేలవహింపఁ బ్రసూనమాలికా
కరిరద పత్రవిభ్రమ, శుకంబులునై మణి యుల్లసిల్లుచున్"

—పాండు. 1–203

ఈ సందర్భమున "నచలసుత, శితికంధరుఁడు. హరుఁడు, గిరిజ" యను పదములు దప్ప వారలు మున్నగు బహు వచన పదములు వాడఁబడలేదు· అలంకరించుకొను సందర్భమున శరీరభాగముల యభేదతయు సగము పద్యమున శివుని శోభయు, రెండవ సగమునఁ బార్వతి విలాసమును వర్ణించుటలో నర్ధనా రీశ్వరమైన యభిన్నతత్త్వమును గుమారస్వామి దర్శించినాఁ డను నంశము స్మీలితమగును. ఇఁక నారదుఁడు శివుని దర్శించిన విధానమునందలి భేదము సాభిప్రాయము.

"...... ....
అందు విధుకాంత వేదికాభ్యంతరమున
దీపిచర్మో పరిస్థల దీపితార్క
కోటినిభమైన యొక నిరాఘాట నిరఘ
నిరుపమ ప్రభఁగాంచె నిర్నిమిష దృష్టి.

"కాంచి విరించి నందనుఁడు కన్నులు బిమ్మిటి నొంద డిందియొ
క్కంచుక గొంకు దేరి కనియెన్ దదుగ్ర మహోగ్రదీప్తిలోఁ
బంచముఖున్ శిఖీక్షణ విభాసిలలాటు మరుజ్ఝరీధరున్
సంచిత సత్కృపారసవశంవదు నాదికపిన్ వృషాకపిన్"

—పాండు. 2-188, 160

తనయుఁడుతల్లిదండ్రులను దర్శించినట్లున్నది స్కందుని యర్ధనారీశ్వర దర్శనము. ఒక జిజ్ఞాసువు దైవతేజస్సునఁ దన యాత్మీయ తేజస్సును గోల్పోయి యటుపైని దైవదర్శనము చేసినట్లు నారదుని యనుభూతి వర్ణింపఁబడినది. ఇది స్కంద నారదుల స్థితిభేదమును జిత్రించుటలోఁ గవి జూపిన వికటకవిత్వము. ఇరువురు చేసిన కైలాసారోహణక్రమముచే యీ భేదము పాటింపఁబడినది.

"...... ....
గంధవతియను నొక్కపంకజమునడుమ
మించునక్కొండ కొదమ రాయంచఁబోలి" —పాండు. 1-174

అను దృశ్యమువలనఁ గుమారస్వామి నెమలి వాహనమున నింగినుండి కైలాసమునకు దిగెనని తెలియును. ఇతని కైలాసగమనమున దూరమునుండి శివుఁడు కైలాసము మొత్తమునఁ దన యాకృతినే కుమారునకుఁ బొడకట్టఁ జేసినాఁ డఁట.

"పుట్టిన మోములై శిఖరముల్ వెలుగొంద నితంబమండలిన్
గట్టిన కృత్తియై నిబిడ కానన రేఖదలిర్ప లోనఁజూ
పట్టిన విశ్వమై వెలుఁగు ప్రాణికులంబలరన్ గిరీశు డ
ప్పటికిఁ గానిపించిన ప్రభన్ గలధౌతనగంబుతోఁచినన్"

—పాండు. 1-173

ప్రాణికుల మెల్లఁ బరమేశ్వరునిలోన జూపట్టిన విశ్వముగా దర్శింపఁగలవాఁడు కుమారస్వామి. ఇఁక నారదుని కైలాసారోహణము మరియొక విధముగా నున్నది. అతఁడును "దెగిన చుక్క ధరణికి నేతెంచు కరణి మేఘ సరణి డిగ్గి" యే కైలాసమునకు వచ్చినాఁడు. కాని కైలాసమునందు శివుని యంతర్యామితను జూడలేదు. తొలుత నందలి యరణ్యములు, తటపుట బిల్వభూరుహ వితానలతాదులు, నిష్పతజ్జటిల మధూళి ధూళిభవ సౌరభములు నారదుని భ్రమింపఁ జొచ్చెను. అందలి యదృశ్యస్వరూపులగు వనదేవతల కుచద్వితయముల నాశ్రయించిన యక్షకర్దమపుఁదావులు త్రోవలాగినవి. అతఁడు కొన్ని మార్గములను జూచి :

"ఉచిత నేపథ్యయుత లయ్యు నురగసతులు
నిఘ్న నిజమౌళి మణి ఘృణి విఘ్నలద్ది
నభిక నంకేతములకు రేలరిగి యరిగి
తిరుగు మొగమైన పిక్కల తెరువులిర" —పాండు. 2 - 174

యని యచ్చెరువంది దాటి వచ్చెనఁట. మఱి కొంత దూరము వ్యాళకరాళ కుంభముల పచ్చి ముత్యాలు నఖాగ్రధారలకు నాభరణాచరణ మొనర్ప శైలగు హస్తులుల నిద్దురలు చేసెడు మహాగ్ర సింహములను జూచి యివి గట్టురామాలి వయాళి పావురమును నూడుకు బట్టునని ముచ్చటపడి చూచినాఁడఁట. ఎట్టకేలకు నిట్టి వింతలను దాఁటి యతఁడు కైలాస ప్రాంగణము చేరినాఁడు. కొంతదూరము గణపతి విహార గేహాంగణములు కాఁబోలు నతనికి గన్పించినవి. మఱి కొంతదూరము ఖేచర స్త్రీల సమ్మర్ద గళిత భూషాస్రజములు గన్పించినవి. ఆ పైని దక్ష కన్య పాదవిన్యాసముచే ధన్యత నందిన గుహలు కన్పించినవి. ఇంకను బోవ నఁట మోదక ప్రియుని దంతముచే నిర్భిన్నములైన ధాతుఖనులు పొడకట్టినవి. అప్పటికి శంకరుని యంతర్యామిత యతనికి లీలగాఁ దోచినది. ఎట్లనఁగా గాంగజలపాతమున రేఁగిన తుంపురుల చలువను బెరిగి పుష్పించిన వృక్షముల జూచి యతఁడు :

".........ఇవి వహ్నితిలకచల క
పర్ద నిర్దోష సురసరి దృహుళలహరి
గహన కుసుమాయమాన శీకరనిపాత
శీతలక్ష్యాతలోద్ధద్రుపోతకములు" —పాండు. 2 - 176

అని భక్తిభావమునఁ బరవశుఁడైనాఁడు. ఇట్టి మార్గమునఁ బరిశ్రమించుచున్న నారదుని దృష్టి కింకను నెత్తైన శిఖర శృంగములు గోచరించినవి. రాజతాహార్య మొక మహా వృషభమువోలె సాక్షాత్కరించినది. చంద్రశేఖరుఁడు మూపురము. గంగాస్రవంతి గంగడోలు. మరల నా మార్గమున "రేపుదమంబు సేయు శబరీ కబరీ నిబరీ సనీలిమలు" పొడకట్టఁగాఁ "ద్రోవిజని", వెనుదిరిగి వచ్చుచున్న కుమార స్వామిని జూచెనఁట. కుమారుని యవరోహణస్థితియే నారదుని యారోహణ స్థితి యని యిందలి ధ్వని.

కుమారుఁడు నీ ఋషులు నెందులకు వచ్చిపోవుచున్నారను వితర్కమాతనికిఁ గల్గెను. పరమోపదేశ మొందుటకని గమనించినాఁడు. వెంటనే జ్ఞానమార్గమునుండి మోక్షమార్గమునకు సూటియైన దారి దొరకినది. తత్త్వజిజ్ఞాస యంతయు మనఃపథమున గిఱ్ఱున దిరిగినది. "పరమేశ్వరుని రూపమున దాపైన మార్గ ముండఁగా వానిని భజించు మతిపుట్టక కంపలఁబడ్డ కాకినై మోస పోయితి గదా ! ఎంతవారికిని ముఖ్య సౌఖ్యము పెను త్రిమ్మట వలనఁ దక్కునా ? దానికి విశిష్టజన సఖ్య మావశ్యకము. కావున వానిని శరణము వేడెదను" అని "నిశ్చలతర నిశ్చయమునఁ" బ్రయాణము సాఁగించినాఁడు. ఇంతవఱ కతని మార్గము కైలాసోన్ముఖమై యున్నను లక్ష్యము మాత్ర మది కాదు. అతఁడు నిర్దిష్టమైన సంచారము చేయుచున్నాఁడు. ఇటనుండి సంకల్పము మాఱుటచే మార్గమంతయు శివలోకమై పొడ కట్టినది. పుండరీకుని కథకు శ్రోతలకు నారద సుబ్రహ్మణ్యుల నడుమఁగల యీ విభేదమే పుండరీకుని కథోపదేశ భేదమునకు నాందియైనది.

కుమారుని శివుఁడు క్షేత్రతీర్థ దైవత పరిప్రశ్నమును గూర్చి "మము నీ యర్థమ వేడుచున్న యది యుష్మన్మాత ...ఈయమకు న్నీకు నెఱుంగఁజెప్పెద" నని యారంభించినాఁడు. ఈ పార్వతి పరిప్రశ్నమునకుఁ గొంత పూర్వరంగ మున్నది. అది కుమారున కావశ్యకము కాదు. కనుక నారదునికే యిట్లు చెప్పినాఁడు : "మును మందరమున నుమయు నేనును విహరించుచుండఁగా నా కనుగ్రహము గలిగి యామెకు వరమిత్తు నంటిని. అపు డామె తనకు వలసినప్పు డొసఁగుడని విన్నవించినది నేఁ డా వరము నిట్లు క్షేత్ర తీర్థ దైవతాత్మక రహస్యము నుపదేశింపవలసినదిగాఁ గోరినది". పరమేశ్వరుఁ డనుగ్రహించినచో జీవులకు నడుగకయే వరము లిచ్చుననియును, వరమే కోరినచోఁ బార్వతి కోరినట్లుండవలెననియుఁ, బ్రస్తుత ముపదేశము చేయఁబోవు నంశము దుర్లభమైన వరముగాఁ గోరఁదగినదనియు నిందలి హెచ్చరిక.

కుమారస్వామికిఁ జెప్పిన క్రమమున మొదటఁ బుండరీకుని కథయుఁ బిమ్మట క్షేత్రతీర్థప్రాశస్త్యము చెప్పఁబడినది. నారదునకుఁ దొలుత క్షేత్రతీర్థ దైవతముల మహిమాను వర్ణనము చేసి, యీశ్వరు డందలి సంగమతీర్థ మహిమ మున కుదాహరణముగా నిగమ శర్మోపాఖ్యానమును జెప్పినాఁడు. ప్రధానకథ తుదివఱకు గోప్యము చేయఁబడినది. నారదుఁ డంతకుముందే విని సారము గ్రహింపవలసిన పూర్వరంగ మెక్కువ యున్నదని యిందు స్పష్టపడును. నారదుఁడు జిజ్ఞాసల దారులలోఁ దిరిగి తిరిగి వచ్చిన కారణమున విశ్వాసము దృఢ మగుటకు నిగమశర్మవంటి పాపులు గూడ క్షేత్రతీర్థ దైవత ప్రభావమునఁ దరించిరని విప్పి చెప్పుట శ్రేయస్కరము. నిగమశర్మ పొందిన స్థితి యెట్టిది ? హరిపార్శ్వ చరులు నలుగురిలో నితఁ డొకఁడైనాఁడు. మిగిలిన ముగ్వురిలోఁ బుండరీకుం డొకఁడఁట. ఇఁక నారదునకు గుఱి యేల కుదరకుండును ? ఉపాఖ్యానముల నిట్లు క్రమవికాసము నందఁజేసి ప్రధానకథలో నైక్య మందించుట రామకృష్ణుని యశేష శేముషీ విశేషమును దెలియఁజేయు చున్నది.

ఎట్టకేలకు నారదునకు బుండరీకుని సాధనామార్గమును శివుఁడు వివరింప నారంభించినాఁడు. కాని యదియు సూటిగా సాఁగలేదు.

"
....
క్షితిసురేంద్రుఁడు తపమిట్లు చేయుచున్న
కాలమున నేఁగె ధర విష్ణుఁ గనుగొనంగ" —పాండు. 3 - 140

నారదుని శ్రోతృత్వమున కావశ్యకమైన శాఖాచంక్రమణ మిచ్చట బాగుగా జరిగినది. భూదేవి శ్వేతద్వీపమున కేఁగినది. మార్గమున క్షీరాబ్ధి వర్ణనము. శ్వేతద్వీప వర్ణనము, నారాయణునితో భూదేవికి జరిగిన సంవాదము ప్రసక్త ములైనవి ఇఁకఁ గృష్ణావతార కథను నారదుఁడు వినక తప్పదు. ఇది భాగవత కథ కదా ! వ్యాసునకు భాగవతము నుపదేశించినది నారదుఁడే. ప్రాధాన్య వివక్షచేఁ దన పాండురంగ మాహాత్మ్య ప్రబంధము "శ్రీ భాగవత చరిత్రము" అని యవతారికలో వికటకవి చెప్పనే చెప్పినాఁడు. స్వకపోల కల్పితములైన యిన్ని కథల కలయికలో వస్త్వైక్యము సిద్ధించిన గౌరవము

కళాపూర్ణోదయము తరువాతఁ బాండురంగ మాహాత్మ్యమునకే దక్కినది. కృష్ణావతార భూమికను విశదపఱచుటలో శివుఁడు నారదునకు హరితత్త్వమును, దత్సంబంధమైన విశేషములను విస్పష్టము చేసినాఁడు. నారాయణుఁడు భూమి కవతరించి నపుడే నారదుని తండ్రియగు బ్రహ్మ భువనమోహినియగు మాయ నుత్పాదింపఁజేసి రాధగా నవతరింపఁజేసినాఁడు. ఆమె తపస్సు చేసి తరించిన మార్గము తెలియనిదో మాయను తరించు మార్గము తెలియదు. అటు విమ్మట గాని పుండరీకుని మోక్షమార్గ మవగతము కాదు.

రాధ కథలోని యంశము లెక్కువ లేకున్నను విన్యాస పద్ధతిలోఁ జాల రహస్యము లున్మీలనము చేయఁబడినవి. యౌవనావిర్భావ మందిన రాధ శరీరము, ఆమె యలంకరించుకొనిన భూషణములు నాపాదమస్తకముగా వర్ణింపఁబడినవి. ఇందలి యుపమానము లన్నియు మాయావృతమైన సృష్టిలోని యంగప్రత్యంగములే. ఈ భూలోకసృష్టి యంతయు జీవుల యుత్పత్తిస్థాన మైన ప్రకృతి శరీర విభాగమేయని కవి వ్యంగ్యముగా నిరూపించిన మార్గము రమణీయము.

"బిసరుహానన కటి సీమ పృథివి యగుట
విక్కమటు గాకయున్నఁ బై నెలవుకొనునె
కాంచియును మధ్యమాయయుఁగమ్రనాభి
లక్ష్మియును ద్వారవతియు సలక్షణముగ" —పాండు. 3 - 184

ప్రకృతి స్వరూపమగు నీ మాయకవధి యేమనఁగాఁ బరమపురుషుఁడామె తనూవిలాసము నలంకరించుటయే యని సూచించు పద్యము కూడ నీ కవి ప్రతిభను వెల్లడి చేయుచున్నది.

"సకియ నాభియమున నుండి జవ్వనంబు
బాలకృష్ణుండు వెడలింప బయలు పడిన
కాళియ ఫణీంద్రుఁడేమొ రోమాళిమధ్య
విష్ణుపదమున కణగిన విధము గలిగె" —పాండు. 3 - 185

ప్రకృతి చేయు తపస్సున హేమంత వసంతాది ఋతుశోభ లభివ్యక్తమగుట యెంతయు సహజము. ఈ కావ్యమున ఋతువర్ణనము వరుసగా, విస్తృతముగాఁ జేయఁబడిన దీ పట్టున మాత్రమే. శరదృతువున నంతర్యామి యగు నారాయణుఁడు మేల్కొనుట పురాణప్రసిద్ధము. రాధకు శ్రీకృష్ణుఁడు ప్రసన్నమైనది శరదృతువుననే. శరదారంభమునకు సంవత్సరము సగము పూర్తి యగును. ప్రకృతియగు రాధను శ్రీకృష్ణుఁ డర్ధ శరీరముగా "నద్రిజ నేలిన శూలి పోలిక" నాదరించినాఁ డనుటలో ధ్వనిగర్భితమైన కథోన్మీలన మెంత యున్నదో గమనింపఁదగును. ఈ పట్టునఁ గథోన్మీలనమే గాక కథాతత్త్వార్థముల యున్మీలనము గూఢ ఘట్టముల వరుసలో, నలంకారములలో, గవిసమయములలోఁ గడు ప్రసన్నతతో విప్పారినది.

రాధ తపమ్ము ఫలించిన వెనుకఁ బుండరీకుని తపస్సు ఫలోన్ముఖము కానవచ్చినదని చిత్రించుట కవి ప్రతిపాదింపఁదలఁచిన ముఖ్యాంశము. ఇట నుండి నారదునకు సరళముగా సూటిగాఁ బుండరీకుని కథ చెప్పఁబడినది. పుండరీకుఁడు తపస్సమాధి నిమగ్నుండై యుండుటతోఁ గథ యారంభించును. కుమారస్వామికిఁ జెప్పిన కథ పుండరీకుని యమనియమాది సాధనములతో నారంభించును. సర్వమునందును బరమేశ్వరుని యంతర్లీనతను జూడఁగల కుమారస్వామికి పుండరీకుని కర్మయోగ సాధనమైన గృహస్థాశ్రమ నిర్వహణ కథయుఁ దన్మార్గమున నతఁడు చేసిన తపస్సును వివరింపఁబడినవి.

"చలిచీమ నేనియుఁ జాఁద్రొక్క శంకించుఁ బలుకఁ డెన్నఁడు మృషా
భాషణములు
కలుష వర్తనులున్న పొలముపొంత జనండు కలిమి కుబ్బఁడు లేమిఁ
గలఁగఁడాత్మఁ
దలయెత్తి చూడఁడెవ్వలనఁ బర స్త్రీల ధైర్యంబు విడఁపెట్టి
దద్దఱుటల
నొరుల సంపదకునై యుపతపింపఁడు లోన నిందింపఁ డెంతటి నీచునైన
మిన్నకయ చూడఁ డాకలి గొన్న కడుపు, సర్వభూత దయోదయోత్సవ
మొనర్చు
నిగమ ఘంటాపథైకాధ్వనీన బుద్ధి, బ్రహ్మ విద్యానవద్యుఁడు
బ్రాహ్మణుండు".

—పాండు. 2 – 6

పుండరీకుని కర్మయోగ సాధనలో మాతాపితృసేవనము, కుటుంబ పరిపోషణము గూడ నుపాస్యదైవము యొక్క యంతర్యామిత్వ మందినవి. అతఁడు "పరిచారికాసహస్రమయి పితృయుగమును సంభావించు గృహమేధి వతంసము". ఇట్టి సాధనకు "నిజమహిళామణి యప్రతీపమతిని దోడ్పడుట" సంభవించినది. ఈ స్థితి నందిన తపస్వికిఁ గావలసిన దొక్కటే. అది తన ప్రేమను, బోషణమును జారఁగొను నాశ్రితులయెడల రావలసిన నిర్లిప్తత. పుండరీకుని నిస్సంగస్థితి నెంత వ్యంగ్యముగాఁ జెప్పినాఁడో తెలియఁదగును.

"పరలోకావన సుఖా
దరపరతం జనిన తల్లిదండ్రుల కొసఁగెన్
గురుభక్తి నిగుడు కొడుకతి
కరుణామతి గంగ నస్థి, గయఁ బిండంబున్.
ప్రేయసివలనఁ బ్రబోధ వి
ధేయమతుల సుతులగాంచి తీర్చెఁ బితౄణం
బాయయ్యె, తదీయంబగు
ప్రాయపుఁ బ్రొద్దంతఁ గొంత పడమరఁ దిరిగెన్.
భాషావిభు నిభుఁ డమ్మని
యీషణ దూషణమొనర్చి యిలు మరచి మదిన్

శేషఫణి శయనుఁగను నభి
లాషోన్నతిఁ జేయుఁ దప మిలాధరతనయా" -పాండు. 2-26, 27, 28

ఇటనుండి రెండుతావులందలి పుండరీకుని కథయు నొకే రీతిని నడచినది. వాని తపస్సునకు మెచ్చి విట్ఠలుఁడు ప్రత్యక్షమయ్యెనని కుమారస్వామికిని దొలుత బ్రహ్మ ప్రత్యక్షమై పుండరీకుని భక్తికి సంతసించి వరము లొసఁగి కృష్ణుఁడు ప్రత్యక్షము కాఁబోవుచున్నాఁడని చెప్పి వెడలినట్లును నాఁటికి మూఁడవ నాఁడు పాండురంగఁడు ప్రత్యక్షమైనట్లు నారదునకును జప్పినాఁడు పరమేశ్వరుఁడు. పుండరీకుఁడు బ్రహ్మయందును, విష్ణువును జూచినాఁడు. బ్రహ్మను జేసిన స్తోత్రమంతయుఁ బరమాత్మస్తోత్రమే. బ్రహ్మ ప్రసన్నుఁ డగుటవలనఁ దన గమ్యము సమీపమైనదని పుండరీకుఁడు స్తుతించినాఁడు. భాస్కరోదయమునకు అరుణావిష్కృతివలె, వర్షమున కింద్ర ధనుస్సువలె, మంత్రమున కోంకారమువలె విష్ణుదర్శనమునకు బ్రహ్మదర్శనము కలిగినదని గొనియాడినాడు. ఇది వినుచున్న నారదునకుఁ దన తండ్రి యింతవాఁడని శివుని ముఖమున వినుట ముదావహమై త్రిమూర్తుల యభేదమును బ్రతిపాదించు నానందము పొటమరింపకుండునా? మాతాపితృ సేవనమున యోగ సాధన జేసిన పుండరీకుఁడు బ్రహ్మయందు విష్ణువును దర్శించుటయు సహజమే.

పుండరీకుఁడు కోరిన వరములు, వాని తపస్సాఫల్యము రెండు తావులయం దొకేరీతిని జెప్పబడినను మొదటికథలో సంగ్రహముగను రెండవకథలో విస్తృతముగను జెప్పఁబడినది. ఈ విస్తృతి విష్ణుముఖమున జరుగుటవలన క్షేత్ర తీర్థదైవత ప్రశస్తికి విలువ పెరిగినది.

నారదునకుఁ జెప్పిన కథలో శివుఁడు పాండురంగని నొక సుదీర్ఘమైన దండకమున వర్ణనాత్మకముగా స్తుతించినాఁడు. నారదుని ధ్యానము కొఱకిది యుపదేశింపబడినది కావచ్చును. మొదటి కథలో బుండరీకుఁడు దశావతారస్తుతి చేసినట్లున్నది. రెండవకథలో వివిధచ్ఛందస్సులలో వేదమయరూపునిగా స్తుతించినట్లున్నది. మొదటి పద్ధతి పురాణాగమసమ్మితము. రెండవపద్ధతి వేదసమ్మితము. రెండును రెండు తావులయందు న్యాసము చేయఁబడుట కథాకథనమం దొక మెలకువ. పాఠకులకు దీనివలన నొక సరళతయుఁ బ్రతిపాదితాంశ మధ్యస్త మగుటయు సిద్ధించును.

ఈ కథయందలి శ్రోతలలో నారదుఁడు జ్ఞానయోగమునకును, గుమారస్వామి భక్తియోగమునకును బ్రతీకలు. కథానాయకుఁడగు పుండరీకుఁడు కర్మయోగసాధకుఁడు. పరిప్రశ్నమును వరముగా గొని సముచిత సమయమునఁ బ్రబోధన మొనర్చిన పార్వతి జిజ్ఞాసకు చిహ్నము. పరమేశ్వరుఁడు జీవులకు మోక్షద్వారమగు తారకము. పాండురంగఁడు గమ్యము. ఈ యంశమును విన్యాసము చేయుటకే యిందలి కథాకథనములోని ప్రతి సూక్ష్మాంశసమున్మీలనమును దోడ్పడుచు వచ్చి కథను సమ విభక్తాంగమైన యొక మూర్తిగా రూపొందించినది.

అయుత నియుతోపాఖ్యానము

ఈ కథ యొక్క యర్థవాదము. దీని ప్రధాన లక్ష్యము "గృహమేధి ధర్మంబు కంటె మేలు కలదె" యను పరమేశ్వరుని సందేశము. నారదునకు గృహస్థాశ్రమముపై నొక చిన్నచూపున్నది. అది తుదివఱకు వాని మనస్సును వీడలేదు. దానిని బోగొట్టుటకే శివుఁడు సుశీలోపాఖ్యానమును జెప్పినాఁడు. సుశీలయు భర్తయు నొక విశేషకారణముచే దరించి యుండవచ్చును గాని వారి సంతతికి మోక్షము సులభముగా నెట్లబ్బినది యను సందేహము నారదునకు విడలేదు. నారదుని జిజ్ఞాస యతి మాత్రము. ఒకేమాఱు పెక్కువిషయముల నడిగి తెలిసినందవలెనని యతని యాశయము. కనుక పై సందేహముతోపాటు తా నెప్పుడో విని యున్న యయుతుని వృత్తాంతమును గూడ నడుగవలె ననిపించినది. రెండిఁటిని జోడించి నారదుఁ డిట్లు ప్రశ్నించినాఁడు :

"....... ....యా సుశీల
పుత్రు లేచందమున మోక్షమునకు జనిరి
ప్రయుతనందను డెవ్వఁ డేపగిది నతఁడు
నృహరి కృప గాంచె......" —పాండు. 5–159

పతితుఁడగు నిగమశర్మ ననుగ్రహించిన నరసింహుని కరుణ వింతయై దోచినది నారదునకు. పుణ్యాత్ములకు మోక్ష మిచ్చుట భగవత్కరుణయే గాని కరుణా విశేషముగాదు. ఈ నృసింహుని కరుణ చాల యపారమైనదిగాఁ గనుపించినది. కనుక నారదుని దృష్టి యా వేలుపునందే మిక్కిలిగా లగ్నమగుట సహజము. ఒక విధముగా నయుతుఁడు గూడఁ బతనము నొందినవాఁడే గదా! అతఁడును నిగమశర్మవలెనే నృసింహుని కరుణచేతనే తరించుటను విని నారదుఁ డిట్లు ప్రశ్నించి యుండవచ్చును.

పై రెండు ప్రశ్నలలో సుశీల పుత్రులకుఁ బాండురంగని యనుగ్రహమున సారూప్య సాయుజ్య స్థితులు గల్గినవని చెప్పుటకు వారు "తత్తనూగ్రామంబెక్కిరి" యని శివుఁడు తెల్పినాఁడు. సుశీల బిడ్డలు సమస్తైశ్వర్యములతో సుఖముగా జీవించి మఱియు ముక్తి నందిరని చెప్పినాఁడు. నారదునకు సందేహము మరలఁ దలయెత్తినది. సంపద లైహికములు గదా! ఆలు, బిడ్డలు, బంటు. బైద, మూలధనార్జనము మోక్షమున కెట్లుపకరించును? వానివలన హాళి మనమునఁ బెరిగి, దర్పము గళదఘ్నముగా నేర్పడు నవకాశ మున్నది. అట్టి వారికి ముకుందుఁడు మోక్ష మిచ్చినచో "నింకేల కలానమేల జడలేల కమండలు వేల దండమున్?" అని నారదుఁడు ప్రశ్నించినాఁడు. ప్రశ్నించు పద్ధతి మోటుగా నున్నదని గ్రహించి కాఁబోలును మరలఁ దానే—

"వార లటుఁగాక కారణ
పూరుషులై యట్టి సతికిఁ బుట్టుట నౌతుదిన్
జేరిరి గృహస్థులయ్యును
సారసదళ నయను మేని సాయుజ్యంబున్" —పాండు. 5–163

యని సద్దినాఁడు. వాని సందియము దీర్చుచు శివుఁ డిట్లు విడమరచి చెప్పి వాఁడు :

"నీ వనినయట్లె వారలకుఁ బురాకృత పుణ్యసంపదవలన మునులకు దుర్లభమైన విష్ణుని మేనఁ గలయఁగల పూనిక యావహిల్లినది". పూర్వపుణ్యము వలనఁ గల్గినది మోక్షముకాదు. దానికిఁ గావలసిన పూనిక. ఇట్టి సత్కర్మ వాసనావశమైన సత్సంకల్పము కలుగుటలో వారికొక ప్రత్యేకత యున్నదని తలఁప నక్కరలేదు. "వారె యేల ? యెవ్వారు గృహస్థధర్మవశవర్తులు వారల పొమ్ము ముక్తియున్ " అని గృహస్థ ధర్మమునకు ముక్తి సర్వసామాన్యమైన పర్యవసానమే యనుచు శివుఁడు మరల నొకమాఱు బ్రహ్మచారియగు నారదు నెత్తిపొడిచినాఁడు. ఈ గృహస్థధర్మమును న్యూనముగాఁ దలఁచి యెవఁడు దారి తప్పునో యతఁడు పతనమందునని గట్టిగా నిరూపించుటకే యయుతుని కథ చెప్పినాఁడు. ఈ యంశమునే మరువకుండ కథ నడుమ మరల వాధూలుని ముఖమున నిట్లు రెట్టించినాఁడు :

"జలధరం బననెద్ది పొలపంబు పుట్టించు, నిల్లాలిమెఱుఁగుల మొల్లములకు
మున్నీరనఁగ నెద్ది మొలచుట కావాల, మాణిపూసలువోణి యాత్మజులకు
నీడఁ్రమాఁకననెద్ది నిలువ నీడై ్రోఁచు, నాఁకటనుండు ద్విజావళులకుఁ
దాఁవనఁగ నెద్ది యాధారమౌ దివిఁ్రాఁకు, పితృవర్యులకుఁ
గుంటిపిచ్చుకలకు
నట్టి గృహమేధిధర్మంబునందునీవు, గుత్ససేయుటనీరీతిగొడవ యొదవె
నొప్పుగతి నొప్పదని పల్కు నుద్ధతులకుఁ, గసరి, పైవచ్చు
టాళ్లపైగాలియైన"

"ఏనింతవాఁడ నేనయి
పూనుదునఁట యెద్దికాక పోయెదు నని నుం
తైన ఫలమందఁ దీరదు
మానవులకు కాదు విను మమర్త్యులకైనన్"
—పాండు. 5 - 261, 262

శాస్త్రమునందలి విధి నిషేధముల ప్రాధాన్య మిందుఁ జూపఁబడినది. శాస్త్రముల గ్రంథములు మానవ నిర్మితములు గావచ్చును గాని యందలి రహస్యములు దేవతలచేఁ గూడ నిర్మితములు గావు. ధర్మము దైవముతోపాటు శాశ్వతము, నిర్వికల్పమునై యొప్పారును.

కథాంతమునఁ గూడ మూఁడవమా టీ గృహస్థధర్మ పవిత్రతయే నొక్కి చెప్పఁ బడినది.

"గృహమేధి ధర్మవర్మా
సహమతియగు కుమతి యయుతు చందమున సుదు
స్సహదుఃఖ గ్రాహానన
గుహఁబడు నని వింటి మును ముకుందుని చేతన్"—పాండు. 5 - 318

ముకుందుఁడె స్వయముగా నీ విషయమున నేకీభవించుచున్నాఁడని చెప్పుచున్న శివునిఁ గూర్చి కవి "పార్వతీనాథుఁడు" అని వ్యవహరించుట సాభిప్రాయము. నారదుఁడు కూడ నొక్కమాఱు సంసారమునఁ బడినట్లు పురాణములు చెప్పుచున్నవి కదా! ఇట్టి యాపదనుండి తప్పించు నుపాయము కొఱకుఁ జెప్పఁ బోవుచున్న కథ యగుటచేత "ఏనోహరమొక్క యుపాఖ్యానము గల దేతదర్థము. అదియును వినిన నీ మనమున నూనిన జడ నుడుగును" అను శివుని పలుకులలో నీషత్ప్రభావస్ఫురణ లీలగాఁ దోచును. ఇట శివుని యుగ్రుఁడని కవి వ్యవహరించుట గూడ సాభిప్రాయమే.

ఉపదేశింపఁబడిన ధర్మము బ్రహ్మచారికిఁ గటువుగా నున్నను గర్వపడక వినయముతో స్వీకరింపవలెను. గర్వము భంగకారణము. ఈ యంశమును గూడ నుపదేశించుటకే యగస్త్యమహర్షి కలఁడని చెప్పుటకు శివుఁడు —

"వింధ్య మమరాద్రిపోటికి వివిధ తార
కములు మొలపూసలుగఁ బెరుఁగ మదిఁదలఁచె
నెన్నఁ డఁటమున్ను కాశిలో నన్నుఁగొలిచి
ఘటజమగు తేజ మింపొందు నుటజమునను" —పాండు. 5 – 168

అని డొంకతిరుగుడుగాఁ జెప్పుట. సృష్టిలో నెంత బలవంతుఁడైనను గర్వపడుట యారంభించిన కాలమునకు ముందుగనే వాని గర్వ మడఁచువాఁడు పుట్టి యుండునఁట. ఇట గర్వ మడఁచు వాఁడు నన్నుఁ గొలుచుచున్నాఁడని శివుఁడు చెప్పుటవలన నీ కథలోని సారాంశ మనుల్లంఘనీయమని సూచన.

అయుత నియుతుల ప్రాశస్త్యము నుగ్గడించుట కవిచేయుటలో సొగసు లేదు. అగస్త్యుఁ డే తనలో నీ శిష్యులను గూర్చి మెచ్చుకొనుచున్నట్లు చెప్పుటలో నా శిష్యుల యున్నతి, పాండిత్య విశేషము, నిష, గురుప్రేమను జూరఁగొనిన పాత్రత, యగస్త్యుని శిష్య వాత్సల్యము, రామకృష్ణుని నాటకీయపాత్రచిత్రణ లోని నైపుణి యొక్కమాఱుగా సిద్ధించినవి. అంతియే కాదు. అంతటి శిష్యులైనను గురునాజ్ఞను, శాస్త్రవిధానము నల్లంఘించినచోఁ బతనము తప్పదని యందు భావింపఁబడినది.

"ఈ నా శిష్యులలోని వీ రిరువురున్ వ్యాఖ్యాన పద్యోదయ
జ్ఞానానూన విచార వాగ్విభవ తేజఃక్షాంతి కాంతి ప్రధా
నానాద్యంబునఁ గానిపించెదరు మత్ప్రాశస్త్యముల్ వీరి స
న్మానింపం దగుఁ బాణి పీడన విధాన శ్రీల వాలాయమున్"
"వాసోనిగ్రహ మెన్న రాఁకలియు నీర్వట్టున్ గణింప ర్తలల్
మానెంగా యన రంగము ల్వడలిన న్పాటింప రట్టుండనీ
యాసాయంబుగ నానిశాత్యయముగా నామ్నాయముల్ ఘోల్చుచో
వాపీన ప్రచలాయితంబయిన లేదాహా వితర్కింపఁగన్"

—పాండు. 5 – 170, 171

ఇందలి దీర్ఘ సమాసములు శిష్యుల దీర్ఘ నిష్ఠకు సూచకములు. అందలి గాఢ పద బంధము వారి యుద్యమమునందలి దృఢత్వమునకు వ్యంజకము. పరుషాక్షరములు విద్యకై వారోర్చిన శరీర కష్టమునకు జ్ఞాపకములు. "తేజఃక్షాంతి" మున్నగు ప్రయోగములు వారి ప్రవచన శుద్ధికి ద్యోతకములు. "గణింపర్తులల్" అను ప్రయోగము సడలని వారి పట్టుదలకు స్ఫోరకము.

శిష్యులకు వధువులను దెచ్చుటకై యగస్త్యుఁడు సత్యలోకమున కరిగెను. అది యంత సులభమా? అతఁడు సత్యవ్రతుఁడఁట! వాని శీలమునుబట్టి యది సులభమే. సత్యలోకమునందు బ్రహ్మ తొలుత సరస్వతీ సహితుఁడుగఁ గనుపించినాఁడు. అందలి తక్కిన విశేషములకన్న వారి దాంపత్యమే తొలుత కనిపించుట కథాగతి కుపస్కారకము. అగస్త్యుని దృష్టి దాంపత్యధర్మము నొడఁగూర్చుటయందు లగ్నమై యున్నది గదా!

అయుతుఁడు పెండ్లి కంగీకరింపనవుడు నియుతునికే యిరువురు కన్యలను బెండ్లిచేసి యగస్త్యుఁ డయుతుని వెడలఁగొట్టెను. కోపమున నిగ్రహము లేని వాఁడైనచోఁ దొలుత నయుతుని వెడలఁగొట్టి నియుతునకు వివాహము చేయును. ఇది కథనము నందలి మెలకువయే గాక యగస్త్యుని గంభీరతను, సంయమమును బరిపోషించుటయు నగును. అగస్త్యున కున్నది విధి విధాన కార్య నిర్వహణ దక్షతయే గాని పట్టరాని కోపము కాదు.

ఇరువురను బెండ్లియాడిన నియుతుఁడు చెడిపోయెనా? గురువచనమును బాటించువాఁ డెట్లు చెడిపోవును? ఈ సంఘటన నియుతుని సమబుద్ధిని బరీక్షించి విడిచెనను కథాంశము "అతివలందు నిలిపె సమబుద్ధి ప్రియమూని నియతమౌని" యను వాక్యమున నున్నది. సంగ్రహ పద్ధతిలో సమగ్రమగు కథాగమన వేగము చెడకయే యింతటి పాత్ర పోషణము చేయుట వింత. నియుతుని సమబుద్ధితో పాటు వాని భార్యల యోగ్యత గూడ నగస్త్యుని కార్యదక్షతకు నిదర్శనము కానిచోఁ గథనము సమగ్రము కాదు. ఈ సమగ్రత సిద్ధించుటకు బ్రహ్మతనయల వరన మావశ్యకము. వివాహానంతర మీ వర్ణనము చేయఁబడుట యాఖ్యానౌచితిని బెంపొందించినది. ఆ మగువలు మిక్కుటమగు శరీర సౌందర్యము కలవారగుట నియుతుని మోక్షసాధనమునకుఁ బ్రతిబంధము గాదు. చిత్తగతి, భావము, ఆశయము, అంతరంగము, భార్యలయందు భర్తలకు లభింపవలసిన ధర్మసాధన సంపత్తి. దీని కనుగుణముగనే వీరి వర్ణన మున్నది.

"కుటిలాలకములు చీఁకటి ప్రోగులగు నైనఁ జిచ్చంద్రికాఢ్యముల్ చిత్తగతులు
మధురోష్ఠములు రాగమహితంబులగు నైన, భావముల్ వైరాగ్యబంధురములు
గురుకుచంబులు గర్వభరితంబులగు నైన, హతదుర్వికారంబులాశయంబు
లలవోక నడలు మాంద్యమయంబులగు నైన, నంతరంగములు బోధాస్పదములు

పొగరుఁ జూపులు చపలంబులగున ట్టైన, నిండుమనములు మిక్కిలి నిశ్చలంబు
లపుర వీరల కననొప్పు నతివలందు, నిలిపె సమబుద్ధి ప్రియమూని నియుతమౌని"
—పాండు. 5 – 180

గృహస్థుఁడై కర్మయోగ సాధనమున లక్ష్యమును సాధించిన పుండరీకుని భార్యను గూర్చి "నిజమహిళామణి యప్రతీపమతిఁ దోడ్పడఁగన్" అని సంగ్రహముగాఁ జెప్పఁబడిన యంశమే యిచ్చట విస్తృతము చేయఁబడినది. నియుతుని సమబుద్ధి యనుట కేవలము దక్షిణ నాయక లక్షణముననే గాదు. పై వర్ణనమునఁ బ్రతిపాదమందును బూర్వార్థమున భౌతిక సౌందర్యము నుత్తరార్థమున సంస్కార లాలిత్యమును బొడకట్టఁజేసి యీ కవి నియుతున కా రెండంశము లందును సమబుద్ధి నిలిచెననియు, నతఁ డిహపరార్థసాధకుఁ డయ్యెననియు నొక ప్రధాన కథాంశమును వ్యంగ్యముగా నిరూపించినాఁడు. ఇట్టి ప్రతీతి కవికులతిలకుల కోవకుఁ జెందినది.

రఘువంశమునఁ గాళిదాసు దిలీపుని ప్రయాణమును వర్ణించుచు నడుమ నొక దృశ్యమును –

"పరస్పరాక్షి సాదృశ్య మదూరోజ్ఝితవర్త్మసు
మృగద్వంద్వేషు పశ్యంతౌ స్యందనాబద్ధదృష్టిషు" —రఘువం. 1 – 40

అని వర్ణించినాఁడు. ఇందు రాజదంపతులు రథమున దృష్టి నిలిపిన లేడి జంటలయందు నక్షిసాదృశ్యమును గనుగొనిరట !

ఆ దంపతులు జింకల కన్నుల సాదృశ్యమును దమయందుఁ బరస్పరము చూచుకొనిరో, జింకల జంటలయందుఁ జూచిరో, తమ్ముఁ జూచుటవలన జింకల కన్నుల కా సాదృశ్యము భ్రమరకీట న్యాయమున సిద్ధించినదో యను నంశమును సహృదయుల యంతరంగములకే ప్రతీయమాన మగుటకుఁ గాళిదాసు విప్పి చెప్పక రథమును బురోగమింపఁజేసినాఁడు. ఇందలి పరస్పరాక్షిసాదృశ్యముతో సాదృశ్యము చెందినది నియుతుని సమబుద్ధి.

వెడలఁగొట్టబడిన "మునుపటి యాతఁడు" — అయుతుఁడు — "హృల్లగ్న గురుకృతానాదరుఁడు" అయినాఁడు. ఇది గురుకృతానాదరము కాదు. అనాదరము గురువే చేసెనని యతని హృదయమున లగ్నమయిన భావము. వాస్తవమునకు గురువు నవాదరించినది తానే. ఎట్టకేలకు శీతనగమునకుఁ జేరినాఁడు. ఏకాంతము, స్త్రీలతో దూరము, భౌతికముగ లభించినది గాని, మనోగత మెట్లు మారును? హిమాలయవనప్రాంతములందు వానికిఁ జిలుకలు, కమ్మతెమ్మెరలు, తేంట్లు గోచరించినవి. శీతమయూఖుఁ డెందున్నను గనిపించును. వాని మనోగతి కవి యన్నియు "నవవిల్తు సాధననికాయము" గాఁ బొడచూపినవి. అంగనాకుల ములా సాధనములకు వేలము పట్టులని జ్ఞప్తికి వచ్చినది. మఱల స్త్రీలపైఁ గోపించుచు వారినే తలచినాఁడు. సిగ్గులేనివారై కొందఱు దొరలుకూడ స్త్రీతృష్ణ

విడువక వీతరాగులమని విఖ్యాతిఁగుదురని నిందించినాఁడు. హిమాలయమునకుఁ బోయినను స్త్రీస్మరణము, స్త్రీభీతి, గురునిందయు వాని మనస్సును వదలలేదు. ఉపమానముల వ్యాజమునఁ గుచకుంభయుగము, నిడుఁజూపు, నతనాభి, నూగారు వాని మనస్సును వేఁటాడినవి. మదనుని వైభవముపై నతని మనస్సు వైరభక్తి వహించినది.

పట్టుబట్టి తపస్సారంభించినాఁడు. ఆ పట్టున నతఁడు జటిల వ్యాఘ్రమఁట! ఈ యుపమానము రామకృష్ణుని పరిహాస కుశలతను, వికట కవిత్వమును దెలుపుటయే కాక యయుతుని సాధనలోని హఠమును సూచించును. ఈ హఠమున "ననాఘ్రాతపుష్పము చందంబగుమేను" నియమములను మంగలమున గ్రుగ్గించినాఁడు. ఇక నిట్టి యసహజ తపస్సును జేయువానికి నాదితత్త్వ మెట్లు దీపించును? "ఆదితత్త్వము దీపింపఁ దపం బొనర్చు" నను వాక్యమున మోస మున్నది. "దీపింపన్" అనఁగా దీపించునట్లుగా నని యొక యర్థము. దీపించుట కోరకని యొక యర్థము. ఈ శ్లేషలోని రెండవ యర్థమే కావలసిన కథాంశమును ముందునకు నడుపును. తపస్సున వేడి పుట్టి స్వర్గము పర్యంతము లోకములలో నిప్పులు కురిసినవి. భూమి కంపించినది. ఇంద్రునకుఁ దల తిరిగినది, కోపించి తపస్సు భంగము చేయుటకు దిగి వచ్చినాఁడు. రాధాపుండరీకుల తపస్సుల వలన వేడి పుట్టదేమి? ఇంద్రుడు దిగి రాఁడేమి? వారి తపస్సులలో గురు ధిక్కారము కాని, రాగద్వేషములు గాని ఫలాసక్తి కాని లేవు. అయుతుని మోక్షకామము వాని మోక్షమునకుఁ బ్రతిబంధకమని ఈ కథాకథనమందలి సమన్వయగతమైన గర్భితాంశము. రామకృష్ణకవి మతము ప్రకారము తీవ్ర వాంఛాపరుల తపస్సును భంగ మొనర్ప జూచువాఁడే కాని ఇంద్రుఁ డపకారి కాఁడు. ఈ కథలో నింద్రుఁడు, కామధేనువు, వాధూలమహర్షియు వరుసగా నయుతుని పతన కారణములైనారు. అందు వాధూలుఁడు పూర్తిగా నెగ్గినాఁడు. ఈ ముగ్వురు నయుతునకుఁ గలిగించినది పతనమా, జ్ఞానోదయమా యను ప్రశ్నకు వాధూలుని వాక్యములే సమాధానము. అపకారము చేయుట వేఱు, దండించుట వేఱు. పాపున కపకారము జరుగును. దారి తప్పినవానికి దండనము జరుగును. మొదటిదానివలన హానియు, రెండవదానివలనఁ బాపనాశము కలుగును. అయుతుని లక్ష్యము దుష్టము కాదు. అతఁ డవివేకి కాని పాపి కాఁడు. వాని ధర్మోల్లంఘనము వాని జిజ్ఞాసనే తెలియజేయును. కనుకనే వాధూలుఁడు "వత్స! వినుము, నా భావపథమున విన్ను నపాపునిగాఁ గనుగొంటిని. నా కోపమున మీఁ దరయ లేక ఇటు లాడితిని" అని యూరడించినాఁడు.

"వగవకుమన్న, దైవగతి వచ్చిన కీడు దలంచి నెమ్మదిన్
బొగులకుమన్న, కర్మములపోకకు భోగమె హేతువన్న ..."

పాండు. 5–260

అని యోదార్చినాడు. శాపము నొందుట కూడ పూర్వకర్మఫలమే.

"గృహమేధి ధర్మంబునందు నీవు
కుత్ససేయుట నీరీతి గొడవ యొదవె
నొప్పునది యొప్పదని పల్కు నుద్ధతులకుఁ
గసరిపై వచ్చు బొళ్లపై గాలియైన" —పాండు. 5-261

ఇది అయుతుని పూర్వకర్మము. దానికి ఫల మతని శప్తస్థితి. ఒక యాడుకప్ప యందు సంతానము వడయుటతో శాపమోక్ష మగును. అయుతునకు శాపమోక్ష మనగాఁ గేవల మోక్షమే. వానికిఁ గల సంస్కారమునకు గృహమేధి ధర్మ వైముఖ్యమను లోపము లేనప్పుడు మోక్షమున కభ్యంతరములేదు. అగస్త్యుని శిష్యత్వమున లభించినది మోక్షసంస్కారమే గాని పూర్వకర్మ సంస్కారము గాదు. ఇక నింద్రుఁడు, కామధేనువు, వాధూలుఁడు చేసిన దేమి? గురువాక్య ము ననాదరించిన శిష్యునిచే గురువు చెప్పినట్లు చేయ నంపినారు. ఈ నడుమఁ గలిగినది కర్మయుఁ దత్ఫలము. ఈ విశిష్ట కథాకథనమున సృష్టిలో నింద్రాది దేవతలయు, వాధూలాది ఋషీంద్రాదులయుఁ గర్తవ్య మెట్టిదో చక్కఁగా వ్యాఖ్యానము చేయఁబడినది. ఈ కథలోని యింద్రుఁడు విశేషమైన పవిత్ర కార్యభారము కలవాఁడు.

ఇంద్రాగమన వృత్తాంతమునందలి కథాకథనము సత్వగుణప్రధానమై స్వభావోక్తులతో నిండి సరళమై నన్నయ్య కథాకథనమునం దీ కవికిఁ గల భక్తితాత్పర్యములను వెల్లడి చేయు చున్నది. "కీర్తిధవళ నన్నయభట్టాది కవులఁ దలఁతు" నని యా కవి యవతారికలోఁ జెప్పిన మాట యిందు సార్థకమైనది. ఇంద్రాయుతసంవాదమునందలి సంభాషణాత్మక కథోన్మీలనము రామకృష్ణుఁడు కావ్యముఖమునఁ దిక్కన సోమయాజికిఁ జేసిన శుశ్రూషను దెలియఁ జేయుచున్నది. ఈ సంభాషణలో నితఁడు పాటించిన యౌచితి గణనీయము. ఇంద్రుని సంభా షణము సత్వగుణ ప్రధానముగను, నయుతుని సంభాషణము రజోగుణ ప్రధాన ముగను సాఁగినవి.

"అఖిల ధర్మంబులందు గార్హస్థ్య మెన్న
నుత్కటంబగు తన్నిష్ఠ నోర్పు గలిగి
జగతిఁ దీర్ఘాచరణ బుద్ధి సంచరింతు
ధ్రువతపోగామి! యీ మేను ధ్రువముగాని" —పాండు. 5-195

అను నింద్రుని పల్కులలోఁ బెద్దల సంభాషణలోని ప్రసన్నత, పండిన వేదాంతము, తన ధర్మాచరణమున దనకుఁ గల కించిదాత్మాదరణము గోచరించును. "ధ్రువ తపోగామి!" యను సంబోధనలో నీ వయస్సున నీ తపోధ్రువత్వ మెంతతడవు నిలచునో చూచెదనను నవాదర మున్నది. కొంత తడవునకు దాని నిట్లు విడమరచి గూడఁ జెప్పినాఁడు.

"చలనవిహీనవృత్తి నడిసన్న పరాశరుఁ డాదియైన య
య్యల యల జాతివంటి హృదయంబులు నీరుగఁ జేయు బోయ పూ
విలుతున కెంత దొడ్డపని వెన్నెల బిడ్డని కాసినంతలో
చలన కరంగి పొంగు పసిబాలుర చిత్తము మెత్త చేయగన్"
—పాండు. 5-212

ఇంద్రుఁ డయుతుని బహువిధములఁ బ్రబోధింపఁ జూచినాఁడు. లాభము లేకపోయినది. "ఒకటికిఁ బదియుఁ బదింటికి ఒక నూఱుగాగఁ దన యుక్తులకు బదులు" నొసఁగుచున్న యా వటుని మార్గమును మరలించుటకుఁ గామ ధేను ముఖంబునఁ గార్యసిద్ధిఁ బడయ నూహించి మాయలుపన్ని వెడలిపోయినాఁడు. ఇటఁ గథనమాపి శివుఁడు నారదుని మునిశ్రేష్ఠా యని ప్రత్యేకముగా సంబోధించి "తపము గావించువారిఁ గనిసఁ దలయేర్చుఁగాదెయాఖండలునకు" నని హెచ్చరిక చేయుచున్నాఁడు.

కామధేనువువలన సిద్ధింపని కార్య ముండునా? అయుతునకు ధేనువు మూలమున జడభరతుని గతి పట్టినది. తపస్సు సడలినది. శాపము కల్గినది. తపస్సు మానినను నయుతుఁడు కామధేనువును సేవించి పోషించెనుగదా! దానికిఁ దగిన సత్ఫలమునకు రామకృష్ణుని కథనము నందు దావులేదా? ఈ యంశము నున్మీలనము చేయుటలోనే కథాపరమార్థమునందలి యొక ముఖ్యాంశ మిమిడి యున్నది. శాపమువలన నయుతునకు లభించినది పాండురంగక్షేత్రావాసము. నృహరిపాదపద్మ సంసేవనము, గృహస్థాశ్రమ లబ్ధియు, మోక్షమును. కామధేను వింతకన్నఁ బ్రసాదింపవలసిన దేమున్నది? తపస్సునకు హిమాలయమందలి యేకాంతమే ఘనమనుకొనువానికి శాపమే లేనిచో మోక్షమే లేదు. గురువును పరిత్యజించిన వెనుక నయుతునకు మరల శాపకాలమునుండియే వినయ గుణము జతపడినది. ఇంద్రునితో శరించి పల్కిన యయుతుఁడు దెబ్బకు దయ్యము వదలినట్లు శాపము తగులగనే

> "కోపాటోప మడంపుఁ డీరలిగినన్ గొండల్వుఁడున్ వారిధుల్
> రూపేదున్ ధరవ్రయ్యు మిన్నొరఁగు మద్రూపంబు నానెంత, ని
> ష్ఠాపద్మాసన లెస్సంగాఁ దెలిసినన్ శాపాగ్ని చేఁగ్రాపవే"
>
> —పాండు. 5–253

యని వేడుకొనినాఁడు. ఈ సత్పరిణామమునకుఁ గామధేనువు కారణము కాదా?

శాపము నిచ్చి వాధూలుఁ డయుతునిఁ బౌండరీక క్షేత్రమునకుఁ బోయి నృసింహుని పాదకమలముల నాశ్రయింపుమని పల్కెను. శపింపఁబడిన యయుతుఁడు భేక మగుటకుఁ జాల కాలము పట్టినది. అతఁడు ప్రయాణము చేసి పాండురంగక్షేత్రము చేరి సర్వ దైవతములను దర్శించి నృసింహుని శరణు జొచ్చి యనుదినము సంగమ తీర్థమున స్నానమాడి వచ్చుచుఁ గొన్నాళ్లకుఁ గ్రమముగా నీర ప్రాంగణ బిలములందు నిద్రింప నిచ్చపొడముట మున్నగు భేకలక్షణము లలవడి తుదకు భేకమైనాఁడు. ఇట్టి నిర్వ్యాజమైన హాస్యగర్భిత చమత్కృతిగూడ రామకృష్ణుని కథాకథనమునఁ బెక్కుతావులందుఁ గనుపించును. అంతియే గాదు. రెండు విశిష్ట కథాంశములిం దిమిడియున్నవి. మొదటిది పండరీపురమునకుఁ బొమ్మని చెప్పిన వాధూలుని వాక్కులోని యాజ్ఞాబలము. రెండవది శాపావస్థను గూర్చిన రామకృష్ణుని శాస్త్రీయ వ్యాఖ్యానము, శాపము తొలుత తపోధనుల వాగ్బలమున మానసికముగా సంక్రమించును. పిమ్మట క్రమముగా అన్నమయాది కోశములకుఁ బరివర్తితమగును. మానవుని

మానవత్వము తొలుత మానసికము. జంతువులకన్న సారమైన మనోబలము వాని మానవత్వమును నిలిపి యుద్ధరించును. పతనోన్ముఖుడైనప్పుడు మానవుఁడు తొలుత "సారాపేత మనోబలుఁ" డై మిగిలిన మనోలేశమునకుఁ దగిన జంతువుల లక్షణమునందును ఆ లక్షణదేహమునకు సంక్రమించును. కావున నే సంకల్పమైనను సూక్ష్మలోకములనుండి స్థూలావరణములలోనికి వివృతమగును. బ్రహ్మసృష్టియు నిట్టిదేగదా! ఋషుల శాపసంకల్పలము గూడ నిట్టిదే యని రామకృష్ణుని విచిత్ర వ్యాఖ్యానము. ఈ వాఖ్యానము పురాణములలోని శాప వైఖరుల సంప్రదాయములకు సమాహార రూపముననే యున్నది.

అయుతుఁ డింద్రునితో సంభాషించుచు నావేశమున నొక యసత్యము పల్కినాఁడు. తన గురువు తనపైఁ గోపించి శపింపఁబోయి మరల నుడిగినాఁడని చెప్పినాఁడు. అగస్త్యుఁడు "కఠోర వర్ణముగాఁ బలుకొలయఁగ వెడల నడిచెను". పలికిన పలుకులు కఠినములే గాని మనసున శాపసంకల్పము లేదు. అయుతుఁడు తొందఱపడి యింద్రునితో నిట్లు లేనిది కల్పించి చెప్పుట యతని భవిష్యచ్ఛాప పాత్రతకు సూచకమని యిందలి కథాంశము.

కప్పలక్షణము లన్నియు నలవడిన వెనుకఁగూడ నయుతుఁడు మానవుఁడు గాఁ గొంతకాల మున్నాఁడు. ఆ కాలమున నృసింహుని మనసార ధ్యానించి నుతులు గూడ సలిపినాఁడు. ఆ నుతులలో నయుతునకుఁ గల్గిన మోక్షోన్ముఖ మగు పరిణామము ప్రపత్తిరూపముగ జిత్రింపఁబడినది. సడలిపోయిన మనోబలము కావున దైవదత్తము, దైవదర్శన యోగ్యమునగు సుప్రతిభ యతనిలోఁ బాదుకొనినది. తత్పూర్వమున్న మనోబలము రజోగుణము నాపాదించుకొన్నది గనుక నది సడలినప్పుడు గాని మానసాగోచరమైన వెలుఁ గితనికి గోచరింపలేదని యిందుఁ జిత్రింపఁబడిన కథాంశము. ఇట్లు లభించిన వెలుఁగగు జ్ఞానము మర్త్యులయందును మృగములయందును బహిరంతర్వ్యాప్తమై రక్షించుచున్నదని యితఁడు చేసిన "మర్త్యమృగాధినాయకా ! నరమృగరాజా !" యను సంబోధనలలోని మృగశబ్దగత శ్లేషచే నభివ్యక్తమగుచున్నది. తాను మృగము కాఁబోవుచున్నాఁడను పరితాపమున భవిష్యత్ స్థితియందుఁ గూడ దన్ను రక్షింపుమను నార్తి యీ సంబోధనలయం దిమిడి యున్నది. కప్పయైనవెనుకఁ గూడ నతని యగస్త్య శిష్యత్వ సంస్కారము సడలక "శిలూర చక్రవర్తి" గనే ఋషుల దినచర్యతోఁ గాలము గడిపినాఁడట ! భూబలమునఁ దిర్యక్కుగా జీవించి నను దినచర్య చెడలేదు. ఆ కప్ప నడవడికి ముచ్చటపడి యచటివా రందఱు హరిదాసమని పేరుపెట్టి పిల్చిరఁట ! ఆ కప్పకుఁ బూర్వజనన చరితజ్ఞతయు మోక్ష సౌఖ్యాపేక్షయుఁ జెడలేదఁట ! ఇట్లు వాని మోక్షమునకు నగస్త్యుఁడు, నింద్రుఁడు, కామధేనువు, వాధూలుఁడు తోడ్పడిన క్రమము నెచ్చటను వాచ్యముగా నీయక కథోన్మీలనముననే కవిప్రతీయమానము చేసినాఁడు. పై ప్రయత్నమునకుఁ బౌండరీక క్షేత్ర తీర్థ దైవత సాన్నిధ్యము చేయూఁత నొసంగఁగా సర్వము సంసిద్ధమైనది. ఇఁక వివాహమే మిగిలియున్నది. సకాలమునకుఁ "గాన్యకుబ్జ విభుని కన్యాశిరోమణి" పాత్ర నేపథ్యమునుండి సర్వలక్షణ లక్షితముగఁ గథలోనికిఁ బ్రవేశించినది. ఏ కారణము లేక రాకుమారి యెట్లు వచ్చును ?

"పౌండరీకనాథు పర్వమునకు" జనులతోఁ జూడ వచ్చెనఁట! పెద్దల పలుకువలన వివాహ మొల్లని వాని కెందఱు భార్య లొక్కమాఱుగాఁ గట్టఁ బెట్టఁబడినారో! సారవంతమైన రామకృష్ణుని హాస్య మిట్టితావులందు నెలకొనినది.

దేవాలయమునఁ గన్యకల విశృంఖల విహారము, వారి చాపల్య చిత్రణము తరుణీ జన సహజముగా మనోహరముగాఁ జిత్రింపఁబడినది. వారు శాపవశమునఁ గప్పలు కాకముందే వారి నాలంబనముగాఁ గొని శృంగార రసోద్దీపనము తిర్యగ్గతము గాకుండఁ బోషించుటలోఁ గవితాప్రపంచమున రామకృష్ణుఁ డెంతటి యుచితజ్ఞుఁడో తెలియనగును. రచన సూటిగా రసపోషణమునకు దిగినది. ఆలయములోనికిఁ గన్యల ప్రవేశమే "విరహిహృద్ధాములగు మారుశరములఁ" బోలిక నున్నదఁట! వయ స్సహజమగు నా పడుచుల చపలత్వము గూడ నయుతున కుపకరించు రీతినే యలవడుట దైవగతి. కప్పను జూచినప్పుడు వారి చాపల్యము హెచ్చినది. పన్నిద్దములు సడలి కప్పతో బంతులాట లాడినారు. చెంగలనున్న వృద్ధతపస్విజనుల నేల లెక్క చేయుదురు? వెంటనే శాపలబ్ధి యైనది. కన్యలు కప్పతో బంతులాడుచుండఁగా వారి నిరంతర స్పర్శవలన నతనికి హావ భావలై వివాహమున కున్ముఖత్వమేర్పడెను. అయినను వారలకు "దవులు పడకుండ" తప్పించుకొని యెగురుచుండె ననుటలో నిక నతఁడు సంసారభారము వహించి గూడ నిర్లిప్తుఁడు కాఁగలఁ డను వస్తుధ్వని యున్నది.

శాపస్థితియం దెక్కువ వర్ణన లేదు. ఉన్న యొక్క పద్యమునఁ బరమ పవిత్రమగు నతని దాంపత్యానురాగము చెప్పఁబడినది:

> "స్వాతి మేఘంబు వినుకులు వనధి శుక్తి
> వితతి ముయ్యాడునై మౌక్తికత వహించు
> కరణి నయుతుని ప్రేమ తత్కాంతలందు
> నిలచెఁ బర్యాయ పాత్రతా నియమ సరణి" —పాండు. 5-315

ఇచ్చటగూఁడ నగస్త్యుని శిష్యుఁ డనిపించినాఁడు. పాత్రత, నియమము ఋషి లక్షణములు. సుతోదయము కాలముననే "శాపపుటిరులును విరిసెను, జ్ఞాన చంద్రుఁడు గనుపట్టెను, విష్ణుపదము గానగవచ్చెను". విష్ణుపదము ధ్రువునికన్న పైనున్న స్థానమని భాగవతాది పురాణము లలో వర్ణితము. భాగవతులలో నయుతు డట్టి స్థానము నలంకరించెనని యొక యర్థము, మోక్షమును గూడ బొందెనని యొక యర్థము శ్లేషగతములై సిద్ధించును.

రామకృష్ణుని రచనలలోఁ బాండురంగ మహాత్మ్య మితని కావ్య సౌధమునకు గోపురము వంటిది. తత్కావ్య శిల్పమునఁ బాండురంగని కథ లన్నియు నంగాంగి భావమున గ్రథితము చేయఁబడినవి. ఈ కథల కథన మితని గోపురపు టంతరువుల పేర్పు. పుండరీకుని కథ సింహద్వారపు టంతరువు వంటిది. అయుత నియుతుల కథ శిఖరపు టంతరువు వంటిది. ఈ కథలోని కథన పద్ధతి సూక్ష్మసూక్ష్మముగాఁ బనితనము చూపి సువర్ణ కుంభము

రూపమును దాటి, సూదిమొనలో సూత్రస్థానమునందుండి గగననీలిమల నంటి, సూర్యపథమును దాటి, తన్మండల భేదన మొనర్చి ధ్రువపదము దాటి కావ్య లోకమున విష్ణుపదమందు నెలవుకొని నిలిచినది.

రామకృష్ణుని కావ్యములందలి పాత్రలు

రామకృష్ణుని కావ్యములందలి పాత్రలలోఁ గొన్ని పురాణ ప్రసిద్ధములు. అవి నారదుఁడు, నగస్త్యుఁడు, కుమారస్వామి, రాధ, పార్వతీ పరమేశ్వరులు. కొన్ని కవి కల్పితములు. అవి ధవళాంగుఁడు, నయుత నియుతులు సుశర్మ, సుశీలోపాఖ్యానమందలి సర్వపాత్రలు, మఱికొన్ని పాత్రలు పురాణములలోఁగాని, రామకృష్ణునకుఁ బూర్వము రచింపఁబడిన కావ్యములలోఁ గాని గల పాత్రల నాధారముగాఁ గొని నూతనముగా సృష్టించి పరిపోషణ చేయఁబడినవి. అవి యుద్భటుఁడు, ముంజభోజుఁడు, మదాలసుఁడు, వేశ్యమాత, నిగమశర్మ, పుండరీకుఁడు.

పురాణ ప్రసిద్ధములైన పాత్రలు సంప్రదాయము చెడకుండ నూతనముగా పరిపోషణ చేయఁబడినవి. ఈ యంశమున నితని పాత్రపోషణము "కళాపూర్ణోదయ" మందలి యుద్యమముతో నరిపోలును. పాత్రపోషణము, పాత్రసృష్టి యనునవి కవితాశక్తులలోఁ గడు దుర్లభములైన యంశములు. కావ్యదృష్టిలోఁ గవి కిందుగల బాధ్యత కష్టతరమైనది. సంప్రదాయసిద్ధములైన పాత్రలను స్వీకరించినపుడు తత్సంప్రదాయమున కెచ్చటను భంగము కలుగనీయక, పూర్వసూరుల పాత్రగుణములను మణిగణములయందు సూదితో సూత్రము చొచ్చుకొనిపోయినట్లు పోవుచునే స్వతంత్రముగాఁ దన ప్రతిభతో నట్టి పాత్రలకుఁ బ్రాణప్రతిష్ఠ చేయవలెను. అట్లుగాక యొక పాత్రను స్వతంత్రముగ సృష్టించినప్పు డాపాత్ర స్వభావము వికసించుటలోఁ బరస్పర విరోధము గలుగరాదు[1]

[1] "Either follow tradition or invent what is self consistent. If it is an untried theme you entrust to the stage, and if you boldly fashion a fresh character, have it kept to the end even as it came forth at the first, and have it self-consistent; " Horace 'Satires, Epistles, and Ars Poetics, H. Rushton Fairelongh, Loeb classical Library 1947, 119 – 130.

నారదుఁడు

"కళాపూర్ణోదయ" మందువలెనే "పాండురంగ మాహాత్మ్యము"నఁగూడ నారదపాత్ర కథకు సూత్రధారునివంటిది, తాత్త్వికము, జిజ్ఞాసాపూరితము, పరిప్రశ్నాత్మకమునైన ఇందలి నారదుని మనోధర్మము మానవ లోకమునుండి

సహృదయపాఠకులను శివవిష్ణు లోకములకుఁ గొనిపోఁగలిగియున్నది. ఇతని త్రిలోక సంచారము. కైలాసారోహణ సందర్భమున వ్యంగ్యముగాఁ జిత్రింపఁబడినది. అందితని యారోహణము భౌతికము కాక ప్రజ్ఞామయమని చూపఁబడినది. కానిచో "తెగిన చుక్క ధరణికి నేతెంచు తరణి మేఘసరణి డిగ్గి శతానంద నందనుఁడు" హిమాలయమును చేరినపుడు మఱలఁ బెక్కు సీమల దాఁటి శివుని సాన్నిధ్యమునకుఁ జేరుటలో నడుమ ననేక దృశ్యములతో నతని కైలాసారోహణము వర్ణింపఁబడుటకుఁ గారణ మేమున్నది? వాని మార్గమున సౌరభములు భ్రమింపజేయుట. వాని మార్గము నాపుట. యురగపతుల చిక్కుల తెసువులు, మహోగ్ర సింహముల వెఱపులు కనిపించుట. కడకుఁ గైలాసమునం దీశ్వరుని రూపమున గంగయను గంగడోలుతో దర్శన మిచ్చుట. మఱికొంత దూరమునకు స్కందుని కైలాసావరోహణమునకుఁ దన యారోహణమునకు దారులు కలియుట మున్నగు నంశములన్నియు నారదుని ప్రజ్ఞకు సంబంధించిన యారోహణకక్ష్యలే గాని భౌతికముగాఁ గొండ లెక్కు యత్నము కాదని ఇందలి రచనయే నిరూపించును.

నారదుఁడు పలువిధములైన జిజ్ఞాసా పథములఁబట్టి తుదకుఁ బరమేశ్వర సన్నిధానమును జేరుకొన్న భాగవతోత్తముఁడు. తుదకుఁ గావలసిన జ్ఞాన లబ్ధికిఁ బరమేశ్వరుని యనుగ్రహమే గాని శాస్త్రశాఖల పరిశ్రమలు కారకములు కావని గ్రహించినాఁడు. సత్సాంగత్యము, గురుజన పాదసేవయు లేనిచో "గాసిలధావతి" మిగిలి "కంపలఁబడ్డకాకి" గతి పట్టునని వానికి బాగుగా దెలియును. ఈ యోగీశ్వరుఁడు, త్రిగుణాతీతుండయ్యు, భగవంతుని మూర్తి త్రయమునకు సాధకములగు కరణములే త్రిగుణములని యెఱిఁగినవాఁడు. భౌతిక, మానసిక, వాఙ్మయ పూజనములం దేకసూత్రత సాధించిన పరమ భక్తుఁడు.

"కనదధర కాంతిపల్లవ
మును దశనద్యుతి లతాంతమునుగా వాక్పూ
జన మొనరించెఁ బురారికిఁ
దనివిసనక మౌనికుల వతంసుఁడు వేడ్కన్"

పాం. మా. 2 – 196

ఇతని గురుభక్తి మెచ్చఁదగినది. భగవంతుఁడు మూర్తిత్రయ స్వరూపుఁడని యెఱిఁగినవాఁడయ్యు, నందు శివమూర్తియే గుణోత్తరుఁడని తన గురువును గూర్చి యితఁడు ముచ్చటపడును. అవును. భగవంతునకుఁ జాల శక్తు లున్నవి. బ్రహ్మయై వేదవివాద గోష్ఠులను నడుపుచు, వృద్ధులతోఁ గాలము గడుపవచ్చును. దానివలన జీవులకేమి మేలు? విష్ణుమూర్తి శ్రీమంతుఁడై వెలుఁగవచ్చును. తక్కిన యింద్రాది దేవతలు యజ్ఞములం దార్జనము చేయవచ్చును. హాలాహల విషాగ్నులను తన కంఠమున దాచి జీవులను గాపాడు కరుణామయత్వము తన గురువగు శివునకుఁ గాక "యేదొరకేటికిన్ దొరకు?" "నీ యనుజీవి నేను" అని యితని ప్రణిపాతము. తనకన్న ముందే జ్ఞానోదయము నొందఁగల స్కందాదులయం దితని కీర్ష్య లేకపోఁ

గాఁ దనకంటె వివేకులను గౌరవమున్నది. "సాధుజనులతోడి సంసర్గమురివిన హాని, భయము, క్లేశమావహిల్లు నెంత వారికైన"నని యితని యనుభవపూర్వకమైన విశ్వాసము. శరణాగతిలేని తాత్త్వక, వితర్కమునఁ దాను వెనుకటి దినములలోఁ బడిన ప్రయాసను గూర్చి "కాలీఁచవడఁ జరింపుదు" నని నవ్వుకొను నేగాని విచారపడఁడు.

నారదుఁ డాజన్మ బ్రహ్మచారి. ఈ కథలోని యితని గురువు గృహస్థుఁడు, వీ రిరువురు నీ యాశ్రమద్వయ ప్రసక్తిలో సుకుమారముగా వివాదపడుచుండుట యీ గ్రంథ మెలెడలఁ గాననగును. ఈ వివాద మెప్పుడును సూటిగా జరుగలేదు. శివుఁ డుపదేశ మారంభించుచు, "నుమయు నేను గూడి" మందరముపై విహరించుచుంటిమని ప్రసంగించినాఁడు. పార్వతికిఁ దనతోఁ గల సర్వలోకముల సంబంధమును లీలగా వర్ణించినాఁడు. పరమోపదేశము గోరిన నారదు నిట్లులసమాడుటలోఁ బరమేశ్వరుని చనవు, రసజ్ఞత వ్యక్తమగును. పుండరీకుని కథ చెప్పుమని వేడిన నారదునకుఁ దొలుత నిగమశర్మ కథ చెప్పినాఁడు. మఱలఁ బుండరీకుని కథ నారంభింపఁబోవుచున్నట్లు నటించుచు, భూదేవి నారాయణునిఁ జూడబోయినదనియు, నారాయణుఁడు కృష్ణావతార మెత్తెననియు, రాధ తపస్సు చేసెననియు గంభీరముగా నుపన్యసించినాఁడు. పలు మార్గములఁ దిరిగి వేసారి వచ్చిన శిష్యునకుఁ దిష కుదిరినదో లేదో పరీక్షించుటకై యతఁ డడుగని కథలను అగనివడువున మిక్కుటముగాఁ బెంచి కల్పన జేసి గంపెడు వర్ణనలతో నింపి చెప్పినాఁడు. ఎచ్చటఁ జూచినను గృహస్థుల ప్రాముఖ్యమే, గృహస్థాశ్రమ ప్రశస్తియే! ఎట్టకేలకుఁ బుండరీకుని కథను ముగించుచు నారదుని తండ్రి గూడఁ బుండరీకునకు వరము లిచ్చెనని చెప్పినాఁడు. నారదుఁడు సర్వమును నిశ్చలత్వమున వినినాఁడు.

నారదున కీ కావ్యమునఁ జిత్రింపఁబడినవి రెండే సంకల్పములు. 1. సద్గురువు నాశ్రయించి పరమార్థమునందుట, 2. గృహస్థధర్మము మోక్షప్రతిబంధక మను సందేహమును దొలఁగించుకొనుట, అందు మొదటి యంశమును గుమారాదులు తామే నిర్ణీతమైన ప్రశ్నగాఁ గోరిరి. నారదుఁ డట్లు కోరక వేద్యమైనదానినిఁ దెల్పి తరింపఁజేయుమని కోరినాఁడు. వ్యాసుఁడు సూతునకుఁ జెప్పినట్లు కావ్యారంభమునఁ గల సూచనను బట్టి యిందలి నారదుఁడు వ్యాసున కుపదేశింపవలసిన యంశమంతయు శివునిచే నుపదేశ మందినట్లు కవి చిత్రించినాఁ డనవచ్చును. భాగవత రహస్యమును నారదుఁడు వ్యాసున కుపదేశించెనని భాగవతమునఁ జెప్పఁబడినది.. దానికిఁ బరిపోషకమే నారదుఁడు శ్రీకృష్ణకథ నుపదేశ మందెనని పాండురంగమాహాత్మ్యమందలి కల్పనము. ఇందుఁ గృష్ణునకుఁ బాండురంగ, విట్ఠలనామములు, సంప్రదాయము "క్రొత్తగు సొమ్ములు" శివు డుపదేష్టయగుట "కుందనమును ఘటించుట". ఈ విధముగా నీ కావ్యమందలి నారదపాత్ర కడు నుత్తమముగ, బవిత్రముగ, సంప్రదాయబద్ధముగాఁ జిత్రింపఁబడినది. ఘటికాచల మాహాత్మ్యమున నారదపాత్ర ప్రవేశము, భృగునారద సంవాదము మున్నగు ఘట్టము లున్నను నందాక పాత్ర చిత్రణముగాని పోషణము గాని లేదు.

అగస్త్యుఁడు

పురాణకాలముననే వింధ్యము దాటి దక్షిణమునకు వచ్చిన యీ ఋషి శ్రీనాథమహాకవివలనఁ దెనుఁగువారితో నెక్కువ పరిచయము గల్గించుకొన్నాఁడు. శ్రీనాథుని భీమఖండమునకు సంస్కృత మూలము లేదని విమర్శకాగ్రేసరులు చెప్పుచున్నారు. ఇది సత్యమైనచోఁ దెనుఁగున నగస్త్యపాత్రకు స్వతంత్రమైన కల్పనము శ్రీనాథునితోనే యారంభమైనదని చెప్పవలెను. ఈ కల్పనము గూడ కాశీఖండము ఛాయలలోనే నడిచినది. అట్లే రామకృష్ణుని కల్పనము భీమఖండము ఛాయలలో నడచినది. అయినను రామకృష్ణుని యాత్మీయత యీ పాత్రయందు ముద్రితమై యున్నది. అగస్త్యుఁడు సభార్యుఁడై "లోకప్రతిష్ఠ గుఱిఁచి" బయల్దేరఁగా వింధ్యము భయపడి బిలమును జొచ్చు కుళీరమువోలె నణఁగినది. ఇం దగస్త్యుని ప్రయత్నమే యున్నట్లు చిత్రింపఁబడలేదు. వింధ్యము గర్వింప నారంభించుటకు ముందుగనే త్రికాలవేదియగు శివుఁడు కాశిలో నగస్త్యుని దన భక్తునిగాఁ బెనిచినాఁడఁట :

> "వింధ్య మమరాద్రి పోటికి వివిధ తార
> కములు మొలపూసలుగఁ బెరుగ మది దలంచె
> నెన్నడట మున్ను కాశిలో నన్ను గొలిచి
> ఘటజమగు తేజ మింపొందు నుటజమునకు" —పాండు. 5 – 168

దానిని శివుఁడు నారదునకుఁ జెప్పినాఁడు. కాశీనుండి బయలుదేరిన యగస్త్యుని ప్రయాణము సామిమలపైఁ గుమారుని దర్శనమున నాగినది. కుమారుఁడు రచించిన స్కాందమును వినిన యగస్త్యునకు క్షేత్రతీర్థదైవత సంప్రశ్నము కథలోఁ దొలిసారిగఁ బొడమినది. తత్పూర్వము పార్వతికిఁ దక్క నెవ్వరికి నీ ప్రశ్నము కలుఁగలేదు. ఆమెకైనను వరముగా నింతకాలము బీజరూపముననున్నదే గాని అది యీ ప్రశ్నరూపమును దాల్చుట యగస్త్యునకుఁ బొడమినప్పుడే జరిగినది. ఈ కథలో నారదునకు శివునితో నెట్టి సంబంధము కలదో యట్టి సంబంధమే యగస్త్యునకును, గుమారునకును పార్వతితోఁ గలదని చిత్రింపఁబడినది. కావ్యపురాణ సంప్రదాయమునఁ బరశురామునకు స్కందునితో దులతూఁగఁగల స్థాన మున్నది. అట్టి స్థాన మగస్త్యునకీ కథలోఁ గల్పింపఁబడినది.

కావ్యారంభమున నగస్త్యపాత్ర ప్రాముఖ్యము పొడచూపినను బాత్రపోషణము మాత్ర మయుత నియుతోపాఖ్యానముననే జరిగినది. ఈ కథలో నతని తపోనిష్ఠ, వేదవిత్తమత్వము, శిష్యవాత్సల్యము, విధివిధానమగు కర్మయోగ మార్గావలంబనము, సత్యలోక ప్రయాణ సమర్థత, బ్రహ్మతో సంభాషింపఁగల సంప్రదాయజ్ఞత, బ్రహ్మ పొగడ్త నందఁగల బ్రహ్మమయత్వము మనోహరముగాఁ జిత్రింపఁబడినవి.

కావ్యోచితమైన ధ్వనిమార్గమున మరియొక ముఖ్యాంశ మీ ఋషీంద్రుని పాత్రపోషణమున సిద్ధించినది. అగస్త్యుఁడు తన శిష్యులతో నిరువురకు వివాహము చేయ సంకల్పించినాఁడు. నియుతుని విషయమున నా సంకల్పము

నూటిగా శీఘ్రముగా సిద్ధించినది. అయుతుని విషయమున విలంబము జరిగినను నింద్రుడు కామధేనువు వాహులుడు నిమిత్తములై యా సంకల్పము నెగ్గించినారు. అయుతునకు వివాహము శతగుణముల బలీయమై జరిగితీరినది. అవ్యాహతమైన సంకల్పబలము గలవాఁ డీ కావ్యమందలి యగస్త్యమహర్షి. ఎంతటి నిర్లిప్తుడో. యెంతటి బ్రహ్మవేత్తయో యంతటి విహార రసికుఁడు. పరేంగితజ్ఞుఁడు నీ కావ్యమందలి "వింధ్యాద్రి నిర్బంధ బాంధవుఁడు". "ప్రతిదిన ప్రయాణంబులు" చేయుచు నగస్త్యుఁడు తనభార్య పొందుచున్న పరిశ్రాంతిని గమనించుచు విశ్రాంతిని గలిగించుచు నుండినాఁడు. ఆమె యడుగులు పొలుసు రాసగోటఁ జెమటఁ ముడిచినపుడు, కను లెఱ్ఱవారినపుఁడు, నిట్టూర్పు పెందినపుడు మున్నగు వేళలందు సరణీతరుణ తరుచ్ఛాయలందు సరోపకంఠమునందు నవకాశములు కల్పించినాఁడు. అంతియు కాక శ్రమపుటమునట్లును బ్రయాణము సాగునట్లును గూర్మి నాదరించి పలుకుచు మార్గమునందలి దర్శనీయములగు మహిమాన్విత ప్రదేశములను గూర్చిన కథా కథనముతో మెల్లమెల్లఁగాఁ బ్రయాణము జరిపినాఁడు. ఎడనెడఁ గల యాశ్రమములను దపోవనములను వర్ణించుచు నామె "దర్శిత మధ్యవృత్త ప్రస్తమృదునీవి, యప్రయత్నపయోధరాంబరంబు" గ మెలఁగినపుడెల్ల "వలుదయైమింపు నప్పంటవలఁతి వెలఁది చంటికడనంటు మృగనాభిచర్చ" నుపమానముగాఁ బ్రసంగించి యేకాంత సంభాషణలో రసికతలు కులికించినాఁడు. మిట్టమధ్యాహ్నపు టెండవేళ భార్యను నడిపింపక విశ్రాంతి కలిగించుచుఁ దుంగభద్రను బ్రసంగించినాఁడు. వాని మనస్సునఁ దీర్థమాహాత్మ్య ప్రశస్తి కిదియే బీజాంకురమైనది.

కుమారస్వామి

ఇది మిక్కిలి ప్రాభవాన్వితమైన పాత్ర. రాక్షస సంహారము, పురాణ సంహితా నిర్మాణము, ఋషులకు గురుత్వము వహించుట, వారికిఁ బరమేశ్వర సాన్నిధ్యము కల్పించుట యను నంశము లీపాత్రకు నిర్దిష్ట కర్తవ్యములు. ఆశ్చర్యకరములగు స్కందుని దివ్య వృత్తాంతములకు వయస్సుతో నిమిత్తము లేదు. "తలమావి వీడని నిసుపు వయస్సు నాఁడె తారకుఁ గట్టినాడు". దక్షిణాపథమున నున్న మహిమాన్విత దైవతములలో నితఁడు స్కాందపురాణమును నిర్మాణము చేసినవాఁడు. లోకమున నీ పురాణము వ్యాసనిర్మితమని ప్రసిద్ధము. "పాండురంగమహాత్మ్యము" కథయంతయు వ్యాసునివలన సూతుఁడు వినినట్లు కల్పింపఁబడుటచే, వ్యాసుఁడు తత్పూర్వమే స్కందునివలన స్కాందపురాణ ముపదేశమందెనని రామకృష్ణుని కావ్య కల్పనము.

దక్షిణాపథమునకుఁ బోయిన యగస్త్యుని, గుమారుఁడు మరల నొకమాఱు కైలాసమునకుఁ గొనిపోయినాఁడు. ఈ పాత్రయందొక గొప్పయుచితజ్ఞత కనుపించును. తన తండ్రియైనను బరమేశ్వరుఁడు కొలువున నున్నప్పుడు నిండు సభలోనే కుమారుఁడు వానిని దర్శించెను గాని. ప్రత్యేకముగా నింటిలోనికి నొక్కఁడును బోయి చూడలేదు. తా నేఁగుసరికిఁ బార్వతీ పరమేశ్వరులు వన విహారము చేయుచున్నారు. వారు తిరిగి కొలువు చేయువఱకు వేచియున్నాఁడు. అగస్త్యాది ఋషులతోఁ జూడబోయినవాఁడు వారిని విడిచి తండ్రిని దర్శించినచో నుచితజ్ఞుఁడెట్లగును ?

కొలువులో దర్శనము చేయునపుడు కొలువు మర్యాద లన్నియుఁ బాటింపవలసినదే.

"పీడియం బెడలించి విధురత్నకనకాలు
కాంచి తాంబువు పుక్కిలించి యుమిసి
యుదిరి బంగరు ప్రాత హొంబట్టువలెవాటు
సడలించి వెసఁ గటిస్థలిని జుట్టి
యనుయాయి పృథుక హస్తాంతర న్యస్తోప
దోవితారము తానె యుద్వహించి
యంగుళీసంజ్ఞ సంయములఁ బ్రత్యేకంబు
మునుమున్న లోనికిఁ జననొనర్చి
ద్వారపార్శ్వస్థ వేదికావలుల జరఠ
రక్షివర్గంబు టంక్రియారభటి వరల
మలయమకుటాదికంబుగ నిలిచి మ్రొక్క
నగవుఁ జూపులఁ జూచుచు నగరు సొచ్చి" —పాండు. మా. 1–198

ఈ పద్యమును బరిశీలించుచుఁ జదువువారల కితఁడు సేనాధిపత్యపదవిలో నున్నాఁడని చెప్పకయే తెలియును. పౌజులు తీర్చుటలోఁ బదవుల చిన్న పెద్దలు పాటించుటలో నితనికిఁ గల యనుభవమిందు వ్యంగ్యము. అట్లయ్యుఁ దన తండ్రి కొలువులోని ముదుసలులను గౌరవపూర్వకముగ చిరునగవున నుచితముగా నాదరించుటను మఱచినవాఁడుగాఁడు.

కుమారుని పితృభక్తియు నంతర్యామిభావనయు నెట్టివి? దూరమునుండియే దర్శన మిచ్చిన కైలాసగిరి మొత్తము శివుని పంచముఖాకృతిగానే యతనికిఁ బొడకట్టినది. ఈరీతిగా నీ కావ్యమందలి కుమారుని పాత్ర కడు దుర్లభములైన బహు సద్గుణముల సమన్వయముతో భాసించుచున్నది. ఇతఁ డెంత తాత్త్వికుఁడో యంత మానధనుఁడు. ఎంత భక్తినమ్రుఁడో యంత నధికుఁడు. ఎంత ప్రపన్నుఁడో యంత పురుషకారము గలవాఁడు. కనుకనే వాని కైలాసారోహణమును "గట్టురేని వైమానిక సేనాని మానధనుండగు నధికుండు నిజపురుషకారంబునుంబోలె నధిరోహించి" యని కవి భావగర్భితముగా వర్ణించినాఁడు.

రాధ

కథలో బూర్వార్థమున నీమె కేవల సౌందర్యమూర్తి. సృష్టిలోని మృదు కఠిన వస్తు జాలమంతయు నీమె దేహమున నంగాంగి భావమున నుపమానత్వమంది. స్థగితమైనది. సత్యలోకమున కవ్వలనున్న శివలోకమునఁ బార్వతి శివుని కర శరీరమైన పరాప్రకృతి. అమె యవయవములు చిన్మయములు. సత్యలోకమున కేవల బ్రహ్మసంకల్పమునఁ బ్రతిబింబితమైన ప్రకృతియే రాధ. ఈమె "నిఖిల భువన మోహిని యగు నొక శక్తి". ఈమె యవయవములు మూర్తిమంతములై సృష్టికి బ్రతీకలైయుండును. సృష్టిలో నంతర్యామి యైన కృష్ణావతారమునకు నర్ధశరీర మగుటయే యామె పరమావధి. ఊర్ధ్వలోకమున "నద్రిజ

నేలిన శూలిహేలిక" భూలోకమునఁ బాండురంగఁడు "అయ్యువతి నర్ధశరీరము నట్లు" బ్రోచుటయే ఈమె తపస్సునకుఁ బరమావధి. బ్రహ్మ యీమెను సృష్టించునపుడు మిక్కిలి జాగరూకత వహించెను. హస్తప్రక్షాళనాదికము నొనర్చియే కడు నిష్ఠతో నీమె కొనగోళ్లను గూడఁ గల్పించెను.

"వివిధయువతికోటి వేమఱు సృజియించి
యవ్వధూటిఁ జేయ నజుఁడు దలఁచి
కేలుదోయిఁ గడుగ వ్రేళ్లలతుద నంటు
జలకణంబులేమొ సతినఖాళి" —పాం. మా. 3-190

మన్మథుని యాయుధములు గూడ నీమె శరీర సౌందర్యమున నిమిడినవి. పరిపూర్ణ యౌవనస్థితిలో నీమె కటిప్రదేశ మీ భూలోకమని కవి కల్పించుట కేవలము కవిసమయము ననుసరించియే కాదు. ఇం దనేకములైన తాత్త్విక, సృష్టిరహస్యము లిమిడియున్నవి. భౌతిక పదార్థ మణువయి, జీవుల శరీరముగ రూపము దాల్చుట, గర్భధారణములోఁ బ్రకృతి యొక్క మాతృత్వము, మూలాధార చక్రరహస్యములు నిమిడియున్నవి. ఈ విధముగాఁ దపస్సునకు ముందటి రాధపాత్రయంతయుఁ బ్రకృతికిఁ బ్రతీకగను గేవల సౌందర్యమయ మూర్తిగను జిత్రింపఁబడినది.

తపస్సు నారంభించిన రాధలో దాగియున్న చైతన్యమంతయుఁ గవి వెలువరించి పోషించినాఁడు. "ననలఁ గ్రొందొడిమ యొత్తినఁ గంట గిలుమస్తకం బెట్టు లోర్చెనో కఱకు జడలు!" సౌకుమార్యమునకును దపోనిష్ఠకు నీమె శివుని గూర్చి తప మొనరించిన హిమగిరి రాజకన్యకతో నెన యనిపించినది. కవి ఈమెనుగూర్చి వ్యక్తిగాఁ జెప్పినది యల్పము, ఈమె తపస్సు చేయు సమయమునఁ బ్రకృతిలోని పరిణామములను గూర్చి వర్ణించినది యధికము. ఋతువర్ణన మంతయు రాధపరముగనే వర్ణింపఁబడినది గాని రాధవర్ణనము లేదు. ఈమె తపస్సంతయుఁ బ్రకృతిలోని ఋతువుల యనుభవముల మూలముననే సాగినది. ఇంత తపస్సునను దాను గోరినది మాధవుఁడు తన కధినాథుఁ డగుటయే. సర్వజీవుల పరమార్థము నొక పాత్రలో సంకేతించుటకు ఫలమే రాధపాత్రసృష్టి.

రాధ తపోవర్ణన మారంభమైన తావునుండి పాత్రచిత్రణవైచిత్రి భిన్నమార్గమున నడచినది. ఈ చిత్రణము ప్రాణవంతము, గూఢమునై యున్నది. ప్రకృతి వర్ణనమునందలి ఋతుశోభల పరిణామములో నామె చైతన్య పరిణామము చూపఁబడినది. ఒక్కొక్క ఋతువునం దామె తపస్సొక్కొక్క కక్ష్యలో నడచినది. హేమంతతరుణవాత్యయందామె జగము కంపించు క్రియఁ గ్రూరనిష్ఠఁ దప మొనర్చినది. సర్వజీవరాసులును జలికిఁ గంపించి నిదురించువేళ నామె నిశ్చల సమాధి యాశ్చర్యకరముగ నొప్పినది. "పైఁ గురియు మంచుతుప్పరవానచేఁ దడిసి కమలి వనలక్ష్మి" యెల్ల "హరిధ్యాన నిమీలితలోచనయౌ నలరాధావధూటి కనుగవయయ్యెను" ప్రకృతియంతయు నామె తపస్సునఁ దాదాత్మ్య మందినది. అందువలన నా ప్రకృతికి జితహేమంతమగు స్థితి యేర్పడినది. ఈ వసంత ప్రకృతికూడఁ దపస్సు చేయుచున్న రాధగనేఁ తాదాత్మ్యమందుట గమనార్హము.

"కెంజికురాకుడాలు తులకించిన ధాతుపటంబు దాయఁ జే
యం జదుకెక్కు పుప్పొడుల నంటిన తేఁటులు భూతిభృజ్జటా
పుంజముఁ బోలఁగా విపిన భూములలో మధులక్ష్మి పొల్చె, నీ
లాంజన వర్ణుఁగోరి తపమ ట్లొనరించు మృగాక్షి కైవడిన్" —4 - 14

ఇందలి యుపవాస భావమున వ్యంగ్యముగా నభేదస్థితి ప్రతిపాదింపఁబడినది. ఈ స్థితి దాటిన వెనుక "హోసవిపులఖరకరమగుచు" వేసవి వచ్చినది. "అప్పు డా పద్మిని దినకరకర తాపమునకు నోర్చి, శ్రీపతి యడుగుల గొడుగుం బ్రాపొదవి, ఘోరతప మొనరించెను". హేమంతము, గ్రీష్మము శీతోష్ణస్థితులలోఁ గరిసత చెందిన ఋతువులు. వసంతము సుఖప్రదమగు ఋతువు. ఇవి యన్నియు నామె తపస్సున నభేదస్థితి బొందఁగా నామెను దైవము పరీక్షించుటయు నామె యా పరీక్షలకు నిలఁబడుటయు జరిగినది. కనుకనే తరువాత వచ్చిన ఋతువునందు స్వామి యనుగ్రహమే రాధ కెల్లెడలఁ గనుపించినది.

"ఇంద్రచాపంబు గాదిది మౌళితలమున
 సవరించు బర్హిపింఛంబు గాని
ఖిదురఘోషంబు గా దిది పాంచజన్యసం
 జాతగంభీర ఘోషంబు గాని
యాశ్రయించిన బలాకావళి గాదిది
 హారిముక్తాహార యష్టిగాని
యిది కోలమెఱుఁగుగా దుదిరి బంగారంపుఁ
 బసిమిగ్రమ్మెడు వచ్చపట్టుగాని
వృష్టిగాదిది కరుణాంబు వృష్టిగాని
నీలమేఘంబు గాదిది నీలవర్ణుఁ
డౌర ! నాముందఁ బ్రత్యక్షమయ్యె ననుచు
హర్షపులకిత తనువయ్యె నవ్వధూటి" —4 - 31

వర్షఋతువు నారాయణుని యవతరణ చిహ్నముగా నిందు సూచింపఁబడినది. ఆ ఋతువునందలి వర్షప్రవాహమగ్న ప్రకృతియంతయు నామె "ధ్యానధారా ప్రవాహ మగ్న హృదయమై" నిఖిల జగద్వలయంబును విష్ణుమయంబై తోఁచెను. "అంత భక్తవత్సలుండగు శ్రీవత్సవక్షుండు......ఫలిత కల్పతరు రీతి రాధ యగ్రమున నిలిచెను" నిలిచి—

"శ్రీదవరన్ గృపారసము చిల్కఁ దపోనలజాయమాన హృ
త్ఖేదము మానిపించి తనకేలను గేల్దమలించి నిర్భరా
హ్లాద మెలర్ప నయ్యువతి నర్ధ శరీరమునట్లు ప్రోచె న
య్యాదవరాజవంశమణి యద్రిజ నేలిన శూలి పోలికన్" —4 - 34

"ఆ యాదవ కిశోరుండును గృశోదరీ సహాయుండై మాయాశబలితుండగు జీవుని పరుసున వివిధ భోగపరాయణుండై" ప్రవర్తించుచుండెను. తపస్సునకు ముందుఁ

బరమాత్మ ప్రకృతిలో నానాచేష్టితుఁడైన ట్లేరీతి భాసించెనో యట్లే తపస్సునకుఁ దరువాతఁ గూడ భాసించెనఁట! అనఁగాఁ బరమాత్మని యర్ధ శరీరముగా నేలఁబడిన ప్రకృతి యటు పిమ్మట నిర్లిప్తముగాఁ గూడి వర్తిలుచుండుననియు బాహ్యసృష్టిదృష్టి కెట్టి మార్పును గనుపింపదనియు నీమె స్థితి ననుసరించి కవి తెలియఁజేయుచున్నాఁడు.

రాధ ప్రణయమే రాధ తపస్సు. ఇందు మధురభక్తిపూరితమగు నాయికా సంబంధమున శృంగారరసమునందు భక్తి పర్యవసాన మందిన స్థితికి రాధ పాత్ర నిరూపకము. యౌవన వర్ణనమునను, దపోవర్ణనమునకు నిందలి రాధ పాత్ర చిత్రణమునకుఁ గాళిదాసుని కుమార సంభవములోని పార్వతీపాత్ర తీర్పు రేఖ లున్నవి. మధురభక్తి పరిపోషణమున భాగవతము దశమస్కంధములోని గోపికల భక్తి కిది ప్రతిరూపముగా నున్నది.

రాధ వర్ణనము నతిమాత్రముగాఁ జేసినాఁడు కవి. దాదాపు కేశాదిపాదాంతమైన శరీర సౌష్ఠవ వర్ణన మున్నది. ఇట్లు చేయుటలో నొక కారణ మున్నది. ఈ కథ కేవలము సాంకేతికమైన తాత్త్విక పరామర్శవంటిది. బ్రహ్మచే సృష్టింపఁబడిన భువన మోహినియగు మాయయే రాధగా నవతరించినది. అనఁగా నీమె సృష్టిలోని ప్రకృతికి ప్రతీక. కనుక నీమె వర్ణనమున సృష్టిలోని సామగ్రి యంతయు నున్నది. సృష్టియందుఁ బ్రవృత్తమైన ప్రకృతి పరమాత్మ ననుభవించుటకొఱకుఁ జేయు యత్నమే రాధ తపస్సుగా సంకేతింపఁబడినది. ముక్తావస్థలోఁ బ్రకృతి నశింప నక్కరలేదనియుఁ బరమాత్మతత్త్వమున నర్ధ శరీరముగా స్థానము గీనుననియు నిరూపించుటయే యీ కథలోని పరమార్థము. శ్రీకృష్ణుఁడు రాధకుఁ బ్రత్యక్షమగుట యనఁగాఁ బరమాత్మ ప్రకృతిలోని కవతరించుట. కనుకనే శ్రీకృష్ణుఁడుగా నారాయణుఁడు భూమి కవతరించుటతో నీ కథ జతపరుపఁబడినది.

పార్వతీపరమేశ్వరులు

ఈ కావ్యమందలి పార్వతీ పరమేశ్వరుల పాత్ర లుజ్జ్వలములు. రామకృష్ణ కవి మిగిలిన పాత్రలను జిత్రించుట, పోషించుట, సృష్టించుటయుఁ జేసినాఁడు, గాని యీ రెండు పాత్రలను గేవలము దర్శించి రచించినాఁడు. నారదుఁడు తొలుతఁ గైలాసమునకుఁ బోయి చూడఁగాఁ గన్నులు మిరుమిట్లు గొలుపు తేజఃపుంజ మొకఁడు తోచినది. దానితో నతఁడు విశ్చేష్టుఁడై మఱల నంబాళించు కొని నిదానించి చూడఁగాఁ, గ్రమముగా నా తేజమం దొక పూరుషాకృతి గోచరించి, శివుఁడు కనుపించినాఁడు. ఈ దర్శనము వాస్తవమునకు రామకృష్ణకవి దివ్యానుభూతియే. ఇట్టి ఘట్టములందుఁ గవి చేసిన సాధనలోని యనుభవములు సహృదయ పాఠకుల కందుచుండును. పార్వతీ పరమేశ్వర దివ్యానుభూతి యితనికి నుద్భటారాధ్య చరిత్రనాటికి సాధ్యమై పాండురంగ మాహాత్మ్య రచన నాటికి సిద్ధమైనది. కనుకనే తద్వర్ణనము కూడ దివ్యస్థాయిలో నవరసభరితమై

యొప్పారుచున్నది. అందు హాస్యరసమునకుఁ గూడ సముచితస్థానము లభించి పాత్రపోషణమునకుఁ దోడ్పడినది. శివుని వర్ణించుటలోనే యీ ఛాయ లుండుట యిందలి సముచితత్వము. ఒక యుదాహరణము. పరమేశ్వరుఁడు ధ్యాననిష్ఠలో నుండఁగా సమయము చూచి పగతీర్చుకొనుటకై నిలిచిన మన్మథుఁడు వాని శిరస్సునఁ దన చురకత్తిని బలముగా గ్రుద్దినాఁడట! కత్తియంతయుఁ దలలోనికి దిగి, దాని పిడియైన యడవి పంది కోరమాత్రము బయటకుఁ గనుపించుచున్నది. అదియే జటాజూటమందలి చంద్రరేఖయఁట! మఱియొక యుదాహరణము. పార్వతి స్నానము చేయుచు నొక వస్త్రముతో మొగము తుడుచుకొన్నదఁట. ఆమె కాటుక, కస్తురిబొట్టు, పసుపు దాని కంటినవి. శివుఁడు విలాసార్థ మా వస్త్రమును ధరించి కొలువు తీర్చెనా యనున ట్లతని పులిచర్మపుఁ బరిధాన మొప్పారుచున్నది.

పరతత్త్వముగాఁ జిత్రింపఁబడినప్పుడు శివుఁ డొక్క సితరోలంబంబు. నాదాత్మకమై పరమజ్ఞాన స్వరూపమైన ప్రణవము, ఆ బంభరమునకుఁ బార్వతి వదనశుంభ త్పద్మసౌరభ్యమును గ్రోలుటలోఁ దనివిననదు. లోకసహజములగు నసితరోలంబముల కట్లు కలుగును, మునిహృదయము లను దమ్మిమొగ్గలలోని సౌగంధ్య లీలాలాలిత్యము గోరుచుఁ గాశిలోఁ బ్రాణములు విడిచినవారికిఁ దనస్థితిని భ్రమరకీటన్యాయమున ముక్తిని, సారూప్యముగా నొసఁగును. త్రిపురాసుర సంహారముననే గాక పార్వతితో నిష్కుటాంతర విహారము చేయునప్పుడు కూడ నతఁడు వసుధారథుఁడే, మారారియే, తారావిటార్ధమౌళియే. ఆ యాది దంపతుల వనవిహారమున నారుఋతువులును జిగురుగుత్తుల విరుల సేవించుటకు సన్నిధియై యుండును. ఆ విహారము లౌకిక శృంగార సంబంధము గలది యను నడియాసతో మరుఁడు కత్తులు నూరుచుఁ దరివేచియుండును. శివుడు పలు పోకలఁబోవుచుఁ బార్వతి యవయవముల వర్ణించుచుండును. అదే సమయమున సుమ ప్రాపొంది రతీశ్వరుఁడు బిట్టోడించ నుట్టాడుచుండును. పార్వతి తన మేని పవిత్ర లక్షణములతోఁ బరమేశ్వరుని గామేశ్వరునిగా, సుముఖుని జేయ నువ్విళ్లూరుచుండును. ఈశ్వరుఁడు పార్వతికి సుముఖుఁడై విహరించుట యెల్లఁ దన కానుకూల్యసిద్ధియని మదనుఁడు పొంగిపోవుచుండఁగా సుమాదేవి మోక్ష రహస్య ప్రకాశకమగు పరిప్రశ్నము చేయుచు "విజ్ఞానమయ! మహాప్రాజ్ఞ!" యని యుపక్రమించును. మదనుఁ డాశాభంగము చెంది, నిజస్థితిని గమనించి యటనుండి తప్పుకొనఁగాఁ గుమారస్వామి కైలాసమునకు వచ్చునట! దీని తత్త్వమేమి ? పార్వతీ పరమేశ్వరుల దివ్య శృంగారమున కానందము పరమావధి కాని స్త్రీ పురుష సంబంధముకాదు. వారిది జ్ఞానానందమయ విహారముగాని స్త్రీపురుష సంబంధ సామాన్యము కాదు. తత్ఫలితము కుమారో దయము గాని మన్మథోదయము కాదు. పార్వతి, పరమేశ్వరుఁడు, కుమారస్వామియు వరుసగా జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాతయు ననఁనొప్పును. ఇది యొక గుప్తాకారమగు త్రిరావృత్త పురావృత్తము. నారదునకు శివుఁడు చెప్పిన మందర పర్వతగతమైన యుమామహేశ్వర విహారమునఁ గూడ నీ యంశమే విస్తృతము చేయఁబడినది. ఈ కావ్యమందలి పరమేశ్వరుఁడు మూర్తిత్రయైక నిలయుఁడుగా నారదునకు దర్శన మిచ్చినాఁడు.

"కాళరాత్రీశుఁడగు నీకుఁ గడఁది తమము
పుండరీకాక్షుఁడగు నీకు భూరి రజము
సత్కృపాంభోధియగు నీకు సత్త్వ భృతియు
ననుగుణంబులు నీకు మూర్తిత్రయైక నిలయ!" —2 - 167

యని నారదుఁడు స్తుతించినాఁడు. ఇటఁ బార్వతీసహితుఁడగు పరమేశ్వరుఁడు త్రిగుణములకు, త్రిమూర్తిత్వమునకు నిలయమైనవాఁడే గాని త్రిమూర్త్యాత్మకుడు, త్రిగుణాత్మకుఁడును గాఁడు. కనుకనే యిట శివకేశవాభేదములోని సూక్ష్మలక్ష్యమును నిర్దేశించుచుఁ బరమశివుఁడు—

"... .. ..ఏ
మనుజుఁడు బుద్ధి నిల్పు మురమర్దన దివ్య కథానుభూతిపై
ననిశము మత్ప్రియుం డతఁడు........................

—2 - 219

అని హెచ్చరించినాఁడు.

ఈ శంకరుని పాత్ర లోకములోని పోకడల నన్నిటి నెఱిఁగిన లోకాతీత తేజము. ఈ కావ్యమున కిట్టి తేజము కథకుని రూపమున గురూపదేశము నందించుటలోఁ గొంత వస్త్వైక్యము సిద్ధించినది. ఇందలి కథాకథన కౌశల్యమంతయు శివపరముగాఁ బ్రకటితమైనది. నిగమశర్మకథలోని కామవికారములను, నయుతుని క్రోధవికారములను, నృసింహుని కన్నుల రక్తిమలోని పరతత్త్వమును, సుశీల సంసారములోని సంసారతరణోపాయ రహస్యమును మున్నగు భిన్నాంశముల నీ కథకుఁడగు పరమేశ్వరుఁడు పుండరీకుని తపస్సిద్ధి రూపమగు లక్ష్యముతో సమన్వయపరచినాఁడు.

కల్పితపాత్రలు

రామకృష్ణకవి కల్పించిన పాత్రలలోఁ బ్రధానమయినవి యయుత నియుతుల పాత్రలు. అందయుతుని పాత్రసృష్టి నిరుపమానమైనది.

అయుతుఁడు

ఇతఁ డగస్త్యమహర్షి శిష్యులలో ముఖ్యులయిన యిరువురిలో నొకఁడు. గురువు నాదరమును జూరఁగొనినవాఁడు. ఇతని వేదాధ్యయనము, బ్రహ్మచర్య నిష్ఠ, విద్యాదరము, సామర్థ్యము కడు గణనీయములు. ఇతని శుశ్రూషా బ్రహ్మచర్యములకు మది మెచ్చి గురువే యితని పాణిపీడనవిధాన శ్రీల సన్మానింపఁ దగునని యెంచినాఁడు. ఇతని కనురూపయగు వధువునకు బ్రహ్మలోకమునకుఁ బోయి రావలసి వచ్చినది. అంతవఱ కితని ప్రవృత్తిలో నే లోపమును లేదు.

వివాహ విషయమునఁ దొలుతగా గురువు నితఁడు తిరస్కరించినాఁడు. గురూపదిష్టమైన మార్గమును సంశయించి యా మార్గమునకుఁ దప్పి భ్రష్టుఁడై నాఁడు. ఉపనయనము చేసి విద్యలు నేర్పిన గురువగు నగస్త్యమహర్షి తన్ను వివాహము చేసికొనుమని చెప్పఁగా దిరస్కరించినాఁడు. వివాహము సంసార బంధహేతువనియుఁ గామక్రోధాదులకు మూలమనియు, మోక్షమునకు విఘ్నకారియనియు నతఁడు తలఁచినాఁడు. కామక్రోధములు తీరనివారే సంసారమున నుండి మోక్షము, దైవమని పెద్ద కబుర్లు చెప్పుదురని యభిప్రాయపడి నాఁడు.

అయుతుని ప్రవృత్తి బాల విలక్షణమైనది, కొన్ని యరుదైన మనోధర్మముల కలయిక యతని పాత్రసృష్టిలోఁ జూపఁబడినది. అతఁడు చదివిన వాఁడయ్యు రజోగుణ ప్రవృత్తిఁగలవాఁడు. ఇతని పాత్రచిత్రణము మూలమున రామకృష్ణకవి తత్త్వదృష్టి కొంత విశదమగును. జీవి కంటిన సంసారభావనయే మోక్షమునకు, బంధమునకుఁ గారణము గాని యితర జీవులు గారు. సర్వ జీవులును బరమాత్మలోని యంశలే! అట్టిచో నితరులను మూర్ఖులను కొనువారు సర్వము నందును దైవముయొక్క యంతర్యామిత్వమును జూడలేక యితరులను దూషించుట, సంశయించుట చేయుచు దోషమందినవా రగుచున్నారు. ఇది రామకృష్ణుని యుపదేశములలో నొకటి. పైదోషమునుండి జీవి బయటపడి సమదృష్టి, దైవము యొక్క యనన్యత నలవరచుకొనుటకుఁ గావలసిన సంస్కారమును గలుగఁజేయుటయే గృహస్థధర్మముయొక్క ఫలము. ఇది యొప్పునట్టి దారి. అయుతుఁ డిది యొప్పదని యుద్ధతుఁడై పలికినాఁడు. సంసారమును గూర్చి యతని దృష్టి యిట్లున్నది.

"సంపదచేతఁగాని కొనసాగవు సువ్వె గృహస్థ ధర్మముల్
సంపద పూర్వజన్మ వికసత్సుకృతంబునఁ గాని చేర దా
సంపద చేరియున్ స్మరవశంవదుఁజేయు మహాత్ము నేనియున్
...." —5 - 224

లోకమున నెంతటి బ్రహ్మజ్ఞానియైనను వివాహితుఁడు దౌర్బల్యమునకు లొంగినవాఁడే యని యితని దృఢ విశ్వాసము.

"మమకారదూరునకు మి
త్రములు కళత్రములు నన్నదమ్ములు నను బం
ధముల పరిష్వంగము ధ
ర్మమె? గైకొన మణుఁగు సగము మైలయు సగమే?" —5 - 220

అయినచో జనకాదులు సంసారసుఖములందు వర్తించుచునే నిర్లిప్తులైయుండి తత్త్వాద్భుతానందము లందిరిగదా యను ప్రశ్న వచ్చును. దానికిఁ గూడ వితఁడొప్పునదియే పలికినాఁడు. ఇతని దృష్టిలో జనకుఁ డొక లెక్కలోనివాఁడు కాఁడు. శుకయోగీంద్రుఁడే తన ప్రవర్తనకు నుదాహరణమని తెలిపినాఁడు.

"…………………………శ్రీ…………
శుకు నెన్నరేమి? సారె జ
నకు నెంతురు పరముఖోపనత విజ్ఞానున్" —5-222

అని లోకమును జూచి విసుగుకొనును.

ఒక జీవి దేనినిగూర్చియైన భయపడుచున్నచో మోక్షార్హుఁడు కాఁడు. తద్భయ కారణమైన దౌర్బల్య మాతనియందు దాగియుండుటయే తద్భయ కారణము. అయుతునకు స్త్రీయన్న భయము, జుగుప్సయుఁ గలదు. అనఁగా నతనికి వయస్సు నిమిత్తముగాఁ బూర్వకర్మ కారణముగా స్త్రీసంబంధమైన భయము నిరంతరము వెన్నాడుచున్నది. ఈ భయమను దుస్సంస్కారమును దాటుట కతఁడు వివాహమాడుట తుదకుఁ దప్పనిసరియైనది.

ఇతఁడు చేసిన స్త్రీనిందలో నితనికిఁ గల స్త్రీజనభీతి, వయోలక్షణమైన స్త్రీ స్మరణము నిమిడియున్నవి. ఇతఁడు చేసిన స్త్రీనిందను గమనించి పరిశీలించినచో నందొక విధమైన వాచాలత, స్త్రీ వర్ణనము కనిపించును. వైర భక్తిలో భగవంతుని నిందించి పలుకు వారలకు భగవంతునిపై నెంత యేకాగ్రత యుండునో స్త్రీలపై నయుతున కంత కేంద్రీకరణమున్నది. హిమవన్నగమున ధ్యానమున కుపక్రమింపఁబూని స్వగతమున స్త్రీల నిట్లు స్మరించినాఁడు.

"స్త్రీ లనఁగా చిలుకలు, మలయమారుతములు, చంద్రుఁడు, తుమ్మెదలు మున్నగు మన్మథుని సాధనముల వేలముపట్టులు. కనుక స్త్రీల విషయమున వైరాగ్యమును సాధింప లేక కొందఱు పెద్దలు తాము గోరికలను జయించినవారమని విఱ్ఱవీఁగుదురు." సత్యముగా నయుతునకుఁ బరిపూర్ణ వైరాగ్యస్థితి యున్నచో నీ యూహ చేయనక్కరలేదు. వైరాగ్యమును బొందకుండుటయే గాక తన మనసుయొక్క కామలక్షణములు కూడ దాఁటలేదు. దాటుటకుఁ గావలసిన పట్టుదల మనస్సున కున్నది గాని సంస్కారరూపమున నున్నది కామ బీజమై, కార్యరూపమునఁ గ్రోధబీజమును వెలార్చుచున్నది. రాగకారణమగు దౌర్బల్యమును దప్పించుకొనుట కవలంబించినది ద్వేషము. స్త్రీల శరీరావయవముల సౌందర్యముపై నాసక్తి కూడ ద్వేష రూపమున నతనిని విడువలేదు.

ఈ దిగువపద్యములలో నది విశదపడును:

"ఉర్వీధరము లెక్కి యురుకనే కుచకుంభ
యుగ మొల్లఁగాక తా నులుకుమనిన
వాఁడికైదువులపై వ్రాలనే నిడుఁజూపు
వాలొల్లఁగాక తా వ్రాలు మనిన
మున్నీటి సుడివడి మునుఁగనే నతనాభిఁ
గన నొల్లఁగాక తా మునుఁగుమనిన
బెడఁగారు కాలాహిఁ దొడుకనే నూఁగారు
తోడునొల్లఁగాక తాఁ దొడుకుమనిన
…………… …………… ……………"—5-184

"కందర్పాస్త్రములంచు నంచిత తటిత్కాండంబులంచున్ సుధా
మందస్యందము లంచుఁ గాంచన లతామత్తల్లులంచున్ సుధీ
బృందంబుల్ ధ్వని నిందలం దెగడు నీబింబోష్ఠులందెల్ల నా
నందా భాసమెగాని భాసిత చిదానందంబు పెంపొందునే"

—5 – 225

"కురుల సిరుల్ మెఱుంగుఁ జనుగుబ్బల నిబ్బరముల్ మొగంబు వి
స్ఫురణము లింద్రనీలమణి భూధర శృంగ కురంగలాంఛనా
దరవశదృష్టిఁ జూచెదవు తాపస వంశవతంస! తజ్జరా
భరమున వచ్చు తెల్పుఁబకువాటు, వళీవలనంబు నుండఁగన్"

—5-226

నిందించుట యను వ్యాజమున వర్ణించుటయుఁ తనకున్న దౌర్బల్యము నితరుల కంటఁగట్టి "తృట్టెగఁదట్ట వీతరాగులమని విఱ్ఱవీఁగెదరు కొందఱు బోదలు నానగండలై" యని తూలనాడుటయు నితనియందున్నవి. ఇది లోక సామాన్యమగు మనస్తత్వము.

ఇంద్రునితోఁ దన వృత్తాంతమును జెప్పుచు గురుఁడు తన్ను వివాహము చేసికొనుమని నిర్బంధించుట కిద్దరు కన్యలను దెచ్చెనట; ఆ కన్య లెట్టివారో కొంచెమైనను వర్ణింపక విడచునా!

"............ .... ధాతృ సం
జాతల, సస్మితాస్య జలజాతల, జాతలతాంతసాయక
ద్యోతల నొక్క యిద్దఱు తలోదరులన్"

—5-201

తా నంగీకరింపనప్పు డింత వర్ణనమేల? ఇదియే యయుతుని పాత్ర చిత్రణము లోని యంతఃకరణ చిత్రణము.

బ్రహ్మచర్యానంతరము గార్హస్థ్యము మానవునకు సహజమైన యాశ్రమ మనియు, నిట్టి క్రమోన్మీలనముననే మానవునకు వానప్రస్థాది స్థితుల యర్హతయు, మనోవికాసము కలుగుననియు రామకృష్ణుని సందేశము. ఈ సందేశమును వ్యంగ్యమర్యాదగా స్థాపించుట కతఁడు స్వీకరించిన సాధనమే యయుతుని పాత్ర. సుశీల తరువాత నయుతుని పాత్రసృష్టి జరుగుటవలన నిట్టి వ్యంగ్యము విశేష ముగా సాధింపఁబడినది.

ఒప్పునది గృహస్థధర్మము. దాని నొప్పదని పలికి పెద్దలను నిందించిన వాఁ డయుతుఁడు. అతఁ డట్లు వేయుటకు రజోగుణము కారణము. అతఁడు కోరిన మోక్షస్థితి, యోగస్థితియుఁ దన తరణమునకు సంబంధించిన ఫలాపేక్ష గలవి. అతని తపస్సు పట్టుదలతో నారంభమైనది. వానిని సరియైన మార్గ మునఁ బెట్టుటకు గురువు సంకల్పించిన సంకల్పము నెరవేరుటకు స్వర్గమునుండి యింద్రుఁడు, కామధేనువు దిగి వచ్చినవి... సుదీర్ఘ సమాధిస్థితినుండి వాధూలుఁడు

దిగివచ్చి శపింపవలసివచ్చినది. అయుతుఁడు నృసింహుని పాదసన్నిధిలోఁ గప్పయై గురుని సంకల్పము తీరిన క్షణమున శాపమోక్షమును, మోక్షమును బొందినాఁడు. అయుతుని పట్టుదలయు, సంభాషణచాతురియు శ్లాఘ్యములు. గురువును దిరస్కరించుటలో మొదటియంశము నిరర్థకమైనది. ఇంద్రుని దిరస్కరించుటలో రెండవది నెగ్గినది గాని యొప్పునది యొప్పదని పలుకుట వలన నది రక్తికట్టలేదు, వాస్తవముగా నింద్రుఁడు సంభాషణలో నయుతునిచేఁ బరాజితుఁడైనాఁడనియే చెప్పవలెను. "ఒకటికిఁ బదియుఁ బదింటికి నొక నూఱుగాఁగ" నింద్రుని యుక్తులకుఁ జలింపక నొడువు వడువుగల యయుతుని దృఢనిష్ఠ కింద్రుఁడే యలరినాఁడఁట ; కాని యీ పట్టుదలయు, సంభాషణయు వాధూలుని యెడలఁ గుంటువడినవి. కారణమేమి ? వాధూలుని శాపములో సంకల్పము లేదు. అగస్త్యుని శిష్యవాత్సల్యమే వాధూలుని కోపము, శాపముగా రూపొంది యయుతుని సన్మార్గమున కున్ముఖుని జేయవలసియున్నవి గనుకను, నగస్త్యుఁ డవ్యాహతమగు భవ్యసంకల్పము, సంకల్పసిద్ధియుఁ గలవాఁడు గనుకను నిది సంభవమైనది.

కావ్యశిల్పదృష్టికి నయుతుని పాత్ర మిక్కిలి యున్నతము. బుద్ధికుశలతకు, సంభాషణచాతురికి, విద్యావ్యాసంగ సంసిద్ధికి, శీలసంపన్నతకు, వయోధర్మ మనోధర్మ నిరూపణమునకు, శుభాంతమైన ప్రవృత్తికి నితని పాత్ర పోషణము నికషోపలము. ఈ యుపాఖ్యాన మొక్కటియే యొక కావ్యముగా, నందలి యయుతపాత్ర నాయకపాత్రగా భాసించుచున్న దనుటకు సందేహము లేదు. పురాణవాఙ్మయములోని జడభరతుని పాత్రచ్ఛాయ లిందున్నను దీని పరిణతియందు స్వతంత్రసృష్టి యున్నది. రామకృష్ణ కవి పాత్ర సృష్టి కిది చక్కని నిదర్శనమైన పాత్ర.

ధపళాంగుఁడు

ఘటికాచల మహాత్మ్యమందలి కల్పిత పాత్ర ధవళాంగుఁడు. ఇందుఁ బాత్రచిత్రణముగాని, పోషణముగాని, విస్తృతిగాని, పెద్ద ప్రయోజనముగాని సిద్ధింపలేదు. విశ్వామిత్రుని శాపమువలనఁ బిశాచరూపము ధరించి మఱల వసిష్ఠుని యనుగ్రహమున స్వస్వరూపము నొందెను. సత్సాంగత్యమున కిది యొక సన్నివేశగతమైన పాత్రస్మరణమే గాని చైతన్యవంతమైన, కావ్యప్రధానమైన ధర్మము లిందు సిద్ధింపలేదు. అప్పటి యా కవి రచనవలెనే యీ పాత్రయుఁ బరిణతముగాదు.

సుశర్మ

కొలది విస్తృతిలో మిక్కిలి చక్కఁగాఁ దీర్చి దిద్దఁబడిన నాటకీయమైన పాత్ర పాండురంగ మాహాత్మ్యమందలి సుశర్మపాత్ర. పరిమిత పరిణామముగల యుపాఖ్యానము నందింత చేతనవంతముగా, హావభావయుతముగాఁ బాత్రను సృష్టిచేసి చదువరుల కందించుటలో నీ కవి తిక్కన సోమయాజి యడుగుజాడలలో నడచినాఁడు.

"ఒకఁడు సుశర్మాఖ్యుఁడు ఘా
తుకుఁడు గలఁడు, కల్లుఁద్రావు, దుమము ధరామ
ర్త్యకులుల, సఱదలఁచున్ గురు
నకు గనకము దొంగిలుం దినము నజపుత్రా"

—5–73

అని ప్రారంభించుటలోఁ గల కథావేగగతమైన హాస్యరేఖయే చదువరుల మనస్సునకు సుశర్మ పాత్ర నపరిచితముగా సుపరిచితము చేయు నైపుణి గలిగి యున్నది. "సఱదలచున్ గురునకు", "అవృషలీపతి" మున్నగు తావు లతని జీవిత ఘట్టము లనేకములలోని యవాచ్య వృత్తాంతము జదువరుల కల్పనాశక్తిని జాలనముచేసి, వ్యంగ్యమైన కథావిస్తృతిని దొడకట్టఁజేసి యీ పాత్రకుఁ బ్రాధాన్యమును గూర్చును. వృషలీపతియని చెప్పుటలో నిగమశర్మకథలో వాచ్యముగాఁ జిత్రింపఁబడిన కొన్ని ఘట్టము లిందు వ్యంగ్యములైనవి.

సుశీల

ఈ కావ్యమందలి కడు విస్తృతములైన స్త్రీ పాత్రలలో సుశీలపాత్ర ముఖ్యమైనది. రామకృష్ణుని రచన కంతకును వాస్తవికత, పవిత్రత చేకూర్చిన పాత్రయిది. ఈ కవి సృష్టించిన స్త్రీపాత్ర లన్నిటిలో నిది యితని కళాకలాపమున కవధి. సజీవమైన, సహజమైన, సమగ్రమైన, కాంతిమంతమైన పాత్ర యిది. ఈమెను దీర్చి దిద్దుటలోఁ గూడ నిగమశర్మ యక్కగారి సందర్భమునవలెనే భౌతిక వర్ణన మెచ్చటను గనుపింపదు. అంతయు భావ మయము, చేష్టానిరూపణమువలననే సుస్పష్టము, పూతమునగు స్త్రీమూర్తి యున్మీలితము చేయఁబడినది.

ఉత్తమ గృహస్థధర్మము, పాతివ్రత్యము, సాధుశీలము, భూతదయ, ప్రపత్తి, వైరాగ్య బంధురత యను లోకోత్తర ధర్మము లీమెయందు సజీవములు, మూర్తిమంతములునయ్యె. ఈమె సంసారపక్షమైన తెనుఁగు కుటుంబములోని యొదుగులతోనే జీవితమును గడిపినది. కవితాకళలోని వాస్తవికతయుఁ గాల్పనికమగు నాదర్శమార్గము నీమెయం దభేదస్థితిని గాంచినవి.

సుశీలపాత్రోన్మీలనమున రెండు స్థితుల క్రమపరిణామ మున్నది.
1. తొలుత నీమె ముగ్ధస్వభావమున నోరులేని సాధుజీవియై పూర్వజన్మమున గోవుగాఁ జిత్రింపఁబడిన యువతి యిది. భర్త పెట్టిన కష్టముల నెల్ల భరించినది. పెద్దల పొగడ్తల నందినది.

"తాళి విధుండు గట్టిన మొదల్ పతిదేవత యా సుశీల, పెన్
గోలతనంబునన్ మగఁడు కొట్టినఁ దిట్టిన రట్టు పెట్టినన్
దాళి దినంబుఁ దప్పరణతామరసంబులు గొల్చు, నేలయున్
బోలునె యాపెకంచుఁ గృతబుద్ధులు వృద్ధులు ప్రస్తుతింపఁగన్"

—4 – 144

భర్త సామాన్యమైన బాధలకు గురిచేయలేదు. అతఁడు—

"రూపహీనుఁడు మహాక్రోధనుఁ డతిలోభి
బద్ధమత్సరుఁ డన్య బుద్ధి మాయి
చంచలస్వాంతుండు సకల బంధువిరోధి
బహుళశపథోక్తిలంపటుఁడు శఠుఁడు
సంతతావిశ్వాస సస్యప్రరోహుండు
గర్వపర్వత మస్తకస్థితుఁడు
కలహాశనుఁడు పితృకృత్య క్రియాకుశలుండు
సంగతోన్మాదోత్తమాంగుఁడు"

కావచ్చును.

"అగున యేనియు నటువంటి మగనితోడఁ
గాపురముసేయు సతి దొడ్డ గరిత యగుచుఁ
గసిడి కోఁతకు నోర్చి లో విసివికొనక
ధాత దూఱక తండ్రిసేతకు వగవక" —4 – 140

సత్పాతివ్రత్య గుణాభిరామయగు నా భామాలలామంబు భర్తను సంప్రీతుని జేయును. సూర్యుఁడు తీవ్రముగా లేఁడా? అది యాతని గొప్పఁదనమునకుఁ జిహ్నము కదా! అట్లే తనభర్త కాఠిన్యముగూడఁ దన భర్త గొప్పఁదనమునకుఁ జిహ్నమేమో యనునంతటి యమాయికత, సాధు శీలము నామెయందున్నవి. ఎట్లో జీవితము వెళ్లఁబుచ్చుటకుఁ గాలక్షేపము చేయుట గాక, భర్తను దృప్తి చేయుటకే యామె పాటుబడు నడవడి మిక్కిలి దయనీయమైన, పవిత్రమైన లక్షణము. "జీవితేశ్వరు నీశ్వరుఁగాఁ దలంచుచుఁ దదుపాసనంబు తనకు నిహపర సంసూచకంబుగ నిందు డెందంబునం గోచరింపఁజేయుమం" డుటలో రామకృష్ణుని నిసర్గోదాత్త పాత్ర సృష్టిశీలత సహృదయులను బులకింపఁజేయును. ఇట్టి గుణహీనుఁడైన జీవితేశ్వరు నీశ్వరుఁ గాఁ దలచినప్పుఁ డీశ్వరుడే స్వయముగా నడుము కట్టి, పాండురంగ క్షేత్రము వెలువడి పాంథమాణవకుడుగా "నభ్యాగత స్స్వయంవిష్ణు" వనిరాకుండునా? రాకున్నచో నతఁ డీశ్వరుఁడెట్లగును? దిగివచ్చి పరీక్షించిననాఁడు మొట్టమొదటిసారిగా నామె భర్త యనుజ్ఞ లేక యతనికింట విందు చేసినది. అతఁడు దైవమని యెఱిఁగి యామె విందు చేయలేదు. అట్లెవ్వరైనఁ జేయుదురు. సుశీల ప్రత్యేకత యేమున్నది? అతఁ డాకలి గొనివచ్చిన యొక బ్రహ్మచారిగా భావించి విందుచేసి, యతఁడు చేసిన యాగడమును సహించుటవలననే యతని కా విందు విశేషముగా నచ్చి "చాలతృప్తి నొదవెడిం బచరణగా దిమ్ముల మును రుచింపదు శబరి విందు ద్రోవది విందు" —4 – 182. అని పలుకుచుఁ ద్రేన్చినాఁడు పాండురంగఁడు. రాముఁ డని యెఱిఁగి చేసినది శబరివిందు. కృష్ణుఁ డని యెఱిఁగి చేసినది ద్రోవది విందు. మాణవకునియందుఁ గరుణ గలిగి చేసినది సుశీల విందు. ఎంతటి గుణగ్రహణ నిపుణుఁ డీ రామకృష్ణుని పాండురంగఁడు! ఆమెభర్త యంత కఠినుఁ డగుట కతని పూర్వజన్మ వృత్తాంతమును దెలిపి, పాండురంగఁ డామెను బరీక్షించిన విధమును విశదపరచి, యటు పిమ్మట భర్త గుణవంతుఁ డగుననియు, వారి

కాపుర మాదర్శవంతముగా సాగుననియుఁ జెప్పి, కర్తవ్యమును బోధించి, భక్తురాలిని దీర్చిదిద్ది యంతర్ధానమైనాఁడు. అంతకుముం దామె భర్త కాఠిన్యమునకుఁ గినుక వహించి యుండినచో నిటుపైని గర్మశేషము బాధించెడిదిగదా! అహా! దైవానుగ్రహ మట్లుండవలెను. దాని స్వరూపము నెఱుఁగక కర్మమార్గమునఁ దొట్రుపడి స్వధర్మమును దప్పినవారే "తనుశతకోటు లెత్తి బహుధర్మవినిర్మితిఁ జేర్మి గాంచినన్ ననుగనలేని రేఁతల" ని దైవమే యానతిచ్చినాఁడు.

ఒక జన్మమున: బాలు, మఱియొక జన్మమున భోజనము దైవమునకు దానము చేసిన సుశీలతో "నీకును డక్కతి" నని పాండురంగఁడు పలుకుట సాభిప్రాయము. ఆమె యిఁక నెన్నిజీవులకు మోక్షదానము చేయవలయునో గమనింపవలెను. "అకృత సత్క్రియుఁ"డగు జీవి యీమె భర్తయై తరింపవలెను. పూర్వజన్మమునఁ దిర్యక్కుగా నుండి యీ జన్మమున నుత్తమ మానవత్వ మార్జించుకొనిన యామె గర్భమునఁ బుట్టిన కాకి మున్నగు తిర్యక్కులు తరింపవలెను. పాలు, నన్నము పెట్టి పుట్టిన జీవి గర్భ మింత విశేషముగా ఫలించుట కథాగతి కెంతయు ననుకూలము, సహజము, శ్లాఘ్యము. ఇట్టి మోక్షప్రదమగు సంసారమార్గము నారదుని మనస్సునకు నచ్చునట్లు చేయుట శివునకును, గావ్య సందేశమును వ్యంగ్యముగా నందించు రామకృష్ణునకును బ్రస్తుతమే.

ఇఁక నీమె పాత్రస్వభావములోని రెండవ పరిణామము పరిశీలింపఁదగినది. పాండురంగఁడు ప్రసన్నుఁడైనది మొదలామె భర్త సజ్జనుఁడై, వారి సంసారము కుదుటఁ బడినదిగదా! అప్పటినుండి సుశీల మౌగ్ధ్యము కూడ వదలినది. ఆమె ప్రౌఢప్రవృత్తి గలిగి, యింట స్వాతంత్ర్యము లభించి, యిల్లు తీర్చుకొను దక్షత యలవడినది. తొల్లింటి సౌశీల్యమున కీ ప్రౌఢివలనఁ బసిఁడికిఁ బరిమళమబ్బినది. ఇఁక భర్త యేమియుఁ బట్టించుకొని నట్లు కనుపింపదు. భక్తిమార్గమునఁబడి, వైరాగ్యబంధురుఁడై, గృహనాధవదత్తమగు నైవేద్యము భోజన మాత్మభార్య భక్తినిడ భుక్తిఁగొనుచున్కియే గాని యన్యమెఱుఁగడు. ఇహ పరసౌఖ్యసంసిద్ధి యతనికి లభింపఁజేసి యామెయే సర్వమును జక్కఁదిద్దుకొనినది. పూర్వ సంస్కారవశేషమ మందిన తిర్యక్కు లామె గర్భశుక్తియం దాణిముత్తెములై జన్మింపఁగా వారలకు వలసిన సంస్కార మామెయే యలవఱచినది.

దశాబ్దములుగా సంసార నిర్వహణముచేసి, మునిమనుమల నెత్తి, సర్వ సంస్కారముల నెల్లఱ కలవడఁజేసియుఁ బరమపదనాథుని సందేశమును బ్రాణ ప్రయాణ సమయమున మఱువలేదు.

"నోములెల్ల నోచి నూఱేండ్లు బ్రదికి నీ
భర్తతోడఁ బరమపదముఁ గనుము" —4 – 203

అని కదా భగవదాజ్ఞ! ఆ యాజ్ఞమేరకు వర్తించు నవసరమున సంతానమును బిలచి యిహపరసాధకమైన మార్గమును సమగ్రముగా వెన్నతోఁ బెట్టినట్లు గఱపినది. తానును భర్తయుఁ బాండురంగని సన్నిధికిఁ దరలిపోవుటకు భర్తను సంప్రదింపలేదు. ఆమె సంకల్పమే భర్తసంకల్పము. ఆమెయే యింటికిఁ బెద్ద, చట్టము, గురువు, దైవము. ఆమె యేమి సెలవిచ్చిన నెల్లరును జనవుతోఁ

జుట్టును జేరి వినువారు. వార్ధకమున భర్త యాలంబన మీమె యూర్ధ్వగతికిఁ బ్రాకుడు కొయ్యగనైనది. తన సౌశీల్యము మూలమున బాగుపడిన భర్త తన తరణమునకే యాలంబన మగుటకన్న జన్మకు ధన్యత యేమున్నది? సకలాగమజ్ఞ యగు నా విప్రకులాంగన పెంపకమున నామె సంతానమెల్లను మదాలస శుకతుల్యులై వెలుఁగొందుటకన్న విధ్యుక్త గృహస్థ ధర్మ నిర్వహణ మేమున్నది ?

భర్తయుఁ దానును మోక్షకాలమునకుఁ బాండురంగని సన్నిధికిఁ బోవుచున్నామని బిడ్డపాపలకుఁ జెప్పినది యామెయే గాని భర్త కాదు. ఇంట నింతటి గౌరవము, స్వాతంత్ర్యము ననుభవించిన యీ వైరాగ్యసంపన్నురాలిని సృష్టించుటలో రామకృష్ణకవి బ్రాచీన వేదసంప్రదాయబద్ధములైన ఋషికుటుంబములలోని యొక ముత్తైదువకుఁ గల స్థానమును ముచ్చట పడి చదువరుల కందిచ్చినాఁడు.

నిగమశర్మ అక్క

రామకృష్ణుని యుజ్జ్వలమైన, వాస్తవికమైన, స్వతంత్రమైన పాత్ర సృష్టికి నిదర్శనమగు పాత్ర. ఈమె మూఁడు మూర్తులఁ దెనుఁగువారి యాడుపడుచు. ఈమె గడుసుఁదనము, మాటనేర్పు, కార్యనిర్వహణ దక్షత, సౌజన్యము చదువరులకు ముచ్చట గొలుపును. రామకృష్ణకవి యోపికతోఁ దీర్చిదిద్దిన యిద్దరు స్త్రీ పాత్రలు సుశీలయు నీమెయు. ఈ యిరువురిలోఁ గూడఁ గొంత భేద మున్నది. ఈమె పాత్ర నిర్వహణయందలి వాస్తవికత యను నింద్రజాలమువలన నీమె చదువరులతో సంభాషించుచున్నట్లు పొడకట్టును.

సుశీల సందర్భమునందువలెనే యీమె పాత్రసృష్టి యందుగూడ భౌతిక వర్ణన మెచ్చటను గానరాదు. కేవల హావభావ కల్పనలయందే యామె మూర్తి స్పష్టముగాఁ బొడకట్టును. నిగమశర్మోపాఖ్యానము మొత్తముమీఁద నింతటి ప్రౌఢ సంభాషణ చేయఁగల పాత్ర మఱియొకటిలేదు. నిగమశర్మ కీమె చేసిన హితబోధ యాంధ్రవాఙ్మయమున విదురనీతి మున్నగు ఘట్టములతో పాటు చిరస్థాయిగా నిల్చును. ఈ హితబోధ చేయునప్పు డామె చూపిన నైపుణి శ్లాఘనీయము. మొదట నిగమశర్మ పరిస్థితి బోధలు వినునట్టి దశలో లేదు సరికదా యాతఁ డింటికి వచ్చుట మాని కూడ జాలకాలమైనది. ఇల్లంతయుఁ బట్టుచెడినది. దానిని సవరించుకొనుచు వచ్చిన నేర్పామెకే చెల్లును. కొడుకు నడవడికి సుడివడిన తల్లిదండ్రులఁ దీండ్రఁగల వచన రచనా చమత్కారముల "సుదార ముదారోపణ కరణోపచారంబులఁ గొంతకొంత వంతకుఁ దొలఁగించినది." గృహదైవతారాధనము, నతిథి సంతర్పణములు నేర్పుస్వ బచరించినది. నష్టావశిష్టమగు మూలవిత్తమును గుప్తము చేయుచుఁ బ్రాశివ దాస దాసీజనములను దనవారినిగా మెలఁగించినది. పుస్తక భాండాగారమును భద్రపరచినది. మడి, మట్ర, చెట్టు చేమయున్న తావులందుఁ దన బిడ్డలను గావు

వెట్టినది. దిక్కులేనివారి యాస్తిపాస్తులను గూడ లోకులు యథాశక్తిగా దోచుకొనుచుందురుగదా! సర్వవిధముల "గేహంబు యథా పూర్వ నిర్వహణ మనోహరముగా ననుసంధించి" నది. నిగమశర్మ భార్య దుఃఖమును మాత్ర మరికట్టలేకపోయినది. తమ్మునకు హితబోధ చేయుటకుఁ దలఁచి వేచియున్నది. ఒకనాఁ డాకస్మికముగా నాతఁడు వచ్చెను. ఆమెను జూచి వెంటనే తిరిగి పోవ యత్నించినాఁడు. ఇట నుండి యామె చాతుర్యమును రామకృష్ణుఁ డద్భుత ముగాఁ బ్రకటింపఁజేసినాఁడు. మంచిమాటలతో నామె వానిని బలుకరించుచుఁ దన కుమారు నెత్తుకొనుమని యందించినది. నిగమశర్మ భార్యచేఁ గొస్లె గడిగించినది. అతఁడు భోజనమునకు మాత్రమే యింటికి వచ్చి యుండుట గమనించి మాటలాడుచునే సర్వమును సంసిద్ధము చేయించినది. తమ్ముని స్నానాదికము చేయించి యందఱితో సావకాశముగా బంక్తిభోజనము పెట్టిం చినది. ఎదుటనే కూర్చుండఁబెట్టుకొని తానును భుజించి వచ్చి హితబోధ యారంభించినది. మంచిగాఁ జెప్పినచోఁ జెవికి నాటదు. తొలుతనే నిందించి నచో నతఁడు రోషపడి వెడలిపోవును. కనుక హాస్యగర్భితమైన హేళనగా.

"ప్రారంభించిన వేదపాఠముగకున్ బ్రత్యూహ మౌనంచునో
యేరా తమ్ముడ! నన్నుఁ జూడఁ జనుదే వెన్నాళ్లనో యుండి..."

యని యారంభించినది. కేవలము హేళనయే గాక యాపేక్ష బంధుప్రేమ యందుఁ బ్రవక్తమగుటచే నతఁడు మాఱు మాటాడ ననువుపడదు.

"..........తండ్రియను నబ్ధిన్ జంద్రుఁడై దోచినన్
బోలుంగాక భవాదృశుం డిశరుఁడై పుణ్యంబులం బాసినన్
సాలగ్రామఖనిన్ జనించునెకదా జాత్యల్పపాషాణముల్"
అని రెండవ ప్రసంగము. ఇందు కొంత నింద కొంత నిష్ఠుర మున్నను నీవంటివాడు చెడిపోగాడ దను పొగడ్తయు నున్నది.

"ఏనమ్ముడు గడవఁగఁ ద
త్సూనులు కనుగందు లగ్రజుండవు నీవి
ట్లైనఁ దఱి యెంత దుఃఖమొ
యా నీప్రోపానపడెదు నీ గురువులకున్"

చాల భావగర్భితమైన మాట. తానమ్ముడు గడవకున్నచో - తాను మగవాఁడై నచో - నీవోటి యల్లుని యాదరము కొఱకుఁ బ్రాకులాడవలసిన దుస్థితి వీరి కుండెడిది కాదు. "తత్సూనులు" యనఁగా నీవున్ను వారి బిడ్డవని లెక్కగట్టఁ దగినవాఁడవా? ఈ కసుగందులందఱు వారి సూనులు. నీవు గుణముచేతఁ గావని ధ్వనిసెంద. ఇది నన్నయ్యభట్టు మార్గమునఁ జేసిన సంభాషణాచాతురి ముఖమైన పాత్రపోషణము. అరణ్యపర్వమున సాళ్వుని తోడి యుద్ధమున యుద్ధభూమినుండి సారథిచే దొలఁగింపఁబడిన ప్రద్యుమ్నుఁడు "చక్రధరసుతు లు నన్నుఁ జూచి యేమియని నగరె సభన్" అని పలికిన పలుకుల ఛాయలిం దున్నవి. "నీ గురువులకున్" అనుటలో తలిదండ్రులను గురువుల వలె జూచుకొనవలెనని యింతచదివిన నీకుఁ దెలియదా? యని యర్థము.

ఇటుపైని దమ వంశగౌరవము మున్నగు విషయములను ప్రస్తావించుచు నామెకుఁ దెలియకుండఁగనే కోపావేశము నందినది.

"శీల మఖిలంబు నిది పిల్లిశీల మనుచుఁ
జదువులివి యెల్లఁ జిల్కల చదువులనుచుఁ
దోడివారలు నవ్వ నాతోడ యేల
వేలవైతివి యీ గుణంబేల నీకు"

నని కఠినముగాఁ బల్కినది. పొరుగూరిలో నలుగురు వానిని గూర్చి తనతో నిందించి పలుకుట తెలిపినది. అప్పటికే నిగమశర్మ దుష్కీర్తియితర గ్రామములకుఁ బ్రాకినదని కవి యింతకుముందే—

"మితిగడచిన ఋణదాతలు
వెతవెట్టఁగ నూరు బొరక వెలివెలిఁ దిరుగున్"
వలువకుఁ గూటికినై నీ
చుల వేడం బోడబొరవఁ జొప్పునతఁడు"

అని హెచ్చరిక జేసియున్నాడు. అప్పులవాండ్రకు భయపడి నిగమశర్మ యితర గ్రామములలోఁ గాలక్షేపము చేయుచుండుట, యతఁడు కొందఱు నీచు లక్కడ బొరవఁగ ఋణములు చేయుట జరిగినది. అతఁడక్కగారి గ్రామమునఁ గూడ నిట్టివి యాచరించియు వారి యింటికిఁ బోవక తిరిగినాఁడు. అప్పులవాండ్రు నీచులు గనుక గాలక్రమమునఁ దా మిచ్చిన సొమ్ముకై యామె నెత్తిపొడిచి యుండిరి. నిగమశర్మ వలన బంధుకోటికంతకు నిట్టి దుష్కీర్తి సంభవించుచున్నదని యామె యుద్రేకపడి తిట్టినది.

శాంతముగా నతనికి బోధ చేయఁదలఁచియు "నమస్తోత్కంఠ కలకంఠ కులకంఠ కాకలీపాక లీలాపహంబగు నెలుంగు చెలంగం గలంగి" కెరలించి పల్కుట యెంతయు స్త్రీ సహజము, కాని యామె మిక్కిలి ప్రౌఢ పరిపాకబుద్ధియు "ప్రయోజన ఘటనా పారవశ్యంబు" గల్గినదియుఁ గనుక మరల సామరస్యము మీద సంభాషించినది. తన తమ్ముని గూర్చి వేవురిముందర నేమేమి గొప్పలు చెప్పినదో యవియెల్ల వినిపించి మఱల వాని మనసు నుబ్బించినది, కులధ్వంసము తగదని నచ్చచెప్పుచునె "సిర్దారుండవే వెన్కనెవ్వారును లేరె సహోదరాదుల్" అని మందలించినది. వారకాంతల మాయలను గూర్చి యమాయికముగా. సంసార పక్షముగా నిందించి తుదకు—

"విడు మిఁకనైన నిట్టి యవివేకము, మామకబుద్ధి పద్ధతిన్
నడువుము నీకుఁ గావలసెనా హరికౌస్తుభమైనఁ దెచ్చెదన్
గడుసరి యచ్చకూళ పఱిగాకుల వీడుము చేయి మీఁదుగా
నడచిన పూర్ణకాముఁడవు నా యనుజన్ముఁడ విట్లు సేయుదే"

వెట్టినది. దిక్కులేనివారి యాస్తిపాస్తులను గూడ లోకులు యథాశక్తిగా దోచుకొనుచుందురుగదా! సర్వవిధముల "గేహంబు యథా పూర్వ నిర్వహణ మనోహరముగా ననుసంధించి" నది. నిగమశర్మ భార్య దుఃఖమును మాత్ర మరికట్టలేకపోయినది. తమ్మునకు హితబోధ చేయుటకుఁ దలఁ వేచియున్నది. ఒకనాఁ డాకస్మికముగా నాతఁడు వచ్చెను. ఆమెను జూచి వెంటనే తిరిగి పోవ యత్నించినాఁడు. ఇట సుండ యామె చాతుర్యమును రామకృష్ణుఁ డద్భుత ముగాఁ బ్రకటింపఁజేసినాఁడు. మంచిమాటలతో నామె వానిని బలుకరించుచుఁ దన కుమారు నెత్తుకొనుమని యందించినది. నిగమశర్మ భార్యచేఁ గౌఁగిలి గడిగించినది. అతఁడు భోజనమునకు మాత్రమే యింటికి వచ్చి యుండుట గమనించి మాటలాడుచునే సర్వమును సంసిద్ధము చేయించినది. తమ్ముని స్నానాదికము చేయించి యందఱితో సావకాశముగా బంక్తిభోజనము పెట్టిం చినది. ఎదుటనే కూర్చుండఁబెట్టుకొని తానును భుజించి వచ్చి హితబోధ యారంభించినది. మంచిగాఁ జెప్పినచోఁ జెవికి నాటదు. తొలుతనే నిందించి నచో నతఁడు రోషపడి వెడలిపోవును. కనుక హాస్యగర్భితమైన హేళనగా,

"ప్రారంభించిన వేదపాఠముసకున్ బ్రత్యూహ మౌనంచునో
యేరా తమ్ముడ! నన్నుఁ జూడఁ జనుదే వెన్నాళ్లనో యుండి..."

యని యారంభించినది. కేవలము హేళనయే గాక యాపేక్ష బంధుప్రేమ యందుఁ బ్రసక్తమగుటచే నతఁడు మాఱు మాటాడ ననువుపడదు.

"..........తండ్రియను నర్థిన్ జంద్రుఁడై దోచినన్
బోలుంగాక భవాదృశం డితరుఁడై పుణ్యంబులం బాసినన్
సాలగ్రామఖనిన్ జనించునెకదా జాత్యల్పపాషాణముల్"

అని రెండవ ప్రసంగము. ఇందు కొంత నింద కొంత నిష్ఠుర మున్నను నీవంటివాడు చెడిపోగూడ దను పొగడ్తయు నున్నది.

"ఏనమ్ముడు గడవఁగఁ ద
త్సూనులు కసుగందు లగ్రజుండవు నీవి
ట్లైనతటి యెంత దుఃఖమొ
యా నీప్రోపాసపడెడు నీ గురువులకున్"

చాల భావగర్భితమైన మాట. తానమ్ముడు గడవకున్నచో — తాను మగవాఁడై నచో — నీవోటి యల్లుని యాదరము కొఱకుఁ బ్రాకులాడవలసిన దుస్థితి వీరి కుండెడిది కాదు. "తత్సూనులు" యనఁగా నీవున్ను వారి బిడ్డవని లెక్కగట్టఁ దగినవాఁడవా? ఈ కసుగందులందఱు వారి సూనులు. నీవు గుణముచేతఁ గావని ధ్వనినింద. ఇది నన్నయ్యభట్టు మార్గమునఁ జేసిన సంభాషణాచాతురి ముఖమైన పాత్రపోషణము. అరణ్యపర్వమున సాళ్వుని తోడి యుద్ధమున యుద్ధభూమినుండి సారథిచే దొలఁగింపఁబడిన ప్రద్యుమ్నుఁడు "చక్రధరసుతు లు నన్నుఁ జూచి యేమియని నగరె సభన్". అని పలికిన పలుకుల ఛాయలిం దున్నవి. "నీ గురువులకున్" అనుటలో తలిదండ్రులను గురువుల వలె జూచుకొనవలెనని యింతచదివిన నీకుఁ దెలియదా? యని యర్థము.

ఇటుపైని దమ వంశగౌరవము మున్నగు విషయములను బ్రస్తావించుచు నామెకుఁ దెలియకుండఁగనే కోపావేశము నందినది.

"శిల మఖిలంబు నిది పిల్లిశీల మనుచుఁ
జదువులివి యెల్లఁ జిల్కల చదువులనుచుఁ
దోడివారలు నవ్వ నాతోడ యేల
వేలమైతివి యీ గుణంబేల నీకు"

నని కఠినముగాఁ బల్కినది. పొరుగూరిలో నలుగురు వానిని గూర్చి తనతో నిందించి పలుకుట తెలిపినది. అప్పటికే నిగమశర్మ దుష్కీర్తియితర గ్రామములకుఁ బ్రాకినదని కవి యింతకుముందే—

"మితిగడచిన ఋణదాతలు
వెతవెట్టఁగ నూరు చొరక వెలివెలిఁ దిరుగున్"
వలువకుఁ గూటికినై నీ
చుల వేడం బోడచొరవఁ జొచ్చునతఁడు"

అని హెచ్చరిక జేసియున్నాడు. అప్పులవాండ్రకు భయపడి నిగమశర్మ యితర గ్రామములలోఁ గాలక్షేపము చేయుచుండుట, యతఁడు కొందఱు నీచు లక్కడ చొరవఁగ ఋణములు చేయుట జరిగినది. అతఁ డక్కగారి గ్రామమునఁ గూడ నిట్టివి యాచరించియు వారి యింటికిఁ బోవక తిరిగినాఁడు. అప్పులవాండ్రు నీచులు గనుక గాలక్రమమునఁ దా మిచ్చిన సొమ్ముకై యామె నెత్తిపొడిచి యుండిరి. నిగమశర్మ వలన బంధుకోటికంతకు నిట్టి దుష్కీర్తి సంభవించు చున్నదని యామె యుద్రేకపడి తిట్టినది.

శాంతముగా నతనికి బోధ చేయఁదలఁచియు "నమస్తోత్కంఠ కలకంఠ కులకంఠ కాకలీపాక లీలాపహంబగు నెలుంగు వెలంగం గలంగి" కెరలించి పల్కుట యెంతయు స్త్రీ సహజము, కాని యామె మిక్కిలి ప్రౌఢ పరిపాకబుద్ధియు "ప్రయోజన ఘటనా పారవశ్యంబు" గల్గినదియుఁ గనుక మరల సామరస్యము మీద సంభాషించినది. తన తమ్ముని గూర్చి వేవురిముందర నేమేమి గొప్పలు చెప్పినదో యవియెల్ల వినిపించి మఱల వాని మనసు నుబ్బించినది, కులధ్వంసము తగదని నచ్చచెప్పుచునె "నిర్ధారుండవే వెన్కనెవ్వారును లేరె సహోదరాదుల్" అని మందలించినది. వారకాంతల మాయలను గూర్చి యమాయికముగా. సంసార పక్షముగా నిందించి తుదకు—

"విడు మింకనైన నిట్టి యవివేకము, మామకబుద్ధి పద్ధతిన్
నడువుము నీకుఁ గావలసెనా హరికౌస్తుభమైనఁ దెచ్చెదన్
గడుసరి యచ్చకూళ పఱగాకుల వీడుము చేయి మీఁదుగా
నడచిన పూర్ణకాముఁడవు నా యనుజన్ముఁడ విట్లు సేయుదే"

ఈ పద్యమునఁ దమ్మునకు నచ్చచెప్పగల్గితినను నాత్మవిశ్వాసము, స్త్రీసహజమైనమౌగ్ధ్యము కనుపించును. మాటలో ధాటియున్నది. కారణమేమి? నిగమశర్మ యామె సద్బుద్ధి యాదరించెనఁట! ఆదరించుట బాగుపడు లక్షణమే యనుకొనినది కాని "చాలదినములనుండియు మైలపడిన బడుగువాఁ డన్న పానకాంక్ష నాదరించెనని యామె యెట్లు గ్రహింపఁగలదు? "తేనెపూసిన కత్తి" యగు తమ్ముని దుర్బుద్ధి యామె కంతుపట్టలేదు.

ఈ సంభాషణలో నామె సామర్థ్యమునకు లోపములేదు. దానిని మించిన విధి వేఱుగా నుండుటవలన ఫలితము దక్కలేదు కాని యామె యాడపడుచు తనమునకు లోపమురాలేదు. ఒక్క తావున లోపము కలిగినదని కొందఱు విమర్శకు లభిప్రాయపడుచున్నారు. నిగమశర్మ యింటిలోని ధనము సూచముట్టుగ దోచికొనిపోగా మఱునాఁ డుదయమున నెల్లరును దుఃఖించిరి. వారితో పాటు క్రొత్తఁగాఁ జేయించుకొన్న ముక్కరకునై యాడు బిడ్డయు దుర్వారయై యడలినదఁట! సర్వముఁ దెలిసి సామర్థ్యముఁగలిగి యన్ని నీతులు చెప్పిన యామె చిన్నముక్కరకై దుర్వారయై యడలుట రామకృష్ణుని హాస్యరసపోషణమనియుఁ "బరిహాసము పవిత్ర వస్తువునుగూడ గమనింపదేమో!"[1] యనియును వారు విమర్శించినారు. కాని సూక్ష్మముగాఁ బరిశీలించినచో నిందు బరిహాసము గాని గమనింపక పోవుటకాని కనుపింపదు. క్రొత్తఁగా జేయించుకొన్న ముక్కర పోవుట యశుభమని యామె దుఃఖించినట్లు ప్రకరణార్థమువలన విశదమగును. నిగమశర్మ తండ్రి వృద్ధ భూసురుఁడుగనుక "నాత్మపితృదత్త దర్భ ముద్రికకుఁ జిత్తంబు గలఁగి" దుఃఖించెను. తల్లి "అత్తగా రిచ్చిన హరిసుదర్శనపు చేరునకు ముత్తయిదువ వనటబొందు". ఇంటి యల్లుఁడు "నవగ్రహకర్ణవేష్టన భ్రంశమునకు" వెతఁబొందెనట! ఇందు వా రెల్లరు దుఃఖించినది పోయిన సొమ్ములకు గాదు. వాని వెల యల్పము. అట్లు దుఃఖింపఁదలఁచినచో "గోమేధికోపలాంకుర మానితంబులు, పుష్యరాగచ్ఛటాపుంఖితములు" మున్నగు విలువగల సొమ్మలొక సీసపద్యమునిండ వర్ణింపఁబడినవి. కాని యం దేదియు వారి దుఃఖమునకు విషయము కాలేదు. దుఃఖకారణములు స్పష్టముగా "ఆత్మపితృదత్త, అత్తగారిచ్చిన, ముత్తయిదువ, క్రొత్తఁగా జేయించుకొన్న, నవగ్రహ కర్ణవేష్టన" పదములలోనే యిమిడియున్నది. కావున నిగమశర్మ యక్క దుఃఖించుటలో జరిగిన సంఘటనలోని యశుభ సూచన వలన గల్గిన దుఃఖమేగాని పరిహాసాస్పదముగా స్వల్పవస్తువుకై దుఃఖించుటకాదు.

తెలివి, మంచిదనము, సంప్రదాయము, అభిమానము మూర్తిగట్టి తెనుఁగుదన ముట్టిపడునట్లు సజీవముగ సృష్టిచేసిన యీ పాత్రను రామకృష్ణుఁడు నిగమశర్మ యక్క యని వ్యవహరించెనే గాని పే రెచ్చటను జెప్పలేదు. ఆంధ్రలోకమున నెల్లరకు నక్కగారుగా నుండునట్లు వాని సంకల్పమేమో యని శ్రీ పింగళి లక్ష్మీకాంతము చేసిన ప్రశంస యెంతయు సముచితము.

---

[1]. నిగమశర్మ అక్క: సారస్వతాలోకము శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ.

సుశీల - నిగమశర్మ యక్క :

ఆంధ్రవాఙ్మయమున స్వతంత్రమైన యుత్తమ స్త్రీ పాత్ర సృష్టికి రామకృష్ణుని రచన యొక ప్రత్యేక స్థాన మాక్రమించుకొన్నది. అందీ రెండు పాత్రలును ధ్రువతారలై వెలుఁగొందుచున్నవి. రెండుపాత్రలకును ప్రవృత్తిలో గాని జీవ ధర్మములో గాని చిత్రితములైన రూపరేఖలలో గాని సంబంధమే లేదు. అయిన నిరువురి ప్రవృత్తులు నుజ్జ్వలములు, చేతనవంత ములు, శ్లాఘ్యములు, నిరుపమానములు. ఈ యిరువురును సంస్కారముగల కుటుంబములలో జన్మించినారు. నిగమశర్మయక్క సంస్కారము, సద్భావము, వాకచక్యము బుద్ధిసూక్ష్మత, లౌకికప్రజ్ఞయు గలది. ఆమె తమ్ముని బాగుచేయు ప్రయత్నమునఁ దన తెలివియు గడుసుదనమునంత నుపయోగించినది అంతకన్న సాధన సామగ్రి యామె కడలేదు నిగమశర్మ పతన మామె మానవప్రజ్ఞను మించిన దైవలీలలోనిది. సుశీల తొలుత మిక్కిలి కష్టజీవి. దుష్టుఁడగు భర్త పెట్టిన యిక్కట్టు లెల్ల భరించి భర్త మెప్పు బడయుటకుఁ బ్రాకులాడినది. భర్తను వశపరచుకొని బాగుచేయవలె నను యత్నముగాని దానికిఁ గావలసిన గడుసు దనముగాని యామెకడ లేవు. ఆమె కున్న సామగ్రి యొక్కటియే. ఏమి జరిగి నను దైవలీలయే యని పూర్ణముగ విశ్వసించి దుష్టులలోఁ గూడ దైవమును భావించి తదనుగుణముగఁ దానే జీవితమును మలచుకొనుట యామెకు దైవము ప్రసాదించిన సద్గుణము. కనుకనే దైవలీల యామె జీవిత భద్రతతోఁ గ్రమముగా నేకీభవించినది. తుదకు భర్తయు సాధువై యామె గొప్పదనమును గుర్తించి వశవర్తియైనాఁడు. ఆమె సాంగత్యమువలన జగత్కుటుంబములోని పశుపక్ష్యా దులు సయితము తన కుటుంబములోనివారై తరించినారు.

వాస్తవిక జగత్తున నడిమి తరగతి కుటుంబములలో నీ యిరుతెరగుల తెలివలు మనకు గోచరించుచునే యుందురు. సుశీల తెనుఁగుదేశములోని యొక యాదర్శ గృహిణియు, నిగమశర్మ యక్క తెనుఁగు కుటుంబములోని యొక గడుసైన యాడుపడుచుగను సృష్టింపఁ బడినారు.

పుండరీకుఁడు :

సత్వగుణప్రధానమైన, సమగ్రమైన పాత్ర సృష్టికిఁ బుండరీకుఁ డొక చక్కని యుదాహరణము. పాండురంగ మాహాత్మ్యము గ్రంథమున కంతటికిని గొలికిపూసయై కుమారస్వామి, నారదుఁడు మున్నగు మహనీయులచేఁ బరిప్రశ్న పూర్వకముగా జ్ఞేయమైన నడవడి గలవాఁడైన పుండరీకుఁడు పాండురంగక్షేత్రావతరణమునకు ముఖ్య కారణము. రామకృష్ణుని యుత్త మాధ్యాత్మిక శీలసంపన్నత యంతయు నితని పాత్రను సృజించుటలోఁ బ్రకటమైన దనవచ్చును. అఖిల పుణ్యములను గణించి గణ్యుఁడగుటకన్న వివేకపాకఖని యగుట యీ మునీంద్రుని యార్యజనస్తవనీయ చర్యకుఁ గారణమైనది. పరమ భాగవతుల సంప్రదాయమున పుండరీకముని కీర్తింపఁబడినాఁడు. వాని తపస్సు పురాణములలో సంగ్రహముగా నున్నది. దానిని నిమిత్తముఁ గైకొని రామ కృష్ణుఁడు మహనీయమైన పాత్రపోషణము చేసినాఁడు.

పుండరీకుఁడు తొలుత సత్తమ యోగసాధకుఁడైన కుటుంబి. పరమ భక్తుఁడు. శాంతి దాంతి మాంసలగతి. ఇతని సాధనకుఁ గావలసిన భూతదయాది గుణములు సహజముగా నున్నవి.

"చలిచీమ నేనియుఁ జాఁదొక్క శంకించుఁ
బలుకఁ డెన్నఁడు మృషాభాషణములు
కలుషవర్తనులున్న పొలము పొంతఁ జనండు
కలిమి కుబ్బఁడు లేమిఁ గలఁగఁ డాత్మఁ
దలయెత్తి చూడఁ డెవ్వలనఁ బరస్త్రీల
ధైర్యంబు విడఁ డెట్టి దద్దఱుటల
నొరుల సంపదలకు నుపతపింపఁడు లోన
నిందింపఁ డెంతటి నీచునైన
మిన్నకయుమాడఁ డాఁకలి గొన్నకడుపు
సర్వభూతదయోదయోత్సవ మొనర్చు
నిగమ ఘంటాపథైకాధ్వనీసబుద్ధి
బ్రహ్మ విద్యానవద్యుండు బ్రాహ్మణుండు" —2 - 6

ఇందు "నిందింపఁ డెంతటి నీచునైన" ననునది వాని నడవడికిఁ గొలికిపూస. అయుతుఁడు పతనమొందిన దీ గుణ మొక్కటి లేకపోవుటవలననే. పుండరీకుని సర్వభూత దయోదయోత్సవ గుణమే యితడు కోరఁబోవు వరమును సూచించును. సర్వభూతములు తరించుటకు పాండురంగని భూమిపై బ్రతిష్ఠించుటయే యాతని తపస్సిద్ధి.

పాండిత్యమునం దితడు హరిహయదేశికాభుఁడు. ఇన్ని సద్గుణములు గలవాని కంబుజోదర చరణారవింద సతతస్మృతి లోలుపమైన బుద్ధివలన బంగారమునకు మృగమద సుగంధము సంధిలునట్లు హత్తుకొనెను. దైవభావన యందు సతతస్మృతి నిల్పుట సద్యస్సిద్ధికిఁ గారణము. భగవద్గీతలో స్థితప్రజ్ఞుఁ డగు సాధకునకుఁ జెప్పఁబడిన లక్షణములన్నియు వాని యందున్నవి. అట్టి వానికే "మను, హఠ, రాజయోగముల మర్మములు ఫలవంతము లగును. పూర్వసంస్కారవశమున నతని మనఃపేటికయందు బాలకృష్ణాకృతియగు పర బ్రహ్మతేజము ధ్యేయమైన రూపమై నిలిచినది.

జీవితమే యొక యోగసాధనగా దర్శించి కావ్యముఖమున లోకమున కందింపఁ బూనిన రామకృష్ణుని ప్రణాళిక యంతయుఁ బుండరీకుని పాత్రచిత్రణ మున నున్నది. ఈ ఋషి యిహలోక సంపదలలోఁ జిక్కుకొనక వర్తించుచు గృహస్థ ధర్మముల సమగ్ర సమాచరణమును బరిపూర్తిఁ జేసినాఁడు. తల్లిదండ్రుల సేవ యతని యోగసాధనకుఁ బ్రత్యూహము కాలేదు. ఇతనికి యోగము జీవిత సాధనమగు నంతర్యాగము.

"యోగయాగంబు సలుపుచో నూర్మిషట్క వి
శసన మొనరించుటకు యూపసమితిఁ దెచ్చు
భాతి నమిధలఁగొని..................." —2 - 17

యితఁడు తన యాహ్నికమును నిర్వర్తించును. కనుక మాతాపితృసేవనము లేక యాతనికి భగవ దారాధనమే లేదు.

"విహితమతిన్ బరిచారక
సహస్రమయి పితృయుగంబు సంభావించున్
గృహ మేధివతంనము......   ..." —2-18

ఇట్టి సాధనకు నింటిలో నానుకూల్య ముండవలెను. అదియు నితనికి సిద్ధించుట దైవానుగ్రహము.

"నిజమహిళామణి యప్రతీపమతిఁ డోడ్పడఁగన్"

లేనిదే పుండరీకునకు దైవతార్చనయే లేదు.

".. ....జనకు నానతి శిరమునఁ
దాల్చి నిద్దంపు బుద్ధిఁ దద్ధారకుఁడు
చక్రహస్తార్చనమున కుపక్రమించు" —2-20

ఈ పద్యమున నొక నిగూఢాంశ మున్నది. పుండరీకుని సాధనకు గురువెవరో యిందుఁ దెలుపఁబడినది. చక్రహస్తుఁ డనఁగా విష్ణువు. జనకు నానతి శిరమునఁ దాల్చినవానికిఁ జక్రహస్తుఁడు జనకుఁడే. శిరమున సహస్రారమను నొక చక్ర ముండును. దానిని హస్తమస్తక సంయోగమున నాశీర్వచన ఫలముచేఁ దండ్రి ప్రబోధన చేసి యుపదేశింపఁగాఁ బుండరీకుని ప్రజ్ఞ చక్రహస్తున కున్ముఖమైనది. విష్ణువు చేతి చక్రము పేరు కూడ సహస్రారమే యగుట మంత్రశాస్త్ర సంప్రదాయము. గురువు లేని విద్య ఫలింపదు. పుండరీకుఁడు తండ్రియందే చక్రహస్తుని భావన చేసి సాధన జరిపినాఁ డనియు, దండ్రియే యతనికి గురువనియు నిందలి భావము. కనుకనే రామకృష్ణుఁడు

"ఆపాదమస్తకంబంటు నూనియగొని
స్వయముగా నుద్వర్తనంబొనర్చు"

అను పద్యమునఁ దల్లిదండ్రుల కాచరించు నభిషేకా ద్యుపచారముల నొక సీస పద్యమునను,

"అభిషేక మొనరించు నాకాశవాహినీ
జననకారణ పాదజలరుహునకు"

నను పద్యమున విష్ణునకు జేయు షోడశోపచారముల నొక సీసపద్యమునను వర్ణించినాఁడు. ఈ రెండువిధములైన యుపచారముల యెడలను బుండరీకునకుఁ భేదము లేదని రామకృష్ణుని నిర్వచనము. కనుకనే పుండరీకునకుఁ దలితండ్రులు దేహత్యాగ మొనర్చిన క్షణమున దుఃఖలేశము కలుగకుండుట. దైవస్వరూపులు దైవమునందు లీనమగుటలో దుఃఖకారణ మేమున్నది? వెంటనే తన కర్తవ్యముగా "గంగ నస్థి గయఁ బిండంబున్" సమర్పించెను.

పోయినవారిని గూర్చి యెట్లు దుఃఖము లేదో యట్లే యున్నవారిని గూర్చిన బంధభావనయు నతనికి లేదు. గృహస్థుఁగాఁ దద్ధర్మము నిర్వర్తింపవలెను. సంతానమును బడసి నంతనే పితౄణము తీరదు. ఆ సంతతి ప్రబోధ విధేయమతులు కావలెను. అట్లొనరించుసరికి "తదీయంబగు ప్రాయపుఁ బ్రౌఢ్ధంతఁ గొంత పడమర దిరిగెన్" అప్పటికి వానప్రస్థ దీక్ష యుచితము. కనుక "యీషణదూషణ మొనర్చి యిలుమఱచి నారాయణుని దర్శించు నభిలాషతోఁ దపస్సు నారంభించెను, వర్ధించిన విస్తరిగా సాధన పూర్తిచేసి తపస్సు చేయుచున్న యతని నియమమునకు శ్రీకృష్ణుని మనస్సు వెన్నవలెఁ గరగినది. స్వయముగా బయలుదేరి వచ్చినాఁడు.

పుండరీకుఁడు తపస్సారంభించిన నాఁటినుండి శ్రీకృష్ణుఁడు ప్రత్యక్షమగు గాలమునకు లోపుగా నెన్నియో వింతలు జరిగినవి. భూదేవి భూభార నిర్వాపణార్థము నారాయణుని దర్శింప శ్వేత ద్వీపమునకుఁ బోయినది. నారాయణుఁడు కృష్ణావతార మెత్తుదునని వాగ్దానము చేసి, సంకల్పించి దిగి వచ్చినాఁడు. భువనమోహినియగు మాయ రాధగా నవతరించి తపస్సు చేసి తరించినది. అటుపైని బుండరీకునకు బాండురంగఁడు ప్రత్యక్షమైనాఁడు. ఈ వింత లన్నియుఁ బుండరీకుని సాధనమున నంతర్దృష్టిలో జరిగినవి గావచ్చును. బహిఃప్రపంచమున యుగాంతములలో నే యే మార్పులు జరుగునో యవియే సాధకుల ధ్యాననిష్ఠలోఁ గూడ జరుగుచుండును. పుండరీకుఁడు "ద్వాపరంబు కడకందువ" నారాయణు నర్చించినాఁడు గనుక నతని సాధనలో వర్తించిన మార్పే యతని ప్రజ్ఞకు యుగసంధిగా వర్తించి స్థూలశరీరమందలి భూతత్త్వమంతయు శ్వేతద్వీపమందలి యనుభూతిలోనికి నుద్ధరింపఁబడినదై, శ్వేతద్వీపవాసియగు నారాయణుని యవతరణ మతని భూలోక ప్రజ్ఞయందు వర్తింప నారంభించినది. ఈ లోపుననే యతనిలోని మాయాశక్తి ధ్యానగమ్యుఁడగు దైవమునం దర్ధశరీరమై యిమిడిపోయినది. ఇట్టి యంతర్దృష్టిలోని భగవల్లీల పరిపూర్ణముగాఁ బొడకట్టుసరికిఁ గృష్ణుఁడు తన కన్నులయెదుట భౌతికమైన యర్చారూపముతోఁ బ్రత్యక్షమైనాఁడు. ఇది పుండరీకుని తపస్సాధన యొక్క గుప్తాకారము. దీనిని వ్యక్తము చేయుటకుఁ గవి యుపయోగించిన కథాసంవిధాన మత్యద్భుతము.

దైవము ప్రత్యక్షమైనపుడు చేయవలసిన దేమి? దానిని గూడ దైవమే యానతీయ వలెను. "చిలిఖితమో, శిలాకృతియొ విస్మృతిరూపు వహించెనో యనఁ జలనవిదూరుఁ" డగు నా తాపసముఖ్యునిగాంచి యదుముఖ్యుఁడే పలుకరించెను. భక్తుని భక్తికి మెచ్చి యతఁడు "నీ పితృభక్తికి మెచ్చితి" ననెనే కాని దైవభక్తికి మెచ్చితి ననలేదు. పుండరీకుని దైవభక్తి ప్రణాళికయంతయు నీ మెప్పున వ్యంగ్య మగుచున్నది.

కొంతతడవునకుఁ బాండురంగని స్తుతించి పుండరీకుఁడు వరములను గోరెను. ఆ వరముయొక్క స్వరూప మిట్టిది :

"భక్తితశేష ! నాయెడఁ బ్రసన్నుఁడ వయ్యెదవేఁ గృతోగ్ర
శ్రద్ధతపమైన యీలలిత రూపముతో నివటన్వసింపు మే
క్షేత్రము నెట్టి తీర్థమును జెందని యున్నతిఁ బొందుఁగాక యీ
క్షేత్రపు తీర్థమున్ గడు బ్రసిద్ధి మదాహ్వయలబ్ధిఁ బొందుచున్"

—2–72

"క్షేత్రకులరాజమైన యీక్షేత్రమునకుఁ
దీర్థకులరాజమైన యీతీర్థమునకు
నిఖిల సురనాథు కర్తృత్వనియతిఁబొదవి
యీవిట వసించుటయ వరంబిమ్ము టనుడు" —2–73

ఎవ్వరు నెన్నడును గోరి యెఱుఁగని వర మిది. కోరినది తాను. ఫలసిద్ధి భవిష్యద్భక్త బృందమునకు, ఆ తపస్సునకు, క్షేత్ర తీర్థ దైవతసిద్ధికిఁ గర్తృత్వనియతి పాండురంగనిది. అనఁగాఁ దపస్సు చేసిన కర్తృత్వము గూడ బుండరీకున కక్కరలేదఁట! ఒక వ్యక్తిగాఁ జేసిన సత్కర్మకుఁ గర్తృత్వము దైవార్పితమై ఫలము లోకమున కర్పితమైనప్పుడు సాధకుఁడు సకలలోకము నం దంతర్యామిస్థితిని బొందును. కనుకనే పాండురంగఁడు "మద్భావము తుష్టిగన్న మాడ్కి" యిది కడు దుర్లభమని మెచ్చినాఁడు. ఇచ్చట మద్భావ మనఁగా భక్తుఁడు దైవభావము నందుట, అది సిద్ధింపని సమస్త సాధనములు నిరర్థకములు!

"వలనా యేటికి నాశ్రయించి మనఁగా వానీరమున్ నీరమున్ ?
దలవెత్తే పచరింపనేఁటికి సమిద్ధానంబు దానంబు, స
చ్ఛలమా యేటికి నెత్తిగొట్టుకొనగా సన్యాసమున్ న్యాసమున్
గలిదేఁజాలు మదీయభక్తిరుచి భక్తశ్రేణి కశ్రాంతమున్"

— 2–98

అని పాండు రంగఁడు మఱియొకమాఱు భక్తి సంప్రదాయ స్వరూప నిరూపణ చేసి

"నా యందు భక్తుఁ డుండున్
బాయక యేనధివసింతు భక్తునియందున్
మా యిరువురకుం గలుగనే
గాయప్రాణానుకూల్య కౌశల్యంబుల్" —4–101

అని వివరించినాఁడు.

ఇట్టి పుండరీకుని చరితమున సర్వసాధన సంప్రదాయములును సమన్విత ములైనవి. దేశవ్యాప్తమైన పుండరీకుని కథలో నతఁడు తొలుతఁ దల్లిదండ్రుల ననాదరించి విశృంఖలుఁడై వర్తించి శాపవశమునఁ గరచరణములను గోల్పోయి

నట్లును మరలఁ బరితాపము చెంది మాతాపితృ సేవనమున శాపవిముక్తుఁడై తరించి నట్లు నున్నది. పురాణములలో వీని కెట్టి యాధారమును లేదు. కనుక రామ కృష్ణుఁడు పురాణకథానుకూల కల్పనమున నీ కథను సంస్కరించి పాత్రపోషణ మును బవిత్ర మార్గమున సంతరించి కావ్యమునకు నాయకమణియైన పాత్రగాఁ బుండరీకుని సృష్టించినాఁడు. జనశ్రుతిలోని యప్రశస్త ఘట్టములను బీరు పోకుండ విడఁదీసి నిగమశర్మపాత్రగా రూపొందించినాఁడు. ఇతఁడు క్రొత్తగు సొమ్ము ఘటించుటలోఁ గడు నిపుణుఁడు. ప్రబంధ వాఙ్మయమునఁ గల పవిత్రమైన పాత్రలలోఁ బుండరీకుఁడు ఘనత వహించును. కావ్యమార్గమున సృష్టింపఁబడిన పాత్రలలోఁ బురాణగౌరవము నార్జించుకొనిన విశిష్టత యిందలి పుండరీకునకుఁ గలదు.

నిగమశర్మ :

పాండురంగ మాహాత్మ్యములోని పురుషపాత్రలలో జగమెఱిగిన బ్రాహ్మ ణుఁడు నిగమశర్మ. చాల యందమైనవాఁడు. తొలుతటి దినములలో భూజన సన్మాన్య విశుద్ధవర్తనుఁడు. సమగ్ర కాంతిమహిమ గలవాఁడు. తల్లిదండ్రు లకుఁ గానక గన్న పురుష సంతానము. త్యాగశీలతయుఁ గలదు. ఈ లక్ష ణము లన్నియు నతని సంస్కారమునుబట్టి వయస్సునకుఁ దగిన పరిణామము చెందును. నూనూఁగుమీసల లేఁ గౌనబుంబ్రాయము వచ్చు సరి కతఁడు వాచాల తలో నుత్కోచుఁడైనాఁడు. ఇదియంత మంచి లక్షణము కాదు. దైవఘటన వలన నతని వయస్సుతని మనస్సును మూఁడవ పురుషార్థమువైపున కాకర్షించి నది. జారత, చౌర్యము, దురోదరము, మద్యపానము మాంసభక్షణము వాని కలవడినవి. సదాచారమునకు సిగ్గుపడి దురాచారమునకు గర్వపడు పాకము గల్గినది. తగు వయస్సునఁ దలిదండ్రులు వివాహము చేయక యే మరిరా యన్నచో నదియు జరుగలేదు. వాని మనస్సే యింతకుఁ గారణమై భార్యయెడల రోతయు, వేశ్యలయెడల లోభము నలవఱచుకొనినది.

దుర్వ్యసనములకు దుర్వ్యయము లేక సాగదు. దానితో నసత్య ప్రవ ర్తనము తప్పదు. తొలుత నిందకు భయపడినను గ్రమముగా సడికోర్చి వ్రేలఁజూపఁ గసుగందని పద్ధతి యవలంబించినాఁడు. వాచాలుఁడు గనుకఁ "బొందుఁవట్టుల నప్పులు పొడిచి పొడిచి, దొరతనంబునఁ జుట్టాలఁ దిరిసి తిరిసి" కొంతకాలము గడిపినాఁడు. ఋణదాతలు వెతవెట్టఁగా నూరు చొరక వెలి వెలిఁ దిరిగినాఁడు. ఇక్కట్ల వెక్కువై యాఁకఁట గుతికిల పడుచు వలువకుఁ గూటికి నరులవేడ బోడ దోరవఁ జొచ్చినాఁడు.

సందర్భోచితమైన కపట ప్రవర్తనమున నతఁడు పండితుఁడు. అక్క సీతులు గరవఁగా విని బాగుపడినట్లు గృహజనులకు నమ్మకము గలిగించు రీతిని బ్రవర్తించినాఁడు.

"రాజాలయమునకు రాకపోకలు సేయు
    మాసిన చదువులు మఱలఁ జదువు
నిన్నాళ్ల నెచ్చెలు లెదురైనఁ దలవంచుఁ
    గులవధూరత్నంబుఁ గుస్తరించు
నాచార్యజనముఁ బ్రత్యహము సంభావించు
    నర్చావళికి నుపహారమిచ్చు
నర్చించుఁ గుతప వేళాగతాతిథి కోటిఁ
    బసి నేదు దర్శించుఁ బైరుపచ్చఁ
దండ్రి యుద్ధమనీయంబుఁ దానె యుదుకు
నత్తికాభర్తతో నవ్వు నల్ప నరణి
గ్రామకార్యంబుఁ దీర్చు నంగడికి వచ్చి
తేనెపూసిన కత్తి ధాత్రీసురుండు" —3 - 46

ఎన్ని పాపములు చేసినను నింటిలో గూరుచుండి యించుకసేపు సంభాషించి నచో నితఁడు మహా శిష్టుఁ డనిపింపఁగలఁడు. ఇట్లనుపించుటలోనే కావును గూడ నమ్మించి పూసలలో దారమువలె వర్తించి గురువుగా దేశికోత్తముఁడుగాఁ బరమాప్తుఁడుగాఁ గనుపించినాఁడు. ఇచ్చటఁగూడ నతని వాచాలతయే సాహాయ్యపడినది. కావున తన ప్రాణమును రక్షించిన వృత్తాంతమును "తాన ప్రసంగమ్ముల్దిగిచి తత్పరణిన్ దనపెంపు పెద్దంగాఁబూని వచించు నక్కపట పూరుషుని" నిక్కముగా నక్కాపు నమ్ముటలో వింత యేమున్నది ? తన్నెఱిగిన బంధువులే మోసపోయి నప్పు డెఱుఁగని కా పొక లెక్కయా ?

ఇట్టి నిగమశర్మ కూడ మోసపోయినట్టి తావులు రామకృష్ణునకుఁ దెలియును. ఇంటిలోని ధనము నపహరించి యతఁడు మార్గమునఁ బోయినచో నెవరైన గుర్తించి పట్టుదురని "యేత్రోవయుఁగాని పేరడవి దూఱి హుటాహుటిఁ" బోవుచుండెను. వానికిఁ బ్రాణభీతి లేదు. ధనము నెవఁడైన బట్టుకొనునను భీతియే యున్నది. దొంగలు వానినిఁ గొట్టి యా ధన మపహరించిరి గాని యాయుర్మహిమచే దొంగలయమ్ములు వాని యాయువు నపహరింపలేక పోయినవి.

కాపుఁగోడలి నపహరించి యాతఁడు బోయకులమునఁ గలసి యవాచ్యము లైన దినచర్యలలో నిమగ్నుఁ డయ్యెను. కాపుఁగోడలు మరణింపఁగా నొక మాలెతను బెండ్లాడి సంతానమును బొందెను. ఈ విధముగా సర్వము చ్యుత సంస్కారమైన జీవితమున నుండఁ గా నొకనాఁడు కుటుంబ మంతయు దగ్ధమై నశించినది. జీవితమునఁ దొలిగా నతఁడు దుఃఖించుట జరిగినది. తలిదండ్రులను మోసగించి దొంగలించిననాఁడు గాని, కాపుగోడలు మరణించిననాఁడు గాని యాతఁడు దుఃఖలేశ మందలేదు. సంతానము కలిగి నశించిననాడు దుఃఖింప నారంభించినాఁడు. క్రమముగా శుష్కించి దుస్థితినంది మరణించినాఁడు. చివరి యదనున బుండరీక క్షేత్రమున సంగమ తీర్థమందుఁ గ్రుంకి నృసింహునిమ్రోల నసువులను విడచినాఁడు. వానియసువు లెట్లు పరిష్కార మొందవలెనను సమన్వ చిత్రముగా వివరింపఁబడినది. చనిపోవు లిప్తకు న[illegible]గించినది.

ఆ నృసింహుఁడు "భజద్వృజనావళీ నాశకృన్నృకంఠీరవ దేవుఁడు" అచటి సంగమతీర్థ మా నృసింహునకు నిశ్యనదనీ కృతము. కనుక నతఁడు యమ లోకమునకుఁ బోక విష్ణులోకమునకే పోవలెనని నిర్ణయము. ఈ కథ తీర్థ మాహాత్మ్య ప్రతిపాదకము గనుక నిది సహజమే యని సరిపెట్టుకొనుట తేలిక. కాని నిగమశర్మకుఁ గల మోక్షార్హత యెట్టిది యని ప్రశ్నించినచో నతని నా క్షేత్ర తీర్థముల కడకు గొనివచ్చిన దెవ్వరని కవి ఇట్లు హెచ్చరించుచున్నాఁడు.

"ఇట్లనుద్దిష్ట ప్రయోజనుండై బహుయోజనంబులు నిర్భోజనుండు నిరంబు భజనుండునై యాకుజనుండు యెచ్చట నిశాటపతి వక్షఃకవాట పూటవిఘట న చటులఘటన ఖరముఖరత్నభరణాయమాన త్రిభువన భరణుండగు నృసిం హుండు...విజయంచేసి యుండు నప్పుణ్య ప్రదేశంబుం బ్రవేశించి" —3 – 100

ఇందనుద్దిష్ట ప్రయోజనము మోక్షహేతు వెట్లగునను సందేహము గలుఁగ వచ్చును. అది యతని మనస్సున కనుద్దిష్టమే గాని కర్మపరిపాకమునకు గాదు. "చేయవచేరువై కడుఁ బచేళిమమై తనుడాయు పూర్వసంస్కార తపఃఫలంబున" నతఁడు సంగమతీర్థము కడకు గొని రాఁబడినాఁడు. ఇతని కట్టి పూర్వ సంస్కార మేమి యున్నదను ప్రశ్నకు నుత్తరమును గథారంభముననే కవి కూర్చినాఁడు. వాని తల్లిదండ్రులు సంతానమునకై "యతుల నిష్ఠ నింగి వేల్పుల నేలకు నేలవేల్పు కొలము నింగికిఁ దెచ్చుచుఁ గొలువఁ" బుట్టిన పుత్రుఁ డితడు. వారి పూజా నిమగ్న శీలములైన మనస్సులు సంస్కారము పొందియుండఁగా నితఁడు కడు పునఁ బడినాఁడు. అట్టి యా జన్మసంస్కార మెచ్చటికిఁ బోవును ? మఱియు "భూజనసన్మాన్య విశుద్ధ వర్తనుఁడు" గా నితఁడు బాల్యమున నుండెను గదా! ఇవి కాక పూర్వజన్మసత్కర్మ సంస్కారము లుండునుగదా ! ఇన్ని సంస్కారము లచేత నతఁ డా క్షేత్రమువైపున కాకర్షింపఁ బడెను. వాని మనస్సునందుఁ గల్పింపఁబడిన జగన్నాటకమైన దుష్కర్మ ఫలితమంతయు దారా పుత్రులతో భస్మమయ్యెను. "మనసు తార్తీయ పురుషార్థమునకె తార్చె దైవ ఘటనావ శంబున" నని శివుఁడు చెప్పుటలో నీ జన్మలోని దుష్కర్మయు దుస్సంస్కార ఫలితము, తజ్జనితవేదనయు మనస్సునందే కల్పింపఁబడినవని యర్థము. దారా పుత్ర వియోగవేదన వలన నతని దుష్ట సంస్కారములు చాలవఱకుఁ దొలగెను. దుఃఖవశమునఁ జేసిన నిర్భోజనత్వము, నిరంబు భజనము వలన నింద్రియము లను మనస్సును బట్టి యున్న కల్మషము గ్రాగినది. వృజనావళీ నాశకృతుండగు నృకంఠీరవుని "దత్పరమధామ పతిన్ బలుమాఱు జూచుచున్" నిలుచుటవలన క్షాళనము పరిపూర్ణమైనది. "నహి కళ్యాణకృత్ కశ్చిత్ దుర్గతిమ్ తాత గచ్ఛతి" యను దైవవాక్కు ననుసరించి నృసింహుని దర్శనమువలన నతనికి స్వామి యొక్క దశావతారలీలల నభినయించు పరిస్థితి యేర్పడినది. మరణసమయ మాసన్నమైనప్పు డాతఁడు రెప్పవేయక చూచుట మొదలగు నడవడి కలిగినది. ఈ నడవడి జీవుని యాసన్నమరణ కల్పనము. ఈ నాటకము దైవ మా యా పాత్రలను గల్పించి యాడునట్టిదే. లోననున్నది దైవతత్త్వమేకదా! ఈ జీవున కా దేవుని లీలలయెడలఁ గలుఁగవలసిన జ్ఞానస్పర్శము సంగమతీర్థ జలముల వలనను నృసింహుని సగుణమూర్తిసాన్నిధ్యమువలనను గలిగినది.

జీవునకు దైవభావన సంస్కారము కలిగినంతనే జీవలోక నాటకములోని పాత్రలకు నంకములకు దైవలీలలోఁ గల స్థానము గోచరించును. ఇట్టి సంస్కారముతో మనస్సు నుపసంహరించుకొని స్థూలశరీరమును విడిచి. సూక్ష్మశరీర మీవలకు రాఁగాఁ గాకఘూకావళీ హీనవుమేను నెక్కనవి. "దండధరానుచరాగ్రణిబలం బావలఁద్రోవలావి వెస యాతనపుం దను వాగి రేగగా" నతఁ డాక్రందనము చేసెను. వాని యాక్రందనమున నతని దైవదర్శనమను సుదర్శనమే రక్షార్థముగా నిడిన చక్రమై వచ్చినది. దిగ్బంధనముచేసి యమదూతావళిని ద్రోలి నిగమశర్మను ఋషి దేవతానమున్నీయమానమగు మార్గమున గరుడాంవిత యానముగ నడిపించి విష్ణుసాన్నిధ్యమును జేర్చినది. స్వామి విగ్రహమును గన్నులతోఁ జూచుచు మరణించెను గనుక నతఁడు స్వామి రూపముతో సమానమగు రూపమునందు కుముదుఁ డను పేర స్వామి పార్శ్వచరులలో నొకఁడై యున్నాఁడు.

ఏ జీవియైనను దెలిసియో తెలియకయో యొక సత్కర్మ నాచరించినచో దానిఫలిత మా జీవియొక్క పరిపాకదశవఱకు వేచియుండి, సమయమున కక్కఱకు వచ్చి యా జీవి నుద్ధరించును. మిగిలిన జీవితమంతయు దుష్కర్మలతోఁ గలుషభూయిష్ఠమై యున్నను నొక్క సత్కర్మయొక్క సంస్కారము వాని సన్నిధిని భస్మముచేసి యా జీవిని సంసరణమునుండి యుద్ధరించి ముక్తి నొసఁగునని నిగమశర్మపాత్ర నిదర్శనపూర్వకముగాఁ జాటుచున్నది.[1]

పురాణవాఙ్మయములోని భాగవతమునఁ గల యజామీళుని పాత్రయే నిగమశర్మవంటి పాత్రల కల్పనమునకు మాతృక యనవచ్చును. శ్రీనాథుఁ డిదే మార్గమునఁ గాశీఖండమున గుణనిధిని, శివరాత్రి మాహాత్మ్యమున సుకుమారుని జిత్రించినాఁడు. గుణనిధి కథకును నిగమశర్మకథకును గొన్ని పోలిక లున్నను పాత్రలలో సామ్యము హెచ్చుగా లేదు. గుణనిధి కంటినది యొక్క ద్యూతము,

---

1 " that divine law rules in these higher worlds of finer matter, just as it does down here in grosser matter; that to everything in this world there in an inner side, and that that inner side is often far greater and more glorious than the outer .... man is a spirit, a spark of God's own fire, that he is immortal, and that to his growth and splender there is no limit; that God's plan for him is wonderful and beautiful beyond all conception, and that none can fail finally to attain that goal intended for him, however slow his progress may be however far he may wander from the path of righteousness."

—C.W. Leadbeater: 'The Science of Sacraments" p.xi, xii.

"అపిచే త్సుదురాచారో భజతేమామనన్యభాక్
సాధురేవ స మన్తవ్యః సమ్యగ్వ్యవసితో హి సః"

— భగవద్గీత

చౌర్యము మాత్రమే. జారత్వము కులభ్రష్టత మద్యమాంస భక్షణము, ధర్మ ద్వేషము, మిత్రద్రోహము, కృతఘ్నత మున్నగు నిగమశర్మ యవగుణముల నల వరచుకొను వయస్సుగాని యవకాశముగాని గుణనిధికిఁ గల్పింపఁబడలేదు. నిగమశర్మ కథకుగల వైవిధ్యము విస్తృతి పాత్రపోషణము నాటకీయత గుణనిధి సుకుమారుల కథలలో నింతగా సిద్ధించు నవకాశములేదు. ఉద్భటచరిత్రలోని మదాలసునిపాత్ర నిగమశర్మ వంటిదే. కాని ఈ పాత్రచిత్రణమున గల నైపుణియుఁ బరిపాకము పరమార్థ పరామర్శయు నందు పొడగట్టవు. రెండు పాత్రలకును నేక కర్తృత్వమువలన సిద్ధించిన పోలికలు మాత్రము హెచ్చుగాఁ గలవు. రామకృష్ణునకు దలువాత సృష్టింపఁబడిన యీ కోవలోని మఱియొక ప్రముఖపాత్ర నిరంకుశుఁడు. కందుకూరి రుద్రయ్య ప్రబంధములోని యీ నిరంకుశుఁడు కావ్య మంతటికిని గధానాయకుఁడు. ఆ పాత్రచిత్రణము, కవి ప్రణాళికయు నింతకన్న భిన్నము లగుటచేఁ బోల్చి చూచుటకు వలనుపడదు. నిగమశర్మ యొక పరమార్థతత్త్వమున కర్థవాదమగు పాత్ర. నిరంకుశుఁ డొక సాంఘికేతివృత్తమునకు నాయకుఁడు. ఆంధ్రవాఙ్మయమందలి కావ్య ప్రపంచ మున నిగమశర్మపాత్ర విలక్షణమైనది.

ప్రమథేశ్వరుఁడు :

ఉద్భటచరిత్రమునఁ గల యుదాత్తపాత్రలలోఁ బ్రమథేశ్వరుఁ డొకఁడు. ఇతఁడు వల్లకీపురాధిపతి. సర్వలక్షణలక్షితుఁడు.

"ఆయతబాహువుల్ వెడఁదయై కనుపట్టు భుజాంతరంబునున్
గాయజుఁ గ్రేణిసేయు నవకంబగు చక్కఁదనంబు గల్గు ల
క్ష్మీమయుత మూర్తియుం జనుల చిత్తములం గరగింప నొప్పు నా
గాయుత సత్త్వశాలి, తుహినాంశుకులోద్భవుఁ డాతఁ డున్నతిన్"
—ఉద్భ. 1–114

పార్వతీధవునకుఁ బువ్వు దండ యయి కువలయరక్షణము చేయుచు బుధకోటు లకుఁ బ్రాణప్రదమైయున్న యాతనిలోఁ జంద్రుని మంచి లక్షణము లన్నియు మూర్తికట్టినవి. రాజ్యపరిపాలముననే కాక యంతరంగ రాజ్యపరిపాలనమునఁ గూడఁ బరిపూర్ణత గడించిన శైవలక్షణ లక్షితుఁడగు నారాధ్యుఁ డతఁడు. భర తుఁడు, భగీరథుఁడు, నంగుఁడు. గయుఁడు, జనకుఁడు మున్నగు రాజర్షుల మార్గ మున వర్తించువాఁడు, దిలీపమహారాజువలె నతఁడును—

"కానుక రాజధర్మమని గైకొను లోభము పూనికాదు, శి
క్షానియమంబునన్ రిపులఁగాంచు విరోధము దాల్చి కాదు, రా
జ్యానుపమానముద్రకు బలావళి నేలు భయంబుఁ బొంది కా
దానరనాథచంద్రుఁడు, మహాద్భుతమాతని వర్తనం బిలన్"
—ఉద్భ. 1–169

కలిదోష మెచ్చట దొరలకుండ సకాల వర్షాదులతో దేవతల యన్యోన్యాను కూల్యముతో నతఁడు ప్రజలను బ్రోచెను. అతని కీర్తులను గైలాసహేమకూటా గ్రములందు సిద్ధకాంతలు పాడుదురు. వాని రాజ్యమున నతి దరిద్రుఁడుగూడఁ

ప్రాణములు కుదువపెట్టియైనను శివపూజ చేయును. గొల్లవాఁడును శివకథా గోష్ఠిలోఁ బ్రొద్దుపుచ్చును.

ఇన్ని సద్గుణము లున్నను నతనికిఁ జిరకాలము సంతతి లేకుండుట విచారమును గలిగించెను. రాజ్యవైభవ మెంత యున్నను దాను రాజ్యపాలనకుఁ బుట్టినాఁడుగాని రాజ్యము తనకొఱకుఁ గాదు కదా! తా నా రాజ్యమున కౌరసుఁడగు వానిని గాంచకున్నచోఁ దన కర్తవ్యము "ఎన్నులేని సస్యము" కదా? కనుకఁ బురుషత్రయరూపు నారాధించు తలఁపున నవిముక్త క్షేత్రమునకుఁ బోవ సమకట్టెను. శచీసహిత పురందరునివలె సభార్యుఁడై బయలుదేరి తొలుత గురువగు కౌండిన్యమునిని దర్శించెను. దిలీపుఁడు వశిష్ఠు నర్చించిన రీతిని గురువు నర్చించి, వారి నదుపదేశమును విని బయలుదేరి కాశికిఁ బోయెను. అట తపస్సు చేసి శివుని మెప్పించి ముంజభోజుఁడను వరపుత్రుని బడసెను.

ఈ ప్రమథేశ్వరుని పాత్ర చాల ధర్మబోధకముగను, సంప్రదాయబద్ధముగను, సత్త్వగుణప్రధానముగను సృష్టింపఁబడినది. కొంతవఱ కిందుఁ బురాణ పురుషులగు రాజర్షుల ఛాయలును గొంతవఱకుఁ గాళిదాసుని రఘువంశములోని దిలీపుని ఛాయలును గనుపించును. ఇతని రాజ్యపరిపాలనమును, గురుదర్శనమును వర్ణించు పట్టులలో రఘువంశములోని కొన్ని శ్లోకముల కనువాదప్రాయమైన పద్యములు గూడఁగలవు. అతఁడు కాశీనగరమును దర్శించి నప్పటి భక్త్యావేశచిత్రణము కడుంగడు శ్లాఘనీయము. అతని తపోదీక్ష మిక్కిలి పవిత్రముగా, భక్తి యుతముగ, వాస్తవికముగఁ జిత్రింపఁబడినది. శివుఁడు ప్రత్యక్షమైనప్పుడు చేసిన స్తోత్రము వేద సంప్రదాయ సమన్వితము. వరము కోరిన విధానము కూడ నతని మహానుభావమును సూచించును. శంకరు నతఁడు సంతానప్రదానము చేయుమని మాత్రమే కోరుటలోఁ బరమావధి లేదు. 'నిరాఘాటతర ప్రతాపుని హిమానీశుభ్రకీర్తిప్రియున్ జనతారక్షణ దక్షునిమ్ము తనయున్ సత్యాకరున్ శ్రీకరున్" అని కోరుటలోఁ దన ప్రజలయెడలఁ దాను చేయవలసిన విట్టవివరి ధర్మము నెఱవేరినది. శివుని యనుగ్రహమును బడసి పంచగ్రహోచ్చలో సర్వలక్షణలక్షితుండైన ముంజభోజుని బుత్రునిగాఁ బడసినాఁడు.

ముంజభోజుఁడు :

ఉద్భటుని ప్రథమ శిష్యుఁడై యిహపరసాధకుఁడైన ముంజభోజుఁ డొక రాజర్షిగాఁ జిత్రింపఁబడినాఁడు. క్షత్రధర్మమే యుజ్జ్వలాకార సంపదతో సాక్షాత్కరించినరీతి నితఁడు ప్రజలకుఁ గనులపండువగాఁ బరిపాలించెను. ఒక యనిర్వచనీయమైన పూర్వజన్మ సంస్కారముచే నతఁడు చదువకమే వేదశాస్త్రముల వైఖరులలో నడచుకొనెను. చదివిన వెనుక నికఁ జెప్పనేల?

తండ్రి శివభక్తియుఁ దన జన్మసంస్కారమై వెంటనంటి యతని గుణగణములకు వన్నెపెట్టినది. నిరంతర పరమేశ్వర చరణారవింద ధ్యానమున మహేశ్వర వేషమునే ధరించి రాజ్యపాలనము కూడ శివదీక్షగనే యెంచి నిర్వహించెను. తండ్రి విరక్తుఁడై గురునాజ్ఞఁ గాశికిఁ జన్న పిమ్మట నితఁడే ప్రజలకు దల్లియు తండ్రియు గురుడై పరిపాలించెను.

ఒకనాఁ డతని కాకస్మికముగా వైరాగ్యభావ ముదయించినది.

"ఈ కాంతలు నీతనయులు
నీ కాంచనరాశు లెల్ల నెన్నడు ధ్రువముల్
గాకుండు టెఱిఁగి బుధులకుఁ
గాకోదరరాజహారుఁ గని మనవలదే" —3 - 96

తనకుఁ గలిగిన యీ భావము మంచిది యనిపించినను గురువు నాజ్ఞ లేనప్పు డది చెల్లదు.

"సద్గురునాథ కటాక్ష స
ముద్గత కారుణ్యలాభమునఁ గాక తగన్
హృద్గోచర మెట్లగు దివి
షద్గంగాధరు పదాంబుజద్వయి నాకున్" —3 - 101

ఈ కారణమున సద్గురువు నాశ్రయింపవలెనని యతఁ డూహించుచుండఁగా నొక రేయి నుద్భటుఁడు స్వప్నమున సాక్షాత్కరించి కైలాసమునకు దారి జూపెను. తాను కైలాసము నారోహించి దేవతలను దర్శించి దిగంతవ్యాప్తమైన తేజము రూపమున శంకరుని సపరివారముగా దర్శించెను. పిమ్మట నచిర కాలమునకే స్వప్నమునఁ బొడకట్టిన గురుఁడగు నుద్భటుఁడు స్వయముగా దన యింటికి వచ్చి పరమోపదేశము చేసెను. శివదీక్ష లేక మాహేశ్వరులు తరింపరు గనుక గురువుకడ నతఁడు శివదీక్షను బొంది తన మనస్సులోని వైరాగ్య భావమును దెల్పెను. భూభారమును నిర్వహించుట రాజులకు ధర్మము. ధర్మా చరణము మాని యెవ్వఁడును ముక్తి నందఁడు. పెద్దకాలము భూమిని రక్షించి శివభక్తిపరుఁడై తుదకు వైరాగ్యసంపన్నుఁడు కావలెనని గురువాజ్ఞ యిచ్చెను. దానికి బద్ధుఁడై ముంజభోజుఁడు క్రమమైన సంప్రదాయమార్గమున గర్మసిద్ధినంది తుదకుఁ దరించెను.

భోజుని పాత్రచిత్రణము కూడ మిక్కిలి సౌమ్యముగను సంప్రదాయబద్ధ ముగను జేయఁబడినది. ఉద్భటచరిత్రమందలి యుత్తమమైన, సముచితమైన పురుషపాత్రలలో నిది యొకటి. పాండురంగ మాహాత్మ్యమందలి పాత్రల కున్నంత విస్తృతిగాని, చైతన్యముగాని యిందు గనుపింపకపోయినను మిక్కిలి నిపుణతతో నిర్వహింపఁబడిన పాత్రసృష్టి యిదియని చెప్పవలెను. బసవపురాణ మున నుద్భటుని కథాఘట్టమున భోజుఁ డను పేరున్నను నిందలి కథావిస్తృతికిని బాత్రపోషణమునకును గల ప్రత్యేకత యందు లేదు. కర్ణాట శైవ వాఙ్మయ ములలో నీ పాత్రచిత్రణమే లేదు. కనుక నిది దాదాపు రామకృష్ణుని స్వతంత్ర పాత్రసృష్టియేయని గ్రహింపవచ్చును.

ఉద్భటుఁడు :

శాపగ్రస్తులైన గంధర్వుల నుద్ధరించి తరింపఁజేయుటకై కారణజన్ముఁడుగా శివుని సంకల్పసృష్టిగా నవనికి దిగి వచ్చిన గురుమూర్తి యితఁడు. సద్గురు వెట్లుండవలెనో యను నంశమును రామకృష్ణుఁ డుద్భటుని రూపమునను, బొందు

రంగ మాహాత్మ్యమున నగస్త్య వాధూల మహర్షుల మూలముననుᐟ నారదున కుపదేష్టయగు శివుని మూలమునను విశదపరచినాఁడు. అందుద్భటుని పాత్రలో శివతేజము మూర్తీభవించియున్నది. ఇత డాజన్మసిద్ధుఁడు. పరమమాహేశ్వరుఁ డగు ముంజభోజునకు దీక్షాగురువు. మానవుఁడుగాఁ బరిపోషింపఁబడిన యీ పాత్రలో శాంతి, దాంతి సంప్రదాయము, మహానుభావము మూర్తీభవించి యున్నవి. సర్వధర్మముల సముచితత్వ మితని యుపదేశ సర్వస్వము. భోజుఁ డకాలమున వైరాగ్యభావము వహించినప్పుడు వానికిఁ దొలుత స్వప్నమునను బిమ్మట భౌతికముగను సాక్షాత్కరించి తత్సంకల్పమును సమయోచితముగా మలచినాఁడు. పరమార్థమునకును బాహ్యప్రపంచమందలి సత్కర్మాచరణము నకును పరస్పర వ్యతిరేకభావము లేదని యితని యుపదేశము. యోగాగ్నిలో నితఁడు తనువును దీప్తము చేయుచున్నప్పుడు పుట్టిన ధూమము కూడ పరమ పవిత్రమై గంధర్వులకు శాపవిమోచనమును గలిగించినదనగా, నితని భౌతిక శరీర మందలి ప్రత్యణువును బ్రాహ్మీభూతమై కారణసంకల్పిత మైనదని వేఱుగా దెలుప నక్కరలేదు. ఈ యంశమున నితని పాత్ర పురాణములలోని దధీచి మహాముని పాత్రను బోలియున్నది. ఇట్టి యతిమానుష మహిమాన్వితుఁ డగుటవలననే దివికేఁగినవానిని గూడ శివుఁడు మరల భూమికిఁ గొనివచ్చి శరీరమును బ్రసాదించి మఱికొంతకాలము భూలోక వాసులైన యాస్తిక సాధకులను దరింపఁజేయుటకు సాధనముగా నియోగించినాఁడు. ఇంతటి వాఁ డాజన్మబ్రహ్మచారి యగుటకన్న లోకోద్ధారకమైన యొక గురువంశమునకుఁ గర్తయగుట లోకకళ్యాణకారకము. ఇట్టివానికి వివాహము బంధహేతువు కాదు. ఉద్భటుఁడు వివాహితుఁడై యుత్తమ గృహస్థధర్మ నిర్వాహకుఁడై ముదిగొండ వంశమునకుఁ గర్తయయ్యెను.

రసము

మాహాత్మ్యములను బ్రతిపాదించు కావ్యము లన్నియు గాకున్నను జాలవఱకు భక్తిభావప్రధానములై యుండును. అందుఁ గొన్ని శృంగారరసప్రధానములు, మఱికొన్ని శాంతరసప్రధానములునై యుండుట సహజము. ప్రబంధవాఙ్మయ మున నిస్సందేహముగాఁ జేరిన మనుచరిత్రము, కాళహస్తీశ్వర మాహాత్మ్యము, ఘటికాచల మాహాత్మ్యము, ఉద్భటారాధ్య చరిత్రము, పాండురంగ మాహాత్మ్యము శాంతరస ప్రాధాన్యము వహించిన రచనలే.

ఘటికాచలమాహాత్మ్యము

ఘటికాచల మాహాత్మ్యమునఁ బ్రధానకథలో ఋషులు ఘటికాచలమునఁ దపస్సుచేసి నృసింహుని బ్రసన్నుని జేసికొని ప్రతిష్ఠ చేసిన సన్నివేశమంతయు భక్తి భావపోషణతో నిండి, శాంతరసమున కున్ముఖత్వము వహించుట జరిగినది. ఉపాఖ్యానము లంగరసములు మఱికొన్నిటితో నొప్పారి వైవిధ్యము చూపుట కావ్యధర్మముగదా! నారదుని జన్మవృత్తాంతమున శృంగారరసాభాసము పోషింపఁబడినది. గోవిందశర్మ నిష్ఠాపరుఁడైన బ్రాహ్మణుఁడు. అతఁ డొక పరిచారికయందు లగ్నమనస్కుఁడై కామించుట యను ఘట్టమున శృంగారరస

పోషణ మున్నను బ్రకరణమున నౌచిత్యము లోపించుటవలన నది రసస్థితిని సాధింపలేకపోయినది. ఋషుల తపస్సును భంగ మొనర్చుట కప్సరసలు భూమికి దిగివచ్చుట, వనవిహారము, పుష్పాపచయము, నృత్తగీతాది విశేషములను వర్ణింపఁబడిన తావునఁగూడ శృంగారరసానుగుణములగు నాలంబనోద్దీపనాది విభావములు పోషింపఁబడినవి. కాని యాయప్సరసల యత్నము విఫలమగుటవలన, ననురాగరేఖ యుభయ పక్షములను లోపించుటవలనను శృంగార రసాభాసమే గాని యటఁగూడ రసము సిద్ధింపలేదు. వసిష్ఠుఁడు భార్యకు, గాంపీపురమును జూపి వర్ణించుచున్న ఘట్టమునఁ గొన్ని శృంగారరసచ్ఛాయ లున్నవి. మొత్తముమీఁదఁ గావ్యమం దెచ్చటను బరిపుష్టమగు శృంగారరసము సిద్ధింపలేదు. ప్రధానరసమగు శాంతము కూడ ఋషుల స్తుతులు మున్నగు తావులందుఁ బోషింపఁబడినదే గాని రసవద్ఘట్ట మెద్దియు సృష్టింపఁబడలేదు.

ఉద్భటారాధ్య చరిత్రము

ఈ ప్రబంధమున వివిధ రస భావములు, రసములు చక్కగాఁ బోషింపఁబడినవి. ప్రథమాశ్వాసమునఁ బార్వతీపరమేశ్వరుల వనవిహార ఘట్టమునఁ జక్కని దివ్యశృంగార రసపుష్టి కలదు. ఘట్టము ప్రారంభముననే యుద్దీపన విభావనమగు వసంతము వర్ణింపఁబడి, చక్కని వాతావరణము నేర్పరచినది.

"చిగురులఁ గ్రొవ్విరిగుత్తుల
నగజాధిపుఁ బూజసేయ నరుదెంచె ననన్
దగియొక్క కాలమున నా
జగతీధర వనములన్ వసంతము దోఁచెన్" —1-83

ఇం దలౌకికత్వసాధనకు "భవుఁగొల్చువారల పాతకంబుల రీతి రమణఁగారాకులు రాలెఁ దరుల" నను పద్యమున "శాంతస్య అహంకార ప్రశమైకరూపతయా సిద్ధేః" యను నానందవర్ధనుని మతము ప్రకారము శాంతరసభావముగూడఁ బోషింపఁబడినది. ఐనను,

"కురువింద కమ్మఁదీఁగెలు
నరవిందము ననఁగి పెనఁగ సహకారంబుల్
గిరివరతనయాలింగిత
హరమూర్తిం దలఁపఁ జేసె నామనివేళన్" —1-87

మున్నగు పద్యములలో శృంగారమునకు స్థాయి భావమగు రతియే స్థాపింపఁబడినది. అట్లు స్థాపింపఁబడిన భావము,

"చల్లనిగాడ్పులన్ సొబగు చల్లెడు వెన్నెలఁ బువ్వుతావులన్
బల్లవవిభ్రమ స్ఫురణఁ బ్రౌఢపికాలి శుకాలి పల్కులన్
బల్లిదుఁడైన యట్టి గణభర్త భవానియుఁ దాను వేడ్క వ
ర్ధిలఁగ నెల్లచోట విహరింపఁగ నొప్పె నభీపరీతుఁడై" —1-89

మొదలగు పద్యములందుఁ బోషింపఁబడినది.

"చంద్రికాధౌత నిర్మల చంద్రకాంత
నివిత నవపుష్పశయ్యల నిలిచి నిలిచి
కలికి బాగునఁ బొదలలోఁ గలసి తిరిగి
రటుల దంపతులా వనాభ్యంతరమున" —1-90

అను పద్యమున ననుభావము పోషింపఁబడిన విధము సొగసుగ నున్నది. నాల్గవపాదమందలి 'అటుల' యను పదముయొక్క సామర్థ్యమునఁ బాఠకుల హృదయసంస్కారము ననుసరించి లౌకికమో యలౌకికమో యగు సంయోగ శృంగార మనుభూత మగును.

"అల్లన మావికొమ్మ చిగురాకు నిజాంచిత చంచుధారచేఁ
జిల్లులువుచ్చి తద్రసవిశేషము నాలుకసోఁకఁ జొక్కుచున్
ద్రుళ్లి పికంబుఁ జూడుమని ధూర్జటి చూపినఁ జూచి పార్వతీ
హల్లకగంధి వంచె వదనాబ్జము కన్నులనవ్వు దేరఁగాన్" —1-93

అను పద్యమునందలి ధ్వని వ్యాపారముచేఁ జుంబనాలింగన దంతనఖక్షతాది విశేషములును నాయికచే ననుభూతమైన లజ్జయుఁ దృప్తియు నున్మీలితము లగును. వాచ్యములు కాని యనుభావములను జిత్రించుటవలనఁ బార్వతీపర మేశ్వరగతమైన రసపోషణము జరిగినందుల కెట్టి దోషముగాని యనౌచిత్యము గాని కావ్యమున కంటుటలేదు. ఈ పద్యమున సంయోగశృంగారము వర్ణింపఁ బడిన దనుటకు నిదర్శనముగా,

"అలకాంత కలితముఖియగు
కులకాంతయుఁ దానుగూడి గోపతిగమనుం
డలకాంతక కలధౌతా
చలకాంతస్థలులఁ గ్రీడసలుపుచు నుండెన్" —1-95

అను కవివర్ణనము,

"..... ....
లోకేశ్వరుఁ డీ వనంబులో నీశ్వరితో
నేకాంతంబున నుండఁగ
నీ కాంతలు మీరు వచ్చు టిది తగ వగునే" —1-101

అని నందీశ్వరుఁడు గంధర్వులను మందలించిన పద్యమును నిదర్శనములు.

ఈ విధముగా నీ పార్వతీ పరమేశ్వర వనవిహార ఘట్టమెంతయు రమ్యమై యౌచితీ పరిపోషకమైన శృంగార రసవద్ఘట్టము. ఆదిదంపతుల శృంగారమును జిత్రింపఁగల కవికి రసపోషణమున నసాధ్యము గలుగదు.

శప్తులైన గంధర్వుల రూపరేఖాది వర్ణనమునను జేష్టానిరూపణమున బీభత్స రసము సముచితముగఁ గుతూహల జనకముగఁ బోషింపఁబడినది. ఈ రస

పుష్టికై చేసిన వర్ణనయుఁ దత్పదప్రయోగ వైఖరియుఁ దిక్కన స్త్రీపర్వమందలి పోలికలను వర్ణనము, నాచనసోముని కావ్యమందలి పిశాచద్వయ వర్ణనమును బోలియున్నది.

"చటులోదగ్రతరాట్టహాసములుఁ గేళచ్ఛన్న ఘోరాస్యముల్
కుటిలక్రూర విలోచనంబులు మెఱుంగుల్ గ్రాయు ఫూత్కారముల్
పటుభీమోద్భట దంతపీడనము లస్పష్టాంగ సంధుల్ మహా
ఘటపీనోన్నత కుక్షిభస్త్రికలు వేగం దాల్చి రాభేచరుల్" —1 . 112

దీని కంగరసముగా హాస్యముకూడ "భల్లూకవల్లభుల నల్లసంబాడెడు నల్లజుంజురు వేనులును... .. ..." మున్నగు వచనమునఁ బోషింపఁబడినది. ఇది యొప్పైన రసమేళనము.

వల్లకిపురాధీశ్వరుఁడగు ప్రమథేశ్వరుని, నతని కుమారుఁడగు భోజుని నాలంబనముగాఁగొని ధర్మవీరము శాంతము నిర్వక్రమగు మార్గమునఁ బుష్టి చెందినవి.

"కువలయ రక్షకుండు, బుధకోటికిఁ బ్రాణపదంబు, పార్వతీ
ధవునకుఁ బువ్వుదండ, యమృతంబుల పెన్నిధి దుగ్ధవార్ధిసం
భవుఁ డిటువంటి రాజు కులభర్తగఁ దేజముగన్న యన్నృప
ప్రవరుని బ్రస్తుతింప నహిరాజునకైనఁ దరంబె యిమ్మహిన్
చపలతరేంద్రియాశ్వముల శంకరపాద
కమలంబులను సాహిణములఁగట్టి
తాపత్రయాభీలదావానల స్ఫూర్తి
విలసిత విజ్ఞానవృష్టి నడఁచి
యకలంక కీర్తి చంద్రిక లోకాలోక
గుహలకుఁ దెలివి నూల్కొనఁగఁజేసి
చటులప్రతాపాంకుశము శత్రురాజన్య
కరిశిరస్థలులపై నిరవు కొలిపి
పలికి బొంకక గుణముల వెలితి గాక
నడక నడలక యడిగిన గుడుసుపడక
యన్వయాచార మెడలక యాది శైవ
లక్షణంబుల నాథరాధ్యక్షుఁ డమరు" —ఉద్భటా. – 165, 166

ప్రమథేశ్వరునకు సంతతి లేక దిగులుపడిన సందర్భమునఁ జిత్రింపబడిన యతని మనోభావములతో, సాహిత్యదర్పణకారుఁడు ప్రతిపాదించిన వత్సల రసమునకు లక్ష్య మనఁదగి రచన తీర్చిదిద్దఁబడినది. ఈ రసమునకుఁ బుత్రాదు లాలంబన మగుదురనియు, నాలింగనాంగ సంస్పర్శాదు లనుభావము లగుననియు నా యాచార్యుఁడు ప్రతిపాదించినాఁడు. తదభావమున నగు స్మరణాదులును జేష్టాది భావనలును దద్రసోన్ముఖములగు సంగవరిపోషణములే యగును.

"గలుగల్లంచును గాళ్లయందియలు వల్కఁ జెక్కులన్ మద్దికా
యల తళ్కుల్ గరువంపుచూప నిటలవ్యాకీర్ణ లంబాలకం
బులతో ముద్దులు చిల్కుచుం గలవచః పూర్ణాస్యుఁడై తప్పట
డ్గులువెట్టఁగల పుత్త్రుఁ డబ్బునొకొ నాకున్నీకు లోలేక్షణా!" 1-20

మదాలసుని కథలోఁ గనకలతా మదాలసు లాలంబనముగా వైశికమైన శృంగారరసము పోషింపఁబడినది. ఇందు వేశ్యకొఱకై మదాలసుఁడు విరహ పడిన సందర్భమున విప్రలంభము సాంగోపాంగముగాఁ బోషింపఁబడినది. అందు నిశీథము, వెన్నెల మున్నగు నుద్దీపన విభావము లున్నవి. అటుపైని సంయోగ శృంగారముకూడఁ గుప్తముగా నొక పద్యమున వర్ణింపఁ బడినదేగాని (2-229) పోషింపఁబడలేదు.

భోజునకు వైరాగ్య ముదయించిన ఘట్టమున నాలంబనముగాఁ గొని, నిర్వేదము స్థాయిభావముగా శాంతరసము పుష్టినందినది. ఈ రీతిగా నుద్భట చరిత్ర వివిధ రస పరిపోషణలచేతను, దత్తదనుగుణ పద్యగతరసవత్త్వ సిద్ధిగల రచనచేతను జదువరుల హృదయముల కానందము గలిగింపఁగలిగినది. రమణీయార్థ ప్రతిపాదకములగు శబ్దముల ప్రయోగము పాండురంగమాహాత్మ్యమందు వలె నిందు పూర్తిగా సిద్ధింపకున్నను, రసాత్మకములగు వాక్యములతో, రస వద్ఘట్టములతో నిండి యాకావ్య మొప్పుచున్నది. కావ్యమం దెల్లెడల శివభక్తి పరమై యుద్భట, భోజ, ప్రమథేశ్వరాలంబనమైన శాంతరస మంగిరసముగాఁ బోషింపఁబడినది.

పార్వతీపరమేశ్వరుల విహారఘట్టము

"మారారి యుమాన్వితుఁడై నిష్కుటాంతర విహారమొనర్చిన" సందర్భ మందలి రసపోషణము మిక్కిలి విచిత్రమైనది. ఉద్భట చరిత్రములోఁ బోల్పఁ దగిన సమానేతివృత్తమైన యీ ఘట్టమును రసదృష్టితోఁ బరిశీలించుటవలన నీ రెండు కావ్యములయందలి రసపోషణ విధాన భేదములు స్పష్టమగును. ముఖ్యముగా గమనింపఁదగిన భేద మేమనఁగా నుద్భటచరిత్రమందలి యీ ఘట్టమున రసోద్దీప్తియుఁ బాండురంగ మాహాత్మ్యమందలి ఘట్టమున రసధ్వనియుఁ బ్రధానముగ నుపాత్తములైనవి. అనఁగా మొదటిదానియందుఁ గేవల ప్రతిభయు, రెండవదానియందు సంయమముతోఁగూడిన ప్రతిభయు గానసగును. వనవిహారము నొనర్చు శంకరుని మారారి యనుటలో నీ సంయమమే సూచింపఁబడినది. సంయమమున్నంతమాత్రమున నతఁడు రసికుఁడు కాకపోఁడు. పార్వతీపరమేశ్వరుల యాలంబనమునకు నుద్దీపన విభావములుగా నాఱు ఋతువులు నచట సన్నిధి చేసినవి.

"మందిరోద్యానఖేల నానంద విభవ
మవధరించెడు తారావిటార్ధమౌళిఁ
జివురు గుత్తుల విరులఁబూజించుటకునొ
యాఱు ఋతువులు సన్నిధియయ్యె నచట" —పాండు. 1-180

ఇందలి రసపోషణలోని గాంభీర్యము నిరుపమానము. చిగురుగుత్తులు, ఆఱు బుతువులు నను శబ్దముల ప్రయోగమువలన ప్రకరణగతమైన శబ్దశక్తిమూలక వ్యంజన వర్తించును. ఉపమానగతమైన కవి సమయసామర్థ్యమువలనఁ "చిగురు గుత్తుల" ననుటలో వక్షోజసంపదయు. "బుతువు"లనుటలో నాయికాగతమైన ధర్మబద్ధసమయోచితత్వము, "తారావిటార్ధమౌళి"యను శబ్దమువలన శంకరుఁడు శృంగారభావపూరితుఁ డనియు నర్థస్ఫూర్తి గలిగి యాలంబనోద్దీపన విభావములను గంభీరతరములుగను ద్విగుణీకృత రసభావపోషకములుగను జేయుచున్నది. తారావిటార్ధమౌళి యను శబ్దమువలననే యతఁ డర్ధనారీశ్వరుఁ డనియు, నాయిక చంద్రకళయనియు, నాయకుఁడు కళల కధినాథుఁడనియు వారి శృంగార మలౌకికమేగాని భౌతికము గాదనియు వెంటనే యొక సంస్కారము కూడ సహృదయుల భావపథమున గోచరించును. ఈ దిగువ పద్యమున నా దంపతుల శృంగార భావమందలి యలౌకిక ధర్మము చక్కగా వ్యక్తము చేయఁబడినది.

> "గంధవిరహితమను బుద్ధిఁగనక తేఁటి
> మూతివిచ్చిన మోదుగ మొగ్గఁ దగిలి
> సౌరభా కాంక్షఁ జొచ్చి చెన్నారెఁ గీర
> తుండవశమైన నేరేడు పండువోలె" --పాండు. 1-183

ఈ ఘట్టము మొత్తముమీఁద శృంగారము స్థాయిభావము నందినది యీ దిగువ పద్యమందలి రసధ్వని సందర్భముననే.

> "విమలమయూఖరేఖయు నవీన తరోత్పలపత్రమున్ బ్రవా
> శమణియు నొక్కటీవ యబలాకృతిఁ దాల్చెనటన్న వించు వి
> భ్రమ శిథిలాంగి యయ్యెఁ గుచభార నితంబకపోల గోపన
> క్రమ కల నాకులాత్మ యయి కన్నుల నీరు నదల్చె గౌరియున్"
> —పాండు. 1-186

ఇందలి యసంలక్ష్యక్రమ వ్యంగ్యము ఘట్టమంతటికిని రసస్థితి నిచ్చుట రామకృష్ణుని సంయమమునకు నిదర్శనము. ఈ యసంలక్ష్యక్రమ వ్యంగ్యమే యుత్తమ కక్ష్యకుఁ జెందిన శృంగార రసధ్వనిగాఁ బరిణమించినది. కావ్యత్వమునకుఁ బ్రాణపదములైన యంశములను బోషించుటలో నీ కవి కాళిదాసాది మహాకవుల యడుగు జాడలలో నడచునని యీవిధమైన రసపోషణము చాటుచున్నది.

ఈ విహారమునఁ బార్వతి శివు నుపచరించుటలో వినయము, అనునయము, అభినయము, అనుకూలత యను భావములు వర్ణింపఁబడినవి. ఇం దనుకూలత యను శబ్దము సంయోగ శృంగారమును సూచించును. ఆదియును ఘట్టము నందెచ్చటను వాచ్యము కాలేదు. వర్ణింపఁబడిన తావునఁగూడ వ్యంగ్యముగనే యున్నది. కాని యిచ్చట రసధ్వని పాటింపఁబడలేదు.

"చిగురులు దేరఁజేసి విరివిక్కని చక్కని పువ్వుగుత్తులన్
బిగువు చనుంగవంబొదివి వ్రేలెడు విల్కలఁజోపి తేనియన్
బొగపిన వల్కలం బొగడి భూతపతిన్ బతిమెచ్చఁజేసె న
య్యగజ తదుద్యమార్హ వినయాను నయాభినయానుకూలతన్"
—పాండు. 1 - 190

ఇందుఁ "దద్యుమార్హ" యను పదముల ప్రయోగమునను "అనుకూలతన్" అను ప్రయోగమునందును శృంగారానుకూలములగు సంచారి భావములు వ్యంగ్య మగుట వలన భావధ్వని యని వ్యక్తమగుచున్నది.

నిగమశర్మోపాఖ్యానము

ఇది యొక్కటే యొక ప్రత్యేక కావ్య మనఁజెల్లును. ఇం దనేక రసభావ ములు చాలనము చేయఁబడి శాంతరస మంగిరసముగా నుపాఖ్యానము మొత్తమునఁ బాదుకొనినది. ఆయా ఘట్టములలో శృంగార రసానుగుణమగు నాలంబనోద్దీప నాది విభావ సముదాయము కనుపించును. కథౌచితి ననుసరించి యిది సుశ్లిష్టమై యున్నను గథలో స్థాపింపఁదలచిన మహాధ్వని యనఁబడు ధర్మప్రతిపాదనము దృష్టిలో నీ శృంగార భావ పోషణమునం దెక్కువభాగము దూష్యముగనో యాభాసముగనో సిద్ధించినది. భారతము నందలి సైంధవ కీచకాది పాత్రల యాలంబనమునను, రామాయణమున రావణుని యాలంబనమునను బోషింపఁ బడిన భావము సహృదయ పాఠకుల హృదయ వ్యాపారమునకు ధర్మశీలత నాపాదింపఁజేయుచున్నది గదా! దానిని గమనించిన రసతత్త్వపారంగతులగు మహా కవు లా మార్గమున నిట్టి ఘట్టములను, రసభావములను దీర్చి దిద్దుదురు. కనుక నిగమశర్మోపాఖ్యానమునందలి శృంగారరసము సమగ్రముగాఁ బరిపోషింపఁ బడినదని చెప్పఁజాలము. ఉపాఖ్యానము మొత్తముమీఁద నొక్క తావున మాత్రము సుకుమారమైన, పవిత్ర మైన శృంగార రసభావస్ఫూర్తి భావధ్వనిగాఁ బోషింపఁబడినది. నిగమశర్మభార్య చాల కాలమున కింటికి వచ్చిన భర్తపాద ములు కడిగినది.

"ఆ పైఁదలి ప్రాణేశ్వరు
శ్రీపాదద్వయముఁ గడిగె శీతల వారిన్
వ్యాపృత నిజనిశ్వాసజ
తాపంబునఁ గొంత కొంత తప్తము కాఁగన్" —పాండు. 3 - 25

చన్నీళ్లతో భర్తపాదములు కడుగఁగా సతని పాదము లామె నిట్టూర్పు గాడ్పులచే. గొంత వెచ్చఁబడినవి. అనఁగా నతనికి సుఖముగా నుండున ట్లుపచరించినదిఁ నిశ్వాసమున నింత వియోగజతాపమును జిరకాలముగా భరించుచున్న యామె ముగ్ధ కాదను నంశము ప్రకటమగును. తన బాధ నంతవఱ కెవ్వరికిని దెలియ నీయక దాచి మెలఁగిన గాంభీర్యముతోపాటు భర్తయెడల నామెకుఁ గల నిగూఢ గాఢతరానురాగము కూడఁ జిత్రింపఁబడినది. ప్రాణేశ్వరశబ్దమువలన నామె

యనురాగాతిశయము, శ్రీపాదద్వయ శబ్దప్రయోగమున దైవసమానమైన భక్తి భావము, కవిచే నుద్దిష్టములైనవి. ఎంత సుకుమారముగా, గంభీరముగాఁ బవిత్రముగాఁ బోషింపఁబడిన రసభావమైనను నిగమశర్మయం దాలంబనత్వము లేకపోవుట వలన నాభాసమే యగుచున్నది.

"భార్యపాలిండ్లు రిక్తకుంభములు రోయి
వెలఁది పసుదోయి నిండు కుండలు కులంబు
తరుణి ఫాలంబు చవితి చందురుఁడు వేశ్య
నుదురువానికిఁ బ్రతిపదిందుండునెమ్మె"
—పాండు. 3 – 11

అను పద్యమున నిగమశర్మభార్య నాలంబనముగాఁ గొనిన భావమే కళత్ర నిష్ఠము.

కాపుకోడలికిని నిగమశర్మకును నడుమ జరిగిన కలాపమునందు సాంగోపాంగమైన శృంగారరసపోషణ మున్నది. ఘట్టము మొదటనే యాలంబన విభావము మిక్కలి ప్రత్యేకతతో వర్ణింపఁబడినది.

"కలదా శూద్ర వసతి శ్రీ
కల దాననఁజాలు నొక వికారపుఁ గోడల్
చలదాలోల కటాక్షాం
చలదామ నిబద్ధ తరుణజనభంజనయై"
—పాండు. 3 – 60

పార్వతీ పరమేశ్వర శృంగారమున భూతపతి శబ్దప్రయోగమువలె నిందు వికార శబ్దము సాభిప్రాయముగ నిందలి రసపోషణలోని మ్లేచ్ఛత్వసూచకముఁగఁ బ్రయోగింపఁబడినది. అచ్చటి భూతపతి శబ్దముగూడ సాభిప్రాయముగలఁ బరమేశ్వరుని రసాతీతలక్షణము, దుస్సాధత తెలియుటకొఱకుఁ బ్రయోగింపఁ బడినది.

నిగమశర్మ, కాపుకోడలు నాయికా నాయకుల వలె నీ చిన్న ఘట్టమున నాలంబనములై యేకాంతము, అంధకారము నుద్దీపన విభావములుగాఁ జేయఁ బడినవి.

"ఇంటను నష్టమాఁక యొకయింతయు లేక చరించువానిఁ జే
నంటినఁ గందు కెందళుకు లంగమునం గలవాని మిక్కలిన్
గంటికి నింపువానిఁ దెలికన్నులవానిఁ బిసాళిబాఁపనిన్
బంటది గోరుఁజారు కుచపంజరకీరముగా రచింపఁగన్"
—పాండు. 3 – 61

"కరఁగిన డెందముల్ విసువుగానని కోర్కులు పారవశ్యమున్
బొరసిన నిట్ట చూపులు గుములొ్కను ముత్పులకాంకురావళుల్
విరిఁగిన సిగ్గులుంగలిగి చీఁకటి వేకటి రేలఁ జాల ద్రా
లిరి తలిరాకుబోఁడియు నళీక విశిష్టుఁడు దుష్ట చేష్టలన్"
—పాండు. 3 – 66

ఇందనుభావ వర్ణనము హెచ్చుగా నున్నది. ఈ ఘట్టము మొత్తముననే యనుభావ వర్ణనము హెచ్చుగా నున్నది. అంతేకాదు. శృంగారమును వాచ్యముగను, శాంతమును వ్యంగ్యముగను, రెండింటిని బరస్పర బాధకములుగను గూర్చి రచించిన పద్యమున్నది.

"పొన్నాకుపైఁ దేనె సన్నచంద్రిక మోవి
మాధుర్య మనక వేమాఱుఁ బొగడి
యామని బుగబుగ అంగచంపకదామ
గంధంబనక పెక్కుగతుల నెన్ని
పడనున్న పండ్ల సంపద పెంపు పాలిండ్ల
బీరం బనక సారె సారెఁ దలఁచి
తెలియ నభ్రచ్ఛాయ వలమానకచభర
ప్రకటనంబనక మాటికిని మెచ్చి
.... —పాండు. 3 – 72

ఇందు మూడవ పాదమున "పడనున్న పండ్ల సంపద" యను ప్రయోగము వలన శాంతరసపోషకమగు భావము వాచ్యమైనది. నిగమశర్మ నాలంబనముగా గొని యిందు శృంగారమును, స్త్రీసౌందర్యములోని నశ్వరత్వమును వర్ణించుటలో శాంతరసమును బోషించుట జరిగినది.

చనిపోయిన కుటుంబమునకై నిగమశర్మ దుఃఖించిన పద్యములలో గరుణరసము ప్రతిభావంతముగాఁ బోషింపఁబడినది. కాని యాలంబన విభావము కావ్యగౌరవాపాదకము కాకపోవుటచే నిందలి కరుణరసమునకు రావలసినంత హృదయద్రవీకరణధర్మము సిద్ధింపలేదు. అట్లు సిద్ధింపకపోగా నెడనెడ హాస్యరసచ్ఛాయలను గూడఁ గవి యాపాదింపవలసి వచ్చినది. ఈ దిగువ పద్యమున నచ్చమగు శోకభావము రసత్వ మందినది.

"ఎల్లరు నెల్లబోధనము లిచ్చి మృగాక్షులఁ గొంద్రుగాని యో
పల్లవపాణి యేఁ బరమపావనవంశము నిచ్చి కొంటి నీ
నల్లనిరూపు నిక్కమని నమ్మి ధ్రువంబది గాక నేఁడు వి
ద్యుల్లతికాధికాభినయ ధూర్వహమౌట యెఱుంగ నింతయున్"
—పాండు. 3 – 93

ఈ దిగువ పద్యమునఁ గరుణరసముతోపాటు హాస్యరసస్ఫూర్తి గూడ నెలకొన్నది.

"పుత్త్రులు లేరె యెవ్వరికి భూమి మదన్వయ వర్ధకుల్ భవ
త్పుత్త్రులవంటివారు మును పుట్టరుగాక తదాస్యకాంతి త
ద్గాత్ర వివృద్ధి తద్భుజయుగ స్ఫురణంబు తదుక్తి లక్ష్మి త
న్నేత్ర సరోజపత్ర రమణీయత చూపఁ జొక్కఁజేయవే"
—పాండు. 3 – 96

ఇందు "తద్గాత్రవివృద్ధి" యను ప్రయోగము మూలమునను, దత్పూర్వకృతమైన మాంసభక్షణాభ్యాసమువలనను బ్రాహ్మణుఁడగు తన కాశ్చర్యము గొలుపు గాత్ర వివృద్ధి తన సంతతికిఁ గలుగుటయు దానికి కారణ మెఱుఁగక తా నిట్లు మెచ్చుకొనుచు విలపించుటయు హాస్యచ్ఛాయకుఁ గారణము లగుచున్నవి.

నిగమశర్మ చరమావస్థలో దేహపరిత్యాగమువలుకు బీభత్సరసము చక్కఁగా పోషింపఁబడినది.

"ఇలఁ జదికిలఁబడి పలుమఱు
తలదూర్చుచు వికృతమగు వదనమున లాలా
జలములు దీగెలు సాగఁగఁ
బలుకు నతం డాలిగుబ్బిచి పరిచితరక్తిన్" —పాండు. 3 – 92

జాతరను వర్ణించు సందర్భమున బీభత్సము, భయానకము ఛాయలుగాఁ బోషింపఁబడినవి. అట్లే నిగమశర్మ దారాపుత్రులు దగ్ధమైన వర్ణన చేసిన మాలినీవృత్తము నందు భయానక స్ఫూర్తి యున్నది. దొంగలును యమ దూతలును నిగమశర్మను జుట్టిముట్టిన తావులందున్నది. నిగమశర్మ సంగమ తీర్థమునకు జేరినప్పటినుండి భక్తి భావముతోఁ గూడిన శాంతరససిద్ధి సుపుష్టముగా నున్నది. ఈ యుపాఖ్యానమందలి రసభావము లన్నియు సుశ్లిష్టములై యంగాంగి భావసిద్ధి కలిగియున్నవి.

వత్సలరసమని సాహిత్య దర్పణకారుఁడు ప్రతిపాదించిన రసమునకుఁ జక్కని లక్ష్య మీ కావ్యమున విలయహారిని వైకుంఠకాంతలు పెంచు సందర్భమున నున్నది.

"జలధి వీచివాత్యఁ జలిదాఁకెఁగా యని
యక్కున నందంద యలమియలమి
ప్రామట్టియా కొత్తిరాయిడిః బొందెఁగా
యని సన్న పొత్తుల నునిచి యునిచి
వాపోయి వాపోయి పసివాడి యాకట
బెగడెఁగా యని యుగ్గు వెట్టివెట్టి
పెనుజీఁకటులు గ్రమ్మ పెన్ బైట వసియించి
వెఱచెఁగా యని పుల్ల విఱిచి విఱిచి
మంచి లక్షణముల పుట్టుమచ్చవాఁడు
నేత్రములు విప్పనట్టి యీ నెత్రుకందు
వరద నేతెంచె నెవ్వారి వాఁడొ యనుచు
విలయహారిఁ దెచ్చి పెనుతు రవ్వీటి సతులు" పాండు. 3 – 156

ఇందలి తెనుఁగు పదములు, జాతీయములును వీటి సతుల చేష్టాదికములును మిక్కిలి రసానుగుణముగా నున్నవి. ఇట్లే సుశీలకథలోఁ దెరువరియగు బ్రహ్మచారి రూపమునఁ బాండురంగఁడు వచ్చినపుడు సుశీల నాలంబనముగాఁ

జేసికొని వత్సల రసభావపోషణ మున్నది. సుశీల వడ్డించిన వంటకము లన్నియు బ్రహ్మచారి తిని యింకను గావలె ననునప్పుడు సుశీల యాలంబన ముగా నద్భుతరసమున్నది.

"ఇసుమంతగాని లేఁడీ
పసిబాలుఁడు కుడుక గూటి ప్రాయమువాఁ డీ
ట్లెసఁగి బహుభక్ష్యరాసులు
మెసఁగెడి, విసువఁడు, ప్రతుష్టి మేకొనఁడుగదే!"
"మాయపుబిడ్డ యీనిసువు మానిసి పుట్టువుగాదు, దేవతా
నాయకుఁడో చతుర్ముఖుఁడొ నాభవబంధము లూడ్వనున్న నా
రాయణమూర్తియో యెఱుఁగరా దొక యించుకయున్ బుభుక్షమై
వేయిదొఱంగఁ డప్పములు వెల్లె సమస్తమునంచు నివ్వెఱన్"
....పాండు. 4 - 190 - 191

సుశీలకథయందు శాంతము ప్రధాన రసముగా వైరాగ్యలక్షణమగు నిర్వికార చిత్తత యీమె పాత్ర యాలంబనముగాఁ బోషింపఁబడినది.

"తాళిని విభుండు గట్టిన మొదల్ పతిదేవత యాసుశీల పెన్
గోలతనంబునన్ మగఁడు కొట్టినఁ దిట్టిన రట్టు పెట్టినన్
దాళి దినంబుఁ దచ్చరణతామరసంబులు గొల్చు ....
...."—పాండు. 4 - 141. 146

సుశీల యాలంబనముగా నభినవగుప్తుని మతమునకు సరిపడు తత్త్వజ్ఞాన మనఁ బడు స్థాయీ భావముకూడ నెలకొని శాంతరస పోషణము జరిగినది. ఇది సుశీల వార్ధకమునఁ గథాంతమున విస్తృతముగాఁ బోషింపఁబడినది.

"పరికల్పిత విషయోప భోగరహితోఽత్రస్థాయీ" యని యభినవగుప్తుని వాక్యము. సుశీల తనబిడ్డలకు మనుమలకు హితబోధ చేయు ఘట్టమున నిది పోషింపఁబడినది.

"అమిత భోగాయతనము దేహమను సర్వ
    ముగ్రకృత్యములేల యుడిగియుండు?
ధాతుమయంబు గాత్రమను ధాత్రీధరం
    బదియేల రాగంబు నవలఁద్రోయు?
నిచితనానాగుణప్రచుర మీ తనువను
    పటమేల చిరుఁగక పదిలమొందు?
నూర్మిపరంపరాయుత మంగమను వార్ధి
    యెడజీవన భ్రాంతి యేల యుడుగు?

నాపవంబు బాల దతికఠినాశయ
మెపుడు మైల విడువ దెందుఁ జివుకుఁ
బటికి డొక్క, దీనిఁ బాటింప రెప్పాట
లక్షయేనియును ముముక్షుజనులు"
....
....
విషయాంకురము గిల్లి వేయనివారికి
    నినుపకచ్ఛడమున కెంతదవ్వు ?
తెగఁగొని గసటు గడుగని వారికిని ద్రి
    షవణంబునకు నెన్ని బాళ్ల పట్టు ?
చింతలన్నియు మ్రోడు వేయనివారికి
    బోడయౌఁదలలకు నేడ కేడ ?
యేను తత్త్వంబులు నెఱుఁగనివారికి
    నెఱుకకు నేయూరి కేది తెరువు ?
....

"మస్తకిరీటహాటక సమంచిత కుంభయుతంబు, పీవరో
రస్తత రత్న దీప్త రుచిరంబు రమానమ సాలభంజికా
శస్త్రమునైన శార్జితను సౌధము నెక్కి సుఖించు బుద్ధికిన్
నిస్తులభక్తి గౌరవము నిచ్చెనయై చననిచ్చు మీఁదికిన్"

—పాండు. 4 – 273, 278, 281

కావ్యము మొత్తమునకుఁ బ్రధానరసమగుటవలన శాంత మెడనెడఁ బెక్కుపాఖ్యానములలో సువిస్తృతముగా నభ్యస్తమైనది. ధర్మరాజు పౌండరీకమునకుఁ బోవు సందర్భమునఁ గూడ నీ రసపోషణ మున్నది. ఇచ్చట స్థాయిగాఁ గొనిన భావము "తత్త్వజ్ఞానజ్ఞో నిర్వేదోऽ న్యస్థాయీ" యను మతము ప్రకారము నిర్వేదము.

"చింతాకంతయు వెన్కఁ దీయక కురుక్షేత్రంబునన్ బాపసం
క్రాంతస్వాంతుఁడనై సుహృత్సుతపితృభ్రాత్రాదులం జంపి య
త్యంత ద్రోహ మొనర్చియుం దిరిగెదన్ బ్రాణంబుతో.......
....

"అసిధారా దళితాత్మబంధుభుజమధ్యస్వైర నిర్యద్వసన్
మనటైపుట్టిన యిమ్మహాదురితమున్ మన్వేట్టియున్ వాజిమే
ధనమిద్ధానల భూతిచే నుసిమియున్ దప్పింప లేనైతి, నీ
కనటెప్పాటఁ దొలంగు నెట్టులగుదున్ గళ్యాణకల్యాత్ముఁడన్"

—పాండు. 5 – 39, 41

అయుతనియుతో పాఖ్యానము

అయుత నియుతోపాఖ్యానము గూడ బహు రసభావబంధురమగు నొక ప్రత్యేక కావ్యము. ఇందగస్త్యవాధూల మహర్షు లాలంబనముగా శాంత, రౌద్ర, ధర్మవీర రస పోషణ మున్నది. అగస్త్యుఁడు బ్రహ్మలోకమునకుఁ బోయిన ఘట్టమున,

"శశిరేఖఁ గైకొన్న సౌవర్ణగిరి వోలె
మినుఁకు జేడియఁగూడి మెఱయు వాని
నసురేజ్యుఁ బాటించు హాటకాద్రియుఁ బోలె
సంచ చెంగట నుండ నలరు వాని
శారదాభ్రము లంటు భూరిశైలముఁ బోలెఁ
దెలుపుఁ గైసేతల వెలయువాని
కకుబిభంబుల మీఁది కాంచనాగముఁ బోలె
వెలిదమ్మి గద్దియ వెలయువానిఁ
బొడవులన్నియుఁ దనయంత పొడమువాని
కడయు నడుమును మొదలు నేర్పడని వాని
సచ్చిదానంద కందమై హెచ్చు వాని
నలువ... ... ..." —పాండు. 5 – 174

అను తావున బ్రహ్మయాలంబనముగ శమము స్థాయి భావమున శాంతరసపోషణ మున్నది.

బ్రహ్మ యగస్త్యుని నుతించిన సందర్భమంతయు ధర్మవీరము. అగస్త్యుని హుంకార భ్రూభంగాదికములైన వివిధరసానుభావము లన్నియు లోకప్రతిష్ఠ గుఱించి దుష్టనిగ్రహాది లోకకల్యాణ సరణికొఱ కుపయోగించుటవలన నివి యన్నియు ధర్మవీరమునందే పర్యవసాన మందు చున్నవి.

"హుంకారములు లేవె యుపపురందర హతో
త్పాటనంబునకుఁ బాల్పడవు గాక
భ్రూభంగములు లేవె యాభీల వింధ్య గ
ర్వస్తంభనమునకు రావు గాక
చులుకాకృతులు లేవె జలరాశి నిశ్శేష
శోషణక్రీడకుఁ జొరవు గాక
జఠరాగ్నులు లేవె జటితాపి వాతాపి
తనుదాహమున నెదుర్కొనవుగాక
నిష్ఠ నీమాడ్కి లోక ప్రతిష్ఠ గుఱివి
దుష్ట నిగ్రహ శిష్టసంతుష్టి హేతు
రోపభీషణ రేఖా నిరూఢ గాఢ
లీలఁ గ్రీడించు ప్రోడలు లేరుగాక" —పాండు. 5 – 176

నియుతు నాలంబనముగాఁ గొని శృంగార శాంతరసముల భావ సమ్మేళనము చూపఁ బడినది.

"కుటిలాలకములు చీఁకటి ప్రోవులగు నైనఁ
జిచ్చంద్రికాధ్యముల్ చిత్తగతులు
మధురోష్ఠములు రాగమహితంబులగు నైన
భావముల్ వైరాగ్యబంధురములు
గురుకుచంబులు గర్వ భరితంబులగు నైన
హతదుర్వికారంబు లాశయంబు
లలవోక నడలు మాంద్యయుతంబులగు నైన
నంతరంగములు బోధాస్పదములు
పొగరుఁ జూపులు చపలంబులగున యైన
నిండు మనములు మిక్కిలి నిశ్చలంబు
లవుర వీరల కన నొప్పు సతివలందు
నిలిపె సమబుద్ధి ప్రియమూని నియుతమౌని" —పాండు. 5 - 180

ఇందలి వైరాగ్య బంధురాది భావములు శమమనఁబడు శాంతరసమునకుఁ జెందినవి. కుటిలాలకములు మున్నగు భౌతిక వస్తుసామగ్రి వర్ణనమంతయు శృంగారరసమున కుద్దీపన విభావాదు లగుచున్నది. నియుతుఁడు కన్యల వివాహమాడుటచే నిది సంయోగ శృంగారపోషణము. ఇట్లు పరస్పర విరుద్ధ మైన రెండు రసము లొకేతావునఁ బోషింపఁబడియు నియుతుని "సమబుద్ధి" యను ననుభావమువలన నే రసము ప్రధానమో చెప్పఁజాలని విధమున మేళవింపఁబడినవి. కాళిదాసు రఘువంశమున "రామమన్మథ శరేణ తాడితా, దుస్సహేన హృదయే నిశాచరీ, గంధవద్రుధిర చందనోక్షితా జీవితేశవసతిం జగామ సా" యనుశ్లోకమున రూపకాలంకారవశమున శృంగార బీభత్సములను పరస్పర విరుద్ధ రసములు నిష్పన్నములైనవి. అట్లే యీ పద్యమున శృంగార శాంతముల సమ్మేళనము సాధింపఁబడినది.

అయుతుఁడు శాపానుకూలమైన పరిణామము నందుటలో నద్భుత హాస్యరసముల భావసమ్మేళనమున్నది.

"నీరప్రాంగణ కర్కటీ బిలములన్ నిద్రింప మృత్స్నామయా
హారంబున్ గబళింపఁ బెల్లరవ నిట్టట్టుంబ్లుతంబుల్ గొనన్
దూరాయాస్యదహీంద్ర భీతి హతి గొందు ల్బాఱుగోరున్ మదిన్
సారాపేత మనోబలంబగు భవిష్యద్భేక ముత్సేకమై"
—పాండు. 5 - 275

ఇందు మానవశరీరమునుండి భేకశరీరమునకు మార్పుఁ జెందుటకు ముందుఁ దదనుకూలమగు మనఃప్రవృత్తి పరిణామము వర్ణించుటలో నద్భుతరస మున్నది. "గొందుల్బాఱుగోరున్" అను పదప్రయోగమునను, వికృత చేష్టాది వర్ణనము వలనను హాస్యవ్యక్తియున్నది. అయుతుఁడు చేసిన నృసింహస్తుతియందు యుద్ధవీర, శృంగార రసభావముల సమ్మేళన మున్నది.

"మిమ్మటమైన వాఁడి పవిమిత్రములై వెలుగొందు నీ నఖా
గ్రమ్ములకున్ మృదు ప్రకృతి గల్గుట క్రొత్త రమాకుచాద్రి పా
ర్శ్వమ్ములయందు నందుఁ గల సారగతుల్ నఖరాళిపాతసా
ధ్యమ్ములుగామిఁ గావలయు నట్లగుటల్ దితిపుత్రశాత్రవా"

—పాండు. 5 – 278

ఇందు నఖాగ్రములు వాఁడితనమునందు వజ్రమునకు మిత్రములై యుండుట రాక్షస సంహారము కొఱకుఁ గావున యుద్ధవీరము. తన్నఖములకే మృదు ప్రవృత్తి కలుగుట రమాకుచద్వయము నెడలఁ బ్రవర్తింపవలయు భావమున శృంగారము. మిథోవిరుద్ధ లక్షణమును గోల్పోయి సమ్మేళనమందినవి. ఇందు యుద్ధవీరము వ్యంగ్యముగను "రమాకుచాద్రిపార్శ్వము"లను శబ్ద ప్రయోగమున శృంగారము వాచ్యముగను జెప్పఁబడినవి. రమాకుచముల యందుఁ గల సారగతులవలన నవి నృసింహుని నఖరాళి పాతముచేత సాధ్యములు గావని వర్ణింపఁబడినది. సింహోచితములైన నృసింహుని క్రూర చేష్టలు ఆనంద, సౌందర్యమయమైన లక్ష్మీదేవి స్పర్శవలన నిష్ఫా రములగు చున్నవని యిందలి వ్యంగ్యము. రాక్షసునియెడల పవిమిత్రములై సమర్థములైన నీ నఖము లిచ్చటఁ పనిచేయ వనుటలో హాస్యస్ఫూర్తి యున్నది. నృసింహుని లక్ష్మీపతిత్వమువలన నతని సింహత్వముకన్న నామె లక్ష్మీత్వమే యెక్కువ సమర్థమని చూపుటవలన శృంగారభావము ప్రధానముగను దక్కినవి యప్రధానములుగను జేయఁబడినవి. మఱియు సింహత్వము దుష్టశిక్షణకును లక్ష్మీసమేతత్వము కటాక్ష ప్రసారమునకును జిహ్మములు – వ్యంజకములు. తనలోని యహంకారమును, గురుధిక్కార జనిత దోషమును దమించుటకు శాపప్రాప్తి కలిగించి నృసింహుఁడు తన్ను రక్షించుటకు పాద సన్నిధికి రప్పించుకొనినాఁడే గాని లక్ష్మీపతిత్వమువలనఁ దన శాపవిమోచనము మోక్షస్థితియుఁ దథ్యములనియు, నట్లు రప్పించుకొనుటవలన జయము పురుషకారమువలనఁ దనదే యనియు వస్తుధ్వనిగూడ ఈరసభావ పరిపోషణమువలనఁ గలుగుచున్నది.

ఈ నృసింహస్తుతిలోనే యొక పద్యమున రౌద్ర. ధర్మవీర, యుద్ధవీర రసభావముల చక్కని సమ్మేళన మున్నది.

"కోపవికారమంచు నొక కొందఱు, కొందఱు భక్తలోకర
క్షాపరతంత్రతా జనిత సాంద్రకృపాగుణమంచుఁ, గొందఱు
ద్దీపిత వీరసింహ విస్ఫూర్తిస్ఫుట ఖేట వికారమంచు నీ
చూపుల రక్తిమం బొగడుచున్ నుతియింపుదు రీశ్వరేశ్వరా"

— పాండు. 5 – 279

ఈ కావ్యమున నృసింహు నెచ్చట వర్ణించినను విచిత్ర రసభావ సమ్మేళవము ననే గౌరవించెను. కృత్యాదియందు దయావీరము, హాస్యము, యుద్ధవీరము మేళవింపఁబడినవి.

"మిగులఁగ నొప్పదవిన బిగువ యెక్కుడుగాని
కరుణాకటాక్ష వీక్షణము వాఁడు
దంష్ట్రావిటంక వర్ధనమ యెక్కుడు గాని
ముద్దుఁజందురు నేలు మోము వాఁడు
నరమృగదేహ విస్ఫురణ మెక్కుడు గాని
బహుకోటి మదన రూపంబు వాఁడు
దైత్యు దండించునుద్ధతియె యెక్కుడు గాని
శ్రితజనావళుల రక్షించు వాఁడు.
...." —పాండు. 1-31

మఱియొక తావున నృసింహుఁ డాలంబనముగ నద్భుత రస మద్భుతముగఁ బోషింపఁబడినది.

"వరసింహమధ్య ! యచ్చో
నరసింహుఁడు కుంజరాశనతఁదాల్చుట య
చ్చెరు వద్దేవుఁడు నిజమం
త్రరాజ పూజైకతానతాయతుఁ బోచుస్" —పాండు. 2-124

ఏనుఁగునకు సింహ మశనమగుట యాశ్చర్యము. విరోధాభాసాలంకారము వలనను, శ్లేషవలనను నిది సమర్థింపఁబడుచున్నది. కుంజరాశన మనఁగా రావిచెట్టు. నృసింహుఁ డశ్వత్థ స్వరూపుఁడైన పురుషోత్తముఁడని యిందలి ధ్వని. అలంకారములచేత నద్భుత రస స్ఫురణ, వస్తుధ్వనియు నిందున్నవి.

శృంగారహాస్యముల సమ్మేళనము మఱియొక స్తుతి పద్యమున నున్నది :

"హరికిరిదంష్ట్ర నాటుపడి యైందవరేఖఁదలిర్చు పూర్వ భూ
ధర శిఖరం బనంగ నుతిఁదాల్చు కుచంబునఁ బొల్చు భూసతిన్
బరిహసనం బొనర్చు రమభావము సిగ్గున మ్రొగ్గఁజేయవే
నరమృగరాజ నీ నఖము నాఁటినఁబొల్చు నురోజకుంభముల్"

—పాండు. 5-20

ఇం దైందవ రేఖ మున్నగు వర్ణనమువలన శృంగారము, పరిహసనంబు, నరమృగరాజ మున్నగు శబ్దములవలన హాస్యము విశ్రితములు. "హరికిరి దంష్ట్ర" యను ప్రయోగమునఁ గల శబ్దాలంకారమువలన దంష్ట్రాయుతములైన నీ వికృతావతారములు మాకు నగవు గొల్పుచున్నవని హాస్యగర్భితమైన యనాదరము భూదేవిపరముగా స్ఫురించును.

శివుఁడు నారదునితో నయుతుని భేకరూపమును వర్ణించి చెప్పుటయందుఁ జక్కని యద్భుత రసపోషణమున్నది. ఈ పోషణయం దుదాత్తములగు సంసార సంతారక భావపోషితములైన శాంతరసభావముల పరంపర యనిర్వచనీయ మార్గమునఁ బొడకట్టుచున్నవి.

"ముత్తియముల్ ప్రవాళదళముల్ గమనాకృతిఁ గూడినట్టులై
క్రొత్తగు నొరవీని యపురూపపు రూపిదియంచు విస్మయో
దాత్తమనస్కులై సకల తైర్థికులున్ గొనియాడ భేక లో
కోత్తమ మొప్పఁ జిత్రవపువుజ్జ్వలమై జలజాసనోద్భవా"
—పాండు. 5 – 285

భేకము యొక్క దినచర్యయం దద్భుతరస మంగముగా శాంతరస మంగిగాఁ బోషింపఁబడినది. కాన్యకుబ్జరాజకుమారి యాగమనమునుండి శాపమునందు వఱకుఁ గల కథలో హాస్యశృంగారముల సమ్మేళనము హెచ్చుగానున్నది.

ఉదా. : 1. "పూర్గభేద శిథిల మతు లంగనలు బొబ్బి
భీమరథి గలంచుటేమి క్రొత్త
వారి గోరు వెప్ప వక్షోజములకాంతి
లవమ ముజ్జగములఁ దవిలి కలఁప" —పాండు. 5 – 291

2. "వనజనాభుని యభిషేకమునకె గాని
కనకగర్భాదులకు వాడు కొనఁగ రాని
తీర్థకుండాంబు నికరంబు తెఱవ పిండు
గబ్బిచను జక్కవలచేతఁ గలఁపఁబడియె"
—పాండు. 5 – 293

ఇందు "తెఱవ పిండు" అను ప్రయోగమున వారి యవివేకము సూచింపఁబడి తత్ప్రవర్తనమువలన హాస్యము స్ఫురించును.

3. "అవసరంబు గాచి యల్లంత దవ్వుల
నుండి సురలు చనకు దండము లిడ
నొప్పు ముక్కునందు నూరువుగల వేలుపుఁ
గొమ్మ లంటి రాటబొమ్మవోలె" —పాండు. 5 – 295

ఈ ఘట్టముననే యొక పద్యమున శృంగారాభాసముతో హాస్యము మేళవింపఁబడినది.

"ఆవర్ణాభూ విధునకు
హావళి దఱచమ్యె బిసరుహాక్షులచేతన్
రావణునకు వైకుంఠపు
రావాసపు స్త్రీలచేతి యలజడివోలెన్" —పాండు. 5 – 306

మఱియొక పద్యమున నయుతుని సంసార జీవితమును వర్ణించుచో సంయోగ శృంగారము హాస్యము సమ్మేళన మందినవి.

"నున్నని మోము మీసముల నూగును చెన్నదిగాకమున్న మా
యన్నవుగా! గృహస్థులకు నగ్రణివై మనుమంచు మున్ను వే
గన్నుల వేల్పు దెల్ప నది గాదని వాదము సేయు ధైర్య సం
పన్నుఁడు దేర్పఁగాఁ దొడఁగెఁ బాదనతిన్ గుపిత ప్రియాతతిన్"
—పాండు. 5 – 313

ఇం దయుతుని దక్షిణ నాయకత్వమునందలి సంయోగ శృంగారము, కవ్యుక్తి గతమైన హాస్యస్ఫూర్తియుఁ గలవు. అచ్చమైన సంయోగ శృంగారము, దక్షిణ నాయకత్వము మఱియొక రసభావముతో మిశితమందని విధమున నుదాత్త రీతిని మఱియొక పద్యమునఁ జిత్రింపఁబడినది :

"స్వాతిమేఘంబు చినుకులు వనధిశుక్తి
వితతి ముయ్యాడునై మౌక్తికత వహించు
కరణి నయుతుని ప్రేమ తత్కాంతలందు
నిలిచెఁ బర్యాయ పాత్రతానియమసరణి" —పాండు. 5 – 315

ఇం దలంకార సామర్థ్యమున శృంగారమందలి యుత్తరరాగమునకుఁ గావలసిన భావములన్నియు వ్యంగ్యము లగుచున్నవి. ఇట్లు బహు రసభావబంధురమై శాంతరసైక ప్రధానమై విరుద్ధ రసభావముల కవిరుద్ధమైన సమ్మేళనమును గూర్చునట్టిదై యయుత నియుతోపాఖ్యాన మొక చక్కని ప్రత్యేకప్రబంధము వలెఁ బాండురంగ మాహాత్మ్యము నలంకరించి యున్నది.

పుండరీకునికథ

ద్వితీయాశ్వాసమందలి పుండరీకుని చరిత్ర మంతయు శాంతరస ప్రధానము, తద్భావ పరిపోషకమునై యున్నది. పుండరీకుని శీల వర్ణనమునను, దపశ్చర్యయందును మఱియొక భావమునకుఁ దావులేదు. పుండరికుని సద్గుణ సంపత్తి సాధనము, వర్ణింపఁబడిన తావునఁ గ్రమముగా నేకరసోన్మీలనము శబలత్వమంది సహృదయ హృదయైక వేద్యమైన పరిపుష్టిని జేకూర్చుచున్నది. శ్రీకృష్ణుఁడు ప్రత్యక్షమైనప్పుడు పుండరీకుని పరముగా నద్భుత రసపోషణ మున్నది.

"విలిఖితమో శిలాకృతియొ విస్మృతిరూపు వహించెనో యనన్
జలనవిదూరుఁడయ్యుఁ దొలునావి పయోధరధారఁ దోఁగు న
య్యిలఁ దలయెత్తు క్రొత్తవులునేవున వేపులకల్ తనూలతన్
మొలవఁగ నున్న నవ్వి యదుముఖ్యుఁడు తాపసముఖ్యు విట్లనున్"
—పాండు. 2 – 52

దశావతారస్తోత్రమున బలరామ వర్ణనమున భయానకము వర్ణింపఁబడినది. బుద్ధావతార వర్ణనమున హాస్య మున్నది. చతుర్థాశ్వాసమందలి పుండరీకోపాఖ్యానమునందుఁ గూడఁ గ్రమోన్మీలితమైన శాంతరసపరిపోషణ మున్నది. కావ్యమంతటికి నిది వస్త్వైక్యమును గూర్చిన ప్రధానకథ యగుటచేతనే యీ కావ్యముగూడ శాంతరసప్రధానమై మిగిలిన యుపాఖ్యానములయందలి వివిధ రసములయు, భావములయు పోషణమంతయు శాంతరసమున కంగముగనే యొప్పారినది. పుండరీకుని కథయందలి రసపోషణమునందు అనుభావ విభావాదులు వేర్వేఱుగాఁ బోషింపఁబడక కథాగమనమున నంతర్భూతములై రసస్ఫూర్తియంతయు విగళిత వేద్యాంతరమైన యొక మహాధ్వనియై భాగవతము

నందలి రసానుభూతివలె నొప్పారుచున్నది. ఇందలి శాంతరసమునకుఁ బుండరీకుఁ డాలంబనము. వానికిఁగల సర్వసమత్వము, శమము, మాతాపితృవియోగాది ఘట్టములయందలి నిర్వికారత మున్నగు భావముల స్థాయిచే రస పోషణ జరిగినది. తపోవన ముద్దీపన విభావముగాఁ బనిచేసినది.

చిన్నచిన్న యుపాఖ్యానములలో జరిగిన రసపోషణముగూడఁ గడు రమ్యముగా నున్నది. ద్వితీయాశ్వాసమందలి ముక్తకేశి కథలోని మధురభక్తి భావపుష్టమైన దివ్యశృంగారానుభూతి యింతకుముందే వ్యాఖ్యానింపఁబడినది.

చతుర్థాశ్వాసమున క్షేత్రపాలుని ఘనతను నిరూపించు నుపాఖ్యాన మొక్కటి చక్కని రససంపదతో నొప్పారుచున్నది. విద్యాధరుఁడు విమానమున విహరించు సందర్భమున శృంగారవిభావస్ఫూర్తితో నారంభించిన యీ కథ రౌద్రరసములోనికిఁ బరిణమించినది. క్షేత్రపాలుఁ డాలంబనముగాఁ బోషింపఁబడిన రోష ముచితముగా స్థాయి నందుకొన్నది.

"కనువిచ్చి చూచుటగాక దిగ్గున లేచె
　　నమిత సమాధి స్థిత మునికులము
గ్రుడ్డులఁ బొదువు మక్కువలు దక్కుటగాక
　　పొదలాడెఁజెట్లపై బులుఁగు మూఁక
వులుమేయు తమకంబు దొలఁగుటకాక వి
　　హ్వలబుద్ధియై వాఁటె హరిణకులము
ప్రజకేలఁ గర్ణరంధ్రములు మూయుట గాక
　　పవిశంఖనీరస్మృతి ప్లవణమయ్యెఁ
పద్మనాభ గృహోపరిభాగ సంచ
రిష్ణు ఖేచర దర్శనోద్రిక్త హృదయ
కాలభైరవ భైరవోద్వేల కంఠ
కుహర నిష్ఠ్యూత రోష నిర్ఘోషవిహృతి" —పాండు. 4 – 292

ఇందెత్తు గీతిలో రౌద్రమును మిగిలిన నాలుగు పాదములలోఁ దదంగమైన భయానకమును విజాతీయములైన భావములచే నతిరస్కృతి మూర్తిమంతము లగునట్లు స్థాయీభావములుగఁ బోషింపఁబడినవి.

"మానని కోపమిట్లు మదిమల్లడిఁ గొల్పఁగ మింటికి న్మహా
శ్యేనము పోలె బిట్టెగసి యెక్కుడు నుక్కున నుగ్రవిగ్రహుం
డైనెటి తగ్గ నగ్గగనయాయి విమానముఁ ద్రొక్కి భగ్నముఁ
గా నొనరింపుడున్ ద్రిదశగాయక నాయకుఁడు దుర్వ్యఁగూలినన్"

"కోలమసంగి మ్రోఁగి బలుగోలలు చీటుచు గ్రుడ్లు ద్రిప్పుచున్
క్ష్వేళ లొనర్చుచున్ మొగము జేవురుముద్ద విధంబునన్ మహా
భీలముగాఁగ వ్యాళవిభుఁ బెంబులుఁ గీడ్చిన మాడ్కి నీడ్చె న
బ్బాలిశుఁ గాలభైరవుఁడు పైకుబుసం బొక పోడువెత్తగన్"
—పాండు. 4 – 293, 294

ఈ రెండు పద్యములలోఁ బూర్ణమైన రౌద్రరసపోషణ మున్నది. ఈ రసము కావ్యమందలి యంగిరసమునకు విరుద్ధము కనుకఁ బాండురంగని పలుకుల లోఁ గోపభావ శాంతియు శాంతరసాంగములగు పెక్కు భావముల యుదయ మును లభించినది.

"నాగాకల్ప యహో! పురే! నిలు! విమానభ్రష్టుఁడై నేలపై
నీ గంధర్వుఁడు కూలి దర్పముడి వోయన్ జంపఁగారాదు గా
ఢాగఃకర్మరుఁ డేనియున్ జడుపువాఁడైయుండ నర్థిన్మహా
భాగుల్ చంపమి నీవెఱుంగుదువు కోపం బాఁపు మీపట్టునన్"

—పాండు. 4 – 296

దీని నద్భుతరసములోనికిఁ బరిణమింపఁజేసి రామకృష్ణుఁడు రసములకుఁ జక్కని ముక్తాయింపు నిచ్చినాఁడు. అం దీ చిన్న యుపాఖ్యానము కూడ శాంతరస ప్రధానమే యైనది.

"లేచి యతండు గాంచెఁ గదళీమృదులోరుయుగున్ హసన్ముఖున్
మేచకమేఘమూర్తి దినమిత్రసమానమ రత్నభూషితున్
లోచనధిక్కృతాంబుజ దళున్ శతకోటి సుధాకరాగ్ని రు
గ్వీచిపరంపరోపమ నవీనతను ప్రభ యాదవప్రభున్"

—పాండు. 4 – 298

"ఈ పుంగ్రామణి యెవ్వఁడొక్కొ! హరి యిట్లొప్పొందె సందేహమేలా పద్మాక్షుడె యంచు లోఁదెలిసి......................" పాండు. 4 – 300

ఒకే పద్యమున నుపాఖ్యానము, భావోదయము, భావశబలత, భావశాంతియుఁ గల పద్యము కడు విచిత్రము.

"గద సారించి త్రిదంష్ట్రనాముఁడగు రక్షఃపాలుఁ డొక్కండు బి
ట్టదరుల్ వాఱ మురారి యడ్మబరి వ్రేయన్ దాన నద్దిక్కు నొ
చ్చె దళింపం బడియెన్ దదుగ్రహతిగానిన్ క్షుల్లకాశీశ్యమున్
మృదుసంరంభముతోడ నవ్వుచున్ దున్మెన్ వాని నద్దేవుఁడున్"

—పాండు. 2 – 103

ఇందుఁ ద్రిదంష్ట్రుఁ డాలంబనముగా రౌద్రభావోదయ శబలతలును, గృష్ణుఁ డాలంబనముగా భావశాంతియు శమోదయమును గానఁనగును.

విభావానుభావముల సామగ్రిని గూర్చుటలో శబ్దార్థసంయోజనము· నజ్జల్ ? సన్నికర్షమును రసోచితముగఁ జేయుటయం దీ కవి కడునేర్పరి. హెచ్చుగాఁ బ్రాసాదులలో నిట్టి శబ్దమయ సృష్టివలన నితఁడు రసానుకూల్యమును జూపును.

ఉదా. 1. "పోర్మి హిఘవ్ నిజాంఘ్రిఁగల బొట్టనవ్రేల్తుద మట్టి పట్టి మున్
బేర్మిఁ దదంగమున్ మెదిపి పెట్టిన నెత్తురుబొట్టుఁ బోలె జ్యో
తిర్మయ వీక్షణం బలిక దేశమునం గల దుర్గ స్వర్గదన్
వార్మణిధారి యుత్తరపువాకిట నిల్చినవాఁడు కాఁపుగాన్"
—పాండు. 5 - 25

పద్యమందలి ప్రాసలోని యక్షర సన్నికర్షమేగాక మట్టిపట్టి, దుర్గ స్వర్గదన్ మున్నగు సంయుక్త పరుషాక్షరము లనుప్రాసములుగా నుండుటవలనఁ గూడ యుదారత యనఁదగు నొక వికటత్వము సిద్ధించి శైలి రౌద్రరసానుగుణముగ జేయుచున్నది.

2. "హారపదాధిరూఢ మహిషాసుర కీకస వర్గ దుర్గ నా
గారి మహోపవాహ్య సదశాక్షరమంత్ర విశేష యుత్తర
ద్వారమునందు నుండు నిరతంబును దా ఫలపూప పాయసా
హారములం దనుస్ దెలుచు నయ్యలదొడ్డికి వేల్పుగిడ్డియై"
—పాండు. 2 - 189

ఇందు మహాప్రాణము లభ్యస్తమగుటయు వర్గదుర్గ యను ననుప్రాసము, నాగారిశబ్దమందలి బలవచ్ఛత్రుసంహారరార్థ స్ఫూర్తియు, 'దుర' యందలి రౌద్రరసమున కంగములైనవి. పద్య ముత్తరార్థమున రచనయంతయు వత్సలరస మనఁబడు కతిపయ లక్షణాచార్యుల భావమున కుదాహరణముగ నున్నది.

3. "కుంకుమ పంకశోణయగు కొండలమండలనాథు పట్టి వా
మాంకము దాకొనన్ ఘణఘణారవ భూరికపాలమాలికా
లంకృతు లోంకృతుల్ నొడువులా గడరన్ దటవిద్రుమద్రుమ
క్రేంకృతికారి సారస పరీత సుధానిధిరీతిఁ గ్రాలుచున్"
—పాండు. 2 - 192

"వ్యాళకరాళకుంభములు వ్రచ్చుట గ్రుచ్చుటఁ బోలెఁబచ్చి ము
త్యాలు నఖాగ్రధారలకు నాభరణాచరణం బొనర్ప నీ
శైల గుహాగుహాస్థలులఁ జల్పెడు నిద్దుర లౌర గట్టురా
చూలివయాళి పావురము సూడుకుఁబట్టు మహోగ్ర సింహముల్"
—పాండు. 2 - 175

ఇందలి శబ్దాలంకారములు, సమాస ఘటనలోని మెళకువలు, శయ్యలలోని మార్పులు రచనను రసానుగుణముగ మలచుచున్నవి. ఏ ఘట్టమునఁ బరిశీలించినను నీ కవి సముచిత రసపోషణ విధాన సామగ్రియందు నిరుపమాన సామర్థ్యము గలవాఁడని స్పష్టమగును. ప్రతిపద్యమునందును, ఘట్టము నందును, సంభాషణాదికములందు నితఁడు చూపిన యంగాంగిభావమే యితని కావ్య నిర్మాణమార్మికతలోని క్రాంతదర్శనమును నిరూపించుచు, నితని కావ్యమందలి మహాధ్వని యనందగు ధర్మోపదేశమును సహృదయుల హృదయములకు సంస్కారప్రాయమైన ధ్వనిగా నందఁజేయుచున్నది.

రామకృష్ణుని హాస్యము

రామకృష్ణుఁడు హాస్యప్రధానకవిగాఁ దెలుఁగుదేశమునఁ బ్రసిద్ధుఁడైనాఁడు. ఇతని హాస్యశీలతను గూర్చి పెక్కుకథ లున్నవి. వికటకవి యని యితనికి బిరుద మున్నది. ఇది యితనిని గూర్చిన కథలలో వినఁబడును గాని కావ్యములందుఁ గానఁబడదు. ఈ వికట శబ్దమున కర్థమితని హాస్యశీలత యనియే కొంద అభిప్రాయపడుచున్నారు. ఇతనికి దేవి ప్రత్యక్షమైనప్పు డామె యొసగిన రెండు గిన్నెలలోని పాలును ద్రావఁగా నామె వికటకవి వగుమని శపించినదఁట! ఈ కథ సత్యము కావచ్చును గాని వికటకవి వగుమనుట యాశీస్సు కావచ్చునే గాని శాపమెట్లగునో బోధపడ కున్నది. వికట శబ్దమునకు సౌందర్యమని యర్థ మున్నది. ఒక ప్రత్యేకత నార్జించుకొనినదని యర్థమైనచో నతని కవిత్వమునకుఁ బూర్తిగా సమన్వయించును. దేవి యిచ్చిన యీ వరము ఫలితముగా నితఁ డందఱి పైనను బరిహాస ప్రధాన చాటుపద్యములను, సంభాషణములను, గోష్ఠులను నిర్వహించినట్లు వాడుకయున్నది.

ఇతని చాటువులని చెప్పఁబడు పద్యములలోఁ గొన్నియు నితని కథలలోఁ గొన్నియు హాస్యప్రధానములై యున్నవి. కొన్ని తావులందలి హాస్యము సున్నితముగను, దుష్ట పండిత గర్వభంజకముగ నున్నను, గొన్నిటియందు ముదుకగను, పేలవముఁగను, నశ్లీలార్థ నిరూపణముగను గూడ నున్నవి. తాతాచార్యుల తోఁటకూర కథ, యప్పయ దీక్షితుని, నప్పలాచార్యులను గూర్చినది, "గంజాయిత్రాగి", "చీపరపాపరతిఁగల" యను పద్యములును హాస్యమున కుదాహగణములుగఁ జెప్పఁబడినను ముదకగను, గ్రామ్యదోష భూయిష్టముగ నున్నవి. "ఎమితిని సెపితివి" యను పద్య మర్థవిహీనము, సందర్భశూన్యము. "మేక తోకకు మేక", "అన్నాతిఁగూడ హరుఁడవు", "తృవ్వటబాబా", "లచ్చిమగఁడ నీకు" అను పద్యములలోను వానికి సంబంధించిన కథలలోను జక్కని హాస్య మున్నది. "తెలియనివన్ని తప్పులని". "ఒకని కవిత్వమందు", "ఓ యమ్మ లార మందులు" అను పద్యములలో దుష్ట పండిత గర్వభంజనమో, నిందయో యున్నది కాని హాస్యము లేదు.

లభించిన కావ్యములను బరిశీలింపఁగా హాస్యమున కంత ప్రాధాన్యము చూపట్టదు. ఇతని ప్రబంధములయం దున్నంత హాస్యము మిగిలిన కవుల కావ్యములు పెక్కింటియందును గలదు. ఇతని కావ్యములలో నెక్కువ భాగము తత్త్వదృష్టి, దైవభక్తి, యుత్తమకవిత, శిల్పవిషయుఁ గానఁబడును. అంతమాత్రమున నితఁడు హాస్యప్రియుఁడు కాఁడని కాని, యితనికి హాస్యోచిత కౌశలము లేదని గాని, జనప్రసిద్ధములగు కథలు చాటువులలో గొన్ని యితనివే యైయుండుట యసంభవమని కాని యెన్నరాదు. చాటువుల విషయమున శ్రీనాథుని పద్యములందును గొంత హాస్య మున్నది. అయినను శృంగార ప్రధాన చాటువులకు శ్రీనాథుఁడును, హాస్యోక్తి ప్రధాన చాటువులకు రామకృష్ణుఁడును జయ విజయులైరి. రామకృష్ణకవి దైనందిన జీవితమున జరిగిన సంభాషణములందు నలవోకగాఁ జెప్పిన చాటువులందును హాస్యప్రధానమైన వాక్చమత్కృతినిఁ బ్రదర్శించి, చిరస్థాయి కావలసిన

కావ్యసముచ్చయమునం దుత్తమ నిసర్గ గంభీర శిల్పము నాదరించి మెలఁగె ననుటలో నసంభావ్యత యుండదు. లభ్యములగు నితని కావ్యములలోఁ బాండురంగ మాహాత్మ్యమున హాస్యప్రధానమైన యుక్తివైచిత్రి పొడకట్టును. నవరసములలో నొకటియైన హాస్యము ననుక్రమణికగా విభావానుభావాదులలోఁ బోషించుట విషయమెట్లున్నను వాక్యగతము, పదగతము, సందర్భగతము, కాకుగతము నగు ననితరలభ్యహాస్యరేఖ యితని వాక్కు నావరించుకొని రచన కొక దీప్తి నొసఁగినది.

ఈ కవి హాస్యమును గూర్చి శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారును గొంత వివరించినారు. "రామకృష్ణుఁడు హాస్యప్రియుఁడు కూడ. జీవితమున బొత్తిగా లేని హాస్యము కవిత కెక్కదు గదా! ఆ గుణమే యాతని మహాపరాధమైనది. తెనుఁగులో పరమానందయ్య వెనుక పాండురంగ మాహాత్మ్య కవి కథలకే ప్రచారము. వానిలో కొన్ని కేవలము రసాభాసములై పామరజన రంజకములైనను, ఆ కవి కీర్తికి మాత్రము చాల భంజకములుగా నున్నవి... ......దానిని — హాస్యమును — బోషించుట యం దాతఁ డనేక పాకముల నెఱుఁగును. ఒక శబ్ద సంయోజనముతో నవ్వించును. ఒకధ్వనితో మందహాస మొలయ జేయును........రామకృష్ణ కవి స్వభావమే హాస్యమయము. అత డే యుపమానము చెప్పినను యే మాటయన్నను దానిపైన గొంత హాస్యరసచ్ఛాయ యుండవలసినదే .... ప్రమథ గణములు....... ... బూజు పాఁగ మేన బూది పూసినవారు అన్నాడు. వారు విభూతి బూసికొన్నారట. అది యెట్లున్న దనగా నొడలం తయు బూజుపట్టిన ట్లున్నదట ....కృష్ణుడు రుక్మిణి నైనమరచినాడు కాని చలిది చిక్కమును మాత్రము తగిలించుకొనియే వచ్చినాడు. ఆ చిక్కము, ఆయన ముందు మీనావతార మైనందున ఆ మహామహుని బట్టుటకు మునులు వేసిన భక్తి యనెడు వలవలె నున్నదట! చేతిలోనున్న శంఖము వెలితిగాఁ జపిగొన్న వెన్నముద్ద యనిపించినది"[1].

ఇట్లే "పొదలు నీ పొక్కిటఁ బువ్వుకాన్పున గదా పెనుమాయ పిల్లలు పెట్టుటెల్ల", "కంపలఁబడ్డ కాకినై" మున్నగు పద్యములలోఁ గూడ హాస్య మున్నదని చెప్పినారు.

నిగమశర్మకథలో నిగమశర్మ బంధువులు నగలు పోయినవని దుఃఖించు వర్ణన మున్న పద్యమున హాస్య మున్నదని రాళ్లపల్లి యనంతకృష్ణశర్మగారు చర్చించి యిందలి పరిహాసరేఖ యౌచితికి భంజకమని తెలిపినారు.

"శోకించు వృద్ధభూసురుఁ డాత్మ పితృదత్త దర్భముద్రికకుఁ జిత్తముగలంగి
యత్తగా రిచ్చిన హరిసుదర్శనవుఁ బేరునకు ముత్తైయిదువ వనటఁబొందుఁ
గొత్తగాఁ జేయించుకొన్న ముక్కరకునై యడలు దుర్వారయై యాఁడుబిడ్డ
జామాత వెతఁబొందు వ్యామోహియై నవగ్రహ కరవేష్టన భ్రంశమునకు"
—3-50

దీనిని గూర్చి యనంత కృష్ణశర్మగా రిట్లు విమర్శించినారు.

---

1 "తెనాలి రామకృష్ణుని తెనుఁగుకవిత" తెనుఁగు తీరులు, పుటలు 3. 12. 65.

"అప్పు డింట నందరు చెప్పిరి. వారితోన నక్కయు చెప్పినది. ఎందు కనుకొన్నారు? తమ్ముడు చెడెనే యని కాదు. యిల్లు మునిగెనే యని కాదు. తన ప్రయత్నము వ్యర్థమాయెనే యనియు గాదు! మరి క్రొత్తగా చేయించుకొన్న ముక్కెర పోయెనే యని దుర్వారదై యఱచెనఁట! పరిహాసము పవిత్రవస్తువును కూడ గమనింపదేమో!"

—సారస్వతాలోకము, పుట. 91

ఈ యభిప్రాయమును గూర్చి వేదాల తిరువేంగళాచార్యులిట్లు వ్రాసినారు:

"ఉంగరమును గూర్చి వృద్ధుడు శోకించుచున్నాడు. ఏమని? తనకు నిత్యమగు వైదిక ధర్మపులోపము, తండ్రికి నిత్య తర్పణపులోపము జరిగినదని చిత్తము కలగి చెదరి పోయినది. వైదికకర్మ లోపించుటవలన దనకు వైదికత్వము, ఉత్తరగతి, రెండును లోపించినవని శోకము. వేదము లోనిది గాదె యనగా పరాశర -3-3- కిదియే యుచితము.......కనుక నగ పోయినదను దుఃఖము గాదిది..... .. పూర్వగృహస్థుల యిండ్లలో అత్తలు కోడలు చిత్తశల్లిదై యుంటి బాధ్యతను-వహించుకొనగల్గు వీదు వచ్చిన తర్వాత కోడళ్లకు గృహవిక్షేపములు, గృహరహస్యములు, సాంప్రదాయములు, సౌమంగల్యప్రదములను నగు కొన్ని వస్తువులు మొదలగువాని నప్పగించి యిచ్చిపోవువారు..... .. ...ఆడుబిడ్డ ముక్కెర క్రొత్తగా చేయించు కున్నది. అది పోయినది. అడలుచున్నది..... .. నగ పోయినదనియు కాదా ఏడుపు. ఇక్కడ శబ్దార్థము బాగుగా గమనించి భావమును గ్రహింప వలెను........ముత్తయిదువ లక్షణములగు కొన్ని నగలను — అనగా మట్టెలు, మంగళసూత్రము .. ..ముక్కెర వీనిని పుట్టింటివారే యెల్లప్పుడును చేయింతురు ....ఆ వస్తువు లియుదు సౌభాగ్య సౌమాంగల్యముల చిహ్నములు. — ముత్తైదువ పదములోని ఐదవ పదమున కిదియే అర్థమని కొందరనుకొందురు—.......... ఇవి పోరాదు. ఇది పోవుట సౌభాగ్య సౌమాంగల్యముల కపాయ సూచన యని భావింపబడును ....ఇప్పుడీ ముంగెర పోవుటలో నీ యాపద రానున్నదని యాడుబిడ్డ హడలుచున్నది............ అర్థ సౌందర్యమును గ్రహింపక రాళ్లపల్లివారు, పుట్టపర్తివారు కూడ నిగమశర్మ అక్కను నేను (రామకృష్ణకవి) హాస్యమాడితి నన్నారు. ఎంత పొరపాటు?."

—అష్టదిగ్గజములు, పుటలు 242 నుండి252 వరకు

దీనిని గూర్చి ఆరుద్ర యిట్లనుచున్నారు: "ఇది కవిభావము కాదేమో?

—సమగ్రాంధ్ర సాహిత్యం సం 8. పుట. 54

ఇప్పటి తిరువేంగళాచార్యుల యభిప్రాయమే కవిభావ మనుటకుఁ బద్యములో "పితృదత్త, అత్తగారిచ్చిన, క్రొత్తగాఁ జేయించుకొన్న, నవగ్రహ" పదములు నిదర్శనములు. ఇందు వృద్ధభూసురుఁడు, ముత్తయిదువ, యాడుబిడ్డ, జామాతయు దుఃఖించినది వరుసగా సంప్రదాయము, పెద్దల యాశీస్సు, మాంగల్యము, గ్రహబలము దెబ్బతిన్నవనియే గాని నగలు పోయినవని కాదు. దీనిలో "గోమేధికోపలాంకుర మానితంబులు............సొమ్ములిన్నియు"

3 – 48 దోయినవని నా చేష్టల కేదేమి? ఎంతెంతో విలువకల నగలు పోయినందుల కేడ్చుట యింక వర్ణింపఁబడలేదు. కనుక నీ పద్యమున నా కుటుంబము యొక్క యుత్తమ సంప్రదాయము ప్రతీయమాన మగుచున్నదే గాని పరిహాసమున కీ పద్యమునందుఁ దావు లేదు.

రామకృష్ణకవి హాస్యము సుస్మితము. ప్రసన్న గంభీరము. సత్వగుణ ప్రధానము. పలుతావులందు వ్యంగ్యమర్యాద నాశ్రయించి యుండునదిగా భాసించును. ఇట్టి యుత్తమ సహృదయైకవేద్యమగు హాస్యము కృష్ణరాయలు మున్నగు నితర ప్రౌఢ కవుల రచనలలోఁ గూడఁ గనిపించును. మానవప్రకృతి ననుసరించి చూచినచో వాగ్దోషము పట్టిన వాచాలుని పలుకులందున్న హాస్యము వాని యంతఃకరణమునకుఁ సంబంధించినదికాదు. మఱియు సహజ గంభీరులై నియతవాక్కులయిన సంయములు యంతఃకరణములకుఁ జిక్కని హాస్యస్ఫూర్తి నిరంతరము వర్తించుచుండును. అది వారి యౌదార్య గుణముతో నభేదస్థితిని బొందియుండును. సంస్కృత కవులలో గీర్వాణ భవభూతుల రచనలలోను, ఆంగ్లకవులలో షేక్స్పియరు, బెర్నార్డ్ షా, ఛెస్టర్టన్ మున్నగువారి రచనలలో నిట్టి యుత్తమ హాస్యము కనిపించును. మోలియరు, 'వోడ్‌హౌసు' రచనలలో వాక్ప్రవృత్తి, వాచాలత గల తక్కువ తరగతి హాస్యమున్నది. హాస్యము శబ్దగతమైనచోఁ దరగతి తక్కువగును. వస్తుగతము, ప్రకరణగతము, శబ్దశక్తి మూలకము, వాక్యగతము, భావనాగమ్యము నయినవి యుత్తమ తరగతికిఁ జెందును. భవభూతి యుత్తర రామచరితమున లక్ష్మణుడు చిత్రపటములను సీతకుఁ జూపించుచుండగా నామె "ఇయము వ్యపరా కా ?" యని ప్రశ్నించుట, లక్ష్మణుడు సిగ్గుపడుట యట్టి హాస్యమున కుదాహరణము. ఈ తరగతి హాస్యమునకుఁ బాండు రంగ మాహాత్మ్యమునుండియే కొన్ని యుదాహరణములను జూపుట కనువగుచున్నది.

1. గ్రంథ పీఠికయందు వేదాద్రిమంత్రిని నృసింహుడు రక్షించుగాఁక యను పద్యమందలి నృసింహ వర్ణనము పరిశీలింపఁదగినది. (1 – 31) ఆ నృసింహునకు మిడిగ్రుడ్లవలెఁ గనుపించు బిగువ యున్నది గాని నిజమున కతఁడు కరుణా కటాక్ష వీక్షణములు గలవాఁడట! నోటినుండి కోరలు వెట్టుకొని వచ్చుచున్నవన్న మాటయే గాని యతఁడు ముద్దుఁజందురు నేలు మోమువాఁడట! నరత్వము, మృగత్వము గలసిన దేహమున్నను బహుకోటి మన్మథుల యందము కలవాఁడట! "అందగాఁడ వదుర్తే ఆదివరాహా" యని సంబోధించిన క్షేత్రయ్య పదమునందుఁ గూడ నిట్టి స్ఫూర్తియే యున్నది. ఈ రామకృష్ణుని పద్యమునందలి హాస్యస్ఫూర్తికి వెనుక నొక గంభీరమైన రూపకల్పనము సాధింపబడినది. రాక్షస సంహారము కొరకుఁ దప్పని సరియై విష్ణు విట్టి వికటమైన యవతార రూపములను ధరించునే కాని సహజముగ సకల కల్యాణ గుణావహుఁడు, కరుణామయుఁడు, రూపసంపన్నుఁడునని యిందలి తాత్పర్యము. కృష్ణరాయలు సింహాచల వరాహనృసింహస్వామిని వర్ణించుచు "దంభకేసరి" యని సంబోధించుటలోఁ గూడ నిట్టి హాస్య యుక్తమైన సత్వగుణ కల్పనమే యున్నది. ఇందలి దంభ శబ్దమువలన

భయపెట్టుటకు "డాబునరిగా" నిట్టి రూపమును ధరించెనే గాని యా దేవుఁ డెట్టి పాపము నెఱుఁగ డను భావము వ్యంగ్యము.

2. కాశీవర్ణనమున నా పట్టణము "డుంఠినామక గజాలానంబు" (1 - 99) గా వర్ణింపబడినది. డుంఠి విఘ్నేశ్వరస్వామి యొక మదపుటేనుగ యఁట! అతఁడు తప్పించుకొని పోకుండఁ గట్టివేయు గుంజయే కాశియఁట! ఇందు నేనుఁగుమోము వాని నేనుఁ గనుటలో సున్నితమయిన హాస్యమున్నది. అతఁడు దైవత్వమునందు మదించినవాఁ డనియు, నుపాసన చేయు భక్తుల మనస్సులలో నిలువక తప్పించుకొని పోవుచుండుననియుఁ గాశీ నివాసులకు నతఁడు సులభసాధ్యు డనియు నిందలి వ్యంగ్యము.

3. ఆ కాశీవర్ణనముననే కాశిలో మరణించినవారికి శివసాయుజ్యము కలుగునని చెప్పిన వర్ణనము పరిశీలింపఁదగినది. ఒకనాఁడుఁ గూడ స్నానము చేయని మూర్ఖుఁడు శిరసున గంగను ధరించును. ఇంటిలోఁ బొయ్యి వెలిగింపని దరిద్రుఁ డష్టైశ్వర్యము లనుభవించును. ఆడువారి చాయకుఁ బోవుటకు భయ పడు నపుంసకుఁ డర్ధశరీరమున భార్యను ధరించును. ఆయుధము తళుక్కు మనిన కాంతిని దూరమునుండియే చూచి భయపడు పిరికివాఁడు నిప్పులు గ్రక్కుచున్న వాడియైన త్రిశూలమును ధరించును. మతిలేని మేదకుఁడు మఱ్ఱిచెట్టుక్రింద మునీంద్రులకుఁ బాఠములు చెప్పునంతటివాఁడగును. ఇందలి యవ్యక్తమయిన హాస్యమువలనఁ గాశీమాహాత్మ్యము వేయిరెట్లుగా భాసించినది.

4. శివుని రథమును వర్ణించిన సందర్భమునఁ జక్కని హాస్య మున్నది. అతని రథమునకు సారథి ఛాందసుఁడు. సూర్యచంద్రులు బండి చక్రములు. అం దొకటి పెద్దది, యొకటి చిన్నది. రెండిటి వేగముల తీరును వేఱు. గుఱ్ఱములు ముసలివి. రథములోని యోధుని శౌర్యము చూతమా యతఁడు సగమే మగవాఁడు. భూమి రథ మగుటచే నది సముద్రముల నడుమ ముక్కలు ముక్కలుగా నున్నది. ఇంక నన్నియు లక్షణముగా నున్నవి! తలఁచిన కార్యము తెల్లవారినట్లే యని యా పట్టణములోని రథములు శివుని రథమును జూచి నవ్వుచున్నవా యనునట్లు మువ్వల శబ్దములతో గలగల లాడుచుండును. ఈ పద్యమున హాస్య మొక ప్రక్కను, గంభీరమై, దుర్ని రీక్ష్యమైన త్రిపురాసుర సంహార సన్నాహ వర్ణన మొక ప్రక్కను సాగినది. - 1 - 115

5. అగస్త్యుని జూచి భయపడు వింధ్యపర్వతము భూమిలోని కడఁగి పోయినదఁట! ఎట్లు? భయపడినప్పుడు పీత కన్నములోనికిఁ బోయినట్లు! ఈ యుపమానమువలనఁ బుట్టిన హాస్యమున నగస్త్యుని సామర్థ్యము హెచ్చుగాఁ బ్రతీయమాన మగుచున్నది. — 1 - 122

6. బుద్ధావతార వర్ణనమునఁ జక్కని హాస్యమున్నది. కృష్ణావతారము సౌందర్యమయమై సర్వభోగములతో నిండినది, బుద్ధావతారము సౌందర్య సాపేక్షకము కానట్టి సన్యాసి రూపముగలది. స్వామి కృష్ణావతారములోని

యలంకరణమును దొలఁగించి బుద్ధవేషమును ధరింపవలసినపుడు నెమలి పింఛమును ధరించియున్న, చక్కని యెత్తుఁగా పెరిగిన జాలపాలజుత్తును గ్రమముగాఁ దీర్చిదిద్దుకొనెను. తల బట్టతల యైనది. ఈ బోడిగుండు రూపమున నింకను బాలకృష్ణునివలె దిగంబరుఁడుగా నున్నచో నెంత లక్షణముగా నుండును ? అందువలనఁ ద్వరగా బట్టకట్టుకొనవయ్యా ? నీ కే వస్త్రము లభింపనిచో నీ నెమలి పింఛమయిన మొలకడ్డము పెట్టుకొనుము. అని కవి స్వామిని హెచ్చరించు చున్నాడు ! —2 – 64

7. పచ్చని నల్లని చారలు కల పులిచర్మమును గట్టుకొని శంకరుఁడు కైలాసమునఁ గొలువు దీర్చి యున్నాఁడు. ఆ పులిచర్మ మెట్లున్నది ? దీని కొక కథ కల్పింపబడినది· పార్వతి కన్నులనిండఁ గాటుక పెట్టుకొని మొగమున గస్తురిబొట్టు కలిగి యుండును కదా ! ఆమె మొగమునకుఁ బసుపు పులిమికొని స్నానము చేయుచు నొక వస్త్రముతో మొగము తుడుచుకొనినది. ఆ పసుపు, కాటుక, బొట్టు వస్త్రమున ముద్రలుగాఁ బడినది. శివుఁడు కొలువులోనివారిని నవ్వించుటకై యా వస్త్రమును గట్టుకొని వచ్చి కూర్చుండి నట్లున్నది. —2 – 163

ఈ వర్ణనమునఁ గనుపించు హాస్యరేఖకు వెనుకఁ బార్వతీ పరమేశ్వరుల దాంపత్యములోని యానుకూల్యము, శివుని రసికత, పరిహాస కుశలత, దివ్య శృంగారరేఖయు వ్యంగ్యము లగుచున్నవి.

8. కామధేనువు తన తపోభంగ మొనర్చినప్పుడు దాని నయుతుఁడు వెడలఁగొట్టిన విధము వర్ణింపఁబడిన శాఖన(5 – 245) పదప్రయోగ గతమగు హాస్యమున్నది. అతఁడు కోపమున దూడ నావుతో లంకె పెట్టెను. ఆవు మెడలోఁ బెద్ద గుదిబండ కట్టెను. తోలవియునట్లు కొట్టి తలత్రాడు పట్టుకొని యాశ్రమమునుండి యావలకు గెంటెను. మహామారికి నుద్వాసనము చెప్పు విధమున యావల నతఁడా యావును వెడల నడఁచెను. ఈ పద ప్రయోగ వైఖరిలోని హాస్యస్పర్శవలన నయుతునకుఁ గ్రోధము పోలేదనియు నతని తపస్సు భంగము కానున్నదనియు సూచన కలుగును.

మొత్తముమీఁద నితని కావ్యమున హాస్యమున్నది గాని యది రామలింగని కథలలోని హాస్యము కాదు. సత్త్వగుణప్రధానమగు హాస్యరసభావము. అదియుఁ బలుతావులందు నరగతము. కొలదితావులందు శబ్దగతము.

వికృతములైన వస్తువులను వ్యక్తులను జూచుటవలనఁ గలుగు హాస్య మొకటి యున్నను, మఱియొక యుత్తమజాతికిఁ జెందిన హాస్యము మానవ జీవితమున నొక సంస్కారరూపమున నున్నది. సుస్మితమైన, వికాసవంతమైన హాస్య మది. దానివలన ముఖకవళికలు వికసించును. మందస్మిత మనఁబడు నొక జీవకళ వ్యక్తమగును. సర్వలక్షణ సంపూర్ణులైన, పరమ పురుషులైన నాయకులపరముగా దీనిని గవులు పరిపోషించినారు. రాముఁడు స్మితభాషి, కృష్ణుఁడు సుస్నిగ్ధమందస్మిత వదనారవిందుడు. బుద్ధుఁడు కరుణా

మయమైన మందస్మితము గలవాఁడు. నాయికా నాయకు లానందపారవశ్య మున మధుర దరహాసమును వ్యక్తము జేయుదురు. ఈ దరహాసరేఖ జీవశక్తి యొక్కయు రసరక్తాది ధాతువులయొక్కయు సామరస్యమును గ్రమోన్మీలన మును సూచించును. ఇటి యనుభావమును బ్రేరేపింపఁజేయగల హాస్యవైఖరి కొందఱి సంభాషణములో, రచనలో నుండును. ఎవరి జీవితమున సుఖదుఃఖ ములు సామ్యమునందునో, ఎవరి దృష్టిలో సర్వ జీవరాసులయందును సమ త్వము సిద్ధించునో వారి వాక్కులందు సర్వ సమస్యలను, సర్వ సంఘర్షణలను సమీకరించి పరిష్కారము చేయఁగల హాస్యవైఖరి నెలవగును. వా రే విషయ మును గూర్చి రచనాకల్పనము చేసినను హాస్యగర్భితమైన యొక చమత్కృతి వెలువడుచుండును. జగన్నాథ పండితుఁడు చెప్పిన రమణీయత, లోకోత్తరా హ్లాద జనకత యిదియే. ఇట్టి వాక్చమత్కృతి రామకృష్ణుని కల్పనలలో నూటికి తొంబదిపాళ్లు కనుపించును. దీని స్పర్శవలననే వర్ణనలకు నలంకారాదులకుఁ బదప్రయోగ సందర్భమునకు నొక యపూర్వత, నొక యనన్యత సిద్ధించును. కనుకనే పూర్వకవులలోఁ బ్రసిద్ధులలోఁ బెక్కుమంది తమ మార్గమున నన న్యులు. రామకృష్ణుఁడును దన మార్గమున నిట్టి యనన్యత గలవాఁడు. ఇది రామకృష్ణుని కల్పన యని యీ యనన్యతవలననే యతని యాత్మీయత స్పష్ట మగును.

దీనికి సంబంధించిన లక్షణములు :

1. లోకోత్తర గంభీర విషయములను జాల సామాన్యముగా, సహజ ముగాఁ దేలిక పదములలోఁ జెప్పుట.

ఉదా. "పొదలు నీ పొక్కిటి పువ్వుకాన్పునఁ గదా
పెనుమాయ పిల్లలఁ బెట్టుటెల్లఁ
బొడము నీ మొదలి యూర్పుల నేర్పు వలనగదా
చదువు సంధ్యలు గల్గి జగము మనుట
కెరలు నీ యడుగుఁదామరల తేనియఁ గదా
పాపంపుఁ బెనురొంపి పలుచనగుట
పొసఁగు నీ తెలిమావు వసఁగదా యిది రాత్రి
యిది పగలను మేర లెఱుఁగఁబడుట
భవన ఘటనకు మొదలి కంబమును బోలె
భువనముల కెల్ల నీ వాదిభూతుఁ డగుచు
నిట్టి నిల మన్కిచేఁ గాదె నెట్టుకొనియె
గెంటు గుంటును లేక లక్ష్మీకళత్ర" —పాండు. 2-55

ఈ పద్యమున మాయ యను మహత్తర వస్తువునకుఁ బిల్లలు బెట్టుట మున్నగు క్రియల యన్వయమున సర్వలోక సమస్యలను నాధ్యాత్మిక జ్ఞాన స్పర్శచేఁ బరామర్శించుటలో నొక హాస్యస్ఫూర్తి యున్నది. ఇట్లే యయు తుఁడు వాధూలముని శాపమున సమగ్ర జ్ఞానోదయము నందిన వెనుకఁ బౌండరీకక్షేత్రము చేరి నృసింహస్వామిని వర్ణించు సందర్భమును బరిశీలింప నది :

"ఆ సభ నుఱ్ఱుంగంబమున నా క్రియ నుద్భవమంది యాసురాగ్రేసర హృద్విదారణము, కించి దుదంచిత హాసకృత్యమున్ గా సమకట్టియున్ బెనుపంగాం గతమేమి పునర్భవ స్పృహన్ నీసట లెవ్వరేఁ దెలియనేర్తురె మర్త్య మృగాధినాయకా !"
—1 - 277

నృసింహుఁడు రాక్షసుని హృదయము చీల్చుచున్నపుడు గూడఁ గొంచెము చిరునవ్వు వాని ముఖమున నొప్పినదఁట! రాక్షసత్వమును జీల్చునది మందహాసరేఖయే గదా! ఇఁక గోళ్లెందులకు? అనేక రూపములతో స్వామి చూపు వినోదముల కొఱకు. కనుకనే మృగముల రూపము, మానవ రూపము గల పెక్కు నవతారముల నెత్తవలెనను నతని సంకల్పము దైవమాయ. ఇది యొక నాటకములోని యానందమువంటిది. ఈ జగన్నాటక వేషధారణకే యతఁడు జూలు మున్నగు నాహార్యములను గల్పించుట. వాని మాయ లెవ్వరు తెలియఁగలరు? సింహముఖముతో నవతార మందియున్నను, గృష్ణావతార మెత్తినను వాని చిరునవ్వు మారదు. లోకములోని జీవు లీ దైవమాయ ననుభవించు సందర్భమున నాటకమును జూచు సామాజికుల వంటివారు. రసానందము కావ్యమున కెట్లు లక్ష్యమో, యోగానందము నృసింహాది రూపములను భావించు భక్తజనుల జీవితముల కట్లు లక్ష్యము. నృసింహావతార మందలి జూలు గోళ్లు మున్నగు మృగ లక్షణములలోఁ గూడ దైవత్వ స్ఫూర్తిని జూడగలుగుచున్నాఁడు గనుకనే యయుతుఁడు శాపవశమునఁ దనకుఁ గలుగబోవు కప్పరూపమును సంతోషముగా స్వామి సన్నిధిలో గడపి వేయగలఁడు. లోకములోని దుఃఖము, కోపము, దయ మున్నగు భిన్న భావము లన్నియు స్వామిని భావించు యత్నమున యోగ సాధకు లనఁబడు ముముక్షువులకు జగన్నాటక ప్రతిపాదితమగు రంగమునఁ బ్రతిపాదింపబడు నానందముయొక్క క్రమోన్మీలన దశలే! ఈ యంశమునే యయుతుఁ డిట్లు కీర్తించుచున్నాఁడు,

"కోప వికారమంచు నొక కొందఱు, కొందఱు భక్తలోక ర
క్షా పరతంత్రతా జనిత సాంద్ర కృపాగుణమంచుఁ గొంద ఱు
ద్దీపిత వీరసింహ విహృతి స్ఫుటఖేట వికారమంచు నీ
చూపుల రక్తిమం బొగడుచున్ నుతియింపుదు రీశ్వరేశ్వరా"
—5 - 279

నృసింహస్వామి కన్నుల యెరుపును జూచి కొందరు కోప మనుకొందురు. కొందరు భక్తుల రక్షించుటకుఁ గావలసిన కృపాగుణ మనుకొందురు. కొందరు సింహముయొక్క సహజ లక్షణ మనుకొందురు. ఇవి యన్నియు నొకే దైవతత్వము జీవులయందుఁ బ్రతిబింబించినప్పుడు, వారివారి సంస్కారముల ననుసరించి వారిలోఁ గలిగిన భావోన్మీలనములు. ఈ వర్ణనమునందు నృసింహదేవుని లీలలను సుకుమార హాస్యగర్భిత భక్తిమార్గమున వర్ణించుట యున్నది. ఇట్లే రామకృష్ణుఁ డెంతటి యున్నత విషయమును గాని యెంతటి నీచ విషయమును గాని యుత్తమ హాస్య స్పర్శచేఁ జక్కగా సమీకరణము చేయును. విగమశర్మ చెడిపోవుటను బరిశీలించునది. "మీను మీనమువంటి యొంటి

జందెము మెఱవఁగ", "తాళిగోణపుఁ జుంగు నేలజీరఁ, కడలేని పీడ్యంపుఁ గావి మోవి పల్లొల ముసుగుదన్న", "నఖరేఖాంక గళము దనర", "యువతిభుక్త నిర్ముక్త పరిధాన యుక్తుఁడగుచు నగర ఘంటాపథంబున నగుచుఁ దిరుగు, నొఱపుగల రీవి జాతిమాత్రోపజీవి"
—3 – 10

ఆ నిగమశర్మకు "భార్య పాలిండ్లు రిక్త కుంభములు వేశ్య చనుదోయి నిండు కుండలు. భార్య నుదురు చవితి చందురుఁడు. వేశ్య నుదురు నెల పొడుపు చందురుఁడు."
—3 – 11

ఇందు వర్ణింపఁబడిన యంశము నీచమయినను నలంకారగతము, పద ప్రయోగగతము, వ్యంగ్యసిద్ధము నగు కవి హాస్య స్పర్శవలన నిందు రమణీయత నెలకొనినది.

నిగమశర్మ హోమాగ్ని నూదఁడుగాని విరహముతో నిట్టూర్చును, సంధ్య యొక్క యెఱ్ఱదనమునకు నమస్కరించఁడు గాని కోపించిన వేశ్యల యెఱ్ఱని కన్నులకు నమస్కరించును. శాస్త్ర వాదములలోఁ పాల్గొనఁడు గాని విటుల వాదములను దీర్చును. విష్ణుని శ్రీపాద తీర్థమును స్వీకరింపఁడు గాని యువతుల పెదవుల దగ్గఱ మద్యమును సేవించును. బొట్టు, జుట్టు, కట్టు మున్నగు పుణ్య లక్షణములను ధరించుటకు సిగ్గుపడును గాని వేశ్యల గోటి గిచ్చులు మెడపైఁ గనుపించుచున్నచో సిగ్గుపడక గర్వించును (3 – 12.) ఇందలి వర్ణిత విషయము నిజముగా రమణీయము కాదు. అయినను కవి వచన గత హాస్యగర్భిత చమత్కార స్పర్శవలన నిందలి వర్ణ్య వస్తువు రమణీయతను జేకూర్చుకొనినది. నిగమశర్మ యను పేరు నేతిబీరకాయ వంటిదను లోకోక్తి హాస్యగర్భితమైనది. అట్లే యతఁడు కళింగోద్భవుఁడు అను వర్ణన కూడ(3 – 17), హాస్యగర్భితమైనదే!

అక్క నిగమశర్మకు బుద్ధి చెప్పఁగా నతఁ డంగీకరించినట్లు మనకుఁ దోచును. వాఁడు బాలకాలమునుండి యన్న పానీయములకు మొగమువాచి యున్నాఁడని చెప్పుటలో వాఁడు సద్బుద్ధిని నమ్మలేదనియు బంధువులను నమ్మించెననియుఁ దెలియును. అక్క మాటలు వినిన తర్వాతఁ గ్రమముగా నిగమశర్మ యింటిలోని సంప్రదాయపు సదాచారము లన్నిటిని మఱలఁ బాటించినాఁడు. దైవారాధన మారంభించినాఁడు. చివరకుఁ దండ్రి మడిపం చెలు కూడ నుదికిపెట్టుచున్నాఁడు. ఎంత వినయ విధేయతలు! ఎంత మార్పు! ఇట్లు వర్ణించి రామకృష్ణుఁడు చివరి కొక్కమాట హెచ్చరిక చేయుచున్నాఁడు. "తేనె పూసిన కత్తి ధాత్రీసురుఁడు" —3 – 46. కనుకనే వాఁడు నగలను దొంగిలించుకొని పోయిన తర్వాత నింటిలోనివా రంద ఱేడ్చుచుండఁగా, నిగమశర్మను గూర్చి "ఎంత దుర్బుద్ధి" యనియు మిగిలినవారిని గూర్చి "ఎంత దుర్భ్రాంతి" యనియు మఱల రామకృష్ణుఁడు "మొదటఁ దేనె పూసిన కత్తి యని నేను చెప్పనే చెప్పితి" నని చదువరులకు జ్ఞప్తి చేయుచున్నాఁడు. ఇందలి కథాకథనమందలి వ్యంగ్య హాస్య పరిపోషణమును గమనించునది.

నిగమశర్మ యింటిలోని నగల నన్నిటిని దోచుకొని పోవుచుఁ జివరకు బావగారి చెవినున్న కాడ గూడ నతఁడు నిద్దుర లేవకుండఁ గత్తిరించుకొని పోయెనఁట! ఇది చౌర్యములోఁ బరిహాసము! రామకృష్ణుఁ డిట్టి వేడుక లెన్నియేని దవ కథాగతియందుఁ జూపును.

నిగమశర్మ నగలను మోచికొని యడవిలోఁ బోవుచుండగా దొంగలు కొట్టిరి. వారు కరుణలేనివారు. చీకటియే యాకారముగాఁ గలిగినంత నల్లగా నున్నారు. ఇతరుల సొమ్మును హరించుటలో వారి కెంత వేగ మున్నది! వారు సృష్టి కంతటికిని ద్రోహులు —3-52. ఈ వర్ణనమంతయు నిగమశర్మ సందర్భమునఁ జేయుటవలన నొక చమత్కృతి భాసించును. అతనికి వారు దయలేనివారుగాఁ గనుపించినారు. తా నిల్లు దోచినప్పుడు తనకు దయకలదా? వారు చీకటివలె నున్నారు. తాను దోచుకొనినపుడు చీకటిలోనే భయము లేక వ్యవహరించెనుగద! వారు సృష్టికి ద్రోహులు. తాను? ఈ విధముగా నెవ్వఁడైనను స్వవిషయమును విడిచి యితరుల గుణ నిర్ణయమును జేయుట, మృత్యుదశ యాసన్నమైన క్షణములయందుఁ గూడ మానవసహజమే యను లోకరీతి యిందు వ్యక్తమగుచున్నది.

దొంగలు నిగమశర్మ రొమ్ము పగులఁగొట్టిరి. వాని శరీరమునఁ బెద్ద పెద్ద గాయము లైనవి. కాని దెబ్బ లాయువుపట్టులందుఁ దగులలేదు. ఆయుర్మహిమ గట్టిదిగదా! —3-53. ఈ వర్ణన వైఖరిలోఁగూడ హాస్యస్పర్శ యున్నది. దొంగలు కొంగలవంటి వారఁట! నిగమశర్మ కడనున్న సొమ్మును హరించి చెట్టున కొక్కఁడుగా జెట్లెక్కి మాయమయిరి. దోచుకొనుట తనకే తెలియునని యనుకొనిన నిగమశర్మ గర్వము కూడ వాని తెలివితోఁబాటు తప్పిపోయినది. చిన్నదొంగ యిల్లు దోచుకొనగా వానిని దోచుకొనువారు పెద్ద దొంగలు.

స్పృహతప్పి పడిపోయిన, 'అ కా పురుషుని' జూచి దయదలచి యొక కాపు తన యింటికిఁ గొనివచ్చి రక్షించినాఁడు. ఇచట కాపురుషుఁ డను విశేషణము వలన (3 – 55) నా కాపునకు నిగమశర్మ వలనఁ గలుగబోవు దుర్దశను ముందే రామకృష్ణుఁడు హెచ్చరిక చేయుచున్నాఁడు. పామును దెచ్చి పాలు పోసి కాపాడిన కాపు కథ తెనుఁగు దేశమునఁ బ్రసిద్ధమే కదా!

కాపుఁగోడలు సర్వవిధముల నిగమశర్మకుఁ దగినది. వికారములలో నిద్దరు సమాన పాండిత్యము గలవారు. ఈ విషయమును బురస్కరించుకొని యితఁ డామెను గూర్చి "ఎప్పుడును దిక్కులు జూచుచున్న చంచలములైన పొగరు కాటుక కన్నులు కలది. ఆమె చూపులు నలుదిక్కులకు విసరుచున్న వలలవలెఁ బ్రసరించి నవ యువకు లను పిట్టలను జిక్కుకొనునట్లు చేయును" —3-60. ఇచ్చటఁ గామాంధకారము – వర్ణనలోని హాస్య స్పర్శవలన గ్రామ్య దోషమను వలలోఁ జిక్కుకొనకుండఁ దప్పించుకొనినది. ఈ కాపుఁగోడలు కన్నులకు నిగమశర్మ యింపుగా నున్నాఁడు. "పసందైన బ్రాహ్మణుఁడు. ఇంట వద్దులేక చరించుచున్నాఁడు" —3-61. వానిని జూడగనే యెక్కడలేని వెకిలి

చేష్టలు చేయును. ఈ వెకలితనమును వర్ణించుటలో రామకృష్ణుని లోకపరిశీలనా కౌశలము, దుర్బలులైన యసంస్కృత జీవలక్షణము గల జనుల కక్కురితి, పత్తరపాటు మున్నగువానిని గవి యెంత నిర్లిప్తుఁడుగా హాస్యదృష్టితో గమనించి చదువరులకు నల వోకగా నందించగలఁడో తెలియఁజేయుచున్నది. ఈ వెకలితనమును వర్ణించుచునే యితఁడు వ్యంగ్యమర్యాదలో మఱియొక నిగూఢమైన మనస్తత్వ శాస్త్రమునకు సంబంధించిన రహస్యమును జిత్రించినాఁడు. ఆ కాపువానికిఁ బెక్కుమంది కోడండ్రుండగా దీని కొక్క దానికే యిట్టి వికారమేల? దుష్టుఁడు, వ్యభిచారియు నగు నీ కుట్టుబాపనిపై మనసేల చలింప వలెను? దీనికిఁ గవి రెండు కారణములను గల్పించినాఁడు. అందొకటి వాచ్యముగను, రెండవది వ్యంగ్యముగను గథలోఁ బ్రతిపాదింపఁబడినవి. అందు మొదటిది దాని పుట్టుకతో నున్న చంచలబుద్ధియే. రెండవది, యా కోడలికి సంతాన మింకను గలుగలేదు. అది నిగమశర్మను జూచినంతనే తోడికోడలి బిడ్డ నెత్తుకొని బుగ్గ నొప్పిపెట్టునట్లు కఱచును. వాఁ డేడువగా నెత్తుకొని కౌగిలించుకొనెను. ఇది నిగమశర్మ చూడ వలెను. అనఁగాఁ దనకు సంతాన ప్రాప్తిఁ గలిగించు నను నమ్మకము తన భర్తపై నామెకు లేదు. కనుకనే భర్త అర్ధమరేయిదాక పొలమారసి యలసి యింటికి వచ్చి భార్యకొరకుఁ జాలరాత్రి పోవువఱకు నిద్దుర కాచి యున్నను వాని నామె పలుకరింపదఁట! ముచ్చట లేదఁట! మూఁగవలెఁ గన్నులు మూసి మనసున నిగమశర్మను జూచునఁట! భర్త యసమర్థుఁడై భార్య నిండువయసున నున్నప్పు డిట్టి మనోవికారములు సహజముకదా! యని చదువరుల మనసులకుఁ దోచువఱకు రామకృష్ణుఁ డిట్లు లోకసంభావ్యతను నిరూపించి వర్ణించినాఁడు. కాని యిది యంతయుఁ గవితా చమత్కృతి. చదువరుల మనస్సులలోని లైంగిక సంస్కారములతో గారడీ చేయుట యిది! అయినను జదువరుల మనసుల నిట్టి స్థితిలో విడువవచ్చునా? వెంటనే వర్ణనమును లోకోత్తర విషయమగు పర తత్త్వము మీదికిఁ గవి లాఁగుచున్నాఁడు. దౌర్బల్యమువలన మనసు నాకర్షించు ధర్మ విరుద్ధ కామము తుచ్ఛమై, తత్ఫలిత మశాశ్వతమై మానవుల నిహపర ములకు దూరులను జేయునని వెంటనే హెచ్చరించుచున్నాఁడు.

"రామాదివత్ ప్రవర్తితవ్యం, నతు రావణాదివత్" అని గదా యుండవలె, మహాకవుల కావ్యములలోని ప్రతిపాదన! ఈ ప్రతిపాదన కూడ కావ్య మర్యాదను దాటిన తత్త్వబోధ కాఁగూడదు. అట్లయినచోఁ గావ్యమునకుఁ బ్రబంధత్వము సిద్ధింపదు. అందువలననే పరతత్త్వమును గూడ వారి వికార ములతో జతపఱచి యితఁడు వర్ణించినాఁడు —3-72. ఇందును హాస్యరేఖ యున్నది. స్త్రీ పెదవి మాధుర్యము పొన్నాకుపైఁ దేనెవంటిదట. అనఁగా దృప్తినీయకయే వ్యయమయిపోవును. స్త్రీ శరీరవాసనలు వసంతము గుమగుమ లఁట! అనఁగాఁ బట్టుమని రెండు నెలలకన్న మించని ఋతువువంటివి. స్తనముల యందము మధుర ఫలములపై నాశవంటిదఁట! అనఁగా పడి రాలిపోవునట్టిది. జడసొంపు నీల మేఘపు నిగనిగలు గలదియఁట! అనఁగాఁ జూచుచుండఁగనే తెల్లఁబడిపోవును. ఇట్టి యశాశ్వత లీలను జూడలేనివారు, క్షణికానందమునకు ధర్మము నుల్లంఘించు తుచ్ఛులని యవకాశము లభించినచోటఁ గవి నొక్కి చెప్పుచున్నాఁడు.

జాతరను వర్ణించిన సందర్భమునఁ గూడ నచ్చటచ్చట హాస్యరస స్పర్శ యున్నది. జాతరకు ముస్తాబై రెడ్లు బయలుదేరిరఁట! యెడ్డెతనపు మోటయిన యలంకారములను జేసి కొనిరఁట! అది చాలక భార్యలను ముందు నడిపించుచుఁ దాము వెనుక నడచుచుండిరట. అనగా నా కాలమున వారి యిండ్లలో నాడు వారిదే పెత్తనమని చిన్న పరిహాసము.

పశువులకు గాలికుంట్లు వచ్చినవి. పశువుల రక్షకై జాతర జరుగుచున్నది. అందుఁ బశువులను బలి యిచ్చుచున్నారఁట; జాతర చేయు భక్తులు ఒక్క వ్రేటున పశువుల మెడను నరుకగా నెగిరిపడు రక్తము పశువుల యాపదలను చీకటులను వోఁగొట్టునట్టి సూర్యోదయరేఖవలె నున్నదఁట. ఇది సరియైన హాస్యము.

ఈ జాతర జరుగుచున్నపుడు నిగమ శర్మ కాపుఁగోడలిని లేపుకొనిపోయె నఁట! ఆ కాపుఁగోడలు మగని నటుపెట్టి రెండవ మగనివెంట నరికెనఁట! కనుక సామాన్యముగా "ఉవిదలకు బుద్ధి పెడతల నుండుగాదె" (3–81) యని రామకృష్ణుఁడు తెగఁబడి దుష్కార్యమును నిందించుచున్నాఁడు.

ఈ నిందలు చదువరులను సూటిగా జొచ్చికొని నొప్పి గల్గింపకుండ నీ పద్యములోని "మగఁడు, రెండవమగఁడు, బుద్ధి, పెడతల నుండుట" మున్నగు తెలుఁగు పలుకుబడుల వలనఁ బుట్టు హాస్యము కాపాడుచున్నది. ఇట్టి నిందకు గురియగువారు కూడ నవ్వుకొనుచుఁ జదువుకొనునట్లు రచించినా డిచ్చట.

నిగమశర్మ, కాపుఁగోడలు బయలుదేరి చేసిన ప్రయాణము మహారణ్య మధ్యము. దాని వర్ణనము కడు దుష్కరముగ, కఠినముగ, భయానకముగ నున్నది. పెద్ద సీస పద్యమున (3–83) నిట్టి వర్ణన చేయుటలోఁ గొండను ద్రవ్వి ఎలుకను బట్టినట్లు నిగమశర్మ క్షణికమగు స్త్రీసుఖమునకై యెంత పాటుపడుచున్నాడు, పాపము! అను హాస్యమిశ్రితమైన జాలిపలుకు ప్రతీయమాన మగుచున్నది.

కాపుఁగోడలు చనిపోవఁగనే నిగమశర్మ యొక నల్లని స్థూల శరీరముగల మాలదానిని బట్టినాఁడట! పోయిన కాపుఁగోడలికై యొక క్షణమైనను వాఁడు విచారపడలేదు. వానికి గావలసినది కామము గాని వ్యక్తిగాదు. అంతటి నీచస్థితి యీ వర్ణనలోని త్వరితగతివలన ధ్వనించును. అంతవరకు నిగమశర్మకుఁ గామమే తెలియును గాని దానివలనఁ గలుగు సంతానము మున్నగు జంజాటము తెలియదు. మాలకన్యవలన నతనికి సంతానము కలిగినది, కొంప మునిగినది. వ్యక్తులకై సుఖదుఃఖములను బాలుపంచుకొన వలసిన మనఃపరిణామము వానికిఁ దెలియకుండఁగనే కలిగినది. ఈ పరిణామముకొఱకై ఎదురుచూచుచున్న విధికిఁ గథ రక్తి కట్టించవలెనను మెఱమెఱ గలిగినది. అతఁడింట లేని యప్పుడు దారాపుత్రులు తప్పఁద్రాగి పడియుండఁగా నగ్నిప్రమాదము సంభవించి యెల్లరు భస్మమయినారు. నిగమశర్మ యింటికి వచ్చి చూచి జన్మలో మొట్టమొదటగాఁ బ్రాణులకై దుఃఖించినాఁడు. ఈ దుఃఖమునగూడ సమదృష్టితోఁ గూడిన హాస్య రేఖలు పొడగట్టును. అతఁడు దుఃఖించిన వైఖరి యిట్లున్నది. "అందఱును డబ్బిచ్చి కన్యలను గొందురు. నేను బ్రాహ్మణవంశము నిచ్చి కొన్నాను. నీ

నల్లని రూపు నిత్య మనుకొన్నాను. అది మెఱపుదీగవలె నైనది. నీవు వాయించు వీణ శబ్దము లిప్పటికిని నా చెవులలో మ్రోగుచున్నవి. దారిని బోవువారు నన్ను జూచి యీ బ్రాహ్మణుఁడు మాలదానికిఁ జిక్కినాఁడు; అని కన్నెఱ్ఱతో నామొగముపై నుమిసిరి. దానిని గూడ భరించి నీ మొగమున నమృతస్థితిని జూడఁదలఁచితిని" (3–94, 95).

ఈ వర్ణనమున నతని యల్పబుద్ధియు మూర్ఖతయు గోచరించును. ఈ విలాపమునఁ గామమే యున్నది గాని ప్రేమస్పర్శ లేదు. ఇఁక సంతానమును గూర్చి చేసిన శోకమున మమకారముతోఁ గూడిన ప్రేమస్పర్శ యుదయించినది. అది యిట్లున్నది. "ఈ భూమిపై నందఱకును బిడ్డలున్నారు. కాని నా వంశమును నిలుపఁ బుట్టినవారైన నీ బిడ్డలవంటివారు మును పెవ్వరికిని బుట్టి యుండలేదు. ఏమి ముఖకాంతి. ఏమి శరీర సౌష్ఠవము. ఏమి భుజములు – ఏమి పలుకులు – ఏమా – కన్నులయందము? —3–96. ఇందు మూర్ఖత, సంకుచితత్వము, నల్పబుద్ధితోడి మమకారము ప్రేమస్పర్శయు నున్నవి. అన్ని భావముల సమ్మేళనము సందర్భగతమైన హాస్యరేఖపై నాధారపడియున్నది. కవికి నిగమశర్మపై జాలి లేదు కాని కోపము గూడలేదు. వానిని మోక్షమార్గమునకు లాగుకొనిపోవు పూర్వ సంస్కారమను త్రాటికొనను బట్టుకొని విధి ఈడ్చుచున్నది. దానికిఁ జేదోడుగాఁ గవియు శ్రమపడుచు, నిగమశర్మను గూర్చి "నాయనా, నిన్నిన్ని త్రిప్పులు పెట్టుట నీ మంచికొఱకే. అదిగో పౌండరీక క్షేత్రము – నృసింహస్వామి యాలయము నెదుటకు నిన్నీడ్చుకొనిపోవుచున్నాను. మమ్ము తిట్టుకొనకుము." అన్నట్టి భావము కథాగతమై స్ఫురించును. రోగికి శస్త్రచికిత్స చేయుచున్న వైద్యుని జాలివంటి జాలి కవి కీ పాత్రపై నున్నట్లు కథాగతమైన హాస్యస్పర్శవలన మనకు గోచరించును.

తుదకు నిగమశర్మ నృసింహ సన్నిధిని జచ్చినాఁడు. పీడ వదలినది యన్నట్లు కవి "ఈ యధముని మేను కాకులు గ్రద్దలు పొడిచినవి" (3–104) యని వర్ణించినాఁడు. శరీరముతోఁ బాపపుఁబ్రోగు చాలవరకు తొలఁగినది. ఇఁక జీవుని సంస్కారమునఁ గల పాపములకు రేవు పెట్టుటకు యమదూతలు వచ్చుచున్నారట! దీనితో వానికి సూక్ష్మ దేహశుద్ధి కల్గునని సంతోషించినట్లున్నది యమదూతల వర్ణన. వా రందఱు కసిదీర నొక్కమారు నిగమశర్మ చేసిన పాపముల నెల్ల నేకరువు పెట్టిరి. వారి కోపము తీర బంధింపఁబోవుచున్నారు. కాని కవి బంధింపనిచ్చునా! తాను సృష్టించిన నిగమశర్మ పునాది గట్టిది. వాని తలిదండ్రులు దేవతలను భూమికి దించి, బ్రాహ్మణులను నింగికెత్తి పూజలు సలిపి వానిని బడసినారు. ఆ సంస్కార మూఱక పోవునా? వెంటనే సుదర్శనచక్రము వచ్చినది. దానిని విష్ణువు పంపనక్కఱ లేదఁట. తానే నిగమశర్మ కేక విని వచ్చెనఁట. యమదూతలు చెల్లాచెదరు కాఁగా నిగమశర్మ పరమపదమునకుఁ బోయెను. ఇందలి చిత్రణమున "నితఁడు తప్పులు చేసిన మాట నిజమే కాని తప్పులకన్న దైవము చాల గొప్పవాఁడు. దైవమునకు జీవులను క్షమించి యుద్ధరించు నధికారమే యెప్పుడును గలదు." అను భావము ధ్వనింపఁజేయఁబడినది. "అట్లయినచో నిక నీ కథలో నీతిబోధ యేమున్నది? ఎన్ని తప్పులు చేసినను

దైవము క్షమించి రక్షించునను వాగ్దానమున్నచో సన్మార్గమున నెవ్వరు పోవుదురు ? ఈ కథను జదివినవారు చెడిపోవరా ?" యని వాదించు సన్మార్గు లుందురు. ఈ కథలో జీవుల పాపపుణ్యములు జగన్నాటకములోని విలాసము లనియు, రక్షణ భారము దేవునిదే కాని జీవునిది కా దనియు నా దేవుడు క్షేత్రము, తీర్థము, దేవాలయము అనఁబడు మూఁడంశముల మహిమవలన జీవుల పాపములను దొలఁగించుననియు గ్రహింపవలయును. చెడిపోయిన వారిని క్షమించి యుద్ధరించువా రున్నంత మాత్రమున నందరును సందు చూచుకొని చెడిపోరు. చెడుట బాగుపడుట జగన్నాటకములోని వివిధ రసముల ఘట్టములు. అది యా జీవి కర్మమార్గముపై నాధారపడియుండును. చెడ్డకర్మకుఁ బ్రతిగా జీవు లందరకును బూర్వసంస్కార వశమగు మంచికర్మ యున్నది. తన చెడ్డకర్మలతోఁ జెడిపోఁ గల్గిగిన జీవి పుణ్యక్షేత్రాది దర్శన మనఁబడు తన మంచి కర్మతో బాగుపడె ననుటలో వింత యేమున్నది ? గ్రంథపఠనమువలన నెవరైనఁ జెడిపోవుట వారి పూర్వవాసనపై నాధారపడియుండును. రామాయణము చదువుచున్నపుడు రాముఁడు నచ్చుటయా, రావణుఁడు నచ్చుటయా – యను నంశము చదువువాని పూర్వ సంస్కారముపై నాధార పడియుండును. కవి యిట్టి విచిత్రమార్గమున ధర్మమూలమును స్పృశింపఁదలచి, దానికి సహకారముగా, గాంభీర్యగర్భితమైన సుకుమార హాస్యరేఖ నంతర్వాహిని గాఁ దన పదప్రయోగవైఖరిలో నిమిడ్చినాఁడు.

అలంకారములు

ప్రబంధము లన్నిటియందు నాలంకారిక రచన ప్రాధాన్యము వహింప వలెను. రామకృష్ణుని మూఁడు ప్రబంధములు నలంకార ప్రధానము లయ్యు నందలి యలంకారము లుత్తరోత్తరము గుణోత్తరములై చారుతరములై భాసిల్లి నవి. రచనలోని పౌర్వాపర్యమే దీనికిఁ గారణము. అలంకారములు సౌంద ర్య ప్రతిపాదకములై యుండుట మాత్రమే గాక, కవి హృదయమును విస్పష్టము చేయుటకును, భావ ధ్వని వ్యంగ్యముల ప్రాచుర్యమునకుఁ బాత్రపోషణమునకుఁ గూడఁ దోడ్పడవలెను వలయుచోఁ గథలోని రహస్యములను బహిర్గతము వ్యాకరింప వలెను. సమగ్రమైన కావ్యరసాస్వాదనకు నలంకారము లెంతయు నావశ్యక ములు. రామకృష్ణుని ప్రబంధములలోని యలంకారములం దీ లక్షణము లన్నియు సమగ్రముగాఁ బొడకట్టును. అర్థాలంకారములలో నుపమ, రూపకము, స్వభావోక్తి, యర్థాంతరన్యాసముల నితఁడు హెచ్చుగా వాడును. ఘటికాచల గ్రంథమున నెక్కువగా నీ యలంకారములే యున్నవి. అరుదైన యలంకార ము లరుదుగా నున్నవి. ఉద్భటారాధ్య చరిత్రమున నలంకారముల సంఖ్య తక్కువ. అది యెక్కువ భాగము వర్ణనాత్మకమైన భక్తి ప్రబంధము. ఈ రెండు గ్రంథములయందు నపహ్నవము, నర్థాంతరన్యాసము, విరోధాభాసము మున్నగు నలంకారము లేదనడఁ బొడకట్టినను బ్రాధాన్య ముపమాది ప్రసిద్ధాలంకారములకే చేకూరినది. పాండురంగ మాహాత్మ్యమున, నలంకార విస్తృతియు, బాహుళ్యము కలదు. అందు నుదాత్తము, తుల్యయోగిత, కావ్యలింగము, వివిధోత్ప్రేక్షలు, వక్రోక్తి, నిదర్శనాపహ్నవాదులు నగు

నరుదైన యలంకారము లన్నియు రసాభ్యుచితములుగ నర్థవంతములుగఁ గూర్పఁబడినవి. ఉపమానోపమేయ సాధనమున్న తావులందు రామకృష్ణుని యుపమానము లన్నియు నతి స్వతంత్రములై యౌచితీ పరభాగములై కవి సామర్థ్యమును జాటుచుండును. కవి సమయములుగాఁ బ్రసిద్ధములైన యలం కారములు కతిపయములుగను, స్వకపోల సాధితము లధికముగాను కాననగును. కవిసమయ ప్రసిద్ధములైనవి గూడ శబ్దముననో యర్థముననో నూతనత్వ మలవరచుకొని యపూర్వములై వెలుఁగొందును. రామకృష్ణుని యలంకారములం దతని ప్రత్యేకత ముద్రితమై యుండును. ఈ ప్రత్యేకత పాండురంగ మాహాత్మ్యమునందలి యలంకారములకుఁ బూర్తిగా నున్నది. ఇతని మూఁడు కావ్యములలోని యలంకారములను వరుసగాఁ బరిశీలించినచో నీ యంశము విశదమగును.

ఉపమ :

ఘటికాచల మాహాత్మ్య గ్రంథమున స్వచ్ఛమైన యుపమాలంకారమే లే దనవచ్చును. శ్లేషానుప్రాణితమైన యుపమ కథారంభము ననే యున్నది.

"శ్రీకరలీలఁ గంకణపరిష్కృత మంబుధి లేవ నిత్య ము
క్తాకలితంబు రామకథకై వడిఁ జారుమరుత్కుమార వా
ర్తాకర మాదితేయగిరిదారి లసత్సుమనోఽభివృద్ధి. లం
కొకము రీతిఁ బుణ్యజనశాశ్రయ మాసర మొప్పు నెప్పుడున్"
—ఘటిక. 1 – 4

ఇందు శ్లేషలోని చమత్కృతి తప్ప విశేషమైన సౌందర్యాపాదన మెద్దియు సాధింపఁబడలేదు. ఇట్లేయత్యుక్తి సహితమగు నుపమాలంకార మొకటి యున్నది

"ముని హోమానలధూమము
వినువాకన్ గ్రుంకి వెడలు విబుధవధూటీ
జనముల నెఱిముంగురులన్
దనరున్ సాంబ్రాణిధూప ధారారీతిన్" —ఘటిక. 1 –12

దీనియందును బ్రత్యేక సౌందర్యాపాదకమైన యలంకారత్వము లేదు. ఈ హోమధూమమే కవి కల్పనావైభవముతోఁ బెరిగి పెద్దదై పాండురంగ మాహా త్మ్యమున ని ట్లల్లుకొన్నది !

"హోమధూమాసిత ప్రభ నీ మహాత్మ
నాశ్రమంబొప్పు నీ యద్రి యంతికమున
వలుదయై మించు నప్పంటవలఁతి వెలఁది
చంటికడ నంటు మృగనాభి చర్చవోలె" —పాండు. 1 – 134

ఉద్భటచరిత్రనాఁటి కితని యుపమ కథాగమనముతో సందర్భమును జేకూర్చు కొన్నది.

"భవుఁ గొల్చువారల పాతకంబుల రీతి
రమణఁ గారాకులు రాలె దరులఁ
బార్వతీపతిమీఁదఁ బ్రాజ్ఞుల కనురాగ
మును బోలె నిగురెత్తె భూరుహములు
నీశానభక్తుల యిండ్ల సంపద లీలఁ
గలయంగ ననుమట గలిగెఁ జెట్లు
శశిమౌళిదాసుల సంకల్పముల భంగి
ఫలియించె నందంద పాదపములు
...." —ఉద్భట. 1 – 84

అలంకారములలోని గాంభీర్యముగూడ పెరిగినది. అనఁగా నుపమానోపమేయ ప్రతిపత్తియు, సందర్భశుద్ధియు హెచ్చినవి.

"పరుష కఠినక్షతిన్ దిన
కరరథ గంధర్వవదన గళితంబగు నె
త్తురు వోలె సాంధ్యరాగము
సురవర దిశయందుఁ దళుకుసూపెం గలయన్" —ఉద్భట. 2 – 48

ఉచితములై సారూప్యశ్రీ యుల్లసిల్లు నుపమానములను వరుసగాఁ గురిపించుట కూడ నలవడినది.

"పవడంపుఁ బొదరింట బాలహంసము పోలె
జడముడి శశిరేఖ గడలు కొనఁగ
నాకాశమండలి నంగారకుఁడు వోలె
నిటలపట్టిక నగ్నినేత్ర మమర
వలుదశంఖములోనఁ బొలుచు నీలమువోలెఁ
గంధరమున మచ్చ గానుపింప
నమృతాంబురాశి నీరానుమేఘముపోలె
నెమ్మేనఁ గరిచర్మ మెమ్మెమీర
వలను మిగిలిన భాగ్యదేవతయ పోలె
శ్రీ విశాలాక్షి చెంగటఁజెలువు మిగుల
....విశ్వపతి............" —ఉద్భట. 2 – 82

స్వతంత్రముగ నుపమానములను గల్పించు శక్తి యిందు స్పష్టముగ నలవడినది. ఈ స్వాతంత్ర్యమునకు రమ్యతరత్వము రసానుగుణమైన యౌచితియుఁ బాండురంగ మాహాత్మ్యమునఁ గాననగును.

"శశిరేఖఁ గైకొన్న సౌవర్ణగిరివోలె
మినుకుఁ జేడియ గూడి మెఱయువాని
నసురేజ్యుఁ బాటించు హాటకాద్రియుఁ బోలె
నంచ చెంగట నుండ నలరు వాని
శారదాభ్రములంటు భూరిశైలముఁ బోలెఁ
దెలువుఁ గైసేఁతల వెలయు వాని
కకుబిభంబుల మీఁది కాంచనాగముఁ బోలె
వెలిదమ్మి గద్దియ వెలయు వాని
...." —పాండు. 5 – 174

ఇం దలంకారములోని సూక్ష్మ, సూక్ష్మతరాంశములందు గూడ నుపమానోపమేయ భావము సిద్ధించుటయే కాక సందర్భము, రసముల ననుసరించిన గడుసుఁదన మున్నది. ఉద్భటచరిత్రమునఁ గేవల ముపమానోపమేయ భావశుద్ధియే పెక్కు తావులందు లక్ష్యము.

"కాయలు రాల్చిన మామిడి
సోయగమున నిల్లు మిత్రశూన్యం బగుచున్
దూయని తద్భూజముఁ గని
హా! యనుచున్ గుండె పగిలి యతి విహ్వలుఁడై"
—ఉద్భట. 3 – 258

ఇందు సాదృశ్యమే కాని సాదృశ్యశ్రీ లభింపదు.

పాండురంగ మాహాత్మ్యమందలి యుపమాలంకారములలోఁ బెక్కు లనన్యములు, నుపరిణతములు. అంతకు ముందు కవులు గాని, తరువాతివారు గాని యుపయోగింపని యలంకార సామగ్రిని భావనాబ్ధినుండి యితఁడు తరువి తెచ్చినాఁడు.

ఉదా:

1. "పలుకుం దొయ్యలి మౌళికాంతి కెనయౌ బాగాలు నయ్యింతి చె
క్కులఁబోలుం దెలనాకు లయ్యువిద పల్కు ల్వంటి కప్రంపుఁ బ
లుకులతోఁ గూడిన వీడియం బొసఁగె నాకుం......."
—పాండు. 1 – 29

2. "సామిమలనుండి రాజతాచలము దాఁక
సేతువెత్తిన గతి మహాసేను సేన
రోదసీరంధ్ర నీరంధ్ర రూపమగుచు
నడచె... ...." —పాండు. 1 – 172

3. "హరుఁడు శిరంబునం జెవిఁ గరాంబురుహంబునఁ దాల్పఁ జంద్రికాం
కురపరభాగమై యురగకుండలమై స్ఫటికాక్షసూత్రమై
గిరిజ కవాశిఁ గర్ణమునఁ గేల వహింపఁ బ్రసూన మాలికా
కరిరదపత్ర విభ్రమ శుకంబులునై మణి యుల్లసిల్లుచున్"
—పాండు. 1 – 203

ఇం దుపమానములు చారుతరములుగా నుండుటయే గాక క్రమాలంకారమున పద్యము పూర్వోత్తరార్ధములలోఁ బార్వతీ పరమేశ్వరుల యలంకృతి వర్ణింపఁ బడుటవలనను, వారి యర్ధనారీశ్వరత్వము, నభేదతత్త్వము మున్నగు నంశముల నున్మీలనము చేయుచున్నది.

కొన్నితావులందు నుపమాన వస్తువుయొక్క నూత్నత యీ కవి యుపమాన మునకు నపూర్వాకర్షణ చేకూర్చును.

"మును మీనగుటఁ బట్టి మునులు వైచిన బత్తి
వలఁ బోలెఁ జిక్కు పౌదలఁ దలిర్ప
వెలితిగాఁ జవిఁగొన్న వెన్నముద్దయుఁ బోలె
శంఖంబు వామహస్తమునఁ దనర
జగదండవహ కాలచక్ర భ్రమణహేతు
దండమై నిజధేను దండ మమర
సంచిఁ బట్టిన పద్మజాండాండముల లీల
వలకేల గ్రచ్చకాయలు ఘటిల్ల
...." —పాండు. 2 - 14

ఇందు బత్తివల యనుచో రూపకము, వర్ణనమున స్వభావోక్తియుఁ గూడ నుపమతోఁ గూడి సౌందర్యమును బెంపొందించినవి.

కొన్నితావుల నితని యుపమ రసనిష్పత్తికిఁ దోడుపడుటకొఱకు నూతన సాధనముల నేర్పరచుకొనును.

ఉదా :

"వైషమేషవ విషమేషు శోషణమున
వేష మొకరీతిగా నిర్నిమేషసయన
యగుచు నెఱిగొంటఁ గదలని పొగరుమీను
దోయిఁ జూపట్టు సుప్తసింధువును బోలె" —పాండు. 2 - 129

ఇందలి విశేషములను గూర్చి ముందు వివరింపఁబడినది.

కొన్ని తావులం దుపమానముల కుపమానత్వము సాధించుటకొఱకుఁ గొంత వస్తు సన్నివేశ కల్పన ముండును. సామాన్యముగా నా వస్తువు, సన్నివేశము కొన్ని రసభావములను గూడ జతపరచును. ఉదాహరణ మీ దిగువ పద్యము :

"జడధి చల్లిన గందవొడి నేత్రములఁ బడ్డ
గతిఁ దామరల పరాగంబు గ్రమ్మఁ
దదితర క్షేత్రముల్ తమయందు నిలుచున్న
నొడ్డించుటలు వోలె నూర్ము లెసఁగఁ
బంకదంభమునఁ బాపముల మ్రింగిన నీటి
పెద్దనవ్వుల లీల ఫేనమలరఁ
బెఱవాహినుల మీఁదఁ బెరిగిన మత్సరా
వేశంబు లన గ్రాహ వికృతు లడర
...." —పాండు. 2 - 134

కొన్ని తావులం దుపమానోపమేయముల నైసర్గికమగు మహత్త్వమే యలంకారమును చారుతరముగాఁ జేయును.

"రాజతాహార్య గోరాజ రాజమునకుఁ
జంద్రశేఖరవర కకుచ్చారువునకు
నీ మహాసింధువుపకంఠసీమ నిగిడి
డాలు దీపించె నిది గంగడోలుఁ బోలె" —పాండు. 2 - 177

ఉపమానమును సాధించుటకై చేసిన కల్పన యప్పటి కథా సందర్భము ననుసరించి లోకోత్తరముగాఁ దీర్చి దిద్దఁబడును. మన్మదునకుఁ బరమేశ్వరునకుఁ గల వైరకథవలనఁ జంద్రున కొక క్రొత్త యుపమాన మతి దుర్లభమైన విధమున లభించినది.

"విడువని వైరవృత్తిఁ దరివేచి రతీశుఁడు చేతికత్తి నె
క్కుడు రభసంబునన్ శిరసు గ్రుద్దిన నయ్యలుగెల్లఁ బోయి లో
నడఁగ బహిఃస్థ తత్పరుపదార్పిత సూకరదంష్ట్ర కైవడిన్
జడముడిఁ జంద్రరేఖ వెదజల్లఁగఁ జల్లని చిన్ని వెన్నెలల్"
—పాండు. 2 - 161

"బహిఃస్థ" యను విసర్గయుత ప్రయోగమునకు వలసిన యుచ్చారణలోని బలీయత వలన మన్మథుఁ డలుగెంత గట్టిగా గ్రుద్దెనో తెలియును. అందలి సమాస దీర్ఘతవలన శిరస్సులోనికి దిగఁబడిన యలుగు దీర్ఘమై, లోతుగాఁ గ్రుచ్చుకొనెనని తెలియును. మూఁడవ పాదమందలి పారుష్యమువలన నాలుఁగవ పాదమందలి చిన్ని వెన్నెలల సౌకుమార్యము హెచ్చినది. అటుఁగు గ్రుద్దుటచేతఁ గలుగవలసిన రౌద్ర రసస్ఫూర్తి కలుగకపోవుట కాలంబనము మన్మథుఁ డగుటయు, భయానకాదిస్ఫూర్తి లేకపోవుటకు నాలంబనము మృత్యుంజయుఁ డగుటయుఁ గారణములు. అలంకారము నిమిత్తముగాఁ బుట్టిన విఠావాదుల యనుభావములు భిన్నములై శాంతరస భావస్పర్శను బద్యమున కాపాదించినవి. ఇట్టి యుపమాలంకారములు వాఙ్మయమున నరుదుగా లభించును.

కొన్ని తావులందు సమానధర్మము వివిధమార్గములలో సాధింపఁబడును. ఈ దిగువ యలంకారముల విశేషము గమనింపఁదగినది.

"నిరవిల సంచారస్థల
మరయిక సుస్నేహపూర మాయుఃస్థితి యా
యిఱుదెఱఁగు బలిమి దుర్దశఁ
బొరయక దీపమ్ము పగిది భూసురుఁ డెసఁగెన్" —పాండు. 3 - 51

"అకుటిలగుణ వాసనతో
న కలిగి మరువంపు లేఁగొనయుఁ బోలిన శ్రీ
శుకు నెన్నరేమి ? సారె జ
నకు నెంతురు పరముఖోపనత విజ్ఞానున్" —పాండు. 5 - 222

ఇందు శశిశబ్దము, పరముఖోపనత ప్రయోగమునందలి శ్లేషయే యుపమకు మూలము.

ఇందు మూఁడవ సమాసమున ధర్మము మిగిలినవానికన్న భిన్నముగా–కేవలము శ్లేషగతముగా – సాధింపఁబడినది.

కొన్ని తావులం దుపమానముల నవ్యత యొక్కటే రచనకు దీప్తి నిచ్చును.

"అంభోధరము క్రింద నసియాడు నైరావ
తియుఁబోలె నిడిఁద్రేలెఁ దెలవ యోర్తు
చెందమ్మికొలన రంజిల్లు నంచయుఁబోలె
నిప్పుటేట నటించె నెలఁత యోర్తు
తొలుసంజ యెండ వర్తిలు జక్కవయుఁ బోలె
నీఁగెఁ బందిరిగుండ మింతి యోర్తు
జలనీలిపై నిక్కు కలువ మొగ్గయుఁబోలె
ననఁటాకు నర్తించె నతివ యోర్తు
...." —పాండు. 3 – 7

రూపకము :

ఘటికాచల గ్రంథమునఁ జాల నపరిణతదశలో నున్నది.

"ఉడుపథమను మట్టిం గడు
నెడవిడుపడి దిగిన యూడ లివి యన ధారల్
బెడిదముగ నంబుదంబులు
జడిగొని వర్షంబు గురిసె జడధులు పొంగెన్" —ఘటికా. 2 – 45

పాండురంగ మాహాత్మ్యమందలి రూపకాలంకారములు లోకోత్తరాహ్లాదజనకములు.

"శీతాహార్య సుతాశనీ వికచ రాజీవంబు విశ్వేశ్వర
జ్యోతిర్లింగ విశుద్ధ రత్నఖని మోక్షోపాయదుగ్ధాబ్ధి వే
లా తీరావని ఢుంఠినామక గజాలానంబు గంగామృత
స్రోతోనిస్సృతి చంద్రగోళ మన మించున్ గాశి శ్రీరాశియై"
—పాండు. 1 – 99

నమానధర్మ మొకప్పు డసమాన ధర్మముగా సాధింపఁబడుటవలన లోకోత్తర మగుచుండును. ఈ దిగువ రూపకములోని స్తితరోలంబ మా విధమైనది :

"ప్రాలేయాచల కన్యకా వదన శుంభత్పద్మ సౌరభ్యమున్
గ్రోలంగల్గియుఁ దుష్టిలేక మునిహృత్త్రోడాబ్జ సౌగంధ్యలీ
లాలాలిత్యముఁ గోరు నొక్క సిత రోలంబంబు నైజాకృతిన్
డాలొందించుఁ బరాసులన్ భ్రమరకీట న్యాయరీతిన్ బురిన్"

—పాండు. 1 - 100

క్రమాలంకార కావ్యలింగములతో మిశ్రితముచేసి రచింపఁబడిన రూపములోక ప్రత్యేక శిల్పము గలిగి యుండును.

"పొదువు పరాగఘృష్టి మొగమున్ శ్రమవారిని మేను భాసు దీ
ప్తిదవుల హెచ్చు చన్గడలుఁదేజము దాల్చెనె గాని యొప్పు గుం
దదు నగపుత్రికప్డు ఘసితంబున వర్షముచేత నగ్నిపైఁ
గదురుట సద్దమున్ లతయుఁ గాంచన కుంభములున్ బెడంకునే"

—పాండు. 1 - 188

"అమిత భోగాయతనము దేహమను సర్ప
ముగ్రకృత్యము లేల యుడిగియుండు
ధాతుమయంబు గాత్రమను ధాత్రీధరం
బదిమేల రాగంబు నవలఁ ద్రోయు
నిచిత నానాగుణ ప్రచుర మీ తను వను పట
మేల చిరుఁగక పదిలమందు
నూర్మి పరంపరాయుత మంగ మను వార్ధియెడ
జీవనభ్రాంతి యేల యుడుగు
నార్ధవంబు చాల దతి కఠినాశయ
మెపుడు మైల విడువదెందుఁ జివుకు
...."

—పాండు. 4 - 273

ఉపమ, రూపకము కలసిన తావున మఱియొక విధమగు సౌందర్యము కనుపించును.

"పారదంబునఁ దోఁచిన పసిఁడితీగ
పగిది రాజిల్లె రాధ చంపక సవర్ణ
వర్ణమగు మేను కుముద ధవళ తుషార
పటల కంబుక వేల్లన ఘటన కలిమి"

—పాండు. 4 - 6

కథాగతమైన రూపక మొకటి యీ కావ్యమున లోకోత్తరత్వము సాధించు కొనినది. సుశీల యాదరించిన గృహలక్ష్మి వర్ణింపఁబడిన ఘట్ట మిది.

"చతురసమ్మార్గ నావరణంబు దొలునాటి
ప్రాఁచిపన్నియ త్రోపు వడుటగాఁగ
గోమయ గోముఖశ్రీ ముంగిట ఘటించు
టలు సుఖమజ్జన కలన గాఁగ
గమనీయ పూర్ణకుంభముల పూజాక్లుప్తి
కుచలికువాకల్ప రచనగాఁగ
నన్నసంపాద నార్హాగ్నిఁ బుట్టిన ధూమ
పటలి సంస్కారధూపంబు గాఁగ
విఘటిత కవాటకద్వార విశదనయన
యర్పితాధర గేహళికాధరోష్ఠ
భాండగోపన యవనికాంబరపరీత
యింతి గృహలక్ష్మి యత్యంత కాంతిఁదనరు" —పాండు. 4 - 148

స్వభావోక్తి :

దీనియం దీ కవికిఁ బ్రత్యేకశ్రద్ధయు నాదర మున్నది. ఇతని స్వభావోక్తిలో నితని లోకపరిశీలన, కావ్యదృష్టిలోని సుకుమారతయు విశదమగును. కథాంశములగు ఘట్టములు సరళములు, ఋజువులుగా నడవ వలసిన తావులందును, పాత్రల స్వభావము విశేషముగా నున్మీలనము చేయువలను లందునను నీ యలంకారము కనుపించును. ప్రకృతి వర్ణనమున నీ యలంకారము హత్తిన తావున దృశ్యములు కన్నులకుఁ గట్టుచుండును. ఇతని యితరాలంకారములు కూడ మిక్కిలి స్వాభావికములుగాఁ దీర్పఁబడిన వనిన నిఁక స్వభావోక్తికిఁ బ్రత్యేకత యుండితీరును. ఋష్యాశ్రమముల వర్ణనముసందర్భమున :

"ఇవె యూపవృతశాఖ లివె లూనముఖ దర్భ
సందర్భ వేశాంత సైకతంబు
లివె శబ్దసహ మృగయువ యుగంబులు వీరె
చలకాకపక్ష మస్తకులు బ్రహ్మ
చారులు నిజహోమ సౌరభేయీ తర్ణ
కముల నీడల నిల్చి కాచియున్న
వారు, సామోదితస్వర సంశయము నొంది
చిలుక కోయిల నిదె తెలియ నడిగె
...." —పాండు. 1 - 131

కొన్ని తావులందు రచనయందలి గాఢ పదబంధ మితని స్వభావోక్తుల సౌకుమార్యమును మాటుపరచు చున్నది.

"నఖరాగ్ర లూనానన స్వేద కోరకం
బర్ధకషాయ దృగంచలంబు
"ప్రబల నిర్వ్యాససౌరభ తర్పిత మదాళి
శోషిత శ్రవణ శిరీషయుతము
దర్శిత మధ్యవృత్త స్రస్తమృదునీవి
యప్రయత్న పయోధరాంబరంబు
సంతప్త శర్కరాసహ పదన్యాసంబు
నచలరజో ధూమలాలకంబు
సరణి తరుణ తరుచ్ఛాయ శమిత ఖేద
మమిత మృదులాంగకంబు......" —పాండు. 1-129

రచన పాంచాలీ రీతిలో నడచినప్పు డితని స్వభావోక్తిలోని యందము తెలియును.

"పద్మినీపద్మాతపత్రంబు శిథిల ప
త్త్రాగ్రమై రాయంచ యాశ్రయించెఁ
దాలుస్రవత్ఫేన జాలంబుతో ఘోణి
పంచల రొంపిఁ గలంచియాడె
దూరోద్గమ ద్దావధూమ మంబుదబుద్ధి
నెమ్మి లోపొదరింట నిక్కి చూచె
జఠరస్థజలము నాసానాళమునఁ దీర్చి
సామజం బిరుప్రక్కఁ జల్లుకొనియె
సరసిపై నీరు సలసల తెరలెఁ విపిన
సకల వీధులు నిర్మృగోచ్చయము లయ్యె
మట్టమధ్యాహ్న మిది......... ....." —పాండు, 1-136

వైదర్భిలోనున్న తావులలో నింకను నందముగ నుండును. పాండురంగని వర్ణనమునం దిట్టి పద్యములు విశేషముగా నున్నవి.

"అవు నదల్చు పచ్చవెదు రంఘ్రియుగాంతర వీధి నూఁది య
గ్రావనిఁ దేజరిల్లు కటిహస్త సమన్వితుఁ గౌస్తుభాంకు నిం
దీవిభు నింద్రనీలనిభదేహుఁ గనుంగొని వర్షహర్ష ధీ
రావిల మానసుండగుచు నమ్ముని కృత్యవిమూఢబుద్ధియై"
—పాండు, 2-51

అందును జాతీయమైన తెనుఁగునఁ గూర్చినప్పుడు స్వభావోక్తియను నామమునకు వన్నె తెచ్చును.

"ఇంతలు నంతలు నగు తన
సంతానము చంటవెంట సందడి చేయన్
భ్రాంతమున నిలిచి తమ్ముని
కుంతలబంధమ్ము విడిచి కుశలాశయమై" —పాండు. 3-29

"గోర్వెచ్చ చమురంటుకొనిరి మస్తకముల
జలకమాడిరి నిశామిళితవారిఁ
గట్టిరి విరుతచౌకముల క్రొంబుట్టముల్
కాటుక దీర్చిరి కన్నుగవల
దిద్దిరి సిందూరతిలకంబు బటువుగా
నిక్కుఁ గొప్పుల విరుల్ గ్రుక్కిరర్థి
నింబప్రవాళ మాల్యంబులు వైచిరి
చిట్టిబొట్టు ధరించి రిట్టునట్టు
తరుణధావన ధగధగ ద్దశనమణుల
హత్తుకొలిపిగి లేత వీడ్యముల డాల్లు
...." —పాండు. 3-74

"ఎడ్డెతనవుఁ గయిసేతల
రడ్డులు నడచిరి పురస్సరద్వార్యముగా
గుడ్డంబు చక్కఁ గట్టం
బడ్డ మహాశక్తి దివ్యభవనంబునకున్" —పాండు. 3-75

విలయహారిని వైకుంఠవాసులు సాకుట వర్ణించిన పద్యమందలి యతిశయోక్తి చాల యరుదైనది.

"జలధి వీచీవాత్యఁ జలిదాఁకెఁగా యని
యక్కున నందంద యలమి యలమి
ప్రామఱ్ఱి యాకొత్తిరాయిడి పొందెఁగా
యని సన్న పొత్తుల నునిచి యునిచి
వాహోయి వాహోయి వసివాడి యాఁకటఁ
బెగడెఁగా యని యుగ్గు వెట్టిపెట్టి
పెనుజీఁకటులు గ్రమ్మ పెనిబైట వసియించి
వెలవెఁగా యని పుల్ల విఱిచి విఱిచి
మంచిలక్షణముల పుట్టుమచ్చవాఁడు
నేత్రములు విప్పనట్టి యీ నెత్రుకందు
వరద నేతెంచె నెవ్వరివాఁడొ యనుచు
విలయహరిఁ దెచ్చి పెనుతు రవ్వీటి సతులు" —పాండు. 3-156

ఈ స్వభావోక్తి వలన నవ్వీటి సతులకు విష్ణుని లీల లెవ్వియు నాశ్చర్యమును గొలుప వనియు, నన్నియు నెఱిఁగినవే యనియు నంశము ప్రతీయమానమగును.

ఋతువర్ణనము మున్నగు ప్రకృతి వర్ణనములందలి స్వభావోక్తు లన్నియుఁ బ్రసాదగుణయుతములై చదువరుల కా వాతావరణమును గల్పించుటలో గాళిదాసుని మేఘసందేశమందలి వర్ణనములను దలపించుచున్నవి.

"ధళధళక్కున నింగిఁ దాటించెఁ బలుమాఱు
నీరాళ్లగొందిఁ గన్నియ మెఱుఁగు
పౌలస్త్యపవన సంపాతజాత ప్రీతి
నివిరిన మ్రాఁకుల కెలమివచ్చెఁ
బ్రథమోదబిందు సంచారంబు మందు నూ
ని యయ్యెఁ బగిలిన నేల మేని
కుఱుము మంతుర సానియును బోలెఁ గనుపించెఁ
దోరంపు మణుల విదూరభూమిఁ
గెరలి సకిలించె షణ్ముఖమఱువు పూవు
పరిమళము చూచెఁ గరి శుష్క పల్వలంబు
గడిమి బిగిరించె గ్రాఁజవంగడము ననిచె
నఖిల హితమైన మేఘోదయంబునందు" —పాండు. 4-21

ఇందు మూఁడు, నాలుగు పాదములలో రూపకము నుపమయు నున్నను దమ సహజత్వముచేత స్వభావోక్తులవలెనేఁ గనుపించును.

స్త్రీ వర్ణనమునందలి స్వభావోక్తులలో వలయునెడల నువమాదులు మిళితములై యప్రతిమానమైన రసస్ఫూర్తిని గలిగించుచుండును.

"కటిఁ జేలార్థము చుట్టి చిక్కనది వేగంజుట్టి పాలిండ్ల మీఁ
దట సంధించుచు నార్ద్ర దేహలత మాద్యద్వర్ష ధారా వల
త్తటిదాకారముఁ జూపఁ దోపికొనుచున్ ధమ్మిల్లబంధంబు ముం
గిటికిన్ సుస్తని వచ్చె గోస్తన హరత్క్కార గ్రహవ్యగ్రయై"
— పాండు. 4-234

ఇందలి లోకపరిశీలనలోని సూక్ష్మాంశములు రసోత్పాదకములు. శబ్దాలంకార యుతమైన స్వభావోక్తి వలన రూపకల్పనలోని చైతన్యము బాగుగా నెలకొనినది.

వర్ణాశ్రమోచితమైన వాతావరణమును గల్పింపవలసినప్పుడు సూక్ష్మాంశ పరిశీలనమంతయు స్వభావోక్తి మూలముననే నడచును. అందర్థసమతను స్థాపించునట్టి ప్రౌఢమైన ఈషచ్ఛబ్ద సమతతోఁ బాంచాలీరీతిలో రచన మనోహరమై యొప్పారును.

కపటికా, లాటాకుల కట్ట
"జీర్ణ కృత్తివేష్టిత శాస్త్ర శబళికా ?
సారపేటిక లొక్క వటువు పూనఁ
గంబళ కట బృసీకాషాయ కరకంబు
లొక్క యంతేవాసి యుద్వహింప
నాళికాఫలసార యవ సక్తుతండుల
నూపాదు లొక్క శిష్యుండు మోవ
సమిదాజ్య పూర్ణ కీచక స్రుక్స్రువ
చయ మొక్క ఛాత్రుండు సంగ్రహింపఁ
దలుగుచామెనఁ బెనఁచిన గళము తోడఁ
జంట వెన్నాడు క్రేపుతోఁ జాల నలసి
నడచు ధేనువు నాక చిన్న వడుగు రొప్ప
నయుతు నాశ్రమవాట మయ్యతిథి డాసి" — పాండు. 5-190

అయుతుఁడు కప్పయైనపుడు వాని దినచర్యను గూర్చి వర్ణించిన స్వభావోక్తి చాల గుణోత్తరమై చదువరులలోని సత్సంస్కారములను ప్రేరేపణ చేయఁగలిగి యున్నది.

"కమలాప్తుఁ డుదయింపకయమున్నె బుటుకున
మునుఁగు సంగమ తీర్థమునకు నేఁగి
విను సైకత నిషణ్ణముని వేదనినదంబు
తగుచోట నుండి రేఁబగటిదాఁక
మధ్యాహ్నవేళ సంప్రాశించు బలిపీఠ
గత పులాకంబులు మితముగాఁగ
సందె ప్రొద్దుననుండి సవరేయి గడనన
సమ్ముఖమ్మునఁ గొల్చి సంవసించు
శ్రీ నృసింహుఁడు పెనుఁబాప సెజ్జ మేను
చేర్పఁ దద్దివ్యచరణ రాజీవమూల
భూబిలంబున నధ్యాత్మ పూర్ణబుద్ధి
జాగరము సేయు శాలూర చక్రవర్తి" — పాండు. 5-286

కావ్యమందలి వ్యాఖ్యానాత్మక భాగములందు స్వభావోక్తుల ప్రభావమే హెచ్చుగా నున్నది. ఉక్తిచమత్కృతితోఁ గూడిన యీ స్వభావోక్తులు ప్రతిభా ప్రకటనము లైన రసానుగుణమైన వాతావరణమును బాఠకుల మనస్సునకుఁ గల్గించుటయం దత్యంతోపయుక్తము లగుచున్నవి.

ఉత్ప్రేక్ష :

పై యలంకారములకన్న నుత్ప్రేక్షల సంఖ్య తక్కువ. కాని వాఁడఁ బడినవి జాతిరత్నములై యొప్పారుచున్నవి. వీనియందుఁ గూడ నలంకార సామగ్రిని సాధించుటలోఁ గల యనన్యత యెల్లెడల స్పష్టపడుచుండును.

"... ... ...
.. ..నయ్యగస్త్యునిన్
బొడఁగని వింధ్యభూధరము పొంకము బింకము దక్కి నేలలో
నడఁగె బిలాంతరస్థలి భయాహతిఁ జొచ్చు కుశీరమో యనన్"
— పాండు. 2-122

పాండురంగని యుదరముమీఁది వళులను వర్ణించుట :

"ఇటనభ మిట భూవలయం
బిట బలిసద్మంబు నుండు నిరవులన యనన్
బటువులగు వళుల చెలువున
బలుపుటనై యున్న చిన్ని బొజ్జ గదలఁగన్" — పాండు. 2-35

అను పద్యమందలి యుత్ప్రేక్ష పెద్దన రచనలోని వైఖరినిఁ జూపుచున్నది. సారూప్యసాధనలో నొక కథయందలి పరిణామము గల కల్పనమును జూపి యల్లిన యుత్ప్రేక్షలు ప్రత్యేక స్థానమును వహించును.

"ఉమ పసుపాడి మోముతడి యొత్తిన హత్తిన తన్నిగాంత దృ
క్కమల దళాంజనాంక కులకంబుగ నిమ్మగు వేలఁగేళి వి
భ్రమగతిఁ గప్పినాఁ డనఁగఁ బచ్చని నల్లని చారలన్ మనో
రమమగు ద్వీపిరా డజిన రత్నము యత్నము మీఱఁ దాల్చుచున్"
—పాండు. 2 - 193

దుర్లభమైన సారూప్యమును నిరూపించి యచ్చెరువు గొలుపు నుత్ప్రేక్షలు చిన్న ఛందస్సులలో నెన్నియేని గూర్పఁబడినవి.

"వివిధ యువతికోటి వేమరు సృజియించి
యవ్వధూటిఁ జేయ నజుఁడు తలఁచి
కేలుదోయిఁ గడుగ వ్రేళుల తుదనంటు
జలకణంబు లేమొ సతి నఖాళి" —పాండు. ~~1~~ 3 - 180
"ముదిత కరమూలముల యొప్పు ముచ్చిలించి
యాక యుండిన నొక్క నాళీకభవుఁడు
ఫణి గణంబులఁ దద్భోగ పద్మరాగ
యోగమున తాలు మోపించుచున్నవాఁడు" —పాండు. 3 - 188
"పాంచజన్యంబు రాధికా చంచలాక్షి
కంధరకు నోడి యెచటనో క్రాఁగి పోవఁ
దద్గతధ్వని తద్భర్త దాయ యనియొ
చేరె వృషభంబు కంఠకుటీరవాటి" —పాండు. 4 - 40
"శిరసు వడంకఁగఁ దెల్లఁగ
నరసిన గృహమేధినియు నడచెఁ దదంగం
బిరవుకొని పట్టు చాలక
జర కొంత వినిర్గమించి చనుదెంచు క్రియన్" —పాండు. 5 - 197

ముసలితనమునకును నరసిన జుత్తునకును లోకమునఁ గల సహచరత్వము చదువరుల మనస్సులలో సంస్కారముగా నుండును. దాని నాధారముగాఁ గొని ముసలితనము తెల్లగా నుండునని కల్పించి, యది దేహమున నిండి తావులేక వినిర్గమించుచున్నట్లు నరసిన కేశపాశ మున్నదని యుత్ప్రేక్షించుట దుర్లభమైన యలంకార కల్పనము. కీర్తి తెల్లఁగా నుండునను కవిసమయము కన్నఁ గూడ జర నరసిన రంగున నుండునను కల్పన మెక్కువ యుచిత మని పించును.

అర్థాంతరన్యాసము :

ప్రయోగించిన యలంకారము లన్నిటిలో నిది యొక్కటియే పెక్కుతావుల యందుఁ బ్రత్యేకత లేక సర్వ సామాన్యముగా నున్నది.

ఉదా.

1. "......... ...... వింధ్యశిఖరి
విక్రమాటోప మడఁప సర్వీఁడు వెడలెఁ
బరవిపత్ప్రతికార తత్పరులు ఘనులు" —పాండు. 1 – 120

2. "పూర్వవాసన తలఁగుటెట్లు? —పాండు. 3 – 183

హాస్యగర్భితమైనప్పుడు మాత్ర మీ యలంకారము గూడ నాకర్షణీయముగ నున్నది.

ఉదా:

1. "ఉవిదలకు బుద్ధి పెడతలనుండు కాదె" —పాండు. 3 – 81

2. "గ్రైకొన మఱుఁగు సగము, మైలయు సగమే?"
—పాండు. 5 – 200

సమాసోక్తి మున్నగు ప్రత్యేకాలంకారములకుఁ బరిపోషకముగ వాడిన తావులందుఁ గూడ రమణీయముగ నున్నది.

"ఒకఁడు నిరూఢ కృష్ణరుచి, యొక్కఁడు నిర్మల మానస ప్రియుం
డొకఁడు ప్రయత్న యోగ్యఫలుఁ డొక్కఁ డనాదృత బంధకంపకుం
డొకఁడు రసానుకూల మతియుక్తుఁడునై విలసిల్లి రీతి పు
త్రకు లిలఁ నెట్టివారలకుఁ దక్కునె తొల్లిటి జన్మ వాసనల్"
—పాండు. 4 – 264

అర్థగాంభీర్యము గల యర్థాంతరన్యాసములు కతిపయములుగా నున్నవి.

"గాఢ విజ్ఞానమయ మనోరూఢమైన
నిర్మముని ధైర్య మతనుండు నేఁడు గొనఁ
దానధారా కరాళ కాంతారదంతి
కుంభముక్తాహరణ మొనఁగూడు టెట్లు" —పాండు. 5 – 221

"ఆసలన్నియు మొదలంటఁ గోసియున్న
గోఁచి కట్టున కటువంటి గొడవ గడవ
రాక మెడఁ జుట్టుకొనియె, నూరక యకార్య
కరణశీలుర కెప్పాటఁగలదె సుఖము? —పాండు. 5 – 238

ఇందు మొదటిది శ్రీనాథుని పద్ధతిలోను, రెండవది నాచనసోముని పద్ధతిలోను నడచినవి. ఎట్లైనను మిగిలిన యలంకారములను దీర్చి దిద్దుటలోఁ జూపిన శ్రద్ధ యీ యలంకారమునఁ గనుపింపదు.

పరికరము:

రామకృష్ణుని యలంకారములయం దెల్ల నిది గుణోత్తరమని చెప్పవచ్చును. దీని కొక కారణ మున్నది. రామకృష్ణుఁడు పదగుంఫనయందును, సార్థకపద

ప్రయోగము నందును ప్రత్యేకమైన కృషిసలిపినవాఁడు. అతని కావ్యమందలి యుత్కృష్టగుణములలో నిదియే మొదట గణింపఁదగినది. పరికరాలంకార మునకుఁ గావలసిన దీ గుణమే గనుక నది యతని కప్రయత్న సాధ్యమైనది.

హరిదాసికినిఁ జిలుకకు నెడలేని పొత్తు గలుగుట కుపపత్తి పరికరమున సాధింపఁబడినది.

"కలహంసోపమయానఁ జక్రకుచఁ బ్రేంఖత్ఖంజరీటాక్షిఁ గో
కిల సారస్వర బర్హిబర్హచికురం గీరప్రియాలాపఁ దొ
యలిఁ జాలంమరిగెన్ శుకంబది గరీయః ప్రేమ గావించుచున్
బలుగుం బొందున నంది పొందినగతిన్ బొల్తొత్తులన్ హత్తుచున్"

—పాండు, 4-229

హరిదాసి కుపమానములుగా నన్నియుఁ బక్షి శరీరాంగములే వర్ణింపఁబడుట సాభిప్రాయము. "శుకపదము వలనను ఇట్టి చక్కని యువతిని జూచిన, ఇంద్రియ నిగ్రహమున గొప్ప పేరువడసిన శుకుఁడు – మహర్షి – కూడ ఆమెను మోహింప వలసి యుండునని వ్యంగ్యము". అని బులుసువారు వ్యాఖ్యానించుట సంగత ముగా లేదు. పద్యమున "శుకంబది" యని ముగంతముగనే శుకశబ్దము వాడఁ బడినది. ప్రేమగావించుట యిందు వర్ణింపఁబడినది. శుకయోగిని సూచించుటకుఁ బద్యమున శబ్దమునఁగాని, యర్థమునఁగాని, ప్రకరణమునఁగాని వ్యంజన యెచ్చటను వర్తించుటలేదు. సాహచర్యమో యసాహచర్యమో ప్రత్యేకముగాఁ గల్పింపఁ బడని హరిశబ్ద ప్రయోగములోని శ్లేషవలెనే యిట శుకశబ్దశ్లేష గూడ వ్యంగ్యము నుత్పాదింపలేదు.

సుశీల వార్ధకమును జెప్పిన పరికర మెంతయో రమ్యము.

"అనుభూతాఖిల భోగఁ బోషిత సమస్తార్యం గృతానేక కాం
చన ముఖ్యోచితదాన దృష్టిగత యుష్మత్ క్షేమ జీవత్పతిన్
జనతామాన్య నశీతి వృద్ధనను నీ సంసార దుర్వార బం
ధర నిర్బంధమునందుఁ బాపుటకు యత్నంబింకఁ జేయందగున్"

—పాండు, 4-270

ఈ పద్యమును పోతన భాగవతములోని "పుట్టంధుండవు, పెద్దవాఁడవు, మహా భోగంబులా లేవు. నీ పట్టెల్లం జెడిపోయె" నను పద్యములోని రచనవంటి ప్రసాద గుణయుత రచనతో నింపినచో నిందలి పరికరాలంకారము రసోచితమై మఱియు నొప్పారి యుండెడిది. సమాస ఘటన యందలి యోజోగుణము స్ఫూర్తికిఁ గొంత బాధక మగుచున్నది.

వాధూలుఁడు నృసింహు నారాధింపుమని యయుతునితోఁ జెప్పిన పద్య మందలి పరికరము మనోహరముగ నున్నది.

" .. ..
వివిధ కథలవాని వివిధ రూపంబుల
వాని నిలిచి కొలుచువారి వాని
శ్రీ నృసింహదేవు సేవింపు ఖేకంబ
వై తదంఘ్రిమూల మధివసించి"

—పాండు. 5-263

లక్ష్మీవర్ణనమునందలి యలంకారము సముచితము, రసస్ఫోరకమునై యున్నది. ఇందలి విశేషములన్నియు సుధాంభోధి పుత్రీత్వమును సాధించుటలో మిక్కలి సాభిప్రాయములు.

"లలితకుంతల శైవలము ముఖేందవ బింబ
మధరాధర ప్రవాళాంకురంబు
చపల స్వభావలోచన మహామీనంబు
కమనీయ కంధరాకంబు కంబు
గర్వితస్తన కనత్పర్వతాభోగంబు
విశద త్రివళిభంగ విలసనంబు
మధ్యవృత్తావర్త మహితంబు కటితటీ
ద్వీపంబు పృథులోరు దివిజకరటి
కరము పదకూర్మ పృథుకంబు గ్రమనఖర
మణికలాపంబు నగుమనే మగువరూపు
భూరి సౌభాగ్యసంపదఁ బోలుఁ దంద్రి
నా సుధాంభోధి పుత్రి బాహాంతరమున" —పాండు, 5-271

ఇం దన్నియు రూపకాలంకారములేయైనను వానికి సుధాంభోధి పుత్రీత్వమునందు సార్థక్యము కల్పింపఁబడుటవలనఁ బ్రధానాలంకారము పరికరమేయైనది.

ఉదాత్తము :

సమర్థులగు మహాకవుల చేతిలో నీ యలంకార మొక ప్రత్యేకతను గడించు కొని కావ్యశోభకు మిక్కలిగా దోడ్పడును. రామకృష్ణుని యుదాత్తాలంకార మీ జాతిలోఁ జేరినది. ఎక్కువగా శబ్దాలంకారములతోఁ గూడియుండి వస్తుశిల్పనమునకు నితని యుదాత్తము లుదాత్తతను జేకూర్చును.

ఉదా :

1 "కఠిన కంఠీరవాక్షత నఖక్షత జరత్
కరిశిరశ్శుక్తి శార్కరిల తలము
లాపాంతజంతు కంఠాగ్రు గుగ్రవ్యాఘ్ర
ముఖ గుహాభాంకార ముఖరితంబు
లశ్వద్విపద్విషాణాగ్ర నిగ్రహ వహత్
ప్రస్తర ప్రసర సౌరభమయంబు
లజ్ఞాత రవికర వ్యాపార భూరుహ
చ్ఛాయానపా యాతి శైత్యఘనులు
గహన ఘంటా పథంబులు........…" —పాండు, 3-83

2. "ఉత్తాల ఫణిభుగ్గరుత్తాల వృంతాని
లాశాంత ఘర్మాంబు వయ్యె మేను
ప్రత్యగ్ర ముక్తాతపత్రీ భవచ్ఛేష
వారితాతప మయ్యెఁ జారుమౌళి
సూత్రవతీశ దోర్వేత్ర దత్తావకా
శామరంబయ్యెఁ గటాక్ష విహృతి
భృగు భరద్వాజ ప్రభృతి కృత స్వస్తివా
గ్భరముఖరములయ్యెఁ బార్శ్వతలము
లరుణ కిరణ సహస్రాభ మభ్రగంబు
నగు విమానంబు పైనెక్కి నిగమశర్మ
తిండ్రఁ బుండ్రేక్షు కోదండు తండ్రిఁ బోలి
పరమధామంబునకుఁ బోవు పథమునందు" —పాండు. 3 – 110

3. "అంతర్మగ్న దిగంతదంతి కట నిర్యద్దాన ధారాశరా
క్రాంతంబుల్ నిజవేగభగ్న వపురుగ్రగ్రాహముల్ మేఘఘో
షాంతేవాసి వికంకట ధ్వనులు నాగావాసగాహుల్ పయ
స్స్వంతానంబులు గ్రాలుఁ బాలకడలిన్ జాగత్ప్రవారంబులై"
—పాండు. 3 – 145

ఇందు మొదటిది నిగమశర్మ మార్గముయొక్క దుస్తరత్వంబును, కుటిలత్వ మును, రాబోవు కష్టఫలమును సూచించుటకును, రెండవది వాని సన్మార్గమం దలి యనుభావమును గోచరింపఁజేయుటకును, మూఁడవది శ్వేతద్వీపము క్షీరసాగరముల యప్రధృష్యత్వమును దెలియఁజేయుటకును శబ్దాలంకారయుక్త ముగఁ జెప్పఁబడినవి.

"శశిరేఖఁ గైకొన్న సౌవర్ణగిరివోలె" నను పద్యమున (5 – 174) ఉపమాలంకారము, నుపమతో నుదాత్తము కూడి యుండుటచే రెం డలంకార ములును బరస్పర పోషకములుగా నున్నవి. "అహంకారములు లేవె" యను పద్యమున (5 – 176) నుదాత్తాలంకారము రసభావములకు సహకారిగా నున్నది.

మఱికొన్ని యలంకారములు : ప్రసిద్ధములైనవానిచే గాక యితఁడు వివిధములైన యితర యలంకారములను బాండురంగ మాహాత్మ్యమున బహుళ ముగా వాడినాఁడు. వ్యతిరేకాలంకారము బాగుగా వాడఁబడినది.

"సారథి ఛాందసుండు బడిసోగదు చక్రయుగంబు పాత పం
చారవు గుజ్జుముల్ రథియు శౌర్యమునం దరమాని పాత్మ వి
స్తారము ఖండ ఖండములు తానట మా నరియంచుఁ దత్పురిన్
దేరులు నవ్వ శంకరుని తేరిని గేతన కింకిణీ ధ్వనిన్"
—పాండు. 1 – 115

వ్యతిరేకాలంకారము కల యీ దిగువ పద్య మీ కావ్యమందలి మచ్చు తునకలలో నొకటి :

"కానలఁ బుట్టిన తీఁగెపెనచేఁ జమరవాల
పరికరంబులఁ జుట్టుపట్టి తిగివి
కమ్మ సంపంగి మొగ్గల నిరుగడరాయు
జేగురుఁ దిరికలఁ జెంపఁబెట్టి
లేడిక నొడియు శిలీముఖ శ్రేణిచే
మేలి పూగుత్తుల రాల రువ్వి
కబళన త్వరమాణ కరటితుండములచేఁ
గదళికా తరువులఁ గాల్లఁ దాఁవి
నెఱికురులు జారునానలు నిబ్బరంపు
గుబ్బ చన్నులు దొడల పెక్కువయు గలుగు
మృగవధూ జీవి శుద్ధాంతమీననయన
లర్చనలు చేసి కొలిచి రయ్యాలు మగల" —పాండు. 1 – 126

ఇందలి క్రమాలంకారముతోఁ గూడిన వ్యతిరేకమునం దొక్కొక్క యుపమేయము నకు రెండేసి యుపమానములు దుర్లభమైన చమత్కార శోభతోఁ గూర్పఁబడినవి.

అర్థాపత్తి :

"చలన విహీన వృత్తి నడిసన్న పరాశరుఁ డాదియైన య
య్యల ఱాతివంటి హృదయమ్ములు నీరుగఁ జేయు బోయ పూ
విలుతునకు నెంత దొడ్డపని వెన్నెల బిల్లని కాచినంతలో
పలన కరంగి పొంగు పసిబాలుర చిత్తము మెత్త చేయఁగన్"
—పాండు. 5 – 212

ఇం దలంకార మున్నట్లే భాసింపదు. రచనలోని సహజత్వమువలనఁ నప్రయ త్న సిద్ధమైన దీ యలంకారము.

దృష్టాంతము :

"పుక్కిటి యోవరిం చదువు పుత్తడి హత్తిన పెద్దనైన మీ
రొక్కొకవేళ పాటవము నొందమిఁ జెందినఁ జక్కఁబెట్టువా
రక్కట యొక్కటింబెడఁకి యాడినఁ గీడన నెవ్వఁడోపుఁ బే
రుక్కన నేఱు నిక్కఁచన నొక్కఁడు వంకలు నొక్క శక్తుఁడే"
—పాండు. 5 – 218

అయుతుఁ డింద్రుని నమ్మించుట కీ యలంకారముచేత యత్నించినాఁడు. సంభా షణయందలి సహజత్వమే దీనికిఁ గూడ రమణీయత కూర్చినది.

వక్రోక్తి :

"దండమె దీని వాలధి సుధానిభవాః కరకంబె దీని యీ
కుండపొదుంగు దీని ముకు(గోరులు భూమిబిలాంతరంబులే
కండపటంబె దీని గళకంబళమంచు(దర్శించి రోసి య
క్కొండిక బ్రహ్మచారి మది(గూకలు వత్తులునై యసద్గతిన్"
—పాండు. 5 – 244

యను పద్యమున రామకృష్ణు(డయుతుని తపోభంగమువలన నైన పశ్చాత్తాపమును జిత్రించుటకు(గామధేనువు వాలాదులను యోగదండాదులతో(బోల్చి చెప్పుట నుపమానోపమేయ భావమును సాధించియు(గాదని చెప్పుటలో వక్రోక్తి సిద్ధించినది.

అపహ్నుతి, కావ్యలింగము సర్వసామాన్యముగా నున్నవి. లోకోక్తులు హెచ్చుగా నున్నవి. అరుదైన యలంకారములలో నతద్గుణ రమ్యముగా నున్నది. (5–180.) ఇది విరోధాభాసాలంకారముగా వ్యాఖ్యాతలచే(జెప్ప(బడినది. కాని యిందు విరోధముగాని యాభాసముగాని లేదు. కుటిలాలకాదులు చీ(కటి మున్నగు నజ్ఞాన లక్షణములు గలవియైనను వాని సాహచర్యముననే యున్న మోక్షోన్ముఖములైన చిత్తగతులు మున్నగు భవ్యలక్షణములు మారక వర్తించుచునే యున్నవని నిరూపించుటవలన నిది యతద్గుణాలంకారము.

ఉల్లేఖము గూడ(గడు రమ్యముగను భక్తిభావప్రేరకముగ నున్నది.
"కోపవికారమంచు నొక కొందఱు.........." — 5-279.

అక్షేపాలంకారము భక్తిభావపరిపోషకమైన దివ్య శృంగార స్ఫురణ(గల్గి యున్నది.

"మిమ్మటమై వా(డిపవిమిశ్రములై ..."— 5-278. సహోక్తి ప్రతిభావంతముగా వాడ(బడినది.

"క్లేశపాశంబుతో(గూడ(గేశపాశ
ముదల బఱ్ఱవతంసు(డు కరుణ నిచ్చు
నీవి యెఱు(గక యెక్కంత నీవిజాఱ..."—పాండు. 2–130.

"పెలుచ(గలుచొక్కు చెలువల తలకు నెక్క(
దోన దిక్కుల తల కెక్క(దొడ(గె(దమము
దేవిగుడిలోన(నొక్కొక్క దివియ దో(ప(
దోన నొక్కొక్క చుక్కయు(దోచెమింట" — 3-79

పూర్తిగ
రామకృష్ణుని మూ(డు ప్రబంధములలో నలంకార సౌందర్యము ననుభవించినది పాండురంగ మాహాత్మ్యమె. సర్వాలంకార ప్రయోగ విధాన సామర్థ్యమంతయు నిందే పొందుపరచి రామకృష్ణు(డు తన స్వతంత్ర కల్పనాధురీణతను నిరూపించుకొనినా(డు. ఇతని యలంకార సామగ్రి యెంతయు నుజ్జ్వలము.

ఉక్తిగతమైన ప్రత్యేకతను గల్గి యుండుటలో నాచనసోముని యలంకారములను బోలియుండును. "జడధి ఫల్లిన గందవాడి నేత్రములఁబడ్డ గతిఁ దామరల పరాగంబు గ్రమ్మ" — 2-134 "కనువిచ్చి చూచుటగాక దిగ్గున లేచె నమిత సమాధి స్థితముని కులము" — 4-292, "నిపువాలు గనుపూపు నిగిడినదో నెల్లబీతెండ రేయెండఁ బెండ్లియాడ"— 2-152 — మున్నగు పద్యములలోని యలంకారము లచ్చముగా నాచన యడుగుజాడలలోనివే. పర్యాయోక్తులు, ఉల్లేఖములు మున్నగు నలంకారముల ధారాళతలో శ్రీనాథుని ప్రయోగ వైఖరి కనుపించును. అందలి పద్యరచన గూడ శ్రీనాథుని ధార ననుసరించియే యుండును. ఒక యుదాహరణముగా నితఁడు చెప్పిన రూపకముల మాలికను బేర్కొనవచ్చును.

"రవిధామంబులు సిద్ధ మంత్రములు చంద్రజ్యోత్స్నికల్ సన్మణి
ప్రవరశ్రేణులు భవ్య భేరుణతతుల్ పాథోధరంబుల్ సుధీ
భవనిస్తారక సేమ మిచ్చి జగముస్ బాలించు మర్యాద నీ
యవతారంబుల శేష లోకహిత చర్యాధుర్య సంచారముల్" — 4-86

జుగుప్స మున్నగు భావములను వెలిబుచ్చు ఘట్టములను మార్చి విజాతీయమైన భావముగా జిత్రించుట కొక యలంకారము నుపయోగించుకొనుటలో నితఁడు కాళిదాసుని యడుగు జాడలలో నడచును.

ఉదా :

"మాతృకతోరకంఠ బిలమార్గగళ ద్రుధిరారుణాననం
బైతగుకొత్తు దోఃపరశు హంసిక మేఁత యొసంగవే రిపు
క్ష్మాతలనాథ మేచకకచాకుచ హారమ్మృణాళనాళ సం
ఘాతము నూతనైణమద కర్దమవర్ధన సంప్రభూతమున్" — 2-61

పాండురంగ మాహాత్మ్యమందలి ప్రథమ ద్వితీయాశ్వాసములలోని యలంకార ప్రయోగవైఖరి చమత్కారప్రధానముగను, చతుర్థ పంచమాశ్వాసముల యందలి వైఖరి రసప్రధానముగను బొడకట్టును. రచనలోఁ గూడ యుజ్జ్వలత్వము, దీప్తియుఁ బూర్వార్థమునను, గాంభీర్యము మాధుర్యము నుత్తరార్థమునను నెలకొనినవి. ఇది రచనలోని పరిణామమువలన గాని, యుపాఖ్యానముల తత్వములోని భేదమువలనఁ గాని కావచ్చును. గ్రంథమందలి యలంకారము లన్నియు నౌచితీసిద్ధములేయైనను సుశీలోపాఖ్యానారంభమునుండి గల యలంకారములు లోకోత్తరాహ్లాద జనకములు. ఇతని యలంకారములలో నొక యాథాత్మ్యము, పవిత్రత, ధర్మోన్ముఖమైన సంస్కారము నైరంతర్యము వహించును. సహృదయు లెల్లరు నితని యలంకారప్రయోగవైఖరిలోని ప్రతిభాన్వితమైన చమత్కృతిని హెచ్చుగా గౌరవించుచున్నారు.

శబ్దాలంకారములు

ఈ కవి యర్థాలంకారములు వాడినంత తఱచుగా శబ్దాలంకారము లుపయోగింపఁడు. పెద్దకవు లెల్లరు నీ మార్గమునే యవలంబించిరి. ఉపయోగించిన తావులందు సందర్భోచితముగను రసానుగుణముగను జేసెను. ఘటికాచల మాహాత్మ్య మందుఁ గతిపయ స్థానములందు ఛందోలంకారము లనఁదగు శబ్దాలంకారము లున్నవి అనఁగా ఛందస్సునందలి ప్రాస, వృత్త పాదముల నడకలు మున్నగు సంగములపై నాధారపడిన యంత్యాను ప్రాసములు, త్ర్యక్షరప్రాసము లున్నవి.

ఉదా :

1. "నారద . హృదయాంతర లీ
నారద ! మోక్షా ... . విద్దీ
నారద ! రుచిజిత శారద
నారద ! హరిచయణభక్త నారదయాఢ్యా ! --1--18

2. "కీరమొకాక చిల్కతురికీ దొరరాణి ధరించు ముక్త కా
హారమొ పాకజిజ్జయ విహారమొ పార్వికచంద్రచంద్రికా
సారమొ చంచలారుచుల సారమొ యౌర యటంచు చూపరుల్
సారె నుతింప ... ." — 2-77

3. "ఈ పురము ధారుణీ మణి
నూపురము సమస్త జన మనోరథ సిద్ధి
శ్రీపురము గోపురస్థిత
గోపురము వినీల కుటిల కుంతల కంటే" — 2-163

ఇందలి యలంకారములు ప్రయత్న సిద్ధములు, నపరిణతములుగా నున్నవి.

ఉద్భట చరిత్రమున శబ్దాలంకారములు సుంకులు తేలి, యర్థ గాంభీర్యమునకుఁ దోడ్పడుచున్నవి.

"అదిమళిల్లు మంచుమల యల్లుఁ బయోరుహనాభభల్లుఁ గా
కోదరరాజకుండలు సముజ్జ్వలగల్లు భజించి మించునా..." — 2-113

పాండురంగ మాహాత్మ్యమున మిగిలిన కావ్యాంగములకువలెనే శబ్దాలంకారము కూడఁ బూర్ణమైన సౌందర్యముతో నొక ప్రత్యేకత నాపాదించుకొనినది.

"ఉరుమతి రంగమంత్రి తనయుల్ విలసిల్లిరి ఫుల్లమల్లికా
హరదరహాస హీరహిమహార పటీర యశోధురంధరుల్
వర దయ గల్గువారు గుణవంతులు శాంతులు కాంతిచంద్రముల్
వరదయమంత్రి పుంగవుఁడు వాసవతుల్యుఁడు రాఘవయ్యయున్"
—పాండు. 1-50

అను పద్యమునఁ బూర్వార్థమునందున్న యనుప్రాసాలంకారము మనోహరమే యైనను నన్నయ మొదలుకొని కవులందఱి రచనలో నిది సామాన్యమే. ఉత్తరార్థ మందున్న వరదయ శబ్దప్రయోగములోని యమక మనితరసాధ్యము. పురుష సంజ్ఞలగు నామములతో యమకము వాడఁబడుటవలన మఱియుఁ జమత్కారము భాసించును.

"లలితన జవామకరతల
కలితకనత్కంబు కాంతి కలకలనవ్వన్
గలువల చెలి గిలిగింతల
నలువగు బాలన్ బిసాళి నలువగు బాలన్" —పాండు. 2-38

అను పద్యమందలి నాలుఁగవ పాదమున యమకము రమణీయము. వివరి రెండుపాదము లందును రెండవ, మూఁడవ యక్షరములతో ద్వ్యక్షరప్రాసము రమణీయము. ఇవి నాచనసోమన, శ్రీనాధుల యడుగుజాడలు. ఈ దిగువ పద్యమందలి యమకము తోడి యనుప్రాసము చాల రమణీయము.

"తటపుట బిల్వ భూరుహ వితానలతా నవ పుష్ప నిష్పత
జ్జటిలమధూళి ధూళియు తన సౌరభ మౌర భ్రమింపఁజొచ్చెని
చ్చట . .. ." —పాండు. 1-173

అంత్యానుప్రాసము నీ కవి యరుదుగా, నరుదైన సొగసుతో నుపయోగించును.

"వనితా! చూచితె మాల్యవంతము ప్రభావంతంబు నానామణీ
జనకోదంచిత సానుకాంతము మరుత్సంపూర్ణ చంద్రాననా
జనకేళీపద చంద్రకాంతము నభస్సంబాధకృత్కూటవ
ర్ధనదుర్దాంతము సర్వపర్వత కథా ప్రాగ్వర్తితోదంతమున్"
—పాండు. 1-130

"నీలమో కాలాభ్రజాలమో బాలశై
వాలమో యీ సిద్ధ వరునికాంతి
...." పాండు. 4-287

"నీలంబు భక్తానుకూలంబు హరిదంత
చేలంబు నవనీత లోల
.... పాండు. 4-187

రామకృష్ణుని రచనలోఁ గంద పద్యమునకును శబ్దాలంకారమునకును దగ్గఱ సంబంధమున్నది.

ఉదా :

1. "కాయంబునఁ బెడపెదపలు
గాయంబులు సేసెఁగాని కడువాడిమిమై
నాయమ్ము లమ్మహీసురు
నాయమ్ములు దాఁకవయ్యె నాయుర్మహిమన్" —పాండు. 3-53

2. "కలదా శుభ్రదవసతి శశి
కల దానసఁ జాలు నొక వికారవుఁ గోడల్
చలదాలోల కటాక్షం
చల దామ నిబద్ధ తరుణ జనఖంజనయై" —పాండు. 3-60

3. "మిను మినుకు మినుకు మనియెన్
బెనుమినుకుల బరణి ధరణి బిట్టాటాడెన్
వననిధులు విరిసెఁ గురిసెన్
గనగనగన మనుచు నిప్పుకలు గుప్పలుగన్" —పాండు. 5-88

పాండురంగ మాహాత్మ్యమునందలి శబ్దాలంకారములలోఁ గేవల శబ్దసౌందర్యము కాక మఱియొక శిల్ప లక్ష్య ముండును. అనఁగా రసమో, సంభాషణలోని యౌచితియో, సంభాషించుచున్న పాత్రస్వభావమును నిరూపించుటయో యందు ఉద్దిష్టమై యుండును.

"ఈ నా శిష్యులలోన వీ రిరువురున్ హృద్యానవద్యోదయ
జ్ఞానానూన విచార వాగ్విభవ తేజఃక్షాంతి శాంతిప్రథా
సానాథ్యంబునఁ గానిపించెదరు ...." —పాండు. 5-170

ఈ పద్యమందలి 'హృద్య – అనవద్య, జ్ఞాన – అనూన, క్షాంతి – శాంతి, సానాథ్య – కానిపించెదరు' అను నను ప్రాసము దీర్ఘ సమాసమున ఘటింపఁబడుట వలన నయుతనియుతుల కీర్తనీయగుణముల నైరంతర్యము భాసించును.

"తెలచిన మొలచిన కృపకుం
గలఁచిన మది తోడ .." —పాండు. 5-175

ఇందలి త్ర్యక్షరానుప్రాసమువలనఁ గృపతో బ్రహ్మసమాధి స్థితి సడలుట సూచింపఁబడినది. ఇట్లే యీ కావ్యమందలి శబ్దాలంకారముల కేదే నొక సార్థక్యము కవిచే నుద్దేశింపఁబడినది.

అలంకారములలో వివాదగ్రస్తములైన తావులు

పాండురంగ మాహాత్మ్యమునఁ గల యలంకారములలోఁ గొన్నిటిని గూర్చి బులుసు వారిచ్చిన నిర్ణయమును, వైఖరులను ఖండించుచు శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రి యొక వ్యాసమును బ్రకటించినారు.[1] "కొన్ని పద్యముల యర్థములు, వాటినిబట్టి అలంకారములు తారుమారై యున్నవి – అర్థాలంకారములు సరిగా గుర్తింపబడని పట్టులును గలవు" అని యారంభించి వారు కొన్ని యలంకారములను బ్రత్యేకముగా వివరించినారు.

1. 1. ఆశ్వా. పద్య. 15. ఈ పద్యమున దోషాత్ములు, కవిరాజు నను శబ్దములలోని శ్లేషను బులుసువారు గుర్తింపలేదు. "దుష్కవులయందు రాత్రిత్వమును, కవిరాజు యనుటలో రాజు శబ్దముచేత, కవియందు చంద్రత్వమును శ్లేషచేత సూచితములైనవి. అందువలననే 'బహుళపక్షము, చీకటి' చెప్పబడినవి యని వివరించినారు.

2. 1 – 40. వాహిని యనఁగా సేన, వాగ్ధాటి యని బులుసువారు వివరించినారు. దీపాలవారిట్లు చెప్పుచున్నారు: "రెండవ వాహిని వాగ్ధాటి కాదు. వాగ్ధాటి సముద్రములను దాటినట్లు చెప్పుటలో ఔచిత్యము లేదు. కనుక ఆ యర్థము తప్పు – కీర్తి యని సరియైన యర్థము. కీర్తిని వాహిని యనుట వ్యవహారమున నున్నది. కాఁబట్టి వాహిని = కీర్తి అని చెప్పుట యుచితము." ఈ శ్లేషయు సమంజసముగా లేదు. రెండు తావులందును వాహిని = సేన, ప్రవాహము అనియే చెప్పుట యుత్తము, శ్రీరాముని సేన యను ప్రవాహ మొక సముద్రమును దాటినది. ఈ రామరాజు సేన యను ప్రవాహ మేడు సముద్రములను దాటి వర్తిల్లును అనియే తాత్పర్యార్థము. అతిశయోక్తి వ్యతిరేకాలంకారము చెప్పవలెను. వాహినీశబ్దములోని శ్లేషవలనఁ బరిణామాలంకారము కూడ సిద్ధించును.

3. 1 – 46. రాధావిభుఁడు = విష్ణువు అన్నారే రాధావిభుఁడు కృష్ణుఁడుగాని విష్ణువెట్లగును? ..... రాధావిభు దేవేరి యనగా రుక్మిణి. ఓబశమ్మ రుక్మిణితో సమానురా లనియే అతని రచన కర్థము దేవేరితో పాటు కావేరి యొకటి యున్నది. ఆ కావేరి యెవ్వరో పద్యములో దానికి గల స్థానమెట్టిదో నాకు బోధపడలేదు." దీపాల.

ఇచ్చట కావేరి సుప్రసిద్ధమైన నదియే. శ్రీరంగనాథుని సాన్నిధ్యమువలనఁ బుణ్యతీర్థమై పతివ్రతల కుపమాన మగుటలో బోధపడనిదేమున్నది ?

4. 1 – 135. "ఈ వ్యాఖ్యానము – బులుసు వారి వ్యాఖ్య – అవిచారిత రమణీయము. అనుచితార్థభూయిష్ఠము.... సానువన సంచార మొనర్చిన వాఁడు రాముఁడు. అతఁడే కుంజరభర్తగా చెప్పబడినాడు. రఘుకుంజర

[1] "పాండురంగ మాహాత్మ్యము – అలంకారములు" – సాహితి, ఫిబ్రవరి, 1962.

భర్త – రూపక సమాసము. రాము డను గజరాజు అని యర్థము, 'వాలిసాల' శబ్దము కూడ రూపక సమాసమే. వాలి యను సాలము అని యర్థము... వాలి యను సాలమును ద్రుంచిన శ్రీరాముడను గజరాజు ఈ సానుతలంబున సంచార మొనర్చెను ... . సానుసంచారము, సాలభంజనము గజములకు స్వాభావికములు. సానుసంచారమునుబట్టి రామునియందు గజత్వము చెప్ప బడినది. .. ...ఇది రూపకాలంకారము, టీకాకారు లీ రూపకమును గుర్తింపక వికృతార్థములు చెప్పినారు" – దీపాల.

బులుసువారు శ్లేష, యుదాత్తము చెప్పినారు అది సరికాదు. దీపాల వారి నిర్ణయమే సరి.

5. 1 - 168. దైవపథ వారినిధి సలిలావిష్కృత విషమషీమహార్చుల పోలెన్ = ఆకాశమను సముద్రపు నీటినుండి వెడలిన కాలకూట విషము యొక్క నల్లని మంటలవలె" – బులుసు.

"ఆకాశము సముద్రమైనట్లును, దానినుండి విషమహార్చులు వెడలి నట్లును సంభావన. కత్తులు విషమార్చులో యన్నట్లు ప్రకాశించెనని యర్థము. కాఁబట్టి అలంకారము ఉత్ప్రేక్షకాని ఉపమ కాదు. పోలెన్ – ఉత్ప్రేక్షా వాచకము" –దీపాల.

ఇచ్చట 'మషీమహార్చులు' అనగా మషిసహిత మహార్చులు అని యన్వ యింపవలెను. కదలుచున్న నల్లని కత్తులు పొఁగవలెను, ఆ కత్తుల తళతళలు మంటలవలె నున్నవి. అలంకార ముత్ప్రేక్షయే.

6. 2 – 45. "అలం, రూపకము, ఉపమ" –బులుసు.

అలం, ఉత్ప్రేక్షకాని ఉపమకాదు" –దీపాల.

ముంగురు లనెడి చీఁకటి తన్ను గప్పునను భయమున ముఖమను చంద్రుఁడు తన కిరణమను బాణమును సంధించి లాగి పట్టిన వింటి చివళ్లవలె నోరమాపున నల్లనై వంకరగ నున్న కనుబొమ్మలు ప్రకాశించె ననుటవలన నుత్ప్రేక్షయే యిందలి యలంకారము. ఇది రూపకాను ప్రాణితము.

7. 2 – 124. "కుంజరాశనతఁదాల్చుట = ఏనుగునకు ఆహారముగా నగుట ... . రావిచెట్టు రూపుదాల్చుట . .. .. ఏనుఁగును భక్షించు సింహ మా యేనుఁగున కాహారమగుట వింత. ఇట్లగుఁ విరోధము .... రావిచెట్టురూపుదాల్చుట అను నర్థాంతరమున నీ విరోధము పరిహృతమగును. .... అలం. విరోధాభాసము" –బులుసు.

"కుంజరాశనము – అంటే ఏనుగుల తిండి అని అవయవార్థము. రావి చెట్టు యని రూఢ్యర్థము....... ....నరసింహుఁడు ఏనుగులకు తిండియై నాడనియు, రావిచెట్టు అయినా డనియు శ్లేషచేత రెండర్థములు. మొదటి యర్థమున – ఏనుగులను తినవలసిన సింహము, ఏనుగులకు తిండియగుట

ప్రకృతి విరుద్ధము గావున విరోధము కనపడినది. రావిచెట్టన్నాడన్న రెండవ యర్థముచేత ఆ విరోధము తొలగిపోయినది" అని బులుసువా రిచ్చిన మార్గముననే మఱి కొంత స్పష్టముగా వివరించి, బులుసువారి వివరణను "పరస్పర విరుద్ధములును, అర్థశూన్యములునునైన యీ వ్రాతలు" అని దీపాల వారు కోపించుట వింత.

8. 2-134. "అలం. ఉపమ" – బులుసు

"....పద్యమున కనబడుచున్న అర్థమును బట్టి ఉత్ప్రేక్ష యగుచున్నది. తామరల పరాగంబు పాఠమే తప్పు. తామరలఁ బరాగంబు అని యున్న గాని అర్థ మేర్పడదు." – దీపాల. అలంకారముత్ప్రేక్షయే గాని తామరల పరాగంబు పాఠమే యొప్పు. దీపాలవారు సవరించిన పాఠము ప్రతులలో నలభ్యము. ఉన్న పాఠమున కర్థము సరిపడుచున్నది.

జడధి = సముద్రుఁడు, చల్లిన – గందవొడి, నేత్రములన్ = కన్నుల యందు, పడ్డగతిన్ = పడినదో యన్నట్లుగా, తామరల పరాగంబు = తామరల యొక్క పుప్పొడి, క్రమ్మన్ = వ్యాపింపఁగా – అని చెప్పవలెను.

9 3-202. "వేణి రాధజొట్టు", .. అలం. ఉపమ. బులుసు.

"వేణి యనఁగా జడగాని జొట్టు కాదు .. జడ పొడుగుగాను, నల్లగాను ఉండును గనుక కత్తితో పోలిక. సిగకు అట్టి పోలిక చెల్లదు. పాణింధ మమై = నలుపై – నల్లగా, వలరాజు కేలివాలు వలెను – డాలు వలెను ఒప్పుచున్నవి వేణి కత్తిగను, వేణీ మూలము – శిరోభాగము – డాలుగను భావన. వెన్ను పట్టె బంగారు రేకును తిరస్కరించు చున్నది. వెన్నుపట్టె కుందనపు తెగడును అనుట ఉపమయే కాని, వేణి వలరాజు కేలి వాలుం బలుక యుఁబలె నలరు ననుట ఉపమకాదు. ఉత్ప్రేక్ష" – దీపాల.

దీపాలవారు చెప్పిన పాణింధమమై = నలుపై యన్నది సరికాదు. లక్షణార్థమున నధికముగాఁ బెరిగినది, చిక్కనిజడ, పట్టెడు చేతి కిముడు లావైన జడ యని భావింపవచ్చును. పద్యమందలి పూర్వార్థమునకు నుత్తరార్థముతోఁ గార్యకారణభావము సిద్ధించును. లతాంగి వెన్ను పట్టియ తళతళమను కుందనంపుఁ గాంతినిఁ దెగడును గనుక దానితోడి జడ పలకతోడి వాలువలె నున్నది యని చెప్ప వలెను. ఇందు వాలునకు జడయుఁ బలకకు వెన్ను పట్టియయు నుపమేయములు.

ఛందో వ్యాకరణ విశేషములు

స్వభావముచేత రామకృష్ణకవి సంప్రదాయమును గౌరవించు మనోధర్మము గలవాఁడు. ఛందస్సునందును వ్యాకరణమునందును అలంకారాదులయందును శాస్త్ర మర్యాదను జక్కఁగా గౌరవముతోఁ బాటించిన విఖ్యాపరుఁడు, శ్రద్ధాళువునగు

సరసకవివతంసుఁడు. ఛందోనియమములయం దెచటను స్వాతంత్ర్యము వహింప లేదనియే చెప్పవలెను. పాండురంగ మాహాత్మ్యము కథాప్రారంభమున ఋత్వరేఫ ప్రాసమును బ్రయోగించెను.

"ఆ ఋషుల ప్రశ్నమంగీ
కారం బొనరించి...... " — 1-97 -.

ఇది నన్నయభట్టు ననుసరించిన ప్రయోగమే

"ఆ ఋషికుమారుఁ గట్టిన
చీరలు మృదులములు ." – భార. అరణ్య. పద్య. 3-104

రామకృష్ణుఁడు సాధురేఫ శకట రేఫములకుఁ బ్రాసమును గూర్చిన పద్యమున్నది.

"నిరనిల సంచారస్థల
మరయిక సుస్నేహపూర మాయుఃస్థితి యా
యిఱుదెఱఁగు బలిమి దుర్దశఁ
బొరయిక దీపమ్ము పగిది భూసురుఁ డెసఁగెన్" —3-57

ఇది శాస్త్ర సమ్మతము కాదు. కవిత్రయమునం దిట్టి ప్రయోగములు లేవు. ఉన్నవని కొందఱు పండితు లభిప్రాయపడుచున్నారు.

వ్యాకరణ విశేషములు :

కవిత్రయము శ్రీనాథుఁడు చేసిన విధములైన మిశ్రసమాసములను గొన్నిటి నీతఁడు ప్రయోగించినాఁడు. అందు శ్రీనాథుఁడు చాటువునఁ బ్రయోగించిన దినవెచ్చ మొకటి.

"దినవెచ్చమునకునై తనమేనఁ గల సొమ్ము
కొదుకక బచ్చింటఁగుదువవైచు" — 3-16

వ్రాయసప్రవృత్తి — 1-20. ఇది 'రాయసప్రవృత్తి' యనియే పెక్కు ప్రతుల పాఠము. అయినను మిశ్రసమాసమే. "కనకక్రోవి" — 4-7.

కొన్ని సంధులు వ్యాకరణ సమ్మతములు గానివి యున్నవి.

1. చెంగావి వలువందు – వలువ + అందు. 1-131.
2. చెలులిండ్లయందు – చెలుల + ఇండ్లయందు, 3-19.
3. గురువు లిండ్ల – గురువుల + ఇండ్ల, 4-44.
4. బచ్చింట – బచ్చు + ఇంట, 3-16.
5. అనమానిసాత్మ విస్తారము – అనమానిసి + ఆత్మ, 1-115.
6. కూడాడుఁజుమీ కూడి + ఆడు.
7. ప్రోదిడు – ప్రోది + ఇడు, 2-198.
8. కంచంత – కంచె + అంత, 3-81.
9. కోమటిండ్ల – కోమటి + ఇండ్ల, 4-149.

మొదలగునవి. వీనిలో "వెలులిండ్లయందు, గురువులిండ్ల" యను ప్రయోగముల కాంధ్ర కవితాపితామహులే తొలుత "తామరసనేత్రలిండ్ల" యని ప్రయోగించి దారి చూపినారు. "వలువందు" మున్నగు ప్రయోగములందుఁ దొలుత సాహితీసమరాంగణ సార్వభౌములు "గంగను కాసె", "నింగిటు" అను ప్రయోగములు చేసి దారి చూపినారు. కొందఱు చూపిన కందాళప్పగారు, కందాళయప్పగారు, అమ్మాజమ్మ, అమ్మాజియమ్మ యను ప్రయోగములు సంజ్ఞావాచకము లగుటచే సంస్కృత వ్యాకరణ సంప్రదాయము ననుసరించి సాధువులే యగుచున్నవి.

మధ్యమ పురుష మువర్ణమున కచ్చు పరమైనపుడు గూడ ముక్ లోపము చేసి 'కావుకావనుట' -1-145 యని ప్రయోగింపఁబడినది. ఇచట బాలుని రోదన శబ్దము ననుకరించుచు శ్లేష సాధించుటచే వ్యాకరణము నుల్లంఘించి యుండవచ్చును. కొందఱు 'వెండిన్' 3-198 అను తావున వెండియున్ అని యుండవలెనని చూపినారు. కాని 'ఎమియున్' అనుటకు 'ఎమిని' అని తిక్కన ప్రయోగమున్నది.

'అనుజులకు నడ్డపడియే
మినిజేయఁగ నిక.. ..." —భార. ఉద్యో. 2-13

ఫలార్థమునఁ బండు శబ్ద మౌప విభక్తికముగా వాడఁబడినది.

'అసాసలనట్లు బాచెదదె యందని పంటి' -5-230

షష్ఠీసమాసముగా 'బచ్చింట' యను ప్రయోగము నుగాగమ రహితముగాఁ బ్రయోగింపఁబడినది.

'కొదుక క బచ్చింటఁగుదువవైచు' —3-16

వీని ననింద్య గ్రామ్యములుగా గైకొనుటయో మానుటయో లాక్షణికులు నిర్ణయింప వలెనను. ప్రౌఢకవులందఱు నిట్టి విలక్షణ ప్రయోగములను జేసినవారే.

ఛందోవైవిధ్యములు :

తెనుఁగు కవులు సాధించిన రచనా వైవిధ్యములలో ఛందస్సొకటి. ప్రబంధ కవులు దీనివలనఁ బ్రత్యేకాకర్షణము సాధించినారు. రామకృష్ణకవి యీ దిగువ వృత్త విశేషముల నాయాస్థానములలో నౌచిత్య విశేషము ననుసరించి యుప యోగించెను.

అ. ఘటికాచల మాహాత్మ్యమునందు :

1. రగడ 1-111.
2. లయగ్రాహి 2-185.
3. మహాస్రగ్ధర 2-196.
4. దండకము 2-217.

ఆ. ఉద్భటారాధ్య చరిత్రమునందు :

1. స్రగ్ధర 2-96.
2. పృథ్వి 2-150.
3. దండకము 3-28.
4. రగడ 3-287.

పాండురంగమాహాత్మ్యమునందు ;

1. స్రగ్ధర 2-159, 175, 4-302.
2. మహాస్రగ్ధర 3-128, 4-178.
3. పృథ్వి 2-160, 4-89.
4. మాలిని 3-90, 4-81.
5. దండకము 4-76.
6. తరల 4-82.
7. భుజంగప్రయాతము 4-83.
8. స్రగ్విణి 4-84.
9. లయగ్రాహి 4-85, 5-26.
10. అనుష్టుప్ 5-115

సంస్కృతశ్లోకము

పాండురంగ మాహాత్మ్యమందలి ఛందోవిశేషవినియోగమునందు వివిధ శిల్ప ప్రయోజనము లుద్దేశింపఁబడినవి. మిగిలిన రెండు కావ్యములలోఁ గేవలము రచనాసౌందర్యమే తప్ప యితర మేమియుఁ గానిపింపవు.

దండకముల రచన :

రామకృష్ణకవి ప్రబంధములు మూఁడింటిలో మూఁడు స్తుతి రూపములైన దండకము లున్నవి.

1. ఘటికాచల మాహాత్మ్యమున —నృసింహదండకము. 1-217
2. ఉద్భట చరిత్రమున —శివదండకము, 3-28
3. పాండురంగ మాహాత్మ్యమున పాండురంగదండకము 4-77

ఈ మూఁడును భక్తిప్రధానములై యున్నవి. అందు మొదటిది ఘటికా చలమునఁ దపస్సుచేసిన ఋషులకు నృసింహుఁడు ప్రత్యక్షమైనప్పుడు వారు చేసిన స్తోత్రము. ఇందు దశావతార ప్రశంసనము ప్రధానాంశము. రెండవది యుద్భటారాధ్య చరిత్రమునఁ బ్రమథాధిపతికిఁ బరమేశ్వరుఁడు ప్రత్యక్షమైనప్పు డతఁడు చేసిన స్తుతి. అందు శివుని హాలాహల భక్షణము, దక్షాధ్వర ధ్వంసము, బ్రహ్మకపాల ధారణము కీర్తింపఁబడినవి. శివుని కేశాది పాదాంత వర్ణనము చేయఁబడినది. మూఁడవది పాండురంగ మాహాత్మ్యమునఁ బుండరీకుఁడు పాండు రంగని జేసిన స్తుతికి ముందున్నది. అందు ధేనుకవధ, గోవర్ధనోద్ధరణము, శ్రీకృష్ణమూర్తి పాండురంగరూప ప్రభావ వర్ణనము కలవు. మొదటి రెండు దండకములును స్తుతిరూపమున నున్నవి, మూఁడవది కవి చేసిన వర్ణన రూప మున నున్నది.

దండకముల సంప్రదాయము: ఆదికవి నన్నయనాటినుండియు నాంధ్ర వాఙ్మయమున దండకములు కావ్యాంతర్గతములుగా స్థానము గొనుట యున్నది. నన్నయభారతమునఁ బాశుపతాస్త్రము నర్జునుఁడు స్వీకరించిన సందర్భమున నొక చిన్న శివదండక మున్నది. పోతన భాగవతమం దక్రూరుఁడు శ్రీకృష్ణుని దండక మున నుతించినాఁడు, శ్రీనాథుఁడు కాశీఖండమున నొక శివదండకము, శృంగార నైషధము నొక సరస్వతీ దండకము రచించినాఁడు. ప్రబంధ కవులలో ముక్కు తిమ్మన పారిజాతాపహరణమున రచించిన శ్రీకృష్ణదండకము, కళాపూర్ణోదయ మునఁ బింగళి సూరన్న రచించిన కృష్ణదండకము ముఖ్యములు. ఘటికాచల మాహాత్మ్యమందలి నృసింహదండకము సంస్కృతాంధ్రపద గుంఫనల చక్కని సమ్మేళనమై యున్నది. ఇందలి నడక యెక్కువభాగము పారిజాతాపహరణ మందలి దండకమును బోలి యాఖ్యానాత్మక రచనతోఁ గూడినయున్నది, ఉద్భట చరిత్రములోని శివదండకము సంస్కృతపద బహుళమై గాఢపదబంధము గల దియై యెక్కువభాగము వర్ణనాత్మకమై శ్రీనాథుని దండకముల దారిని నడచినది. ఈ రెండు దండకములు దైవముల నుత్తమ పురుషలో సంబోధించి కథలోని పాత్రలు చేసిన స్తుతులు. పాండురంగ మాహాత్మ్యమునఁ గథకుఁడు-శివుఁడు-శ్రోతకు-నారదునకుఁ- బ్రథమ పురుషలోఁ జెప్పుచుఁ జేసిన దైవప్రశస్తి. ఇది కొంతవఱకుఁ గ్రొత్తపద్ధతిలోని దండక రచన,

సామాన్యముగా దండకము లన్నియు శబ్ద ప్రధాన రచనలై ప్రశస్తి రూప మున నుండును. అలంకారములలోఁ గూడ శబ్దాలంకారములైన యనుప్రాసము, యమకము మున్నగునవి ప్రాధాన్యము వహించును. రామకృష్ణకవి మూఁడు దండకములును గూడ నదియే మార్గమున నడచినవి. దీనిలోఁ బాండురంగ

మాహాత్మ్యములోని దండకము పాద విభజన గల తరగతిలోనిది. అందుఁ బ్రతిపాదమందును రెండు సగణములును మిగిలినవి రగణములును జివర గురువును గలిగియున్నది. ఈ మూఁడు దండకములందలి రచనయు మధురమై భక్తిప్రధానమై శబ్దార్థాలంకారభూయిష్ఠమై సహృదయులు కంఠస్థము చేయఁ దగిన స్థాయిలో నున్నది. కాని ప్రౌఢియుఁ బదబంధగాఢతయు వీని లోకవ్యాప్తికిఁ గొంత ప్రతిబంధకములనవలెను. ఈ మూఁడు దండకములను బరిశీలించినచో రామకృష్ణుని శైవ వైష్ణవ సంప్రదాయ పరిశుద్ధియు, నాచార్యత్వమును విశదమగును.

4. పాండురంగమాహాత్మ్యము ప్రత్యేకపరిశీలనము

విట్ఠల సంప్రదాయము

పాండురంగ మాహాత్మ్యమున రామకృష్ణకవి పాండురంగ విట్ఠల దైవత మును సర్వసంప్రదాయ సమన్వయ రూపమునఁ బ్రతిష్ఠాపన మొనర్చినాఁడు. వేదమార్గ ప్రతిష్ఠాపన తన జీవితోద్యమమున కీ కవి యీ దైవమును గేంద్ర మొనర్చి "యిదియు నొక యారాధనా విశేషముగా" నొనర్చినాఁడనియు నీ గ్రంథ మీ కవికిఁ బరమావధి యనియు నిందలి విశేషముల వలన మనకుఁ దెలియనగును. ఇందలి దేవతామూర్తి యొక్క సంప్రదాయమును విశేషములను దెలిసికొనుట యావశ్యకము. శైవ వైష్ణవ మార్గములలోఁ బెక్కు శాఖలు చారిత్రకములైన పురాణానంతర యుగములలోఁ గలుగవలసిన యావశ్యకత దేశమునకుఁ గొన్ని మత సాంఘిక కారణములవలనఁ గలిగినది. ప్రధానముగా మహమ్మదీయుల దండయాత్రలు, జైన బౌద్ధ మతోద్యమములు ప్రబలు చున్నప్పుడు యావద్భారతదేశమున వేదమార్గ ప్రతిష్ఠాపనకై తగు నుపాయ ములు కావలసివచ్చినవి. ఈ యక్కఱ కొఱకు పురాణాదులలోఁ బ్రతిష్ఠిత ములైన కొన్ని తీర్థములు, క్షేత్రములు, దేవతాయతనములును బునరుజ్జీవింపఁ జేయఁబడినవి. అట్టి యుద్యమములలో శైవము కాకతీయ ప్రభువుల కాలమునను, వైష్ణవము విజయనగరరాజుల పాలనమునను దక్షిణ భారతమునఁ ప్రాధాన్యము వహించినవి. ఈ రెండింటి సంధి కాలమునను రెడ్డిరాజులలోఁ గొందఱు శైవమును గొందఱు వైష్ణవమును బ్రోత్సహించిరి.

విజయనగర ప్రభువుల కాలమున బహుళ ప్రచారములోనికి వచ్చి వ్యాప్తిచెందిన విష్ణుపరమైన వేదశాఖలలో విట్ఠల సంప్రదాయ మొకటి. కనుక నీ సంప్రదాయము పదునైదు, పదునాఱు శతాబ్దులలోఁ బుట్టి పెరిగినదిగా స్థూలదృష్టికిఁ గనిపించును. సూక్ష్మముగాఁ బరిశీలించినచో నొక సంప్రదాయము పుట్టిన వెంటనే వ్యాప్తిలోనికి వచ్చుట జరుగక కొంతకాలము దాని పెరుగుదల కావశ్యకమై యుండును. జనబాహుళ్యమునకుఁ దెలియనంత ప్రాచీనముగా సంప్రదాయముల పుట్టుక "ప్రకటగుప్తాకారమున" మెలఁగును. ఇది "ఏఱుల జన్మంబు" వంటిది. ఈ న్యాయము విట్ఠల సంప్రదాయమునకును వర్తించును. సూక్ష్మ పరిశీలన చేసినచో నీ సంప్రదాయము, విట్ఠల పాండురంగ శబ్దములును నడిమి శతాబ్దులలో విజయనగర రాజ్యమునఁ బ్రచార మందినవి మాత్రమే కావనియును, కర్ణాట మహారాష్ట్ర దేశములలోఁ గూడఁ గొంత ముందుకాలము

నుండి పెరుగుదల వహించినవనియును దెలియును. అంతకుఁ బూర్వ మాఱవ శతాబ్దినుండియే యీ సంప్రదాయ ముద్భవమై, స్థిరపడి పోయిన దనుటకుఁ జారిత్రకములు సాంప్రదాయికములు రెండు విధములగు నాధారములు గనిపించును. అందుఁ జారిత్రకములలోఁ జరిత్రకారుల రచనలు, శాసన ప్రమాణములును ముఖ్యములు. సాంప్రదాయికములలోఁ బురాణ తంత్ర వాఙ్మయాధారములును సాహిత్యపరములైన యాధారములును ముఖ్యములు. వీనిని గొంతవఱకైన సమగ్రముగఁ బరిశీలించి యనుపూర్వి నేర్పఱచుకొననిచో నీ సంప్రదాయముయొక్క వైభవమును సమగ్రముగా బోధపఱచుకొనుట కవకాశ ముండదు.

విట్ఠల దైవతము

పాండురంగఁడు, విట్ఠలుఁడు నను నామములతో వెలయు పౌండరీక క్షేత్రాధిష్ఠితుఁడైన మూర్తి విష్ణుదైవతము. ఇతఁడు పీతాంబరధారియగు బాల కృష్ణమూర్తి. నల్లనివాఁడు. కటిన్యస్తహస్తములు గలవాఁడై నిలఁబడి యుండును. నారదాదినద యొక యిటుకపై నని సంప్రదాయజ్ఞులు చెప్పుదురు. భుజములకు భుజకీర్తులు, చెవులకు మకరాకారములగు కుండలములు నుండును.

ఇతఁడు పాండురంగఁ డనియు విట్ఠలుఁ డనియుఁ బాండురంగ విట్ఠలుఁ డనియుఁ గూడ వ్యవహరింపఁబడుచున్నాఁడు. ఈ నామముల వ్యుత్పత్తిని గూర్చి పలువురు పలువిధములఁ జెప్పుచున్నారు.

పాండురంగ శబ్దము

1. పాండురంగ శబ్దము రంగశబ్దమునుండి వచ్చియుండవచ్చు నని యొక యూహ. శ్రీరంగనాథుఁడు వైష్ణవుల దైవము. ఈ పేరు రామాయణమున వాల్మీకిచే నుదాహృతము జగన్నాటకరంగమున కధినాథుఁడు గనుక శ్రీరంగ నాథుఁ డైనాఁడని వైష్ణవ గురువులు కీర్తించియున్నారు. శ్రీరంగనాథ శబ్దము ననుసరించి పాండురంగ శబ్దము కాలక్రమమున వచ్చి యుండవచ్చును. అప్పుడు శ్రీరంగమునందలి శ్రీ యను పదమువలెఁ బాండుపదము కూడ సంప్రత్యకట నారము కావచ్చును.

2. పుండరీకుని పేరఁ బౌండరీకమను నామము క్షేత్రపరముగాఁ దొలుతఁ బ్రసిద్ధమై, యది కాలక్రమమున శ్రీరంగశబ్దములోని రంగశబ్ద సాహచర్యము లోకమున నుండుట వలనఁ బౌండరీక క్షేత్రపదము పాండురంగ క్షేత్రమై యటుపైని దైవత పరముగా వచ్చి యుండవచ్చును.

3. ఇది పాండురాంగశబ్ద వికృత రూపము కావచ్చును.

4. పాండుశబ్దము జ్ఞానసూచకమైన వెలుఁగు కావచ్చును. పాండువైన రంగము గల వాఁడు కావచ్చును.

5. పంఢరీ అను దక్షిణదేశభాషా వ్యవహారసిద్ధమైన నామమునకు సంస్కృతీకరణము కావచ్చును. ఇవి యన్నియు నూహలే. ఇందు రెండవ యంశము కొంత హేతుసహ మనిపించును.

విట్ఠల శబ్దము

ఇది విష్ణుశబ్ద మని కొందఱును, విష్ణుపతిశబ్దమునుండి పుట్టిన విరోధశబ్ద మని కొందఱును, విష్ణరశ్రవశ్శబ్దమునుండి వచ్చినదని కొందఱు నూహించినారు. మహారాష్ట్ర ప్రాకృతమున విట్టి యనఁగా ఇష్టకశబ్దభవమైన యొక పదము. పుండరీకుఁడు సమర్పించిన యిటుకపై నిలఁబడి వెలసిన విగ్రహము గనుక విట్టిశబ్దమునుండి విట్ఠల శబ్దము వచ్చినదని కొందఱు చెప్పుచున్నారు.[1] ఇదియే సరియైన యూహ కావచ్చును. రామకృష్ణుని కావ్యమునఁ బుండరీకుని కథలో నిటుకరాతి ప్రసక్తి లేదు. మహారాష్ట్రభక్తుల కథలలో నున్నది.

ఈ దైవతమూర్తియుఁ దచ్చరిత్రము ప్రాచీనములు కావనియుఁ, జాల నర్వాచీనములనియు నిరూపించుటకుఁ బలువురు పాశ్చాత్య చరిత్రకారులగు వ్యాసకర్తలు పాటుపడిరి[2]. కొందఱిది హైందవీకరణము చేయఁబడిన జైన[3]. బౌద్ధదైవతమని పలికిరి. కాని

"ప్రహ్లాద నారద పరాశర పుండరీక
వ్యాసాంబరీషశుకశౌనకభీష్మదాల్భ్య ."[4]

---

[1] 'Lord', sa d Punda ık, ' re.nain with the goddess Rukmini here on this brick for ever, as Vithoba, he who stood on the brick and waited for his devotee..." A.P.S. Iyer, *Sri Krishna: The Darling of Humanity*, The Madras Law Journal Office, Madras, 1957, p. 552.

"The plain truth probably is that as the Indo-Aryans proceeded southwards, the Brahmans found it necessary to invent reasons for attaching sanctity and attracting pilgrims to other spots besides those already held sacred in the North-west. It was on this account that the Mahatmyas of various places were gradually written and inserted in the Puranas. Some of those additions··· are comparatively modern, and the Mahatmyas of one or two tirthas, such as Pandharpur in the Dikhan, are said to have been added during the last fifty or hundred years" -Monier Williams, "Sraddha Ceremonies at Gaya," *Indian Antiquary* Vol. 5, July, 1976, p. 201.

"Still others held that it (the image of Vithala) is only a Jain image of Neminatha Tirthankara or Buddhist Padmapani. This last view in a paper in *Ind.Ant.* Vol. X, p. 149, by a Christian missionery who makes several such unsubstantiated statements about the god" R.S. Panchamukhi, *An Introduction to Haridasa Sahitya of Karnatak*, Srikantia Press, Bangalore, 2, 1953, p. 64.

I incline to believe with Dr. Stevenson and others, that Pandharpur was originally a gathering place of Buddhists... a Jain deity. Dr. J. Murray Mitchell, Pandharpura, *Ind. Ant.* Vol. XI, p.149.

[4] శంకరుల లక్ష్మీనృసింహకరావలంబనస్తోత్రము. శ్లో. 16.

యను తావులందుఁ బరమ భాగవతుల నామములందుఁ బుండరీకుని నామము కనఁబడుట వలనను, బుండరీకుని కథ పద్మపురాణమున నుండుట వలనను, శంకరాచార్యులవారిచే స్తుతింపఁబడుటవలనను నీ పాశ్చాత్యుల యూహలు నిరాధారములనియు సవ్యాజములనియు నిశ్చయముగాఁ జెప్పవచ్చును. రామకృష్ణ కవి కూడ దీని ప్రాచీనతను నిరూపించుటకే పై శ్లోకమును గూడఁ దన కావ్యమున నాంధ్రీకరించినాఁడు .

"సురకర్మంది హిరణ్యదైత్య సుతు వ్యాసున్ శౌనకున్ శ్రీపరా
శరు రుక్మాంగదు నంబరీషు సరమా జానిన్ వసిష్ఠున్ బురం
దరపుత్రున్ శుక దాల్భ్య భీష్మ వెఱఁగొందంజేయు నుద్భక్తి త
త్పరుఁ డీ పుణ్యుఁడు పుండరీకుఁ డితనిన్ బాలింతు మేలీవులన్"

—పాండు. 4-104

విట్ఠల శబ్దము

దీని వ్యుత్పత్తి కొఱకై పలువురు పరిశోధకులు పలు విధములైన యూహలు చేసినారు. ఇది పాండురంగ క్షేత్రములోని దైవతమునకు వాడఁబడు నామము. ఈ శబ్దము మహారాష్ట్రభాషకు సంబంధించినదని కొందర రభిప్రాయ పడినారు.[1] విట్ఠల శబ్దము విష్ణుశబ్ద వికృతియని కొందఱును, ద్రవిడభాషాశబ్దమని కొందఱును భావించినారు[2]. కొందఱు విష్ణుశబ్దమున కిది కర్ణాటభాషలోని తద్భవ మనిరి[3]. విష్ణుశబ్దమునకు బహువిధములైన వికృతి రూపములు విట్ఠల శబ్దమునకు దగ్గఱగా నున్నవి రావచ్చు ననియు నట్టివి వ్యాప్తిలో నున్న వనియు కాణే మహాశయుఁడు తెలిపినాఁడు.[4] మఱియుఁ బాండురంగ దేవునితో సంబంధము లేకయే విట్ఠలశబ్దము కేవల విష్ణు సామాన్య వాచిగా వాడఁబడుట కూడఁ

---

[1] "Vithoba, he who stood on the brick and waited for his devotee. It is called in Marathi Vitti or Itti (Sanskrit Ishtika)" - Sri Krishna by A.P S. Iyer, p. 552.

[2] "Vishnu becomes Vishtu yielding ultimately Vithoba modified under Dravidian influence' - Encyclopaedia of Religion, and Ethics, Vol VI, p. 703.

[3] "Vithala and Vithoba are corrupt Kanarese forms of Vishnu (Vitthu) with the affixes 'la' and 'ba' to denote tenderness or reverence (Dr. Bhandarkar) quoted from A History of Canarese Literature by Edward P.Rice. p. 80.

[4] "Vishnu assumes in Prakrit the forms Vinhu, vinnu, venhu, vetha and others. In Canarese Vishnu becomes Bitti, Bittiga, Vitta and etc. The changes in names do not necessarily follow the rules laid down in Prakrit or Canarese Grammars" - History of Dharma Sastra. P. V. Kane, Vol. IV, p. 731.

దొలుత గలదు. ఇదియే ప్రాచీనతరమైన వాడుకయై యుండవచ్చును[5]. కాణే మహాశయుని యుదాహరణమునుబట్టి పాండురంగనితో సంబంధము లేని సిక్కు సంప్రదాయ గ్రంధాదులలోఁ గూడ నీ పదము విష్ణుదైవసామాన్యవాచిగా నున్న దనుట స్పష్టము. కనుక నీ శబ్దము కాలక్రమమునఁ బౌండరీక క్షేత్రములోని పుండరీక వరదునికిఁ బరముగా విష్ణుసామాన్యార్థమునఁ దొలుత వాడఁబడి, తత్క్షేత్ర దైవత సంకేతముగా జనశ్రుతిలో స్థిరపడి యుండవచ్చును. పై నుదాహరింపఁబడిన ప్రయోగములే గాక వానికన్న ముందునుండి యీ పదము వాడుకలో నున్నదనుటకుఁ జరిత్రలోని కొందఱు వ్యక్తుల పేర్లు మన కాధార మగుచున్నవి[6]. వీనిని బట్టి విఠల శబ్దము విష్ణుపరమైన యర్థమున వికృతిగా నుద్భవించి, పాండురంగక్షేత్రదేవుని పరముగా సంకేతము గొనిన దనియుఁ, బదమూఁడవ శతాబ్దినాటికే వ్యక్తుల నామముగా వాడఁబడు నంతటి వ్యాప్తిలో నున్నదనియుఁ దెలియనగును. మొదలాఱవ శతాబ్దినాటికే విఠలదైవతము, విఠల నామము వాడుకలో నున్నట్లు మఱి కొన్ని యాధారము లున్నవి. మావా పుర రాష్ట్రకూట రాజులలో నొకఁడైన యవిధ్యుఁ డను రాజు – నేటి సతారా మండలమున కేలికయైనవాఁడు – ఆఱవ శతాబ్దమున జయద్విట్టులు డను నొకనికి పాండురంగపల్లి యను గ్రామముతోపాటు మఱి నాలుఁగు గ్రామముల నగ్ర హారముగా దానము చేసినట్లు శాసన మున్నది.[7a] –. ఈ దానము పాండు రంగపల్లిలోని పాండురంగ విఠలుని దేవాలయారాధనార్థమై చేయఁబడినదని

---

[5] "Mr. A. K. Priyolkar in his learned paper on Bhagvat Namadeo of Sikhs, in the Journal of the University of Bombay Vol. VII, Part 2 (1938) points out (p 24) that in the Adigrantha of the Sikhs in the hymns of Namdeo, God is addressed as 'Bithal' or 'Bithalu' (p 24), that in the Gujarathi poems of Narasimh Mehta and Mira Bai God is addressed as Vitthala (p. 35) and Vithala is employed by these saints meaning only Vishnu and not the deity at Pandaripur" -Ibid. p. 721. Also Ibid page 716 para 2 and Early History of Deccan Vol. II, Ed. by G. Yazdani - page 566.

[6] (a) "Vishnuvardhana (of the Hoyasala dynasty, A.D 1110-52) has been known as Bitti Deva before his convertion Bitti is a pet name for Vishnu-" Hoyasalas by J.D. M. Derrett, p. 222.

(b) Buddharaja one of the generals of the Kakatheeyas traces his descent from Vithala, his great grand father - see the Early History of Deccan Edited by G. Yazdani, p. 695.
(c) One of the generals of Prataparudra of the Kakateeya Dynasty (1295-1323) before the name of Vithala Bhunadha. See Ibid, p. 93.

[7](a) See Mysore Archaeological Survey report for 1929, p. 197 - 210.

యను నేటి పాండురంగ క్షేత్రమే యీ శాసనమందలి పాండురంగపల్లి యనియు కాణే మహాశయుని నిర్ణయము. [7b]

పాండురంగ శబ్దము

ఇది విష్ణుపరమైన రంగని పేరునకు సంబంధించిన దనియుఁ, బౌండరీక శబ్ద వికృతియై క్షేత్రనామము దైవతపరముగా సంక్రమించిన దనియు, పంఢ్రన్ అను ద్రావిడభాషాగతమైన నామమునకు సంస్కృతీకరణమనియుఁ బెక్కు లూహ లున్నవి. ఆధారములనుబట్టి చూడఁగాఁ గర్ణాటభాషలో "పండరగె" యను రూపము ప్రాచీనమైనది యున్నది.[8] స్వల్ప రూప భేదములతో నీ పదము శాసనములలో వ్యక్తి నామముల, స్థలనామముల పరముగాఁ గనిపించు చున్నది. [9] తొమ్మిదవ శతాబ్దినాటికే అద్దంకి శాసనము మున్నగు నాధారములనుబట్టి తూర్పు చాళుక్యుల రాజోద్యోగులలోఁ బండరంగఁడు అను పేరు వినిపించును. ఆఱవ శతాబ్దిలోఁ పండరంగపల్లియను గ్రామనామము, తొమ్మిదవ శతాబ్దిలోఁ బండరంగఁ డను వ్యక్తినామము అతఁడు కట్టించిన పండరంగమను గ్రామ నామము[10] – తొండైమండలమున పులికాటి కొలను తీరమున నున్నది – గనిపించుట చూడఁగా, నంతకు ముందు బాలకాలము నుండియే ఈ పేరు జనశ్రుతిలోనికి వచ్చి యుండునని తెలియును. ఈ యాధారములనుబట్టి మఱి యొక యంశమును మన మూహింపవచ్చును. పాండురంగ క్షేత్రములోని దైవతముతో, ననఁగా నర్చామూర్తితో సంబంధము లేకయే పాండురంగఁడు విట్టలుఁడు ననఁబడు నొక దైవతము ప్రాచీన భారతీయ సంప్రదాయమునందు స్థానము చేసికొని యుండుట కవకాశ మున్నది. దీనికిఁ దోడు పురాణాధారములు కూడ భీమరథీతటమున నున్న యొక మహిమాన్విత దైవతమును గీర్తించుచున్నవి. ఆ స్థలము దైవదత్తమైన మహిమ గల్గినదిగాఁ జిరకాలమునుండి కొనియాడఁబడుఁచు నటుపైఁ గొంతకాలమునకు దేవాలయ నిర్మాణాదులు జరిగి యుండుటకు నవకాశ మున్నది.

---

7 (b) "Therefore the important conclusion follows Pandharpur was known to Canarese people as Pandraga and was also called Pandarangapalli - History of Dharma Shastra by P. V. Kane, Vol. IV, p. 717.

"As regards the name of the Kshetra it appears that originally it is called in Canarese 'Pandarage' of which Panduranga is a Sanskritised form. History of Dharma Shastra by P. V. Kane, p. 721.

Pandurangapalli plates of Avidhya of the early Rastrakuta dynasty, datable to 6th century, mentions the village of Pandurangapalli – see Mysore Archaeological report, 1929, pp. 197 – 210.

10 See Epigraphica Indica Vol. XIX p. 275 and also Nellore District Inscriptions, I g. 86 – 105

సంప్రదాయాధారములనుబట్టి పర్యాలోకనముఁ జేసినచోఁ బురాణములలో నీ క్షేత్ర దైవతముల ప్రశంస కలదు. పద్మపురాణమునందుఁ బుండరీకుఁడు భీమరథీ తటమునఁ దపస్సు చేసి దైవత సాక్షాత్కారము నందినట్లున్నది. తీర్థమాహాత్మ్యమున విట్ఠల ప్రశంసయు, భీమరథీ ప్రశంసయు నున్నవి.[11] కూర్మపురాణమునను స్కందపురాణమునను గూడ నీ క్షేత్ర ప్రశంస గలదు. ఈ శ్లోకములు కొన్ని నేడు ముద్రిత ప్రతులలోఁ బూర్తిగా లభింపకున్నవి. హేమాద్రి యను కవి రచించిన తీర్థ భూషణమను గ్రంథమున నిందలి శ్లోకములు కొన్ని యుదాహరింపఁబడినవఁట! అందలి పదునొకొండు శ్లోకములను విట్ఠలభూషణ గ్రంథకర్తయైన గోపాలాచార్యులను కవి యుదాహరించినాఁడు.[12] ఈ యాధారములనుబట్టి కాణేమహాశయుని పరిశోధన ఫలితముగా క్రీ. శ. 1260 – హేమాద్రి తీర్థ గ్రంథ రచనాకాలము కన్నఁ బెక్కు శతాబ్దులకుఁ బూర్వమే పండరిపురము పుణ్యతీర్థముగా గణన కెక్కినదనియుఁ, బుండరీకుఁ

---

11 "తతో నివృత్తా ఆయాతః పశ్యన్ భీమరథీతటే
ద్విభుజం విట్ఠలం విష్ణుం భుక్తి ముక్తిప్రదాయకమ్
యత్ర భీమరథీ తీరే బిందు మాధవ సంజ్ఞితః
హరిః స వర్తతేఽద్యాపి భుక్తిముక్తిప్రదో నృణామ్
యత్ర గోదావరీ జన్మసానం బ్రహ్మగిరిర్మహత్"
—పద్మపురాణము 176 శ్లో. 56 – 58

12 తీర్థహేమాద్రౌ
భైమ్యాశ్చైవ తపేదేవి దక్షిణే తీర్థముత్తమమ్
అస్తి క్షేత్రమ్ దైవతంచ సర్వోత్కృష్టమ్ సుదుర్లభమ్
పౌండరీక మితి ఖ్యాతమ్ తత్తీర్థమ్ క్షేత్రపూజితః
పాండురంగశ్చ తత్రాస్తే మూర్తిమాన్ దేవతోత్తమః
పుష్కరాత్త్రిగుణం పుణ్యం కేదారాత్ షడ్గుణం భవేత్
వారాణస్యా దశగుణ మనంతం శ్రీగిరేరపి
షష్టివర్ష సహస్రాణి దివ్యదైవతదర్శనాత్
తత్ఫలం లభతే మర్త్యః సకృ దేవహి తత్ఫలమ్
అష్టావింశతి తమే కేత్రేద్వాపరాంతేచ షణ్ముఖ
పుండరీకఇతిఖ్యాతః తపస్తేపే సుదారుణమ్
భక్త్యా పిత్రోశ్చ శుశ్రూషాం కుర్వన్ మునివరస్సదా
తదైవం కుర్వతః పూజామ్ పిత్రోరహరహః ప్రియే
పరితుష్టోభవద్దేవో గోపీజనమనః ప్రియః
గోవర్ధన గిరౌ రమ్యే చారయన్ గోగణం విభుః
గోయష్టిమ్ ధారయన్ యస్మాత్ భత్రోజ్జ్వలిత కంకణమ్
నానారత్న ప్రభోద్భాసి శిక్యమౌళి విరాజితః
అతీవసుస్వరః సౌమ్యే రత్నాంకిత మహాంగదః
దిగ్వాసాశ్చాది సౌమ్యేన గుహ్యాసూత్రేణ వేష్టితః
త్రివృతేనాను కాలేన కటిబద్ధేన – కటిబంధేన – రాజితః
కటిమాలంబ్య తిష్ఠన్వై త్రివృద్వల్ల్యాచ సంయుతః

డను ఋషియుఁ జిరకాలప్రసిద్ధుఁ డనియు, నచటి విట్ఠల విగ్రహము గూడఁ గడు ప్రాచీనమే గాని యర్వాచీనము గాదనియు తేలుచున్నది.[13]

సంప్రదాయాధారములలోఁ పద్మపురాణాంతర్గతమైన సూతశౌనక సంవాద ఘట్టమునఁ బదునాలుగు శ్లోకములలో విట్ఠలకవచ మున్నది. – చూ. అనుబంధము 1. అందు విష్ణురూపమున విట్ఠలుఁడును మూల ప్రకృతియు నారదాదులును గీర్తింపఁబడినారు. ఉపపురాణములలోనే రుద్రపురాణాంతర్గతమైన నాదమకేశ్వర తంత్రమున నారద వశిష్ఠ సంవాద ఘట్టమున విట్ఠల స్తవరాజమున్నది. భవిష్యోత్తర పురాణమునఁ బాండురంగ మహాత్మ్యమను ఘట్టమున విట్ఠలహృదయ స్తోత్ర మున్నది చూ. అనుబంధము. పాండురంగ మాహాత్మ్యమను పేర నొక సంస్కృత గ్రంథ మున్నట్లుఁ కాణే మహాశయుఁడు చెప్పుచున్నాఁడు. అందును హేమాద్రిచే నుదాహరింపబడిన శ్లోకములే కొలది మార్పులతో నున్నవి. [12] ఈ పాండురంగ మాహాత్మ్య మే పురాణము నుండియు నుద్ధృతమైనట్లు కాణే పండితుఁడు చెప్పలేదు. ఇది బహు పురాణాంతర్గత శ్లోక సంకలనములతోఁ గూడి నదియు రామకృష్ణుని పాండు

తత్రైవ కూర్మపురాణే—

పుండరీకం మహాతీర్థం బ్రహ్మణై రుపసేవితమ్
తత్రాభి గమ్యవృత్తాత్మా పుండరీకఫలం లభేత్

(Quoted from Kane's History of Dharma Sastra, p. 717)

[3] "Though a M.S. of the Thirtha portion of Hemadri's work has not yet been recovered. there is no reason to doubt that the verses were taken by Gopalacharya from Hemadri's work particularly when almost all those verses ane quoted by T.S. (about 1500 A.D.) from the Skanda Purana and Kurma Purana. As Hemadri composed his work about 1260-1270 A.D. and as the verses quoted by him are cited from the Skanda Purana, it follows that several centuries before 12th century A.D. Pandharpur was known as Thirtha, that the devotee and Saint Pundarika (Marathi Punddlik) also was so known then and that the image of Vithoba was essentially the same in appearance as it is now" —Kane's History of Dharma Sastra, p. 718.

" In a M S of Pandurangamahatmayam in the possession cf Pandit Khuperkar, the same verses occur with a few additions. That M.S. raeds అంతస్సూత్రేణ, త్రివృద్వల్లీ కృతేనేశః కటిబంధేన రాజితః and క్షుల్లకాశిక్య సద్భాభ్యా మూరుభ్యాంబాతి శోభితః makes no sense. It has to be noted that కటిబంధేన రాజితః or అంతస్సూత్రేణ is mentioned separately from Katibandhena and therefore గుహ్య సూత్ర or అంతస్సూత్రేణ was something different from Katibandhena (waist-band) …… … In Pandit Lakshmana Sastry అంతస్సూత్రేణః వేష్టితః కటిబంధేన రాజితః and క్షుల్లకా శిక్య సద్భాభ్యామూరుభ్యాం వారు శోభితః are the readings" Kane's History of Dharma Sastra —pp. 717-718

రంగ మాహాత్మ్యమునకు మూలమైనదియు నగు గ్రంథమై యుండునేమో. అటు పైని మనకు లభించు నాధారము శంకరాచార్యకృతమగు పాండురంగాష్టకమను స్తోత్రము. ఈ స్తోత్రమున భీమరథి, పుండరీకుఁడు, పాండురంగఁడు నను పదము లుపయోగింపఁబడినవి. ఇందుఁ బాండురంగఁడు నడుమునఁ జేతులనుంచి ఇష్టకపై నిలఁబడిన రుక్మిణీ సమేతుడైన కృష్ణమూర్తిగా పరబ్రహ్మలింగ సంకేత ముగా వర్ణింపఁబడినాఁడు. ఈ యాధారములలోఁ బద్మపురాణములోని యుత్తర భాగము క్రీ. శ. వెయ్యి సంవత్సరముల ప్రాంతమునకుఁ బూర్వమైనది కాద నియు[15] స్కాందపురాణము సుమారు తొమ్మిదవ శతాబ్దమునాటి దనియు, [16]గూర్మపురాణము షుమా రెనిమిదవ శతాబ్దమునాటి దనియు, శంకరా చార్యులవారి కాలము క్రీ. శ. 788-820 లనియుఁ జరిత్రకారుల మదింపు[17]. కనుక చరిత్రకారుల నాధారముగాఁ గొన్నచో శంకరులవారిదే సంప్రదాయ ప్రమాణములలో మొదటి దగుచున్నది. ఈ స్తోత్రములన్నియు నాదిశంకరులవి కావని కొందఱు తలంచుచున్నారు. కాని యిది నిరాధార మగుటఁజేసి యాదర ణీయము గాదు. ఈ విధముగాఁ బాండురంగ విట్ఠల దైవతము శంకరుల వారి కాలమునకుఁ జాల శతాబ్దములు ముందుగనే సుప్రసిద్ధదైవతమనియు భీమరథీ తటమున నున్నట్లును సంస్కృత సంప్రదాయమున స్థిరపడి యుండుననుకొణే మహాశయుని యూహయే సమంజసము. అర్వాచీన కాలమున మహమ్మదీయ దండయాత్రలు మున్నగు కొన్ని వికాకుల వలనఁ బ్రాచీన వేద సంప్రదాయోద్ధరణ మావశ్యకము కాఁగా, తరములతఱఁబడి సుప్రసిద్ధులగు వివిధ శైవవైష్ణవ మార్గో ద్ధారకాచార్యుల యాగమనము వలనఁ బుణ్యక్షేత్రములకుఁ బుసర్వసంతాగమమై సంప్రదాయములు మొగ్గతొడిగినవి. ప్రాచీన భారతీయ సంప్రదాయ పునరుజ్జీవన మునకుఁ బ్రజలలో వ్యాప్తి యావశ్యకము. దీనికి భక్తిమార్గము సుళువైన సాధనము. ఈ మార్గమును వ్యాప్తిచేయుటకు దేవాలయములు, స్థలమాహాత్మ్యములు గొప్ప సాధనములు. శంకర, రామానుజ, మధ్వ, చైతన్య, వల్లభాది మహామాన్వితులైన మహనీయుల తపశ్శక్తి యొక ప్రక్కను, వారి దేశ సంచారముల ఫలితముగాఁ బుణ్యక్షేత్రాదుల పునరుజ్జీవన మొకప్రక్కను ధారాళముగా శతాబ్దుల తఱఁబడి జరిగినది. ఇట్టి ద్విగుణీకృతోద్యమమునందు నసంఖ్యాకములైన దైవతములపై స్తోత్రాదులను రచించి భక్తజనావళి కందించుట శంకరాదుల ప్రయత్నములలో నొకటి. కనుకనే యాదిశంకరుల స్తోత్రములలో శైవ, వైష్ణవ, శాక్త, గాణాపత్య, వైదిక, శ్రీవిద్యా సంప్రదాయము లన్నియు సమగ్రముగా స్పృశింపఁబడినవి. తక్కిన యాచార్యుల స్తోత్రరచనమం దిట్టి సమగ్రత లేకున్నను బ్రయత్నము మాత్ర మిట్టిదియే.

ఈ విధమైన ప్రయత్నములలోఁ జైతన్యప్రభువు శ్రీకృష్ణపరమైన విశ్వ ప్రేమ సిద్ధాంతమును దన యోగ శక్తిచేఁ బ్రజలలో సుప్రతిష్ఠితము చేయుచు

---

[15] "The Padmapurana (Uttara-Khanda) in my opinion is a late addition and cannot be placed earlier than about 1000 A.D , History of Dharma Sastra, Vol. IV. p. 713.

[16] Ibid. p. 718 and 720

[17] History of South India by Nilakanta Sastry, p. 353.

నాసేతుశీతాచలము చరించి నట్లు తెలియుచున్నది. తన సంచారములలో నతఁడు పండరిపురమునకుఁ బోయినట్లున్నది. అట్లే వల్లభాచార్యులును,[18] చైతన్యులు విజయనగరరాజ్యా సంచారము గూడఁ జేసినట్లు చారిత్రాధారమున్నది.[19] అది పదునైదు పదునాఱవ శతాబ్దముల కాలము. అనఁగాఁ గృష్ణదేవరాయలు రాజ్యమునకు వచ్చుటకు ముందు వెనుకల కాలము. చైతన్యుని యుద్యమమును పాండురంగ సంప్రదాయమును వైష్ణవశాఖకుఁ జెందినవి. ఆనాటికే విజయనగర రాజులు వైష్ణవ మత స్వీకారమును దక్షిణ సంప్రదాయము ననుసరించి చేసినట్లు తెలియుచున్నది, విరూపాక్షరాయని కాలమున —క్రీ.శ. 1485, 86 కుముందు— నృసింహార్యుఁడు, శ్రీరంగదేశికులు అను సోదరు లిరువురు ఏట్టూరు గ్రామమునుండి వచ్చినట్లును, నందు శ్రీరంగదేశికుఁడు విరూపాక్షునకు వైష్ణవ దీక్ష నిచ్చినట్లును ప్రపన్నామృతమను గ్రంథము వలనఁ దెలియుచున్నది. ఈ ఇరువురిలో శ్రీరంగదేశికుని మనుమఁడును అహోబిలాచార్యుని కుమారుఁడు నగు తాతాచార్యుఁడే రాయలవారి గురువైనట్లు కూడఁ దెలియుచున్నది. నృసింహార్యునకుఁ దొమ్మిదవతరము వాడును, పంచమత భంజన కర్తయు నగు తాతాచార్యుఁడు రాయల గురువని కొందర రభిప్రాయఁపడినారు. ఇది ప్రామాదికము. ఈ తాతాచార్యుఁడు రామరాయల గురువు. ఈ విధముగా విజయనగర రాజులు శ్రీశైలపూర్ణ వంశీయులగు ఏట్టూరి యాచార్యులవలన రామానుజీయ వైష్ణవ సంప్రదాయముచేతను, చైతన్యుని యాత్రవలన నుత్తరాది వైష్ణవ సంప్రదాయముచేతను ప్రభావితులై వేదమార్గ ప్రతిష్ఠాపనోద్యమమున నుజ్జీవితులైనారు. ఇందు దాక్షిణాత్య ప్రభావము వలనఁ దిరుపతి, శ్రీరంగము, కంచి క్షేత్రములలోని దేవాలయములఁ బరిపోషణమును, చైతన్య ప్రభావమువలన విజయనగరమునందు విట్ఠల దైవతారాధనము విట్ఠలాలయ నిర్మాణమును ప్రాముఖ్యము వహించినవి. హంపీక్షేత్రములోని విట్ఠలాలయ నిర్మాణమారంభించిన వాఁడు కృష్ణరాయలే.

ఇది యిట్టుండఁగా నానాఁటి వైష్ణవ గురువులలో విజయనగర రాజ్యమునకు సంబంధించినంతవఱకు రెండు తెగలవారున్న ట్లూహింపవచ్చును.

---

[18] 'That Pandharpur has risen in sanctity and importance in the 15th century follows from the fact that both the great Vaishnava Saints, Caitanya and Vallabha, visted it" —History of Dharma Sastra. Vol. IV, by P.V. Kane, p. 718.

[19] See Notes on the places visited by Caitanya in the south–Pampa– the ancient and Puranic name of the Tungabhadra. The village of Hampi (the site of the famous capital Vijayanagar) was originally known as Pampathirtha–we should also note that this pilgrimage was performed between April 1510 and January 1512 and that the great and wide spread revival of temple building which resulted from the restoration of the Vijayanagar Empire under Krishnadev, just began at the time of Caitanya's visit but was completed long afterwards" quoted from Caitanya – Charit Amrita by Jadunath Sarkar, p. 92–97.

1. కేవల దాక్షిణాత్య వైష్ణవ సంప్రదాయమును వ్యాప్తిచేసి వైష్ణవ మత ప్రతిష్ఠాపనాచార్యులై మెలఁగినవారు. ఉదాహరణమునకు రాయల గురువగు తాతాచార్యులు మొదలగు వారు. వీరి భక్తి సంప్రదాయమున శైవము శాక్తము మున్నగు నితర మార్గములకుఁ దావే లేదు. ఒక విధముగా వీరిది వీరశైవము వంటి వీర వైష్ణవ మన్నచోఁ దప్పులేదు. వీరి శిష్యులగు కృష్ణరాయలు మున్నగువారి గ్రంథములలోఁ గూడ వైష్ణవేతర దైవముల ప్రశంస యుండదు. అంతేగాక శివుఁడు మున్నగు దైవములు మోక్షప్రదములేయైనను విష్ణూపాసనముతోఁ బోల్చినచోఁ దరతమ భేదము లున్నవని గూడ రాయ లాముక్తమాల్యదలోఁ జెప్పియున్నాఁడు.

2. విష్ణూపాసనమును మిగిలిన మార్గములతోపాటు వేదమార్గ ప్రతిష్ఠాపనకుఁ బట్టుకొమ్మగా స్వీకరించి తాత్త్విక సమీకరణకుఁ దలపెట్టినవారు రెండవ తెగకుఁ జెందిన యాచార్యులు. ఉదాహరణకు శఠకోపయతి, భట్టరు చిక్కాచార్యులు, కందాళ అప్పలాచార్యులు మున్నగువారు. వీరి శిష్యులు వరుసగా నల్లసాని పెద్దన, తెనాలి రామకృష్ణుఁడు, సారంగు తమ్మయ్య. ఆ గురువుల సమీకరణమార్గమే యీ శిష్యుల కావ్యరచనలోఁ బ్రతిఫలించినది. కనుకనే యీ కవుల గ్రంథములలో హరి హర హిరణ్యగర్భులు గజాననుఁడు మున్నగు దైవతము లందఱుఁ గనిపింతురు. ఈ రెండవతెగకుఁ జెందిన గురువులకే యుత్తర దేశమునుండి వచ్చిన వైష్ణవోపాసనామార్గమగు పాండురంగవిట్ఠల సంప్రదాయ మంగీకార్యమై యుండును. ఈ తెగకుఁ జెందిన గురువుల ప్రభావమువలననే పెద్దనాదుల రచనలలో వైష్ణవ ముపాదేయ మగుటయు, శైవవైష్ణవ గురువుల కొక్కే శిష్యుఁడు – రామకృష్ణుఁడు – శుశ్రూష చేసి శైవ వైష్ణవ గ్రంథములు రచించుటయు జరిగినది. దీనినిఁ జూచి రాజప్రాపకమునకై పెద్దనాదులు వైష్ణవ మతము నభిమానించి శైవదూరులైనారని యొక నిరాధారమైన యూహను గొందఱు విమర్శకులు పెంపొందించుకొనినారు. వీరిలో రామకృష్ణునకును సారంగు తమ్మయ్యకును రాజులను బొగడవలెనను నూహ యున్నట్లు వారి రచనలనుబట్టి గాని చరిత్రనుబట్టి కాని యెట్టి యాధారములును లేవు. వారే గ్రంథమును బ్రభువున కెవ్వనికిని నంకితము చేయలేదు. చైతన్యులు దక్షిణ దేశయాత్ర చేసిన కాలమునకు రామకృష్ణుని జననకాల మించుమించుగా సరిపోవు చున్నది. రామకృష్ణుని వంశమువారు తెనాలిలోని రామలింగేశ్వర స్వామి భక్తులు. రామలింగేశ్వరస్వామియే తత్త్వముచేత హరిహరునివంటి శైవ వైష్ణవాత్మకమైన శివదేవుఁడు. వారి కుటుంబమునఁ బ్రసిద్ధులైన కవుల పేళ్లలోఁ గూడ శైవ వైష్ణవములు సమ్మిశ్రితములై యున్నవి. రామకృష్ణుని కుటుంబ మాతని కాలము ననే తొలుత పెనుగొండకు వచ్చినది. అప్పటి వివిధ మతశాఖలలోని వేద మార్గము నేశేశ్వర గురువు శైవ సంప్రదాయముగను, భట్టరు చిక్కాచార్యులు వైష్ణవ సంప్రదాయముగను వానికి బోధించి, వరుసగా నుద్భటారాధ్య చరిత్రమును బాండురంగ మాహాత్మ్యమును రచించుటకుఁ బ్రేరేపించినట్లు వాని గ్రంథములనుండియే మన మూహింపవచ్చును.

విట్ఠలుని యర్చామూర్తి వృత్తాంతము

పండరిపురమునందలి విట్ఠలదేవునిమూర్తి మిక్కిలి యర్వాచీనమని కొందఱి యూహ. అందలి విగ్రహము పెక్కుమాఱులు మతదండయాత్రల కాహుతి యైనదనియు మరల మరల నర్చక కుటుంబములవారు ప్రతిష్ఠ చేసిరని యుఁ గొందఱు భారతీయేతర సంప్రదాయావలంబకుల యూహ. ఈ యూహలు నిరాధారములని కాణే మహాశయుఁడు సప్రమాణముగా నిరూపించినాఁడు.[20] ఇది తొలుత బుద్ధవిగ్రహ మనియు లేదా జిననాథ విగ్రహ మనియుఁ, దఱువాత వైష్ణవార్చన మారంభింపఁ బడినదనియు మఱికొంద ఱూహించిరి.[21] పాండురంగ, విట్ఠల నామాంకితుఁడైన విష్ణు దైవతముయొక్క యర్చామూర్తిగనే యనాదినుండి యీ మూర్తి ప్రసిద్ధమై యున్నదని కాణే మహాశయుఁడు నిర్ణయము చేసి వల్కి నాఁడు.[22] పద్మపురాణరచనవాటికే మఱియు నాదిశంకరుల కాలమునాఁటికే యీ మూర్తి యిట్లు ప్రసిద్ధమై యున్నది.

శంకరాచార్యులవారు పాండురంగాష్టకమున – చూ. అనుబంధము 1. మఱికొన్ని విశేషములను దెలుపుచున్నారు. మహాయోగపీఠమగు భీమరథీతట మునఁ బుండరీకునకు వరమిచ్చుటకై ప్రత్యక్షమైన పాండురంగఁడు నీలమేఘ వర్ణుఁడు, తటిద్వాసనుఁడు, నిటుకరాతిపై సమముగా న్యస్తము చేయఁబడిన పాదములు గలవాఁడు, నితంబములయందుఁ గరములను నిలిపి కౌస్తుభాలం కారము గలవాఁడై కిరీటోజ్జ్వలుఁడై త్రిభంగ్యాకృతియై నిల్చినవాఁడు.

మూర్తివివరణము

"The image of Vithal or Vithoba in the temple is about three feet and nine inches high and together with its base seems to be cut out of one block of trap... The image is standing with its arms akimbo and hands resting on the hips; the left hand holds a conch and the right a cakra (discus). On the image are carved but so slightly as to be hardly noticeable except on close examination a waist cloth and round the waist a waist-band, the end of which hangs on the right thigh. The ornaments consist of a necklace and in the long ears are ear-rings which touch the shoulders. On the head is a long round topped cap" – Quoted from History of Dharma Sastra, Vol. IV by P.V. Kane, p. 714.

---

[20] See History of Dharma Sastra. P.V. Kane, Vol. IV, pp. 719–21.

[21] See, Ibid, p. 722, also see *Indian Antiquary*.

[22] In my opinion the description in the Skanda Purana (which must be held to be at least not later than about 1000 A.D.); tallies in essential particulars with the present image" – Ibid. p. 720.

పురాణాంతర్గతములైన శ్లోకములలో మఱి కొన్ని విశేషములున్నవి. ఈ మూర్తి దిగ్వాసుఁడు, గుహ్యసూత్ర వేష్టితుఁడు, త్రివృతమైన కటి బంధముఁ గలవాఁడు, శిక్యమౌళి విరాజితుఁడు, గోయష్టిని ధరించి గోవులను దోలుచుండు వాఁడు.

సంస్కృత పాండురంగ మాహాత్మ్య కావ్యమునఁ గూడ నిదే వర్ణనము గనిపించును. ఒకతావునఁ దటిద్వాసుఁడనియు నొక తావున దిగ్వాసుఁడని యును వర్ణింపఁబడుటయు, శంకరుల వారి యష్టకములోని మకుటమున "బ్రహ్మలింగమ్" అని చెప్పఁబడుటయు నిందలి విశేషములు. ఇందర్చా మూర్తి నడుము పట్టి ధరించినట్లు చిత్రింపఁబడినాఁడు. రెండవ వర్ణనము కేవల మా దేవుని లీలావిశేషము కావచ్చును. ఇది గోయష్టి ధరించుట వంటి ది. రామకృష్ణుఁడు "తటిద్వాసున్" అనియు, "దిగ్వాసుండు" అనియు రెండు శైలల ననువాదము చేసినాఁడు. మఱియు "శిక్యావచూడుఁడు" "మువ్వంక మురువుతో మురళి" మ్రోయించువాఁడు, "విట్ల నిలుచున్న"వాఁడు మున్నగు పైవర్ణనలలోని విశేషములేగాక "ఆవు నదల్చు వచ్చు వెదు రంఘ్రియుగమ్మునఁ దాల్చి" యని లీలావిశేష వర్ణనము గూడ స్వీకరించినాఁడు. ఇఁక బ్రహ్మ లింగమని శంకరుల వారు చెప్పిన ప్రయోగమున శివలింగము కిరీటాకృతిఁ దాల్చినదని కొందఱర్థము చెప్పుచున్నారు. కాణే పండితుఁడు దీనినిఁ గూడ సూచించినాఁడు.[28] పురాణాంతర్గతములని చెప్పఁబడుచున్న స్తోత్రము లలో నొక్కదానియందును పాండురంగమూర్తి వర్ణనము లేదు. అందుఁ శ్రీకృష్ణపరమైన మూర్తి, తత్త్వప్రశంసయే విట్ఠల, పాండురంగపరముగాఁ జూపఁ బడినది. ఈ స్తోత్రములలోఁ పాండురంగ దైవతోపాసనమార్గములు చెప్పఁ బడినవి. ఇవి యా కాలమునఁ గాని యంతకుముందుఁ గాని పండరిక్షేత్ర దైవతోపాసకులచే ననుష్ఠానమున నమలుపరుపఁబడినవై యుండవచ్చును. విద్యానగరరాజ్యమందలి విట్ఠల సంప్రదాయానుయాయులలో నెవ్వరైన గురు పరంపరగా వీని నాదరించిరో లేదో గూడ తెలియరాకున్నది. కాని వీని యునికినిఁబట్టి యాగమాత్మకము దాంత్రికమునైన భక్తి ప్రధాన యోగసాధన యొకటి పాండురంగాత్మక మున్న ట్లూహించుటకు తావున్నది. రామకృష్ణుఁడు దానిని స్వీకరించెనో, యంతకుముందే భట్టరు చిక్కాచార్యులు దాని ననుష్ఠించి శిష్యుల కుపదేశము చేసెనో యనియు మనము సందేహపడవచ్చును. రామకృష్ణుని కావ్యమున మాత్రము విట్ఠల సంప్రదాయ యోగ సాధనము సుప్రతిష్ఠితమై యున్నట్లు చిత్రింపఁబడినది. అందు కామకలాబీజ సంపుటీ కరణము గల గోపాలమంత్రము, "మనుహరరాజయోగముల మర్మములు", కుండలిని, షట్చక్రభేదనము మున్నగు విశేషములును స్థాపనఁ జేయఁబడినవి. పుండరీకుఁడు భీమరథీతటమున నా మార్గము నవలంబించి స్వామిని సాక్షాత్క రింపఁజేసికొనినట్లు వర్ణింపఁబడినది. అంతేగాక బ్రికిటాకృతి యగు క్షేత్రమే

---

[23] "The Pujaris and common people regard it as a Sivalinga and the run as the rope of the Sikya that is carried on the back (by Cowheards)" – Kane, P. V. History of Dharma Sastra, Vol. IV, p. 720.

గాక గుప్తాకృతియగు క్షేత్రము - క్షేత్రజ్ఞునికొఱకు సాధనము చేయఁబడు నట్టి తావు - కలదనియు దానికి ద్వారదేవతలు సంగదేవతలు మున్నగున వన్నియుఁ గలవనియు నీ కావ్యమున వర్ణింపఁబడినది. భీమరథీ తటమునఁ గల పాండురంగ క్షేత్రమును మహాయోగపీఠమని శంకరాచార్యులు ప్రశంసించుటలోఁ గూడ నీ సూచనయే యున్నది. విద్యానగరములోని విట్ఠలాలయ నిర్మాణవ్యూహమున గూడ నీ యాగమ రహస్యము లేమైనఁగలవేమో యని తత్త్వవేత్తలు సాధకులును నగు చారిత్రక పరిశోధకు రెవ్వరైన కృషి చేసి తేల్పవలసియున్నది. దండయాత్రల దుండగములలో జరిగిన విధ్వంసనము నుఁ జాలవరకుఁ బ్రతిఘటించి నిలఁబడిన యాలయములలో విద్యానగరమునకు సంబంధించినంతవఱకు విట్ఠలాలయమే ప్రాముఖ్యము వహించునని యాత్రికులు గమనింపఁగలరు.

పాండురంగ సంప్రదాయము

పాండురంగమూర్తి నారాధించి తరించిన విష్ణుభక్తుల కథలు మహారాష్ట్రమునను గర్ణాటకమునను బెక్కులున్నవి.[24] మహారాష్ట్రభక్తులలో సక్కుబాయి, జ్ఞానేశ్వర, గోరా కుంభారులు, సమర్థ రామదాసు ముఖ్యులు. కర్ణాటులలో గుజ్జారియను భక్తురాలి కథ, పురందరదాసుకథయు ముఖ్యములు. మాధ్వ వైష్ణవ గురుపరంపరలో నీ మూర్తి యర్చన మున్నది. ఉడిపి క్షేత్రమున నున్న శ్రీకృష్ణమూర్తి పాండు రంగఁడని కొందఱూహించుచున్నారు. మధ్వాచార్యులుగాని రామానుజులుగాని యీ దైవతమును పేర్కొనలేదు.

శ్రీ వైష్ణవమున దక్షిణదేశ ప్రసిద్ధమైన యాళ్వారాదుల సంప్రదాయమున గాని, వేదాంత దేశికాదుల సంప్రదాయమునఁ గాని, గురువులు మఠాధిపతుల సంప్రదాయములలోఁ గాని పాండురంగఁడు కనుపింపఁడు. దక్షిణదేశమునఁ గల వైష్ణవ గురువులకును గవులకును రెండుక్షేత్రముల లోని మూర్తు లాధారములు. 1. తిరుపతి వేంకటనాథుఁడు, 2. శ్రీరంగ నాథుఁడు. దక్షిణదేశమున శైవ వైష్ణవాగమములు జైన, బౌద్ధ, మహమ్మదీయములైన యుద్యమముల నుండి వేద సంప్రదాయమును రక్షించి నిలఁబెట్టుటకుఁ బునరుజ్జీవింపఁబడిన సమన్వయ మార్గములని తెలియును. రామకృష్ణకవి వాస్తవముగా వైష్ణవ గ్రంథమును రచింపఁబూనినచో సంప్రదాయసిద్ధములైన వైష్ణవ పుణ్యక్షేత్ర దైవతములలో నొకనినే స్వీకరించి యుండెడివాఁడు. ఆంధ్రదేశమునకుఁ గ్రొత్తదియగు విట్ఠల సంప్రదాయము నేల యాదరించును? దీని కొక కారణ ముండితీరవలెను. ఆ కారణమిది:

---

[24] "Pandharpur is noted for the temple of Vithoba which attracted the saints like Tukarama, Namadeva, etc., from Maharashtra and Purandaradasa, Vijayadasa, Jagannadha dasa, etc., from Karnatak", R. S. Panchamukhi, An Introduction to Haridasa - Sahitya of Karnatak, Srikantia Press, Bangalore - 2, 1953, page 64.

రామకృష్ణుని శైవ వైష్ణవ సంప్రదాయములు వేదమార్గ సంస్థాపన లక్ష్యముగాఁ గలవి. పక్షపాతము, చీలికలు లేక, యంతకుముం దొక మత వర్గమునకు సంబంధించినదిగాఁ బ్రసిద్ధిచెంది యుండక మెలగుచున్న యొక క్షేత్రమును గాని, తీర్థమును గాని, దైవతమును గాని స్వీకరించినప్పుడు మాత్రమే వినూతన సంప్రదాయమునకు దెబ్బతగులకుండ నది దేశమునఁ గ్రామోన్మీలన మొందుట కనుపడును. ప్రతిభావంతుఁడైన యొక నూతన సంప్రదాయ ప్రవర్తకుఁడు తనకు ముందున్న యొక సంప్రదాయము నూఁతగాఁ గొనుటకు యత్నింపఁడు. అట్లు యత్నించినచో నంతకుముందున్న సంప్రదాయమందలి మంచి చెడుగులు తన ప్రతిపాదనపైఁ బ్రభావముచూపి, తన యుద్యమ మంతయు నొక వర్గమునకుఁ జెందిన దగును. వేద సంప్రదాయము కాలక్రమమున వివిధాగమములవారిచే భిన్నశాఖలుగా దర్శింపఁబడి, యనైకమత్యమునకు దారితీయుచున్న కాలమున, మరల వేదమార్గపు టైక్యమును జాతి చైతన్యముగాఁ బునరుజ్జీవింపఁజేయఁదలఁచు వారెల్లరు నంతకుముందున్న భిన్న సంస్కారములలో నొక్కదాని నూఁతగాఁ గొనుటకు యత్నింపరు. వేంగి చాళుక్యుల కాలమున నన్నయ మూలమునను, మనుమసిద్ధి కాలమునఁ దిక్కన మూలమునను, విజయనగర కాలమునఁ గందాళప్పగారు, శఠకోప యతీంద్రులు, భట్టరు చిక్కయాచార్యులు మున్నగువారి యుపదేశమునఁ బెద్దన, రామకృష్ణకవుల మూలమునను సాహిత్య పరముగా నీ వేదమార్గ ప్రతిష్ఠాపనము జరిగినది. వేదత్రయమూర్తులగు పురుషోత్తమ, అంబుజభవ, శ్రీకంధరుల సమగ్ర మూర్త్యారాధనము, హరిహరనాథ దైవత ప్రతిష్ఠ, విట్ఠలనాథ సంప్రదాయ స్థాపనము, పైఁ జెప్పిన మూఁ డుద్యమములకును ప్రబలమైన నిదర్శనములు. ఈ మూఁ డుద్యమములును వారివారి కాలములకు వినూత్నములై సంప్రదాయబద్ధులకుఁ గొంత విప్లవాత్మకముగాఁ గనిపించి యుండవచ్చును. పండితులు కొందరభ్యంతరములు పలికియును నుండవచ్చును. కొన్ని వివాదములును జరిగి యుండవచ్చును. అట్టి వివాదములు ఘోర రణము లయియును, భారతయుద్ధమునఁ బాకశాసనికి నారాయణునట్లుఁ దనకు నారాయణభట్టు తోడ్పడెననియు నన్నయ చెప్పనే చెప్పినాఁడు. ఇకఁ దిక్కన తేజస్సు నెదిరింపఁగలవాఁడు లేక పోయెను. రామకృష్ణుని కాలమున మతసంబంధమైన యవ్యవస్థ మిక్కిలిగా నుండెనని చరిత్ర చెప్పుచున్నది. శైవ వైష్ణవ మతములు నద్వైతవిశిష్టా ద్వైత ద్వైత సంప్రదాయములు కాలక్రమమున భిన్నమతములవలె పొడసూపి రాజుల యాదరణము నూఁతగొని మఠములు, సంఘములుగా నేర్పడినవి. శైవ వైష్ణవాగమములు నా యా భిన్న దైవతమూర్తులు, దేవాలయములు, నాచార్యులు ప్రబలి ప్రజలలో భిన్నత యేర్పడినది. అట్టియెడల వాని నెదుర్కొన యత్నించువారు మరియు భిన్నతనుఁ బ్రబల జేసినవా రగుదురు. కనుక వాని నన్నిటిని సమన్వయించుకొని వచ్చుటకే బుద్ధిమంతుఁడైన కవి యత్నింపవలెను. రామకృష్ణుఁడు శైవ వైష్ణవ శాక్త సమన్వయము చేసి, యందరి యంతర్వాహినియైన వేదమార్గమును బ్రతిష్ఠాపనము చేయుటకు వలసిన సంస్కారమును శైవ వైష్ణవ గురువులవలనఁ బొందెను. వైష్ణవగ్రంథము ఘటికాచల మాహాత్మ్యమును రచించి వైష్ణవుల యాదరమును, శైవగ్రంథమగు నుద్భటారాధ్య చరిత్రమును రచించి శైవుల యాదరమును బొంది తన నూతన మార్గమునకు దారి యేర్పఱచు

కొనినాఁడు. ఇఁక రచింపవలసిన నూతన గ్రంథమందుఁ బ్రతిపాదింపదలచిన దేవతామూర్తిని సంప్రదాయ వైష్ణవమునుండి గాని, సంప్రదాయ శైవమునుండి గాని గైకొన్నచో నతని యత్నమున కానుకూల్యము లేదు. పాండురంగ విఠలుఁడు తత్పూర్వము దాక్షిణాత్య సంప్రదాయ శైవులచేఁగాని, వైష్ణవులచేగాని యారాధింపఁబడినవాఁడు కాఁడు. మాధ్వ సంప్రదాయమున నతఁడు బాలకృష్ణ మూర్తిగాఁ గొందఱాచార్యులచే నారాధింపఁబడినను బూర్తిగా నా సంప్రదాయములోని కొదిగినవాఁడును గాఁడు. అట్టి దేవతామూర్తిని స్వీకరించుటయే రామకృష్ణుని యుద్యమమున కనుకూలమ్ము

పాండురంగమూర్తి స్వరూపము

పురందరదాసు, నామదేవుఁడు మున్నగు దాస సంప్రదాయము వారి రచనలలోఁ బాండురంగని వర్ణన మున్నది. ఈ మూర్తి మహారాష్ట్ర, కర్ణాటక సంప్రదాయములలోకన్న కొంత భిన్నముగా రామకృష్ణుని రచనలో నాంధ్రమున కవతరించినాఁడు. రామకృష్ణుఁడు చేసిన పాండురంగమూర్తి వర్ణనమునకు మూఁడు విధములైన యాధారములు కనిపించును. 1. పురాణసంప్రదాయము, 2. సంస్కృత స్తోత్రకవుల సంప్రదాయము, 3. అర్వాచీనమైన దాసకూటము కవుల సంప్రదాయము. ఈ మూడువిధములైన యాధారములను వివిధ ప్రాంతములయందు వ్యాప్తములైన కథలలోని యంశములను గైకొని రామకృష్ణుఁడు "కడుఁగ్రొత్తగు సొమ్ము" గా దేవకీనందను సత్కథోద్యమమును నవ్య కవిత్వ కళాకలాపమను కుందనమున ఘటింపఁ జేయుట యాంధ్రావళి నోము ఫలము.

పాండురంగ మాహాత్మ్యమున శివుఁడు పార్వతికిని గుమారస్వామికిని బాండురంగ విద్య నుపదేశింపఁబోవుచుఁ బాండురంగమూర్తి నిట్లు మదిఁ దలచెనట :

"వెడఁదకన్నులవాని వెయినామములవాని
 త్రేఁతల వలపించు వెరవు వానిఁ
జిప్పకూఁకటివానిఁ జిన్ని నవ్వులవానిఁ
 జెరివిన మంచి పించియమువానిఁ
బులుగుతత్తడివానిఁ బొడవులఁ దుదవానిఁ
 బొక్కిట వెలిదమ్మి పూవువాని
మినుకు టూర్పులవాని మిసిమిమేఁతలవాని
 మెలుగుఁ జామనిచాయ మేనివాని
దిప్పమొలవానిఁ బసిఁ గాన ద్రిప్పువాని
మురళిగలవాని మువ్వంక మురువువాని
విట్ఠలాధీశుఁ దలఁచి తద్విపుల మహిమ
నుడువుఁ బ్రామఱ్ఱి క్రీనీడ విడిదిప్రోడ" 1-213

ఇందుఁ బాండురంగఁడు దిగంబరుఁడైన బాలకృష్ణుఁడుగా వర్ణింపఁబడినాఁడు. ద్వితీయాశ్వాసమున 33వ పద్యమునుండి 48వ పద్యము వఱకును బౌండరీకునకుఁ బ్రత్యక్షమైన పాండురంగమూర్తి వర్ణన మున్నది. అందును దిగ్వాసుఁడుగనే స్వామి వర్ణింపఁబడినాఁడు. తొడలప్రక్కనుఁ జక్కని పిల్లకండలు దిరిగిన సొగసును, దక్షిణహస్తమున గ్రచ్చకాయల సంచియు, దలపైనొక ప్రక్కఁ దగిలించుకొనిన చలిదియన్నపుఁ జిక్కమును వర్ణింపఁబడినవి. చతుర్థాశ్వాసమున 77వ సంఖ్యగల దండక మున్నది. ఇది పుండరీకుఁడు తనకుఁ బ్రత్యక్షమైన విఠలుని జేసిన వర్ణన. ఇందుఁ గుండలములు, లీలావిభూషణములు, చరణములకుఁ గడియములు, నడుమున మొలత్రాడుగా ముప్పేట తీఁగచుట్టలు, భుజమున నావులను దోలు కట్టియు నెడమచేతిలో శంఖము, నాభియందుఁ గమలము, పాదపీఠముగాఁ జేయఁబడిన విశ్వంభరాపీఠము, భోగిభోగాసనము, పాదమున జక్రచిహ్నములు, పార్శ్వములశ్రీభూనీలలు నుండిరని వర్ణింపఁబడినది. అయినను నతఁ డయిదు సంవత్సరముల వయసు బాలకుని మూర్తిగాఁ బ్రత్యక్షమయ్యెనఁట! చతుర్థాశ్వాసమున 134 పద్యమున విఠలుని లీలలు వర్ణింపఁబడినవి :

"ముప్వంక మురువుతో మురళి యొక్కొకవేళ
    మ్రోయించు భువనైక మోహనముగఁ
గ్రీడించు నొకవేళఁ దోడి బాలురఁగూడి
    యక్షిణగతిఁ గుబేరాక్ష కేళి
నవధరించు నొకవేళ జలవిహారము బాలఁ
    బ్రేమ భీమరథీ గభీర వారిఁ
గొలువుండు నొకవేళ నళిన సంభవ పుండ
    రీకాస్మదాదులు ప్రీతిఁగొలువ
నురగరిపు వాహనమున నొక్కొక్కవేళ
వేడ్కవేంచేసి మెఱయుఁ దిర్వీధులందు
నెన్నికల్పంబు లరిగిన నేనయేండ్ల
వెలయు ప్రాయంబుగల కొయ్యవిఠలయ్య."

చతుర్థాశ్వాసమున 280వ పద్యము నుండి 288వ పద్యమువరకు సుశీల చేసిన పాండురంగ వర్ణన మున్నది. అందు విఠలుఁడు తులసీమాలాలంకృతుఁ డనియు, శ్రీవత్సచిహ్నాంకితుఁడనియుఁ జెప్పబడినది. పురాణ సంప్రదాయమునఁ బాండురంగఁడు తా నొక యిటుకరాతిపై నిలఁబడి పుండరీకునకు దర్శన మొసఁగ వేచి యున్నట్లు వర్ణింపఁబడి యున్నది. మహారాష్ట్ర కవుల సంప్రదాయమునఁ గూడ నిది యున్నది. ఈ అంశమును రామకృష్ణుఁడు వర్ణింపక విడిచినాడు. పాండురంగక్షేత్రమందలి విగ్రహము గూడ నిటుక రాతిపై నిలఁబడి యున్నట్లు చెప్పుదురు. మరియు నీ దేవుఁడు రుక్మిణీ సహితుఁడుగా నితర సంప్రదాయములలో వర్ణింపఁబడినాఁడు. రామకృష్ణుఁ డీ విషయమును గూడఁ బేర్కొనలేదు. శ్రీ భూ నీలా సహితమూర్తినే యితఁడు వర్ణించినాఁడు. ఈ విధముగా రామకృష్ణుఁడు లభించిన సంప్రదాయ వర్ణనముల నాధారముగాఁ గొని తన కల్పనలతో దానిని బూరించి యొక సమగ్రమైన పాండురంగ విఠలమూర్తి నాంధ్రలోకమునకు నొసఁగినాఁడు.

విరలాగమము

పురాణస్తోత్ర సంప్రదాయములలో మంత్రశాస్త్రమునకు సంబంధించిన విరలాగమము కొంతవఱకు మనకు లభించును. ఇంకను నముద్రితములైన గ్రంథములలో సమగ్రముగా నున్నదేమో మనము చెప్పలేము. రామకృష్ణుఁడు స్వతంత్రమైన యొక తంత్రమును విరలమూర్తి పరముగాఁ దన గ్రంథమునఁ బ్రతిష్ఠాపనము చేసినాఁడు. అందు మంత్రము, ఋషి, ఛందస్సు, దేవతయు నొసఁగఁబడినవి. శివుఁడు నారదున కీ పాండురంగ విద్య నుపదేశించిన ఘట్టము, పంచమాశ్వాసమున 113వ పద్యము నుండి 116వ పద్యము వఱకు వర్ణింపఁబడినది. ఈ మహామంత్రమునకుఁ గృష్ణుఁడు ఋషి. మహావిష్ణుఁడు దేవత. వేయిమాఱులు జపించుట నియమము. ధ్రువ స్థితి దీనికి ఫలితము.

"స్వర్ణాద్యం సత్యనామాద్యం షష్ఠవష్ఠం సదీర్ఘకం
షష్ఠం షష్ఠాది సత్యం తం సమారం తం విదుర్బుధాః" —5 - 115

ఈ శ్లోకమున మంత్ర ముద్ధరింపఁబడినది. 'కృష్ణాయనమః' యను వాక్యమునకు ముందు క్లీం అను బీజాక్షరమును జేర్చినచో బాలకృష్ణ మంత్ర మగును. శ్లోకమందలి "సమారం" అను పదమున కుమారు డనఁగా మన్మథుఁడనియు, వానితోఁ గూడినది యనగా మన్మథ బీజమనియు నర్థము. క్లీం అనునది మన్మథబీజము. ఈ పదమునకు సమానమైన దళములు కలది. షడ్దళ స్వాధిష్ఠాన చక్రము కలదియని బులుసువారిచ్చిన వ్యాఖ్య ప్రామాదికము ఈ మంత్రమూర్తితో వెలయు క్షేత్రమూర్తియుఁ దీర్థమూర్తియు మూర్తి మూర్తియు సపరివారముగా నిందుఁ బ్రకట గుప్తాకృతితో వర్ణింపబడినారు ఆ వర్ణన మిట్లున్నది :

1. పాండురంగనికిఁ బశ్చిమ దిక్కున నూఱు విండుల దూరమున శంఖపద్మ నిధు లున్నవి. అందు రావిచెట్టు రూపమున నర నారాయణు లున్నారు. ఆ దిక్కుననే మూఁడు కోటు లమరాంగన లున్నారు. దేవునకుఁ దూర్పుదిక్కున స్వామి కుండలములు శిలలో దాగియున్నవి. అందుఁ గుండల తీర్థ మున్నది. దానికి సమీపమున మంత్రరాజనృసింహమూర్తి యున్నాఁడు. అందే హ్రీంకారముతో నలంకరింపబడి యుత్తర దిక్కున నొక తీర్థ మున్నది. అందు దివ్యకన్యకలు స్నానము చేయుదురు. ఈ విధముగా వివిధ తీర్థములు ప్రకటాకారమున వర్ణింపఁబడినవి. ఇఁక గుప్తాకృతి యైన మంత్రమయ వ్యూహముతోఁ గూడిన క్షేత్రవర్ణనము ద్వితీయాశ్వాసమున 91వ పద్యము నుండి 102వ పద్యము వఱకు వర్ణింపఁబడినది. స్వామికిఁ దూర్పు దిక్కున క్షేత్రపాలకుఁడు ముప్పది రెండక్షరముల మంత్రరాజము కలవాఁడై యున్నాఁడు. ఆ దిక్కుననే దశాక్షర సరస్వతి యున్నది. దక్షిణద్వారమందు షడక్షరీమంత్రసిద్ధుల కధిపతియైన నారదుఁ డున్నాఁడు, ఈ నారదుఁడు మంత్రమయ మూర్తియైన శాశ్వతమూర్తి. శివుని శిష్యుఁడైన నారదుఁడు మంత్రగ్రహణము చేయ సర్వజీవాంతస్థ శిష్య

స్వరూపియగు బ్రహ్మ - దక్షిణద్వారమున సింహము వీపుపై శ్రీచరణము లున్నవఁట! రెండు శ్రీకారములతోఁ గూడిన సింహమంత్రమని యర్థము. పశ్చిమద్వారమున హ్రీంకారస్వరూపిణియగు భువనేశ్వరీదేవి యున్నది. మరల నుత్తరద్వారమున దశాక్షర దుర్గాదేవి యున్నది. ఇట్టి వ్యూహము నడుమ నున్న పాండురంగని శరీరమున వెలుఁగొందు వర్ణరాజి సమస్తము శ్రీమంత్ర రాజమఁట! ఇందు వర్ణరాజి యనగా రంగుల సమూహము. సూర్యాంతర్వ ర్తియగు స్వామి వెలుఁగొందు సూర్యకిరణాంతస్థ వర్ణములు. వానిని బేరే పించునవి మంత్రాక్షరములు. వర్ణ మనఁగా గ్రహమని కూడ శాస్త్ర సంప దాయము. గ్రహాదులును వాని నధిష్ఠించిన రంగులును ధ్వనులును మంత్ర తేజస్సుగా స్వామి శరీరరూపమై వెలయుచున్నవని యర్థము. క్షేత్ర శబ్దము నకు శరీర మని వేదాంతములయందలి నిర్వచనము. సాధకుని శరీరమున మూలాధారాది సహస్రారపద్యంతము రంగులు ధ్వనులు నంతర్లీనములైన శక్తులుగా గ్రహాధిపతుల బీజమూర్తులుగా నుండుననియును సాధకుని యోగా భ్యాసమువలన నుద్బుద్ధములై తేజోమయమూర్తి యగు నంతర్యామిని దర్శనము చేయించుననియును సంప్రదాయజ్ఞులు చెప్పుదురు. పైఁ జెప్పిన స్థానములలో నాజ్ఞాచక్రమునకుఁ గొంచము పైని గల యొక స్వయంప్రకాశక స్థానమును గాశీక్షేత్రమని కాశీఖండము వర్ణించుచున్నది. ఇందు జీవులకుఁ బ్రాణోత్క్రాంతి వేళ శివుఁడు తారకమంత్ర ముపదేశించుచుండును. ఇట గుప్తాకృతిగాఁ బాండు రంగక్షేత్ర వర్ణనమునకును గావ్యారంభమునఁ జేయబడిన కాశీక్షేత్ర వర్ణనము నకును గల సంబంధము గమనింపఁదగినది. ఈ విధముగాఁ బాండురంగ విద్యయను పేర రామకృష్ణునిచేఁ బ్రతిపాదింపఁబడిన మంత్రాగమవిద్యలో నక్షరపంక్తి యంతయు శ్రీమంత్రరాజమఁట! అనగా శ్రీ విద్యా సంప్ర దాయ మనఁబడు జగన్మాతృకాస్వరూపమే ఓంకారోద్భవమైన అకారాది క్షకా రాంత మాతృకా వర్ణ స్వరూపము. ఇది మొదట మూఁడు విధములుగా సూర్యోదయ మనఁబడు కాలమునుండి యుదయము, మధ్యాహ్నము, నస్త మయమునను అహోభాగములుగా సృష్టిలో వ్యక్తమగునట - పాండు.

2-101. ఇవియే సంప్రదాయజ్ఞులు చెప్పునట్టి అకార ఉకార మకారము లు. వీనిని గీర్తించునట్టి జగదుద్భవ, ప్రకాశ, ప్రళయ స్థితులే సృష్టికిఁ బ్రాత ర్మధ్యందిన సాయంసవనములుగ వేదములలోని జ్యోతిష్టోమాది మహా యజ్ఞ ములఁ స్తోత్రము చేయుచున్నవి. ఇది యీ కవి చేసిన శైవ వైష్ణవ శాక్తాత్మక మైన వేదమార్గ ప్రతిష్ఠాపనముయొక్క సమన్వయము.

పాండురంగ మాహాత్మ్య కథ - మూలములు

ప్రబంధములలోఁ బెక్కింటికిఁ గథావస్తువు పురాణములనుండియో ప్రసిద్ధములైన దేశీ యేతి వృత్తములనుండియో గైకొనఁబడి కవి కల్పనము లచే బెంపు చేయఁబడును. రామరాజ భూషణుఁడు చెప్పినట్లు కేవల కల్పనా కథలు కవితారహస్యము లెఱిఁగిన మహాకవుల కెక్కువ యాదరణీయములు కావు. అవి కృత్రిమ రత్నములవంటివి. వేద పురాణేతి హాసములలోని "యాదృచ్ఛికథల్ వార్ధిపుట్టు రత్నములు". ఆ కథలను స్వీకరించి కవి

నూత్న కల్పనా విభూషావహ మొనరించినప్పు డవి "సానలఁదేరిన జాతిరత్నములు" అగుచున్నవి. మనుచరిత్ర కథ మార్కండేయ పురాణమునుండి గైకొనఁబడినది. పారిజాతాపహరణ కథ హరివంశమునుండియు, భాగవతమునుండియుఁ గైకొనఁబడినది. వసుచరిత్ర కథ సూటిగా భారతమునుండియే గ్రహింపఁబడినది. కళాపూర్ణోదయ కథ కవిచేఁ గల్పితమైనను నారద శ్రీకృష్ణాది పాత్రలను దత్సంబంధములైన కొన్ని కొన్ని ఘట్టములను బట్టి కేవల కల్పనా కథ యనుటకు వీలు పడదు. దానిని బురాణ సంప్రదాయబద్ధమైన కల్పనాకథ యనవలెను. ఇట్లే పెక్కు ప్రబంధములు ప్రత్యక్షముగనో పరోక్షముగనో పురాణములతో సంబంధమును గల్గి యున్నవి. ఆముక్తమాల్యద శ్రీకాళహస్తీశ్వరమాహాత్మ్యము. పాండురంగ మాహాత్మ్యము, ఘటికాచల మాహాత్మ్యము మాత్ర మీ విషయమునఁ గొంత భిన్నలక్షణము గల్గియున్నవి. ఇందొక్కొక్క గ్రంథమే కొన్ని కథల సంపుటీకరణము. ఆ కథలలోఁ గొన్ని పురాణగాథలు, తత్సంబంధములు, తద్వాసనావాసితములునై యొప్పును. మఱికొన్ని దేశవ్యాప్తమైన జనశ్రుతి ననుసరించినవి కలవు. ఇట్లే గ్రంథములలోని కథా వస్తువునందుఁ బురాణ దేశీయ వస్తుసమ్మేళనము కాననగును.

పాండురంగ మాహాత్మ్యములోని కృష్ణ కథ సర్వ పురాణప్రసిద్ధము. పుండరీకుని కథ పద్మపురాణమున నున్నది. దానినిఁ గొంత మార్పు చేసి విస్తృతి చేసి రామకృష్ణుఁడు స్వీకరించినాఁడు. జనశ్రుతిగా వచ్చుచున్న పుండరీకుని జీవితగాథయందుఁ గొంత పతిత లక్షణము వినిపించుచున్నది. పుండరీకుఁడు తల్లిదండ్రుల నాదరింపకుండుట, శాపము ననుభవించుట, పరితప్తుఁడై మాతాపితృభక్తియుక్తుఁడై పరమ భాగవతోత్తముఁ డగుట యను ఘట్టము లీ కథ యందున్నవి. తెనుఁగుదేశమందలి భజనలలోను హరికథలలోను, "పుండరీక వరదా గోవిందా' యని విష్ణువును సంబోధించుట కలదు. పరమ భాగవతోత్తముల పరంపరను గూర్చిన "ప్రహ్లాద నారద పరాశర పుండరీక" యను సంప్రదాయ శ్లోకమున నితని పే రున్నది. కొంచెముమార్పుతో శంకరాచార్యులవారు రచించిన శ్లోకమునఁ గూడ నీ పేరున్నది. రామకృష్ణుఁడీ పుండరీకుని కథలోని జనశ్రుత్యంశములను విడిచి పుండరీకునిఁ గేవలము పరమ యోగీంద్రుఁడగు భాగవతోత్తమునిగాఁ జిత్రించినాఁడు. నిగమశర్మ కథ పురాణ సంప్రదాయము ననుసరించి రచింపఁబడినది భాగవతము షష్ఠస్కంధమునందలి యజామిళోపాఖ్యానమువంటి మొదటి పురాణ కథలకు విస్తృతి కల్గించి, కల్పనలతో నింపి మొట్టమొదటగా శ్రీనాథుఁడు గుణనిధిని, సుకుమారుని సృష్టించినాఁడు, రామకృష్ణుఁ డింకను ప్రాముఖ్య మొసఁగి మెఱుఁగులు దిద్ది మదాలసుఁడు, నిగమశర్మ, సుశర్మ యను పాత్రల యుపాఖ్యానములు రచించినాఁడు.

పాండురంగ మాహాత్మ్యమందలి సుశీలోపాఖ్యానము అయుత నియుతల కథ, రాధాదేవి తపస్సు, త్రిదంష్ట్రుని వృత్తాంతము, ముక్తకేశి కథ యను వాని కే పురాణమునఁ గాని మూలములు లేవు. కాకి, హంస, చిలుక మున్నగు సుశీలోపాఖ్యానమందలి కథాఘట్టములకుఁ గూడ మూలము చెప్పటకులేవు. ఇట్టికథలు మాత్రము పురాణములలో నెల్లయెడలఁ గాననగును. కాళహస్తీశ్వర

మాహాత్మ్యములోని యేనుగు, పాము, సాలెపురుఁగు మున్నగువాని కథలు గూడ నిట్లే కల్పింపఁబడినవి. పురాణకథల ననుసరించి యేర్పడిన శైవ, వైష్ణవ సంప్రదాయములలో నీ కథ లన్నియు నుండి యుండవచ్చును. అందుండి యీ కవులు గ్రహించి యుండవచ్చును.

స్థల పురాణములలోఁ బెక్కింటికి స్కాందమునందు మూలకథ యున్నట్లు ప్రతీతి యుండును. పాండురంగ మాహాత్మ్య కథ కూడ స్కాంద పురాణములోనిదే యని యొక యభిప్రాయ మున్నది. నేఁడు లభ్యమగు స్కాందమునందీ కథ లేదు. ప్రబంధమందలి పీఠికలో స్కందపురాణ ప్రశంస యున్నది. విరూతి వేదాద్రిమంత్రి రామకృష్ణకవి నొక ప్రబంధము రచింపుమని కోరుచు నిట్లు పల్కినాఁడు :

"స్కంద పురాణ నీరనిధి కౌస్తుభమై ప్రథవించు దేవకీ
నందను సత్కథోద్యమము నవ్య కవిత్వ కళాకలాపముల్
కుందనమున్ ఘటించి కడుఁ గ్రొత్తగుసొమ్మొనరించి విష్ణు సే
వం దులకించు నప్పరమ వైష్ణవ కోటి నలంకరింపుమా"

—పాండు. 1 - 26

ఇంకను నముద్రితమైన స్కాందపురాణ భాగము మిక్కుటముగా నుండునని కొందఱు నరిపెట్టుచున్నారు. ఆ భాగమునఁ బాండురంగ మాహాత్మ్యమునకు మూలమైన కథాభాగమునుండి యుండవలెను. లేనిచో రామకృష్ణుఁ డీ ప్రశంస చేయుట యెట్లని కొంద ఱాశంసించుచున్నారు.

ఈ యభిప్రాయమునకుఁ దగినట్లు సంస్కృతమునఁ బాండురంగ మాహాత్మ్య గ్రంథ మొకటి లభ్యమైనది. దీని తాళపత్ర ప్రతి యొకటి పూనాలోని భాండార్కరు ప్రాచ్యగ్రంథాలయమందున్నది. ఇదికాక మఱి రెండు వ్రాత ప్రతులను గూర్చి కాణే పండితుఁడు 'History of Dharma Sastra' అను గ్రంథమునఁ బ్రస్తావించినాఁడు.[1] వీనియందుఁ గూడ నీ గ్రంథము పాండురంగ మాహాత్మ్య మనియే యున్నది. వీనిలో నొక్క ప్రతి వాయీ గ్రామవాసియగు పండిత లక్ష్మణశాస్త్రి కడను, రెండవది పండిత ఖాభేర్కర్ కడను దాము చూచినట్లు కాణే మహాశయుఁడు తెలిపియున్నాఁడు. ఈ ప్రతులకును భాండార్కర్ ప్రాచ్య గ్రంథాలయమందున్న ప్రతికిని గల భేదాభేదములను దెలియుట కాధారములు లేవు. గ్రంథాలయ ప్రతి ననుసరించిన వ్రాత ప్రతి యొక్కటి శ్రీ విలుకూరి పాపయ్యశాస్త్రిచే నసమగ్రముగా సాధింపఁబడి కాకినాడ సాహిత్యపరిషద్గ్రంథాలయమున నున్నది. పూనాలోని ప్రతిలో నున్న వివరి భాగము రెండధ్యాయము లిందు గ్రహింపఁబడలేదు. పూనాప్రతికి సంపూర్ణమైన మఱి యొక ప్రతి మదరాసు విశ్వవిద్యాలయ గ్రంథాలయమందున్నది., ఈ గ్రంథము సంస్కృత స్కాంద పురాణాంతర్గతమైన పాండురంగ మాహాత్మ్య ఖండమని కొందఱు నమ్ముచున్నారు. ఈ గ్రంథము వివరి గద్యలో నిట్లున్నది. "ఇతి స్కందపురాణే ఉమామహేశ్వర సంవాదే ఉత్తర సంహితాయాం పాండురంగ మాహాత్మ్యే నవమోఽధ్యాయః".

---

1 చూ. పుట 717 ఎస్.

స్కాంద పద్మ పురాణములలోఁ బాండురంగనిఁ బ్రశంసించుచుఁ గొన్ని శ్లోకము లున్నవి. ఇవే శ్లోకములను కాణే పండితుఁడు గూడఁ దత్తత్పురాణాంతర్గతములని యుదాహరించినాఁడు. ఈ శ్లోక సముచ్చయము పైఁ జెప్పిన పాండురంగ మాహాత్మ్య ప్రతిలో నున్నది. అంత మాత్రమున నీ గ్రంథ మంతయు స్కాంద పురాణాంతర్గత మనుటకు వీలు లేదు. పండితు లెవ్వరు నట్లు నిర్ణయింపలేదు. గ్రంథమందలి రచన గూడ నది పురాణాంతర్గత మనుట కనువుగా లేదు. పురాణములయందలి ప్రసక్తశ్లోకములతోఁ గలిపి భక్తులెవ్వరో పరనార్థమై రచించు కొనిన శ్లోకస్వరూపమైన కథాసంపుటి యిది. ఇది భక్తుల యిండ్లలోఁ బరంపరగాఁ నందింపఁ బడుచుండవచ్చును. గ్రంథాంతగద్య నర్వాచీను లెవ్వరో తమకుఁ గల గౌరవమును బురస్కరించుకొని చేర్చియుండుట సంభవము.

ఈ సంస్కృత ప్రతియందలి కథకును రామకృష్ణుని గ్రంథమందలి కథలోని కొంత భాగమునకును సంబంధ మున్నది. దీనినిఁబట్టి రామకృష్ణుని కావ్యమున కిది మూలమని కొందఱభిప్రాయపడినారు. ఈ మూలమందలి కవిత్వము పేలవమనుట నిస్సందేహము. వ్యాకరణ దోషములు పెక్కులు; పునరుక్తి మున్నగు దోషములు కొల్లలు. పలుకుబడి, జాతీయము, వాక్య నిర్మాణము సంస్కృత భాషాసంప్రదాయము ననుసరించి యుండక పోవుటయే గాక తెనుఁగు ననుసరించియుండుట గూడ స్పష్టముగా గనుపించుచున్నది. రామకృష్ణుని కావ్యమునందలి పద్యములు కొన్నిటికి మూల స్థానముల నున్న శ్లోకములను బరిశీలింపఁగా నీ గ్రంథకర్త తెనుఁగు పద్యము నపార్థము చేసికొని యనువదించెనని నొక్కి చెప్పఁదగిన తావులు పెక్కు గలవు. ఈ యంశమును గూర్చి శ్రీ బులుసు వెంకటరమణయ్య తమ పాండురంగ మాహాత్మ్య పీఠికలో నీ విధముగాఁ దెలిపియున్నారు. "పాండురంగ మాహాత్మ్య మను నొక క్షేత్ర మాహాత్మ్యము గీర్వాణభాషలో గూర్పబడినది కలదు. అది తొమ్మిది యధ్యాయముల చిన్న గ్రంథము. స్కాంద పురాణాంతర్గతమట! . గ్రంథములోని విషయమునుబట్టి చూడ, అయ్యది రామకృష్ణకవి యాంధ్ర ప్రబంధము ననుసరించి వ్రాయబడినట్లు తోచుచున్నది. అయ్యదియే మూలమని ప్రచారము చేసి, తన్మూలమున రామకృష్ణుని ప్రతిభను, శక్తిని కొంచపరచుట కెవ్వరో ఇట్లు మూలమును కల్పించి, అయ్యది ప్రచారము పొందునట్లు చేసి యుండవలెను. .. ఆంధ్రపాండురంగ మాహాత్మ్యమున గల నిగమశర్మో పాఖ్యానము, రాధికావృత్తాంతము, సుశీల మున్నగు వారి కథలు, సుశర్మో పాఖ్యానము, అయుత నియుతుల వృత్తాంతమును సంస్కృతమున లేవు. మిగిలిన వృత్తాంతములు సంగ్రహముగఁ జూపబడినవి.

ఆంధ్ర ప్రబంధమునగల పదములు సంస్కృతమూలమున గానవచ్చుచున్నవి. కాని దానింబట్టి సంస్కృత మూలమున కిది యనువాదమనుట యుక్తిదూరము. ఆంధ్రమందు "తద్ఘోరతాడన వేగంబున భగ్నమయ్యెఁగడి వేల్లత్ క్షుల్లకాశిక్యమున్" – పుట. 331 – అని యుండగా దానిని సరిగా

అర్థము చేసికొనక మూలమున క్షులుకానాంచ శిక్యంచ భగ్నమద్యావిదృశ్యతే" అని కూర్చబడినది. ఇట్టివి చాల గలవు".

– పాండురంగమాహాత్మ్యపీఠిక. వావిళ్లవారి ప్రతి, ప్రకటితము 1962, పుటలు. 14,15,16.

రామకృష్ణుని గ్రంథమే సంస్కృత గ్రంథములోని పెక్కుభాగములకు మూలమై యుండుట సంభావ్యము. సంస్కృత గ్రంథమున నిగమశర్మో పాఖ్యానము లేదని బులుసు వారు తెలిపినారు ఇది సరి కాదు. ఆ కథయిందు సంగ్రహముగాఁ గూర్పఁబడినది. నిగమశర్మయను పేరు మాత్రము లేదు. షష్ఠాధ్యాయమున నీ కథకు సంబంధించిన శ్లోకములు :

"భ్రంసితోమధు మాంసాద్యైః వృషలోఽభూద్ద్విజోత్తమః
తతస్త్యక్త్వా స్వకర్మాణి వృషలీసంగతో ద్విజః
సురామాంసాదిభిర్భోజ్యైః తాంపుపోషదిసేదినే
తతః కాలేన నష్టానోఽపిచా మతః
చండాలీం బుభుచేమత్తః తస్యామజనయత్ సుతాన్
లాలయన్ సుతదారాంస్తాన్ నష్టపూర్వద్విజోఽధమః
ఏకదా సంగతోఽరణ్యమ్ మాంసార్థీ శ్యేనయుగ్మయుక్
ఇతస్తతోమహారణ్యే విహత్య శశలావజాన్
దివనాన్తే భృశంశాన్తః నామిషో గృహమగామః
తావదగ్ని గృహం తస్య సపుత్రం సపరిగ్రహమ్
దదా హక్షణ మాత్రేణ సదారం కామమోహితః
తం దృష్ట్వా మహదాశ్చర్యమ్ శోకేనాకలితేక్షణః
రురోద బాష్పపూరేణలాలితోదుః ఖితోఽపతత్
సంప్రాప్య సౌంజ్ఞాం కృష్ణేన నియమ్యాత్మానమాత్మనా
తావన్నభోక్ష్యే నపిబేయావద్యామి స్వకాన్ శిశూన్
ఇత్యుక్త్వా నిర్గతో బ్రహ్మన్ నిర్జనం కాననం ఖలః
కాలేన గతవాం స్తత్ర యత్రాస్తే నృహరీపరః
తీర్థే తస్మిన్ సంగమాఖ్యేస్నాత్వాదృష్ట్వ నృకేసరీ
ఉపవాస కృతో దీనః పపాత చ మమార చ
యమేన ప్రేషితా దూతాస్తంబబంధూ రుషాన్వితాః
చుక్రోశ వేదనాయా స్వహ తాడిత స్తర్జితోథ తైః
శ్రుతం తన్మహదాశ్చర్యం శ్రీహరిణాద్భుత కర్మణా
రక్షార్థం స్థాపితం తేన సుదర్శన ముపాద్రవత్
ప్రళయానలసంకాశం విచ్ఛేదాస్యచ బంధనమ్
దద్రువు ర్యమదూతాశ్చ తేజ సాతస్య ధర్షితాః
తదా హరేః సమీపస్థాః శంఖచక్రాసిపాణయః
విమానం దివ్యమారుహ్య నిన్యుస్తే హరిమందిరమ్
చతుర్భుజోర విందాభః పద్మమాలీమహాద్యుతిః
అద్యాపి భాయతే బ్రహ్మన్ కుముదోనామ పార్షదః"

ఇందలి 'మహదాశ్చర్యము', విమానమెక్కించియనుటకు 'ఆరుహ్య' యని ప్రయోగించుట మున్నగు వ్యాకరణ దోషములను సంస్కృత కవులలోఁ జిల్లరకవులు గూడ చేయరు. కనుక నీ గ్రంథము పురాణాంతర్గత మనుటకన్న హాస్యాస్పద మైన విషయ ముండదు. "గ్రంథములోని విషయమునుబట్టి చూడ అయ్యది రామకృష్ణకవి యాంధ్ర ప్రబంధము ననుసరించి వ్రాయబడినట్లు తోచుచున్నది" యని బులుసువారు చెప్పిన విషయమే సత్యమనిపించును. కాని "అయ్యదియే మూలమని ప్రచారము చేసి, తన్మూలమున రామకృష్ణుని ప్రతిభను, శక్తిని కొంచె పరచుట కెవ్వరో యిట్లు మూలమును కల్పించి, అయ్యది ప్రచారము పొందునట్లు చేసి యుండవలెను" అని బులుసువారు చేసిన యూహ నిరాధారము. ఈ సంస్కృత గ్రంథమే మూలమని యెవ్వరును ప్రచారము చేయను లేదు; చేయుటయు సాధ్యము కాదు. ఈ చిల్లర గ్రంథమువలన రామకృష్ణుని ప్రతిభ, శక్తి కొంచెపడుట యసంభవము. చక్కని యాంధ్రగ్రంథమున కనువాదముగా నెవ్వరేని సంస్కృత శ్లోకములను భక్త్యాదరములతో రచించుకొనుట దోష మెన్నడును గాదు. రామకృష్ణకవిపై భక్తి తాత్పర్యములు గల సాధుజనుఁడగు నప్రౌఢ కవి యొకఁడు కొన్ని శ్లోకములను రచించి, స్కంద పద్మపురాణాంతర్గతములైన పాండురంగ విట్ఠల ప్రశంసలను, మఱి కొన్ని స్తోత్రములలోని శ్లోకములను వానితోఁ బొందుపరచి యీ గ్రంథమును రూపొందించుకొని పూజా పుస్తకముగా నుపయోగించుకొని యుండవచ్చును. తత్సంప్రదాయావలంబకులు కొందఱు దానికిఁ బ్రతులను దీసికొని యుండవచ్చును. భాష సంస్కృతము గనుక ప్రాంతీయ కక్ష్యలను దాటి యుత్తర దక్షిణ దేశములలోని పాండురంగ భక్తుల యిండ్లలో నిది లభ్యము కావచ్చును. గ్రంథము దైవ విషయము కనుక స్తోత్రముగాఁ జదువుకొనుటకు సంస్కృతమున కనువదించుకొను ప్రయత్నము నెవ్వరో చేసియుందురు. శ్లోకములలో నెచ్చటను స్కందపురాణ మను పేరుగాని, వ్యాసప్రణీత మను ప్రశంసగాని లేదు. కాణేపండితుఁడు గూడ దీని నొక ప్రత్యేక గ్రంథముగాఁ బేర్కొనెనే గాని పురాణాంతర్గతమను సూచన గూడ చేయలేదు. ఇఁకఁ గొన్ని ప్రతులలో లభ్యమైన గ్రంథాంత గద్య గ్రంథకర్తృ ప్రణీత మనుట కాధారము లేదు. రామకృష్ణుని పద్యములోని స్కందపురాణ శబ్దమును జూచి ఈ శ్లోక సంపుటి స్కంద పురాణములోనిదై యుండునని పొరపడినవారెవ్వరో యీ గద్యను భావి పాఠకుల స్పష్టతను, సదుపాయము నాశించి రచించి యుందురు. కావున యీ సంస్కృత గ్రంథమును గూర్చి యే పెద్ద విషయము నూహింప నవశ్యము కాదు.

కాఁగా నిఁక రామకృష్ణుఁడు చెప్పిన స్కంద పురాణ నీరనిధికి గతియేమి? ఇది యంతయు రామకృష్ణుని వికట కవిత్వ విజృంభణమున జరిగిన యింద్ర జాలము. పాండురంగ మాహాత్మ్యములోని గ్రంథస్థమగు నితర విషయమును బరిశీలింపఁగా నితని కథ స్కందపురాణములోనిది కాదని యితఁడే వివరించి చెప్పినాఁడు.

ప్రథమాశ్వాసమున నగస్త్యాది ఋషులందఱుఁ గుమారస్వామినిఁ జూచుటకు సామిమలకుఁ బోయిరి. స్వామి తాను రచించిన స్కంద పురాణమును వారికి వినిపించెను.

"తద్విరచిత మహాస్కాంద గ్రంథసందర్భంబునం బూర్వ
భాగంబు విని తదాశయావబోధ సుధాదునీ వినిమ
జ్జనంబునం గాశీ వియోగజనిత క్లేశంబుఁ దీసివైచి యందలి
యుత్తరభాగంబున తీర్థప్రవర్తనములు స్వామి వినిపించె
వింధ్య సంస్తంభదయితకు" —పాండు. 1 – 147, 148.

"ఆ కుంభజుతో మఱి యుం
గేకి ధ్వజుఁ డనియె . ..
"తీర్థ విశేష శ్రవణముతఱిఁ జెవికిం జవియొసఁగెనే విశిష్టవిచారా ?"
—పాండు. 1 – 149 నుండి 151 వఱకు

"అనుడు వగస్త్యుఁ డిట్లనియె...... సమస్తము గ్రిందుచేసి మించిన బలు
వేల్పుఁ దీర్థమును క్షేత్రమును నొక్కెడఁ గూడి యుండెనేని
నిరుపమాదృతిన్ దెలిపి నీవు మమున్ గరుణింపఁగాదగున్"
—పాండు. 1 – 152

"అని పలుకు... ప్రశ్న ... విని పురభిత్తనయుఁడు ..
గనఁజాలమికిన్" —పాండు. 1 – 153

"ఆ యాశ్రమ విశ్రాంతులను గూర్చి యిట్లనియె...మచ్చేతో
గతిఁ దోపదు ..హరుచేత నెఱుఁగవలయు" — 154, 155, 156

కుమారస్వామి శివుని దర్శించినప్పు డిట్లు పలికెను :

"నా పేర స్కాందంబునాఁదగు నొక్క పురాణము......రచించి యి
మ్మునీంద్రులకెల్ల నెఱిఁగింప......... విని .... యెఱిఁగింపుఁ డనిన
..............నీ వలన .... వినుటకై .... .: వచ్చితిమి"
— 1 – 206, 208, 209

నారదుఁడు దివ్యదృష్టితో నిట్లూహించెను :

"స్వకృత స్కాందోక్తియం దావహిల్లిన సందేహముఁ దండ్రిచేఁ
దెలియఁ..........గొంచనగోద్యదియు వచ్చె" — 2 – 180

శివుడు నారదునితో నిట్లు చెప్పెను :

"వినసుపన్ స్కందపురాణ మమ్మునులకున్ వ్యాఖ్యానముం జేయ

మున్‌జని వారల్ శ్రుతితీర్థులై యదియ కాంక్షన్ వేగఁడ
దా గానమిన్ వచ్చి ....మౌని సమన్వితముగా నెఱిఁగి
. ...యరిగె" —2 – 215, 216

"ఈ సముదగ్రతత్త్వపద మే నొకరుండ నెఱుంగుదున్ సరోజాసనుఁడు, నద్రిత
నూజ, వాసవుఁడు .... సరస్వతి......... మనువు...... శేషుఁడు...
గరుడండును బ్రాగ్వాసనమై నెఱుంగుదురు" — 2 – 220

"ఈ పురావృత్తంబు తిరావృత్తంబుగా నుత్తమశ్లోకుండగు కృష్ణద్వైపాయను వలన మున్నెఱింగిన యది ...." — 1 - 98

పై నుదహరింపఁబడిన గ్రంథస్థ వాక్యముల ననుసరించి యీ దిగువ విషయములు స్పష్టమగుచున్నవి.

1. ఈ గ్రంథమందలి తిరావృత్తమగు పాండురంగ విట్ఠలతత్త్వము సూతునిచే శౌనకాదిమునులకుఁ జెప్పఁబడినది.

2. అందు వ్యాసప్రోక్తమని యున్నది.

3. కుమారస్వామి యగస్త్యాదులకు స్కాందమును వినిపించినట్లున్నది.

4. కుమారస్వామి స్కందపురాణము వినిపించుట సమాప్తమైన వెనుకఁ దిరావృత్తము యొక్క పరిప్రశ్నము కల్గినది.

5. దానికి లక్ష్యము పాండురంగతత్త్వమను సంశము ఋషులకుఁ గాని కుమారస్వామికిఁ గాని తెలియదు. మొట్టమొదటగా శివుఁడే దానినిఁగూర్చి కుమారస్వామికిని, ఋషులకును, బార్వతికిని, రెండవమాఱుగా నారదునకును దెల్పెను.

ఈ యంశములనుబట్టి కుమారస్వామియే యెఱుఁగని పాండురంగ మాహాత్మ్యము కుమారస్వామి రచించిన పురాణమున నెట్లుండును ? ఈ కావ్యమందు స్కందుఁడు రచించినట్లు కవి కల్పించిన పురాణమే గ్రంథ పీఠికలోని స్కందపురాణ నీరనిధి. ఈ గ్రంథమునకు హృదయస్థానమున శ్వేతద్వీప వైకుంఠ వృత్తాంతములును, నారాయణుఁడు కృష్ణుఁడుగా నవతరించుటయు, రాధ తపస్సును నారదునకుఁ బరమేశ్వరునిచే నుపదేశింపఁబడినవి. నారదుఁడు వ్యాసునకు దేవకీనందను సత్కథోద్యమమైన భాగవతకథ నుపదేశించుట భాగవత ప్రసిద్ధము. ఈ సంప్రదాయమును బురస్కరించుకొని పురాణములన్నియుఁ దొలుతఁ దత్త్వదేవతాతత్త్వముచేఁ బ్రకాశితము లనియు, నటుపైని పరంపరగా లోకమునకు వచ్చిన వనియు సూచించుచు స్కందపురాణము కుమారస్వామి ప్రణీతమని యొక చమత్కారమైన కల్పన చేసెను. రామకృష్ణుఁడు పీఠికయందుఁ జేసిన స్కందపురాణ ప్రశంస కావ్య కథాగతమైన స్కందప్రణీతమైన పురాణముయొక్క ప్రశంసయే !

సముద్రమునఁ గౌస్తుభము మొదటినుండియు సిద్ధమైయుండదు. ఈ కథలో స్కందపురాణ మొక నీరనిధి కాగా ఋషుల సంప్రశ్నమువలన నీ నీరనిధిని మథించుట జరిగినది. తత్ఫలితముగఁ గౌస్తుభమణి – అపూర్వమైనది – సముద్రమున నుద్భవించినట్లు, శివుని ప్రసాదమువలన దేవకీనందను సత్కథోద్యమము తిరావృత్తమయిన పాండురంగవిట్ఠల తత్త్వముగా నావిర్భవించినది. ఇది యంతయుఁ దన కల్పనయే యని సూచించుచు రామకృష్ణుఁడు "కడుఁ గ్రొత్తగు సొమ్మొనరించి విష్ణుసేవం దులకించు పరమ వైష్ణవకోటి"గా నిందలి పాత్రలను దీర్చి దిద్దినాఁడు.

రామకృష్ణుఁడు స్వతంత్రమైన యొక పురాణ రచనా ప్రణాళికను సంప్రదాయానుసారముగాఁ గల్పించి తన గ్రంథమునఁ బ్రతిష్ఠించినాఁడు. దానికిఁ బురాణత్వమును మాత్రమే యాపాదించినచోఁ గావ్యత్వమునకుఁ బ్రాధాన్యము వచ్చుట యెట్లు ? కనుకనే "నవ్యకవిత్వ కళాకలాపమన్ కుందనమున్ ఘటించి" నాఁడు. ఈ నూతన ప్రయత్నమునే పద్యమందలి నవ్యశబ్దము సూచించుచున్నది. ఆద్య సత్కథ యగు దేవకీనందను సత్కథోద్యమము నీ విధముగా నూతన కల్పనా విభూషావహ మొనర్చుట యితని యసమాన ప్రతిభ నుగ్గడించుచున్నది. కావ్యకథా వస్తువు నిట్లే స్వీకరింపవలెనను రామరాజభూషణుని సాహిత్య సూత్రము నితఁడు పాటించుట యా కవిపై నితనికిఁ గల గౌరవమును వెలిబుచ్చుటయే యగును. సమకాలికుఁడైన ప్రబంధకవి రామరాజభూషణుని యెడల నితనికిఁ బ్రత్యేకాదర మున్నటు లితని గ్రంథములోని "గిరికానుషక్తబుద్ధి" యను శ్లేషపద్యమే నిదర్శనము. తదనుసారియైన నూత్న కల్పనా విభూషణమే యితని స్కందపురాణ నీరనిధి.

పాండురంగమాహాత్మ్యము – పాఠభేదములు

నిర్దుష్టములైన పాఠములను నిర్ణయించి నిర్దిష్టము చేయుట యుక్తివైచిత్రి ప్రధానముగాఁ గల ప్రౌఢతర కావ్యములకుఁ జూపవలసిన పూజ్యభావ చిహ్నములలో మొదటిది. ఒక గ్రంథమునకుఁ జక్కని పాఠ నిర్ణయము చేయఁబడిన పిమ్మటనే సహృదయులగు పాఠకులకు గ్రంథకర్తచే నుద్దిష్టమైన యంశము సమగ్రముగా లభ్యమగును. ఉక్తి వైచిత్రికిఁ, గల్పనకు, రసపోషణమునకును బ్రాధాన్య మొసఁగి రచింపఁబడిన కావ్యములలో నపపాఠములున్నచోఁ గావ్యాంగముల మూలముల నుద్దేశింపఁబడిన యాహ్లాదము చదువరులకుఁ జేకూరకుండుటయే గాక, తత్కావ్యాత్మయగు ధ్వనికి మూకత్వము సంభవించును. మహాకవుల రచనలలోఁ బ్రధాన వస్తువు ధ్వనిమూలకముగనే స్థాపితమగును. ఆ ధ్వని పెక్కు తావులందు శబ్దార్థ ప్రయోగ సందర్భ వైఖరినిఁ బురస్కరించుకొని యుత్పన్నమగును. అట్టిచోఁ బ్రయోగింపఁబడిన శబ్దమున కపవాదమున్నచోఁ బ్రయత్నమంతయు వ్యర్థమేకదా !

ఆంధ్రప్రబంధములన్నియు సుకుమారమైన యుక్తివైచిత్రినిఁ బ్రధానాంగముగాఁ గలిగియున్న ఎనుటలో సందేహము లేదు. పాండురంగ మాహాత్మ్యము శబ్దార్థ పుష్టిగల కతిపయ ప్రౌఢమహాప్రబంధములలో నొకటి. దీనికిఁ బాఠనిర్ణయము చేయుటెంతేని యావశ్యకము. ఈ ప్రయత్న మింతకు ముందే యథాసంభవముగా జరిగినది. నేఁటివఱకుఁ బ్రధానముగా నాలుఁగు విధములైన ముద్రితప్రతులు వెలువడినవి.

ఇప్పుడు మనకు లభించు ఆ గ్రంథ ముద్రణములు నాలుఁగు :

1. 1887 కొమాండూరి అనంతాచార్యులవారిచే పరిష్కరింపబడి తెన్మరం వెంకట నరసింహాచార్యులుగారిచే లఘుటీకతోడ చెన్నపురి వసురత్నాకర ముద్రాయంత్రము నందు ముద్రింపబడినది.

2. దాని యనుముద్రణమే తెన్మఠము శ్రీరంగాచార్యులచే 'పరిష్కరింప బడి' పాఠటీకతో కొన్ని చిరు మార్పులతో మద్రాసులో ఆరుమారులు ముద్రిత మైనది.

3. 1913లో తణుకు సౌదామినీ ముద్రాక్షరశాలయందు అచ్చువేసినది మూలమాత్రము.

4. శ్రీ బులుసు వెంకటరమణయ్యగారి క్రొత్తటీకతో వావిళ్లవారు 1952 లో ప్రకటించినది. ఇవిగాక తిరుపతి ప్రాచ్య పుస్తక భాండారమందలి తాటాకుల ప్రతియొకటి, అక్కడిదే కాగితముల వ్రాతప్రతి యొకటి, గద్వాల సంస్థానపు పుస్తకాలయములోని తాటాకులప్రతి యొక్కటి, ఆంధ్ర సాహిత్య పరిషత్తుది మొదటి యాశ్వాసము మాత్రము గల తాళపత్రగ్రంథ మొకటి :[1]

ఇందు మొదటి రెండును బండిత లోకావలోకన పాత్రములు. అయినను వీనియందును పాఠములు పరస్పరము భేదించుచున్నవి. రెండింటిలో బులుసు వారి ప్రతిమేల్తరము. తెన్మఠము వారి ప్రతి "అయిదు కూర్పులు పొందినది. తొలికూర్పున నే రీతి నున్నదో చివరి కూర్పునను అట్లే యున్నది. గ్రంథమున గల పద్యములలో సగమునకుఁబైగా అపపాఠములతోఁ గూడి యుండుటచే సమన్వయము కుదురకున్నది. టీకయు నట్టి మూలము ననుసరించియే వ్రాయఁ బడుటవలన దానివలనఁ గవిహృదయము నెఱుఁగుట కవకాశము లేకున్నది."

"మూలమునఁ దప్పులు చాల ఉన్నందున తొలుత మూలమును సంస్కరించినఁగాని టీక వ్రాయుట అసాధ్యమని వారును అంగీకరించిరి. పిదప శ్రీ సుబ్బరామయ్యగారి సాయముననే ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము లోని మూఁడు వ్రాత ప్రతులతో ముద్రిత ప్రతిని సరిపోల్చి పాఠములు సేకరించితిని" — పిదపఁ జెన్నపురికి వచ్చి వ్రాతప్రతులలోని పాఠములను సంప్రతించుచు మూలమును సంస్కరించి శుద్ధప్రతిని వ్రాయఁ దొరకొంటిని. ఈ విషయమున క – చ – ట – త అను ప్రతులలోని పాఠములను, ఆయా సందర్భముల ననుసరించి గ్రహించి, పాఠాంతరముల నధస్సూచికయందు ఇచ్చితిని. ఇందు క. గుర్తు గలది శ్రీ తెన్మఠమువారు ప్రకటించిన ముద్రిత ప్రతి, మిగిలినవి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునందలి వ్రాతప్రతులు"

—గ్రంథ పరిచయము, బులుసు వెంకటరమణయ్య, పుటలు, 34, 35

వాస్తవముగా బులుసువారి ప్రయత్నము కడుంగడు ప్రశంసనీయము. వీరు చేసిన కృషి యే ప్రతులపై నాధారపడియున్నదో యట్టి 'క – చ – ట – త' ల వివరములను దెలిపి యుండినచో భావి పరిశోధకులకు సమస్యలు సరళము గాఁ బరిష్కరింపఁబడి, వీరి కృషి యెల్లరకు మార్గదర్శకమై యుండెడిది. మఱియు బులుసువారు పరిష్కరించి వేసిన ప్రచురణమునఁ గల పాఠములలోఁ గొన్ని చిక్కులు కాన్పించుచున్నవి. "తెన్మఠంవారి ప్రతిలో అపపాఠములు

1. పాండురంగ మాహాత్మ్యములోని అపపాఠములు – శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ – సాహితి, మార్చి, 1963.

విస్తారముగా నున్నవనియు వారి టీక సరియైనది కా దనియు బులుసువారు తమ పీఠికలో వ్రాసినారు. కాని ఆ లోపములు వీరి ప్రతిలో లేకపోలేదు. విరివిగానే యున్నవి.... .... రెండు ప్రతులలోను ఛందస్సు చెడిన పాఠములు కొన్ని యున్నవి."[1]

ఈ పాఠభేదములను గూర్చి శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రి. శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మయుఁ దమ వ్యాసములలో సహేతుకముగా విమర్శించి కొన్ని పాఠములను సప్రమాణముగ నిర్దుష్టముగా స్థిరపరచుటకు యత్నించినారు. అవి యీ దిగువ విధమున నున్నవి :

1. "కిలుకొన వ్రాయసంబులు వ్రాయ వ్రాయ"
— 1 - 72 - బులుసు
"కిలుకొన రాయనంబులు వ్రాయవ్రాయ" — రాళ్లపల్లి
"కిలుకొన వ్రాయసంబుల వ్రాలు వ్రాయ" — దీపాల

2. "వన్నెల వన్నెల సంచి నిండియింపలరారన్
— 2 - 37 - బులుసు
.... నిండి నింపులువారన్" — రాళ్లపల్లి
"యతి తప్పినది. సరియైన పాఠము లభింపలేదు" — దీపాల

3. "అశ్రీతార్థము లర్థ్యమతినిఁ" గూఁకలు వెట్టు క్రియమయూరంబులు కేరలి వలుక" — 2 - 218 - బులుసు
"ఆశ్రితార్థములు ర్థ్యమూర్తి (గూఁకలు వెట్టుక్రియ . ..." లేక
"ఆశ్రితార్థములర్థ్యమూర్తి........." — రాళ్లపల్లి
"యతిలేదు - ...." —దీపాల

4. "దక్కనె .... విశిష్టజనంబులు"
— 2 - 184 - బులుసు
"విక్కనె ....విశిష్టజనంబులు" — రాళ్లపల్లి
"విక్కనె........." — దీపాల

5. "పైఁ గురిసు ముంచు తువ్వర వానల"
— 4 - 10 - బులుసు
"పైనిగుడు.........." — రాళ్లపల్లి
"పైనిగుడు............" — దీపాల

6. "నిమ్ననాభియుఁ ద్రివళివాల్లిత జఠరము"
— 4 - 64 - బులుసు
" ....త్రివళి వర్ణిత జఠరము" — రాళ్లపల్లి
దీపాలవారు పాఠనిర్ణయము చేయలేదు

---

[1] శ్రీ దీపాలపిచ్చయ్యశాస్త్రి "పాండురంగ మాహాత్మ్యములోని ఛందో భంగ పాఠములు — సాహితి, జనవరి 1963.

7. "క్షణముక్షణార్థంబైనఁ ద్రిక్షణలలితంబగు"

— 4 – 133 – బులుసు

" ....క్షణార్థమైనఁదీక్షణ........." — రాళ్లపల్లి

"క్షణము క్షణార్థంబేందేక్షణలలితంబగు" — దీపాల

"ఇందు దీక్షణ దీక్షచేత, దీక్షణము లను రూపమును చరిత్రాది గణమున చేర్చి మువర్ణమునకు వైకల్పిత లోపము చేసికొనవచ్చును. త్రిక్షణలను పాఠమునకు ఆ క్షేత్రమున విష్ణునకు మూడు కన్నులు గలవనుట అను టీక అవిచారితము. విష్ణుమూర్తులలో ఒక నృసింహమూర్తికి మాత్రమే సూర్యచంద్రాగ్ని మయములైన మూడు కన్నులు గలవు" అని రాళ్లపల్లివారు వివరించినారు.

8. "హరిదంతచేలంబు నవనీత చోరము"

— 4 – 187 – బులుసు

"....... .... నవనీతలోలము" — రాళ్లపల్లి

"..........నవనీత లోలము" — దీపాల

9. "మొదలు నడమును గడయు నేర్పడని వాని" – 5 – 174 అను పాఠమును ప్రధానముగా స్వీకరించి బులుసువారు "కడయు నడుమును మొదలు నేర్పడని వాని" యను పాఠమునధస్సూచికలోఁ జేర్చిరి. మొదటి పాఠమున యతిభంగమును రాళ్లపల్లి, దీపాలవారు చూపగాఁ దరువాతి ముద్రణమున బులుసువారు తదనుగుణముగా మార్చినారు.

10. "కటిచేలార్థము చుట్టి చిక్కనది మేనంజుట్టి"

— 4 – 234 – బులుసు

"....... .... వేగంజుట్టి" — రాళ్లపల్లి

"—... .. .. వేగంజుట్టి" — దీపాల

11. "విందుదన తొడుగు మణిమయకుండల" — 3 – 66 – బులుసు

"విండుదన ...." — రాళ్లపల్లి

"విండుదన .. .. " — దీపాల

12. "మాయావృతుఁడగు నాత్మని
సోయగమునఁ దెగడు తీఁగ సొగలు ముచ్చు
త్రైయునికి సంగరహితం
బయ్యేన్ గాకున్న జఘన మభిరామముగన్"

— 2 – 34. తెన్మరము

ఆఅవకూర్పులో "సంగరహితం" బైనదీ పాఠము. తణుకు ప్రతిలో".......సోయగమును దెగడు...... సంగరహితంబాయెన్" అని యున్నది. ఇందు ఛందోభంగము తప్పినది, కాని పద్యార్థమును గాని పూర్వోత్తర పద్యములలో సంగతినిగాని పరిష్కర్తలు గమనింపలేదు. దీని పాఠనిర్ణయమును గూర్చి రాళ్లపల్లివారు, దీపాలవారు సుదీర్ఘములైన చర్చలు చేసినారు. రాళ్లపల్లివా రిట్లు నిర్ణయించినారు :

"మాయావృతుఁడగు నాత్మని
సోయగమునఁ దెగడ తీఁగ సోగలు ముచ్చ
ట్టైయునికి సంగరహితం
బైయున్ గాకున్న జఘన మభిరామముగన్"

దీపాలవారు నీ పాఠమునే గ్రహించినారు.

వీ రుదాహరణప్రాయముగఁ జూపిన యీ పాఠములే గాక మఱియుఁ బెక్కు తావులలో సందేహములున్నవి. ఈ సందేహములు తీరుటకు లభించి నంతవఱకు లిఖిత ప్రతులన్నియుఁ బోల్చి చూచుట జరిగినది. మఱికొన్ని మేలైన పాఠములు లభించినవి. ఈ సందర్భమునఁ దంజావూరు శరభోజీ సరస్వతీమహలు గ్రంథాలయములోని వ్రాఁతప్రతులు – తాళపత్రములు – ముఖ్యముగా నుపయోగపడినవి. అవి రెండు – 1959 సంవత్సరపు గ్రంథ పట్టికలోని 181 సంఖ్య గల ప్రతులు. అందొక్కటి సమగ్రము. రెండవది యసమగ్రము. రెండును శిథిలావస్థలో నున్నవి. అసమగ్రప్రతి మఱియు శిథిలము, అందు "శ్రీకాంతామణి . అని యారంభించి "విప్రచరితములు" అని యంతమగు చున్నది. అపపాఠములు. స్ఖాలిత్యములును బెక్కులున్నవి. అయినను ముద్రిత ప్రతులలోని పాఠములను గూర్చిన కొన్ని సమస్యలు తీరినవి. వాని వివరము లీ దిగువ నొసఁగఁబడినవి.

1. ఆశ్వా. 1, ప, 4. "శరత్కాదంబినీ చంద్రికా జిద్భ్రాపాంచిత" బులుసు. అధస్సూచికలో "విద్భ్రాపాంచిత యను పాఠమే యర్థపుష్టి గలది.– వెన్నెలను జయించు రూప మనుటకన్న వెన్నెలవలెఁ బ్రకాశించు జ్ఞాన స్వరూప మనుటయే సరస్వతీ వర్ణనమున నుచితము.

2. ఆశ్వా. 1, ప. 5. "ఈ విగురాకు నీ ప్రసవము" —బులుసు
"ఈ విగురాకు లీ ప్రసవము" తం.ప్ర. (తంజావూరు ప్రతులు)

రెండవ పాఠము సమంజసము. శివుని జడ లుపమేయము కనుక బహువచ నము యుక్తము.

3. ఆశ్వా. 1. పద్య. 6. "......మోవిమోవినిడి" —బులుసు
"..... మోముమోవినిడి" —తం. ప్ర.

రెండవ పాఠ ముచితము, మోవి యనఁగాఁ జిలుకముక్కని బులుసువారు చెప్పిన యర్థము యుక్తము కాదు "మోము మోవినిడి" యను పాఠమునఁ జిలుక మొగమునఁ దన పెదవితో ముద్దిడుకొనుచు నను నర్థము యుక్తము.

4. ఆశ్వా. 1. ప. 7. మూఁడవ పాదమునందు.
" . ...సుమనోహరములైన దివ్యాయుధములతోడ" —బులుసు
"......సుమనోరథములైన ...."—అధస్సూచిక —బులుసు
"......వేతనాదరములౌ దివ్యాయుధములతోడ" —తం. ప్ర.

చేతనాదరములౌ నను పాఠ మర్థపుష్టి గలది. ఆయుధములు సుమనోహరములు – చక్కనై మనోహరములైనవి, పుష్పములను హరించునవి, దేవతలను హరించునవి యను నర్థ మొప్పదు. సచేతనములై పనియేమి యని యాదరముతో విన్నపము చేయుట విష్వక్సేనుని యాయుధములకుఁ గల విశేషముగాఁ జెప్పఁబడినది. దీనికి భాగవతమున

"యద్వైకాత్మ్యానుభావేన వికల్పరహితః స్వయమ్
భూషణాయుధ లింగాఖ్యా ధత్తేశక్తీః స్వమాయయా"

— భాగవతము, 6 – 8 – 32

యను నారాయణ కవచమందలి వర్ణనము మూలమై యుండవచ్చును. నిగమశర్మోపాఖ్యానమున —

"అమరద్రోహి విరోధి మున్నచట రక్షార్థంబుగానిద్ధ చ
క్రము విక్రాంతి వహించి భాస్కరసహస్రక్రూరమై వచ్చి ...."

— 3 – 107

అని చక్రాయుధము చేతనాదరముగా వర్ణింపఁబడినది.

5. ఆశ్వా. 1. ప. 9. నాల్గవ పాదమున —
"... . .. కీర్తి వైభవమున గీలు కొలిపి" — బులుసు
".........కీర్తి వైభవకేళిఁగీలు గొలిపి" — తం. ప్ర.

రెండవపాఠమునందు శయ్యయున్నది.

6. ఆశ్వా. 1. ప. 11. "......ఇట్టాడరాని" బులుసు
......"మిట్టాడరాని" — తం. ప్ర.

మొదటి పాఠమునకు "చెప్పుటకు శక్యముగాని" యను టీకకన్న రెండవ పాఠములోని మెదలుటకు వీలువడని యను పాఠ మర్థపుష్టియు, జాతీయత కలది. "బ్రహ్మయు నోరు మెదల్పలేని" - 3 – 151 వంటిది.

7 1 – 12. "నేర్పు మీరంగ" —బులుసు
"నేర్పు మెఱయంగ" —తం. ప్ర.

కావ్యదర్పణములను రూపకమునకు రెండవ పాఠము యుక్తము.

8. 1 -12. వ్యాస వాల్మీకి ముఖసూక్తి వైభవముల
నేర్పు మీఱంగ నిజకావ్య దర్పణముల
సరసమానసముల నేఱుపఱచుకీర్తి
ధవుల నన్నయ భట్టాది కవులఁదలఁతు" —బులుసు

మూఁడవ పాదమున "బాలబోధకముగ నేఱుపఱచు" అని తం. ప్ర. బులుసువారి పాఠమున రేఫ శకట రేఫములకుఁ బ్రాసయతి యున్నది. తంజావూరు ప్రతి పాఠమున నా దోషము లేకుండుటయే గాక యర్థపుష్టి యున్నది. గ్రంథములను

దెనిఁగించుట సరసమానసముల కొఱకే గాదు. సంస్కృతమును జదువలేని బాలకులకును బోధపడుట కొఱకు. నన్నయాదుల కాలమున బాలురు కాని సరసమానసముల వారిలో నెక్కువ మంది సంస్కృత నిష్ణాతులే.

9. 1 – 14. "సరసకవితా వశోక్తుల" —బులుసు
"సరసకవితాశయోక్తుల" —తం. ప్ర.

రెండవ పాదము సందర్భమునకుఁ దగియున్నది.

10. 1 – 15. కానదోషాత్ములైన దుష్కవులకతన" —బులుసు
"కఠినదోషాత్ములైన ......" —తం. ప్ర.

రెండవ పాఠ మర్థవంతము. కఠినులు, దోషాత్ములు నని యొక యర్థము. వాక్కునందును, రచనయందును గఠినత గలవారు, కావ్యములందును. జీవితము లందును దోషములు గలవారని యొక యర్థము. ఆత్మయుఁ గవితాత్మయు దోషదూషితములైన వారు దుష్కవులని యితని మతము కావచ్చును. కవిత్వము రచించుట సాధ్యమైనను నాత్మశుద్ధి లేని వాఁడు దుష్కవియే యను భావము పొడకట్టును. కనుకనే "కవి రాజు కావ్యమహిమ" యనుచో మహిమాశబ్దము కూడ రెండు విధములుగా నన్వయించును. కావ్యమువలనఁ గలుగు కీర్తి దుష్కీర్తులుగాక మంచి చెడ్డ సంస్కారములు వెన్నెల, చీఁకటిగా నుపమింపఁ బడినవి. మఱియొకమాట. పై పద్యములో నీ పద్యమున కెట్టి కార్యకారణభావము లేదు. కాన యని పద్య మారంభింపఁబడుట సార్థకము గాదు.

11. 1 – 17. "ఇక్కావ్య కళాకలాప మీరేడుటకున్" —బులుసు
"ఇక్కావ్య కథాకలాప ......" —తం. ప్ర.

రెండవపాఠ ముచితము. "శ్రీ భాగవత చరిత్రము" అని కవి పేర్కొనిన యీ గ్రంథమున కథలయొక్క కలాపమనుట సమంజసము. కావ్యగుణము లెంత యున్నను గథకొఱకే యీ గ్రంథరచన జరిగినది. దేవకీనందనుని సత్క థోద్యమ మిది. కనుకనే వ్యాసవాల్మీకి నన్నయాది పురాణకవులు మాత్రమే గ్రంథారంభమున స్మరింపబడిరి.

12. 1 – 22. "నను రామ కృష్ణకవి...
యర్ధాసనమునఁ గూర్చుండఁబనిచి ..." —బులుసు
"
....
యర్ఘ్యాసనమున ...." —తం. ప్ర.

రెండవ పాఠము సమంజసమనుట స్పష్టము.

13 1 – 25. " ....నా పేర నుడువు పరతత్త్వనిధీ" —బులుసు
" .. , ...పరత్త్వనిధీ" —తం. ప్ర.

కావ్యము పరతత్త్వ ప్రతిపాదకము. రెండవ పాఠమే సరియైనది.

14. 1 – 35. ".. .. ఒప్పును నేర్పును నెన్నశక్యమే" —బులుసు
"......ఓర్పును నేర్పును నెన్నశక్యమే" —తం. ప్ర.

రెండవ పాదమున సందర్భము ననుసరించిన సార్థకత, శయ్యాసౌందర్యము గలవు.

15. 1 – 50. నాల్గవ పాదము.
"......వాసవతుల్యుఁడు రాఘవయ్యయున్"
—బులుసు
"—...వాసవకల్పుఁడు రాఘవయ్యయున్"
—తం. ప్ర.

రెండవ పాదము రమ్యతరము.

16. 1 – 52. మూఁడవ పాదము.
"వలపింపఁగా నేర్పు వాలారుఁ జూపుల
కోపులు చూపు చకోరదృశల" —బులుసు
"...... ....
కొప్పులు చూపు చకోరదృశల" —తం. ప్ర.

రెండవ పాదమును బులుసువా రథసూచికలో నిచ్చినారు. అదియే సరసమైనది. వరదయ్య చూపులకుఁ జకోరదృశలు చూపులకోపులు – అందములు – చూపు దురనఁగా లజ్జావిహీనలగుదురు. కొప్పులు చూపుదురనఁగాఁ గేశ బంధములను బ్రదర్శించెదరనియు, సిగ్గుచే జడ కనిపించునటులు శిరస్సు వంచుదురనియు నర్థము. ఇది కామశాస్త్ర సంప్రదాయమునకును ననుకూలము.

17. 1 – 64. రెండవ పాదమున
"........భానునుపమం జూపట్టు" —బులుసు
".........భానుసుషమం జూపట్టు" —తం. ప్ర.

18. 1 – 70. నాల్గవ పాదము.
"... . బంధుజనంబు ప్రియంబుసేయఁగన్"
—బులుసు
".......బంధుజయంబు .. .. .." —తం. ప్ర.

శక్తియు, సిద్ధియు వరుసఁగా జయంబు, ప్రియంబు సేయునని యర్థము పొసఁగును.

19. 1 – 73. మొదటిపాదమున.
"చేతులు ద్రిప్పుచున్ బ్రభల చెంతల నూరక దుర్వినీతులై"
—బులుసు
"చేతులు ద్రిప్పుచున్ గతలు చెప్పుచు నూరక .... " —తం ప్ర.

కతలు చెప్పుట యనఁగా ఁగల్పించి కొండెములు పల్కుట.

(02) 9.01

20. 1 – 73. రెండవ పాదమున.
"... ఇప్పటి మంత్రులు తంత్రులిం....." —బులుసు
" .....ఇప్పటి మంత్రుల తంత్రులిం . .." —తం. ప్ర.

మొదటి పాదమునకుఁ దంత్రు లనఁగా యోధులని సంచర్పింపని యర్థము చెప్పుటకన్న రెండవ పాదమును స్వీకరించి మంత్రుల వాద్యములకుఁ దంత్రికలు – చేతిలోఁ గీలుబొమ్మలు – అని చెప్పుట యుచితము.

21. 1 – 88. నాల్గవ పాదమున.
"సుగంధిల భువనత్రయునకు" —బులుసు
"సంగంధిత...... " —తం. ప్ర.

22. 1 – 98. "...అఖిలంబులకు వచ్చునట్లుగా" —బులుసు
"........మీ యంతరంగంబులకు వచ్చునట్లుగా"
—తం. ప్ర.

23. 1 – 100. నాల్గవ పాదమున
"డాలొందింపుఁ బరాసులన్......" బులుసు
" .. .... బరాశులన్........." తం. ప్ర.

రెండవ పారమునకు బరతత్త్వమునం దాశ కలవారు, పరతత్త్వము దిక్కు మొగమైనవారు నని యర్థము. ఈ పద్యమున మునుల హృదయములందు విశ్వనాథుఁడు చేయు భ్రమరకీట న్యాయము వర్ణింపఁబడినది. కాశిలో మునులు మోక్షమునకై చనిపోనక్కర లేదు. దీని తరువాతి పద్యమునఁ జెప్పఁబడినది పరాసుల విషయము.

24. 1 – 107. మూఁడవ పాదము.
"పచ్చ బంగారుకువ్వలు ..." —బులుసు.
"పచ్చి బంగారుకుప్పలు .. . " —తం. ప్ర.

బంగారమునకుఁ బచ్చఁదనము చెప్పుట వ్యర్థమైన పునరుక్తి. అచ్చమైన, సిసలైన యను నర్థమునఁ బచ్చియను విశేషణము వాడఁబడినది. ఇది తెలుఁగున వ్యవహారమునఁ గలదు.

ఉదా. : పచ్చిదొంగ, పచ్చివేదాంతము.

25. 1 – 119. రెండవ పాదమున.
...చెక్కులదూరిన చూర్ణకుంతలావళి" —బులుసు
"....చిక్కుల దూరిన చూర్ణ......" —తం. ప్ర.

రెండవ పాదము రతాంతస్థితిని సూచించును.

26. 1 – 129. రెండవ పాదము.
"ప్రబలనిర్యాన సౌరభతర్పితమదాళి" — బులుసు
"...... ⋮ సౌరభదర్పితమదాళి" —తం. ప్ర.

27. 1-131. ఎత్తుగీతి మొదటి పాదము.
"భసలకలభకులాకృష్ట . ." —బులుసు
" . కులోత్సృష్ట.. " —తం. ప్ర.

భసల కలభములు తపోవనమందలివి గనుక వైరాగ్యమున కుపలక్షకములు. కనుక మకరంద మయమైన మావిమోక వానిచే త్సృనుష్టమనుట తగును.

28. 1-136. మొదటి పాదము.
"పద్మినీ పద్మాతపత్రంబు.. " —బులుసు
"పద్మినీ పత్రాత పత్రంబు .. " —తం. ప్ర.

పద్మముకన్న పద్మపత్రమే గొడుగగుట యెక్కువ సమంజసము.

29. 1-190. మూఁడవ పాదము.
" భూతపతిన్ బతి మెచ్చఁజేసె" —బులుసు
" భూతపతిన్ మతి మెచ్చఁజేసె" —తం.ప్ర.

30. 2-34. బులుసువా రిచ్చిన పాదమున కన్వయము గాని. యర్థ పుష్టి గాని లేదు. ఈ పాఠమును దీని టీకను దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు. రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు దోష భూయిష్ఠమని నిరూపించినారు.[1] ఈ పద్యమునకుఁ దంజావూరు ప్రతిలోఁగల పాఠము పిచ్చయ్యశాస్త్రిగా రూహించిన రీతిగనే యున్నది.

"నంగరహితంబయ్యెన్ గాకున్న జఘన మభిరామమగున్"
—బులుసు
"సంగరహితంబైయున్ గాకున్న జఘన మభిరామముగన్"
—తం. ప్ర.

31. 2-35. రెండవ పాదము.
"ఇట బలిసద్మంబునుండు నిరవులనియనన్" —బులుసు
"... .... నిరవుతెలియనన్" —తం. ప్ర.
"... ...... నిరవులివియనన్" "

ఇందు మూఁడవ పాదము బాగుగ నున్నది.

32. 2-37. నాల్గవ పాదము.
"వన్నెల వన్నెల సంచినిండి" —బులుసు
"వన్నెల వెన్నెల నంచినిండి" —తం.ప్ర.

రెండవ పాఠమునఁ బునరుక్తి లేకుండుటయే గాక తెల్లని కాంతులను జిమ్ము నంచియను నర్థము పొనఁగు చున్నది.

---

[1] కృష్ణాపత్రిక వజ్రోత్సవ సంచిక, సాహితి. జనవరి 1963, మార్చి 1963.

33 2–70. రెండవ పాదము.
"...జిగుర్నగుమోవి మెఱుంగుఁజెక్కులున్" —బులుసు
"... జిగిన్నగుమోవి .. " —తం. ప్ర.

మూఁడవ పాదమున

"వలమరి యఱు .. " —బులుసు
"వలమురి యఱు .... " —తం. ప్ర

34. 2–71. రెండవ పాదము.
"...పెన్వెలుఁగు వెంబడివిం జనువాని ....." —బులుసు
"..... ... వెంబడి నింబగు వాని" —తం. ప్ర.

35. 2–80.
"కంబుకంధరునకు" —బులుసు
"కంబుధరునకు" —తం. ప్ర.

36. 2–85. మొదటి పాదము
"దొరకు జన్మమునకుఁ బరమ భైషజ్యమౌ" —బులుసు
"జరకు జన్మమునకు... . " —తం ప్ర.

రెండవ పారము మోక్షార్థ స్ఫోరకము. మొదటి పారము వ్యర్థపద యుక్తము.

37. 2–87. మూఁడవ పాదము.
".. కలధౌతాహార్యవర్యాత్మక" —బులుసు
" . వర్యాత్మక" —తం. ప్ర.

రెండవపార మర్థవంతము.

38. 2–88. మొదటి పాదము.
"ప్రావారాజినరాజిఁగంబళతతిన్..." —బులుసు
"......... . నంబరతతిన్ ..." —తం.ప్ర.

రెండవ పారమునధస్సూచికలోఁ జూడఁదగును.

39. 2–131. ఎత్తుగీతి రెండు మూఁడు పాదములలో.
"............ .... నీవ
నంబరపు ముక్తకేశి వినఖిలభూష
ణాంవితాంగివినై ... . " —బులుసు
"... ... .నీవ
నంబరయ ముక్తకేశియు నఖిలభూష
ణాంచి తాంగియునై ...." —తం. ప్ర.

రెండవ పారము బాగున్నది. మనస్సునకు బంధము తీరుట, సద్గుణములను. భూషణములు సమకూరుట యిందు వర్ణింపఁబడినది.

49. 2–178, మొదటి పాదము.

"... . . నిభేంద్రతటోత్కట దానధారలై" —బులుసు

...........కటోత్కట............" —తం. ప్ర.

దానధార లేనుగుల కటములనుండి వచ్చును గాని తటములనుండి కాదు.

41. 2-180. మొదటి పాదము.

"..... ....ఈ కాసూధరుండీమునుల్"

—బులుసు

" . ... ఈకాశోద్భవుండీమునుల్"

—తం. ప్ర.

ఇందు రెండవపాఠమును స్వీకరించి మొదటిపాఠము నధస్సూచికలోఁ జూపఁదగును.

42. 2–193. రెండుమూఁడు పాదములు,

" . ...గేళి

భ్రమగతిఁగప్పినాఁ డనఁగ......" —బులుసు

"..... ....గేళి

భ్రమరతిఁగట్టినాఁ రనఁగ" —తం, ప్ర.

రెండవపాఠము నధస్సూచికలోఁ జూపఁదగును.

43. 2–204. మొదటి పాదము.

"కారిఁవవడఁ జరిగింపుదు —బులుసు

"కారిచ్చవడి చరింపుదు" —తం. ప్ర.

44. 2–234. మూఁడు నాలుగు పాదములు.

" . ...రాజీవరాజీ

వసచ్చక్షూరమ్యులుగా —బులుసు

" .. .. రాజీవరాజీ

హసచ్చక్షూరమ్యులుగా......." —తం. ప్ర.

రెండవ పాఠమునఁ బద్మములను జూచి నవ్వునట్టి కన్నులుగలవారని యర్థము వచ్చును.

45. 3–54. నాల్గవ పాదము,

"......జనిరి చెట్టు కొకరుఁడై" —బులుసు

"..............వెట్టొకరుండై" —తం. ప్ర.

రెండవ పాఠమును బులుసువార ధస్సూచికలోఁ జూపినారు. అదియే కవితానుకూలము, వ్యాకరణసమ్మతమునగు పాఠము.

46. 3–74. నాల్గవపాదము.

"విట్టిబొట్టు ధరించి రిట్టునట్టు" —బులుసు

"విట్టు బొట్టు ధరించి... ..." —తం. ప్ర.

విట్టు బొట్టు పదమునకుఁ గొన్ని ప్రాంతములలో మంగళసూత్ర మను నర్థ మున్నది.

47. 3–76.

"ధ్వనివరీతంబగుట" —బులుసు

"ధ్వనివరితంబగుట" —తం. ప్ర.

రెండవపారము నథస్సూచికలోఁ జూపవలెను.

48. 3–80. మూఁడవ పాదము.

"......బొమ్మను పెండ్లాడెడు వడువున" —బులుసు

"..... గొమ్మడు పెండ్లాడె... " —తం. ప్ర.

49. 3–107, నాల్గవ పాదము.

".... శిఖిసన్నాహంబుదిగ్గ్రాహిగన్" —బులుసు

"................... దిగ్గాహిగన్" —తం. ప్ర.

రెండవ పారము నథస్సూచికలోఁ జూపవలెను.

50. 3–110 మొదటిపాదము.

" . .. లాశాంత ఘర్మాంబువయ్యోమేను" —బులుసు

".........లావాంత . ..." —తం. ప్ర.

గరుడుని ఱెక్కల గాలికి నిగమశర్మమేని ఘర్మాంబువులు దిగంతములకు పోయిన వనుటకన్న హరించుకొనిపోయిన వనుట యుక్తము,

51. 4–56. నాల్గవ పాదము.

"కర్మైకసాక్షిబూ నిర్మలుండు" —బులుసు

"శర్మైక................" —తం. ప్ర.

52. 4–61, నాల్గవ పాదము.

".........చరితార్థుఁడ నీవు చతుర్థ సంపదన్" —బులుసు

"... . ..విదతుర్థ సంపదన్" —తం. ప్ర.

53. 4–148. రెండవ పాదము.

"సుఖమజ్జన కలనగాఁగఁ —బులుసు

"ముఖ..................." —తం. ప్ర.

54. 4–193. నాల్గవ పాదము.

" ....మదీయ మౌళితటిఁ గుచలికుచా"

—బులుసు

"...... .....గుటిలకచా" —తం. ప్ర.

పాండురంగఁడు సుశీలను సంబోధించు సందర్భమున మొదటిపాఠము అసంగతము, తుచ్ఛము ; రెండవపాఠము ప్రశంసనీయము. దీనివలన సుశీల శిరసు వంచి నమస్కారాదులను జేయుట సూచింపఁబడును.

55. 5–83 ఎత్తుగీతి మూఁడు నాల్గు పాదములు.

"........... నప్ర
పన్నదైన్యలతాదాత్ర..... ..." —బులుసు

"... .... ఓప్ర
పన్న దైన్యలతాదాత్ర........" —తం. ప్ర.

56, 5–225. రెండవ పాదము.

"..... ......గాంచనలతామతల్లులంచున్"

—బులుసు

"... ....మత్తాళులంచున్" —తం. ప్ర.

ఇట్లు లభించిన పాఠములలో నూటికిఁ దొంబదిపాళ్లు తంజావూరు ప్రతిలోని పాఠములే సమంజసములుగా నున్నవి. ఇంకను దాళపత్రములు లభించినచో మఱికొన్ని పాఠములు సవరించి కవి హృదయము నెక్కువగా గ్రహించుట కనుకూలమగును.

పాండురంగ విజయుని పదగుంఫనము

"పాండురంగ విజయు పదగుంఫనంబును
- గాకమానురాయ నీక తగుర"

ఈ పద్యమును గూర్చి వింతలైన కథలు పుట్టినవి. వాని కాధార మున్నట్లు కనుపించదు. మూర్తికవి పాంచాలీ పరిణయమున నీ యాభాణకము పెద్దన, తిమ్మనలను గీర్తించుటతోపాటు పద్యరూపము దాల్చినది. రామకృష్ణుని నామస్మరణము చేసిన ప్రతి యాంధ్రుఁడును దీనిని స్మరించును. ఇందలి పదగుంఫన మీతని కవిత్వమున నొక ప్రత్యేక లక్షణముగాఁ జెప్పఁబడుచుండును. అందుఁ గొంత విశిష్టమైన సత్య మున్నది. కవితా లక్షణములలో నెక్కడను లాక్షణికులచే పదగుంఫనము పరిగణింపఁబడినట్లు గనుపట్టదు. కాని స్థూలముగా దీనికొక స్వరూపము నేర్పాటు చేసికొనవచ్చును.

పదములను గుంఫించుట కవు లెల్లరును విశిష్టతతో నొనర్చునట్టి పనియే. శబ్ద ప్రయోగ వైచిత్రియే కొంతవఱ కిది కావచ్చును. పదముల నొప్పుగా సందర్భించుట రీతియని వామనుఁడు లక్షణము నేర్పరచినాఁడు. రీతియే కావ్యమున కాత్మయని యతని మతము. "పొసఁగ ముత్తెపు సరుల్ పోహళించిన రీతిఁ దనులోన దొరయు శబ్దములఁ గూర్చి" యని పింగళి సూరన కళాపూర్ణోదయమునఁ గవిత్వ రచనను వర్ణించుచుఁ జెప్పిన దీ యంశమునే యనవచ్చును. "సత్కవి కవిత్వంబునుఁ బోలియు నసాధు వర్ణ సంబాధ బంధురంబు" — పాండు. 3 - 76 నని రామకృష్ణకవియే వర్ణప్రయోగ వైచిత్రినిఁ గూర్చి వ్యాఖ్యానించుటయు దీనికి సంబంధించియే యున్నది. అసాధువర్ణములను సంబాధించుట యనఁగాఁ గూడని వర్ణములను బరిహరించుట. సందర్భమున కుచితములు కాని వర్ణములయుఁ బదములయు బ్రయోగమును రామకృష్ణకవి మెచ్చఁడు. దీనినిఁబట్టి సందర్భోచితమైన త్రివిధ వ్యాపార శబ్దములను గుంఫించుటయే పదగుంఫనమని యర్థము సిద్ధించును.

వర్ణింపఁబడు వస్తువు స్వభావము ననుసరించి పదముల ప్రయోగము జరుగుట పదగుంఫనమని సిద్ధాంతము. దీని కితని కావ్యమగు పాండురంగ మాహాత్మ్యమునఁ గల ప్రతి పద్యము నొక యుదాహరణమే యనుటలో నతిశయోక్తి లేదు. అయినను నీ లక్షణమునకుఁ బ్రత్యేక స్ఫూర్తి గల తావులను గొన్నిటినిఁ బరిశీలింపనగును.

1. "సంహృతాంహస్స్ఫూర్తి సింహాసనుండు నృ
సింహవిక్రముఁడు నృసింహశౌరి" — 1 - 42

ఇట్లే,

"మద్రేశ నిభసమున్నిద్రశౌర్యోద్రేక
విద్యావిశారి వేదాద్రి శౌరి" — 1 - 69

అను పద్యములలోని శబ్దాలంకారాంతర్గతమైన శిల్పధర్మము పరిశీలనార్హము వరుసగా నీ యుదాహరణములలోని బిందు పూర్వక హకారములు, హ్రస్వ పూర్వక 'ద్ర' కారములు వర్ణ్యవస్తువులోని వీరరసమును బెంపుచేయుచున్నవి. ఈ పద్యములలోని నాలుఁగు పాదములలో భిన్న రసభావములకు సంబంధించిన వర్ణన లున్నవి. దాని ననుసరించి పదసందర్భముయొక్క ప్రకృతి కావలెనని మార్పు చేయఁబడినది. పైనుదాహరించిన పాదముల పదగుంఫనకును మూఁడవ పాదముల పదగుంఫనకును సంబంధము లేదు.

"గంగాతరంగ సారంగ లాంఛన దీప్తిఁ
బొంగు కీర్తికిరాజు రంగరాజు" — 1 - 42

"శరశరచ్చంద్రికా హలహారహిమ హీర
కరకీర్తివరశయ్య తిరుమలయ్య" — 1 - 69

కీర్తికినిఁ దరంగములకు ననుగుణమైన పదప్రయోగముకొఱ కిందు మార్పు కల్గినను బద్యములలోని సమత చెడలేదు.

2. వర్ణ్యవస్తువున గాంభీర్యమును గౌరవమును సూచించు నప్పటి యక్షర సన్నివేశము, పద సమాస ఘటనము, ప్రాసయుఁ దదనుగుణముగా నుండుట కుదాహరణము.

"తత్తాదృగ్విభవ ప్రభావనిధిఁ గందాళప్పగారిన్ దయా
యత్త స్వాంతు నితాంతశాంతియుతు లోకాచార్యవర్యున్.. ..."
— 1 - 38

ఇందలి తకారద్విత్వము దీర్ఘాక్షరయుత సమాస ఘటనము కందాళప్పగారి ఘనతను గాంభీర్యమును ప్రాభవ విస్తృతిని సూచించును.

3. హోమధూమాగ్రములపై నటనలు నేర్చిన వాయువులను వర్ణించుచు నా వాయువులు తిరిగిన మెలపులను భంగిమలను దీప్పుచు పదములను గుంఫించిన యుదాహరణము.

"నిర్ధూత పాతకములు హ
విర్ధూమలతాగ్ర లాస్యవిలసన శిక్షా
ధూర్ధరములు నిజభజన వి
వర్ధిత సుకృతంబు లివటి వాయువు లబలా" — 1 - 132

ఇందలి ప్రాసలోని సంయుక్తము, నిడుదలు కుఱుచలు నగు సమాసములోని విఱుపు, సుకృతంబు అనుచో నాకే బిందువు, వాయువులబలా అను దీర్ఘములతోడి పద్యాంతము సూటిగా ధూమాగ్ర వాయువులవలెనే తిరిగినది.

4. "జరరస్థజలము నాసానాళమునఁబీల్చి
సామజం బిరువ్రక్కఁ జల్లుకొనియె" — 1 - 136

ఇందలి పూర్వార్థమున నేనుఁగు చేయు ప్రయత్నము చదువరుల యుచ్చారణమున జరుగును.

5. రచనలో శయ్యాసౌభాగ్యము నాపాదించు సూక్ష్మములు కొన్ని యున్నవి. వర్ణములను గాని వర్ణ సముదాయములను గాని యావృత్తము చేయుట యొక మార్గము. అది ప్రయత్నపూర్వకమై పద్య మాసాంతముగ వర్తింపినచోఁ గేవల శబ్దాలంకార వైఖరినిఁ బొంది కావ్యమున నప్రధానమైన శోభను మాత్రమే గల్గించును. అట్లుగాక యప్రయత్నమైన యావృత్తి యితని రచనలో సిద్ధించును. పోతన రచనలో నప్రయత్నముగా సిద్ధించు ననుప్రాసము కన్న భిన్నమైన యొక వర్ణ సందర్భవ్యావృత్తి యితని రచనలో నెల్లెడలఁ బొడకట్టును. కుంతకుఁడు స్థాపించిన వక్రోక్తి సిద్ధాంతమందొక యంగమైన వర్ణ విన్యాస వక్రత యిదియే.

ఉదా. :

1. "గతిమధ్య స్తన కుంతల స్తబక వీక్షాగర్వ దుర్వార యా
సతిచే మానమె యానమయ్యె నిఁక నిస్సారంపుఁ బ్రాణంబు..."
—1-86

2. "కుతుకంబింకక కుంకుమద్రవ మిళద్గోరోచనాపంక ని
ర్మిత వక్త్రాంక కలంకి తాంబుధి కుమారీహారి వక్షోరుహ
ద్వితయా స్ఫాలన లాలనోచిత వయో విస్ఫారి కాసార నం
తతినా నీడ భవంబు క్రీడ సలుపున్ దద్దివ్యధామంబునన్"
—4-219

3. "ఈ విధమైన యయ్యధము హీనవుమేనపు డెక్కెఁ గాక ఘూ
కావలి దావకీలలగు నల్కలు ముంగల మొల్కలెత్త దం
తావల జాలనీలమగు దండధరాను చరాగ్రణీ బలం
బావలఁ ద్రోవలాఁచి వెస యాతనవుం దను వాఁగి రేగఁగన్"
—3-104

మున్నగునవి యనేకములు గలవు. స్తన కుంతలస్తబక, గర్వదుర్వార, మానమె యానమయ్యె. సారంపుఁ బ్రాణంబు అను తావులందుఁ గడపటిదగు సారంపుఁ బ్రాణంబు అనునదియే యిట్టి శోభ కెక్కువ దోహదము సేయును. తక్కినవి గూడ నీ విధమైనవే. రెండవ యుదాహరణములోని క్రమవిరహితమైన బిందు పూర్వకాక్షరముల యప్రయత్నావృత్తియు కుమారీహారి, స్ఫాలనలాలనోచిత, విస్ఫారి కాసార, నీడభవంబుక్రీడ, దద్దివ్యధామంబునన్ అను తావులం దీ గుణ మున్నది. మూఁడవ యుదాహరణమున విధము...యధము, హీనవు. కాకఘూక, కావలి దావకీల, నల్కలు . మొల్కలు, తావలజాలనీల, ధరానుచరాగ్ర, బావలఁ ద్రోవలాఁచి, యాతనవుం దనువాఁగిరేగగన్" అను తావులందున్నది. ఒక్కొక్క పద్యము మొత్తమునఁ గల క్రమవిరహితము, నప్రతీక్షితమునగు వర్ణావృత్తి లోని యప్రయత్నసిద్ధియే యీ పదగుంఫనమును శబ్దాలంకారానుగుణమగు ప్రయత్న పూర్వకావృత్తి నుండి వేఱు చేయుచు, గుణవతియగు కావ్య సుందరికి "అప్రయత్న పయోధరాంబరంబు" వంటి యుదాత్త సౌజన్యమును జేకూర్చును. కేవల శబ్దాలంకారమున కీశోభ లేమి నీ దిగువ యుదాహరణమువలనఁ గాన నగును.

"వనితా చూచితె మాల్యవంతము ప్రభావంతంబు నానామణీ
జనకోదంచిత సానుకాంతము మరుత్సంపూర్ణ చంద్రాననా
జనకేళీ వదచంద్రకాంతము నభస్సంబాధ కృత్కూట వ
ర్ధన దుర్దాంతము సర్వపర్వత కథా ప్రాగ్వర్తితోదంతమున్"
—1-130

6. వర్ణ్యవస్తువునందలి ప్రత్యేకతనో యుదాత్తతనో తెలియఁజేయుటకుఁ బదములలోని యజ్ఝల్ విన్యాసమును గొంచెము మార్చుజేసి పారకు నాకర్షింపవచ్చు.

ఉదా. :

"వాసోనిగ్రహ మెన్న రాకలియు నీర్వట్టున్ గణింప ర్తలల్
మాసెంగా యన......" —5 – 171

నీర్వట్టున్ గణింపర్తలల్ అను ప్రయోగము లయునితయుతుల వేదాధ్యయన తీవ్రతను దెలియఁ జేయును.

"పోర్మహిషున్ నిజాంఘ్రిఁగల బొట్టన వ్రేల్తుద మట్టిపట్టి..." —5 – 25 ఇందు దుర్గ మహిషాసురుని మట్టి చంపిన పోరితీవ్రత పోర్మహిషున్ అను ప్రయోగమునను, దత్ప్రాసమందలి కఠినతయందును వ్యక్తమగును. ఇట్టిదే 'వ్రేల్తుద' ప్రయోగము గూడ. ఇట్లే 'నిర్వేదయు' —1 – 101. 'బోర్తలుపు' — 2–36, యెడ్మబరి – 2 – 103, కొన్గినిపి – కొన్ని గినిపి – 4 – 147 మున్నగు ప్రయోగములును.

7. ఇతని పదగుంఫనమునందలి మిక్కిలి యందమైన యంశము పదనిర్మాణవైచిత్రి. ఇది మిక్కిలి యాశ్చర్యావహమగు కవితావైశిష్ట్యము. అర్థవైచిత్రిలోఁ గొన్ని మెలువులను గల్పించి తచ్చమత్కృతిచే సహృదయుల దృష్టిలో వర్ణ్యవస్తువునకు విశిష్టతఁ గల్పించుటకొఱకు నూత్నపదనమ్మేళనము నొనర్చి యొక నూత్నపద సృష్టిగా భాసింపఁజేయును.

ఉదా. "విలసిల్లు విప్రునెదుట మందప్రోయాండ్ర కూరి మిమ్రానిపండు" 2 – 14.

పుండరీకు నెదుట విలసిల్లు నతఁడు కృష్ణుఁ డన్నచోఁ బ్రత్యేకతయేమున్నది? గోపికల ప్రేమయను వృక్షమునకు ఫల మనుటలో నొకరూపకమే యున్నది. 'మందప్రోయాండ్ర కూరిమి మ్రానిపం,డనుటలో నితని పదగుంఫనమే వైశిష్ట్యమును గల్పించినది.

గోపిక యనుటకు మాఱుగా "అపసిగాఁపు పూపవయసాకె" – 2 – 128 యనుటయు, కాపుఁబడుచనుటకు మాఱుగా 'పంటది' – 3 – 61 యనుటయు నిట్టివే. ఈ ప్రయోగముల వైశిష్ట్యమువలన శృంగార రసభావము ప్రాముఖ్యము వహించును. క్రొత్తగా వయసు వచ్చిన నిగమశర్మను "లేఁగొనబుంబ్రాయపుఁ దేజకూన" – 3 – 6 యనుటయు నిట్టిదే. పుండరీకునకుఁ బ్రత్యక్షమైన చతుర్ముఖ బ్రహ్మయంతటి వానిని హాస్యగర్భితముగా "తొలుకారు కలఁక పులుఁగు మావురావుత్తు" అని నిర్దేశించుటలోఁ గృష్ణుని దర్శనమును గోరిన పుండరీకునకు బ్రహ్మ కొంత సామాన్యముగఁ దోచెనని చెప్పుటయే. కృష్ణుఁడు మురళి నూదుమండఁగా మోహితలైన నాగకన్యకలకు 'చక్షుశ్శ్రోత్రకన్యల్' అను శ్రీనాథుని విశిష్ట ప్రయోగమును గొనివచ్చి ప్రయోగించియు 'నిచ్చట వీరు మాత్రము కన్నులు గూడఁ జెవులుగా వేణుగానమును గ్రోలుచున్నారు కనుక సార్థకముగాఁ బ్రయోగించితి"నని రామకృష్ణుఁడు చెప్పుచున్నట్లు పొడగట్టును.

సంభాషణలు నడుపుచున్న ఘట్టములలో వినుచున్న పాత్రను పాఠకులు మరచుట శ్రవ్యకావ్యమున సంభావ్యము. దానిని బరిహరించుటకుఁ బ్రతిభావంతుఁడగు కవి కొన్ని మెలకువలు చూపవలెను. రామకృష్ణుఁడు తన నూత్న పద నిర్మాణ గుంఫనమును సంబోధనల వైశిష్ట్యమున మలచి మెలకువలు చూపును.

ఉదా. : శివుఁడు పార్వతిని సంబోధించుచు నొక తావున
"అంశేందూద్వహదేవి! ..." —2-126 —యనియు,
"కించిద్వలగ్న! ..... —1-195 —అనియు,
"ఇలాధరతనయా!...... -2-28 —యనియు సంబోధించును.

పుండరీకుఁడు విష్ణుని సంబోధించుచు "కంసహింసకా!" -2-71 యని శబ్దాలంకారయుతముగను, 'భత్రితశేష' -2-72 యని వ్యాకరణవైచిత్రితోను, 'కాంతికంచుకా' -2-67 యని సంప్రదాయబద్ధముగను, 'అసురఘస్మర' -2-59 యని యప్రసిద్ధపద ప్రసిద్ధితోను సంబోధించును.

ఒక్కొక్కప్పుడు కవిగూడ నాఖ్యానవశమున నిట్టి ప్రయోగములతో నాఖ్యానమున వైవిధ్య కల్పనము చేయును. శౌరిని 'దోశ్యమితారి' -3-123 యనియు, శంకరుని 'యర్ధవతూణీరుం'డనియు, నారదుని 'వీణాముని' -3-2 యనియు విట్ఠలుని 'వెలయుప్రాయంబు గల కొయ్య విట్ఠలయ్య' యనియు వ్యవహరించుట యిట్టిదే.

ఒక వైశిష్ట్యము నుద్దేశించి రూపక సమాసాదుల నొడఁగూర్చుటలో నితఁడిట్టి పదనిర్మాణము చేయును. పట్టుదలతోఁ దపమొనర్చు నయుతుఁడు 'జటిల వ్యాఘ్రుంబు' -5-186, అయుతునిచే ననాదరముగాఁ జెప్పఁబడిన బ్రహ్మ 'పుక్కటియోవరిం జదువు పుత్తడిహత్తిన పెద్ద' -5-218. ఇట్లే యర్ధనారీశ్వరుఁ డపహాస్యమున 'శార్యమునం దరమానిసి' -1-115 విశిష్టత గల విషయమును మిక్కిలి చనువుతోఁ జెప్పునప్పుడు సామాన్యముగా సంస్కృత ప్రయోగమునఁ గీర్తింపఁబడు నంశముల నపురూపమైన యచ్చ తెనుఁగు పదముల కూర్పుతోఁ జెప్పుట యితని పదగుంఫనమునందు విరివిగాఁ గనుపట్టును. ప్రమథులు నందివాహనమున నెక్కి తిరుగుదు రనుటకుఁ 'గొమ్ము తేజులనెక్కుగువియువారు' యనుటయుఁ, త్రినేత్రు లనుటకు 'మిక్కిలి చూపు లెసఁగువారు' అనుటయుఁ, భస్మధారులనుటకు 'బూదిఁ బూసినవారు' అనుటయు -1-165, శివుఁడనుటకు 'వాకతాల్పుఁడు' అనుటయుఁ, జక్రాయుధ మనుటకుఁ 'జుట్టుంగత్తి' -2-33 అనుటయు, బ్రాహ్మణుఁ డనుటకు 'త్రాడిగట్టు, జన్నిగట్టు' -3-68 అనుటయు, నిష్ఠాశీలుఁడనుటకు 'నెట్టికసీల' -4-179 యనుటయుఁ, బొట్టివాఁ డనుటకు 'నడ్డిగపీల' -4-179 యనుటయుఁ, దరంగము లనుటకు 'నీటి డొంకలు' -5-157 అనుటయు, బ్రహ్మచారి యనుటకు, 'గోఁచికట్టు' -5-238 అనుటయుఁ, గప్పయనుటకు 'బొతికొడుకు' -5-314 అనుటయు నిట్టి విచిత్ర ప్రయోగములే.

ఇతని పద నిర్మాణ వైచిత్రిలోఁ బైఁ జెప్పినదానికి విపర్యాసమైన పద్ధతి గూడ నున్నది. తేలికగాఁ దెనుఁగు పదమునఁ జెప్పఁదగిన యంశముల నపహాస్యాది ప్రయోజనములకై ప్రౌఢ సంస్కృత పదనిర్మాణమున నిమిడ్చి విచిత్రమైన గాంభీర్యము నాపాదించును. చిక్కపుసంచి యనుటకు 'క్షుల్లకాశిక్యము' – 5 – 108, కప్పయనుటకు 'వరుణదంతావళము' – 5 –310, 'మండూకసార్వభౌముఁడు' – 5 – 312, 'సలిలజంతులలామము' – 5 – 309, 'వర్షాభూవిభుఁడు' –5 – 306, 'వర్షపిశునంబు' –5 – 303, 'దర్దుర పట్టభద్రుఁడు' – 5 – 302, 'శాలూర చక్రవర్తి' – 5 – 283 యను ప్రయోగము లిట్టివే.

కొన్ని తావులందు సంస్కృతమైనను దెనుఁగైనను నితర కవులు సామాన్యముగాఁ జేయు ప్రయోగముల నుజ్జగించి వానికిఁ బ్రతిగా నూతన పదనిర్మాణమును జేయును. దానివలనఁ బాఠకులకుఁ బ్రాతపడిన ప్రయోగములపై నతి పరిచయమునఁ గల యవజ్ఞతను బరిహరించుటయే యితని సంకల్పముగాఁ దోచును.

ఉదా. : మన్మథుఁ డనుటకు 'ఉగ్రశత్రువు' – ఉగ్రునియొక్క శత్రువు – 2 – 72. 'భుజాభోజనము' కొల్లయైన విందుభోజనము 2 – 111, స్కందుఁ డనుటకు 'కాసూధరుండు' – 2 – 180, త్రిశూల మనుటకు 'త్రిముఖాస్త్రము' – 1 – 165, 'వాఁడిముమ్మోముల వేడియలుఁగు' – 1 – 101, వేశ్య యనుటకు 'రూపాజీవ' – 3 – 88, వంటయిల్లనుటకు 'రసవతి', పర్వదినము. శ్రాద్ధాదిక వ్రతదినము మున్నగు నర్థములలో 'ప్రస్తుతము' – 4 – 149, కౌస్తుభ మనుటకు 'వార్మణి' – 5 – 25, 'నీటి కెంపు' – 1 – 13 మున్నగు ప్రయోగములు గమనార్హములు.

8. తెనుఁగు భాషలోని జాతీయము ప్రతిబింబించునట్లు విశిష్టపదకల్పన చేయుట : ఇందు వ్యాకరణముకన్న భాషాస్వభావము ననుసరించిన జాతీయతను బొదుగుటయే యితని ప్రత్యేకదృష్టి యనిపించును. కనుక ననింద్యగ్రామ్యముల తరగతికిఁ జెందిన ప్రయోగము లున్నవి.

ఉదా. : పలుకులవంటి యనుటకు 'పల్కుల్వంటి' – 1 – 29 లక్ష్మణఘనుఁడనుటకు 'లక్ష్మఘనుఁడు' – 1 – 69, కాళహస్తి యనుటకు 'కాళాస్తి' – ఇది వ్యక్తి నామము గనుక వ్యాకరణోల్లంఘనము లేదు – 1 – 75, అర్వాభాగమనుటకు 'నర్పభాగము' – 2–115, ప్రేలుట లనుటకు 'ప్రేలడములు' – 3 – 43, మోడ్పుఁగే లనుటకు 'మోడ్పునఁగేలు' – ఇది తిక్కన 'గౌరవంబున మొగంబును', నన్నయ్య "యెలజవ్వనంబున విలసనంబు" వంటిది, – 4 – 94, మొదలగునవి.

9. పైఁ జెప్పిన విధమున వాక్యకల్పనము చేయుట గూడఁ గలదు.

ఉదా. : 'ఈరు తివియఁ బేనురాకున్నె' – 4 – 166, 'కుప్పఁజిప్పిడి పేలాలు కొరుకఁదివురు' – 4 – 196, 'తన మొగంబుఁ జూడు తనుజూడు' – 4 – 278, 'ఏనుంగుమీఁద నున్నవాని మేరమీఱి సున్న మడుగఁజూచుచున్నారు' – 4 – 278, 'మడుఁగు నగము మైలయు నగమే' – 5 – 220, చిమ్మెటసింగమె

సురదాఁటే వానికిక్

గాజురత్నమే' – 5 – 223, 'సురదాఁజేవానికినేఁ జింతయాకంతయైనన్ గడ మేనియున్ గడమగాదా' – 4 – 275 'గుడిమ్రింగువానికిఁ దలుపులప్పడములు కాకుండునె' – 5 – 229. మున్నగునవి. ఇందెక్కువభాగము లోకోక్తు లగును. వీనినిఁ గల్పించుపట్ల రామకృష్ణుని బుద్ధి సూక్ష్మతయు, సుకుమార హాస్య కౌశలము నూటికి నూఱుపాళ్లు నాచనసోముని యడుగుజాడలలో నడచినది.

ఇట్టి బహుముఖీనమైన తన పదగుంఫనా వైశిష్ట్యమును రామకృష్ణకవి కేవలము పాఠకుల నాశ్చర్యచకితులను జేయుట కుపయోగింపలేదు. మహా కవి యెవ్వఁడు నట్లుపయోగింపఁడు. దీని కొక ప్రత్యేక ప్రయోజన మున్నది. పాండురంగ మాహాత్మ్యమందలి పరమార్థము దురవగాహమైనది. కథాగత ప్రతిపాదితమైన యంశ మాధ్యాత్మికశీలము, ప్రధానరసము శాంతము. ఇతని కవితామార్గములు ప్రౌఢములు. ఇన్నిటికిఁ దగిన వైవిధ్యమును, చిత్తాకర్షణను, సుబోధకతను, హృదయాహ్లాదమును గల్గింపవలసిన ముఖ్యకావ్యాంశము లున్నప్పుడు గాని కావ్యముత్తమ ప్రబంధత్వమును జేకూర్చుకొనదు. ఇట్టి యత్యావశ్యకములైన కావ్యాంశములలో ముఖ్యమైనది పదగుంఫనము. దీనిని గ్రహించిన సహృదయ పాఠక పండిత పరంపర తలయూఁచి 'యౌ' నని మెచ్చి " పాండురంగ విజయు పద గుంఫనము" అని కీర్తించినది.

రామకృష్ణుని మతము, ఆత్మీయత, తత్త్వదృష్టి

రామకృష్ణుఁడు జన్మతః శైవుఁడై నడిమి వయస్సున వైష్ణవమతమును స్వీకరించెనని పలువురు పండిత విమర్శకుల యభిప్రాయము. ఇతని కుటుం బము తొలుతనుండియు శైవ సంప్రదాయము ననుసరించినదని యీతని వంశ చరిత్రను బరిశీలించిన కొందఱు తెలిపియున్నారు.

"క్రి. శ. 1500 సంవత్సరమునకు అయిదారేళ్లు కొంచెం కుడియెడంగా తెనాలి. గ్రామంలో గార్లపాటివారి కుటుంబం ఉండేది. ఆ యింట్లోవాళ్లంతా శివభక్తులు, మంచి పండితులు .....పరమ శివాచార పదచక్రవర్తి అయిన పాల్కు రికి సోమనాథుని తర్వాత అంతటి వైభవము ఈయనకు – గార్లపాటి లచ్చన్న గారికి – ఉండేదని చెప్పవచ్చును.[1]

నవచోళచరిత్రయను గ్రంథములోని "వీరభద్రేశుని విజయసాహసము" మొదలుగాఁగల ద్విపదల మూలమున రామయ్య తమ్ముఁడైన యీ లచ్చన్న కవి వీరభద్ర విజయమను కావ్యమును రచించినట్లు తెలియుచున్నది. మఱియు నీ యంశమును గూర్చి శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి యభిప్రాయ మిట్లున్నది.

"తెనాలిలో నున్న రామయ్య పండితుఁడు శైవాచారపరుండు గాన నక్కడ వెలసియున్న రామలింగస్వామి పేరే తమ ప్రథమ పుత్రునికిఁ బెట్టుకొనెనని

[1] ఆరుద్ర 'సమగ్రాంధ్రసాహిత్యం' •వాల్యూము 8, పుట. 15.

నేను దలఁచుచున్నాఁడను......తెనాలిలో రామలింగేశ్వరస్వామి యాలయమున నొక యుత్సవ విగ్రహము పీఠము మీఁద నీ శ్లోక మున్నది

"శ్రీ తెనాలినగరే వ్యరాజయద్దార్లపాటి పురరామపండితః
శుక్లమాఘసిత పంచమీగురౌ రామలింగముమయోత్సవాకృతిమ్"

.... ఉద్భటారాధ్య చరిత్ర కర్తయగు రామలింగయయే వైష్ణవమతము పుచ్చుకొని రామకృష్ణుఁడై పాండురంగ మాహాత్మ్యము రచియించినాఁడని... ... నిర్ణయించుట ప్రమాణ దూరము కాదు" [2]

ఈ యంశమును గూర్చి కందుకూరి వీరేశలింగమి ట్లభిప్రాయపడినారు.

"ఈ కవి మొట్టమొదట శివభక్తుఁడైనను విష్ణుభక్తులగు చంద్రగిరి రాజులను సంతోష పెట్టుటకై తరువాత విష్ణుభక్తుఁడై వైష్ణవులను గురువుల నుగాఁ గైకొనెననియుఁ గూడఁ జెప్పుదురు" [3]

ఈ యభిప్రాయములనే బలపరచుచు శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యు లిట్లు చెప్పినారు,

".........రామలింగఁడు రామకృష్ణుఁ డగుటకుఁ గారణము స్పష్టముగాఁ గనిపించుచునే యున్నది. .... నాఁటి యారవీటి రాజులు వీరవైష్ణవులు, వేషముతోపాటు పేరుగూడ మాఱినది. భట్టరు చిక్కాచార్యులు పంచసంస్కారముద్రలు వేసినారు." [4]

వీ రంద దిట్లు రామకృష్ణుని మతమును మార్చుటకు లభించిన యాధారములు పరిశీలింపఁదగినవి.

1. అతఁడు శైవవైష్ణవ గ్రంథములను రచించుట – ఇది యతని యభేదదృష్టిని నిరూపింపదా ?

2. శైవ గ్రంథమున రామలింగఁ డనియు, వైష్ణవ గ్రంథమున రామకృష్ణుఁ డనియుఁ బేరుండుట – ఒక్కనికే రెండుపేర్లున్నచో నిట్లు రచించుటలోని యభ్యంతర మేమి ?

3. శైవ గ్రంథమునందు వీని గురువు పేరు పాలగుమ్మి యేలేశ్వరుఁ డనియు, వైష్ణవగ్రంథమందు భట్టరు చిక్కాచార్యు లనియు నుండుట – ఒకే వ్యక్తి శైవ వైష్ణవ పురాణావళి నానార్థములఁ గరతామలక నిభము లొనర్చు

---

2. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, 'ఉద్భటారాధ్యచరిత్ర పీఠిక, పుట. 8
3. శ్రీ కందుకూరి వీరేశలింగము 'ఆంధ్రకవుల చరిత్రము, పుట. 164.
4. శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు రామకృష్ణుని రచనా వైఖరి, పుట 2.

కొను నాదర్శముతో లిరువురు గురువుల కడ నీ రెండు విధములైన యాగమ ముల నుపదేశమందుట యసంభవమా ? ఒకే గ్రంథమున శైవవైష్ణవ గురు వులను గీర్తించిన కవులకే మత మిప్పించఁగలరు ? [5]

4. పాండురంగ మాహాత్మ్య పీఠికలో విరూరి వేదాద్రిమంత్రి యీ కవిని శైవవైష్ణవ పురాణావళి నానార్థములు నీకుఁ గరతామలక నిభములు" – 1 – 23 అని కొనియాడుట. ఇది యీ కవికిఁ గల సమదృష్టినిఁ జక్కఁగా నిరూ పించుచున్నది.

"కందాళ భావనార్యుల
నందను శ్రీరంగగురుని నతబుధరక్షా
మందారంబునులింతను
మందార మరంద బిందు మధురారభటిన్.

"కాళిదాసాది సంస్కృత కవులఁ దలఁచి
యాంధ్రభాషావిశేష భాషాధిపతుల
నన్నపార్యాదులను బుద్ధి సన్నుతించి
పాలగుమి భీమగురుని సద్భక్తిఁ గొలుతు" — సుదక్షిణాపరిణయము

1 – 8.9.5

"వీరేశలింగము" చేసిన యూహ సత్యమైనచో రామకృష్ణుఁడు తన వైష్ణవగ్రంథమును వీరవైష్ణవులగు చంద్రగిరిరాజులకే యంకితము చేసి యుండవలెను. మతము మార్చుకొని రాజు నూరక సంతోషపెట్టి శుష్కప్రియము చేసి కావ్య మంకితమీక యీ కవి యేమి సాధించియుండును ?

ఈ యాధారములనే గతానుగతికముగఁ బ్రమాణబుద్ధితో స్వీకరించి మఱియుఁ దదేక దృష్టితోఁ బాండురంగ మాహాత్మ్యములోని పద్యములను బరిశీలించి శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు రామలింగని కామూలాగ్రముగా మరల శివదీక్ష నిప్పించుటకుఁ బ్రయత్నించినారు.

"ఇతని వైష్ణవము తెచ్చిపెట్టుకొన్న వైష్ణవము. జన్మతోడిది కాదు. ఇతనిది జన్మతోడిది శైవము.... ఇతని శివభక్తి యపారము."

"జన్మతోడిది" శైవము కాని వైష్ణవము కాని కాదనియు, శైవవైష్ణవము లవంటి యాగమములచేఁ దెలియఁ దగినది జీవుని దైవాంశయనియు, నంగీకరింప వలసిన యుగమున, వయస్సున నిట్టి విమర్శలు నెలకొనుట సృష్టికర్తయొక్క పరిహాస కుశలతను దెలియఁజేయును. పైఁ జెప్పిన విమర్శకు లెల్లరు చూపిన యాథార్థ్యములన్నియు మంచివే కాని వానికిని, రామకృష్ణుఁడు మతము మార్చు కొనెనని వారెల్లరు చేసిన నిర్ణయమునకును గార్యకారణ సంబంధము లేకుండుట

౫. తెనాలి రామకృష్ణకవి సోదరుఁడగు తెన్నాలి యన్నయ్యకవి రచించిన సుదక్షిణాపరిణయ పీఠికలోని యీ వరుస పద్యములలోఁ గందాళ శ్రీరంగాచార్యులను దన వైష్ణవ గురువుగనుఁ బాలగుమ్మి భీమనను శైవగురువుగను గీర్తించినాఁడు.

వింత ! అతఁ డొక మతమునకు నభిమానపడుటగాని, వైఁదొలఁగుటగాని, మఱి యొక మతమును స్వీకరించుటగాని యసంభవ మనుట కతని పాండురంగ మాహాత్మ్యమే ముంజేతి ముకురము. పట్టుదల కల వైష్ణవుఁడు పాండురంగమాహాత్మ్యమును వైష్ణవ గ్రంథ మనుకొనుట కెంత యవకాశమున్నదో పట్టుదలగల శైవుఁడు దానిని శైవగ్రంథ మనుకొనుట కంతియే యవకాశమున్నది. ఉన్న దనుటయే కాదు, ఇట్లు పరిగణించుటయు జరుగనెద. పై విమర్శకులురామకృష్ణుని వైష్ణవ స్వీకారమును నిర్ణయించుట కీ పాండురంగ మాహాత్మ్యమునే యాధారముగాఁ గైకొనుటను బట్టి వారి నిర్ణయము ప్రకారమిది వైష్ణవగ్రంథమని తేలుచున్నది. వారిలో నొకరైన శ్రీవిశ్వనాథవారు మరల నీ గ్రంథమునే యాధారముగాఁ గొని "యితని శివభక్తి యపారము" మొదలగు నిర్ణయములు చేయుటఁ బట్టి వారి యభిలాషప్రకారము నిదిసారతః శైవగ్రంథమని తేలుచున్నది. ఏకాభిప్రాయముగల అనఁగా రామకృష్ణుఁడు పాండురంగ మాహాత్మ్యమును రచించుట వలన శైవమునుండి వైష్ణవమునకు మాఱెననుట – పై విమర్శకులే యీ గ్రంథమందలి శైవమును, గ్రంథకర్త కాపాదింపఁ దలఁచిన వైష్ణమును జూపఁగలుగుట జరిగిన దనఁగా నా గ్రంథమున శైవ వైష్ణవములకు సమాన ప్రామాణ్యము నభేదము కల దనుటయే గదా! విమర్శకుని యభిలాషనుబట్టి గ్రంథమందుఁ బోషింపఁబడిన శైవమో వైష్ణవమో యేక దేశమై ప్రతిబింబించుటకుఁ గారణ మా రెండు నందుఁ బరిపుష్టి నంది యుండుటయే! ఇంతకును గారణము రామకృష్ణునకు మతముపైఁ గల విలక్షణమగు దృష్టియే. పాండురంగ మాహాత్మ్యమందంతటను శైవ వైష్ణవ శక్తి దైవతములు మేళవింపఁబడి పాండురంగ విద్య త్రయీమయమైన యొక నూతనాగమ మార్గముగా రూపొందినది. ఈ విద్య అప్పటికే కొన్ని కుటుంబములలో నుపాస్యమానమైన సంప్రదాయముగా రూపొంది యుండవచ్చును. విద్యానగర ప్రభువులు విట్ఠల దేవాలయమును నిర్మాణము చేయుట, కర్ణాట మహారాష్ట్ర దేశములలో నప్పటికే ఋషితుల్యులయిన పండరినాథభక్తుల సంప్రదాయము నెలకొని యుండుటయు, గర్ణాట మహారాష్ట్ర వాఙ్మయములలోఁ బాండురంగ విట్ఠలునిపై భక్తి వాఙ్మయము వెలువడుటయు నప్పటికే జరిగినవి. ఈ సంప్రదాయము విద్యానగర ప్రభువుల కుటుంబములలోఁ గూడ నప్పటికే నెలకొని యుండవచ్చును. మాధ్వమతమునఁ గూడఁ బాండురంగతత్త్వము ప్రాధాన్యము వహించినది. కాని యది కేవలము విష్ణుపరముగా రూపొందినది. అప్పటికి నూతనముగా దక్షిణదేశమున నెలకొనిన సంప్రదాయము నాధారముగాఁ గొని రామకృష్ణుఁడు శైవ వైష్ణవ శాక్త సంప్రదాయముల సంగమముగా దానిని రూపొందించుటకు యత్నించె ననవచ్చును.

ఈ నూతన సంప్రదాయమునఁ గాలభైరవుఁడు, కాళరాత్రి, శివుఁడు, పార్వతి, కృష్ణుఁడు, గోపికలు, రాధాదేవి, వాణీహిరణ్యగర్భులు, లక్ష్మీనారాయణులు స్థానము వహించిరి. దాక్షిణాత్యవైష్ణవ సంప్రదాయమున భైరవుఁడు, కాళరాత్రి, పార్వతీ పరమేశ్వరులకు స్థానములేదు. శైవ సంప్రదాయమునఁ గృష్ణుఁడు, గోపికలు నుండరు. ఈయన సృష్టించిన యుపాసనామార్గములలోఁ గొన్ని రహస్యము లున్నవి.

1. కృష్ణునికై తపస్సు చేసిన పుండరీకుఁడు భస్మోద్ధూళన పాండురాంగుఁడు–2–54.

2. పాండురంగ తత్త్వోపదేష్టయైన పరమశివుఁ డీతని పాండురంగ మహాత్మ్యమున "దక్కిన విష్ణుభక్తియు దృఢంపు విరక్తియుఁ గల్గు వైష్ణవ సార్వభౌముఁడు" –2–181, 186. శ్రీకృష్ణుని గూర్చి తపస్సు చేయుచున్న రాధాదేవికి భూతిభృజ్జటాపుంజ ముపమానగతము వర్ణింపఁబడినది –4–14. ఈ విధముగా నెంత తఱచి చూచినను రామకృష్ణుఁ డవలంబించిన మతము తత్వప్రధానమైన వేదపురాణమార్గమే గాని, యర్వాచీన శైవవైష్ణవములలో నొకటి కా దనుట నిర్వివాదాంశము. నన్నయచే నారాధింపఁబడిన వేదత్రయమూర్తులు, తిక్కనచేఁ దర్శింపఁబడిన హరిహరనాథుఁడు రామకృష్ణునిచేఁ దద్వేద సంప్రదాయానుసారముగ దర్శింపఁబడి యారాధింపఁబడినారు. శైవగ్రంథమును నిర్మింపుమని కోరిన యూర దేవయ రామకృష్ణుని " బహువేద వివేక పవిత్ర భావ సంకలితములైన వాక్యములఁ గావ్యముఁ జెప్పఁగ నేర్తు వాది కావ్యుల కవితానిగుంభన సమున్నతిఁ గాంచినవాఁడవౌదువు" —ఉద్భట. 1-26, అని సంబోధించినాఁడు. వైష్ణవ గ్రంథము గాక "శ్రీభాగవతచరిత్రము రవణింపు" మని రామకృష్ణుని గోరిన విరూరి వేదాద్రిమంత్రి "శైవవైష్ణవ పురాణావళి నానార్థములు నీకుఁ గరతామలక నిభములు" –పాండు. 1–23, అని సంబోధించినాఁడు. ఇదియే రామకృష్ణుని మతము. అనఁగా శైవవైష్ణవాగ మాదుల సంప్రదాయములను బీటు పోసిక వేదమార్గ ప్రతిష్ఠాపనము చేయుట యతని జీవితాదర్శము. అంతియె కాదు. అట్టి యాదర్శము కలవా రెల్ల రతనికి దైవతజ్యేష్ఠులు. కందాళప్పగారి నతఁడు" వేదమార్గప్రతిష్ఠాదైవత జ్యేష్ఠుఁడు"–పాండు. 1–77 అని భక్తితోఁ గీర్తించినాఁడు. "సాధ్వనుభావుఁడు, ప్రసన్నుఁడునగు నైలనాహ్వాయ" గురువును గూడ "నధ్వరకర్మకౌశలసమంచితు" – ఉద్భట. 1 – 7 నిగా వేదమార్గ ప్రవర్తనముననే కీర్తించినాఁడు. దన శైవకావ్యమున నొనఁగిన మహామంత్రము కూడఁ ద్రియంబక మనఁబడు ఋగ్వేదమంత్రమే కాని తద్భిన్నము కాదు.

"తడిసి మొత్తంబు రేపాడి తాన మాడి
దిగ్గియల చేరువులను, బూదియలలందు
కాలములఁ బల్కుచను త్ర్యయంబకంయజామ
హే యటంచును జలవక్షు లెల్లయెడల" — ఉద్భట. 1 – 56

ఇతని మతమున శైవ వైష్ణవ పుణ్యక్షేత్ర తీర్థ దైవత దర్శనము సాధకునకు నవశ్య కర్తవ్యము. ఎవని గోత్రకర్తను వాఁడు భక్తితో నుపాసింపఁగాఁ దన మార్గమున దారి చూపు గురువు ప్రసన్నమై కర్తవ్యమును బోధించును. ఉద్భటమునఁ గౌండిన్యమునియుఁ, పాండురంగ మాహాత్మ్యమున నగస్త్య వాధూల మహర్షులును బ్రహ్మవిద్యా గురువులుగాఁ గీర్తింపఁబడినారు. పల్లికీపురము నేలు ప్రమథేశ్వరుఁడు, దిలీపునివలెఁ జిరకాలము సంతానహీనుఁడై యుండెను.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, తెలుఁగు విజ్ఞాన సర్వస్వము, సం. 3, పుట. 1004

దిలీపుఁడు వశిష్ఠుని చరణము నాశ్రయించినట్లు తాను గౌండిన్య గురుచరణము నాశ్రయించెను. తన్మూలమునఁ గాశీ విశ్వేశ్వర దర్శనము, పుత్రప్రాప్తియు, గృహస్థాశ్రమ పరిపూర్ణతయు, నపవర్గప్రాప్తియు లభించినవి. ఈ సందర్భమున మఱియొక విశేషము కూడ నున్నట్లు తోఁచును. గోత్రకర్తలను, దైవతములను దదంశోద్భవులైన సమకాలికుల సద్గుణవర్చస్సునందు దర్శించి యారాధించుటయు నితని మార్గమున నొక యారాధనా విశేషము. తనకుఁ బూజ్యులలో నొకరైన కందాళప్పగారు వాధూల గోత్రోద్భవుఁడు. వారిలో నితఁడు చూచిన ఋషిత్వమునే పాండురంగమాహాత్మ్యమున వాధూలఋషి - 5వ ఆశ్వాసము - లోఁ జిత్రించి యుండవలెను. కౌండిన్యుఁడు తనకు గోత్రకర్తయైన ఋషి. వారి తేజస్సు నుద్భటమున దర్శించి యుపాసించి యుండవలెను.

మతము జీవితమునకు వెలుఁగు నిచ్చుబాట. అందు యోగ సాధన యొక యపరిహార్యమైన యంగము. "మను - మంత్ర - హఠ - రాజయోగముల మర్మము" తెలుఁగుట సాధకుని కర్తవ్యము. ఇవి యెన్ని యున్నను వర్ణాశ్రమ ధర్మావలంబనము జరిగినప్పుడే యర్థవంతములై మోక్ష ప్రదము లగును. గృహస్థాశ్రమము నొల్లని యయుతుఁడు భ్రష్టుఁడై వాధూలుని కరుణచే శాపముఖమున నుద్ధరింపఁబడి విష్ణుపదము నందినాఁడు. సంసారమును రాజ్యభారము నొల్లనని యకాల వైరాగ్యమున విషాదయోగము నందిన ముంజభోజుఁ డుద్భటగురుని కరుణా కటాక్షములచేఁ గర్తవ్యోన్ముఖుఁడై కర్మబంధమును దొలఁగించుకొనినాఁడు.

రామకృష్ణుని మతమున ముక్తి యనఁగా ఋషి సంప్రదాయానుసారమైన జననమరణాతీత స్థితియే గాని "నిదురవంటిది, చావువంటిదియుఁ గాదు" - పాండు. 5-216. ఇతఁడు సదేహముక్తి నిట్లు కీర్తించినాఁడు :

"కేలారమున నుండి పాలింటి కేతేర
బహుధాన్యములు చేలఁబండి యొరఁగ
నెడనెడఁ బెండ్లిండ్లు వడుగులు పొడమఁ
గృతార్థులై యర్థింప నర్థు లలరఁ
బరిచారికా కోటి పనిపాటు పాటింపఁ
జుట్టంపు సందడి నెట్టుకొనఁగ
గ్రామ మెంతయు నిజప్రాభవంబున మన
సత్యనిష్ఠకుఁ దన్ను సాక్షి గోర
నిత్య నైమిత్తికములు నిర్నిద్ర బుద్ధి
నాచరించుచు హరిభక్త మాత్మభార్య
భక్తినిడ భుక్తిఁ గొనుచున్కి ముక్తి కాని
నిదురవంటిది చావు వంటిదియుఁ గాదు"

—పాండు. 5-216

మోక్షోన్ముఖుఁడగు గృహస్థుకుటుంబ మెట్లుండవలెనన్న విషయము నీతని యాదర్శ రచనలవలనఁ దెలియవచ్చును. ధర్మమార్గమునకు దూరము గాని ప్రవర్తనమున జీవితమును మలచుకొనుచుఁ గలుషవర్తనులున్న పొలము పొంతఁజనక, యెంతటి నీచునైన నిందింపక మెలఁగవలెను. ఆఁకలిగొన్న కడుపును మిన్నకయ చూడరాదు. నిత్యమును యోగమార్గానుసారియగు దైవచింతనమున మనస్సు లీనము కావలెను. పితృయుగమును బరివారికా సహస్రమయి సంభావింపవలెను. తన సకలోద్యమములకు విజ్ఞమహిళామణి యప్రతీపమతిఁ దోడ్పడవలెను. పరలోకమున కేఁగిన తల్లితండ్రుల సుఖావాసమునకై గంగ నస్థి గయఁబిండము విడి పితౄణ మీఁగవలెను. భార్య ప్రేయసియై యనుకూలయై తా నామె కనుకూలుఁడైనపుడే జన్మించు సుతులు ప్రబోధ విధేయమతు లగుదురు.

ఉత్తమ గృహిణికిఁ బండబాఱిన వయస్సు వచ్చుచున్న కొలఁదిని ప్రాణ విభూపలాలనము ప్రాఁకుడు కొయ్యగా నిలువవలెను. జీవితమంతయు సుశీలయై, కళ్యాణగుణశీలయై చేమీఁదుగా నెల్లమట్టములకుఁ బెట్టవలెను. భర్తతోఁ గూడ ముత్తాటిపండు తిని మునిమన్మ గుబ్బల నెత్తవలెను. 'శతమానం భవతు, శతాయుః పురుషః శతేంద్రియః ఆయుష్యేవేంద్రియే ప్రతితిష్ఠతి" యను శ్రుత్యాశీర్వాదము గృహస్థులకును వారి కుటుంబమునకును సత్యమైనప్పుడే వారి యింటి సదాచారము సఫలమగుట, అడుది యశీతి వృద్ధయైనను జీవత్పతిగా దైవమును జేరుకొనవలెను. ఘనశీల, సుశీలయగు నుత్తమగృహిణి సభర్తృకముగ దైవ సాన్నిధ్యము చేరుకొనుట కూడ సద్గతియే.

సంతతిని గృహస్థులు కని లోకముపైఁ బాఱవైచినంతనే సరిపోదు. ఆ సంతతి ప్రబోధ విధేయమతులై, లౌకికవైదికాచరణ లాలసులై, యుత్తమ శ్లోకులై సుశీల సంతతివలె హరిభక్తియుక్తులో, ముంజభోజునివలె హర భక్తియుక్తులో కావలెను. సూనృతలక్ష్మికిఁ బట్టుకొమ్మలై యేకడ – "సర్వ భూత దయయే తమ సొమ్ముగఁనో" దీనమానస వ్యాకుల తాపసోదనధనాఢ్యులై విలసిల్లవలెను. అప్పుడే గృహస్థులకు ముక్తి కరస్థము

ఆడబడుచులు పుట్టినింటికి మెట్టి నింటికి మేలు చేకూర్పఁ బాటుపడవలెను. పుట్టినింటికి వచ్చుట యనఁగా వారి కష్టసుఖములలోఁ బాల్గొని తోడు నీడలై నిలువవలెను. అచ్చటి పశు శిశు దాన దాసీజనములఁ దనవారుగాఁ జూచుకొనవలెను. నిష్ఠాపరుఁడైన బ్రాహ్మణునకు మడి మట్ట, చెట్టు చేమ లుండవలెను. అతిథి సంతర్పణము, చదువు సంత నిరంతరము సాగుచుండవలెను. చక్కని గ్రంథాలయము సురక్షితము చేయఁబడి యుండవలెను. ఇది రామకృష్ణుని సార్వకాలీనమగు సందేశము. ఈ కవి చిత్రమునఁ బుండరీకుఁ డాదర్శ గృహస్థు. సుశీల యాదర్శ గృహిణి. నిగమశర్మయక్క యాదర్శవంతమగు నత్తిక. ముంజభోజుఁడు, ప్రమథేశ్వరుఁడు నాదర్శవంతులైన పరిపాలకులు... కౌండిన్యుఁడు, వాధూలుఁడు, నగస్త్యుఁడు సద్గురువులు.

గురువు శిష్యునిఁ దన కన్న బిడ్డవలె నాదరించి విద్యావంతుని జేసి యతని ప్రాభవమునకు సంతసింపవలెను. విధేయుఁడు కాని శిష్యుని నశింపఁ జేయరాదు. అతఁడు బాగుపడవలెనని గట్టిగా సంకల్పించి, విశాల ప్రపంచ ములోనికి విడిచినచోఁ దత్సంకల్పమే అతని నెన్ని కష్టముల నుండియైన నుద్ధరించి విష్ణుపదమును జేర్చును. గురుకటాక్షము వలనఁ జడుఁడు గూడ పౌవివర్యులఁ జదివించువాఁడగును. అనపత్యుఁడు కూడఁ బుత్రవంతుఁడై సద్గతి పొందును. ప్రాణోత్క్రాంతివేళ గురూపదేశమే తారకమంత్ర మగును. గురువు పరమేశ్వర స్వరూపుఁడు. నారదునివంటి బ్రహ్మపుత్రునికేని, స్కందుని వంటి పరమేశ్వర పుత్రునికేని గురుచరణసేవ లేక సుగతికిఁ ద్రోవలేదు. సమగ్రమైన, వర్ణాశ్రమ ధర్మానుసారమైన జీవితపథమునఁ గర్మజ్ఞాన భక్తియోగములతోడి వైరాగ్య మలవడనిదే మోక్షము లేదు. ఇతరుల వైరాగ్యాదులను గూర్చి లోపము లెన్ను బుద్ధి పనికిరాదు. ఆత్మసంయమ యోగమునఁ బరమాత్మయం దనన్య భావమున నుండుటయే ముక్తి. శైవమార్గ మవలంబించినవారా పరమాత్మ యనుగ్రహముచే

"హరుఁడు జగంబుల నుండఁగ
హరునందు జగంబు లుండ నాత్మ నెఱిఁగి భా
సుర విజ్ఞానాంబుధి.... ..." —ఉద్భట. 3-81

వెలయుదురు. వైష్ణవమార్గ మవలంబించినవారికి నా పరమాత్మ

"నా యందు భక్తుఁ డుండున్
బాయక యేనధివసింతు భక్తునియందున్
మా యిరువురకుం గలుగున్
గాయప్రాణానుకూల్య కౌశల్యంబుల్" —పాండు. 4-101

అని యవిచ్ఛిన్నముగా నుపదేశించుచుండును. ఈ సృష్టిలో నంతర్యామిగాఁ బరమాత్మయున్నాఁడే గాని దీని కతీతుఁడై నంతమాత్రమున వింకెచ్చటనో యున్నాఁ డనునది రామకృష్ణుని మతమున నంగీకృతము కాదు. అంతర్యామియుఁ, గరుణామయుఁడును, మోక్షప్రదుఁడునగు దైవమునకుఁ బుండరీకుఁడు సుశీల, రాధ, ప్రమథేశ్వరుఁడు, ముంజభోజుఁడు, కౌండిన్యుఁడు, నగస్త్యుఁడు, వాధూలుఁడు, నుద్భటుఁడు మున్నగు సాధకులు, భక్తులు, ఋషులును, నారదుఁడు, స్కందుఁడు మున్నగు దివ్యపురుషులు మాత్రమే యభిమానింపఁదగినవారనరాదు. కాకి, చిలుక, హంస, పాము, తేనెటీఁగ, గోవు మున్నగు పశుపక్షులు కూడ నాత్మోన్మీలన మార్గమున నాకర్షించి సాఁకవలసిన వారే. అంతియ కాదు, పశు పక్ష్యాదులకన్న హీనులు, క్షుద్ర ప్రకృతులు, నల్పులు నగు నిగమశర్మ సుశర్మ మదాలసాదులు గూడ జగత్కుటుంబములోని వారే, యనుకంపనీయులే, ఒకానొక కర్మ విశేషమాతగా నాకర్షించి యాత్మప్రకాశము నొసఁగ వలసినవారే. కనుకనే సాధకుఁడును "నిందింపఁ డెంతటి నీచునైన"నని రామకృష్ణుని వినయపూర్వక పవిత్ర జీవిత సందేశము. దైవము "విశ్వనాథుఁడై" మునిహృదయాంబుజ సౌగంధ్య లీలాలాలిత్యము గ్రోలును. పరాశరులను వెఱక్కరిచి — సారూప్యము — దాలొందించును. తనపీఁట మేఁవరించువారికిఁ దవ

సంపద – అష్టమూర్తి యొక్క యైశ్వర్యము లెనిమిదియు – నిచ్చి, తన రూప మిచ్చి, యంతర్యామిత్వ మిచ్చును. ధర్మభ్రష్టుఁడు గూడఁ బ్రాణోత్క్రాంతివేళ నాక్రోశ మొనరించినపోఁ జక్రమై విక్రాంతి వహించి వచ్చి, జముపురమునుండి మరలించి గరుడాంచిత యానమునఁ బరమధామమునకుఁ గొనిపోవుటకుఁ "దార బ్రహ్మవిద్య విశేష ప్రతిభోపదిష్టముగఁ జేయంబూని" – ఉద్భట. –2–262. యహోరాత్రములు వేచియుండును. కలియుగమున మానవులు మోక్షమునకై శ్రమపడి తపస్సుల నాచరించి వానీరము పీరము నాశ్రయించి మనఁగా వలను లేదు. సమిద్ధానంబులఁ దలవెట్టిపడనక్కరలేదు. భక్తిమార్గమే దివ్యతేజస్సు నొసఁగును. అది లేని సన్యాసము, న్యాసము నేటికి? నెత్తిఁగొట్టుకొనుటకా?

—పాండు. 4–98

అనుభూతాఖిలభోగము, పోషితపరమస్వార్యమునై ధన్యత వెందిన వరజన్మ కలంకారమే సంసారదుర్వారబంధన నిర్బంధమునందుఁ బావుటకుఁ జేయు యత్నము. లక్ష చెప్పినను ముముక్షుజను లీ దేహమును ధర్మ సాధనముగా వినియోగింతురే కాని పరమావధిగాఁ బాటింపరు. దైవతత్త్వమే సత్యమై యంతర్యామిత్వ మందియుండఁగా సృష్టి కస్తిత్వమును గల్పించు మాయయను శక్తి యొకఁడున్నది. దానితో మైత్రివలన జీవుఁడు జీవత్వమను పాత్రను ధరించును. అయిరువురు నాడుపాటు, మగపాటు పడఁగా వివిధత్వము పుట్టును. పంచభూతములు, తజ్జన్యములైన వస్తుసముదాయము నా యిరుపురి కృషికిని పైరుగా నుదయించి పెరుగును. అది చిగుర్చుచున్నకాలఁదియు మునలితనము, రోగము, మృత్యువును నియమించిన పశుభావములు దానివి మేయుచుండును. పెద్ద లీ సంసారమునందలి భావమును బోఁద్రోచి, యంతర్యామి భావన మారోపించుకొనుచుఁ గ్రమముగా దాని యనంతత్వము నధిష్ఠింతురు. ఇది రామకృష్ణకవి తన కావ్యముల మూలమున సహృదయులు, సంస్కారవంతులు, సూక్ష్మగ్రాహులునగు కావ్యపాఠకుల కందించు తాత్త్విక దివ్యసందేశము. ఈ సందేశమే వేదములలోఁ, బురాణములలో, వేదాంతములలో, ధర్మశాస్త్రాదులలోఁ గాళిదాసాది మహాకవుల కావ్యములలో, నన్నయ తిక్కనాది యాంధ్ర సంప్రదాయ ప్రవర్తకుల, శైవ వైష్ణవాద్యాగమ ప్రతిష్ఠాపకుల రచనలలో మార్మ్రోగు నట్టిది. అందలి యేక సూత్రతను విప్రతిపత్తి రహితతను, సంభావ్యతను, సదాచారణీయతను గాంతాసమ్మితముగా మఱలఁ బరమ వివేకపారధ విభాసిత పద్మబంధ పుంజ వారిజోత్కర రుచిరములైన యాంధ్ర హృదయ సరసీవనంబులకు జగదతంబుగ శ్రీభాగవత చరిత్ర రూపమున నందించుటయే తెనాలి రామకృష్ణ కవి జీవితాదర్శము. పుండరీకునకు వలె నీ యుద్యమమునఁ గృతకృత్యుఁడగుట వలననే యా ఋషీంద్రుఁ డనఁదగు సత్కవి తరించినాఁడు.

5. పాండురంగ మాహాత్మ్య వ్యాఖ్యాన సమీక్ష

ప్రౌఢతరము, ధ్వనిప్రధానము, పండితైకవేద్య పద వాక్య ప్రమాణ మాననీయము, సాభిప్రాయ శబ్ద గుంఫితమునగు నీ యసాధారణ ప్రబంధరాజము గురువులకడ నభ్యసింపఁదగినది. సహృదయ హృదయోల్లాసకరమగు నొక విపుల వ్యాఖ్య యీ కావ్యమున కెంతేని యావశ్యకము. ఇంతవఱకు రెండు వివరణములు వెలువడినవి. 1. తెన్మఠము రంగాచార్యులవారు రచించినది. 2. బులుసు వెంకటరమణయ్యగారిది. రెండును సమగ్రములు గావనుట సువిదితము. రెండింటియందును బొరపాటు లున్నవనుట సాహసము గాదు. ఈ రెండు టీకలలోనున్న లోపములను జూపుచు శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి యొక వ్యాసమును "పాండురంగ మహాత్మ్యము లఘుటీకలు" అను శీర్షికతోఁ గృష్ణాపత్రిక వజ్రోత్సవ సంచికలోఁ బ్రకటించినారు. వా రొక యిరువది పట్టుల నుదాహరణముగాఁ గొని యిరువురు టీకాకారుల లోపములు చూపినారు.

బులుసువారు తమ పాండురంగ మాహాత్మ్య పీఠికలో నిట్లు చెప్పినారు. "పాండురంగ మాహాత్మ్యము వ్యాఖ్యానాపేక్ష గల ప్రౌఢ ప్రబంధమై యున్నను, ఇంతవఱకును శ్రీమాన్ తెన్మఠం రంగాచార్యులవారి టుప్టీక తప్ప వేఱొక టీక వెలువడలేదు... .... దానివలనఁ గవిహృదయము నెఱుఁగుట కవకాశము లేకున్నది.... మూలమును సంస్కరించినఁగాని టీక వ్రాయుట అసాధ్యము. .. ఇయ్యది పెద్ద గ్రంథము, మఱియు ప్రౌఢప్రబంధము, వైష్ణవ సంప్రదాయ విషయములతో వెలయు నుద్గ్రంథము. నిఘంటువులలో లేని పదములు ఇందుఁ జాలావఱకును గలవు. ....చాలా పద్యములు గూఢార్థములతో నిండియున్నవి." ఈ విధముగా సమగ్ర టీక మిక్కిలి యావశ్యకమని చెప్పియు, మఱల నెందు వలననో యీ ప్రయత్నమును సంగ్రహపరచి, యాశాభంగము గలిగించురీతి నిట్లు చెప్పుచున్నారు. "కొంతవఱకును వాఙ్మయమునఁ బరిశ్రమచేసిన వారే యీ గ్రంథమును పఠింతురు కావున అట్టివారి కుపయుక్తమగు రీతిని టీక సంగ్రహముగాఁ గూర్పఁబడినది....అవసరమని తోఁచినపట్ల మాత్రము టీకలో పద్యముల కర్థము, తాత్పర్యము నీయఁబడినవి. కొన్నియెడల శబ్దార్థము కాక భావార్థము చూపఁబడినది."

కొంతవఱకు వాఙ్మయమునఁ బరిశ్రమ చేసినవారికి మన వ్యాఖ్యానముల యావశ్యకత యుండదు. మిగిలినవారికి సంగ్రహ టీక పనికిరాదు. మన కావశ్యకమని తోఁచినచోట్లఁ బద్యముల కర్థము చెప్పుటలోఁ, జదువరుల కుపకరించుటకన్న వ్యాఖ్యానకర్తకుఁ బని సులువగును. శబ్దార్థము చెప్పని భావార్థము విద్యార్థులకు నిరుపయోగము. రసజ్ఞుల కనావశ్యకము. మొత్తముమీఁద బులుసు వారి ప్రయత్నమునఁ బూర్వ టీకలోని లోపములపై నున్నంత శ్రద్ధ, పట్టుదల మూలగ్రంథ వివరణముపై లేదు. నిర్వ్యాజము, నిస్స్వార్థము నగు సాత్త్విక ప్రయత్నమువలనఁ గాని యిట్టి యుద్యమములు సమగ్రముగా ఫలింపవు.

ఈ యిరువురి టీకలను గూర్చి దీపాల పిచ్చయ్యశాస్త్రి "ఆ ప్రౌఢకావ్యమునకు సమగ్రమైన వ్యాఖ్యాన మింతవఱకు పుట్టలేదు. రెండు టీక లున్నవి గాని, ఆ రెండును అసమగ్రములే. అవి కావ్యార్థ భావ జిజ్ఞాసువుల కంతగా నుపకరించుటలేదు. ...ఆచార్యులవారి టీక అతి లఘువు. బులుసువారిది అంతకంటెను కొంచెము విపులము. మొత్తము మీద అదియును లఘుటీకయే గాని పద్యార్థమును విశదీకరించు సమగ్ర టీక కాదు." అని చెప్పిన మాటలు సత్యములు.

పరిమాణము ననుసరించియుఁ బ్రస్తుతోద్యమము ననుసరించియు నిది యిట దిఙ్మాత్రముగాఁ నుదాహరణప్రాయముగాఁ జేయఁబడినది. నాచే రచింపఁబడిన పాండురంగ మాహాత్మ్య విపుల వ్యాఖ్యలోని కొన్ని ముఖ్యాంశములు మాత్ర మవకాశమునకు, నావశ్యకతకు, నౌచితికిఁ గట్టువడి యిట వివరింపఁబడినవి.

ప్రథమాశ్వాసము

1. 1 – 5.

ఉ. కపర్దాచిత చంద్రగాంగజలము ="జటాజూటముచేఁ గప్పఁబడిన చంద్రుఁడు, గంగాజలము కలది" – బులుసు.

ఇచ్చటఁ గప్పఁబడిన యను నర్థము ఆచిత అను పదమునకుఁ జెప్పుట సమంజసము కాదు. [1]చక్కఁగా గూర్పఁబడిన యను నర్థము చెల్లును.

ఆ. వెన్నెలమాడ్కిన్="చంద్రకాంతితో సమానముగా : ఆదర పూర్వకముగా ననుట" —బులుసు.

ఇచ్చట ఆదరపూర్వకముగా ననుటకన్నఁ బొంగి వచ్చునట్లుగా – ఉద్దీపకముగా నని చెప్పినచోఁ గీర్తికలశాబ్ధియను రూపకమును బ్రయోగించిన కవి యభిప్రాయము తెలియును.

ఈ పద్యమునకుఁ దాత్పర్యమును, వాఖ్యయు లేదు.

తాత్పర్యము : శివుఁ డనెడి కల్పవృక్షముచుట్టును శుకయోగి మున్నగు చిలుకలు చేరినవి. ఆయన కపర్దమును జూచి చిగురాకనియుఁ, జంద్రుని జూచి ప్రసవనియు, గంగాజలమును జూచి పువుదేనియయనియుఁ గొలుచుచున్నవి. అనఁగా శివతత్త్వమును గల్పవృక్షముగా వా రనుభవించుచున్నారు. ఆ కల్పవృక్షము వేదాద్రిమంతి కీర్తి యను పాలసముద్రమునకు వెన్నెలవంటిదియై చూచుఁగాక.

వెన్నెల పాలసముద్రమునకు రసోదయమగు కారణము. కల్పవృక్షము, చంద్రుఁడును పాలసముద్రమునందుఁ బుట్టుటవలన దగ్గర సంబంధము. గంగ

---

[1]చిత – Piled up. heaped (R.V.); placed in a line. collected, gained covered.

—Monier Williams, 'Sanskrit – English Dictionary.',

శివజటాజూటమునఁ బడుటవలనను సముద్రమున సంగమ మగుటవలనను గంగతో సముద్రమున కెక్కువ సంబంధము. కనుక వేదాచలమంత్రి కీర్తి కలశాబ్ధి యైనప్పుడు శివాహ్వయకల్పశాఖి – శుభము అను పేరుగల కల్పవృక్ష మని శ్లేష – యతని కీర్తిని బొంగింపఁగలదు. అనఁగా శివభక్తివలన నతని కీర్తి విస్తరించిన దనియు శివుఁ డతనిపాలిటి కల్పవృక్షమై యున్నాఁడనియు భావము.

2. 1–8.

ఇందుఁ దత్తాదృక్ శబ్దమునకు దానిని పోలిన యను నర్థము సరియా, సాటి లేని యను నర్థము సరియా యను చర్చ యున్నది. అందు సాటిలేని యను నర్థమే సరియైనది. కారణములు; ఈ పదమును రామకృష్ణుఁడు మూఁడు తావులందీ గ్రంథమున వాడినాఁడు.

ఎ. కందాళప్పగారి మహిమను జెప్పుచు—1–78.

"తత్తాదృగ్విభవ ప్రభావనిధి" యను విశేషము వాడినాఁడు. ఇచ్చట దేవిని పోలినదియు ననుటకు వీలు లేదు. సాటిలేని యనియే చెప్పవలెను.

బి. హేమంతఋతు వర్ణనమున —4–4.

"తత్తాదృఙ్మదజృంభమాణ తరుణీతారుణ్యసంపద్దశా, ప్రోత్తుంగస్తననిష్ఠ లోష్మ కవచంబుల్ ...."

అని వాడినాఁడు. ఇచ్చటఁగూడ సాటిలేని యను నర్థమొకటి మాత్రమే పొసఁగు చున్నది. ప్రస్తుత వర్ణనమునందుఁ గూడ సాటిలేని యనియే చెప్పనగును. దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు – తత్తాదృక్ = దానివంటి – అనఁగా వెండి కొండ కాంతి వంటి – అని చెప్పుటవలన తుండము అనఁగా ముక్కు కాదు మొగమని యర్థము చెప్పుకొనవలసివచ్చినది. తుండమనఁగా ముక్కనియే చెప్పుకొని తత్తా దృక్ పదమునకు సాటిలేని యనియే చెప్పుకొని పద్యమున కీ విధముగాఁ దాత్పర్యము చెప్పుకొనుట కవి హృదయమునకు సమీపమేమో :

శరీరమంతయు బంగరు రంగు గలిగి యుండుటచేత మేరువువలె గరు త్మంతుఁ డున్నాఁడు. పై భాగమంతయుఁ దెలుపు గనుక – వెండి కొండ యా మేరువు పైనుండి వెలుఁగుచున్నట్లున్నది. సాటిలేని చంచువుకాంతిచేతఁ జిగుర్చుచున్న – ప్రకాశింపఁజేయుచున్న – గరుత్మంతుఁడు చూడఁగా బంగరు కాంతులనుండి పుట్టుచున్న శుభప్రభలుగల వాఁడు, వేదాద్రీశుని మనుమన్ – ఇచ్చట వేదము లనెడి యద్రిని బరిపాలించువాఁడు లేక రక్షించువాఁడు నను నర్థము శ్లేష. మేరు, కైలాసముల సమాహారమైన వర్ణతత్వముగల గరుడుని శరీరము ఛందోమయము గనుక వేదాద్రి శబ్దమును ధరించిన వేద సంప్రదాయాబ్ధి మానియగు ఘనుని మనుచుటలో సందియము లేదని ప్రధానార్థము వ్యంగ్య ముగాఁ జేయబడినది. ఇందు శుభప్రభలు – గలవాఁడు – అను దీపాలవారి పాఠమే సమంజసము.

తత్తాత్పక్ష్బద్ధము మురారికవి యనర్ఘరాఘవమున – అంకము 2. శ్లోకము 53 – వాఁడబడినది. "తత్తాదృక్ప్రణవూలకోపనయన.. ......" దీనికి వాఖ్య రచించిన వారు కూడ నీ యర్థమునే నిర్ణయించినారు.

"తత్తాదృ గిత్యేకం పదం తాదృగిత్యర్థే తత్తుల్య, తత్పర, సపత్వాది శబ్ద వత్ తత్తాదృశాః నిరూపమాః"

— విష్ణుభట్టవిరచితా పంచికాఖ్యావ్యాఖ్యా.

3, 1-29.

ఈ పద్యమున మౌళికాంతి యను పాఠమును తెన్మఠము, మోవికాంతి యను పాఠమును బులుసువారును గ్రహించినారు. ఇందు మౌళికాంతి యను పాఠమే సరియని తోచును. ఇది వక్కల కుపమానముగా వాడఁబడినది. నల్లని నిగనిగలతోఁ బళ్లెరమునం దుంచిన వక్కలగుట్ట ముంగురుల సమూహమువలె నుండుట చాల సరసముగా నుపమింపఁబడినది. పెదవులకాంతి యెఱ్ఱఁగా నుండుట లోకప్రసిద్ధము, కవిసమయము గనుక కుదురదు.

తాత్పర్యము : కావ్యరచన చేయుమని కోరుచు రామకృష్ణకవికి విరూరి వేదాద్రి స్వహస్తములతోఁ దాంబూల మొసఁగెను. అనుదినమును విష్ణువు నర్చించునప్పు డాయన చేతి కంకణముల ఝణత్కారము గులుకుచుండును. కనుక నా హస్త ములు, కంకణములు, ఝణత్కారము పావనములు.

ఆ తాంబూలము పళ్లెరమునందలి వక్కలు సరస్వతీదేవి ముంగురుల కాంతుల వలె నున్నవి. తమలపాకులు ఆమె బుగ్గలవలె నున్నవి. అందలి కర్పూరపుఁ బలుకు లామె పలుకుల వలె నున్నవి.

విశేషము : ఇందు వక్కలవలనఁ గాఠిన్యము, మౌళికాంతివలన వక్రతకి తెలనాకులవలన సౌకుమార్యము, నిర్మలత – చెక్కులవలన రసస్ఫూర్తి కర్పూర ఖండములవలన మాధుర్యము, దీప్తి – సరస్వతి పలుకుల వలన సూక్తి వైభవము అను కవితా లక్షణములన్నియు స్ఫురించుచు, తాంబూల ప్రదానమున సర్వ వస్తువులను సరస్వతిపరముగనే వర్ణించి, లక్ష్మికి సూచకములయిన స్వర్ణ మణి ప్రభృతి వస్తువులను వర్ణింపకుండుట విశేషము. ఈ కృతిరచనము అంకితముకూడ గుణప్రధానములే గాని ధనధాన్యాది సంపదలు, రాజ్యము. మున్నగునవి యాశించుటకా దను భావ మిందుఁ జిత్రింపఁబడి యుండవచ్చును.

4, 1-31.

విశేషము : ఈ పద్యమునఁ బ్రతిపాదమునను బూర్వార్థమునఁ జెప్పఁ బడిన లక్షణములు వికటములు. మిగులఁ గన్నొదవిన బిగువు. దంష్ట్రావిటంక వర్ణనము, నరమృగ దేహవిస్ఫురణము, దైత్యుదండించు నుద్ధతియుఁ గలిగి యుండియుఁ గరుణాకటాక్షాదు లున్నవి యనుటలోఁ జక్కని తేటయైన హాస్య స్ఫూర్తి యున్నది. ఇందలి వికటలక్షణములన్నియు దైత్యుని దండించుకొఱకుఁ దాల్చిన యసహజ లక్షణములనియుఁ, గరుణాకటాక్ష వీక్షణము, ముద్దుఁజందురు

నేలుమోము, బహుకోటిమదన రూపము, శ్రితజనావళుల రక్షించుట యను కళ్యాణగుణము లాయనకు సహజములనియు భావము. అవతారలక్షణములు నిమిత్తములనియు, నవతారములయందుఁ గూడ సర్వసంవత్సరిపూర్ణమైన మూర్తియే నిండి యంతర్లీనమై యుండు ననియును జెప్పఁబడినది. దైత్యలక్షణములుగలవారి కవతారములోని వికటత్వము, శ్రితజనావళులకు నారాయణత్వము గోచరించుట శాస్త్రమునను లోకమునను గూడఁ బ్రసిద్ధము.

ఈ విధముగా దుష్టులకు భీకరముగను వికటముగను బైకిఁ గనుపించుచు శ్రిత జనావళులకు సౌమ్యము, లక్ష్మీశ్వరమునగు మూర్తిగ దర్శనమిచ్చుట వలననే ఎల్ల జగముల నేలుట సాధ్యము.

ఈ వర్ణనమువలన గరుడాద్రి యను పదము సామర్థ్యమున విశేషమైన సార్థక్యము కల్పింపఁబడినది. గరుడుఁడను నద్రిని సింహాసనముగాఁ గలవాఁడను రూపకము వలన గరుడవాహనారూఢుఁడగు విష్ణువు అను నర్థమును సౌమ్య గుణముల కన్వయింప వలెను. గరుడాద్రియందున్న నృసింహావతారమూర్తి యనః నర్థమును భీకర గుణముల కన్వయింపనగును.

5. 1 – 32.

ఇందుఁ గాంచన మాలిక కర్థము చెప్పఁబడలేదు. "కాంచన" పదమునకుఁ బద్మ కేసరమను నర్థమున్నది. [1]అట్టి పద్మకేసరముల మాలికకు సూర్యుని వంటివాఁడు – మకరందము నుద్దీపింపఁజేయువాఁడు.

విశేషము : ముక్తికామినీ కఠినకుచద్వయీనిహిత కాంచనమాలిక హేళి కల్పుండు. ఇచ్చట "కఠినకుచద్వయీ" యను పదములు ముముక్షువునకుఁ గలుగు పరీక్షలు, విభ్రమములు, కష్టములు అనువానికి వ్యంజకములు. వానికి లోనుగాక యామె యనుగ్రహమందుఁగల యతీంద్రియు లామె వక్షమునఁ గాంచనమాలికలోని పుష్పము లగుదురు. వారి నందరిని వికసింపఁజేసి యామెను రంజింపజేయు హేళికల్పుఁడు శఠమఠనర్షి. దైవసమానుఁడని యభిప్రాయము.

6. 1 – 38.

మహితసౌదర్శనమను విదుండు గొప్పదైన సుదర్శన మంత్రము నెఱిఁగినవాఁడు.

—ఓం నమో భగవతే శ్రీ సుదర్శనాయ అనునది సుదర్శన మంత్రము —బులును. ఇది సరికాదు. సుదర్శనమంత్ర మీ క్రింది విధముగా నిర్వచింపఁ బడినది :

తారో భృగుర్వియద్భ్యాయస్తదాద్యం
వహ్నిదీర్ఘయుక్

[1]కాంచన: "the filament of a lotus" Apte, Sanskrit-English Dictionary.

పావకః కవచాస్త్రాన్తో
మనుస్సప్తాక్షరస్స్మృతః."　　　　శారదా తిలకము. 16 – 67

"సుదర్శనమంత్రస్యోద్దిష్టత్వాత్తమాహ తార ఇతి తారః ప్రణవః, భృగుః స, వియత్ హః, తదాద్యం నః, వహ్నా రేఫః, దీర్ఘ ఆకారః తద్యుక్ తేన ఘా, పావకో రేఫః, కవచంచ హుం, అస్త్రంఫట్." —రాఘవభట్టవాఖ్య.

ఇత్యాది బహుప్రమాణములవలన సుదర్శనమంత్రము ఓం సహస్రారహుంఫట్ అని ప్రసిద్ధము.

"అళవందారుస్తవాభిశోభి" యను సమాసమునకు టీక గాని వివరణము గాని చెప్పఁబడలేదు. అళవందారు అనఁగా యామునాచార్య మునీంద్రులు. వారు ప్రపత్తి సిద్ధాంత ప్రతిపాదకమైన విష్ణుస్తుతిని రచించినారు. ఆ స్తోత్రమును అధ్యయనము చేయుట వలన మిక్కిలి శోభిల్లుచున్నాఁడని యీ సమాసమున కర్థము.

7. 1 – 79.

వచనము : "కవికుల తిలకుండు", "రవికుల తిలకుండు" – ఇందు రెండవ పాఠమే సమంజసము. వర్ణింపఁబడినది పెద సంగ భూపాలుఁడు.

కథా ప్రారంభము

8. 1 – 97.

ఆ ఋషుల ప్రశ్న మంగీకారం బొనరించి – "– జవాబు చెప్పుటకు – గ్రహించి" –బులుసు, అట్లనుటకన్న, 1. దాని నొక ప్రధాన ప్రశ్నగా అంగీకరించి, 2. దానిని దనలోనొక యంగముగా – అనఁగా జ్ఞేయమైన ప్రధాన జ్ఞానాంగముగా గ్రహించి – చూ. అంగీకృత పూర్వోత్తరపక్షవంబును – నన్నయ భారతమ్ము. ఆది. ఆ. 6 – 4. ఇచ్చట సూతుఁడు జ్ఞానమయుఁడు పురాణమయుఁడుగక నిది సమంజసము. 3. అంగమనఁగా నంతరంగము, దానియందు బ్రతిష్ఠించి యనియుఁ జెప్పవచ్చును.

ఇది కందపద్యము. ఇందలి ప్రథమ పాదమునందలి ప్రాసము ఋకారము. మిగిలినవానిలో రేఫము లున్నవి. దీనినిగూర్చి బులుసువారు "ప్రాసములందు హల్లుల కేనియమము కాన తొలిపాదమున "ఋ"ప్రాసమిందుండుట దోషము కాదు" అని వివరణము చేసినారు. ఈ వాక్యమువలన నే యచ్చునకైన నొక హల్లు ప్రాసము కావచ్చునను నతివ్యాప్తి కలుగును. మఱియు ఋకారము వాడిన మొదటి పాదమున నే హల్లును లేదు. అందుచే నిచ్చట హల్లునియమమును గూర్చి ప్రసక్తి లేదు. అట్లనుటకన్న ఋకారము రేఫతుల్యమను వ్యాకరణమందలి నియమము వానుషంగికముగా ఛందస్సునకు సమన్వయింపవచ్చును.

నన్నయ భారతమున నిట్టి ప్రయోగమున్నది.

"ఆ ఋషికుమారు కట్టిన
చీరలు మృదులములు......" —భారతము, అరణ్య, ఆ.3, ప.104

9. 1 – 98.

త్రిరావృత్తంబు = "మూడుసారులుగా, ... ముమ్మారు చెప్పఁ బడుట సూచితము" – బులుసు.

త్రిరావృత్తంబు అనఁగా మూడుసారులు అని చెప్పుట సమంజసము గాదు. మూఁడుసారు లావర్తింపఁబడినది. 1. అనఁగాఁ జెప్పఁబడినది. 2. మూడావరణలు గలది — క్షేత్రము, తీర్థము, దైవతము అని చెప్ప వచ్చును.

ఇచ్చటఁ గృష్ణద్వైపాయసునివలన మున్నెఱిఁగినట్లు సూతుఁడు చెప్పి నాఁడు. ఇచ్చటఁ గూడ స్కంద పురాణ ప్రసక్తి లేకుండుటచేఁ బవిత్రత, సంప్రదాయసిద్ధి కొఱకుఁ గవి యిట్లు సంకేతించెనని చెప్పవచ్చును.

10. 1 – 99.

మోక్షోపాయదుగ్ధాబ్ధి వేలాతీరావని = "మోక్షసాధనమగు పాలసము ద్రమునకు ఒడ్డు" — బులుసు

అ. మోక్షోపాయమనఁగా మోక్షమును బొందు మార్గము గాని సాధ నము గాదు. ఉపాయమను పదమునకు దగ్గరకుఁ జేర్చునదియను నర్థము. సాధనము గూడ నుపాయములలో నొకటి కావచ్చుఁగాని యుపాయ మనఁగా సాధనము గాదు.

ఆ. వేలాతీరావని యనఁగా ఒడ్డుకాదు. సముద్రతీరమునందుఁ జెలి యలికట్ట యొడ్డుననున్న భూమి భాగము. సముద్రప్రాంతమగు భూభాగమని యర్థము. ఇందు మోక్షమార్గమే పాలసముద్రము. అందు విష్ణువుండును గనుక నది విష్ణుదైవత్వమగు మోక్షమార్గమనియు, సముద్రతీర భూమి తాప హరమై నట్లిది భవతాపహరమనియుఁ బ్రతీతి కలుగును. మఱియు దుగ్ధాబ్ధి శివుని వర్ణనమున కుపమానము. శివవిష్ణు తత్త్వాత్మకమైన తారకమంత్రము వలన జీవు లిచ్చట ముక్తి నొందుదురని యిటుపైని వర్ణింపఁబడినదిగదా !

సంప్రదాయజ్ఞులు, సాధకులునగు మహాకవులు దైవతములను "ప్రకట గుప్తాకార"మైన సంకేతములనుగా వర్ణింతురు. ఇందు "మనుహరరాజయోగ ముల మర్మమెఱింగిన" సాధకులగు ముముక్షువుల దేహమందలి యంత ర్లోకములు వర్ణింపఁబడినవి. ఇవి బహిర్లోకమునకు బీజప్రాయములు. బ్రహ్మ యొక్క వాగ్బీజమగు నంతర్లోకమునకు వృక్షమే బహిర్లోకమని శాస్త్రములు చెప్పుచున్నవి.

కాశి యనఁగా స్వయంప్రకాశముగల యొక గ్రంథి – చూ. కాశీఖండము. శ్రీరాశి యనఁగా సంపదలరాశి యనియే గాక శ్రీ యను మంత్రాక్షరము యొక్క రాశియనియు నర్థము. దాని శబ్దముచేతఁ బ్రేరేపింపఁబడి యున్నిద్ర మగు దేవీతత్త్వమే యాడుతుమ్మెదయగు శితాహార్యసుత. అట్టి నాదాత్మక యగు దేవి విహరించు రాజీవమే కాశి. ఇది భ్రూమధ్యమునందలి యాజ్ఞా చక్రమునకుఁ బైన, సహస్రారమునకుఁ గ్రింద నుండును. దీనినే మూడవ నేత్రమని యందురు. Pituitary body అను గ్రంథియందిది యుండును. అందంతర్లీనమై శాశ్వతమై యుండు జ్యోతియే జ్యోతిర్లింగము. అది యీ కాశి యను గనిలో నుండును. భక్తులు నాదముతో దానిని త్రవ్వి వెలు వరింపవలెను. ఈ ప్రయత్నమున మథనము చేయవలసిన పాలనముద్రము – జలములలోని యగ్ని లేక జలతత్త్వమునందు మథించి తీయఁబడు వెలుఁగు తనకుఁ జేరువయగును —- ఇది శ్వేత ద్వీపవర్ణనలో "విరసజనహృదయంబులం దగులు వడని బ్రహ్మవిద్య"వలె "సప్తకక్ష్యాంతరంబులు"గా వివరింపఁబడినది. 3 – 142 నుంచి 157 వరకు. దుంఠినామక గజాలానంబు అను తావున మూలధార పద్మమునఁ జేయు గణపతి ధ్యానము చెప్పఁబడినది. దీనినిగూర్చి శాస్త్రమున –

"చతుర్బాహుభూషం, గజేంద్రాధిరూఢం" అనియు, దానియందు "కూజంతీకులకుండలీచ మధురం, మత్తాలిమాలాస్ఫుటమ్" అనియుఁ జెప్పఁ బడినది.

గంగామృత స్రోతోవిస్ఫుతిచంద్ర గోశమన మింమన్' అనుచోటఁ గాశి యను గ్రంథిలోని చంద్రశేఖరమూర్తి వర్ణింపఁబడినాఁడు. ఇచ్చట ఇంద్రయోని. సోమకంద మనఁబడు గ్రంథియుండును. దానినుండి యమృతద్రవము వర్షిం చును. దీనినిగూర్చి శాస్త్రమున – షట్చక్ర నిరూపణము. 6 – 41, 42

"నమసే తస్యాంతః శశపరిరహితః శుద్ధ సంపూర్ణ చంద్రః
స్ఫురజ్జ్యోత్స్నాజాలః పరమరసచయ స్నిగ్ధసంతానహాసీ
....
ఇహస్థానే దేవః పర శివసమాఖ్యానసిద్ధః ప్రసిద్ధః"

అనియు వేదమున "యత్రాసౌకేశాంతో వివర్తతే వ్యపోహ్యశీర్షకపాలే...... పేంద్రయోని" అనియుఁ జెప్పఁబడినది.

11. 1 – 100.

విశ్వనాథుఁడను సితరోలంబము పార్వతి వదన పద్మ సౌరభ్యము గ్రోలఁగల్గియుఁ దుష్టిలేక మునుల హృదయపద్మ సుగంధమును గోరును. ఆ రో లంబము ఆ పురిలోఁ బరానుఖను దన యాకృతిలోనికి దాలోందించును.

ఇందు శివమంత్రాత్మకమైన జ్యోతి పార్వతి ముఖస్థమై యెల్లప్పుడును జపింపఁబడు చుండుననియును, ఆమె విశుద్ధికమలమునఁ దుమ్మెదవలె నాదము

చేయుచుండుననియును. ఆమెచే స్వయముగా నుపదేశమందిన మునుల హృదయకమల మనఁబడు అనాహతచక్రమున నాదము చేయుననియునుఁ దదితరులు కాశీపట్టణమునఁ బ్రాణములు విడివినంతనే తారకమంత్రాకృతియై శివునిచే నుపదిష్టమై వారి కుపదేశ మనుపేరఁ దన యాకృతి నిచ్చుననియు ననఁగా సారూప్యముకి నిచ్చుననియుఁ బ్రధాన విషయము కమగుచున్నది.

12. 1 – 101.

ఈ సీసపద్యము పై పద్యములోని భ్రమరకీట న్యాయమును విశదీకరించు చున్నది. జీవుఁడు కీటస్థితియందున్నప్పుడు హేయ లక్షణము లుండును. అవియే శఠత్వము, నిర్వేదతనము, వర్షధరత్వము, భీరుత, మలినవర్తనత, మతిలేనితనము ననునవి. అట్టి జీవునకు భ్రమరత్వము సిద్ధించుట యనఁగా భ్రమ తెగిపోవుట యని సంప్రదాయజ్ఞులు చెప్పుదురు. అప్పుడు గంగాధరత్వము, అష్టమూర్తిత్వము, అర్ధనారీశ్వరత్వము, త్రిశూలధారణము, సుధాలలితమూర్తిత, చంద్రశేఖరత్వము, దక్షిణామూర్తిత్వ మగు సకల విద్యాగురుత్వము గలుగును.

ఇచ్చట నైశ్వర్యము లెనిమిదియు ననుచోట నణిమాద్యష్టైశ్వర్యములని బులుసువారు వివరించియున్నారు. అణిమాదు లష్టసిద్ధులు గాని యైశ్వర్యములు గావు. అవి శివునకుఁ బ్రత్యేక లక్షణములు కాఁజాలవు. ఏ యోగికైనను సహజముగా సిద్ధించును. మఱియు ముముక్షుతతో సంబంధములేని సిద్ధులవి. అందువలన నైశ్వర్యము లెనిమిది యను తావున శివుని ఈశతగల యష్టమూర్తిమత్త్వమైన విశ్వరూపమని చెప్పుట సమంజసముగా నుండును.

"మలినవర్తనుఁడును సుధాలలితమూర్తిని మించి వర్తించును" అను చోటఁ జంద్రుఁడు గురుదార గమనాదులు గలిగిన మలినవర్తనుఁడయ్యు శంకరుఁడు ధరించుటవలన సుధా లలితమూర్తియై వర్తించెననియు, దక్షశాపవిముక్తుఁడైనాఁడనియు నున్నగు స్ఫురణ లున్నవి.

"మౌనివర్యులఁ జదివించు మఱ్ఱినీడ" అనుచోట శివుని దక్షిణామూర్త్యవతారము చెప్పఁబడినది. దక్షిణామూర్తి లక్షణము శాస్త్రమున-

"చిత్రం వటతరోర్మూలే, వృద్ధాః శిష్యా గుర్యువా
గురోస్తు మౌనం వ్యాఖ్యానం, శిష్యాస్తు ఛిన్నసంశయః"

సర్వవిద్యా సమగ్ర స్వరూపము, విశ్వముయొక్క దర్పణదృశ్యమానత, మోక్షపదత్వము దక్షిణామూర్తి లక్షణములు.

ఆ ప్రొద్దు = 'ఆ రోజు' – బులుసు.

అదినమైనను. అనఁగా మేనోసరించు దినమైనను ననవలెను. ఇచ్చట జన్మమునం దెన్నఁడు నింటిఁబొయి రాజని నిఱుపేద యని భావము.

13. 1 – 102.

ముక్తి ప్రమదానందిత హారనీలతరళోపముఁడై = "ముక్తికాంతను తృప్తి పఱచిన హారమునందలి నల్లనైన మధ్యమణిని పోలినవాఁడై" — బులుసు.

తరళోపముఁడు = పతకమును బోలిన వాఁడు – తెన్మరము [1]

ముక్తికాంతచేత నానందింపఁబడిన – ముక్తికాంత మెచ్చిన, వరించిన – హారమునందలి పెద్ద నీలమణితో సమానమైనవాఁడు. ఇందు దైవతము లెల్లరును ముక్తికాంత మెచ్చిన హారములోని మణులు. అనఁగా మోక్షమిచ్చువారనియు, నందు నీలవర్ణుఁడైన కేశవుఁడు పెద్ద మణియనియు, ననఁగా ముక్తి కేశవోపాసనమున సులభమనియుఁ దాత్పర్యము.

14. 1 – 104.

రావియాకుల మొలనూలు = రావియాకుల యాకారముగల యాభరణ విశేషములు గ్రుచ్చిన మొలనూలు.

15. 1 – 105.

ఈ పద్యమందలి యలంకారము కల్పితోపమ – బులుసు. ఇది హేతూత్ప్రేక్ష యనుట సమంజసము.

ఇందుఁ దాత్పర్యమున "ఆ బంగరుటందె వలె కాశిపట్టణపుఁ గోట కనకమయమయి యున్నదని భావము" – బులుసు. "కనకమయంబై" యని వేఱుగాఁ బదప్రయోగ ముండుటచేత నిది మఱలఁ బద్యములోని భావము కాఁజాలదు. వామనమూర్తి త్రివిక్రమతఁ బొందినప్పటి తులాకోటి గనుక నది మిక్కిలి పెద్దది యని వర్ణింపుటయగును.

16. 1 – 110.

విశేషము : రాజకుమారుల కీర్తి యంబరవాహినియై పాతాళమునకుఁ బోయిన దనుటలో భూలోకమునుండి అంబరమునకుఁ బోయినది. అనఁగా నూర్ధ్వలోకమునకుఁ బోయినది యనియు, నాగలోక మనఁగా నధోలోకమునకుఁ బోయినది యనియు, నందిరవు కొనుటకు నెడము వాలక బుగ్గలుగా ననఁగా నూర్ధ్వస్రోతస్సులుగా భూలోకమునకే వచ్చిన దనియు, నా బుగ్గలవలె స్రోతస్సు లున్నవనియు నుత్ప్రేక్షింపఁబడుటవలన నౌధశబ్దము గనుకఁ గీర్తియే యట్లు రూపందిన దనుట యుచితము.

17. 1 – 111.

విశేషము : ఇందు సముద్రములను సంపులతోఁ బోల్చునపుడు "రత్నాకరములు" అను పదమునకుఁ బ్రత్యేక సార్థక్య మున్నది.

---

1. తరల = 1. The central gem of a necklace. 2. A necklace. 3. A level surface. 4. A bottom, depth. 5. A diamond. 6. Iron. –Apte.

రత్న + ఆకరములు = రత్నములకు నిలయములు. ఇది సంచులకు విశేషణము.

సముద్ర మను నర్థ ముపమానము.

సంవి మొదలు చేసి = "మూలధనముగాఁ జేసి" – బులుసు.

ఇచట క్రయమునకుఁ జేయు వాగ్దాన చిహ్నముగా – సంచకరువుగా – యను నర్థము కావచ్చును. వర్ణ్యమగు విషయము బేరమాడుట కాని వ్యాపార మారంభించుట కాదు. బేరమాడుటకుఁ గావలసినది క్రయమునకు మొదటిచ్చు ధనము.

18. 1 – 112.

వెలమలను శబ్దము పరిశీలింపఁదగినది. శ. ర. వెలమ. దే. వి శూద్ర జాతి విశేషము. – వెలమవాఁడు, వెలమది – బ. ఆ జాతివారు. "వెలమలు అను ఒక శూద్రజాతి" – బులుసు. "పూర్వటీకలో వెలమల = శూద్రులయొక్క అని యర్థము వ్రాయఁబడినది. వెలమ పదము శూద్ర సామాన్య బోధకము గాదు, విశేషవాచకము" – బులుసు.

ఇది సరికాదు. చాతుర్వర్ణ్య వర్ణనమున నాల్గవది యగుటచే శూద్ర సామాన్య వాచి యనుటయే తగును.

19. 1 – 113.

ఇందలి యలంకారము నిరుక్తి, అర్థాంతరన్యాసమునని బులుసువారు. ఇది విచారణీయము. ఇది నిరుక్తి యగును. రెండవ పాదమున "సర్వ జగంబుల" అనుచోట జగంబులో, గజంబులో పాఠాంతరములు పరిశీలనార్హములు.

20. 1 – 114.

"కెరలక క్రమ్మరింప నడుగెంటనె." అడుగెంటన్ = అడుగుపడిన మాత్రముననే. – అడుగు + ఎడు – బులుసు.

ఇందు పదవిభాగ మస్పష్టము. మరియు నీ పద విభాగమున కర్థము గనుపింపదు. ఈ విభాగము వలన యతి తప్పును. కనుక విచ్చట పదచ్ఛేదమునందో పాఠమునందో లోప ముండవలెను.

"నడిగెంటనె" యను రెండవ పాఠము సరియైనచో, నడి + గెంటనె యని విడదీసియేమైన నర్థము సాధింపవచ్చునేమో. "నడి + గెంటన్" లేక "నడు + గెంటన్" = నగము గంతుననే – దుముకుచుండఁగా సగముననే యని భావమేమో.

21. 1 – 114.

అ. బడిసాగదు చక్రయుగంబు – "రథచక్రములు సూర్యచంద్రు లగుటచే ఒకదాని తరువాత నింకొకటి నడచును గాని, రెండు చక్రములు వేగమున నొకసారిగా నడువవనియును".

ఆ. ప్రాతపంచారపు గుఱ్ఱముల్ – "నాలుగు వేదములును గుఱ్ఱము లగుటచే అవి నాటినుండి నేటి వఱకును ఎట్టి మార్పులేక వెనుకటి పద్ధతిలోనే యున్నవనియు" – బులుసు.

అందు, అ. సూర్యచంద్రు లెల్లప్పుడు నొకదాని తరువాత నింకొకరు నడువరు. ఇట్లుచెప్పుట కన్న నా చక్రముల వేగములు, పరిమాణము భిన్నములు గనుక బడి సాగదని వివరించుట సమంజసము. ఆ. గుణములలో మార్పు లేకపోవుటవలన నష్టము లేదు. ప్రాత శబ్దముచేత ముసలి గుణములని చెప్పుట సందర్భమునకుఁ దగియుండును.

పంచారము = ఐదంచులు గలది. ఇది సూర్యచంద్రుల నడుమఁ గలుగు పితృయాన చక్రము.

"పంచారే చక్రే పరివర్తమానే" — ఋగ్వేదము. 1 – 164 – 13

"పంచపాదం పితరం……" — ఋగ్వేదము. 1 – 164 – 12

ఈ గతిని గలిగించు గుఱ్ఱములు "పంచారపు గుఱ్ఱములు"

22. 1 – 119.

మూర్ధకుంతలావళిన్ = "ముంగురులను" – బులుసు

"పొడి వెంద్రుకల వరుస – ముడికందని వెంద్రుకల సమూహము" – తెన్మరము. —చూ. పుట. 35

మూర్ధకుంతలము = అలకము, నెఱికురులు = చుట్టవెంద్రుకలు, వక్ర కేశములు – శ. ర.

సిందూరాది మూర్ధమును ధరించు కురులు = అలకలు, నెఱికురులు – సూ. ని. ఇందలి సూ. ని. లోని మొదటి యర్థమును దీపాల పిచ్చయ్యశాస్త్రి తెలుఁగు నిఘంటువులు అను వ్యాసమున ఖండించినారు. చూ. సాహిత్య సమీక్ష. పు. 183.

"మూర్ధకుంతలములలో – సిందూరాది మూర్ధ మున్న దనుకొనుట పొరపాటు. మూర్ధ కుంతలములు, వట్టి కురులే గాని, మూర్ధముతో ఏలాటి సంబంధము కలవియును కావు. చూడండి…………"అలకాః మూర్ధకుంతలాః" కుమార సంభవము 5 – 55కు మల్లినాథవ్యాఖ్య.

"రాలువుప్పొడి దూసరములైన మూర్ధాలకంబులు కొనగోళ్లఁగలయ దువ్వి" — ఉద్భటా. 1 – 101

"సుభ్రువామప్యలకాన చూర్ణాన్" – భా. చం. 2 – 136.
"విలుళిత చూర్ణకుంతలతయా" – భా. చం. 6 – 47.

చూర్ణకుంతల శబ్దము చూర్ణమును ధరించుటనుబట్టి యేర్పడ్డది కాదు . ఆ శబ్దములోని చూర్ణము సిందూరాది చూర్ణమును కాదు. అసలా చూర్ణము విశేషణము గాని విశేష్యము గాదు. అలకాశ్చూర్ణకుంతలాః – అమరము."

"చూర్ణాః కుటిలాః కుంతలాః చూర్ణకుంతలాః" గురుబాల ప్రబోధిక

"చూర్ణక్షోదేచకుటిలే" – రభసః
"చూర్ణకాఖ్యాః కేశాః – చూర్ణకుంతలా –
"చర్చురాఖ్యాః కురలాశ్చ" – క్షీరస్వామి
"చూర్ణ కుంతలములు – Curls ringlets – Brown
"చూర్ణ కుంతలః – a curl, curly hair – Apte.

23. 1 – 120.

"పెక్కు కల్పంబులుండి" యని పద్యమునను, "పెక్కు కల్పముల నుండి" యని వివరణము – బులుసు – నందును పాఠభేద మున్నది. ఇందు మొదటిపాఠమే సమంజసము. తెన్మఠమువారి పాఠముగూడ నిట్లే యున్నది. రెండవ పాఠమును స్వీకరించినచోఁ బెక్కు వేల యుగములనుండి దేవతలు తన్ను ప్రార్థించిన వెనుకఁగాని యగస్త్యుఁడు వింధ్యదమనమునకుఁ బూనలేదని యర్థము వచ్చును.

"ఈ పద్యమున అలంకారము ఉపమ" – బులుసు.
"లోపాముద్రయును దాను బ్రభయుఁ దరణియునుబోలె" – ఉపమ.
"పరవిపత్ప్రతికార తత్పరులు ఘనులు" అనుచో నర్థాంతరన్యాసము.

24· 1 – 123.

ఇచ్చట నగస్త్యుఁడు లక్ష్మిని శ్రీ సూక్తమున స్తుతించెనని తాత్పర్యము.

25. 1 – 126.

లేడికి నొడియు = "జింకనాకర్షించు – జింకలను కొట్టు" – బులుసు.
ఇచ్చట లేడికొలకు ఒడుపు గల్గియుండు, లేడి యొడుపులు – మెలవులు–, అన్నియు గలిగిన గమనము గల యనుట తగును. అందుచే తప్పక లేడిని వేటాడఁగల శిలీముఖములని భావము. వర్ణింపఁబడిన బోయ మగువలు "తమ కేశములందు నవరములను గూడఁ బెట్టుకొన్నారనియు, జేగురుఁ దిరికలను చెంపలకు అలంకారములుగ పెట్టుకొన్నారనియు, మేలిపూగుత్తులను వక్షములపై నదిమి అలంకరించుకొన్నారనియు, వారు కదళీకాకాండములను కాళ్లతోఁ దన్నుచు, చమత్కారముగా నడచివచ్చుచుండిరనియు చమత్కారము స్ఫురించుచున్నది. అలం – వ్యతిరేకము, క్రమము" – బులుసు.

ఈ తాత్పర్యము సరిగా లేదు. పైఁ జెప్పిన పరికరములన్నియు వారు ధరించిరని యర్థము చెప్పుట సమంజసము కాదు. వారు సవరములు కేశములం దుపయోగించువారైనచోఁ దమకేశములు చామరములను జయించుట యసంగతము, ఈవర్ణన హాస్యాస్పదము నగును. నెఱికురులు, చారునావలు, నిబ్బరంపు గుబ్బచన్నులుఁ దొడలపెక్కువయుఁగలుగు మృగవధా శుద్ధాంత మీననయనలు ఆ యాలుమగల నర్చనలు సేసికొలిచిరి. ఏ విధముగాఁ గొలిచిరో పై నాలుఁగు పాదములలో వర్ణింపఁబడినది. చామరములకుచ్చును దీగె పెనలచే నమర్చి వీవనలు వేసిరి. కమ్మ సంపెఁగలను జేగురు దిరికలను వారి వెంపలయందుఁ బెట్టి యలంకరించిరి. శిలీముఖములతో మేలి పుష్పగుచ్ఛములను రాలగొట్టి తెచ్చిరి. ఏనుఁగుల తొండముల సహాయమునను దమ పాద తాడనములచేతను గదళికా తరువులను బెఱికి దెచ్చిరి. ఆ పరికరములతో నయ్యాలుమగల సేవించిరని యర్థముగాని తాము సింగారించుకొని వారిని బూజించిరనుట సంగతము కాదు. ఈ పద్యములోని క్రమాలంకారమున రచనాసౌందర్య మంతయు నిమిడి యున్నది. నెఱికురులు గల బోయమగువలు చమరవాలములజుట్టును—కేశములను — లాగి కట్టి దానితో వీవన వేసి కొలిచిరి. చారువాసలు గలవారు సంపంగి మొగ్గలతోఁ బూజించిరి. గుబ్బచన్నులవారు పూలగుత్తులతోఁ బూజించిరి. తొడల పెక్కువలవారు ఏనుగు తొండములచేఁ గదలికా తరువులను బెల్లగింపఁజేసి, కాళ్లతోఁ దన్ని చదును చేసి — మంటపస్తంభములుగా నమర్చి — యర్పించిరి.

ఈ వర్ణనము తమ నెఱికురులు మున్నగు శరీర సౌందర్యాంగములు చామరములు మున్నగు నుపమానములను గ్రిందుపఱచుచున్నవని భావము.

26. 1–129.

స్వేదకోరకంబు = "చిరుచెమట" బులుసు.

అంతకన్న మొగ్గలు దొడిగినట్లు పోసిన చెమట బిందువు లనుట సరసము. ఆననస్వేదము సహజముగా మొగ్గలు దొడుగుచున్నట్లు రూపొందును. నఖరాగ్రలూన మగుటలో నీ రూపకమువలన సరసత కలుగును.

23. 1–130.

విశేషము : మరుత్సంపూర్ణచంద్రాననాజనకేళిపద చంద్రకాంతము = "నిండుచంద్రుని వంటి ముఖము కల దేవతాస్త్రీలకు క్రీడాస్థానమయిన చంద్రకాంతపు రాళ్లు కలదానిని" —బులుసు

ఇచ్చట వారి యాననములు సంపూర్ణ చంద్రమండలములు గనుక నచ్చటి చంద్రకాంతపు రాళ్ళు ఆ మరుత్కాంతలకు విహారయోగ్యములనియు వారి విహారమున నవి ద్రవించు ననియును జమత్కారము.

28. 1-131.

లూనముఖదర్భసందర్భవేశంత సైకతంబులు = "కోయఁబడిన దర్భల కూడికకల - కోసిన దర్భల మొదళ్లు కల - బురదగుంటలతోఁ గూడిన ఇసుక దిబ్బలు" టీక, "బురదగుంటల యొద్దునఁ గల దర్భలు కోయఁబడుటచే మొదళ్లు మాత్రము కనఁబడుచున్నవి." —తాత్పర్యము. బులుసు.

అ. వేశంతమనఁగా దొరువు, అల్పజలాశయమని యర్థము కాని బురద గుంట కాదు.

ఆ. ఇది యాశ్రమ వర్ణనము. అందలి నిష్ఠాపరులు బురదగుంటలోని దర్భలు కోయుట సంగతము కాదు.

ఇ. దర్భసందర్భవేశంత సైకతంబులనఁగా దర్భలా వేశంతముల నిండుగాఁ బెఱిగినవని గాదు. సందర్భ శబ్దమునకు నత్యంత సామీప్యమునఁ గూడియున్నవి యని చెప్పవలెను. వేశంతముల చుట్టును దర్భలు పెఱిగిన యిసుక ప్రదేశములున్నవి. ఇచ్చట దర్భసందర్భములైనవి వేశంత సైకతములుగాని వేశంతములు గావు.

ఈ. బురదగుంట లున్నచోట సైకతములుండవు.

"భసలకలభకులాకృష్టకుసుమవిసర
మసృణ మకరందమయమైన మావిమోక"

భసలకలభకుల= "కొదమ తుమ్మెదల సమూహముచేత, అస్పృష్ట = బాగుగా తాకఁబడిన, కుసుమ విసర= పుష్పసముదాయమువలని, మసృణ= చిక్కని, మకరందమయమైన=తేనెతోఁ గూడిన, మావిమోక=గున్నమామిడి"
—బులుసు

"గండుతుమ్మెదల గట్టితాకుడువలన మావిపూగుత్తులనుండి కారిన తేనె చెట్లకు అరఁగట్టిన కావిగుడ్డలపయి పడి, మామిడి చిగుళ్ల కాంతిని ఆ వస్త్రము లకుఁ గలిగించుచున్నది." —తాత్పర్యము. బులుసు

అ. పద్యమున "కలభకులాకృష్ట" యనియు. టీకలో "కలభకుల + అస్పృష్ట" యనియు ముద్రితము. తెన్మఠమువారి ప్రతిలోను తణుకు ప్రతి లోను "కులాస్పృష్ట" యని యున్నది. "కులాస్పృష్ట" యను పాఠమే సరి. ఇచ్చట భసలకలభకుల + అస్పృష్ట=కొదమ తుమ్మెదలచే తాకఁబడని యని చెప్పవలెను. వర్ణ్యవస్తువు ఆశ్రమభూమిగాని శృంగారవనము కాదు. గండు తుమ్మెదలచేఁ దాకఁబడని పువ్వులుండుటవలననే యామామిడి వృక్షము చిక్కని తేనెతో నిండి యున్నది. ఇది బ్రహ్మచారులు, వారి ముఖముయందలి బ్రహ్మ వర్చస్సు, తపశ్శక్తిని స్ఫురింపఁజేయు వర్ణనము. ఆ మావిమోకయొక్క చిగుళ్లకాంతి రెట్టింపుగాఁ దళుకై యచ్చటి ఋషుల చెంగావి వలువయందుఁ బ్రతి బింబించుచున్నది. చెంగావి వలువ వైరాగ్యమునకుఁ దురీయాశ్రమమునకుఁ

జిహ్మము. దానికే వన్నెతెచ్చునట్టి దీ తుమ్మెదలచే స్పృశింపఁబడని మావిమోక యొక్క చిగుళ్లకాంతి. అనఁగా యతీశ్వరులైన గురువులకు వన్నెతెచ్చు నడవడి గల బ్రహ్మచారి శిష్యుల స్ఫూర్తి యిందున్నది. భసలకలభకుల + అస్పృష్టయను పదము, మసృణపదము, ఋషుల చెంగావి వలువ యను పదము కారణముగా శబ్దశక్తిమూలకము, ప్రకరణాత్మకమునగు వ్యంజనవలనఁ బ్రధాన విషయము ప్రతీయమాన మగుచున్నది.

29. 1 – 132.

విశేషము : ఈ పద్యమునందలి దుష్కరప్రాసము, సంయుక్తాక్షరముల తోడి, హ్రస్వ దీర్ఘ వర్ణ మిశ్రితమైన సమాస ఘటన ధూమలతలయొక్క యాకృతికి వ్యంజకములు.

30. 1 – 133.

నిష్కాలగళుండు మున్నగు విశేషణములవలన నతఁడు సగుణ శివస్వరూపమునకు వెనుకనున్న నిర్గుణ పరబ్రహ్మము ననుభవించువాఁడని ధ్వని. అందువలన "నంబరకేశ" శబ్దము శివునకుఁ బ్రయోగించుట సార్థకము. శివతత్త్వముతో నిట్టి యభేదము సాధించి యతఁడు వాధూలముఖాతిరిక్త చరితుఁడైనాఁడు. ఉత్ప్రేక్షతోఁబాటు వ్యతిరేకము న్యూన రూపకము కూడ నున్నవి.

31. 1 – 135.

సత్త్వగుణకీర్తితమూర్తి = సత్వగుణముచేతఁ బొగడ్తగొన్న యాకృతి.

వాలిసాలసంహార విహార కారణము = వాలి యను కోఁతియొక్క నాశనము విహారమునకుఁ గారణమైనది" – బులుసు.

వాలిని, సప్తసాలములను సంహరించుట, – వనవాస – విహారము చేయుటయుఁ గారణములుగాఁ గలది. లేదా వాలిని సప్తసాలములను సంహరించుటయే తన విహార కారణముగాఁ గలది. "గజపక్షమున – వాలి, సాలసంహార విహార కారణము = మ్రొగ్గి – పూని, వృక్షములను విరిచి నాశనము చేయునట్టి యాటకుఁ గారణమైనది." –బులుసు.

వాలి = వాలముగల జంతువు, సాల = మద్ది మున్నగు చెట్లు.

రఘుకుంజరభర్త = "రఘువువంటి గొప్ప ఏనుగులరాజు – రఘువంశస్థుఁడైన ఏనుఁగులరాజని పూర్వటీక" – బులుసు.

గజపరముగా రఘు = వేగవంతము, శక్తిమంతమునగు, కుంజరభర్త – ఏనుగులరాజు అనుట యుక్తము.

రాముని పరమున —
"రఘుకుంజరభర్త = రఘువంశశ్రేష్ఠుఁడైన శ్రీరాముఁడు" – బులుసు.
వంశమను నర్థమునకుఁ బదము మూలమున లేదు.

విశేషము : ఈ పద్యములో వర్ణింపఁబడిన వస్తువున నొక సందేహము కలుగును. రాముఁ డవతరింపకముందే యగస్త్యుఁడు దక్షిణమునకు వచ్చినాఁడు. వాల్మీకి రామాయణమున నరణ్యకాండలో రాముఁడు వనవాసకాలమున నగస్త్యాశ్రమమునకుఁ బోయి యగస్త్యుని దర్శించినట్లున్నది. కనుకఁ దన దక్షిణ యాత్రా మార్గమధ్యమున నున్న యగస్త్యుఁడు శ్రీరామ వర్ణన చేయుటయు "మున్ను సంహారమొనర్చె" ననుటయు నెట్లో! అవతార కథలు ప్రతి కల్పము నందును గలుగుచుండును. గనుక నగస్త్యుఁడు తలఁచినది యంతకు ముందటి కల్పములోని రామకథ కావచ్చును.

32. 1 – 136.

"దూరోద్గమద్దావధూమ మంబుదబుద్ధి
నెమ్మి లోపొదనుండి నిక్కిచూచె"

యను పాఠము సర్వసమ్మతము. ఈ పాదమున భ్రాంతిమదలంకారమున్నది.

"సరసిపై నీరు = సరస్సుపై నున్న నీరు" – బులుసు

నీరు సరస్సులో నుండునుగాని సరస్సుపై నుండదు. సరస్సునందలి పై. నీ రని యర్థము. నీటి పై పాలమాత్రమే సలసల తెఱలె ననుట స్వాభావికము

"విపిన సకల వీధులు = అడవిలోని ప్రదేశము లన్నియు" – బులుసు. అట్లనుటకన్న నడవిలోని దారులన్నియు ననుటొప్పును.

33. 1 –142.

పంచాక్షరీ గుహాహర్యక్షంబు = పంచాక్షరీమంత్రమను గుహకు సింహ మైనవాఁడు" – బులుసు.

ఇచ్చటఁ బంచాక్షరీ మంత్రముయొక్క గుహలోని – లోపలి భాగమున – సింహము అనవచ్చును.

34. 1 – 144.

విశేషము : "బాహుసారుఁ గుమారున్" అను చోటను, "గలశసుతుండుం బలుకుల మొలకలు" అను చోటను గల యనుప్రాసాలంకారములు నుతి వాక్య మందలి పుష్పోపహార సామ్యతకు సూచకములు.

35. 1 – 145.

"వసవల్పు = వసవలపు – వనకంపు" – బులుసు.

ఇందు వసాగంధము రాక్షసులయందును వసకొమ్ము వాసన శిశువుల యందు నుండును గనుక నిందు శ్లేషను జెప్పవలెను.

36. 1 – 152.

ఇందు గ్రంథమందలి ప్రధాన విషయము తొలుతగాఁ బ్రస్తావింపఁబడినది. వేల్పు, తీర్థము, క్షేత్రము నను మూఁడంశము లిందున్నవి. దీవిక వాండీస్వ

రూపమైన "మనాక్ కావ్యార్థ సూచనమే" కథారంభమునఁ జెప్పబడిన "త్రిరావృత్తంబు" – 1 – 98. ఇది "యుత్తమశ్లోకుండగు కృష్ణద్వైపాయను వలన మున్నె తెలిఁగినయది." ఈ యంశమే గ్రంథమునఁ బాండురంగనామకమగు ప్రధాన వస్తువు. ఇందలి మూఁడంశములును.

1. వేల్పు – పాండురంగవిఠ్ఠలుఁడు
2. తీర్థము – భీమరథి
3. క్షేత్రము – పౌండరీకము.

ఇందలి త్రిరావృత్తమగు పురావృత్తము "ప్రకటగుప్తాకృతి (mystic, half veiled) — 2 – 75.

సంప్రదాయజ్ఞు లిందలి గుప్తాకృతిని యిట్లు చెప్పుదురు :

1. వేల్పు – మనలోనున్న యంతర్యామి
2. తీర్థము – తరణోపాయమైన యొక నాడిక, దేహమందలి నాడులలో నొకటి.
3. క్షేత్రము – శరీరము

ఇందు వేల్పును గూర్చి —

"ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి"
"దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవస్సనాతనః"

మున్నగు వాక్యములు ప్రమాణములు.

రెండవదియగు తీర్థము ఆయా సంప్రదాయమునుబట్టి మాఱుచుండును. సామాన్యముగా సుషుమ్న యను నాడి పరమతీర్థముగాఁ గైకొనఁబడును.

క్షేత్రము : భౌతిక దేహమం దొకానొక భాగము స్వీకరింపఁబడి, యం దంతర్గతముగా నున్న చక్రమో, చైతన్య గ్రంథియో క్షేత్ర శబ్దవాచక మగును. అందలి వ్యూహ మంతయు నంగదేవతలతోఁబాటు వర్ణింపఁబడును. ఇది గుప్తాకృతి. ఇది కొందఱికొఱకే. ఇకఁ బ్రకటాకృతిరూపవి యందఱెఱిఁగిన పుణ్య క్షేత్రములు. గుప్తము శరీరమందును (అంతర్లోకమున) ప్రకటము భూతలమందునను (బహిర్లోకమున) ఉండును. పై మూఁడంశములు గలసి యున్న విశేషమును దెలుపుటయే యీ గ్రంథస్థమగు ప్రధాన విషయము.

37. 1 – 153.

పురభిత్తనయుఁడు – త్రిపుర సంహారియగు శివునికిఁ బుత్రుఁడు. గుప్తార్థము, తార మంద్ర మధ్యములకు స్థానములు ఇంద్రయోని, మూలాధారము, అనాహతము త్రిపురములు. వానిని భేదించుట త్రిపుర సంహారము దానికి వలసిన బ్రహ్మచర్యాదులతోఁ గూడిన జీవుఁడు పురభిత్తనయుఁడు. అట్టివాఁడు గూడ "తత్త్రి విధము నొక్క నేలం గుమి కూడి యునికిఁ గనఁజాలఁడు." అనఁగా మిక్కిలి దుర్లభమైన సంప్రదాయమునకుఁ జెందిన మోక్షసాధన మిందుఁ జెప్పఁబడినది.

38. 1–155.

"మచ్చేతోగతి = నా మనోమార్గమందు – మనస్సున" —బులుసు
చేతస్సు = జన్మాంతర సంస్కార స్మృతికరణమగు ప్రజ్ఞ.
—"తచ్చేతసా స్మరతి నూనమబోధ పూర్వం
భావస్థిరాణి జననాంతర సౌహృదాని" —కాళిదాసు
సముపేతావృతి = ఆవరణతోగూడిన
ముకురకుక్షిన్ = అద్దములోపలి భాగమున
ఇభమునుబోలెన్ = ఏనుఁగువలె.

39. 1–156.

అక్షికౌక్షేయుఁడు = మూఁడవ కన్ను అయుధముగాఁ గల శివుఁడు. అ కంటికే యీ యేనుఁగువంటి త్రిరావృతమైన పాండురంగతేజము గోచరించును గనుక నక్షికౌక్షేయుఁడు చెప్పఁగలఁడని భావము.

40. 1–173.

ఈ పద్యమునకుఁ దాత్పర్యము, విశేషములు చెప్పఁబడలేదు.

తాత్పర్యము : కుమారస్వామి కైలాసమును సమీపించుచుండగాఁ బర్వత శిఖరములు మొలచిన శివుని శిరస్సులవలె నున్నవి. దట్టమైన యడవుల వరుస యా శివుఁడు గట్టిన చర్మమువలె నున్నది. శివునిమూర్తిలోపలఁ దిరుగు సమస్త లోకములవలె నా పర్వతమునఁ జరించు జీవులు తోచినవి. ఈ విధముగాఁ దన పుత్రునకు గిరీశుఁడు దర్శన మిచ్చిన రీతి కానుపించెను.

ఇందు శివుఁడు ప్రకృతియుతమైన తన విశ్వరూప విస్తృతిని గుమారునకుఁ జూపినట్లే వర్ణన మున్నది. "లోనఁజూపట్టిన విశ్వమై" యనుచోట విశ్వములోనతఁ డంతర్యామిత పొందిన రూపమే కాక తదతీతము, దృశ్యమాన నగరీతుల్యమగు సూక్ష్మ ప్రకృతి – బీజప్రకృతి – రూపకము కూడ నిందు వర్ణింపఁబడినది. అదియే దక్షిణామూర్తి తత్త్వము. ఇందుపమాలంకార మున్నది.

41. 1–176.

వెండిరానేల దుమ్ము సప్తర్షులకుఁ గూడ భస్మధారణార్హమైన పవిత్రత కలదియని యర్థము. ఇందుఁ గైలాస ధూళికి, నందిగిట్టలకుఁ గల పవిత్రత సూచింపఁబడినది.

42. 1–180, 181.

ఉద్యాన విహార మొనరించు శివునకుఁ బుష్పపూజ చేయుటకు ఋతువులాఱును బ్రత్యక్షమయ్యెనని వర్ణించుటలో నిచ్చటఁ జెప్పబడిన శివలోకమందలి కైలాసము "మహాకాలము" నందున్నదనియు, నందు భూత భవిష్యద్వర్తమానముల నొక్కుమ్మడిగా శాశ్వతత్వ మనుభవించు మహాకాలుఁడు శివుఁడనియు సూచింపఁబడినది.

43. 1–188.

ఇందలి యలంకారము క్రమము, రూపకము అని చెప్పఁబడినది. కాని క్రమము, అర్థాంతరన్యాసము కావలెను.

44. 1–189.

ఈ పద్యమునఁ బార్వతీదేవి యొక్క కామేశ్వరి యవతారముద్ర వర్ణింపఁ బడినది. అందులకు లక్షణము.

"హరనేత్రాగ్నిసందగ్ధ కామ సంజీవనౌషధిః" అను లలితా సహస్ర నామాంతర్గత పాదము.

ఇందు హర అనఁగా హకార రేఫములు. నేత్ర మనఁగ ఇకార సంయోగము. హ్రీం అను సంయుక్త వర్ణము శక్తియొక్క బీజనామము. అందలి రేఫము అగ్ని యనఁబడును.

45. 1–193 నుండి 196.

అగస్త్యాదులతోఁ గుమారస్వామి వచ్చి యడుగఁదలఁచిన ప్రశ్నయే పార్వతియు నడిగినది. ఈ విధముగాఁ బరమేశ్వరుని మనస్సును వారి యాగమన నిమిత్తమున కనుకూలము చేసినది. ఈ వర్ణనమువలనఁ "బురుష కారము" అనఁబడు దేవీకటాక్షము సూచింపఁబడినది.

46. 1–198.

"టంక్రియార్భటిన్, వరలు= "ధనుష్టంకార ధ్వని రీతిని, ఒప్పునట్టి"
—బులుసు

ఇది ముదుసలి కావలివాండ్ర చేతి కడియములు కిరీటములకుఁ దగిలినప్పుడు పుట్టుధ్వని. ధనుష్టంకార ముపమానము మూలమున లేదు. వట్టి టంకారమే. అనగా ఖంగుమను శబ్దము.

47. 1–199.

"దర్శనంబిచ్చుట=కన్పించుట—చూడ ననుమతించుట" —బులుసు

ఇచ్చట కన్పించుటయను నర్థము సరియైనది. చూడ ననుమతించుట యను నర్థము సరికాదు. దేవతలు ద్రష్టయొక్క యర్హత ననుసరించి తమతమ స్థానము లందుఁ బొడకట్టుదురు, కొందఱకు గనుపింపరు. కనుక మానవ ప్రభువుల దర్శనమందువలె ననుమతించుట విషయము కాదు.

48. 1–216.

శుద్ధతత్త్వప్రపత్తి="పరిశుద్ధ స్వభావమున వర్తించువాఁడా" —బులుసు
ఇచ్చట శుద్ధతత్త్వమనఁ బరమానందమనియుఁ బరతత్త్వమనియుఁ జెప్పనగును.

49. 2-5.

"అత్యలఘువివేక పాకనిధి=అతిలేటిన తెలివికి నిధియైనవాఁడు"

—బులుసు

గొప్పదియైన యుక్తాయుక్త పరిజ్ఞానమునకు, బహుజన్మ సముపార్జితమైన సుకృత పరిపాకమునకు నిలయమైనవాఁడు. వివేక మనఁగా మంచి చెడులను దెలియు సామర్థ్యము. ఇదిగూడఁ దెలివిలో భాగమేగాని వివేకమనఁగా దెలివి గాదు. పాకమనఁగాఁ బంట. ఇచ్చట మంచి పూర్వ సంస్కారము.

50. 2-8.

బరాబరిచేసి=హద్దున నిలిపి

సాత్త్విక స్వల్పభోజనలబ్ధి=సత్త్వమును గలిగించు వస్తువులనే కొలదిగా భుజించు స్థితి—సత్త్వమనఁగా బలము, సత్త్వగుణము.

ముద్రాసనంబుల మేని పనిగొని=ముద్రలు, ఆసనములు నగు సాధనములతో దేహమునకుఁ బని గల్పించి, యనగా శ్రమింపఁజేసి—జాలంధరము మున్నగునవి ముద్రలు. ఇవి ప్రాణమయకోశమును బరిశుద్ధిచేయును. పద్మాసనము మున్నగునవి యాసనములు. ఇవి స్థిరముగను, సుఖముగను సిద్ధించినప్పుడన్నమయ, ప్రాణమయ కోశములను శుద్ధిచేయును. ముద్ర అనగా వరదాభయ పాశాంకుశాదికములు కొన్ని యున్నవి, అవి మనోమయ విజ్ఞానమయ కోశములను బరిశుద్ధి చేయును. ఆసనములలోఁ బద్మాసనమనగా షట్పద్మములలో నొకదానియందు మనోమయమగు స్థిరత్వము సుఖత్వము సాధించుట. దీనివలన మనోమయ విజ్ఞానమయ కోశ శుద్ధి పరిపూర్ణ మగుటయే గాక పరిపుష్టము కూడ నగును. వీని వివరణమంతయు "షట్చక్ర నిరూపణము" మున్నగు గ్రంథములం దొసఁగఁబడినది.

పాపపూరుషున్=పాపస్వరూపుఁడగు పురుషుని. జీవుని పాపసంస్కారము లన్నియుఁ బ్రాణమయ మనోమయ కోశాత్మక పురుషుని యాకృతిలో నుండును. ధ్యానబలమువలన జ్ఞానాగ్నిలో నీ పురుషుఁడు భస్మమగును. పాపపురుషుని వర్ణనము శాస్త్ర గ్రంథములలో నిట్లున్నది.

"బ్రహ్మహత్యా శిరస్కంచ స్వర్ణస్తేయ భుజద్వయమ్:
సురాపాన హృదాయుక్తం గురుతల్ప కటిద్వయమ్"
తత్సంయోగి పదద్వంద్వ మంగప్రత్యంగ పాతకమ్
ఉపపాతక రోమాణం రక్తశ్మశ్రు విలోచనమ్
ఖడ్గ చర్మధరం పాప మంగుష్ఠ పరిమాణకమ్
అధో ముఖం కృష్ణ వర్ణం దక్ష కుక్షౌ విచింతయేత్

మూలాలవాల గహ్వరకరండకుండలీస్థాన గోకర్ణ కులకలాప తత్త్వ దర్శన వర్ణాధిదైవత దశ నిర్ణయంబు=మూలాధారమగు గుహారూపమగు బరిణెయగు కుండలీ స్థానమందలి శేషుని తత్త్వమును, విష్ణుతత్త్వమునకు మూలములగు బీజాక్ష

రములు అధిదేవతలు దళములు అనువాని తత్త్వమును బాగుగ నెఱిఁగెనని భావము – బులుసు.

మూలాధారము గుహ కావచ్చును. మఱల బరిణె యెట్లగును? విష్ణు తత్త్వమను వాఖ్యకు మూలము లేదు. ఇందు వర్ణింపఁబడుచున్నది సర్వా గమ సమ్మతమగు యోగవిషయము.

మూలాలవాల = మూలాధారమను పాదు, గహ్వర=గుహ -కన్నము, కరండ=బరిణె, కుండలీస్థాన=పాముండుచోటు, కుండలి యుండుచోటు. గోకర్ణ కుల=సర్పము. కుకలాప=కులకుండము – కుండలినికిఁదావు. తత్త్వదర్శన =నిజస్వరూపమును దర్శించుట, వర్ణాధి దైవత, దళనిర్ణయంబు=అక్షరముల యొక్కయు రంగుల యొక్కయు నధి దైవతములను షట్పద్మముల దళముల సంఖ్యాదికమును నిర్ణయించుట. మూలాధారమందున్నపాదు కన్నమునందలి బరిణెవంటిది, కుండలినీ నివాసమునగు కుల కుండ మిందలి నిజస్వరూపము నమభవించునపుడు పొడకట్టు నక్షరములయు, రంగులయుఁ, బద్మదళములయు నిర్ణయము.

--మూలాధారము యోగ విద్యకుఁ బాదువంటిది. అందొక కన్న ముండును. దానియందు 'కందము' అనబడు స్థాన ముండును. అది కుండలిని యను సర్పమునకు నిలయము. దీని నుద్బుద్ధము చేసినప్పటి మూలాధార మును 'కులకుండము' అందురు. అప్పట తత్త్వ దర్శనము జరుగుచున్న సమయమందలి యనుభూతులలో నొక్కొక్క పద్మమున అకారాది క్షకారాంత ములలోఁ గొన్ని కొన్ని ధ్వనులు వినిపించును. ఏడు రంగులలో నొక్కొక్కటి కనిపించును. షట్పద్మముల దళములు నిర్ణీత సంఖ్యలు గలవియై విచ్చుకొనును, వీని నిర్ణయమంతయుఁ బుండరీకున కున్నరూపునఁ బొడకట్టినవి. మూలాధార మును బాదుతో బోల్చుటవలన యోగవిద్యను మహావృక్షముగా – సంసారవృక్ష మునకు మాఱుగా – పుండరీకుడు దర్శించెను.

51. 2-9.

అర్జున రథభూషణంబు= "అర్జునునకు సారథియైనవాఁడు" —బులుసు అర్జునుని రథమున కలంకారమైనవాఁడు.

నిద్రవు విట్ట చూవుసన్="చలింపని ప్రేమమయ దృష్టిచేత" -బులుసు చలింపని సూటియైన దృష్టిచేత —ఏకాగ్ర దృష్టిచేత.

తాత్పర్యము: మంత్ర, హఠ, రాజయోగముల రహస్య మెఱిగి, తచ్ఛబ్ద వాచ్యమైన యర్థమును – పరమాత్మను – దెలిపిన సిద్ధి పొంది, యా సిద్ధి నిందు మనస్సును బుష్పింప జేయగా హృదయపద్మమందలి దట్టమైన పరిమళమునకుఁ దుమ్మెదవంటివాఁడు, నర్జునుని రథమున కలంకారమునగు శ్రీకృష్ణుని దన బాహ్య దృష్టిలేని ఏకాగ్రమగు నిశ్చలాంతర్దృష్టితో దర్శించి, తన సహస్రార దళకమలము నుండి వర్షించు నమృతము క్రమను దొలగింపగాఁ బరవశుఁడగును.

విశేషము: షట్పదశబ్దమువలన వక్ష్యమాణమగు గోపాలషడక్షరీ మంత్రము, షట్కోణ యంత్రము, షట్చక్రములయందు జరుగు విన్యాసము వ్యంగ్యములు.

52. 2-11. 1వ పాదము.

సనకసనందనాది నిఖిలాంతర్వాణి
హృల్లీనభావంబు సల్లపెట్టి.

"తత్వశాస్త్రము నెఱిఁగినవారి మనస్సులయందు లయించి యుండుటను - నల్లించి - వదలి" - తెన్మఠము.

"సనకుఁడు సనందనుఁడు మొదలగు విద్వాంసుల మనస్సులయం దణఁగి యుండు - నివసించియుండు - టను విడిచి" - బులుసు.

తెన్మఠమువారి టీకలోని "తత్త్వశాస్త్రము నెఱిఁగినవా" రెవ్వరును బద్య పాదమున లేరు. అంతర్వాణి శబ్దమున కిందు వివరణము లేదు. బులుసు వారి టీకయందును లేదు. ఈ పదముయొక్క యర్థము విడవియే సమాసమున కర్థము చెప్పఁబడినది.

టీక: సనకసనందనాది = సనకుఁడు, సనందనుఁడు మొదలైన, నిఖిల = సమస్త, అంతర్వాణి = లోపలివాక్కు గలవారు - అంతరంగమునుండి శ్రుతి స్వరూపమగు శబ్ద బ్రహ్మమున సర్వమును వాక్కుగా వినఁగలవారు - ఋషులు, హృత్ + లీనభావంబు = హృదయమం దిమిడియున్న భావమయ రూపమును, సల్లపెట్టి = విడిచి.

తాత్పర్యము: సనకసనందనాది యంతర్ముఖుల హృదయమం దిమిడి యున్న భావమయమగు తన యనుభూతిని గూడ విడిచి యని చెప్పవలెను. అనఁగా వారి హృదయములలోని యనుభూతికన్న పరమభక్తుఁడగు పుండ రీకుని హృదయమున దైవమున కెక్కువ యనుభూతి కలిగినది. అనఁగా దైవభావ మెక్కువగా ననుభవింపఁబడెనని యర్థము.

సనకసనందనాదులు తత్త్వశాస్త్రము నెఱిఁగినవారు, విద్వాంసులు నను నర్థము చెప్పరాదు. బ్రహ్మయొక్క సృష్టిలోఁ గౌమారసర్గ మనఁబడు నత్యు త్తమ మార్గమున స్వయం వ్యక్తులైన నలుగురు కుమారులువారు. మోక్ష స్వరూపులు. వారు సనక, సనందన, సనత్కుమార, సనాతను లనువారు.

2వ పాదము. విశ్వంభరాభోగ వివిధమూర్త్యంతరస్ఫురితానుభావంబు బుజలువైవి =

"లోకోద్ధారకములు, గొప్పవియు నగు అవతారములు ఎత్తు మహిమను సున్నలు పెట్టి" - బులుసు.

"సర్వమును భరించునట్టి గొప్పవియు నానావిధములునైన రామకృష్ణాదిమూర్తులచేత ప్రకాశించునట్టి మహిమను – సున్నలు పెట్టి – మాని" – తెన్మఠము.

1. బులుసువారి టీకలో "లోకోద్ధారకములు, గొప్పవియు" అను టీకకు మూలపదము లీ సమాసమున లేవు. అట్లే తెన్మఠమువారి టీకలో "గొప్పవియు" అను పదమునకును.

2. మూర్త్యంతర శబ్దమునకు బులుసువారి "అవతారములు ఎత్తు మహిమ" తెన్మఠమువారి "రామకృష్ణాదిమూర్తులు" అను వివరణము విచారణీయము.

ఈ పద్యమున వర్ణింపఁబడినది "శిఖండిబర్హమండిత శిఖండకుఁడు" అనఁగా శ్రీ కృష్ణమూర్తి మంతమైన పరబ్రహ్మము. ఆ మూర్తియే సున్నలు చుట్టినచోఁ బుండరీకుని పని సున్నయే యగును. మఱియు నంతర్యామి యవతార మెత్తినపుడు స్వస్థితి ఖాళీయగుట గాని లేక యొక భక్తుని ధ్యానమునఁ బొడకట్టఁ దలఁచినపు డవతారమూర్తులు సున్న చుట్టుటగాని సమయ విరుద్ధము. ఎందఱు భక్తులు ధ్యానించినను వారికిఁ బ్రత్యక్షమగునప్పుడు రాముఁడు గాని కృష్ణుఁడు గాని తమ మూర్తులకు సున్నచుట్టుకొనలేదు. కనుక నీ సమాసమందలి సంప్రదాయార్థము వేఱు. అది యిట్లుండవలెను.

విశ్వంభరా = భూలోకము, ఆభోగము = వ్యాప్తి లేక పరిధి, వివిధ = అనేకములైన, మూర్త్యంతరస్ఫురిత + అనుభావంబు = ఇతరరూపములలో వ్యక్తమగుట యను ననుభూతి.

ఇచ్చట భూలోకమందు వ్యాపించియున్న వివిధాకారములుగా స్ఫురించుట యను ననుభూతిని మాని యని తాత్పర్యార్థము. అనఁగాఁ బుండరీకున కదివరకు గనుపించిన సకల జీవరాసుల యాకారనామరూపాదులు స్ఫురించుట మాని యన్నియును దైవమునం దిమిడిపోయినవి యని భావము.

3వ పాదము : శింశుమార = మొసలి, నీరుకోతి – శ. ర. –

శింశుమారాకృతి స్వీకృతిన్ = "మీనరూప – జలచరరూపమును ధరించుటచేత" – బులుసు.

"మొసలిరూపమును పొందుటచేత – మత్స్యావతార మెత్తుటచేతనని తోచెడిని" – తెన్మఠము.

శింశుమార మనఁగాఁ దాబేటివంటి యొక జలచరము. విష్ణువు కూర్మమూర్తియై యాదికూర్మ మనుపేర నిలిచి భువనముల కాధారభూతుఁడై యుండుట పురాణ, కావ్య ప్రసిద్ధమగు సమయము. అందువలననే ప్రాచీన భారతీయ భూగోళమం దుత్తరార్ధమునకుఁ గూర్మమని పేరు వచ్చినది. మరియు మన సౌరకుటుంబమున కవ్వల తారాపథమందుఁ గల వివిధ తారకలను సూర్యులను

లెక్కింపఁబడ్డ జ్యోతిశ్శాస్త్రమున దృశ్యమాన తారకావ్యూహమును శింశుమార చక్రమని వ్యవహరించినారు. ఇదియును సర్వ పురాణకావ్య ప్రసిద్ధము. కనుక ప్రస్తుత పద్యపాదమున నీ సమయమును స్వీకరించినచో సకల తారకావ్యూహాకృతిని స్వీకరించియున్న బ్రహ్మాండాంతర్యామి యగు స్వామి, యందలి విహారమును విడచి పుండరీకునకుఁ బొడకట్టెనని సమన్వయము. అనఁగా బ్రహ్మాండములోని బ్రహ్మాండాకారము తొలఁగి పుండరీకునకు స్వామియే కనిపించినాఁడని వ్యంగ్యము.

53. 2–12–26.

ఈ వర్ణనలనుబట్టి పుండరీకుని పితృభక్తి కథలు రామకృష్ణునినాటికే వ్యాప్తములయినవని భావింపవచ్చును. పౌరాణికము అయినను కాకున్నను పుండరీకుని పితృభక్తిని గూర్చిన కథ మహారాష్ట్ర దేశమున నేటికిని బహుళ వ్యాప్తముగా నున్నది. అతఁడు తొలుతఁ దల్లిదండ్రుల ననాదరించి చ్యుతుఁడై నట్లును, గుక్కుటపాదముని యాశ్రమమున గంగచేఁ బ్రబోధితుఁడై మాతాపితృ సేవ చేసి తన్మూలమున యోగసిద్ధి వడసి పరమాత్మను దర్శించెననియును, వానికి దర్శన మీ వచ్చిన కృష్ణుని గూడ వేచియుండ నియమించి తండ్రికి సేవ చేయుచుండెననియును, ఈలోఁగా విశ్రమింపుమని యొక యిష్టక – ఇటుక – స్వామి కర్పించెననియు, దానిపై నిలఁబడుట వలన స్వామికి విట్టలనామము కలిగెననియు నా కథాసారాంశము.

54. 2–13.

ముక్తామయతాస్ఫురణము = "ముత్యములచే అలంకరింపఁబడుట – లావణ్యము, విడువఁబడిన రోగభావమును" – బులుసు.

ఇట టీక యస్పష్టము.

ముత్యములచే నింపఁబడుటవలనఁ గలుగు మెఱుఁగు అని యొక యర్థము. విడువఁబడిన జాడ్యము – భవరోగము – అగు స్థితివలన మెఱయుట యని మఱి యొక యర్థము. ఇందు మొదటి యర్థము "యోగీంద్రశిఖాభరణము" అను రూపకమునకుఁ బరిపోషకమగు విశేషణము. ముత్యములతో మెఱయు శిఖాభరణము గనుకనే "భువనప్రశస్తముగ జిగిమీరెన్" అను క్రియాన్వయము సార్థకము.

55. 2–14. మొదటిపాదము.

మత్స్యావతారము వేదోద్ధారకము. భక్తియను సాధనమున మాత్రమే మునులు వేదార్థ దర్శనము చేసిరని ధ్వని.

56. 2–15.

సత్యాప్రియరూపము = సాక్షాత్కరించిన – శ్రీకృష్ణుని స్వరూపముతోఁ గూడ – బులుసు.

ఇచ్చట సత్యభామ ప్రియుఁడైన కృష్ణుని రూపమని యర్థము. అంతేకాక పాండురంగఁడు రుక్మిణీసహితుఁడైన మూర్తిగాఁ బ్రసిద్ధి చెందినాఁడు. అందుచేత సత్యా + అప్రియరూపము అనఁగా సత్యభామ యీసడించుకొనునట్లు రుక్మిణీ సహితమూర్తిగాఁ బ్రత్యక్షమగు చున్నాఁడని చమత్కృతి.

మఱియు సమాధిని సడలించి యంతర్నయనము మూసి బహిశ్చక్షువులు తెఱచు చున్న క్షణమునఁ బుండరీకునకు భగవంతుని సత్య + అప్రియరూపములు ఒక్కమారుగా గోచరించుచున్నవనియు స్ఫూర్తి. ఇందంతర్నయనము వలన దేవుని సత్యమూర్తియు, బహిశ్చక్షువులకు దైవేతరమైన యప్రియ మూర్తియుఁ గూడఁ బెనఁగొనునని భావము. అలంకారము శ్లేష.

57. 2–16.

అ. గాడ్పును సాగనిచ్చి = కుంభించిన శ్వాసను మఱలఁ బ్రసరింపనిచ్చి. మఱియుఁ బంచప్రాణ వ్యాపారములను సాగనిచ్చి. ఈ విషయమున

"చలే వాతం చలం చిత్తం
నిశ్చలే నిశ్చలం భవేత్." అని శాస్త్ర వచనము.

ఆ. పైఁగావలియిడ్డ శక్తులన్ = "లోనికి రాకుండ అటంకపఱచి యుంచిన యిచ్చాది శక్తులను" — బులుసు.

ఇచ్చట కావలి యిడుట యనఁగా రక్షగాఁ గాపుంచుట – యోగ విద్యను బొందువారు దిగ్బంధనము వేసి మనోమయములైన చక్రాదిప్రాకారముల నుత్పాదించి ద్వారదేవతలను, క్షేత్రపాలురను, పాతాళాది శక్తులను కాపుంచెదరు. విద్యపూర్తియైన వెనుక నా దేవతలను సగౌరవముగా నుద్వాసము చేయుదురు. అనఁగాఁ దమలో లీనము చేయుదురు.

58. 2–17.

పవిత్రవర్ధనమె = 1. పవిత్రతను బెంపొందించు కొనుటయే. 2. లేక దర్భలతో వ్రేలిపట్టలు చేసి ధరించి దేవ పితృకర్మాచరణమందుటయే.

బహుఫల + ఉత్కరములు + ఒడిసి = 1. పెక్కు పండ్ల సమూహములను మెలిపి త్రెంపి, చెట్టునుండి కోసి, 2. బహు కర్మఫలముల సమూహములను ఒడుపుతోఁ - శమదమాదిగుణములతోఁ – ద్రెంపి.

అటు లొనర్చినప్పుడే యవకాశము చిక్కినతరి నపవర్గమను స్థితిని "చేపట్టుట" జరుగును. చేపట్టుట యనఁగాఁ బంధపరమునఁ జేతితోఁ బట్టుట, మోక్షపరమున స్వీకరించుట. యోగయాగము = యోగాభ్యాసమను యజ్ఞము.

ఈ పద్యమునఁ గర్మయోగ సాధనము వర్ణింపఁబడినది. భగవదర్పితముగా సర్వకర్మల నాచరించుట, సర్వ కర్మాచరణమునందు నంతర్యామిని జూచుటయుఁ గర్మయోగ లక్షణము. దీని వలన భక్తియోగము సులభమగును.

59. 2 – 18.

గృహస్థ ధర్మము మోక్షధర్మమునకు బాధకము కాక సాధక మగునని యిందుఁ బ్రతిపాదింపఁబడినది – చూ. అయుత నియుతోపాఖ్యానము, సుశీల కథ.

60. 2 – 19.

లఘుధౌతవసన పల్లవములు = "తేలికయై నిగనిగలాడు మడత వస్త్రములు" – బులుసు.

"తేలికయై పరిశుద్ధములైన చిగుళ్ల వంటి వస్త్రములను" – తెన్మఠము.

తేలికలై శుభ్రముగా నుదికిన మృదువైన వస్త్రములను జిగురుటాకులు. సంధ్యాసమాధి విధి ప్రయుక్తి = సంధ్యలయందు దైవనిష్ఠకై చేయవలయు పూజాదిక్రమము. కవలువో కుండన్ = ఒకదానిని బోలిన పంక్తి యింకొకటి యున్నప్పుడు తప్పులుపోకుండ.

61. 2 – 20.

తాత్పర్యము : చూ పానకపోవుటవలనఁ బలువిధములైన వస్తువులకొరకై తడవుకొనుచున్న తండ్రియొక్క యాజ్ఞను బ్రేమతో శిరమున దాల్చి యా పుండరీకుఁడు విష్ణునిపూజ కుపక్రమించును.

విశేషము : జనకు నానతి శిరమునఁ దాల్చుటయే యతనికిఁ జక్రహస్తార్చనము. ఎట్లనఁగా దా ను చేయు ననుష్ఠానము కాక తండ్రి చేయు పూజలోఁ గూడఁ బాల్గొనుటవలన నర్చన మితోధికముగా సిద్ధించుచున్నది. నిర్ధంపు బుద్ధి యనుటవలనఁ జక్రహస్తుఁడు ప్రేమైకసాధ్యుఁడని చెప్పుట సార్థకము. జనకు నాజ్ఞ శిరమునఁదాల్చి యని చెప్పఁబడినది. శిరమున యోగి గమ్యమగు సహస్రార మను చక్ర ముండును. నారాయణుని హస్తమున నున్న సుదర్శనము యొక్క గుప్తనామము సహస్రారము. జనకునియందు నిర్ధంపుబుద్ధియు, విధేయతయుఁ గలుగుటవలనఁ జక్రహస్తుని హస్తము తన సహస్రార చక్రమును స్పృశించి యాశీర్వదించునని ధ్వని.

62. 2 – 21.

వలయిత = "... ఆవరింపఁబడిన" — బులుసు.

గుండ్రముగాఁ జేయఁబడిన యను టొప్పును. 21, 22, 23, 24 పద్యములలోఁ దిరువారాధన మనఁబడు పూజావిధానము వర్ణింపఁబడినది.

63. 2 – 23.

కంబుగర్భస్థము = "శంఖములో పోయఁబడినదానిని" — బులుసు.

శంఖములో నున్నదాని ననుట యొప్పు.

64. 2 – 24.

తిరువారాధనము = "దేవతార్చన" — బులుసు.

ఇది వైష్ణవ సంప్రదాయపదము. తిరు అనఁగా శ్రీ యనియు, శుభకరమనియు నర్థము. తిరు + ఆరాధనము. ఇచ్చట సంస్కృత సహజమైన యణాదేశసంధి లోకసిద్ధమై వచ్చినది.

65. 2 – 25.

పులిజున్ను = పెద్దపులియొక్క జున్నుపాలు. ఇది దుర్లభ వస్తు వనుటకు జాతీయము.

66. 2 – 27.

"ప్రాయపుఁ బ్రొద్దంతఁ గొంత పడమర దిరిగెన్" -- నడివయస్సు దాటినదని భావము.

67. 2 – 28.

శేషఫణిశయనున్ = శేషుఁ డను పాముపై శయనించినవానిని – విష్ణుని – ఈ యుపమానమువలనఁ బుండరీకుఁడు కుండలినీయోగ సాధనమున విష్ణుని జూడనెంచినాఁడని గుప్తార్థము.

68. 2 – 29.

పుంషువంటిచలి – వేరువెల్లఁకి – కాయగూర – ఈ చెవిగాడుపాచెవిఁ బోవ – తనకుఁ బోదు నాకుఁ బోదని – యనునవి చక్కని జాతీయములైన పలుకుబడులు.

గురిచేసి = లక్ష్యముగాఁ గొని – ఏకాగ్రతవహించి. ఈ పద్యమున నుగ్రతపస్సు అనఁబడు హఠయోగ మార్గము చెప్పఁబడినది.

తేటగీతిలోఁ బరిణామాలంకారము. సీసము రెండవ, నాల్గవ పాదముల నుపమ, పద్యమునఁ బ్రధానాలంకారము స్వభావోక్తి.

69. 2 – 34.

వివరణమునఁ బొరపాటున్నట్లు తోచును. ఇందుఁ బాఠమును సరిగా సంస్కరింపనట్లును దోచును. "బయ్యెన్, బయ్యున్" అను పాఠాంతరములు నాల్గవపాదము మొదలుగా స్వీకరింపఁబడినవి. వీనివలన ప్రాసభంగము కలుగును. "బాయెన్" అని తణుకు ప్రతిలోని పాఠము. ఇందుఁ బ్రాస సరిపడుచున్నది. రెండవ పాదమున "దెగడి" యని బులుసు ప్రతిలోను, "దెగడు" అని తణుకు ప్రతిలోను ఉన్నది.

దీపాల పిచ్చయ్యశాస్త్రి యీ పద్యము పాఠములలోని యసందర్భమును గూర్చి చర్చించినారు. తంజావూరు ప్రతిలోఁ బాఠ మీ రీతి నున్నది.

"మాయావృతుఁడగు నాత్మని
సోయగమును దెగడు తీగ సోగలు ముచ్చ
టై యునికి సంగరహితం
బై యుం గాకున్న జఘన మభిరామముగన్"

ఇచ్చట 'నభిరామముగన్' అనఁగా 'నభిరామముకాన్' – అభిరామము కాఁగా – నని యర్థము.

70. 2 – 48.

ఇందలి యలంకారము కావ్యలింగమని బులుసువారు వ్రాసిరి. కాని యిది యర్థాంతరన్యాసము.

71. 2–49.

"చొక్కుగదురఁ జేయు జగత్పతి" యన్నచోఁ "జొక్కుగదురఁ జేయు" అన్నది విశేషణము. పారవశ్యమును గలిగించునట్టి యని యర్థము.

బులుసువారు దీనికి "చొక్కన్=పరవశతను, వ్రాసినారు. తాత్పర్య మీయలేదు. ఈ టీకవలనఁ బద్యమున నన్వయము కలుగదు.

72. 2–54.

ఇందనుకరణముగా సంస్కృత వాక్యములు వాడఁబడినవి. విజ్ఞాపన, ప్రార్థన మున్నగు తావులలో నిట్లు వాడుట చాలమంది కవులు చేసినారు.

73. 2–55.

పెనుమాయ=పెద్దమాయ. దేవుని స్వయంప్రకాశమునుండి సృష్టికొఱకుఁ గొంత వేఱగుట. పెనురొంపి=పెద్ద బురద. భవన ఘటనకు=మేడ కట్టుటకు, సృష్టిని ఘటించుటకు, గెంటు కుంటును లేక="కదలిక, తగ్గులేక" —బులుసు. గెంటు="కదలిక" తెన్మరము.

కాని యిచ్చట కదలిక లేనిచో సృష్టి యెట్లు సాగును? కనుక గెంటు అనఁగా గంతు అని యర్థము. భగవంతుఁడు సృష్టిచేసి నడిపించునట్టి నడకలో నడుమనడుమ హెచ్చుతగ్గులు కాని కుంటుపడుటగాని యుండదని యర్థము.

74. 2–56.

తాత్పర్యము : సోమకాసురుఁడు సంతసించుచుఁ బట్టుదలతో నపహరించిన యా వేదములను మఱల గొనివచ్చి, యా రక్కసుని కడుపులోని ప్రేవులయందలి కంపు తొలగిపోవునటుగా నీ కీర్తియను గంగతోఁ గడిగి, విచ్చుకొనుచున్న బ్రహ్మ ముఖములను పద్మములను గంధముచే లలితములుగాఁ జేసితివిగదా!

విశేషము: రాక్షసుని ప్రేవుల స్పర్శచే వేదములకు బల్లదురందినది. దానిని గీర్తి యను గంగచేఁ గడిగి బ్రహ్మవదనములందు నిహితము చేయఁగా సరోజగంధ మంటినది.

75. 2–57.

కోపనశాఖ సవ్యశిఖి=కోపస్వభావముగల దుర్వాసుని శాప మనెడి క్రొత్త నిప్పు" —తెన్మఠము

" ....కనకనలాడు నిప్పుచే" —బులుసు.

=క్రొత్త నిప్పుచే - బాగుగ మండుచున్న నిప్పుచే - అనఁదగును.

అ. ఈ పద్యమందు విష్ణుపురాణాంతర్గతమైన కథ స్మరింపఁబడినది. జంభాసురుని జంపివచ్చు గర్వము కారణముగా నింద్రుఁడు దుర్వాసునిచే శపింపఁ బడినాఁడు. కనుక జంభాపహ రాజ్యలక్ష్మి యను సమానము సార్థకము.

అ. ఈతకాయ శబ్దమునకు సొరకాయ యనుటకన్న గుండ్రని గాలి పడవతట్టులు అని చెప్పినచోఁ దాచేటి యాకారమునకు సరిపడును. లేదా తాచేటి కాయ యనఁబడు కూర్మాకార కుంభవిశేషముచేత నీదఁగలిగి రాజ్య లక్ష్మి పైకిఁ దేర్చినట్లైనఁ జెప్పవచ్చును. పృథుకర్పరత్వము సొరకాయకు సహజముకాదు.

76. 2–58.

ఈ పద్యమునకు సరియైన వివరణము వ్రాయఁబడలేదు.

తాత్పర్యము: ప్రళయపయోధి ప్రవాహమున దెబ్బతినిన భూమిని నీవు సేదఁదీర్చి, బంగరు టదుకుతోఁ గూడిన విలాసమును బ్రకటనసేయు నీ కోఱ యందు నిలిపిన యా రూపము చూడఁగా, నగ్నిహోత్రుఁడు మండునవు డతని మంటలపై నుంగరములు గట్టుకొనుచున్న పొగపొరల వలెఁ గనుపించినది. ఇచ్చటఁ గఱగిపోయిన భూగోళము మఱల ఘనీభవించునప్పటి స్థితి ధూమ వలయములుగా వర్ణింపఁబడినది.

మకరాకరమేఖలన్="భూమిని" —తెన్మఠము

="సముద్రము మొలనూలుగాఁ గల భూమిని" —బులుసు.

ఈ కవి సమయము వెనుక నొక శాస్త్రసమయ మున్నది. మకర మనఁగా భూమిని దక్షిణాయణమునుండి వెనుకకుఁ ద్రిప్పి కాపాడు నొక శక్తి. దేవ తాత్మకమగు నీ యాకర్షణశక్తివలన భూమికి సగము సంవత్సర చలనము జరుగు చున్నది. దీనివలననే చలినుండి తప్పుకొని భూమి సూర్యుని కవోష్ణ కిరణ ధారలతో తన మేఖలయందున్న సృష్టి కనుకూల ప్రదేశములను ఫలవంతములు చేసికొనుచున్నది. భూమధ్య రేఖ కొకప్రక్క మకరము, మఱియొక ప్రక్క కటకము – కూర్మము – ఉండును. ఈ రెండింటి నడుమను మకరాకరమేఖల యైన భూమి అయన చలనమును బొందుచు సంవత్సర స్వరూపుఁడగు యజ్ఞ మూర్తిచే నుద్ధరింపఁబడుచుండును.

అష్టాపదటంక విభ్రమ విడంబిని="బంగారును నఱకునట్టి యులి యొక్క విలాసమును పోలినది" --తెన్మఠము.

"బంగారు పిడియొక్క విలాసము ననుకరించునట్టి - పూర్వటీక సరికాదు —బులుసు.

తెన్మఠమువారి యులి, బులుసువారి పిడి యెందులకో వివరింపఁబడలేదు.

ఇచ్చట టంకశబ్దమున కదుకు అని యర్థము. బంగరుతో నదుకుపెట్టిన పందికోర పిడి ఖడ్గాద్యాయుధములకుఁ బ్రసిద్ధము - చూ. 2-191. "తత్సరు పదార్పితసూకర దంష్ట్ర-ఇందు భూమి నుద్ధరించు వరాహమూర్తి కోర బంగరు టదుకుగల పంది కోరపిడివలె నున్నదని భావము. దీనివలన హిరణ్యాక్షుని జంపుట సూచితము.

77. 2-59.

తాత్పర్యము ; లోకకంటకులలో గొప్పవాడగు హిరణ్యకశిపుఁడను మదపుటేనుఁగు కుంభస్థలమున కంకుశములగు వాడియగు నీగోళ్ల కొనలే నాగళులు. వానితో శత్రువక్షస్థలమను నడవినేలను జాళ్లుగాఁజేసి, రాక్షసుని రక్తమను నీరు పెట్టి, నీకీర్తియను బరిపూర్ణమైన వరిమొక్కల నింద్రుని సంపదయను పంటకొఱకు వెదజల్లితివిగదా!

ఇది నృసింహస్తుతి, అలుకవె="నాటవా" —బులుసు.

ఇట వెదజల్లవా యనుట సమంజసము.

78. 2-61.

పరశువు చాల కఠినమైన వస్తువు. దానిని హంసితోఁ బోల్చి శత్రురాజుల కంఠహారములను మృణాళనాళములతోఁ బోల్చుటలో, నా కార్యము యొక్క నిర్వహణము పరశురామున కెంత సులభసాధ్యమైనదో యను విషయమును బ్రతీయమానము చేయుట. కంఠహారము లనెడి మృణాళములు నూతనైణమదకర్దమ వర్ధన సంప్రభూతము లనుటలో భోగౌత్కృష్ట్యము, సంపద స్ఫురించును. ఆ రాజుల ధన మదమే వారి వినాశ కారణమని ధ్వని, హారములతోఁ బాటు కుచముల, మేచక కచముల ప్రస్తావనవలన నా స్త్రీల మాంగల్య, వయో విలాసములతోపాటు వారి దాంపత్యములోని కామాంధత స్ఫురించును. ధనమదము, కామాంధత వలననే కార్తవీర్యుఁడు జమదగ్నిని నఱికె నను నభిప్రాయము స్ఫురించును.

దోః పరశుహంసికి "మేతయొసంగవే" యనుటలోఁ జాలినంతగా, పుష్కలముగా నని స్ఫురించును. "మాతృకఠోరకంఠ" యను తావునఁ గఠోర శబ్దము "రుధిరారుణాననంబై" యనునట్టి హంసి విశేషణమున కన్వయించును. మరియు మాతృకంఠలుంఠనమును జదువరియొక్క సంస్కారబలమువలన జ్ఞప్తికిఁ దెచ్చును.

ఈ పద్యమున వర్ణింపఁబడిన సన్నివేశము జుగుప్సకు విషయము. కాని వర్ణనబలమున, అలంకార చమత్కృతి మూలమునను బోషింపఁబడినది వత్స లతకు, రతికి విషయము, ఇట్లు పరస్పర విరుద్ధ భావముల నుపమానాదిక విభావనాగత చమత్కృతిచేతఁ బోషించుట మిక్కిలి దుర్లభమైనది. ఇది సమర్థు లగు మహాకవుల రచనలలో నరుదుగాఁ గనుపించును.

కాళిదాసుని రఘువంశమునఁ దాటకవధా ఘట్టమున నిట్టి వర్ణనమున్నది.

"రామమన్మథ శరేణ తాడితా
దుస్సహేన హృదయే నిశాచరీ
గంధవ ద్రుధిరచందనోక్షితా
జీవితేశవసతిం జగామ సా."

79. 2-62.

వ్యాఖ్య : ఇది రామావతార వర్ణనము. ఇందు శ్రీరాముని చేతిధనుస్సును మదపుటేనుఁగుగను, బాణములు మదజలధారలుగను, పద్మములు రావణుని తలలుగను, దేవతల హృదయములు పద్మములుగను రూపకము చేయఁబడినది.

ఈ రూపక సామర్థ్యమున రావణవధ రామునకుఁ గ్రీడాప్రాయ మయ్యెనను భావము ప్రతీయమానమగును. ఏనుఁగు కొన్ని పద్మములను బెల్లగించుట సహజమే గాని కొన్నిటిని వికసింపఁజేసి పోషించుట సహజము కాదు. ఈ యసహజత్వము సాధ్యమైనదని చెప్పుటలో రామధనుస్సు, బాణములయొక్క లోకోత్తరత నిరూపింపఁబడినది. ఇట్టి ప్రగల్భత నీకే తగును అను మెచ్చుదల కుపపత్తిగా, నుదాహరణగా హరీ! యను సంబోధన చేయఁబడినది. ఇందు సింహార్థమున సింహము దగ్గఱ వారణరాజుండఁగా, రాముఁడను సింహ మిట్టి వింతలు ఆ వారణరాజుచేతఁ జేయించు టేమి వింత యను భావమున్నది.

80. 2-63.

ఇందు బలరామ వర్ణనము, శ్లేషవశమున సర్పవర్ణనము చేయఁబడి "శేషాను కారి" యని చెప్పఁబడినది. బలరాముఁ డాదిశేషుని యవతారమను పురాణ విషయ మిచ్చటఁ గైకొనఁబడినది.

81. 2-64.

ఈ పద్యము కొంత దుర్బోధముగా నున్నది. పూర్వవ్యాఖ్యాతలు సందేహనివృత్తి చేయలేదు.

ఇందలి "ప్రతిదిన కేశలుంఠనపురాయిడి నెట్టన బట్టకట్టిపైఁ బుతపుత మంచునున్న కురుబోడతల" కు సరియైన హేతువు లభించుటలేదు. ఇది బౌద్ధ భిక్షువులు చేయించుకొను ప్రతిదిన ముండనముయొక్క వర్ణనము కావచ్చును. కృష్ణమూర్తిత్వమునుండి బుద్ధావతారము కలుఁగుటలో స్వామికి నెటికురులు రాలిపోయినవనియును, అయినను నెమలి పింఛము పైనభిమాన మాయనకుఁ బోక బాధపడుచుండెననియు హాస్యమైన కల్పన చేసియుండవలెను. అట్టిచో శిఖి

పింఛములు గల వల్లిని నడుమునకుఁ గట్టుమని నలహా నిచ్చుటలోఁ గవి, బుద్ధుఁడు దిగంబరుఁడు కాని సన్యాసి కనుకను, వస్త్రాద్యపేక్షల కతీతుఁడు గనుకను సహేతుకము కావచ్చును. ఇందు భోగియైన యవతారమునుండి విరాగియైన యవతారమునకు స్వామి చూపిన మార్పు కనుపించు చున్నది.

82. 2–65.

శోభనపు గమ్మ విరుల్ = "మేలులను సువాసనతోడి పువ్వులు"

—తెన్మఠము

"చక్కఁదనము–శోభ–అను పరిమళయుత పుష్పములు" —బులుసు

ఈ యర్థమున నుపమానోపమేయములకు వచనము సరిపడకున్నది. ఇచ్చట శోభనమునకుఁ జెందిన కమ్మవిరులు – శోభన మను నొక వృక్షమునకు సంబంధించిన పుష్పములు అని చెప్పుట సమంజసము. "దుల్చి" "చిగురాకు" అను పదములు కూడ దీనినే సూచించును.

83. 2–66.

నీటిలోఁ జివుకక నిలిచి క్రుమ్మరు పూన్కి = "ఇఁట మత్స్యావతారము సూచితము. చేప నీటిలో ఎంతకాల మున్నను చివుకక స్వేచ్ఛగా తిరుగును"

—బులుసు

ఇది ప్రధానార్థము కాదు. వాచ్యార్థము. నీటిలోఁ జివుకక యనుటకు జలప్రళయములకు లొంగక–ప్రళయాంతర్లీనమై ప్రళయాతీతమైన యని యర్థము. మత్స్యావతారమం దుద్ధరింపఁబడిన వేదము లిందలి వర్ణ్య వస్తువు. అది వ్యంగ్యము చేయఁబడుటచే ధ్వని. నిలిచిక్రమ్మఱు అను లావునఁ బడవ యన్వయములో "నిలబడి – మన్నిక గలిగి తిరుగు చుండు" అని అర్థము- వేదముల నుద్ధరించు మత్స్యమూర్తిలోఁ బ్రతీయమానుండగు నంతర్యామి పక్షమున "తదేజతి తన్నై జతి" మొదలగు శ్రుతులలో వర్ణింపఁబడిన తచ్ఛబ్దవాచ్యమగు వస్తువు ఉదాహృతము. ఈ జగముల కదలికగా నది కదలుచుండును గాని తన స్థితిలోఁ దనకు గదలికలేదు.

84. 2–67.

సుధామరందవిచ్ఛల = "అమృత మనెడి పూఁదేనె చిక్కఁదనము గలిగి"

—బులుసు

ఇచ్చట సుధాశబ్దమునకు వెన్నెలశ్లేష. పద్యమునఁ జంద్రవర్ణనము పద్మ వర్ణనము కలిపి రూపకము చేయఁబడినది. ప్రబోధగుణజృంభిత = పరిమళముతో వికసించిన —బులుసు

ఇచ్చట ప్రబోధ శబ్దమునకు ఆత్మజ్ఞాన కిరణము అని చెప్పుట యుక్తము. వర్ణ్య వస్తువు స్వామి యాయతనము గదా!

అ. ఈ పద్యమునఁ జంద్రుని వికాసకళలే పద్మముయొక్క రేకులుగా వర్ణింపఁబడుటచే షోడశదళ పద్మము, దానికి సంబంధించిన మంత్ర యంత్రాకృతులు ననుసంధేయములు. ఇది గోపాల షోడశాక్షరీ మంత్ర విషయము.

ఆ. పరస్పర విరోధము కల చంద్రుఁడును గమలమును స్వామి యాయతనములుగా రూపకములు చేయఁబడుటచేఁ బ్రేమమయమైన సమ్మోహన విద్య, సర్వ సమత్వసిద్ధియు ఫలితములుగాఁ బ్రతిపాదింపఁబడినవి. ఇందలి ధ్యేయమూర్తి యందు భిన్న విషయముల కేకత్వ సిద్ధి కలుగునని స్ఫురించును.

ఇ. "పుష్కరాయతనః" యని సమాసమును విడగొట్టరాదు. దానివలన నర్థస్ఫురణ చెడిపోవును. "పుష్కరాయతన షట్చరణేంద్రః" అను సంబోధనము సమంజసము. తెల్లఁదమ్మి నివాసముగా గల శ్రేష్ఠమైన తుమ్మెదవంటివాఁడా!" అని ప్రకటార్థము. షట్చరణ యనఁగా నారు చక్రములయందలి సంచారము గల ఇంద్రనామక దైవతమని గుప్తార్థము. షట్కోణగతమైన షడక్షరీ మంత్రోద్ధారణము వ్యంగ్యము.

ఈ. నవేంద్రనీల = క్రొత్త యింద్రనీలమణి వలె, కజ్జల = కాటుక వలె, జలజాప్తజాజల = సూర్యసుతయగు యమున జలము వలె, నిజద్యుతి వంచక = సహజకాంతిని గూర్చి మభ్యపెట్టునట్టి, కాంతికంచుకా = కాంతి యను పొరగలవాఁడా! ఇందలి కాంతి శబ్దమునకు నీలకాంతియని యర్థము. భగవంతుని నిజద్యుతిని కప్పుకొని ప్రకృతి యనఁబడు తమస్సుండును, అట్లే కృష్ణుని తత్త్వమును గప్పుచు నీలాదేహరుచి జగన్మోహనమై వర్తించునని యర్థము." ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్" అను శ్రుతి విషయ మిందు వర్ణింపఁబడినది.

ఉ. "నిజద్యుతి" యనుచోట నిజశబ్దమునందు జన్మాదిరహితమైన దివ్య తత్త్వము యొక్క కాంతి యని శ్లేష.

85. 2-71.

ఎందునే వెలుఁగునుగాని పెన్వెలుఁగు వెంబడినిన్ జనువాని = విష్ణు వెచ్చట కేగినను ముందుగా గొప్ప తేజస్సు వ్యాపించుచుండునని భావము - బులుసు.

అ. ఇది యిందలి విశేషము గాదు- ఇతరమైన వెలుఁగు లేవియు దీనిని వెలిగింపలేవనియు నితరకాంతులతో నిది పోలిక చెందదనియు భావము. మఱియు నయనేంద్రియ విషయమైన వెలుఁగు కాదని యర్థము. "నతద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః", "నతత్రచక్షుఃప్రతిభాతి" యనియు శాస్త్ర ప్రమాణము. పెన్వెలుఁగు అను ప్రయోగమునకు "తస్య నామ మహద్యశః" అను శ్రుతివచనము ప్రమాణము.

ఆ. యతిమానసహంసక = యతులమనస్సు అనెడు మానస సరోవరమునకు హంస యగువాఁడా! - శ్లిష్టపరంపరిత రూపకము -

యతులయొక్క మనస్సునకు హంసయైనవాఁడా అని పూర్వటీక – బులుసు.

ఇందు యతుల మనస్సునం దిమిడిన శ్వాస, ప్రాణగతి యొక్క స్వరూపమైనవాఁడా! యని గుప్తార్థము. ప్రాణగతి నియమనమున హంసప్రచారము నిలిచి పరమాత్మ భాసించుట యోగశాస్త్ర ప్రసిద్ధము మఱియు యతుల మనస్సున వెలుఁగు సూర్యరూపమైన యంతర్వర్తియనియు శ్లేష. హంస శబ్దమునకు సూర్యుఁడు, శ్వాసయను నర్థము లున్నవి.

86. 2–72.

కృతోగ్రశత్రుత్రపము = "శివునికి విరోధియగు మన్మథునికి సిగ్గు కలిగించెడు – మన్మథు నతిక్రమించెడు" – బులుసు.

"చేయఁబడిన క్రూరశత్రువుల భయము కలది – క్రూరమైన శత్రువులకు భయము కలుగఁజేయునది" – తెన్మరము.

ఇందుఁ జేయఁబడిన యుగ్రశత్రువుల సిగ్గు గలవాఁడా! – శత్రువులు సిగ్గిలఁ జేయు రూపము గలవాఁడా! అనఁగాఁ దన మోక్ష ప్రదత్వమగు రూపమునకు రాక్షసులు సిగ్గిల్లునట్లు చేయువాఁడా – యని చెప్ప నొప్పును.

87. 2–77.

"నలువమొగంబు లెట్లు" అనుటలో నొక విశేష మున్నది. "ప్రకటగుప్తాకారంబున" యను వర్ణనమునందు "అచ్చతుర్భుజుండు పుండరీకునిఁ జేకొనియె" నని వర్ణింపఁబడినది. వాని యాయతనమునకు నాలుగు వాకిళులును జెప్పఁబడినవి చతుర్ముఖమైన పీఠమధ్యమునఁ జతుర్భుజమైన పూజాయంత్ర ప్రతిష్ఠ యిందు వ్యంగ్యము.

"నలువమొగంబులు" అనుటవలన వేదమయము లనియు శబ్దబ్రహ్మమయము లనియు సూచ్యము. నలువ మొగముల పోలికవలననే "కాంచన చారువులు" అను ద్వారముల విశేషణ మర్థవంతము. నలువ హిరణ్యగర్భుఁ డని ప్రసిద్ధి.

88. 2–80.

"అర్ధయోజన విస్తారంబును, దదర్ధాయామసంయుతంబును" ఇది దేవతాయతనమునకు గుప్తాకృతికిఁ జెప్పఁబడిన సమాసము. అట్లే "పశ్చిమాభిముఖుండు" అనునదియును 2–75.

89. 2–85.

ఆ. "విలువాయనవు వేల్పుఁ గిలముఁ గొల్వక వాసుదేవు నారాధించు తెలివి యొకటి" యనుటవలన వాసుదేవశబ్దవాచ్య మొక దేవత కాదనియు సర్వాంతర్యామి యనియుఁ బ్రతిపాదింపఁబడినది. ప్రకటార్థమున వాసుదేవు డనఁగా వసుదేవసుతుఁడనియు గుప్తార్థమున నారాయణుని – జగద్వ్యాపకమైన

సర్వనివాసకమైన తత్త్వమనియు నర్థము. ఏ నామమైనను ఈ తత్త్వమునకు గౌణమే యగును గాని వాచకము కాదని మహాభారతము.

"వాసనా ద్వాసుదేవస్య వాసితం తే జగత్త్రయమ్
సర్వభూతనివాసోఽసి వాసుదేవ నమోస్తుతే"

....

"యాని నా మాని గౌ ణాని విఖ్యాతాని మహాత్మనః"

అ. ఈ పద్యమున మానవుఁడై జన్మించుట, మాతృశుశ్రూష చేయుట, అధ్యాత్మ జ్ఞానము కలుగుట, అంతర్యామియందు భక్తియోగము కలుగుట, యర్థుల నలరించుట దుర్లభములని చెప్పఁబడినవి. ఇవి యొకఁడొకఁడేకడు దుర్లభములు. ఇఁక నన్నియుఁ గలిసిన వాఁడు మఱియు దుర్లభుఁడు. అట్లే క్షేత్రము తీర్థము, వేలుపు మూఁడును దుర్లభము. అవి లభ్యములగుట యపురూపము ఇట్టి దుర్లభుఁ డట్టి దుర్లభక్షేత్రవాసము నొందుట దైవానుగ్రహమని తాత్పర్యము.

90. 2-90.

ఈ పద్యము తాత్పర్యము విడఁగొట్టుటకుఁ గొంచెము క్లిష్టముగా నున్నది. భిన్నవిషయము లిందు భిన్న వాక్యములలోఁ బొందిక చేయఁబడినవి.

1. పితరులు .. ... యని
2. అందు నొసఁగు ..... ఫలించు
3. నవరించఁగ లేరు ...... ంఁదొల్తురెకాని
4. పౌండరీకేశు శాంబరికతమున .... నఘంబులుడుగు.

5. అమ్మహాక్షేత్రమునకు నెయ్యది సమంబు ? అందు మొదటి వాక్యమున కన్వయము. "ఆత్మకుల + ఉద్భవుండెవ్వఁడేనియుఁ బౌండరీకమునకు నేగకయున్నె యని పితరు లుబ్బుదురు." మన వంశమున జన్మించినవాఁ డెవఁడైనఁ బౌండరీక క్షేత్రమునకుఁ బోవ కుండునాయని పితరులు ఆశతో వేచి యుందురు. కారణము రెండవ వాక్యమున నున్నది. హవ్యమనఁగా దేవతల కర్పించు నాహారము. కవ్య మనఁగాఁ బితృదేవతల కర్పించు నాహారము. ఈ రెండు నమేయములై ఫలించును.

3వ వాక్యము : భక్తులలో నేనొకఁడనుదక్క మిగిలినవా రెవరును సత్వ సంసిద్ధిని బొందలేదు. అనఁగా నా క్షేత్రమందున్న భక్తుఁ డెవ్వఁడైనను సత్వ సంసిద్ధి పొంది రజోదోషమునుండి పరిపూర్తిగా విముక్తుఁ డగును. ఇవల నవల నున్నచో స్వయంకృషిమీద నా స్థితిని సాధింపలేరు.

4. మొ వాక్యములు : పై విషయమునకుఁ గారణ మిందుఁ బ్రతిపాదింపఁబడినది. పౌండరీకేశు శాంబరివలన మనోవాక్కాయములఁ గల పాపము నశించును. అందువలన సత్వభావ మచట వసించువారి కప్రయత్న సిద్ధము.

91. 2 – 91.

4వ పాదమున "నింగిక్రిందుగనున్న" యను భాగము వివరింపఁబడలేదు. ఆకాశమునకు మాత్రమే క్రిందనున్న – అనఁగా మిక్కిలి యెత్తైన. "నాకస్య పృష్ఠే" వంటి ఉక్తి. లేదా నీలత్వము మున్నగు లక్షణములవలన నింగియే దీనికిఁ గ్రిందుగ నున్న – అనఁగా నింగిని గ్రిందుపఱచునట్టి.

62. 2 – 93.

లింగతను వైభవము = "విగ్రహరూప వైభవము" — బులును. ఇచ్చటఁ జిహ్నలతోఁ గూడిన యాకారము, లేక లింగ శరీర స్వరూపమున నివసించు వైభవము.

వేణుముద్ర : వేణువు ధరించియున్న ముద్ర – భంగిమ.

93. 2 – 96

"శ్రీచరణంబు లున్నయవి సింగము వెన్నుననంటి" = సింహము వీపుపైని శ్రీవిఠలుని పాదముద్ర లున్నవి. ఇందు విఠలుఁడు సింహవాహనుఁడై విహరించు నని యర్థము. లేదా శ్రీచరణంబులు అనఁగా లక్ష్మీపాదములని చెప్పుకొన్నచో సింహవాహనయైన రూపమున శ్రీదేవి విహరించునని యర్థము. "నవదుర్గాం మహాకాళీంబ్రహ్మవిష్ణుశివాత్మికామ్" – లక్ష్మ్యష్టోత్తర నామములు.

గుప్తార్థము : శ్రీచరణంబులు = శ్రీ బీజములు

సింహము = క్ష్రౌం. వెన్నున = వెనుక. శ్రీంశ్రీం క్ష్రౌం అను మంత్రమున పౌండరీకక్షేత్రము దక్షిణద్వారమున స్వామిపూజనము "నేమముతో రచియించె నేని పూరుషుఁ డిహంబుఁ బరంబుఁ గొనును" లేదా దక్షిణాభిముఖుఁడై చేసినను గొనును. ఇది లక్ష్మీనృసింహ సంపుటీకరణము.

94. 2 – 97.

అ. శాతముఖాంకుశపాశముల్ = "వాఁడి మొనలు గల యంకుశ మును, పాశమును" – బులుసు. పాశమనఁగా "ఆం" అను వర్ణము. ఇవి రెండును బాహువులం దిరు పార్శ్వముల ధరింపఁబడినవి. అనఁగా దేవీబీజమగు "హ్రీం" వర్ణమున కిరుపార్శ్వముల నుండును.

గుప్తార్థము = అంకుశ మనఁగా క్రోం అను వర్ణము. వర్ణింపఁబడిన దేవత "హ్రీంకృతిమంత్రరూపభాస్వర" యగు భువనాధినాయిక. అనఁగాఁ బై రెండక్షర ములకు నడుమ శక్తిబీజమగు హ్రీంకార ముంచినచో భువనేశ్వరియగు దేవత వచ్చును. "ఆంహ్రీంక్రోం" అను మంత్ర మిచ్చట నుద్ధరింపఁబడినది. ఇచ్చట రామకృష్ణకవి స్వతంత్రించినట్లు గనుపించును. శాస్త్రమున నిది అశ్వారూఢయగు దేవి మంత్రముగాఁ జెప్పఁబడినది.

ఆ. "పాండురంగని దుండగములనుండి మరలించుటకు బెదరించు నట్లు... ... " సరస్వతిగాని భువనేశ్వరిగాని పాండురంగని బెదరించుట మూలమున లేదు. ఇది యర్థశూన్యము.

ఇ. సమస్తమరుత్కరి = "సమస్త దేవతలలోను ఏనుఁగైన – ప్రధాన దేవతయైన" – బులుసు. సమస్త వాయువులకు నేనుఁగువంటివాఁడు – ప్రాణాది వాయువుల లోకమున విహరించు నేనుఁగువంటివాఁడు అగు "తన్ను" గూర్చి మెచ్చరిక ధరింపఁబోలునన అహంకారమును గూర్చి జాగరూకత వహింపఁ బూనినట్లు. లేనిచో దాని కవ్వలఁ బ్రతిష్ఠితమైన స్వామితత్త్వమునకు మరల్చుట, పట్టుట, కట్టుట కష్టము. ఆ పనులకు భువనేశ్వరీమంత్రము జాగరూకత వహించునని భావము.

ఈ. లసద్రసనాయిక = " – ఒప్పిదములైన రసములకు నాయకురాలు, సరస్వతి, అని పూర్వటీక, కాని సరస్వతీదేవి యిదివఱకే తూర్పువాకిట నున్నట్లు వర్ణింపఁబడినది. ఆమె విష్ణుని బెదరించుటయు అసంభవము" – అని బులుసు వారు పూర్వటీక నధిక్షేపించుటతోఁ దమ కర్తవ్యమును ముగించినారు. రస శబ్దమున కనుభూతి, రుచి యని యర్థము. "రస్యత ఇతి రసః". భువనేశ్వరి యోగానందమున కధినాయిక యనునది సంప్రదాయసిద్ధము. మఱియు భు + వన + అధినాయక ; పుట్టుక యనఁబడు సంసార జలముల కధినాయిక యను శ్లేషవలఁ బ్రకృతిశక్తియనియు నామెయే రసనాయికయనియుఁ జెప్పవలెను.

95. 2–99.

ఈ పద్యమున బాహ్యావరణ ద్వారములలో పైఁ జెప్పిన మంత్రాధి దైవతముల న్యాసమున్నది.

దక్షిణము

నారద, అప్సరస, శ్రీచరణములు – షడక్షరి

తూర్పు వాణి–దశాక్షరి

పశ్చిమము–భువనేశ్వరి

ఉత్తరము – దుర్గ, దశాక్షరి

అవధానబుద్ధి = "హెచ్చరిక గల్గునట్లు" బులుసు. శ్రద్ధగలిగిన బుద్ధితో, ధారణాత్మకమైన బుద్ధితో, ఏతత్సవిశేషార్చనము = "నియమముతో వీరిని పూజించుటను" —బులుసు. విశేషములతోఁ గూడిన పూజనము – అనఁగా శాస్త్రమర్మము లెఱిఁగిన పూజనము. బాహ్యావరణమనఁబడు ప్రథమావరణమునకు సంబంధించిన గుప్తార్థ సమన్వయము. ప్రణవము పరమాత్మకు వాచ్యరూపము. అది అండాకృతియైన దేశముగను జక్రాకృతియగు కాలముగను

వ్యక్తమగును. ఈ రెండింటియందును నడుమనుండి – బిందువునుండి – చతుర్భుజాకృతియైన వ్యక్తి కలుగును. దీనినే యజ్ఞశాల నిర్మాణమున "ప్రదిశశ్చతస్రః" అని శ్రుతులును Squaring up the circle or contemplation అని గుప్త విద్యయును జెప్పుచున్నవి †

కేంద్రమునుండి పరిధివరకును గల భూమిని 27 కాని 28 కాని 30 కాని, 60 కాని 360 కాని 720 కాని 1000 కాని విభాగములు చేయుదురు. అందు 27 నక్షత్రములు యజ్ఞపురుషుని రూప విభాగములు.* ఇవి చంద్రుని మాసాత్మకమైన మండల భ్రమణమున దిన సంఖ్యను దెలియఁజేయును. ఒక్కొక్క దేవతగాఁ బరమాత్మను భావనలో నిర్మించుకొనునప్పు డీ నక్షత్రమండలము నొక్కొక్క విధముగా విభాగముచేసి నలుదిక్కులందు నుంచవలెను. సాధకుని సాధన క్రమమునగూడ మాసము నట్లే విభజించుకొనవలెను బాహ్యప్రపంచమున భౌతికమగు నాలయము నిర్మించునప్పుడు గూడ నిట్టి వ్యూహమునే యనుసరింపవలెను.

ప్రస్తుత వ్యూహమున నక్షత్రము లిట్లు ప్రథమ ద్వారముగా న్యాసము చేయఁబడినవి.

తూర్పు 10, దక్షిణము 6, పడమర 1, ఉత్తరము 10 = 27 అక్షరములు. ఇవియే నక్షత్రములు.† వీనికి ఆహత శబ్దములు సృష్టిలోఁ గల్పింపఁబడును. వానినే అక్షరము లనుచున్నాము. **అవియే ఆయా మంత్రముల యక్షరము లనఁబడుచున్నవి. ప్రస్తుతము నాలుగు ద్వారములతోఁ గూడిన బహిరావరణము పౌండరీక సేవితుఁడైన విరలాహ్వయునికి సంకేతమైన విద్యగా స్థాపింపఁబడినది. నిగమమునుండి యాగమము లిట్లే కాలకాలములందు నాచరణప్రధానములై పరి కల్పింపఁబడును. ఆ యాచారమునకు శాశ్వత ధర్మము మూలము. ఆ ధర్మము నిట్లు వ్యక్తుల మూలమున వ్యక్తముచేసి చ్యుతికాకుండఁ గాపాడువాఁ డచ్యుతుఁ డనఁబడు నంతర్యామి. ఈ విషయము భారతమున నుద్ఘాటింపఁబడినది.

"సర్వాగమానా మాచారః ప్రథమం పరికల్పితః
ఆచారప్రభవో ధర్మః ధర్మస్య ప్రభురచ్యుతః"

96. 2-100.

"పరమపదనాథు నెమ్మెనఁబరఁగు వర్ణరాజి యఖిలంబు శ్రీమంత్రరాజమబల." ఇచ్చట రెండు న్యాసములు చెప్పఁబడినవి. అ, వర్ణరాజియఖిలంబు

† con=circle. Templar=square.

*నక్షత్రాణిరూపమ్

**అక్షరము, నక్షత్రము అను శబ్దముల నొక గుప్తగ్రంథ మిట్లు వ్యాఖ్యానించుచున్నది "

"అ + క్షరము, న + క్షత్రము. క్షరమనఁగా క్షతి. క్షత్ర మనఁగా క్షతిశీలము, అది లేనిదియే యక్షరము, నక్షత్రము. కనుకనే యక్షరమ శబ్ద బ్రహ్మోద్భవమనియు, నక్షత్రము పరమపురుషుని రూపమనియుఁ శ్రుతి చెప్పుచున్నది"

అనగా అకారాది క్షకారాంతము వర్ణాక్షమాల. ఇది స్వామినెమ్మేనఁ బరఁగును. అనగా మాతృకాన్యాసము చేత స్వామి శరీరమును బ్రతిష్ఠింపవలెను. అటుపైని శ్రీమంత్రరాజమువలన మూర్తి కల్పన చేయవలెను అనఁగా దిరుమంత్ర మనఁ బడు అష్టాక్షరీమంత్రము. ఓం నమో నారాయణాయ అను మంత్రము. వర్ణ రాజి యనగా రంగుల వరుస. ఇది వక్ష్యమాణ పద్యమునఁ జెప్పఁబడినది.

97. 2-101.

సూర్యోదయ కాలమున విట్టలు నెఱ్ఱరంగునను, మధ్యాహ్నమున శుభ్ర వర్ణమునను, సూర్యాస్తమయకాలమున నల్లని రంగు గలవానినిగను ధ్యానింప వలెను. ఇందుఁద్రిమూర్త్యాత్మకమై, జగద్వహనక్షమమైన రూపము నుపాసించుట జరుగును. రజోగుణమగు హిరణ్య గర్భవర్ణ ముదయమునను, సత్వగుణమగు శుచిషద్హంస – విష్ణు – వర్ణనము మధ్యాహ్నమునను, తమోగుణమగు రుద్ర రూప వర్ణనము సాయంకాలమున నుపాసించినచో సృష్టి స్థితి లయాత్మకమగు త్రిసంధ్యోపాసనము జరుగును. ఇది వేదోక్తమగు త్రిషవణములనుండి యవ లంబింపఁబడినది.

"గాయత్రియుం బోలి" యనుటవలన వాహనాదు లూహింపవచ్చునని యర్థము.

98. 2-104.

పైఁ జెప్పఁబడిన మూఁడు సవనములు నిందుఁ బుండరీకమునఁ గల "త్రిరా వృత్త"త్వమునకు సమన్వయింపఁబడుచున్నవి. క్షేత్రాత్మ ఎఱ్ఱరంగు గలిగి యుండును తీర్థాత్మ స్వచ్ఛవర్ణము. మూర్త్యాత్మ నీలవర్ణము. ఎఱ్ఱనేలపై స్వచ్ఛజలముల నది ప్రవహించును. అందుఁ బ్రతిబింబించు నాకాశస్వరూపుఁడు నీలదేహుఁడగు పరమాత్మయని చమత్కృతి.

"కంబలకౌశేయ" మొదలుకొని క్షేత్రమూర్తి నర్చించు విధము.

99. 2 – 105, 106.

తీర్థమూర్తి నర్చించు విధము.

ఇఁక మూర్త్యర్చనము ప్రధానము గనుకఁ బ్రత్యేకము వచనమున హెచ్చరింపఁబడినది. 108 నుండి 114 వ పద్యము వఱకును ఋతువుల ననుసరించి మూర్తి నర్చించుట. – ఋతువుస్వరూపుఁడైన యగ్నిని వర్ణించుట వేద ప్రసిద్ధము. అందుండియే ఆగమములలోనికి వచ్చినది.

100. 2 – 108.

"వనధి వనధాము" నుండి వర్ణనము. ఇది యా ఋతువునం దుపాసకుఁడు చేయు ధ్యానమునకును మూర్తికిఁ జేయు నలంకారమునకును బ్రమాణము. "మఖాంశభోక్త" అనుటకు "యజ్ఞభృత్ యజ్ఞకృద్యజ్ఞీ యజ్ఞభుగ్యజ్ఞసాధనః" అని విష్ణుని నామములుగా మహాభారతము చెప్పుచున్నది.

101. 2-109.

"వాసవిమనుపు కాపు" అనుటలో వాసవుఁడు మేఘాధిపతి గనుక ని యర్చనము వలన వేసవి తాప ముపశమించునని చమత్కృతి అందువలననే యీ పద్యమందలి యుపమానము లన్నియు జలమయములు, శీతలములుగా వర్ణింపఁబడినవి. ఇవి స్వామికిఁ జేయవలసిన శీతలోపచారములు.

102. 2-110.

ఈ పద్యమున ఋతుధర్మముల ననుకరించునట్టి యర్చన చెప్పఁబడినది. ప్రకృతిలోని వ్యూహములను మానవుఁ డనుకరించుట క్రతులక్షణము. – చూ. ఐతరేయ బ్రాహ్మణము. అధ్యా. 1. ఖం. 3. ఇందలి ప్రత్యంశమునకు వర్ష కాలోచితమగు నుపమానము జతపఱచుటవలన శ్రీకృష్ణునియందలి నారాయ ణత్వ ప్రతిపాదనము వ్యంగ్యము.

103. 2-111.

ఈ పద్యమందుఁ గూడ ఋతువు ననుసరించిన వస్తువులచేఁ బూజ వర్ణింపఁబడినది. ఇందుదాహృతములైన గోక్షీర, దధ్యాదులు తమ శ్వేత శుభ్రత్వాదిలక్షణములచే శరదృతు విషయకమైన యనుభావమును సహృదయ పాఠకులకుఁ గల్గించును. ఇం దుపమాద్యలంకారములు చేర్చక స్వభావోక్తు లతోఁ బూజ వర్ణింపఁబడినది. ఉపమానములు వ్యంగ్యమర్యాదలో నిహితము చేయఁబడి శ్రీకృష్ణుని ఋతుమూర్తిగను, గాలస్వరూపుఁడుగను ఉపమించు చున్నవి.

"క్రొంబంట వంటకములు" అనునది వేదమందలి అగ్రయణయిష్టి యను శరద్యజ్ఞములోని ప్రధానాంగము.

104. 2-112.

అ. ఇది హేమంత వర్ణనము. ఇదియును గ్రీష్మవర్ణనమునందువలె ఋతుధర్మముల నుపశమింపఁజేయు నుపచారములతో వర్ణింపఁబడినది. సుఖ ప్రదమైన ఋతువులలో నుపచారములు ఋతుధర్మోద్దీపనములుగను, క్లేశకర ములైన గ్రీష్మ, హేమంత శిశిరములయందు ఋతుధర్మోపశమనములుగను జెప్పఁబడి స్వామి సేవకు నిత్య శోభను గూర్పఁదగియున్నవి.

ఆ. "తులసిదండయగాని కలుగని తక్కువ
మరువక కుందకుట్మల సమృద్ధి"

ఈ పాదమున బులుసువారి వివరణమున– కలుగని = ఎక్కువ దొరకని, తక్కువన్ = లేమిని; మరువక = మరువము........" అని యున్నది.

తక్కువ యనగా నిచ్చట యల్పత్వము, లభింపకుండుటయని యర్థము. తులసి దండలు తప్ప నితరము లభింపని యల్పత్వమునందుఁగూడ మల్లెమొగ్గ లను బాయించి సేవించుట మరువకయని భావము. "కలుగని తక్కువ"

యనఁగా లోపము లేక యనియు నర్థము. స్వామి కర్పించునది తులసి దండయే గాని, యందు లోపము లేక, యా ఋతువు నందుఁగూడ కుందకుట్మల సమృద్ధిని మరువక యని యర్థము.

ఇ. "ముదురు వెన్నెలఁ జేయు నుదరపోషణవృత్తి" యను పాదములోని యర్థము సుబోధకముగా లేదు. "ముదుర వెన్నెలన్ = ముదిరిన వెన్నెలతో అమృతముతో" అని బులుసువారు.

105. 2–114.

"ఋతువుల నాలిట నీ క్రియఁ బ్రతిదినము భజింప" అనుటలో నొక యుక్తి యున్నది. ఆయా ఋతులక్షణములతో నర్చన ప్రతిదినము చేయవలెనని – అనఁగా సంవత్సరము తిరిగివచ్చువఱ కర్పింపవలెనని కామ్యకర్మరులగు దీక్షావరుల కన్వయించు నర్థము. ఈ యర్థమున "ఋతువులనాలిట" యను దాని కొక సంవత్సర మవధిగ నని యర్థము గలుగును.

ప్రతి సంవత్సరమందు నిట్లు స్వామి నర్పింపవలెనని నిష్కామకర్మరులగు ముముక్షువుల నిత్యార్చన విధాన క్రమము.

ఇది గాక యాగమోక్తమైన యాగవిధి నర్పించుటకు దేవాలయాది విధాన ములకు మఱియొక సమన్వయ మున్నది. "ఋతువు లాఱింటిలోఁ బ్రతిదినము భజింపన్" అని యన్వయము. ఆయా ఋతూక్తములగు పూజాక్రమములతోఁ బ్రతిదివ మారువేళల నర్పించుట, ఇది సంప్రదాయసిద్ధము, వేదములనుండి స్వీకరింపఁబడినదిగా నున్నది. వైష్ణవాలయములలో నాలువేళల నర్చన మున్నది.

106. 2–115.

ఇప్పుడు చెప్పఁబడినదంతయు మూర్త్యాత్మ నర్పించు విధానము. ఇట నుండి క్షేత్రమూర్తి నర్పించు విధాన మారంభమగును.

107. 2–116.

విశేషము: ఇందు క్షేత్రశబ్ద సాహచర్య బలమున శాస్త్ర నిరూఢ విషయ మొకటి యిందమర్చఁబడినది.

ఇరువదినాలుఁగు తత్వములను సృష్టియందుఁ గపిలుఁడను సిద్ధుఁడు సాంఖ్యమనఁబడు తత్వముగా స్థాపించెను. జీవుఁ డిరువదియైదవవాఁడు. ఈ యిరువదియైదు తత్వములను బరమపదనాథుని దిరిగి వచ్చుచుండును. ఇరు వదినాలుఁగు తత్వములతోఁ గూడిన భౌతికసృష్టియే క్షేత్ర మనఁబడును. అది పిండాండమున దేహ మనఁబడును. ఆగమపరిభాషలో నిదియే దేవాలయ మనఁబడును. చూ. దేహోదేవాలయః ప్రోక్తః. ఈక్షేత్రము, 25వ వాఁడగు నక్షరపురుషుఁడు కలిసి యిందు క్షేత్రమూర్తిగా నిరూపింపఁబడినారు. ఈ మొత్తమే ముక్తికరి, అనగా మోక్షమునకుఁ గారణము. ఇదియే యిరువదేను చేతుల ప్రమాణము అగు క్షేత్రమూర్తి యని యిందుఁ జెప్పఁబడినది

యోగమార్గ మవలంబించువారి సాధనకు దేహమే దేవాలయము. ఆగమ మార్గ మవలంబించువారికి ప్రతీకయైన బాహ్యదేవాలయ ముండును. బ్రహ్మో పాసకులకు సృష్టింపఁబడిన యీ బాహ్యజగత్తే దేవాలయము. ఇం దేది యైనను క్షేత్రశబ్దవాచ్యమే. అందలి జీవుఁడు, ఆత్మ. విగ్రహము క్షేత్రజ్ఞుఁడు. క్షేత్రజ్ఞులయం దంతర్యామిత వహించి తదతీతుఁడై పురుషోత్తమశబ్దవాచ్యుఁడగు పరమాత్మ యుండును. అతఁడే పరమపదనాథుఁడుగా నీ పద్యమునఁ జెప్పఁ బడినవాఁడు. చేతులు = "మూరలు"బులుసు. కిష్కువులు, బారలు అని యుండవలెను.

108. 117 నుంచి 160 వఱకు.

విశేషము : ఈ భాగమున క్షేత్రమూర్తి, తీర్థమూర్తి వైభవములు కలిపి వర్ణింపఁబడినవి. ఆయా క్షేత్ర విభాగములయందున్న యంగప్రత్యంగ దేవతలు వర్ణింపఁబడినారు వీరు మన దేహములయందలి కర్మేంద్రియముల కుపమానమగుచు బ్రహ్మాండమునం దంతర్లీనమై యున్న ప్రకృతి శక్తులకు నుపమేయములు, అధిదేవతలు నగుచున్నారు. తీర్థముల కధిదేవతలుఁగూడ వర్ణింపఁబడినారు, వీరు జ్ఞానేంద్రియములు, మనసు, వాగర్థాదులు, తదుత్పా ద్యములైన రసభావాదుల కుపమానములై సూర్యచంద్రాదిగ్రహముల కుప మేయములు, నధిదేవతలు నగు చున్నారు. యోగసాధనకు సంబంధించిన దేహస్థనాడీమండలమే బాహ్యజగత్తున ఆగమశాస్త్రములలోని తీర్థములగు చున్నది.

109. 2-117.

విశేషము : ఏ తీర్థము మహిమాన్వితమని కీర్తి పొందునో యదియే సమస్త తీర్థము లందు నర్చింపఁబడు నర్హత గలిగి తీర్థమూర్తియందు వెలుఁ గును. అనఁగా నే స్రోతస్సు – దేహమునఁగాని భూమిపైనిగాని – వలన పూజ నీయమగు చైతన్యము వహింపఁబడి సాధకుని మనస్సును సకలోత్కృష్టోన్నతి యందు నిలుపునో యది తీర్థమూర్తి. అనఁగా సుషుమ్న యని ధ్వని. కుటిల మగు కుండలిని యీ స్రోతస్సునం "దకుటిలమతి" యగును.

110. 2-118.

నేలమూర్తి = క్షేత్రమూర్తి.

క్షేత్రమూర్తియం దర్చనకు, నియమమునకు నేర్పడి ప్రశస్తములైన భాగము లున్నవి. – ఇవి శరీరమున భ్రూమధ్యము, హృదయము మున్నగు నవి. భూమిపైనిగాని, గయాకురుక్షేత్రాదులు – వానిని వదలి యింక నే భాగ మును బూజించినను వ్యర్థమగునుసుమా! – ఇందు శాస్త్రమర్మములు గురు కటాక్షమునఁ దెలియక సాధన మెంత చేసినను క్షేత్రద్వారములు విడవని హెచ్చరిక చేయఁబడినది.

111. 2-112.

"కావున క్షేత్రమూర్తి (body) తీర్థమూర్తి (soul) మూర్తి మూర్తుల (spirit) యందలి యర్చాభాగంబు లెఱింగి యర్చించుచు, ననువితావరణం బులకు విముఖుండగు పుణ్యనిధికి సుముఖుండై పాండురంగం డఖండానందం బాపాదించు" నని చెప్పఁబడినది.

ఇందు శాస్త్రజ్ఞానముకన్న నడవడి ప్రధానమని హెచ్చరిక వేయఁబడినది.

112. 2-120. 1. పద్మతీర్థము.

శుభోత్కరసద్మము = "శుభములకు స్థానమైన' బులును

శుభ + ఉత్ + కరసద్మము = శుభమైన యూర్ధ్వమయూఖములకు నిలయము — ఊర్ధ్వగతిని గలిగించు వివేకాది కిరణములకు నిలయము — అని గుప్తార్థము. దీనినే యూర్ధ్వరేతస్కతయని యోగులును ఉష్ణిక్ అని వేద విదులును జెప్పుదురు. ఇది దీర్ఘాయుః ప్రదము కనుక శుభశబ్దము సార్థకము.

"ఉష్ణిహాంవాయుష్కామః కుర్వీత, ఆయుర్వా ఉష్ణిక్
సర్వమాయుర్ఛేతి" " ఐ. త. బ్రా. అధ్యా. 1. ఖం. 5.

"ఉత్స్నిహ్యంతి ఊర్ధ్వజీవినో భవంత్యనయా ఇతి
వ్యుత్పత్త్యా ఆయుర్వృద్ధిహేతుత్వముష్ణిహః —భట్టభాస్కరః

ఇందు పిప్పలాకారులు "నరనారాయణులు" - "సుస్థిరతన్" - అను శబ్దముల శక్తిమూలక వ్యంజనవలన "అశ్వత్థవృక్ష" మనఁబడు పురుషోత్తమ ప్రాప్తి సాధనము ధ్వనించును. ఉత్కరము అను పదము వలన నూర్ధ్వమూలము అని స్ఫురణ. "పిప్పలాకారులు" అనుటలో పిప్పలమున కేకవచనము వాచ్యము. ఒకే చెట్టుమీద నరనారాయణతత్త్వములు గలవని భావము. ఈ సాధన స్వరూపమున నరుఁడనఁగా జీవుఁడనియు, వృక్షమనగా సంసారము (Universe) అనియు, నారాయణుఁడనగాఁ బురుషోత్తముఁడనియు సంప్రదాయము. ఇది శ్రుతులలో "ఊర్ధ్వమూల మవాక్ శాఖమ్" అనియు "ద్వా సుపర్ణా సయుజా సఖాయా" అనియు, గీతలయందు ఊర్ధ్వమూలమధశ్శాఖ మనియుఁ గీర్తింపఁబడినది. సుస్థిరతన్ అనుటకు గీతలందు "అశ్వత్థమేనం సువిరూఢమూలమ్" అని చెప్పఁబడినది. పిండాండమునందు మూలాధారము "సుస్థిరతన్" అను శబ్దమువలన సూచితము. మూలాధారమునుండి పైకి ఊర్ధ్వస్రోతస్సుగా నున్న బ్రహ్మదండమే యశ్వత్థము. అందు నరుఁడు (Man), నారాయణుఁడు (God) కలసి యుందురు. ఈ స్రోతస్సు యొక్క మార్గమున బద్మములు ఆరుండును గనుక నది పద్మతీర్థమనియు వికసన శీలమనియు చమత్కృతి. శంఖము - శబ్దజనకమైన, శబ్దబ్రహ్మప్రేరకమైన విశుద్ధి చక్రము. పద్మమనఁగా బ్రాధాన్యవివక్ష చేత హృదయ కమలము. ఈ రెండును నిధులు.

113. 2-121.

"హరిమేన నవతారమైన వారు"

గుప్తార్థము: హకార రేఫములు. అందు హకారము విష్ణుసూచకము, వ్యాపన శీలమునగు వాయుపూరణ వర్ణమనియు, రేఫమునకు - అగ్ని సూచకము. బోధన శీలమునగు తేజస్ఫూర్తియనియు శ్రుతులు, తంత్రములును జెప్పును, విష్ణువు అవతరించునప్పుడు హరియగునని భాగవత, విష్ణుపురాణములు చెప్పుచున్నవి,

"బ్రహ్మచర్యము" బ్రహ్మయందు చరించుట - పరబ్రహ్మభావము అని విశేషార్థము.

"పరపురుషార్థ సంపద" = 1. నాల్గవ పురుషార్థమగు మోక్ష సంపద. 2. ఉత్తమ పురుషుఁడు లేక పురుషోత్తముఁడనఁబడు పురుషసూక్తాదివ్యాహృత పరమాత్మయను నర్థ సంపద. 3. ఇతర పురుషుల యర్థమే తమ సంపద. అనఁగాఁ దాము పురుషార్థాతీతులై, నితరులయం దంతర్యామి తత్వముగా నున్నవారు.

ఈ సంపదతోడ "ధనురాది శస్త్రముల్ దాల్చుట" యనఁగా సర్వము మోక్షోన్ముఖము చేసికొనుట, సర్వశక్తులును బరమప్రయోజనమగు బ్రహ్మహితము కొఱకే వినియోగించు స్థితి సిద్ధించుట.

బ్రహ్మాదయో బ్రహ్మహితాయ తప్త్వా పరస్సహస్రం శరదస్తపాంసి
ఏతన్యదర్శన్ గురవః పురాణాః స్వాన్యేవ తేజాంసి తపోమయాని"

— భవభూతి. ఉ.రా.చ. 1

"ధనురాది శస్త్రముల్" శస్త్రములనగా స్తోత్రాత్మకములగు ఋక్కులు. అవి ప్రణవాదిగా వ్యాహారము చేయఁబడినచో మోక్షవాచక, సాధకములగును. ఈ వినియోగమునకుఁ బ్రణవము ధనుస్సని శ్రుతులు చెప్పుచున్నవి.

"ప్రణవో ధను శ్శరోహ్యాత్మా
బ్రహ్మత ల్లక్ష్యముద్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం
శరవత్తన్మయో భవేత్" — ముండకోపనిషత్. 2-2-4

"ఘస్రప్రతిబింబనిభులు" 1. సూర్యబింబమును బోలినవారు. 2. సూర్యాంతర్వర్తితో సమానులు, సూర్యాంతర్వర్తి నారాయణుని కాంతిస్వరూపమైనవారు.

"సహస్ర కవచకవచనిర్భేదనులు" కర్ణుని కవచమును భేదించినవారు" - బలులను. 1. సహస్రకవచ మనఁగా సహస్రారదళకమలము. దాని కవచమును - ఆవరణమును భేదనము చేయువారు. అనఁగా సహస్రారచక్రభ్రమణాత్మకమగు నఖండ బ్రహ్మపదవియందున్నవారు, దానిని బ్రసాదించువారు.

2. 'సహస్ర' యను కవచము సుదర్శనము. అది పురుషోత్తముని ప్రధానాయుధ మనియుఁ బురుషసూక్తమున మొదట వాచకమనియుఁ బెద్దలు చెప్పుదురు. "సహస్ర" యను పదమే తద్వాచకము. అందలి పొఱలను భేదించి తత్త్వార్థమను ననుభూతిని గలిగినవారు, ప్రసాదించువారు.

114. 2 – 122.

గుప్తార్థము: మూలాధారము మొదలుకొని మూఁడు కోటులు – మూడం చులుగా నాడులీ సుషుమ్నామార్గమును బ్రజ్ఞామయములై వెలిగించుచుండునని శాస్త్ర సంప్రదాయము. వారే అమరాంగనలుగా నిందు సంకేతింపఁబడినారు.

115. 2 – 123. 2. కుండల తీర్థము.

ఇది "పన్నగశాయికి నీఋదిక్కున" నున్నది. అనఁగా నీ తీర్థమునకుఁ బడమట స్వామి సర్పముమీద శయనించి యుండును. ఇది పిండాండమున మూలాధారమనఁ బడు స్థానము. దీనిని దాంత్రికులు "కులకుండ"మందురు. ఇందలి సర్పమును గుండలిని యని యోగశాస్త్రము, తంత్రశాస్త్రము పేర్కొనును. శేషుఁడని ఆగమములు పురాణములు పేర్కొనును. ఇదియే సకల జగద్భారవహ మని, సహస్రశీర్షమని, సంకేతజ్ఞులు వర్ణించిరి.

"వహత్యేనం శౌరిః కథమపి సహస్రేన శిరసా"

– అది శంకరుల సౌందర్యలహరి. శ్లో. 2.

"తన తొడ్విన కుండలముల్ నిజక్ష్మాంతశ్శిలలోనదాప"

గుప్తార్థము: కుండలములు = వర్తులాకారములైన జగదండములు. తనతొడ్విన = తాను ధరించిన – తానాకారము పొందిన, అంతర్యామిత పొందిన – నిజక్ష్మా = 1. తన భూమి, తాను నిలబడిన భూమి – నిరాలం బము – 2. స్వయంవహన శక్తి.

అంతశ్శిల = 1. లోపల నిమిడియున్న రాయి, 2. లోపల నిమిడి యున్న నాడి, స్రోతస్సు – శిలాభిస్తు లంబత్యాకోశసన్నిభమ్. మంత్రపుష్పము. ఇట్టి తావులందు శిరాశబ్దపర్యాయముగా శిలాశబ్దము వాడఁబడును.

తాను ధరించిన జగదండముల యాకారములను తన మాయ యనఁబడు స్వయంభరణశక్తిస్వరూపమైన నాడిక.

116. 2 – 124.

అ. "నిజమంత్రరాజపూజైకతానతాయుతుఁబ్రోచున్" = 1. నిజ, మంత్ర రాజ, పూజా, ఏకతానతా, యుతున్ – తన మంత్రరాజమునఁ బూజించుటయం దేకాగ్రత కలవానిని రక్షించును. 2. నిజ, మంత్రరాజ, పూజా, ఏకతా, అనత, అయుతున్ – తనమంత్ర రాజమునఁ బూజించుటయం దైక్యముపొంది నమస్క రించిన అయుతుని రక్షించును.

అయుతుని కథ 5వ యాశ్వాసమున నారదునకుఁ బరమేశ్వరుఁడు చెప్పి నాఁడు. అగస్త్యుఁడు వింధ్య దాటక మునుపు కాశియందున్నప్పుడే యీ కథ జరిగినది – చూ. ఆ. 5. ప. 168.

ప్రస్తుతము పార్వతి కి క్షేత్రమాహాత్మ్యమును వివరించునాటి కగస్త్యుఁడు వింధ్యాద్రి దాటినాఁడు. కనుక ద్వితీయాశ్వాసకథనాటి కయుతుని కథ భూత కాలికము. ఇచట 'ప్రోచున్' అను క్రియకుఁ బ్రోచినాఁడు అని యర్థము చెప్పుకొన వలెను. అయుతుఁడు కప్పయై నరసింహ చరణపీఠముకడనుండియే తరించినాఁడు.

అ. మంత్రరాజము: నృసింహబుక్కు. ఇది యనుష్టుప్ఛందమున అథర్వణమునందున్నది. దీనినే అనుష్టుభ మంత్రరాజ మనియుఁ గీర్తింతురు.–చూ. 5 – 263. "మును లనుష్టుభమునఁ దనుగొల్వఁదగువానిఁ బ్రహ్లాదుఁబ్రోవఁ బాల్పడినవాని ....శ్రీ నృసింహదేవు." అది యీ విధముగా నుండును.

"ఉగ్రంవీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతోముఖమ్, నృసింహం భీషణం భద్రం మృత్యు మృత్యుం నమామ్యహమ్"

ఇ. కుంజరాశనత: 1. ఏనుఁగులను దిను లక్షణము. ఇది సింహము నకు సహజము, 2. రావిచెట్టు రూపము ధరించుట. ఇది పురుషోత్తముఁ డనఁబడు నారాయణుని యశ్వత్థమూర్తి, 3. కుంజరమను సంకేతముగల శక్తి మూలాధారమున నుండును దానిని జయించుట కుంజరాశనత.

"చతుర్బాహుభూషం గజేంద్రాధిరూఢం
తదంగే నవీనార్కతుల్యప్రకాశః"

–షట్చ. ని. ప్రక. 1. శ్లో. 7.

117. 2–125.

హరివల్లభలు=1. విష్ణువునకుఁ బ్రియలు. 2. హరిశబ్దమునకు వాల్ల భ్యము వహించు ధ్వనులు – హ్రీంకారములు – చూ. ప. 126. ఇవి శక్తి బీజము లనఁబడును. 3. "హరివల్లభ" యనఁగా లక్ష్మి – చూ. భారతము. అనఘాం హరివల్లభామ్.

శ్రీం అను నక్షరము.

హ్రీంశ్రీం అను మంత్రమును గొలువవలయునని గుప్తార్థము.

నయకాములకున్=శుభములు కోరువారికి. నయకాములకున్=నియ మము కోరువారికి. విఘ్నములు కలుగక యిహపరసాధనములు కలుగవలె నన్నచో మూలాధారమున శ్రీంహ్రీంకారములతోఁ గూడిన నరసింహమంత్ర రాజము నారాధింపవలెనని గుప్తార్థము.

118. 2-126. 3. ముక్తకేశి. 126-132.

అ. అంశేందూద్వహదేవి="చంద్రకళను వహించిన శివునికి నాకు భార్యవైన పార్వతీ." —బులుసు.

అంశేందూద్వహ, దేవి యని వేర్వేఱ రెండు సంబోధనలుగా స్వీకరింప వలెను.

అంశేందూద్వహ=చంద్రకళను వహించినదానా! హ్రీంకారవాచ్యయగు దేవి చంద్రకళాధరయే! తంత్రములలో దేవీ వర్ణనము.

"అంతస్స్మితోల్లసిత మిందుకళావతంస
మిందీవరోదర సహోదర నేత్రశోభి
హేతుస్త్రిలోకవిభవస్య నవేందుమౌళే
రంతఃపురం దిశతు మంగళ మాదరాద్వః"

ఆ. హ్రీంకృతిధ్రువంబై="హ్రీంకారబీజముతో స్థిరమై" —బులుసు.
హ్రీంకారబీజమునకుఁ గేంద్రమై - ఉత్పత్తిస్థానమై.

ఇ. త్రింశచ్చాపమితోర్విన్ = "ముప్పదివిండ్లుదూరమున" —బులుసు.

చాపమితములు ముప్పది యయిన ప్రాంతమునందు, అనఁగా వెన్నెముక యను చాపమునందు ముప్పది కనువుల దూరమున - వెన్నెముకలోని యెముకలు ముప్పది లెక్కింపఁగాఁ గల దూరమున - యని గుప్తార్థము. ఇది యనాహత మనఁబడు హృదయము ప్రాంతము. అందువలననే హ్రీంకృతిధ్రువంబు అను విశేషణ మరవంతము.

మున్ భ్రంశంబొందక="పాటైపోక" బులుసు. ముందటి ప్రవాహమున భ్రంశము చెందక - అనఁగా మహిమ తరుగక. జీవితమందలి భవిష్యత్కాలమున - ఈ తీర్థసేవనము చేసినవారికి - భ్రష్టత కలుగనీక.

తాత్పర్యము : ఓ చంద్రకళాధరీ ! దేవీ ! హ్రీంకారమునకు మూలమైన యా తావునుండి ముప్పది చాపముల కొలతకుఁ బై నుత్తరదిశయందు నొక తీర్థము దీపించును. పోయినకొలదియు నెందును దానికి భ్రంశములేదు. దాని జలధారలవలనఁ బాలవరుసలతోఁ బరిశుద్ధి పొందిన జలములు కొన్ని వెనుకఁబడి నిలిచినవి. అచ్చట జపము, స్నానము, పాత్రులకు దానాదికములు చేయఁదగును.

119. 2-127.

తాత్పర్యము : విష్ణుమూర్తికిఁ బలుదెసలయందు నెదుట నిలఁబడి హారతులిచ్చు నియమము కల దేవకన్యకలు శతకోటి సంఖ్యలవారా యుత్తమమగు ముక్తకేశి తీర్థమున జలక్రీడ లొనరింతురు. వారు హరికి హారతులిచ్చు వేళల బాహుమూలముల విగడగలు గనుపించును. వారు మోయు బరువున కవి తోడు

పడ వచ్చినట్లుండును· చంద్రుల సమూహములకుఁ గల చలువ నలవఱచు క్రొను క్రొత్త సూర్యరశ్మి లనునట్లుగా వా రిచ్చు హారతుల దీపముల వెలుఁగులు వారి బుగ్గల యందుఁ బ్రతిబింబించుచున్నవి. దీపపుఁ గొడియందుఁ బుట్టు నల్లఁదనపు మొలకలను మబ్బులకు గ్రొత్తమెఱపులవలె వారి చూపులున్నవి. పాత్రుని యందుఁ బొడమిన మైత్రివలె – స్వామికి హారతు లిచ్చి – పాత్రయందుఁ జము రుంచఁబడినదియని యిచ్చి సంతోషించుచున్నట్లు పాలిండ్లు నిబ్బరము లగు చున్నవి.

ఇందు నాలుగు పాదములయందును నాలుఁ గుపమాలంకారములున్నవి. మూఁడవ పాదమునఁ "గాశిమాంకురపుమేఘములు" అనుచో రూపకము. నాలుఁ గవపాదమున "స్నేహంబు – పాత్రనిక్షిప్తము – ఉబ్బు" అనుచో శ్లేష.

విశేషము : రెండవ పాదమునఁ గల యలంకారమున స్త్రీల మొగములు చంద్ర సదృశములు గనుక నెలకులంబుల చల్వ సమంజసము. కపోలము లద్దము లవలె నున్నవి గనుకఁ బ్రతిబింబించుట, మూఁడవ పాదమున "క్రొమ్మించులు" అనుటచే నవి తొలకరి మెఱుఁగులనియు, నందువలన నెత్తుగీతిలోని "దివ్యకన్య కలు" అను ప్రయోగమందలి కన్యకాశబ్దము సార్థకమగుటయుఁ గననగును. వారి స్నేహము హరియందు నిక్షిప్త మగుటవలనఁ బాత్ర నిక్షిప్త మయినది. కనుక "ధన్యమతులు" అను ప్రయోగము సార్థకము.

120. 2–128.

త్రిలోక విమోహన క్రియారోప నిరూపణంబగు = "మూఁడులోకములను మోహింపఁజేయుటను రూపించు" —బులుసు.

"మూఁడు లోకములను విశేషముగా మోహింపఁజేయు క్రియను – క్రియా శక్తిని – ఆరోపింపఁగలుగుటను నిరూపించునట్టి" అని యుండవలెను. దీని నిరూపణములే గోపికయందుఁ గలిగిన నిర్నిమేషనయనత మొదలగు స్థితులు.

121. 2–129.

వైషమేషవ విషమేషు శోషణమున = "బేసిసంఖ్యబాణములు గల మన్మ థుని బాధను గలిగించు బాణములవల్ల చిక్కిపోవుటచేత – విషమేషు = బేసి బాణములవలని – అని పూర్వటీక —బులుసు.

ఇచ్చట "విషమేషు" శబ్దములోని విషమ శబ్దమునకు బేసి యను నర్థము అపుష్టము, పునరుక్తము, వ్యర్థము నగును. కఠినమను నర్థము సమంజసము – విషమ = uneven, rough, rugged - Apte "పథిషువిషమేష్వప్యచలతా" – ముద్రా. రా. 3.3. –. Irregular, unequal, coarse, rough, painful, troublesome - Apte.

వైషమేషవ = మన్మథునకు సంబంధించిన, విషమేషు = కఠిన బాణముల చేత, శోషణమున = శుష్కించుటవలన అనుట సమంజసము.

ఆ వేషమొకరీతి, కాన్ = వేఱుగా మారిపోఁగా - బులుసు

"ఒకరీతి" భేదము లేని స్థితి. నిశ్చేష్టత పొందఁగా ననుట సమంజసము. దీనివలన భక్తులకు భగవంతుని వలనఁ గలుగు ఏకత్వము, ఏకముఖత్వము, ఏకాగ్రత మున్నగునవి ద్యోతమగును. అందువలననే "నిర్నిమేష నయన" యగుట, సుప్తసింధూవ మగుటయును.

ఇ. సుప్తసింధువు : సింధువు కదలిక లేక యుండుట సాధ్యము కాదు. అట్లే చిరవాంఛితమైన వస్తువు తోచినపుడు హృదయము స్పందించి ద్రవింపక మానదు. విరహిణికిఁ గూడఁ బ్రియదర్శనమున హృదయ ముద్విగ్నమై ద్రవించును. ఇట్టి లౌకికానుభూతులు కలుగక స్వామి దర్శనమున నిశ్చలము, అలౌకికమునగు స్థితి లభించినదని యర్థము.

ఈ. ఎఱగొంట : ఆహారము తీసికొనుట. స్వామిదర్శన మనునది పరితృప్తిని గలిగించు ననుభూతిగా నామెకుఁ గలిగినదని భావము.

122. 2 - 130.

బర్హశతంసుఁడు కరుణనిచ్చు నీవి యెఱుఁగక తచ్చరణములు మదినంటన్ - ఊరకుండుట - ఇచ్చట భక్త్యనుభూతికిఁ బరమావధియగు ప్రవృత్తి చిత్రింపఁబడినది. ప్రసన్నతయను స్థితియందు దైవమువలన మన కేమి కావలెనను ప్రశ్న ముదయింపదు. మోక్షాపేక్ష కూడ నంతర్హితమై దైవసాన్నిధ్యమగు పరవశత లభించును. అప్పు డన్య వస్తుభాస యుండదు. దీనినే యనన్యభక్తి, ఏకాంతభక్తి యని శాస్త్రములు చెప్పుచున్నవి. చిత్తబంధమే క్లేశబంధము. అది జారుటయే నిజమైన ముక్తి.

123. 2 - 131.

అ. "ఇది యేమి నీ వన్న" ఇదియేమి ? నీవు - నీ విట్లయితి వేమి యని భావము. లేదా "ఇది యేమి నీవు" - అనఁగా నీ వనుభావము - మధ్యమ పురుషభాన - అన్యవస్తుభాన - ఎక్కడనున్నది యని యుల్లసమాడుట. ఇందు జీవేశ్వరుల యంగాంగిభావము - శేషశేషిత్వము - చిత్రింపఁబడినది.

ఆ. కుంచితావయవభంగురవృత్తి = "వంపఁబడిన అవయవములయొక్క వంకరతోడి వ్యాపారముతో" - తెన్మరము.

"ముడుచుకొనిన అవయవములతో వంగు పద్ధతిచి" - బులుసు.

"ముడుచుకొనిన అవయవములతో అలవంటి ప్రవృత్తిగలిగి" యనుట సమంజసము. నది తనపైఁ బ్రవహింపఁబోవుట భంగురశబ్దముచే సూచితము. మఱియు శరీరముయొక్క తరంగవద్భాసము పరమాత్మానుభవమునఁ గలుగుట యిందు సూచింపఁబడినది.

ఇ. అస్మత్కరార్ధితంబగుట నడుగుఁగవ యిది సలాంఛనంబగుగాక : నా చేతులచేఁ బీడింపఁబడుటవలన నీ పాదద్వంద్వమిది లాంఛనములతోఁ గూడిన దగు గాక – అనఁగా నా చేతుల గుర్తులు నీ పాదములపై నుండుఁగాక యని యర్థము. అమె స్పర్శ విరమ్మరణీయ మగుఁగాక. లేదా చేతులచే నొక్కఁబడిన పాదములలోని శుభలాంఛనములు భక్తులకొఱ కచ్చోటి భూమిపైఁ బడుఁగాక యనియు నర్థము.

ఈ. అనంబరవు = 1. వస్త్రము లేనిదానవు, 2. ఆకాశము లేని దానవు - ఆకాశతత్త్వమున కతీతమైనదానవు, శబ్దగుణమున కతీతమైనదానవు, అనఁగా నిశ్శబ్దముగ నిలుచుదానవు అని గుప్తార్థము 3. మాయావరణరహితము, నిర్వికారచిత్తమునని మంత్రశాస్త్ర సంప్రదాయము. ముక్తకేశిని = 1. జుట్టు విరియఁబోసుకొన్నదానవు, 2. చాంచల్యము విడిపోయినదానవు అని మంత్రశాస్త్ర సంప్రదాయము. ఇందులకుఁ బ్రమాణము కర్పూరాదిస్తవము 10వ శ్లోకమున సాధకుని "గళితచికురః" యని వర్ణించిన సందర్భమునకు వ్యాఖ్య : "గళితం, నష్టం చికురత్వం చాపల్యం యస్య సః, నిశ్చలచిత్తస్సన్ : ఇట్లే 3వ శ్లోకమున "విగళితచికురే, కేశవిన్యాసాదివికార రహితే, నిర్వికారే కాలికే". అందే దిగంబరత్వమునకు 15వ శ్లోకమున సాధకుని "దిక్పటధరః" అని వర్ణించినదానికి వ్యాఖ్య : "దిక్పటధరః, మాయవతావరణరహితః, నిర్వికారచిత్తః"

— * విమలానందదాయినీస్వరూపవ్యాఖ్యా.

124. 2 – 132.

అనతార్ధమూర్తి = సగము శరీరమును వంచినది – అనంబరత్వమువలనఁ గలిగిన వ్రీడకతమునను, స్వామిసన్నిధివలని భక్తితోను సగము వంగినదని యర్థము.

125. 2 – 133. 4 భీమరథి.

బహుశలహరిగహనభయదాకృతియై = "ఎక్కువైన ప్రవాహములను నడచివే భయమును గల్గించు నాకారము కలదయి" – బులుసు.

ఇచ్చట గహన శబ్దమునకు దుస్తరార్థము సమంజసము. "ఎక్కువైన యలలతో దుస్తరమగుటవలన భయమును గొల్పునదై" యని సమాసార్థము. లహరిశబ్దమునకు బ్రవాహమనుటకన్నఁ దరంగములనుట సరియగును.

126. 2 – 137. 5. నృసింహతీర్థము.

అరణి నుద్భవమందు నగ్నికరణిన్ : అరణి యనఁగా యజ్ఞశాలలో నగ్నిని రగుల్కొల్పుట కుపయోగించునట్టిది, రోలు రోకలి వంటిది యగు కఱ్ఱల

*Hymn to Kalı by Arthur Avalon, Ganesh and Co., Madras, 1953.

జంట. ఇది నెల్లికఱ్ఱతోఁగాని, రావికఱ్ఱతోఁగాని చేయఁబడుటవలన నా వృక్షములకు వరుసగా "అగ్నిమంథనము, అశ్వత్థము" నను నామములు కలిగినవి. అరణి నుద్భవమైన యగ్నిని యజ్ఞాగ్ని, జాతవేదుఁడు నందురు. యజ్ఞమందు విని యోగింపకముందు సద్యోజాతుఁడందురు. శివాగమమున నేకాదశరుద్రులలో సద్యోజాతుఁడొకడు. వైష్ణవాగమమున నృసింహుఁ డతఁడే. పూర్వముగూడ నీ కవి నృసింహుని నశ్వత్థముతోఁ బోల్చినాఁడు. "నరసింహమధ్య, యబ్బో నరసింహుఁడు కుంజరాశనతదాల్చుట". – 2 – 124

మొదటిపాదమున నుపమాలంకారము, రెండవపాదమున రూపకము. మూఁడవ పాదమున విరోధాభాసము, నాలుగవ పాదమున రూపకము, కావ్యలింగము. "యక్షపక్షిఖచర . గ్రామణీశిరోమణి – పక్షిశబ్దము పశుపక్ష్యాదులచేఁ గొలువఁబడుట రాఁబోవు కథలో నయుతుఁడు కప్పయై కొలుచుటను సూచించును.

ముప్పది రెండు బాహువులు గలిగి : ఇవి మంత్రములోని ముప్పది రెండు వర్ణములు. అనుష్టుభమంత్రరాజమునఁగల ముప్పది రెండు వర్ణములును ముప్పది రెండు బాహువులై భక్తులఁ బ్రోచునని యర్థము. ఏ మంత్రమైన ననుష్టుప్ఛందమున నున్నవు దది ముప్పది రెండు బాహువుల దేవతగాఁ జెప్పుట యాగమ పరిభాష. ముప్పదిరెండు వర్ణాత్మక దైవతములచేఁ బరివేష్టింపఁబడి యుండునని చెప్పుట వేదపరిభాష. అట్టి మంత్రమును రెండుమార్లుచ్చరించుట వలన నొక యావర్తము అగును. అట్టి యావృత్తులు స్వర్గఫలప్రదములగునని వేదసంప్రదాయము. ఒకయావృత్తిలో 64 వర్ణము లుండును. దివిపృథివ్యంతరిక్షములు మూఁడింటిలో నొక్కొక్కటి ఇరువదియొక్క స్వరసమిధలచేత – త్రిస్థాయులలో స్వరసప్తకము చేత – నుద్దీప్తమై యుచ్చరించువానికి ద్యోతకమగుచుండును. $21 \times 3 = 63$. ఈ 63 లోకములు సంసారాత్మకములు. వానికిఁ బరమందున్నది 64వది వేదమున స్వర్గమనఁబడును. అదియే వేదాంతములందు ముక్తి, మోక్షము అనఁబడును. ఇది యనుష్టుప్ఛందస్సువలన లభ్యమని వేదము చెప్పును.. – అనుష్టుభౌస్వర్గకామః కుర్వీత, ద్వయోర్వాఅనుష్టుభోశ్చతుష్షష్టిరక్షరాణి, త్రయఇను ఊర్ధ్వఏకవింశాలోకాః, ఏకవింశత్యైకవింశత్యైవేమాంల్లోకాన్ రోహతి, స్వర్గ ఏవలోకే చతుష్షష్టితమేన ప్రతితిష్ఠతి, ప్రతితిష్ఠతి యఏవంవిద్వాననుష్టుభౌకురుతే, ఐతరేయ బ్రాహ్మణము – అధ్యాయము 1. ఖండము 5. – చూ. ఆశ్వా..5. ప. 273.

127. 2 – 138. 6. అగస్త్యతీర్థము.

ఒకానొక తపంబు = ప్రత్యేకదీక్ష. ఒకానొక లోకశ్రేయస్సు కోరి చేసిన తపస్సు.

తాత్పర్యము : ఆ యగస్త్యుఁ డొక ప్రత్యేక తపస్సుగ్రముగఁజేసి నన్ను దివ్యలింగముగా నచ్చటి తీర్థమున నిలిపినాఁడు. అదియే యగస్త్యతీర్థము. దాని విస్పారిన యాకారము డెబ్బదియేడు చేతుల కొలతగల యావరణము. అనఁగాఁ దీర్ఘము గుండ్రగానుండి చుట్టుకొలత 77 హస్తములుండును.

గుప్తార్థము: అగస్త్యుఁ డుగ్రతపస్సు చేసి "నే" నను అహంకరణమును జలమధ్యమున విడిచెను. "నేను" అను ప్రజ్ఞ దివ్యలింగమై – దివ్యప్రజ్ఞకు గురువై – రుద్రాకృతిలో వెలుఁగును. రుద్రులు పదునొకండ్రు – 5 కర్మేంద్రియములు, 5 జ్ఞానేంద్రియములు మనస్సు – వీరు ఏడు లోకములలో – (సప్తవ్యాహృతు లనఁబడు వర్ణలోకములో (seven utterances as colours and musical scales) భాసించుటవలన 11 × 7 = 77 మూర్తులుందురు. అందువలన ఆ తీర్థము 77 హస్తముల మండలాకృతిగా వర్ణింపఁబడినది.

129. 2 – 139. 7. గణపతి తీర్థము.

విద్యాధికుల్ = 1. విద్యలయందు గొప్పవారు, 2. గణపతివిద్య, గోపాల విద్య మున్నగు మహావిద్యలయందు గొప్పవారు, 3. మోక్షవిద్య యందు గొప్పవారు.

తాత్పర్యము: విఘ్నేశ్వరుఁ డొకప్పుడు గోపాలుని గొలిచెను. తత్ఫలితముగా గోపాలమంత్రమందుఁ దానొక యంగ మయ్యెను. గోపాలమంత్రము తన మంత్రమునం దంగమయ్యెను – సారూప్యముక్తి లభించెను. అప్పు డొక తీర్థము దాపున నతఁడు వసించుట వలన నది గణపతితీర్థ మయ్యెను. అది అగస్త్యతీర్థముకన్నను మొదటిదని విద్యలు తెలిసినవారు చెప్పుదురు. ఇందు గణపతి బీజసంపుటితో గోపాలమంత్రము నూతనముగా రామకృష్ణునిచే నుద్ధరింపఁబడినది. అది "గం నవనీత ప్రియాయనమః" యనునది.

గుప్తార్థము: గకారము గోపాలమంత్రమునకును గణపతిమంత్రమునకును సమానము. అది గో శబ్దమై నవనీతప్రియుని మంత్రమున అంగమగును. గం శబ్దమై గణపతి మంత్రమున అంగమగును. గణపతి, గోపాలశబ్దములకు మొదట గకారమున్నది. అగస్త్య శబ్దమున గకారము రెండవదిగా నున్నది కనుక దానికన్న గణపతి గోపాల శబ్దములకు అద్యముగా గకారమున్నది గనుక గణపతి తీర్థమగస్త్య తీరమునకన్న మొదటిదని విద్యాధికులు చెప్పుదురు.

వ్యాకృతము కానిది, పరిమిత మనస్సున మాయచే నియతార్థమున బద్ధము కానిదియు నగు శబ్దము గోవని వేదములు చెప్పును. ఛందోబద్ధమైన శబ్ద సముదాయము, వ్యాకరణబద్ధమైన పద సముదాయము గణ మనఁబడును. ఛాందోగ్యము, గోపథములందును, వివిధ బ్రాహ్మణములలోని గవామయన వ్యాకృతి యందును పశుబంధన యజ్ఞమునందును ఈ వివరణమును విపులముగాఁ గనవచ్చును. మఱియు సంస్కృత భారతము ఆదిపర్వమున ఉపమన్యు ఉదంకులు చేసిన "విపులార్థవంతంబులైన మంత్రము" లలోఁ జూడనగును.

130. 2 – 140. 8. సంకర్షణ తీర్థము.

తాత్పర్యము: గణపతి తీర్థమునకుఁ దూర్పున సంకర్షణతీర్థమున్నది. అందు స్నానము చేయువారికిని వారి పూర్వులకుఁ గూడ ముక్తి గలుఁగును. పూర్వము బలరాముఁడు తీర్థయాత్రకు వచ్చి స్నానము చేయుచుండఁగాఁ బాండురంగఁడు ప్రత్యక్షమై దయచూపెను. అప్పుడు తన పేర నాతీర్థము

వెలయవలయునని బలరాముఁడు వరము వడసెను. ఆ వర మిచ్చి పాండురంగ. డంతర్హితుఁడయ్యెను.

బలరాముఁడు భారతయుద్ధకాలమునఁ దీర్థయాత్ర వెడలెనని భారతమునఁ గలదు. రామకృష్ణు డా కాలమునకు దీని ననుసంధించియుండును.

హలధరునిపేర సంకర్షణతీర్థ మయినదని చెప్పుటవలన బలరాముఁడు సంకర్షణవ్యూహమను శాస్త్రసమయము స్మరింపఁబడినది.

131. 2-141. 9. జాబాలి తీర్థము.

అద్యంబై = మొదటిదయి - తరువాతిదయి - బులుసు.

ఇందు మొదటిది యనుటొప్పు. తరువాతి దనుట తప్పు. ఇంతకన్న ముందుఁ బుట్టినదియని యర్థము.

తాత్పర్యము: ఆ సంకర్షణ తీర్థమునకన్నఁ బురాతనమైనది జాబాలి తీర్థము. బ్రహ్మచే నది మ్రొక్కు లందుచుండును, దాని హొడవేఁ బది ధనుస్సులు. తన నీటియందు మునుఁగారు సకల జీవరాసుల కోరికల నొసఁగుటయను దీక్ష యం దది యెప్పుడును సంసిద్ధమయి యుండును.

132. 2-142. 10. బ్రహ్మతీర్థము.

దానివృత్తంబెల్లన్ = "దాని చరిత్ర మంతయును" --బులుసు. దాని నడవడి యంతయును, దాని యావరణ మంతయును అని శ్లేషార్థములు.

"క్రొత్త దాని వృత్తంబెల్లన్" —చూ. ప. 145

ఆ జాబాలి తీర్థమునకు సమీపమున బ్రహ్మతీర్థమున్నది. అది నూరు చేతుల వృత్తాకారము. దాని విషయము నిత్య నూతనత్వము.

శతదోర్వృత్తాకృతి యనఁగా నూరుచేతుల చుట్టుకొలత గల గుండ్రని యాకారము.

133. 2-143.

వాణీవధూ సనాథుండగుచున్ = "సరస్వతీదేవితో కూడినవాఁడగుచు" — బులుసు. సరస్వతీదేవిచే నలంకరింపఁబడినవాఁ డగుచు.

ఇచ్చట శతానందుఁడను పదమునకుఁ బ్రత్యేక ప్రయోజనమున్నది. ఆ తీర్థము శతదోర్వృత్తకృత్తి. ఈయన శతానందుఁడు. కనుక నందు వసించుట కాయన కనువగును. కనుక నది బ్రహ్మతీరమైనది. ఇట శతానందశబ్ద మాను కూల్య వ్యంజకము.

134, 2-144. 11, కలశ తీర్థము.

బ్రహ్మతీర్థమునకు దక్షిణమున గలశ తీర్థమున్నది. ఇది ఐదుబారల పొడవు గలది. లక్ష్మికి నివాసము. అమృతామహాదేవి=లక్ష్మీదేవి. అశోకాం అమృతాందీప్తాం లోకశోకవినాశనీమ్." అని లక్ష్మీనామములు

135. 2-145.

ఇందలి విరోధాభాసములోని 'యద్భుతంబు' వలన 142 వ పద్యములోని బ్రహ్మతీర్థము వృత్తముయొక్క క్రొత్తదనము నిరూపితమైనది.

"చంద్రికాగౌరము" అను విశేషణమువలన బ్రహ్మతీర్థమునందలి సరస్వతీత్వము, కలశతీర్థముయొక్క అమృతాదేవి యాస్పదత్వము నిరూపితములు. శతానందుఁడు బ్రహ్మతీర్థమున "యదుకులనందనసేవావిధాన నందన్మతియై" యుండుటవలనఁ" దత్పయోధార ముక్తినిధానమునకు నంజనబ్బాయయై తోచుట" కు హేతువు వ్యంగ్యము. యదుకుల నందనుఁడు నీలదేహుఁడు.

136. 2-146. 12. పితృతీర్థము.

కలశతీర్థమునకు దక్షిణమున నేడు చేతుల పొడవున నున్నది. అచ్చట స్నానదానాదికములు చేసినచో గయలో చేసిన రీతిని పితరులకు సుఖము నొనఁగూడును.

138. 2-147. 13. చక్ర తీర్థము.

దానికి దక్షిణమునఁ దొమ్మిది చేతుల పొడవున నున్నది. ఇది బ్రహ్మవిద్య నెఱిఁగిన వారిచే సేవింపఁబడును. అందు విలాసముగా-హెచ్చు నియమదీక్షాదికముల యపేక్షలేక - విమలజలములతో స్నానము చేసి విష్ణుని - విరలుని-ధ్యానము చేసినవారికి దుర్గమము లైన మోక్షమార్గ శ్రేణి సులభములగును.

132. 2-148.

అందలి జలములలోఁ జక్రచిహ్నలు ముద్రింపఁబడిన శిలల సమూహముండును - సాలగ్రామములుండును. ఆ తీర్థముయొక్క గుణగణము లింద్రాదులు కొనియాడుదురు. సుదర్శనముద్ర గల సాలగ్రామము లుత్తమశ్రేణికిఁ జెందినవి, మిక్కిలి పవిత్రములని సంప్రదాయము.

139. 2-149. 14. లక్ష్మీతీర్థము.

చక్రతీర్థమునకు దక్షిణమున నున్నది. అది యార్తులకు - భవరోగములకు - భేషజము. అచ్చట నిశ్శంకగాఁ దపము చేసియే లక్ష్మీదేవి విష్ణుని వక్షస్థలమను రతనాల మేడలో నడుగిడి నివసింపఁగలిగెను.

"ఆర్యంబార్తివైద్యంబు" - అనుప్రాసాలంకారము.
"దైతేయారి భుజాంతరాళ మణిసౌధంబు" —రూపకము.

140, 2-150. 15. కౌమోదకీతీర్థము, 16. పద్మతీర్థము.
17. శంఖతీర్థము 18. చక్రతీర్థము.

ఇవి లక్ష్మీతీర్థమునకు దక్షిణమున నున్నవి యనుటవలనఁ దొలుత నుదాహరింపఁబడిన పద్మతీర్థము -ప. 120-, చక్రతీర్థము -ప. 147 కాక యివివేఱని యర్థము. ఈ నాలుఁగును లక్ష్మీతీర్థమును గలిసి శక్తి పంచక మనఁ బడును.

-వీనినే భగవంతుని యైదు శక్తులుగాఁ దాంత్రికులు చెప్పుదురు. వాని కృత్యములు, సృష్టి, స్థితి, లయము, తిరోధానము, అనుగ్రహము.

వీని మొత్తము విస్తృతి యఱువది చేతులు. వీని ప్రభావము పరమ పవిత్రము- భక్తులను బాప విముక్తులను చేయుట ఈ యైదును విష్ణుని ప్రాణ పంచకమనఁబడును.

—యోగసాధకుని పంచప్రాణములే యివి. అతఁడు సమాధిసితుఁడైనప్పు డివి భగవంతుని పొత్తై సాధకునకు ముక్తస్థితి కలుఁగును. ప్రాణము (Inhalation అపానము (exhalat on) వ్యానము (nerve sensat on) ఉదానము (equi-ll brium) సమానము (centralizat on) అనునవి పంచప్రాణములు. వీనిని సమానమును నైదవస్థితిలో నుంచుట ప్రాణాయామ మనఁబడును "ప్రాణాపానౌ సమౌకృత్వాభ్యంతర చారిణౌ" . గీత. ఇందుఁ బ్రాణమునకు శంఖము, అపాన మునకుఁ జక్రము, వ్యానమునకు గద, ఉదానమునకు లక్ష్మి, సమానమునకు బద్మము చిహ్నములు.

ఈ 18 తీర్థములును స్వామి శరీరత్వమునందునుఁ "దీర్థమూర్తి" అను పేరున వ్యవహరింపఁబడును ఇవికాక—

141. 2-151. 19. పౌండరీక తీర్థము.

ఇది యాయన దివ్యశరీరము. ఇది యన్నిటికన్న గొప్ప తీర్థమూర్తి. ఇది దశవ్యామవిశాలము.

పురుషుఁడు దశాంగులత్వము గలవాఁడని శ్రుతి. 10 యను సంఖ్య పురుష సూక్తమునఁ బ్రతిపాదింపఁబడిన మూర్తికిఁ జెందినది. ఇది యన్నిటికన్న పరమైన తీర్థము. విష్ణువు పరోమాత్రమగు తనువున వర్ధిల్లెనని శ్రుతి. "పరో మాత్రయాతన్వావృధాన" [1]మూఁడు లోకములును ఆ మూర్తిని బొందును - భూర్భువస్సువర్లోకములు. విష్ణువు మూఁడు క్రమములతో విష్ణుత్వ మందెనని శ్రుతి. "ఇదం విష్ణుర్విచక్రమే త్రేధా నిదధే పదమ్"[2], "త్రీణిపదాని విచక్రమే"[3] "అనఁగా వినఁగాఁగనఁగాఁదగున్దగున్" – యమకము.

---

[1] ఋగ్వేదము 7 – 99 – 1.

[2] ఋగ్వేదము. 1 – 22 – 17.

[3] ఋగ్వేదము. 1 – 22 – 18.

అంగులమ్ - ఱకఱ

142. 2 – 152.

ఆ మధువైరి దివ్యతనువు పై పద్యమున సూచింపఁబడినది. ఈ పద్యమున దాని వైభవ వర్ణనము చేయఁబడినది.

నిడువాలుగను చూపు = "మిక్కిలి వాడియైన చూపు" – బులుసు.

నిడుకను చూపు, వాలుఁగను చూపు అని విడఁదీయుట సమంజసము.

నిడుచూపు = సూటియైన చూపు. ఇది సూర్యరశ్మి లక్షణము కనుక సూర్యాత్మకమైన దృష్టి యిందు సూచింపఁబడినది.

వాలుచూపు = వంగినచూపు – ప్రతిబింబితమైన చూపు –

ఇది చంద్రకిరణమున కుపలక్షణము కనుకఁ జంద్రాత్మకమైన యాలోక మిందు సూచింపఁబడినది. దీనినిఁగూడ మిక్కిలి వాడియైన చూపని చెప్పుట సమంజసము కాదు. ఇందలి నాలుఁగుపాదములలో వరుసగా సూర్యచంద్రులు, వాయువు, పృథివి – గంధవతి పుష్పాది –, జలము విష్ణుని దివ్యతనువు నందం గాంగిభావము గలిగినట్లు వర్ణింపఁబడినవి.

కంబుశక్తి = "శంఖరూపమగు ఆయుధ విశేషము" – బులుసు.

కంబు, శక్తియని విడఁదీయుట సమంజసము. శంఖము, శక్తి యను నాయుధ ద్వయము.

వెల్లివొడువ = "ప్రవహింపఁగా" అను నర్థము సమంజసము. తీర్థశ్రేణిని వ్యాపింపఁ జేయుబయను నర్థము పొసఁగదు.

"బ్రహ్మాంకురంబులు పాదుకొనఁగ" పరిణామాలంకారము.

143. 2 – 155.

విర్ముక్తక్లేశకున్ = "క్లేశములను నశింపఁజేయునట్టిదానికి" – బులుసు.

నిర్మోచనము చేయఁబడిన క్లేశము గలదానికి – భక్తులను భవబంధ క్లేశము నుండి విడిపించుదానికి.

సత్యామనస్సక్తున్ = "సత్యభామకు ప్రియుఁడగు శ్రీకృష్ణుని" – బులుసు. ఇట సత్యభామ మనస్సునఁ దగిలియున్నవానిని" యని చెప్పనగును.

మఱియు నొక విశేషము: రుక్మిణిని చెప్పుట కృష్ణ వర్ణనమున సామాన్యము. ఇట సత్యనుఁ జెప్పుట యొక ప్రత్యేకతను సూచించుచుఁ బారకుని హెచ్చరించి యొక చమత్కృతి చేయుట జరిగినది. సత్య + అమనస్స క్తున్ = సత్యస్థితియైన మానసాతీత యోగస్థితియందుఁ దగిలియున్నవానిని అని గుప్తార్థము. "యోగశ్చిత్తవృత్తినిరోధః" – "యతోవాచోనివర్తంతే, అప్రాప్య మనసాసహ" అను శాస్త్ర వాక్యము లిందుఁ బ్రమాణములు.

తాత్పర్యము : భక్తు(డెవ(డేని ముక్తకేశీ తీర్థజలములను గ్రోలి, భవ బంధమోచనములను జేయు ముక్తకేశికి(గరములు జోడించి, సత్యమైన సమాధి స్థితియందు సత్యభామ మనస్సున(దగిలియున్న స్వామిని జూచినచో వానిదే జన్మము. అత(డు నశరీరముక్తి నందును. రా(బోవు జన్మములు వానికి(బూర్ణములు.

పయః పానంబు = నీరుద్రాగుట, పాలుద్రాగుట. శ్లేషవలన ముక్తకేశికి జగన్మాతృత్వము స్థాపితము. తత్పయః పానమువలన సమాధి సిద్ధించునని విశేషము.

“భావికాల జననంబుల్ వానికిం బూజ్యముల్” ఇట(బూజ్యము లన(గా శూన్యములని సామాన్యార్థము. “మైవాల్చియున్ ముక్తుండాత(డు” అనుటవలన నతనికి(గలుగ(బోవు జన్మలు పూజింప(దగిన యవతార విభూతులని యర్థము.

144. 2–156, 157.

సంగమాహ్వయ మహాసురు నాసురవృత్తి(ద్రోచి = “సంగము(డను పేరి గొప్ప రాక్షసుని క్రూరముగా పడ(ద్రోసి” బులుసు.

ఇట రక్కసుని జంపుటలో స్వామి యాసురవృత్తి చూపినా(డను సమన్వయ మువితముకాదు. “సంగమాహ్వయ మహాసురునియొక్క యాసురవృత్తిని ద్రోచి” యని సమన్వయించవలెను. కనుకనే స్వామి యడుగు లూ(దినచోట సన్నిధి పెన్నిధి యగుట సంభవము. మఱియు ననురత్వము విడిచిన యసుర జీవము పొందిన యనాసురత్వము వలననే తీర్థము వాని పేరిట నొప్పును. లేనిచో అసురత్వమున్నచోట(దీర్థ మొప్పుట సాధ్యము కాదు. దీని తరువాత పద్యములోని “అవిర్భూతాఖిలాద్భుతార్థత” ఈ యర్థమును హెచ్చరిక చేయు చున్నది. “అవిర్భూతాఖిలాద్భుతార్థత = 1. పుట్టిన సమస్తమైన యాశ్చర్యకర ప్రయోజనములను గలిగి యుండుటచేత, 2. పుట్టిన సమస్తమైన యాశ్చర్య కర – చమత్కార – అర్థములను – శబ్దారాన్వయములను – గలిగియుండుటచేత.

145. 2–158. 21. సోమతీర్థము, 22. దేవతీర్థము, 23. సూర్య తీర్థము, 24. సరస్వతీ తీర్థము.

అద్యము = “మొదటిది – తరువాతిది” – బులుసు.

అద్యమన(గా మొదటిదే – తరువాతిది కాదు. ఇట సంఖ్యావిషయము గాక ప్రాధాన్య వివక్ష గ్రాహ్యము. సంగమతీర్థముకన్న ముందు(జెప్పవలసినది యని యర్థము. మిగిలిన పాదములలో(గూడ(“బూర్వమైయుండు – అట మున్న – ప్రాక్తనము” లను పదము లీ యర్థమునే స్థాపించుచున్నవి.

ఇందు సోమలోకము, దేవలోకము వరుసగా సామ్రాజ్యము, భూరిభోగము కలుగ(జేయునవి. సౌరసిద్ధి సాయుజ్యము నొస(గును. వాఙ్మయలోకము పూజ్యత నొస(గును.

146. 2 – 159.

పై పద్యములోని సరస్వతీతీర్థ వైభవ మిట వర్ణింపఁబడినది.

గుప్తార్థము : సరస్వతి యిచ్చట సకల ప్రాణి ధీమూర్తియై అంతర్లీనమైన నాదముగా నుండును. ఆమె పర్వేందుస్ఫూర్తి వక్త్రయైనప్పుడు పూర్వద్వాఃస్థయగును. అనఁగా ధీగమ్యమై యంతర్లీనమైన నాదము నుపాసించినచో నది వక్త్రమునకు వచ్చునపుడెల్లఁ బదునారు కళలతో వెలువడును. అప్పుడు పున్నమనాటి చంద్రుఁడు తూర్పుదిక్కునఁ దోఁచినరీతిగా సోమతీర్థ మనఁబడు స్థితిని బొందును. అనఁగా షోడశీ యనఁబడు వాగ్దేవిగా విశుద్ధి చక్రమున నాదము వెలువడును. అప్పుడు ఆజ్ఞాచక్రమున మనస్సనఁబడు చంద్రబింబము పరిపూర్ణ దర్శనమిచ్చి యోగానుభూతి కలుగును.

— అట్టి పద పద్మములజంటతో నరసింహుఁ డచ్చట నుండునని తరువాత పద్యమునఁ జెప్పఁబడుటవలనఁ బదునారు కళల జంట – $16 \times 2 = 32$ – యగు అనుష్టుభమంత్రరాజమున కధిదేవతయై యందు నృసింహుఁడు వసియించునని చెప్పఁబడినది.

సోమతీర్థము – చంద్రనాడి, సూర్యతీర్థము – సూర్యనాడి, దేవతాతీర్థము – ఆజ్ఞా చక్రము, సరస్వతి తీర్థము - విశుద్ధి చక్రము – అను నాలుఁగును, సాధకుని యంతస్తీర్థములు. ఇవి చతుర్గుణితములై పదునారు కళల మొగముగా మనస్సను చంద్రుని యందు "సకలప్రాణిధీమూర్తి" ప్రతిబింబితమగును. దానికి రెట్టింపై నృసింహతేజము – అనాహత చక్రమున – నుండునని గుప్తార్థము.

147. 2 – 160.

"చలదగాకృతిన్" అనఁగా నశ్వత్థరూపమున నని యర్థము. నరసింహుని యశ్వత్థమూర్తిత్వ మితఃపూర్వము వివరింపబడినది.

147. 2 – 165.

"బిలేశయతలిమోపధాన లీలాలోలస్వాంతిశయుఁడు = పాముపానుపు దిండుగాఁ గల విష్ణుని విలాసములందు ఆసక్తమగు మనస్సు కలవాఁడు" – బులుసు. ఆసక్తమగు తన యాశయము గలవాఁ డనుట తగును.

గుప్తార్థము : ఇందు బిలేశయశబ్దముచేత మూలాధారమున శయనించిన కుండలిని సూచ్యము. తలిమ శబ్దముచేత వెన్నెముకయంతయు వ్యాపించుట వలనఁ బాన్పు అని యర్థము. ఉపధాన శబ్దమున సహస్రారమునందున్న కుండలిని సూచ్యము. ఆ కుండలినీ శక్తియొక్క ఈ రెండు స్థితుల యనుభూతియే లీల. దానియం దాలోలమైన స్వాశయము కలవాఁడు ఇచ్చట స్వయమనఁగా నహంకరణ మనఁబడు ప్రజ్ఞ. అది పరతత్వమునం దాలోలమగుట వలననే "పరమపదబద్ధాశుఁడు" అను విశేషము సార్థకము. భగవంతుని స్మరణము చేతనే యీ స్థితులుఁ గలవాఁడు గనుక రోమహర్షణాత్మజుఁడనుట యుచితము – రోమహర్షణమానందానుభూతికిఁ గల బాహ్యచిహ్నాలలో నాకటి.

148. 2-166.

అక్షవలయాకృతి = "జపమాలయొక్క ఆకారమును వహించునది - జప మాల మునులకు ముఖ్యము, అది శ్రవణాలంకారముకూడను. -." బులును.

అక్షవలయాకృతి యనఁగా అకారాది క్షకారాంతమైన శబ్దమయ ప్రపంచ మగు నభోవలయము - వేదమునకు నిత్యనివాసమగు పరాకాశగోళము. దీనినే కారణాకాశము, చిద్గగనము నందురు. దీనినే తాంత్రికులు, ఆగమికులు, వాణీ చతుర్ముఖనివాస భూమియగు సత్యలోక మందురు. కనుకనే "మచ్ఛ్రవోవిధేయ మగుచునుక్కి" యను హేతువు సమర్థమగుచున్నది. అలంకార ముపమ.

149. 2-170. — శివనారద సంవాదము

"మును వేదవ్యాసు వచనమున వినియునికిన్"

ఇది పురాణేతిహాసాదులయం దని యర్థము. దీనివలన నీ కావ్యమందలి కృష్ణకథ పురాణానుసారియేగాని పురాణములలోనుండి సంగ్రహింపఁబడినది కాదని సూచన.

150. 2-171.

"అబ్ధిజలసూనుఘనంబుల లీల నేఁగఁగన్"

ఇచ్చట శంకరుఁ డబ్ధితోను, ఋషిదేవతాదులు, కుమారుఁడు ఘనము లతో నుపమాన మందు టెంతయు నుచితము. ఇంత విష్ణు మహిమాను వర్ణనము చేసినను శంకరుని విష్ణుజత యించుకంతయుఁ దరుగలేదనియు నెంత చెప్పుటకైన దక్షుఁడేననియు సూచితము. ఋష్యాదు లా మహిమను లోక మందు వర్ణింపఁజేసి శ్రోతలకు మోక్షము సుభిక్షముగాఁ జేయుదు రనియును సూచితము. వారందఱిని మేఘములతోఁ బోల్చుటవలనఁ గుమారుని "సమ యూరరాజవాహనముగ" ననుట యుచితము. ఘనములు సజలములైనప్పుడు మయూరము శోభిల్లును.

151. 2-173.

జటిల = దట్టమైన, తటపుట .. సౌరభము = "ఒడ్డులయందు - ప్రక్కల యందు - ఉన్న మారేడుచెట్లగుంపుయొక్క తీగలనున్న పూవులనుండి రాలుచు, ధారారూపమగు తేనె తుంపుల పరిమళము" - బులును. మారే డుచెట్లకు తీగలుండవు. తేనెవుప్పొడి రాలు పూవులుండవు.

పుట = దొన్నె - వంటి -, The Pod or Capsule which envelopes young shoots. A sheath, cover, Covering - Apte.

తట = ప్రాంతము, a field, Apte.

తటపుట = ప్రాంత ప్రదేశముననున్న, గుబురులైన, బిల్వభూరుహా = మారేడుచెట్లయందు, వితానలతా = పందిరులుగా నల్లుకొనిన తీవలయొక్క,

నవపుష్పనిష్పతత్ = క్రొత్త పువ్వులనుండి రాలుచున్న. జటిల = చిక్కని. మధూళిధూళిభవ = తేనెతోను బుప్పొడితోను బుట్టిన. సౌరభము = పరిమళము.

యక్ష కర్దమము :– "కర్పూరాగురుకస్తూరీ కక్కోలైత్యక కర్దమః" –అమరకోశము.

"కుంకుమాగురు కస్తూరీ కర్పూరంచందనంతధీధా
వహాసుగంధ సంయుక్తం నామతోయక్ష కర్దమః"

152. 2–174.

అభిక=కాముక [1] –సోనధికారమభికః కులోచితంకాశ్చన స్వయమవర్త యత్సమా – రఘువం. 19–4.

అభికసంకేతములకు=కామకేళీ సంకేత స్థానములకు.

తాత్పర్యము : నాగకాంతలు ప్రియులను గూడుట కుచితములైన సంకేతముల నేర్పఱచుకొని తగిన యలంకరణాదులఁ జేసికొనియుఁ, దమ శిరస్సులందున్న మణుల కిరణముల వలన విఘ్నములు కలుగుటచే రాత్రులం దితరులకుఁ గనఁబడకుండ వంకరటింకర త్రోవలఁ దిరిగి తిరిగి యనుకూలపడక తిరుగుమొగ మగుచున్నారు. అట్టి వికుఁలదారు లివి.

వారు ఉరగసతులు గనుక వాని గమనములు వికుఁల తెరువు లనుటుచితము. జాతి యురగములు సుగంధము పీనుచుండుటవలన నేపథ్యయుత లనుట యుచితము. మఱియు "బుష్పనిష్పతజటిలమధూళీ ధూళియుతసౌరభ" మార్గములను జిలువచెలువలు తిరిగిన మార్గములని నారదుఁడు తలఁచుటయును దగియున్నది.

153. 2–175.

గ్రుచ్చుటవోలెన్="గ్రుచ్చుకొన్నట్లుగా" —బులుసు. ఇట దండ గ్రుచ్చునట్లుగా – కూర్చునట్లుగా నని చెప్పవలెను. అందువలననే పచ్చిముత్యాలు నఖాగ్రధారల కాభరణాచరణ మొనర్చుట.

తాత్పర్యము : దుర్గవాహనమగు సింహముతోఁ బంతము వేయఁగల మిక్కిలి భయంకరములగు సింహము లా కొండగుహలే తమ నెలవులు కాఁగా నిద్దురలు వోవుచుండును. అవి పొగరు టేనుగుఁగుల కుంభస్థలములను బ్రద్దలు కొట్టఁగా నందలి పచ్చిముత్యము లా సింహముల గోళ్లకు వరుసగాఁ గ్రుచ్చుకొనును. అవి ఈ గోళ్లయందు గ్రుచ్చబడినట్లుగా నిలఁబడి యాభరణత్వము వహించును. ఇచ్చట నాభరణాచరణంబునందు ఆ సింహముల బలపరాక్రమములకుఁ జిహ్నములైన యాభరణములుగా ముత్యాలున్నవని సూచన. నిద్దురలు అను బహువచన ప్రయోగమువలన నిశ్శంకము నిర్భీకమునగు ప్రవృత్తి సూచితము.

---

[1] అభిక=Lustful, libidinous, Voluptous – Apte

154 2-176.

మోదకప్రియ ప్రబలదంతవ్రాతనిర్భిన్న ధాతుఖనులు— "వినాయకుని బలిష్ఠములగు దంతములను నీటెలచే పొడువఁబడిన జేగురు మొదలగువాని గనులు" -బులుసు. ఇందీటెల నుపమానమున్మూలమున లేదు. నిర్భిన్నయనఁగాఁ బొడుఁవబడిన యనుటకన్న బ్రద్దలు గొట్టఁబడిన యనుట తగును.

155. 2-177.

తాత్పర్యము: శివుఁడను మూపురము గల వెండికొండ యను వృషభము నకు గంగానది గంగడోలువలెఁ బ్రకాశించుచున్నది.

సురసరిత్ = గంగయొక్క. బహుళ = మిక్కిలియైన. లహరి = ప్రవాహములయొక్క. గహన = దుస్తరత్వముచేత. కుసుమాయమాన = పువ్వులుగాఁ జేయఁబడిన. శీకర-తుప్పరులయొక్క. నిపాత = పడుటచే. శీతల = చల్లనైన. క్ష్మాతల = భూభాగమునందు. ఉత్థ = మొలచిన. ద్రుపోతకములు = మ్రాకుల మొక్కలు.

156. 2-178.

తాత్పర్యము: ఈ పర్వతమందు బోయపడుచుల కేశ బంధముల దట్టములగు నలుపులు, మదపుటేనుఁగుల కటములందలి యుత్కటములైన మద ధారలవలెను, నదీతీరమున మెలఁగు తరంగపు టంచుల వెలువడు నాచు మొలకలవలెను, తాపస బాలికల చెవుల కలంకరింపబడిన యవధాన్యపు మొలకల యాకారముగల నగలవలెను, నందములై పగటినే పీకటిగాఁ జేయుచుండును.

157. 2-180.

"స్వకృతస్కాందోక్తియం దావహిల్లిన సందేహముఁదంద్రిచేఁ దెలియ హాళిన్ వీరిఁదోకొంచుఁ గ్రౌంచనగోద్భేదియు వచ్చెన్" —ఈ గ్రంథమందలి కథ స్కంద పురాణములోనిది కా దనుటకిదిఁ యొక యాధారము. "స్వకృత" యనుటచేఁ గుమారస్వామిచే రచింపఁబడిన యొక స్కాందపురాణము కథాగతమగు కవి కల్పన మగుచున్నది.

158. 2-181.

అపార ప్రజ్ఞాకరుఁడు = "అంతులేని ప్రతిభకు నిధి" -బులుసు. పారములేని ప్రజ్ఞయే కిరణముగాఁ గలవాఁడు. పారములేని ప్రజ్ఞాకరమైనవాఁడు.

159. 2-183.

"తమంబును రజంబున్సత్త్వమున్నాగ" —ఇది సరియైన త్రిగుణోత్పత్తి క్రమము.

దనుజద్వేషణులు = "రాక్షసులను ద్వేషించు దేవతలు" —బులుసు. రాక్షసుల ద్వేషము గలవారనుట యుక్తము. లేనిచో సత్త్వగుణ మెట్లు వారి యందుఁ బొసఁగును?

163. 2 - 191.

తాత్పర్యము : మన్మథుఁడు విడువని వైరమువలన సమయము చూచి శివుని శిరస్సునఁ దన చురకత్తిని గ్రుద్ది పొడిచెను. ఆ కత్తియంతయు శివుని శిరస్సున దిగఁబడిపోయి దాని పిడిగా నమర్చిన యడవిపంది కోరమాత్రము బయటకుఁ గనుపించుచున్నదా యనునట్లు శివుని జటాజూటమునఁ జంద్రరేఖ చిన్ని వెన్నెలలను వెదఁజల్లుచున్నది.

వైరవృత్తి : ఇది కామదహనమునాటిది. సాధకుఁడగు యోగికి జ్ఞాననేత్రమువలనఁ గామము దగ్ధమయిన వెనుక మరల విశ్వప్రేమయను నిర్బీజ శృంగారరూపమున మన్మథ కళ ప్రకాశించుననియు దానితోఁడిచూపు చిన్ని వెన్నెల వెలయించు ననియును సూచితము.

సూకరదంష్ట్ర : అడవిపంది కోఱను గత్తికి పిడిగాఁ జేయించుట రాజుల యాచారము.

164. 2 - 192.

టీక : కుంకుమ పంకశోణ = కుంకుమ కర్దమముచే నెఱ్ఱనైనది. కొండలమండల నాథుపట్టి = పర్వతరాజగు హిమవంతుని కుమారి., అడరన్ = పూనఁగా, విజృంభింపఁగా, తటవిద్రుమద్రుమక్రేంకృతికారిసారసపరీత సుధానిధిరీతిన్ = "ఒడ్డుననున్న పగడపు చెట్లపై క్రేంకారములు చేయుచున్న చాతక పక్షులు గల పాలసముద్రమువలె" - బు౨.సు. ఒడ్డుననున్న చిగురు కొమ్మలచెట్లయందుఁ గ్రేంకారము చేయుచున్న హంసలచేఁ జుట్టఁబడిన గంగానదివలె ననుట సమంజసము.

తాత్పర్యము : కుంకుమ కర్దమముచే నెఱ్ఱనైన పార్వతి - గౌరి ఎడమ తొడపై నుండఁగా, ఘణఘణమని శబ్దము చేయుచున్న బహు కపాల మాలిక లోంకారములు పలుకుచున్నట్లుండఁగా, నొడ్డునఁ జిగురుకొమ్మలు గల చెట్లయందు హంసలు క్రేంకారములు చేయుచున్నప్పటి గంగానదివలె శంకరుఁ డొప్పెను.

విశేషము : గంగ తెల్లఁగా నుండుటచే శివుని మేనితోఁ బోల్పఁబడినది. కుంకుమ కర్దమయుతమైన పార్వతి కైసేత చిగురుఁగొమ్మలతోఁ బోల్పఁబడినది. పార్వతి యొక ద్రుమముతోఁ బోల్పఁబడినది. వాని ఘణఘణారవ మాహంసల క్రేంకారముతోఁ బోల్పఁబడినది. మఱియు నోంకారము హంసస్వరూపము - పరమాత్మస్వరూపము - కనుక హంస క్రేంకారముతోఁ బోల్పఁబడినది. అలంకారము శ్లిష్టోపమ.

వామాంకము : ఎడమప్రక్క గుర్తు, సగము శరీరము పార్వతియని స్ఫురణ.

165. 2 - 193.

మోము తడియొత్తినన్ = మొగమునఁ దడిఁ దుడువఁగా.

కులకంబు = సమ్మిశ్రము

తాత్పర్యము : పార్వతి పసుపు రాచుకొని స్నానముచేసి మొగముతడిఁ దుడువఁగా నా పసుపు గురుతులతోను, కనుదామరల కాటుకముద్దల గురుతుల తోను గూడిన యందము గల వస్త్రమును విలాసార్థము ధరించెనా యనునట్లు శంకరుఁడు నల్లని, పచ్చని చారలు గల పులిచర్మమును ధరించెను. ఉత్ప్రేక్షా లంకారము. ఇందుఁ బార్వతిపై శంకరునకుఁ గల యాదరము, ప్రణయము, విలాసబుద్ధి వ్యంగ్యములు. ఉత్ప్రేక్షాలంకారముచే నవి యన్నియుఁ బరమేశ్వరుని యం దలంకారప్రాయములుగా నారోపితములైనవే కాని ప్రకృతులు కావని ధ్వని.

166. 2 – 194.

తాత్పర్యము : ఇంద్రుఁడు మున్నగు దేవతలు శంకరునకు సాష్టాంగ ప్రణామ మాచరించుటయందు మిక్కిలి కుతూహలముగలవారై గుంపులుగా వచ్చుచుండిరి. నంది బంగరుదండముయొక్క దెబ్బవలన నొరిగిన కిరీటములు గలవారై కూడ లెక్కచేయక మొండితనము చేసి లోపలికి వచ్చుచున్నారు. వారియెడలఁ బరిపక్వమైన దయతోఁ గూడిన నిండుచూపులను బ్రసరింపఁజేసి మహాదేవుఁడు వారలను గౌరవించుచుండెను – పైపద్యమునకు వాక్యాన్వయము.

వివరణము : అవసరము కాకపోవుటవలన నంది దండమున నడ్డుకొను చున్నాఁడు. అయినను నెట్టుకొని వచ్చుచున్న కారణ మా దేవతల మనస్సున గల దండనమస్క్రియాభిరతియే, అట్లు నంది కవిధేయత చూపెనని వారి చండితన మును జూడక వారి హృదయమందలి యభిరతినే స్వీకరించుటవలనఁ బరమేశ్వ రునిలోని పరమేశ్వరత్వ ముచితముగా నిరూపింపఁబడినది.

167. 2 – 195.

చరణపీఠోపకంఠనిషణ్ణ = "పాదముల సమీపమునఁ గూర్చున్న"
– బులుసు.

పాదముల నుంచు పీటదగ్గఱ కూరుచున్న – యనవలెను.

తాత్పర్యము : శివుని పాదపీఠమునకు దాపున వృషభరాజమగు వాహన మున్నది. దాని మూపురముపై చరణములు నిలిపి సకల దేవతామందిరేశ్వరుఁ డగు పరమేశ్వరుఁడు కొలువున్నాఁడు. అట్టి శివుని సమీపించి యోగీశ్వరుఁడైన నారదుఁడు మ్రొక్కె – మీది పద్యమున కన్వయము.

168. 2 – 196. నారదుఁడు చేసిన శివస్తుతి.

తాత్పర్యము : ప్రకాశించు క్రీఁగెదవికాంతి – తనక్రీఁగెదవికాంతి – చిగురు టాకుగను, దంతకాంతి పుష్పముగను వాక్కులతో నారదుఁ డెంతకును దనివి తీరని వేడుకతో శివు నర్చించెను. అలంకారము రూపకము.

విశేషము : చిగుళ్లతోఁగూడిన పువ్వుల నర్పించి వాక్కులతో నుతించుట పూజాలక్షణము. మఱియుఁ జిగుళ్లలోఁ బువ్వుల నర్పించి నమస్కరించుట

పెద్దల దర్శనము చేయునప్పుడు లక్షణము. మౌనికులవతంసుఁడు అను విశేషణమువలన వాఙ్నియమము. పరిమితవాక్కు. మౌనముద్రగల నారదుఁడే తనివిసనక వేడుకతో నుతించె ననుట. నారదుని భక్త్యావేశమున కిది వ్యంజకము.

169. 2-197.

కాళరాత్రీశుఁడు = 1. కాళరాత్రి యవతారమగు దుర్గకు భర్త. 2. ప్రళయకాలమున కధిపతి - ప్రళయకాలము జీవులకు రాత్రివంటిది.

కడిఁదితమము = 1. మిక్కుటమైన తమోగుణము. 2. దట్టమైన చీకటి.

పుండరీకాభుఁడు = 1. పద్మమువంటి కాంతి గలవాఁడు. 2. పద్మమునకుఁ గాంతియైనవాఁడు. సూర్యాంతర్వర్తి — సూర్యకిరణమయమగు తేజము గలవాఁడు.

భూరిరజము = 1. మిక్కుటమైన రజోగుణము. 2. ఎక్కువైన పుప్పొడి - బ్రహ్మాండమను పద్మము విచ్చుకొనఁగా నందలి పుప్పొడివలె సవితృ ఋక్కులు బ్రహ్మవలన సృష్టి కున్ముఖములై వ్యాపించును.

సత్కృపాంభోధి = 1. మంచిదయకు సముద్రము వంటివాఁడు. 2. ఆకాశమను దయానముద్రము - ఇది స్థితి కవకాశమిచ్చు నీలదేహుఁడగు విష్ణుని లక్షణము లేక నారాశబ్ద వాచ్యములగు జలములకు నిలయము.

సత్త్వభృతియు = 1. సత్వగుణమును ధరించుట. 2. జలజంతువులను భరించుట.

మూర్తిత్రయ + ఏకనిలయ = మూఁడుమూర్తులకు నొకే స్థానమైన వాఁడా!

తాత్పర్యము : కాళరాత్రికి భర్తయైన మహాకాళుఁడగు నీవు బ్రహ్మవిష్ణు శివాత్మకుఁడవు. కనుక సత్వరజస్తమస్సులు నిన్ననుసరించి - నీ వశమున - వర్తించును. రాత్రికిఁ దమమెట్లు సహజమో యట్లు నీ సంహారమూర్తికిఁ దమోగుణము సహజము. పద్మమునకుఁ బుప్పొడివలె నీ సృష్టిమూర్తికి రజోగుణము సహజము. సముద్రమునకు జలజంతువులవలె నీ స్థితిమూర్తికి సత్వగుణమను గుణము - సముద్రమునఁ జలచరములున్నట్లు. నీ స్థితిమూర్తి యగు విష్ణుమూర్తి గర్భమున లోకములు వర్తించును. నీవు మూఁడుమూర్తులకు నేకనిలయమగు మూర్తివి.

విశేషము : ఈ పద్యమున శివవర్ణనము గాక త్రిమూర్త్యతీతమగు మహాదేవమూర్తి కీర్తింపఁబడినది. 2. ఈ పద్యమున నుపాసకుల కత్యంతపర

వస్తువగు "నక్షర" శబ్దవాచ్యము, త్రివృతమైనది సూచింపఁబడినది. అది ఓంకార పదవాచ్యమై "అ – ఉ – మ" గా వ్యాకృతమై సితారుణశ్యామమై యొప్పును. దాని ధ్యానయంత్ర మిట్లుండును. దీనిని భాగవతమున వ్యాసుఁడు "త్రివృద్బ్రహ్మాక్షరంపరమ్" అని ప్రతిపాదించినాఁడు.

170. 2 – 198.

తాత్పర్యము : వేదమును గూర్చిన వివాదములు జరుగు పెద్దల గోష్ఠిలోఁ బాల్గొనుచు వారి బుద్ధిగమ్యములైన మార్గములను గౌరవింపవచ్చును. లక్ష్మీకటాక్షము గలిగి చిరకాల మనుభవములు పొందవచ్చును. యజ్ఞముల ఫలములు చేకూర్చు సుఖభోగములు పొందవచ్చును. ఇవి యన్నియు నెవ్వరైనఁ జేయవచ్చును గాని నీవలె విషాగ్నుల నడుపులోఁ బెట్టుట యింకెవ్వరి కెప్పుడు సాధ్యపడును ?

విశేషము : ఇందు మొదటి మూఁడును గర్తకు సుఖము కలిగించును గనుక సాధ్యములు. కాలకూటమును భక్షించుట యితరులకు సుఖమును గలిగించుటకై తాను పడవలసిన బాధ. అది నీకొక్కనికే సాధ్యమని భావము.

ఇందు మొదటి మూఁ డంశములును వరుసగా బ్రహ్మ, విష్ణు, ఇంద్రుల ప్రవృత్తిని సూచించును. నాల్గవది శివుఁడు చేసిన హాలాహల భక్షణమును గూర్చి చెప్పఁబడినది.

మొదటి మూఁడును వరుసగా జ్ఞానము, సంపద, సుఖభోగములను సూచించును. నాల్గవది పరోపకార లక్షణము. మొదటి మూఁడింటికన్న నీ నాల్గవది దైవలక్షణమనియు, సాధకునకుఁ గూడ జ్ఞానముకన్నను, సంపద కన్నను, యజ్ఞయాగాదులకన్నను బరోపకారమే ముఖ్యమనియుఁ బ్రతిపాదింపఁ బడినది.

171. 2 – 200.

తాత్పర్యము : నారదుఁడు త్రినేత్రుని సమీపమునఁ గూర్చుండఁగా హిమవంతుని యెదుట నున్న యొక చిన్న కొండవలె నుండెను. అలంకార ముపమ. వా రిరువురును గొండంతవారు – ఘనులు – అయినను, అందుఁ దారతమ్య మున్నది యని యిందలి వ్యంగ్యము.

172. 2 – 201.

తదాననదత్త నిరీక్షణాబ్జుఁడై = అతని ముఖమునకు సమర్పించిన చూపులను పద్మములు కలవాఁడై – పూజాభావమునఁ జూచువాఁడై. మీ యనుజీవిన్ = మి మ్మనుసరించి జీవించువాఁడను.

173. 2 - 206.

విశేషము : 'మనంబునఁ గృష్ణు నిలిపి' యనుటలో 'శివస్య హృదయం విష్ణుః' అను లోకోక్తియుతమైన తత్త్వరహస్యము పాటింపఁబడినది.

174. 2 - 207.

తాత్పర్యము : 'నారదా! వ నీ్న ఋషులు వేడిన యర్థము మిక్కిలి దురవగాహము. పాపహారము. అంతము లేని పుణ్యఫలములకు మూలము. నశింపనిది, విశ్వమునందుఁ గొనియాడఁబడునది. విష్ణుమూర్తి ప్రసాదమునఁ గలిగిన ప్రతిభకు నిధినైన నేను దక్క తక్కినవారలు దాని నెఱుఁగరు."

175. 2 - 208.

తాత్పర్యము : ఇది మందర పర్వత వర్ణనము. అమృత మథనమునఁ గవ్వపుఁద్రాడైన సర్పముయొక్క మేనిహారలవంటి గాలికిఁ గదలుచున్నట్లు హంసలు భ్రమించుచున్నవి. దేవతలు బంతులు దీర్చి యాసక్తితో నమృతము గ్రోలు రీతిని దేఁటులు పూఁదేనె లానుచున్నవి. హాలాహలమును భుజించు శివునిమూర్తులనఁ జిలుకలు నేరేడుపండ్లను దినుచున్నవి. ఆ కొండ నాశ్రయించిన మేఘము లితర మేఘములను బిలుచునట్లు మయూరములు కేక లిడుచున్నవి. ఈ విధముగా సముద్ర మథనమున నొక్కమాఱుగా నవతరిల్లిన సంపదవలె నా మందరముపైఁ గ్రొంగ్రొత్త ఋతుశోభలతో మదికి నుల్లాసము గలుగుచుండఁగా నొకనాఁడు నేనును బార్వతియుఁగూడి – మీది పద్యమున కన్వయము.

176. 2 - 209.

ఒప్పైన విధమునఁ జంద్రకాంతవేదిపైఁ గోరికలు మొలకలెత్తఁగా విహరించు నప్పుడు శివుఁడు పార్వతితో నిట్లనెను : 'నా మనస్సు గట్టుల నొరయునట్టి విలాసమున నీదగు విహారము మిక్కిలి యొప్పినది. నీ వేదేని వరము గోరు మిచ్చెదను' అన విని యామె యిట్లనెను :

177. 2 - 219.

తాత్పర్యము : 'తన మదిని జయించిన యువిదకుఁ దక్కిన నిక్కపు మోహివలె నెవఁడు మిక్కిలి కుతూహలముతోఁ, గృష్ణుని దివ్యకథానుభూతిపై మనస్సు నిలుపునో యతఁడు నాకు మిక్కిలి ప్రియుఁడు. కనుక నేను గని విని యున్న రహస్యమును మీకు వినిపింతును.

178. 2 - 222.

తాత్పర్యము : భూమికిఁ బంద్రెం డడుగుల యెత్తున ఆ క్షేత్రరాజము విరాజిల్లును. దాని నడుమను విమానమువలె ప్రకాశములతో మలచిన మూర్తితోఁ గూడి యది యొప్పారును.

విశేషము : ఇందుఁ బాండురంగ క్షేత్రమున కుపలక్షకమైన గుప్తాకార మనఁబడు క్షేత్రము వర్ణింపఁబడినది. సాధకుని శరీరము క్షేత్ర మనఁబడును. కూర్చుండగా నేలనుండి పంద్రెండడుగుల యెత్తున – వెన్నెముక వెంబడి – నా క్షేత్రము విరాజిల్లును. ఇది యనాహతచక్రము. దాని నడుమ – హృదయ కమలమున – వెలుగుఁలయందుఁ బ్రయాణము వేయు – వెలుఁగులదారులు గల – యొక వెలుఁగులమూర్తి వర్తించును. ఇది ధ్యానమున వికసించు మూర్తి.

179. 2 – 223.

తాత్పర్యము : స్వర్గమునందును భూమియందును పాతాళమునను దనకు సాటిలేనిదై యా క్షేత్రము జ్ఞానులకు క్షేమము కల్గింపనదై మహావైభవమున మెఱయును.

గుప్తార్థము : ఇందు మఱి యొక క్షేత్రము వర్ణింపఁబడినది. ఆ క్షేత్ర మునకు దేవలోకమునను, భూలోకమునను, పాతాళమునను సమానమై బుధ లోకమునకు క్షేమము గల్గించునదై యే క్షేత్రముగాని యొక క్షేత్ర ముండును. ఇందు హృదయకమలమునకుఁ బైని, గంఠమునకుఁ గ్రింద సమానవాయు స్థానమున నొక గుప్తక్షేత్రము సాధకుని శరీరమున గుర్తింపఁబడినది. బుధలోక మనఁగా బుధగ్రహలోకము. సాధకుని శరీరమున వాక్కున కుత్పత్తి స్థానము. బుధుఁడు వాక్కున కధిపతియని హోరాశాస్త్రాంశము.

180. 2 - 224.

తాత్పర్యము : ఈ విధమైన బహు మహిమల కొకే నివాసమగు నా మహాక్షేత్రమున శ్రీకృష్ణు నర్చించుటయందు విధేయమైన బుద్ధితో నేను వసించి యుందును.

విశేషము : వాగుత్పత్తిస్థానమగు నా గుప్తక్షేత్రమున నేనను ప్రజ్ఞగా శివుఁడు నివాసము చేయును. వసుదేవసుతు నర్చించు బుద్ధి యతని వలన గలు గును.

తృతీయాశ్వాసము

3 – 3. కళాకలాపముల్ డాసినరచ్చ = ఇచ్చట కలాప శబ్దమునకు బులుసువారు సమూహార్థము జెప్పినారు కాని ఈ శబ్దమునకున్న వివిధార్థ ములలో A. shrewed and intell gent man అని ఆప్టేనిఘంటువు. 'రచ్చ' యను శబ్దములోని శక్తివలన నీ యర్థ మన్వయ మగు ననిపించు చున్నది. కళలలో నారితేరిన బుద్ధిమంతులందఱు సభాపతికడ నిత్యము సభ చేయుదు రనియుఁ బ్రమాణత్వ మంగీకరింతురనియు భావము అన్వయమగును. అభి లంబు = అందఱును – బులుసు. ఇచ్చట ఫలముగాని విధమున నని చెప్పఁ దగును.

3 – 5. ఈ పద్యమున దివిదేవతలను బృథివికి, పృథివిదేవతలను దివికిఁ దెచ్చు విధమునఁ గొలుచుట యనఁగాఁ బెద్ద ప్రయత్నము చేయుట. వ్రతాదు లనుష్ఠించుట యని యర్థము. నిగమశర్మ జన్మమున కిందఱు వేల్పులు కొలువఁబడినారు గనుకనే 'మనసు తార్తీయపురుషార్థమునకు" "దైవ ఘటనావశంబున' లాగఁబడినను, నొకానొక సంస్కారవిశేష మిం దిమిడి యున్నది. ఇది నిగమశర్మ యవసాన సమయమునఁ 'జేరువ వేరువై కడు పచేళిమమై తను డాయవచ్చి"నది. అతని సర్వ కలుషములను హరించి మోక్ష ప్రదమైనదని సూచింపఁబడినది. కనుక నీ వర్ణనము కథాకథనమునకు మిక్కిలి యావశ్యకము. ఉత్తరకథలో నిది వ్యంగ్యముగా సూచింపఁబడినది. – చూ. ప. 101. ఇందు వర్ణింపబడిన విషయము కథాకథనముతో సంబంధించి యున్నది. 'పూర్వసంస్కార' మనఁగాఁ బూర్వజన్మ సంస్కారమని సామాన్యార్థము. జన్మకాలమున జననీ జనకు లొనర్చిన పుణ్యకర్మల వాసనయని విశేషార్థము. పుట్టపర్తి నారాయణాచార్యులు ఈ విషయము నుదహరించినారు. 98 – 99 పద్యములలోఁ గూడ నుపమాన వశమున నీ 'పూర్వసంస్కార' మే చేరువయగు లక్షణము వర్ణింపఁబడినది. 8వ పద్యమున 'దైవఘటనావశంబున' యనుటలోఁ గూడ నితని జీవితమంతయు నొక దైవఘటన కుదాహరణ కావలసి నడచినది యని వ్యంగ్యము.

3 – 6. వనితామానస సూనసాయకుఁ డను విశేషణము రాఁబోవు కాపుకోడలు, ప్లవకన్యలకు సంబంధించిన ఘట్టములకు సూచకము. జీవత్రా తపాదుఁడు. తలిదండ్రుల యదుపాజ్ఞలలో నున్న స్థితిని సూచించును. చంద్రుని పైన్నుద్ది యనుటవలనఁ బరదారగమనాది కళంకములు సూచ్య ములు.

3 – 7. నునుముత్యము = 'స్వచ్ఛమైన ముత్యము' బులుసు. తళ కైన ముత్యమని చెప్పవలెను. అలంకార ముపమ.

3 – 10. ఇందలి మొదటి పాదమునకు వివరణ మెవ్వరును జేయ లేదు. కలదు లేదను వాదమున కోర్చి = కొందఱున్నదని కొందఱు లేదని చేయు వాదములకుఁ గారణమై – స్పష్టాస్పష్టమై, జీర్ణప్రాయమై – మీను మీనమువంటి = చేప మీసమును బోలిన – గఱుకెక్కినది, పాతది, నూనె జిడ్డు మున్నగు నలి కలిగినదని యర్థము –. ఒంటిజందెము = మూడు ముళ్ళను. ధరించు శ్రద్ధలేదనియు 'జీవత్రాతపాదుండు' గనుక మొదట కొన్నాళ్లు తండ్రి పోరు పడలేక ధరించుచున్నాఁడు, క్రమముగాఁ "బుణ్య విహ్నంబు లపఘ నంబున ఘటింప సిగ్గుపడు" స్థితికి వచ్చుచున్న క్రమ మిది.

2వ పాదము. పాణింధమంబైన = దట్టమైన – బులుసు. 88వ పద్య మున వీణాపాణింధమ = వీణవాయించుదానిని' అనియు వ్రాసినారు. ఇది సమయానుకూల టీక. "కొలిమితిత్తియైనది – వ్యాపింపఁజేయునది, వీణా వాద్యము చేతఁ గలదానిని"

— తెన్మరము

"పాణింధమము = 1. కొలిమితిత్తి, 2. చీకటి, 3. వాద్యవిశేషము శ.ర. Blowing through the hands – Apte.

ఈ పదమును గౌణార్థమున శ్రీనాథుఁడు పలుతావులందు వాడినాడు. ఇచ్చట, బహుసంకుమదపంక పాణింధమంబైన – శ.ర. 2. ననుసరించినచో ఎక్కువ జవ్వాది బురదచే నలుపందిన" యనవలెను. లేదా చేతితోఁ బ్రక్కగోవి చెంగును విసరుకొనుచు నడచుచుండుటచే వాసనలు వసరుకొనుచున్న వనవలెను. లేదా గౌణార్థమున జవ్వాదివాసన లూదుచున్న, వెదజిమ్ముచున్న పంచె చెంగని చెప్పవలెను.

3వ పాదము : కడలేని పీడ్యంపు = ఇచ్చట కడలేని యనఁగా హద్దులేని యని – బులుసు. అంతులేని, ఎడతెఱిపిలేని యనవలెను. మోవిపల్లొత్తుల ముసుగుదన్న "పెదవి – దంతక్షతముల చేత ఆవరింపఁబడగా" బులుసు. కాని యిచ్చట విరామము లేని తాంబూలపు టెఱ్ఱిరంగు అతని పెదవులపై నిరంతరక్షతములపైని ముసుగుతన్ని యున్నది – కనఁబడక కప్పుచున్నది – యనవలెను.

4 వ పాదము : "సానతాకులు = వివరణము చేయఁబడలేదు. శంఖము నకుఁ బులునడిగి మెఱుఁగుపెట్టుటకు సానబట్టుదురు. ఆ సానరాయి తాకులు మన్మథుని శంఖముపై గుర్తులుగాఁ బడిగ యట్లు నఖక్షతములతోఁ గూడిన కంఠమున్నదని భావము. కంఠమును శంఖముతోఁ బోల్చుట కవిసమయము. "సూనాస్త్రశంఖంబు" అనుటచే నిగమశర్మ "తార్తీయ పురుషార్థమునకు" శంఖారావము చేసినాఁడని యౌచితి.

పరిహాసకులు – వీరు వేశ్యాబాంధవులేమో పరిశీలింపఁదగును. ఈ పదము కొంత విలక్షణత గలిగి ప్రయోగింపఁబడినట్లు తోఁచును. "యువతి భుక్తనిర్ముక్తపరిధానయుక్తుఁడు = యువతులను అనుభవించుటచే మలినమైన కట్టు వస్త్రము కలవాఁడగుచు" – బులుసు. "యౌవనస్త్రీలు అనుభవించివిడిచిన కట్టు వస్త్రముతోఁ గూడినవాఁడు" – తెస్మరము. రెండవదియే సరియనిపించును. దానివలన నతని మలినవర్తనము, కామాంధత, నిర్లక్ష్యము సూచింపఁబడును. నగరఘంటాపథ శబ్దములు దీనినే సూచించును. అతఁడు నగరఘంటాపథంబు ననగుచుఁదిరుగుట 'సంతతంబాటునుమానుట' ను నిర్లక్ష్యమును దెలియఁజేయును. 'నగుచు' పదమువలన ఎవ్వరేమనుకొన్ననేమి ? నన్నేమి చేయఁగలరు ? అను వ్రేలఁ జూవఁ గసుగందని వృత్తి వ్యంజకము. 1,4 పాదములం దుపమాలంకారము లున్నవి.

3 – 11. రిక్తకుంభములు = వట్టికుండలు. "చవితిచందురుఁడు = చూడఁదగనిది. ప్రతిపదిందుఁడు = పరిశీలించి చూడఁదగినది" – బులుసు.

చవితిచందురుఁడు = చతుర్థితిథినాటి చంద్రుఁడు. చూచినచో నిందలు వచ్చునని విశ్వాసము. ప్రతిపదిందుఁడు = పాడ్యమినాటి చంద్రుఁడు. శుక్ల పాడ్యమినాటి చంద్రుఁడు – నెలపొడుపు చంద్రుఁడు. దుర్లభదర్శనము.

భార్యమొగము చూచుట పాపమని నిగమశర్మ తలఁచును. వేశ్యమొగమును నెలపొడుపువలెఁ జూడ నభిలషించును. అనఁగా సూలువోఁగుగాఁ దలఁచి తన కడనున్న ద్రవ్యము సమర్పించునని సూచన. ప్రతిపదిందుఁడు = ప్రతిపత్ = ఇందుఁడు. ప్రథమకళగల చంద్రుఁడు; దర్శనీయుఁడు. "ప్రతిపచ్చంద్రనిభోఽయమాత్మజః – రఘువంశము. 8 - 65 ప్రతిపత్ = Beginning, commencement – Apte.

3 – 12. ఉష్ణని = ధ్వన్యనుకరణము. వెచ్చనూర్పు = వెచ్చని నిట్టూర్పులు విడచును – ఇవి తాపమును దెలుపును –, కంబుభృత్ = పాదోదకంబు = శంఖమునఁబోయఁబడిన విష్ణుపాదతీర్థమును" —బులుసు.

ఇట 'కంబుభృత్' పదమునకు 'శంఖమునఁ బోయఁబడిన' యను నర్థము వ్యాకరణ విరుద్ధము. మఱియు 'విష్ణుపాదతీర్థమును' అనుటలో విష్ణు శబ్దార్థకము మృగ్యమగును.

కంబుభృత్ = శంఖధారియైన విష్ణువుయొక్క, పాదోదకంబు = శ్రీపాద తీర్థమును – అని చెప్పనొప్పును. యౌవతాధరశీధువు = "యువతీసమూహము యొక్క మోవితేనెను" – బులుసు. ఇది పొసఁగదు. 'యువతి యధరమునుండి గ్రోలిన మద్యమును – యువతుల యధరస్పర్శ గల మద్యమును" అని చెప్ప నొప్పును.

శీధు = 1. Any spirituous liquor, rum, 2. wine – Apte. దీనిని గూర్చియే 'అదవ(తావ్వఁడు' అనియు – 3 - 19 – 'లలనాజనోష్ఠ లాలాజలావిలముగఁ గ్రోలె మద్యము పేరికులమునెల్ల" – అనియు – 3 – 105 – నుత్తర కథలో వర్ణింపఁబడినది.

అపఘనంబునన్ = దేహమునందు – తెన్మరము. 'అవయవములందు, ముఖము, భుజములు మున్నగు తావులందు' అనియుఁ జెప్పవచ్చును. 'అపఘనోఽంగమ్. – పాణిని 3 – 3 – 81. 'అంగంశరీరావయవః – నచనపర్వం – కింతుపాణిః పాదశ్చేత్యాహుః "– సిద్ధాంతకౌముది. కాక "కరనఖశిఖరలిఖన జాతనూత్న క్షతాంబువుల్" అను పాఠము సమంజసముగా నున్నది. "చేతి గోటికొనలు గ్రుచ్చుటవలన గలిగిన క్రొత్తగాయములు" అని యర్థము.

అరజము = 'ఇంపు, – తెన్మరము. అరజముమీఱఁన్ = ఎక్కువ దుర్విలాసమున – బులుసు. "1. ఇంపు, 2. కలధ్వని, 3. మనోజ్ఞము – శ. ర. 1. కలధ్వని, అవ్యక్తమధురధ్వని, 2. లీల, విలాసము. 3. దుర్వి లాసము. ఇందు దుర్విలాస మను నర్థమే సమంజసము. దుర్విహారహారి = 'చెడ్డనడతలు గలవారిలో అందగించువాఁడు" – తెన్మరము. 'చెడ్డనడతకల ఆ పోకిరి" – బులుసు. "దుర్విహారమున నందఱను మించినవాఁడు" అనఁదగును. హారిన్ = Surpassing, excelling – Apte.

ఈ పద్యమునఁ బ్రతిపాదమునను బోలికవలన బ్రాహ్మణధర్మములు, నిగమశర్మ ధర్మ భ్రష్టతయు స్పష్టముగఁ జిత్రింపఁబడినవి.

3 – 13. వీటిప్రోగు = "దుర్వ్యయము మిక్కిలి చేయువాఁడు" – తెన్మరము "వొల్లలరాశి – మిక్కిలి దుర్వ్యసనము కలవాఁడు" – బులుసు. "మిక్కిలి దుర్వ్యయము చేయువాఁడు – సూ. రా. అం. ని.

"ఇంటి ధూళిప్రోగు, పెంటకుప్ప – వ్యర్థుఁడు అనుట యొప్పును. నిగమశర్మయను పేరి యర్థము అయథార్థమగుటకు ధూళి – పెంటకుప్పయను నర్థములు సార్థకములు. 3 – 14. "వంకపారకబాటు" అను పాఠము గ్రాహ్యమని తోచును. ఇచ్చట పారకయను పదము పొలు, అడ్డము అను నర్థమున వాడఁబడి యుండవచ్చును. గడుసుఁదేరిన వెనుక నిగమశర్మ వంకచెప్పుట – సాకు, కారణము చెప్పి వేశ్యాదుల కడకుఁబోవుట – యను పొలయడ్డము నుంచుట కూడ మానెనని యర్థము.

3 – 15. పాము కఱచినవాని మేని నెత్తురు విరిగిపోయినట్లు నిగమశర్మ తాకిన రొక్కమంతయు నక్కుఱలేని విధమున మాయమయ్యెనని యర్థము.

3 – 16. తండ్రికి నిడ్డ పత్రములు = ఇతరులు ఋణాదులను దీసికొని వ్రాసి యిచ్చిన పత్రములు.

గుత్తచేలు = 'ఒకరియొద్ద ధాన్యపు గుత్తకు తీసికొన్న చేలు' – తెన్మరము.

'గుత్తకు తీసికొనిన పంటచేలు' – బులుసు

"ఇంకొకటికి గుత్త కిచ్చినవి" యని యుండవలెనేమో. లేనిచో దొంగతనముగా నైన నమ్ముటకు సాధ్యము కాదు.

తాత్పర్యము : అనుదిన వ్యయములకుఁ దన శరీరముపైనున్న యంగుళీయకాదులను నిగమశర్మ జంకులేక తాకట్టుపెట్టును. మఱికొంతకాలమునకు – తల్లి శరీరమున ధరించిన బంగారమును గొంచెము కొంచెముగా నీతవెట్టును కల్లుగీసినట్లు ఓడ్చు కొనును. తండ్రి కితరులు వ్రాసియిచ్చిన ముఖ్యములైన పత్రములను దొంగిలించి వచ్చినంత ధర కమ్మి కొంత డబ్బునార్జించును. చక్రవడ్డికి ఋణములను దెచ్చి యమునివలెఁ గనుపించు వణిజుల కప్పువడును. బ్రాహ్మణ పండితవృత్తులకై యీయన తండ్రి కిచ్చిన పొలములు, భుక్తి కేర్పఱిచ కొనిన పొలములు, కవులున కిచ్చినవి, దానము చేఁబడిన గ్రామములలోని పొలములు, తుదకు పురి, పాతరలలోని గింజలు కూడ నతఁడు తనకు నమ్మిని గలిగి చనవు గలిగినవారికి రహస్యముగా అమ్ముటకు యత్నించును.

1. గుడ్డవృత్తులు, 2. వృత్తులు : 1. గుడ్డము + వృత్తులు అను దానికి జాతీయ రూపము కావచ్చును. గుడ్డము = పొలము – చూ. గుడ్డంబు చక్క – 3 – 75. ఈ యర్థమున బ్రాహ్మణమాన్యములగు పొలములని

తెలును. 2. వృత్తులు = విద్యాబోధన, అధ్యయనాదివృత్తుల కేర్పఱుపఁబడిన భుక్తిదాయకములగు చేలు కావచ్చును - చూ. 'రాజానుగ్రహలబ్ధంబులగు నేక భోగగ్రామంబులు' - 3 - 24. దినవెచ్చము, బచ్చింట అనునవి యనింద్యగ్రామ్యములుగాఁ గ్రైకొనవలెను. చనవరులు = పరిచితులగు మిత్రులు అను బులుసువారి యర్థమే సమంజసము. ఇతరులకు రహస్యముగా కూటవిక్రయము వలనుగాదు.

3 - 17. ఇతఁడు పెద్దవాఁడని యితరులు వ్రేలెత్తి చూపినను నిగమశర్మ జంకఁడనియును, యోగ్యుల యంగీకారమునకు వెలియైనవాఁడనియును భావము. కావ్యలింగాలంకారము.

3 - 18. అప్పులు పొడిచి పొడిచి యనుటవలన నెంత దొఱకిన నంతే గ్రహించియనియు, నంగీకారములేని పట్టులందుఁగూడఁ బీడించి యనియు నభిప్రాయము. దొరతనంబునన్ = 'దివాణమునందు' - బులుసు. దొరతనంబునన్ దిరిసి యనఁగా దర్పమైన పద్ధతులలోఁ దిరిపెమెత్తి (honourable begging) అని కావచ్చును. 'బ్రాహ్మణుఁడు' అనుటలో మిక్కిలి యనుచితస్థితికి దిగజారినవాఁడని వ్యంగ్యము.

3 - 19. అనద = అనాథ, దిక్కులేని - అధవః అను పదమున కిది వికృతి - సూ. ని. అదవద్రావుడు = దిక్కుమాలిన త్రాగుడు - మూల్యమును దన చెలులలో నెవరైన వెచ్చింపఁగాఁ దాను త్రాగుట. వెనటి = కుత్సితము వ్యర్థమునగు. పిసాళి = మూర్ఖము, వివేకములేనిది = సూ. ని. వెనటి పిసాళి వెచ్చములు = వ్యర్థము, అవివేకము, నీచమునగు వ్యయము.

తాత్పర్యము : నిగమశర్మ - ఇంటికిఁ బోలేని పరిస్థితి వచ్చి, ఋణములు హెచ్చి, యింక ఋణములు పుట్టక, తనమాట లెవ్వరు నమ్మని సితికి వచ్చినప్పుడు - తన స్నేహితుల యిండ్ల యందుఁ దేరగా మద్యపానము చేయుచుఁ గాలము గడపెను. మఱియు జూదమాడియు, దొంగిలించియు నసత్యములాడియు నెడనెడఁ గొంత యార్జించెడివాఁడు. అట్లార్జించిన యర్థమును నీచముగ, నవివేకముగ వ్యయమొనరించువాఁడు. ఇట్లతని పూర్వ వైభవములెల్ల నడఁగిపోఁగా నిత్యమును లఘువగు ప్రవర్తనమున జీవితము గడుపసాగెను.

3 - 20. 'తతిన్ - సమయమునందు' - బులుసు. ఇచ్చట వరుసగాఁ గొన్ని పూటలను నర్థము హెచ్చుగాఁ బొసఁగును. తతి = so many, a series, row, line, a number, troop, group - Apte.

3 - 21. బోడచొరవ = 'మొండి చొరవ' - బులును. 'సన్యాసి బొచ్చునట్టి చొరవతో' - తెన్మరము. ఈ రెండవ యర్థమే సమంజసముగాఁ దోచును. సన్యాసికి నెవరింటికిఁ బోవుటకు నడ్డంకి యుండదు గనుక చొరవ యుండును. మఱియు రామకృష్ణుని రచనలో సన్యాసులన్నఁ జులుకన గనుపించును. 'కొందఱు బోడలునానాగండలై' - 5 - 182.

3 – 24. వచనము : ఐదామడల దూరమున నున్న తన యూరి నుండి నిగమశర్మ యక్క పుట్టింటికి వచ్చి కొంతకాలము గడపి – యచటి పరిస్థితు లవగతము చేసికొనినది. కొడుకు చెడ్డ నడవడికి దుఃఖసముద్రమున సుడులు దిరుగుచున్న తల్లిదండ్రులకు ధైర్యము చెప్పి సంతోషమును గలిగించు మాటలనాడి యోదార్చినది. ఇలవేల్పగు శ్రీమన్నారాయణుని యారాధనము, అతిథి పూజ జరుపసాగినది. పోఁగా మిగిలిన సొమ్మును దల్లి చూపగా భద్రపరచినది. దాసదాసీజనములను సొంతవారినిగా మెలగునట్లు చేసి వారి బాధలు తీర్చినది. పుస్తక భాండాగారమును భర్త కప్పజెప్పి యందలి గ్రంథములను అగ్ని, యాచకులు, శిథిలత మున్నగు పరిస్థితుల నుండి తప్పించినది. సామగ్రి తొలఁగిన యా యింటిని దొంటివలె నడపి చదువుసంధ్యలు సాగునట్లు చేసినది.

తమ్ముని దురభ్యాసములకు వ్యయమై పోవనివి, రాజానుగ్రహమువలన లభించినవియు నగు భుక్తగ్రామములను, చేలను, దోటలను దన వశము చేసికొనినది. అవసరమగు తావులఁ దన బిడ్డలను గాపు పెట్టినది. నిగమశర్మ భార్య మనస్సున కలఁతచెందినను నితరులకుఁ దన భర్త చేయు తిరస్కారము ననాదరము తెలియనీక గుట్టుగా నడచుకొనుచున్నది. ఆమె సౌందర్యమడవిగాచినవెన్నెల యగుచున్నది కదా యని మిక్కిలి దుఃఖించినది.

ఇట్లు కొన్నాళ్లు గడువఁగా నాకస్మికముగ నిగమశర్మ యూడిపడినాఁడు. చలిది వంటకము దినుటకై వచ్చినవాఁ డక్కను జూచి జంకినాఁడు. కాని వెనుకకుఁ దొలఁగిపోలేక – ఆకలివలనను, ఆమె తన్ను జూచినదని గ్రహించుటవలనను – సమీపించి నమస్కరించినాఁడు. చూచి యెంతో కాల మగుటవలన నామె యతనిని గౌగిలించుకొనఁబోయినది. కాని యతని మెడచుట్టును నెలవంకలవలె నీచస్త్రీలనఖక్షతములు నెత్తురులు చిమ్ముచున్నవి. ఆమె శంకించి దూరముననే నిలచి, మఱల కొంత సమాధానపడి యతనిని సీమంతపుఁ బెండ్లికొడుకవు కమ్మని యాశీర్వదించినది. ఇంతలో నతఁడు మోహపు త్వరలో వెడలిపో యత్నించుచుండెను. ఆమె సాన్నిధ్యము, మాట యతనికి సహింపరానిది యగుటచే నామె వెంటనే వినయము, ఆపేక్ష, మృదుత్వము, తీయఁదనము గల పదములనల్లి వానిని నిలిపినది. మఱియుఁ దన చిన్నబిడ్డను వానిచేతి కిచ్చి 'ఇడుగో మేనల్లుఁడు. ఎత్తుకో. ఎక్కడికి పోయెదవు? మీ బావ బంతిని భోజనము చేయుదువుగాని, నిమిషములో వంట యగునట్లు చూచెదను,' అని పలికినది. వెంటనే యతనికి వెనుకగా నిలఁబడియున్న యతని భార్యకుఁ గనుసైగ చేసినది.

విశేషములు : 'చలిదివంటకంబు గుడువం జనుదెంచి' – ప్రొద్దున వచ్చెనని తెలియును. రాత్రులింటికి వచ్చుట లేదు – 'ఇంటికెన్నడున్ జనక' – 3 – 19. బాగుగా నాకలియై గతిలేక యానాడు వచ్చినాఁడు. కనుక నెవ్వ రనుకొనకుండ నూడిపడినాఁడు 'చుక్క తెగిపడిన వడువున'. చుక్కరాలుట కీడు. ప్రస్తుతమతఁడింటికి వచ్చుటవలన నతఁ డచ్చటి నగలన్నియుఁ జౌర్యముచేసి పారిపోవఁగలఁడు గనుక నా యింటికి కీడుగోరియే వచ్చెనని సూచ్యార్థము. 'నెత్తురులు చిలుకుచు'

అనుటవలన వేకువజామున నుదయమున గూడ అప్పటికి రాఁబోవు కాలము వఱకుఁ గూడ – నతఁడు మదించిన దుష్టస్త్రీల బాహువులలో నున్నాఁడని సూచన 'కుకవిపద బంధంబునుంబోలె, చెడ్డకవి వాడు పదములలో సందర్భమునకుఁ బట్టుండదు. అనగా నా పదములు సకలమైన యర్థమునందును ప్రవర్తింపక – అసకలప్రవృత్తంబులయి – భావవ్యక్తియందుఁ చదువరుల కస్పష్టత కలుగును.

"సీమంతపుంబెండ్లికొడుకవు గ" మ్మని హేతుగర్భితంబుగా నాశీర్వదించుట. అతనిభార్య గర్భిణి కావలెనని యతని కొక కుమారుఁడు కలిగి వంశము నిలువవలెననియు దానికొఱకు సీమంతమను సంస్కారము జరుగవలెననియు నాశీస్సు. 'ఇంతమంది దుష్టస్త్రీల సాంగత్యమందఁ గలవాఁడవు, ఒక్క కుమారుని గని పున్నామ నరకము నుండి తరింపరాదా? పితౄణ విముక్తుఁడవు కారాదా?" యన్న హేతువా యాశీస్సునందు గర్భితము. మఱియు 'ప్రజార్థై గృహమేధినాం, ప్రజాకామో యజేత' మున్నగు ధర్మములు తెలియవా? సంతానము కొఱకుఁ గాని కామము భ్రష్టత కావా?' మున్నగు హేతువులునందు గర్భితములు.

"తమకంబు గమకంబునఁ బోవనుంకించినన్" – నిగమశర్మ కహోరాత్రములు తమకమే యనియుఁ, దప్పనిసరియై వచ్చినాఁడు కాని మనస్సు మాత్రము దుష్టస్త్రీలయందే యున్నదనియు భావము.

జాతీయములు : 1. చదువుసంధ్య = చదువుకొనుట, సాంధ్యకృత్యమాచరించుట. ఇవి బ్రాహ్మణగృహముననుండి తీరవలసిన ధర్మములు. 2. తప్పిదారి, 3. మడిమడ్ర, 4. చేమచెట్లు, 5. చుక్క తెగిపడిన వడువు.

సంస్కృత జాతీయములు. 1. వనచంద్రికావైభవము, 2. వనకేళీపలాశదోహదము.

అలంకారములు :
1. చుక్కతెగిపడిన వడువున, ఉపమ.
2. కొదమనెలవంకల వంకలొత్తుచు, వ్యతిరేకము
3. కుకవిపద బంధంబునుంబోలె, ఉపమ
4. అసకలప్రవృత్తంబులు, శ్లేష
5. ఇందుబింబంబునుంబోని నిజనందను, ఉపమ.

3 – 25. శ్రీపాదద్వయము = 'భర్తయొక్క రెండుపాదములను' – బులుసు శుభకరములయిన, పూజనీయమైన పదములజంట. భర్తయెట్టివాఁడైనను భార్య కతని పదకమలములు భగవచ్చరణములనియును నిగమశర్మ భార్య పతివ్రతాతిలక మనియును వ్యంగ్యము.

తాత్పర్యము : ఆ కాంత తన ప్రాణేశ్వరుని చరణకమలములను జల్లని నీటితోఁ గడిగెను. తన నిట్టూర్పులోని వెచ్చఁదనమువలన వాని పాదములు కొంత కొంత వెచ్చఁబడినవి.

ప్రాణేశ్వర శబ్దమువలన నతనియందే ప్రాణములు పెట్టుకొని యెదురు చూచుచున్నది. 'గుట్టిక' యుండుటచే నెవ్వరికి నామె మనస్సులోని బాధ యంతగాఁ దెలియదు. దానిని జూడఁ గలిగిన నిగమశర్మయక్క వాల బాధ పడినది. నిశ్వాసజతాపము. ఇది వియోగతాపజము, దుఃఖమువలనఁ బుట్టినదియు, అమె నిట్టూర్పులు సోకుటవలన నతని పాదములు చన్నీళ్లతోఁ గడుగఁబడియు వెచ్చని నీటి యుపచార మందించినవి. అమె దుఃఖమున గూడ నతనికి సేవచేయుటయున్నది.

3 – 26. ఈ పద్యమున కీఁబడిన యన్వయము, టీక, తాత్పర్యము దోషవంతములుగా నున్నవి. ఈ దిగువ విధముగా నుండుట సమంజసము.

టీక. : వినువేల్పునకును = ఆకసమునుండి దిగివచ్చిన దేవతకును – చూ. 'నింగివేల్పుల నేలకు 3 – 5.

మెచ్చొలయని = మెప్పునంగీకరింపని. బలువిందునకు = గొప్ప బంధువునకు.

తాత్పర్యము : ఆ నిగమశర్మయక్క తన తమ్మునకు సర్వవిధములైన పదార్థములతో భోజనము పెట్టినది. నింగినుండి దిగివచ్చిన దేవతకువలె, తన మెప్పున కింత హెూదాయైనను జాలని బంధువునకువలెఁ బెట్టినది.

విశేషము : 'అనుజునకుఁ దదగ్రజాత' యనుటలో నాపేక్షతో వండి పెట్టినదని సూచన.

3 – 29. సంతానము తనవెంటఁ జేయు సందడియంతయు నీ పద్యము లోని ప్రాసమునను ప్రాసములలోని శబ్దములవలన వ్యక్తమగును.

3 – 32. ఓరగా = ఎటవాలుగా, అడ్డముగా.

3–33. వేదాధ్యయనము నభ్యాసము చేయువారు విఘ్నభయమున గ్రామసీమలు దాటరు. హేళనగా నామె యీ వంకనుగూర్చి ప్రశ్నించుచున్నది. తమ్ముఁడు వేదపఠనము చేయలేదను బాధ యిందున్నది – చూ. నేనతని యజ్ఞమునం గడుపూజ్యురాలనై వేదినలంకరింతునని –3–39.

3–34. నిత్యశుద్ధి = నిత్యకర్మలయందుఁ బరిశుద్ధి – నిష్ఠాపరత్వము. ఉద్వేలస్ఫూర్తిన్ = 'ఎక్కువ ప్రకాశముతో' – బులుసు. 'అధిక ప్రకాశము చేత' – –తెన్మరము. ఉత్ + వేలస్ఫూర్తిన్ = తీరమున కెగతట్టి యెగయు చున్నయనుట సమంజసము – తండ్రియను నబ్ధి యనుదాని కన్వయము. పాల గ్రామఖనిన్ – వారివంశము దైవసమానపూజ్యతకల పుణ్యపురుషులకు గని వంటిది. జాత్యల్పపాషాణముల్ – జాతిశబ్దము వంశపరముగాక జన్మమను నర్థమున వాడఁబడినది. జాతిచేతనల్పము – నీచవుఁ బుట్టుక. పాషాణము – తల్లితండ్రులను, గట్టుకొన్న భార్యను ,'లోవెడలని తమ్ము గుజ్జులను కష్టపెట్టు

కరినాత్ముఁడని వ్యంగ్యము. తత్సూనులు=వారిబిడ్డలు. తానమ్ముడు గడచిన వెనుక వారి బిడ్డను తానని భావము – చూ. ప్రద్యుమ్నుఁడు 'చక్రధరమతులు' అని తన సోదరులను గూర్చి పల్కినట్లు. భా – అర.

3–35. ఈ పద్యములోని యనుప్రాసాలంకార మిందలి యుక్తి నిష్ఠుర తను స్ఫురింపఁజేయును. పిల్లిశీలము=కన్నులు మూసికొని నన్నెవ్వరు చూచుట లేదనుకొనుట, దొంగచాటుగ ననుభవించుట, కృతఘ్నత. చిల్కల చదువులు= పరమార్థమంటని చదువులు – ఉచ్చారణసూత్రకములు. సంస్కారమంటనివి. 'ఈగుణంబేల నీకు'? అవాచ్యములైన యంశములను గూర్చి కులస్త్రీలు సహజ ముగఁబలుకునట్టి పద్ధతి,

3–36. కుంఠితప్రబోధుండగు = 'మొక్కపోయిన తెలివిగలవాఁడు' —లెన్మరము

'వ్యర్థమైన యుపదేశము కల —బులుసు

ఆమె యుపదేశము వ్యర్థమగునని యప్పటికామెకుఁ దెలియు నవకాశము లేదు. ఇచ్చట 'కుంటుపడిన వివేకము గలవాఁడు' అని చెప్పనగును. ఇది వాని పూర్వవృత్తమువలన విదితమే. ఆమె యింతవఱకును రోషావేశములు, హేళన గల ధోరణిలోఁ జెప్పినది, రానురా నావేశము హెచ్చి గొంతుకచయి యదలు నంతగా మందలించి పలికినది. వెంటనే ప్రయోజనము గోచరించినది. ఎదిగినవానికి, వివేకము కొఱఁతపడినవానికి నయముననేగాని భయమునఁ జెప్పరాదని గ్రహించి ధోరణి మార్చినది, ఈ మార్పును గమనింపఁజేయుటకే యీ చిన్న వచనము రచింపఁబడినది, ఇందలి హ్రస్వదీర్ఘ బిందవ్యక్షర శబ్దాలం కార సమ్మిశ్రమగు రచన యామె కోపముతోడి తత్తరపాటును, మాటవేగమును సూచించును.

3–38. వడఁబడఁబాఱుచున్='మిక్కిలి శ్రమలను పొందుచు, బులుసు. పడన్ + పడన్ + పారుచున్ = ఎప్పుడెప్పుడో రాలిపోవు ననునట్లు పరువెత్తు చున్నటులున్న వయసుగల ముదుసలి. అందువలననే వడఁకుపట్టిన=వణఁకు చున్న – యను నుత్తర ప్రయోగము.

నేలలోవెడలని='భూమిపై నడుగుపెట్టి తిరుగని' –బులుసు. నేల= ప్రాంతభూమి. లోవెడలని=లోపలనుండి వెలువడని – ఒకచోటును – గృహ మును – వెలువడుటెరుగని, బంటున్='సేవకుని' పైదన్='పసుల కుఱ్ఱ వానిని' –బులుసు. బైద – పిల్లవాఁడు అని యుండవలెను. లేనిచో ప్రోవఁగ యను పదము సూటిగా సార్థకము కాదు. ఇవి జాత్యేకవచనములు. వీని కిచ్చట బహువచనార్థము చెప్పుట యుక్తము. 'ఈ పనివాండ్రను బిడ్డలను' అని యర్థము.

కర్ణునొదలనె భారతసంహిత నిల్చుచాడ్పునన్ 'కర్ణుని తల భారతమని లోకోక్తి. కర్ణుని ధైర్యము లేనిచో దుర్యోధనుఁ డన్ని దుర్ణయములు చేసి

యుండ(డనియు భారతయుద్ధమునకు(గర్తు(డుత్తమాంగమనియు నీ లోకోక్తి. నిర్వహణ సామర్థ్యము లేనివానిపై నీ కుటుంబభారము పడినదని భావము.

3–39. వేది యలంకరింతునని. యజ్ఞము చేయించునపుడు పూజింప(బడుదునని, యజ్ఞము చేయించు పురోహితుని, వాని భార్యను వేదికపై నలంక రింప(జేత పూజించుట.

3–40. ముక్కారుంబండు = 'మూ(డుపంటలు పండుచున్న' –బులుసు మూ(డుకాలముల(బండునట్టి' యనవలెను.

అఖండసేతువృతముల్ = 'ఎడతెగక పాలు పంటకాలువలు కలవి' –బులుసు, తెగకొట్టనట్టి యడ్డకట్టలతో(జుట్ట(బడియున్నవి – గట్టులు తీయుట కవకాశము లేనట్లెప్పుడును గాలువలనీటితో(బంటలు బండునట్టివి.

3–41. ఈ పద్యమున రమించు శబ్దము రెండుమారులు ప్రయోగింప(బడినది. ఇది గ్రామ్యదోషము. అక్కతమ్మునితో(జేయు సంభాషణయం దిట్టి ప్రయోగ ముచితము కాదనిపించును.

3–42. కోలాభోజనియంచు. ఈ పాఠమునకు(బ్రమాణము చూప(బడలేదు. ఇతర ప్రతులయందు కోలంబో జరియించు అను పాఠమే కనుపించు చున్నది.

3–45. సద్బుద్ధి యాదరించెన్ = అక్కయొక్క సద్బుద్ధి నత(డంగీ కరించెను. అది వాని సద్బుద్ధివలన(గాదు, అన్నపాన కాంక్షవలన. కనుకనే 46వ పద్యమున(దేనెపూసిన కత్తి యనుచున్నా(డు కవి.

3–49. పడుపడుకకు = తాను పరున్న శయ్యకు(గూడ(దెలియనీయక– అతిశయోక్తి –, భార్యకు(గూడ(దెలియనీయక యని వ్యంగ్యము. ఇ(క(గను పింపక యింటినుండి వెడలిపోవునప్పుడు కూడ నత(డు భార్యను వదలిపో(గలిగె ననిన నతని హృదయహీనతకు, నైచ్యమునకు నవధిలేదు. అనుజీవి యను భావమతనికి(గలుగలేదు. 'కాపుంగెంజిగురాకుబోడి వరలోకంబు ప్రాపించి నప్పుడు కూడ(దుఃఖ మతనికి(గలుగలేదు. దైవయోగమున నతనికి సంతా నము గలిగిన వెనుకగాని యీ మార్పు రాలేదు.

3–50. విశేషము : ఈ పద్యమున వృద్ధభూసురాదులు దుఃఖించుట వస్తునష్టమునకు(గాదు. వృద్ధభూసురుని దుఃఖ మాత్మపితృదత్తము నష్టమై నందులకు. ముత్తైదువ వనట(బొందినది యత్తగారిచ్చిన వస్తువు పోయినందు లకు. ముక్కర మాంగల్య చిహ్నములలో నొకటి, మఱియు(గ్రొత్తగా(జేయిం చుకొన్న వస్తువింకను ధరింపకుండ నష్టమైనదియని యాడుబిడ్డ యడలినది. అట్లే నవగ్రహప్రభావిత వస్తునష్టమునకు జామాతకు వెతగలిగినది. ఈ నలుగు రును బొందిన దుఃఖము వస్తునష్టమునకు(గాక యా వస్తువుల పవిత్రత, వానిపై(దమకు(గల గౌరవాదులవలన నని యీ పద్యరచనవలన పదప్రయోగమందలి

కాకువువలన వ్యంగ్యము. ఇందు నిగమశర్మభార్య దుఃఖమును జెప్పకపోవుట యొక విశేషము. భర్తయే యింటినుండి వెడలిన వెనుక నామె యే వస్తువుకొఱకు వేఱుగా దుఃఖించును?

3-51. విశేషము : 'ఒక్కనాటి సంధ్యావసరంబునందు' అనుటవలన నతఁడు చేసిన బహుదినప్రయాణము సూచితము.

3-52. 'పరార్థాహృతి త్వరితాంతఃకరణుల్' అను పాఠ మువితము. ఇతరులసొమ్ము నపహరించు వేగము గల హృదయాభిలాషము కలవారని యర్థము.

3-54. బకనిభులు='బకాసురునివంటివారు' —బులుసు

కొంగలవంటివారనుట యొప్పును. అందువలననే యా పతితుని దోచు కొని పెట్టుకొకరుఁడై చనుట తగియున్నది

3-55. అనుకంపాటోద్దీపితబుద్ధి=ఎక్కువ దయచే ప్రకాశించు బుద్ధితో -బులుసు. 'దయాతిశయముచేత వెలుఁగునట్టి బుద్ధితో' —తెన్మరము.

'దయవలన వేగిరపాటు నెందిన బుద్ధితో' అన నొప్పును.

3-56. తాత్పర్యము : తండ్రిని విడచుటవలన వృద్ధి పొందిన పాపము పోవునట్లొత్తురితిని వ్రేళులతో నెత్తురులను దుడిచి, నిదురించుచున్న నిగమశర్మ ప్రాణములను మేలుకొలుపునట్లు గాయములలో వత్తులు బొప్పించి, 'యిదియితని మృతికి నమయము కా'దని యమదూతలను మగుడఁజేయునట్ల తని శరీరమున నాటిన యస్త్రములను దొలఁగించి, పడఁబోవుచున్న శరీరము పడ కుండఁ బోటివిలువునట్లు మెత్తని గుడ్డలనెక్కువ నొత్తుపెట్టి, చప్పిడి యన్న మును దినిపించి, త్రాగుటకు వేడినీళ్ల నొసఁగి, మంచి ఘాటైన మందులతోఁ గూడిన తాంబూలముల నిప్పించి, సమర్థుఁడైన వైద్యుని జాగరూకునిగా హెచ్చ రిక చేసి యా కాపు కన్నులలో దీపము పెట్టుకొని యతనిని సాకెను. ఈ పద్యమున నుపమాలంకార మున్నది. 'కంటవత్తిడుకొని' యనుతావున లోకోక్తి.

3-59. విశేషము : ఇటఁ దలలోపల నాలుక యనఁగా మనో భావముల ననుసరించి వర్తించుట. పూసలలో దారమనఁగా నెటు వంచిన నటు వంగుట. పాలఁజల్లిన నీ రనఁగా విడదీయలేని కలయిక యుండుట.

3-60. ఇందలి రూపకమువలన నామె దుశ్శీలయగుట సూచింపఁబడి, రాఁబోవు కథాంశము ననుసరించిన యౌచితి యేర్పడినది.

3-68 విశేషము : 1 భీతి గలిగినప్పుడే-యందును ప్రాణభీతి గలిగినప్పుడే - యవాచ్యమగు ధర్మచ్యుతి కొడిగట్టుట లోకమునఁ బామరజన సహజము నిగమశర్మ 'కాయజామేయనాయకాఘాతభీతి' కలిగినప్పుడట్టి ప్రాణ భీతికరమగు పాపమున కొడిగట్టినాఁడన నత్యంతనైచ్యమును సూచించును.

2. ఎంత యధర్మశీలుఁడు నాత్మ రక్షణమును జెడగొట్టు నధర్మమును విశ్వాస రహితముగఁ జేయఁడు. అట్టి పని నితఁడు చేయుట 'గుడినుండి గుడిటాళ్ల దీయుకరణి' నాచరించెను. రామకృష్ణుఁ డీ ఘట్టమును రచించునాటికిఁ బింగళి సూరన కళాపూర్ణోదయములోని శల్యాసురుఁడు గుడినుండి గుడిటాళ్లు తీసిన ఘట్టము నితఁ డెఱిఁగి యభిమానించి యుండెనేమో!

3 – 69. విశేషము : చీఁకటి వేకటిరేలన్ = చీకటితో నిండిన రాత్రులందు' అని బులుసు 'వేఁకటి' = దే. వి గర్భము – వ్రేఁకటియొక్క రూపాం. తరము – శబ్ద రత్నాకరము పుట 738 వేకటి యనునది నిర్బంధుక రూపమై వేగుధాతువుపైఁ బుట్టిన రూపము కావచ్చును అప్పుడు 'చీకటి వేకటి రేలు' అనఁగాఁ జీకటితోఁ గూడిన వేకువజాము రాతిరి వేళలని యర్థము కావచ్చును. మూఁడవజాము రాతిరి యెల్లరు గాఢ నిద్రలో నుండుట నిగమశర్మ పాపాచరణమున కనుకూలము.

3 –78. తాత్పర్యము : దేవిభక్తులు వాడియైన కత్తులతోఁ బశువుల తలలు నఱికి బలియిచ్చిరి. ఎక్కువైన యాపదలను చీఁకటులకుఁ గ్రొత్త సూర్యకాంతులుగా నా పశువుల కుత్తుకలనుండి నెత్తుటి ధార లుబికినవి

విశేషము : పశువులను గాలిగంగలనుండి రక్షించుటకై భక్తులు పశువుల తలలు నఱకు చున్నారు. వాని కంఠరక్తధారలు పశువుల యాపదలను బోఁగొట్టుననుట యవహేళనమైన వర్ణనము ఇందు హాస్యరసము ధ్వనించును రామకృష్ణకవికి బలు లిష్టములేనట్లు సూచించు కథ దేశమునఁ బ్రచారమున నున్నది.

3 – 80. వాలుంబోడువఁడు = 'దుష్టబ్రాహ్మణుఁడు' తెన్మరం, బులుసు. ఇట సాహసికుఁడగు దుష్ట బ్రాహ్మణుఁడని చెప్పనగును. పోడ వయసు దాని రూపాంతరమే పోడవఁడు. 'సందడిన్ బొమ్మను బెండ్లాడెడు వడువునన్' అనఁగా నా సంబరమున బొమ్మల పెండ్లి చేసికొనినట్లు

3 – 83. అనపాయ = 'అపాయము లేని' – తెన్మరము, బులుసు 'అనపాయము = అపాయము లేనిది' – శబ్దరత్నాకరము, పుట 22. 'అపాయము = హాని, చెఱుపు' – శబ్దరత్నాకరము, పుట. 28.

కాని యజ్ఞాతరవికర వ్యాపారములగు తావులు హానిలేనివి యగుట సహజము కాదు. అపాయ శబ్దమున కిచ్చట విశ్లేషమను నర్థము పొసఁగుచున్నది. భూరుహచ్ఛాయలచేత నెడబాటు చెందని శైత్యఖమలని తాత్పర్యము.

4 – 85. తాత్పర్యము: కాపు కోడలి నిట్టూర్పుగాడ్పు పరిమళము లాఘ్రాణించుట వలన నిగమశర్మ మదాకులుఁ డయ్యెను తత్ఫలితముగా నతనికి వేఁటతమక మలవడినది కనుక పులులు మొదలగు జంతువులతో భయంకరమైన యరణ్యమున వా రిరువురు శీఘ్రగతిని మెలఁగుదురు

4 – 86 నెమళ్లు మున్నగు జంతువు లామె యవయవముల కుపమాన ముగాఁ దూఁగలేకపోయినవి గనుక మానమే యూనమైనదని వాచ్యార్థము. 'ఈసతిచే మానమె యూనమయ్యె" నను వాక్యమిందలి కాకువువలన నీమె మానహీన యగు నువిద యనియు నామె యవయవమున కుపమితములైన తమకును మానమె యూనమైనదనియు నిఁక నిస్సారమగు ప్రాణము ధరించుట కాదని ఆ జంతువులు ఁోసినవనియు నర్థము సూచ్యమైనది

3 – 95. విశేషము : 'నీ ముఖమునం దమృతస్థితిఁ గాంచి మించఁగన్' చంద్రునియం దమృతము చూచుట సహజము. అ + మృతిస్థితి = మృతస్థితి కానిది ఆమె ముఖచంద్రుఁడు శాశ్వతానంద మొసఁగునని నమ్మినాఁడు నశ్వరమైన భౌతిక మనశ్వరముగా భావించితినని పూర్వ సంస్కారవశమున వాపోవుట తెలియనగును చంద్రునకు క్షీణత ప్రసిద్ధము గనుక నతని యాశయు భంగమైనదను నుపపత్తి యతని మనస్సునకు గోచరించినది. ఆ ముఖము 'కలంక ముక్త చంద్రాకృతి' యని భావించుట దుఃఖహేతువు అట్లే తరువాతి పద్యమున నామె పుత్రులవంటివా రికఁ బుట్ట రనుకొనుట దుఃఖహేతు వగుచున్నది.

3 – 96. విశేషము · బరువు మోచువాఁడు తూఁగుచుఁ దూలుచుఁ నేఁగుట సహజము కర్మనాశసమునకు ముందుగా నెవ్వరికైనఁ దత్పూర్వకర్మ ఫలభార మనుభవింపకతీర దనునది యాధ్యాత్మిక సత్యము.

3 – 97. విశేషము : కర్మలలోఁబడుట, తత్ఫలితములను మేననుభవించుట, యా మేను విడిచి జీవుఁడు దైవానుగ్రహమున కుద్ధరింపఁబడుటకు యత్నించుటయు శాస్త్రసత్యములగు భారతీయ సంప్రదాయములు.

3 – 98. అనుద్దిష్ట ప్రయోజనము నిర్వికల్పస్థితికి దాపైన స్థితి. నిర్భోజనుఁడు, నిరంబు భజనుఁడు నగుట యొక వ్రతాచరణము చేయువానికిని లక్షణము.

3 – 102 1 'దుఃఖజలధిమునుఁగు = దుఃఖసముద్రమునందు మునుఁగున్ – ఇందు కూర్మావతారము కాననగును ఆది కూర్మము సముద్రమున మునిఁగియుండుట సాజము – – బులుసు. ఇట సంసారమున నను శ్లేషార్థమును గైకొనినచో భగవంతుఁడు అజమనఁబడు – అనాదియగు – తన శీర్షమును బ్రజాపతిరూపమునఁ దెగఁగొట్టుకొని సంవత్సరరూపుఁడై సంసారసముద్రమున నీఁదినట్లు కూర్మావతారమెత్తి సముద్రమున మునిఁగెననియు నదే విధమున నిగమశర్మ సంసార దుఃఖమున మునిఁగియున్నను దైవలీల యగు జగన్నాటకము ననుకరించుచున్నాఁడేగాని వేఱు గాదనియుఁ దాత్పర్యమగును. దుఃఖశబ్దమునకు సంసారమను నర్థ ముండుటకు :

"దుఃఖంలోకోభవశ్చైవ సంసారఃకష్టకారకః"

అని త్రికాండ శేషము. 1 – 170.

2. 'చేరఁగారాని = సమీపింపఁగా లేని, దర్శనస్థితిన్ = చూపుయొక్క యునికిని – చూపు చెడిపోవుటను, వహించున్ = పొందును. – బౌద్ధావతార పక్షమున 'దగ్గఱకుఁజేరఁగా రాని మతముయొక్క – బౌద్ధమతముయొక్క – స్థితిని పొందునని యర్థము. దర్శనము = చూపు, శాస్త్రము –' బులుసు.

ఇందు దర్శనస్థితి యనఁగా 'చూపు చెడిపోవుటను' అను శ్లేష అసాధ్యము. అసందర్భము, అనావశ్యకము. బుద్ధావతారము నింద్యమను భావమిందుఁ గనుపింపదు. రామకృష్ణుని స్వభావమునకు విరుద్ధము.

చేరగారాని దర్శనస్థితి యనఁగా నిగమశర్మ పరమున సమీపింపరాని బీభత్సదృశ్యమనియు, దైవపరమున నెవ్వరు సమీపించి యిదమిత్థమని నిర్ణయింపరాని సుగతదర్శనమనియుఁ జెప్పవలెను. 'సౌగతాగమమాలిమిశాస్త్రసరణి'ని – 2 – 66 – వర్ణించిన మఱియొక తావునఁ గూడ భవతారకమగు నావ నడుపు శాస్త్రముగనే యీ కవి వర్ణించినాఁడు.

3 – 133. తాత్పర్యము : 'పుండరీక' శబ్దములోని నాలుఁ గక్షరముల యందును నాలుఁగు పురుషార్థములును సమన్వితములై యుండి, తలలు ముదిరిన పాపములను నేనుఁగులను సింహమువలె నా క్షేత్రము చెండి వైచును'

విశేషము : ఆత్మనామపదచ్చతురక్షరములు – ఆత్మయొక్క పేరు నందుండు నాలుఁ గక్షరములు. ప్రణవము, నక్షరమునను వాక్కు నాలుఁ గక్షరములుగా – నాలుఁగు వాక్కులుగా – పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ యను వాక్కులుగా – జీవుని ప్రజ్ఞ యందు భాసించుట మంత్రశాస్త్ర ప్రసిద్ధము. దీనికిఁ బ్రమాణము. 'చత్వారివాక్ పరిమితాపదాని, తాని విదుర్బ్రాహ్మణాయే మనీషిణః' – ఋగ్వేదము 1 – 169 – 45. దీని కొక యంత్రమయమగు నాకారము సృష్టిలో నున్నది. బిందు, పరిధి రూపకమగు – స్వయంభూ, పరిభూస్వరూపమగు – వృత్తము ప్రణవముగను, నందుఁ జతుర్భుజము (cross) నుండి యుద్భవించుచున్న చతుర్ముఖము (square) నాలుఁ గక్షరములుగా వెలువడు కుమారసర్గము (virgin creation) గను వర్ణింపఁబడినది. 'చతుర్భిస్సాకం నవతించ నామభిః చక్రంనవృత్తం వ్యతీగ్ంరవీపపత్, బృహచ్ఛరీరో విమమాన ఋక్వభిః యువా కుమారః ప్రత్యేత్యాహవమ్"– ఋగ్వేదము 1 – 155 – 6. దీని యాకారమిట్లుండును.



పాశ్చాత్యులలోఁ గూడ నవాదిగా శ్రుతివిద్య నుపదేశమందినవారి నాలుఁ గక్షరములవాక్కు నుపాసింతురు.

[1]ఈ వాక్కు మానవునిలోనున్న – జీవునిలోనున్న – ప్రజ్ఞగాఁ గీర్తింపఁబడినది. దాని బాహ్యార్థము మనలో నున్న 'అహమ్'[2] అను ప్రజ్ఞయనియు దాని ధ్యేయమైన యాకారము యొక్క మూర్తియే యీ శరీరమను క్షేత్రమునఁ – భౌతికమగు నవయవ నిర్మాణమున – బ్రతిష్ఠింపఁబడి యున్నదనియు, నదియే విట్ఠలుని కటిన్యస్తహస్తాకారమగు మూర్తితత్త్వమనియు సంప్రదాయజ్ఞులైన తత్త్వవేత్తలు గురుపరంపరాగతముగఁ జెప్పుచున్నారు.[3]

3 – 143. తాత్పర్యము : పాలసముద్రమునఁ జంద్రుఁ డుద్భవింపఁ బట్టియే శివుఁడు చంద్రశేఖరుఁ డయ్యెను, లక్ష్మి యుద్భవింపఁబట్టియే గొల్లవాఁడుగ నవతరించినను విష్ణువు శ్రీపతి యయ్యెను, అమృత ముద్భవింపఁబట్టియే దేవతలు కూటిపేదలు కాక నిరంతర మమృతాస్వాదనము చేయుచున్నారని సుధాబ్ధిపుణ్యమును లోకములు నుతించుచుండును.

3 – 144. ఇంద్రుఁడు సముద్రమునుండి గుఱ్ఱము, ఏనుఁగు, రత్నము, స్త్రీలు మున్నగు సమస్త వస్తుసముదాయమును స్వీకరించియు, దానిలోతును గైకొనఁగోరి బాగుగఁ గాలిన పిడక కచ్చికలను మేఘరూపమునఁ బంపెనేమో! లేనిచో నవి నీరు ద్రావుట యేల ?

విశేషములు : గుఱ్ఱము, ఏనుఁగు, రత్నము, స్త్రీలు ననఁగా వరుసగా నుచ్చైఃశ్రవము, ఐరావతము, కౌస్తుభము, నప్సరసలు. 2. మేఘములు నీరు వర్షింపవలెను గాని సముద్రమునుండి స్వీకరించుటయేల యనుదాని కుపపత్తి యిట సాధింపఁబడినది. బాగుగఁగాలిన కచ్చికలు నీటిని పీల్చుకొనుట సహజము. నీఁటిలోఁతు నెఱుఁగఁగోరువారు నీఁటి నింకింపఁ జేయుటకు యత్నింతురు.

---

1 The Sacred Tetragram : 'Attach thyself', says the alchemist; to the four letters of the tetragram disposed jn the following manner. The letters of the ineffable name are there, although thou mayest not discern them at first. The incommunicable axiom is kabalistically contained therein, and this is what is called the magic arcanum by the Masters' – Isis Unveiled. Vol.I.p. 506.

2 'I am that I am', the name of God.

3 'The original idea of the 'man crucified' in space certainly belongs to the ancient Hindus. Moor shows this in his Hindu Pantheon, in the engraving that represents Vithoba' – The secret Doctrine. Vol. iv, page 131.
'In the mystical representations of his character, vishvakarman is often called vithoba...' – ibid- vol. v. page- 270.

3 – 147. విశేషము : పాలసముద్రము విష్ణుని చేతితోఁ జిల్కఁబడుట వలన సర్వవ్యాపియగు విష్ణుని జగద్ధారణమున కిది ముఖ్యస్థానము వహించు చున్నదనియు, నతని వ్యాపనమూర్తియగు విశ్వరూపములోని భాగమనియు భావము.

3 – 148. వేలాసమాభ్యాగతాతురాచలార్థులకున్ = 'ఒడ్డునకు వచ్చిన ఆతురులగు – శ్రమపడిన – కొండలను అతిథులకు' – బులుసు.

'వేలాసమభ్యాగత . ' యను పాఠము సమంజసము.

'వేలాసమభ్యాగత = ఒడ్డునకుఁజక్కగావచ్చి చేరిన. ఆతుర = ఆతురత పడుచున్న. అచల + అర్థులకున్ = కొండలను యాచకులకు' అన నొప్పును.

3 – 158. టీక : అలరుముమ్మొనల కట్టావులు = 1. పువ్వులముం దంచులనుండి నిశ్వసింపఁబడు వాయువు లూరుచోట, 2. అలరు = సంతస మందు – పరిపుష్టినందు – ముమ్మొనల కట్టావులు – మూడు + మొనల – మూఁడగ్రముల నిశ్వాసములు, అకార, ఉకార, మకారములకు సంబంధించినవి, త్రిగుణములకుఁ ద్రిమూర్తితత్వమునకుఁ గాలత్రయసృష్టికి సంబంధించిన ప్రాణ స్పందనములూరెడిచోట. 2. కెలఁకులన్ = పార్శ్వములయందు, కొలఁకులు = చెఱువులు. తొలఁకుచోట = తొణికిసలాడుచున్న చోట. 3. గంధర్వ గాంధర్వ గంధమింపగుచోట – 1. గంధర్వుల సంగీత లేశమింపగుటచేత – దూరము నుండి వినఁబడుసంగీతము. 2. గంధర్వుల సంగీతముపై నభిలాష యింపగు చోట. 'లేశంస్తూపదంగంధోఽనుబంధేషత్కరావపి' – త్రికాండ శేషము. 3 – 35. గంధఅర్దనే. 'వ్రార్థితేఽర్దితః' – అమరకోశము – 3 – 98. 4. నిరపాయసంప్రదాయసిద్ధి = 'అపాయము లేనట్టిసిద్ధిని' – బులుసు. అవిచ్ఛిన్నమైన పరంపర సిద్ధించుటయని చెప్పఁదగును. కనుకనే వివిధ ధర్మంబు లావిర్భవించుచోటని చెప్పఁబడినది.

3 – 159. టీక : బహుయోజన విస్తీర్ణము = పెక్కామడల నిడివి కలది. బహునారీజనయుతంబు = అనేక స్త్రీజనములతోఁ గూడినది. బహువిధ మహిమావహము = అనేక విధములైన మహిమలతోఁ గూడినది.

3 – 160. తాత్పర్యము : అమృతబిందువులు ఘనీభవించిన చల్లని కిరణములు గల చంద్రుని బింబములవంటి ముఖములు గల దేవకన్యకలు ఘల్లుమను గాజుల రవళులతో నూపుచుండఁగా, సర్పడోలికయందు లక్ష్మీదేవి కరిన కుచమువలెనున్న గుండ్రని తలగడపై నెడమముంజేతి నానించి యుల్లాస మందుచు – ముందు పద్యమున కన్వయము.

3 – 172. తాత్పర్యము : కపట కూర్మరాజు కంఠమునఁ బ్రకాశించు చీకటిప్రాని దళమువలెను, శేషుఁడను బటికపురాతిస్తంభముపైఁ జెక్కిన యింద్రనీలముల బొమ్మవలెను, యజ్ఞవరాహమూర్తి కోరయను గునపముచేఁ బెల్లగింపఁబడిన హిరణ్యాక్షుని గర్భము నందలి కాలేయమువలెను, దిగ్గజముల

స్కంధములను లంకదిబ్బలపైఁ గాపురమున్న నల్లయాడుహంసవలెను, భూమిని భరించువారికిఁ జివర వర్తించుచుఁ బర్వతాగ్రములయందు మెలఁగు నాడు నెమలి వలె నొప్పునదియు, నృగభగీరథ భరతాదుల భుజాగ్రమున నలఁగిన సుగంధపుఁ బూతవలెను దగియున్న వసుంధరను జూచి దైత్యాంతకుఁడైన విఠ్ఠవిట్లను చున్నాఁడు.

3 – 174. – యుద్ధసామాన్యముచే నానందమిచ్చుట యసంభవము గావున నిచ్చట విశేషముగా యుద్ధావరణ మొక నేపథ్య రచనగా రూపింపఁ బడినది.

3 – 178. విశేషము : ఇందుఁ గృష్ణుని లీలలన్నియుఁ దెలుఁగుదేశము లోని యాటలతోఁ బోల్పఁబడినవి.

3 – 180. తాత్పర్యము : వివిధ యువతుల సమూహములను బలుమారు సృష్టించిన బ్రహ్మ రాధను సృష్టి చేయఁబోవునపుడు చేతులు కడుగుకొనగా నతని వ్రేళుల చివర నంటు జలకణములే రాధనఖములేమో యనునట్లున్నవి. ఆమె నఖములు నిర్మలములు, రుచిరములు, బవిత్రములునని భావము.

3 – 181. తాత్పర్యము : రాధ యూరువు లంటిబోదె లగుటచేత వానినుండి కలిగిన లావణ్యమను నరటి పూతపై నిగిడిన రేకులే యొక రెండు వ్రాలి బోరగిలబడినట్లు పాదములపై భాగము లమరును.
"అలంకారము. ఉపమ, రూపకము" —బులుసు.
రూపకాను ప్రాణితోత్ప్రేక్ష యిందలి యలంకారము.

3–182. తాత్పర్యము : రాధ పిక్కలు పరికింపఁగా గదలే కాని బాకాలు కావు, బాకాలైనచో నదుకులు పడకుండునా ? గీపెట్టకుండునా ? పదను దీయఁబడి రాగి రంగుదేరి వలుకక యుండునా ?
"అలం. రూపకము,వ్యతిరేకము"—బులుసు, ఇందు వ్యతిరేకము సరికాదు, హేతువు కల్పింపఁబడుటవలన కావ్యలింగము.

3–183. తాత్పర్యము : ఏనుఁగు తొండములు తమ చర్మమందలి కాఠిన్యదోషము నపనయించుకొనుటకై రాధ తొడలై జన్మించి కూడ దామరల తోడి తగులమును మానలేకపోయినవి. ఆ తగులమామె చరణముల నెపమునఁ దోచుచున్నది. పూర్వవాసనలను దొలగించుకొనుట సాధ్యమా ?

రాధతొడ లాకారమున నేనుఁగు తొండములవలె నుండియు మృదుత్వము గలవి యనియు, నామె చరణకమలములా తొండముల చివరఁ బట్టిన పద్మముల వలె నున్న వనియు భావము.

"అలం. విషమము, అర్థాంతరన్యాసము" —బులుసు. ఇందు విషమా లంకారము లేదు.

3–185. తాత్పర్యము : రాధ నాభియను యముననుండి యౌవనమను బాలకృష్ణుఁడు వెడలఁగొట్టఁగా వెలువడిన కాళీయుఁడా యనునట్లామె రోమాళి

యొప్పును. అది యామె నడుమనెడి విష్ణుపదమున కణఁగిన విధ మేర్పడి యున్నది.

విష్ణుపదమనఁగా నాకాశమని యర్థ మున్నది గనుక నాకాశమువంటి రాధ మధ్యమున నూగా రణఁగియున్నది. కాళీయుని దేహముపైఁ గృష్ణుఁడు చిందులు తొక్కెను గనుక వాని పదమే విష్ణుపదమై వాని నణఁగఁగొట్టినది. అలంకారము శ్లేషాను ప్రాణితమైన యుత్ప్రేక్ష.

3–190. అన్వయము : సోమబింబాస్యదశనవాసోమతల్లి చంద్రిక యందెలఁడాలు గుప్పళింపి యొప్పును.

తాత్పర్యము : చంద్రబింబమువంటి మొగముగంటి రాధయొక్క మేలైన పెదవి – యామె ముఖమునుండి వెలువడు – వెన్నెలయం దెఱ్ఱరంగును గుప్పిం చుచు నొప్పుచున్నది. పలుచని జిలుగువస్త్రముల కెటువంటి రంగైన నందమే కలిగించును గదా!

విశేషము : "సోమబింబాస్య" యనుటలోని సోమత్వమువలన ముఖ మున వెన్నెలలు గలుగుట సహజము. "దశనవాసోమతల్లి" యనుటలోని వాసశ్శబ్దమువలన వస్త్రత్వము, పెదవుల యుపమేయత్వమువలన నెఱఁడాలును సహజములు. సాభిప్రాయముగఁ బ్రయోగింపఁబడిన యీ రెండు ప్రయోగముల వలనఁ బరికరాలంకారము. ఉత్తరార్థమున నర్థాంతరన్యాసము. దశనవా సోమతల్లియను తావున రూపకము.

చతుర్థాశ్వాసము

4–6. తాత్పర్యము : వెన్నెలవలెఁ దెల్లనైన మంచుహారను ధరించిన బంగారమువంటి రాధమేను పాదరసమునఁ బడవైచిన బంగారు తీగవలెఁ బ్రకా శించెను.

4–7. తాత్పర్యము : క్రొత్తదియగు నల్లయగరు పూతవలన స్త్రీల చన్నులయందు వెచ్చఁదనమను నగ్ని కలిగెను. సమగ్రమైన బుద్ధిబలము గల వారు పొగయను ననుమాన ప్రమాణమువలన నగ్నియొక్క యస్తిత్వమును సాధింతురు.

విశేషము : సుగంధ ద్రవ్యముల పూఁతను స్త్రీలు ధరించుటవలన వారి ప్రియులకు వెచ్చఁదన మాలింగనాదికమువలన సిద్ధించినదని భావము. అలం కారములు – రూపకము, అర్థాంతరన్యాసము.

4–9. తాత్పర్యము : అగరు, కుంకుమపూవు, నెఱ్ఱవస్త్రములును జలిని నెట్టి వేయఁగలవా? పొగలేని యాక కుంపటులైన మగువల స్తనములే భోగమహనీయములై వెచ్చఁదనమును గూర్చును.

4–11. అలంకారము. శ్లేష, అర్థాంతరన్యాసము.

4-12. తాత్పర్యము : నల్లని కాలాగురుధూపము హృదయమునకు సుఖమును గూర్పఁగాఁ గన్నుమోడ్చిన రీతిని కిటికీలు మూసిన సౌధము లొప్పినవి. అలంకారము : రూపకము, ఉపమ.

4-17. తాత్పర్యము : రాధయను పద్మిని సూర్యకిరణముల తాపమున కోర్చి ఘోర తప మొనరించెను. శ్రీపతి యడుగులను గొడుగులను శరణు జొచ్చినవారిని దాపభరమెట్లంటును ?

విశేషము : 1. పద్మిని యనఁగా నుత్తమజాతి స్త్రీయనియుఁ దామరతీగ యనియు నర్థము. తామరతీగకు సూర్యకిరణములవలని దాపభరమెట్లుండును ? ఆహ్లాదమే కలుగును. 2. పద్మము శ్రీదేవికిని వాసముగనుకను. స్వామి శ్రీపతి గనుకను రాధయొక్క పద్మినీత్వ మానుకూల్య సాధకము. 3. విష్ణువు సూర్యమండల మధ్యవర్తిగా ధ్యేయుఁడు గనుకఁ బద్మిని కది యనుకూలము.

అలంకారము. 1. పద్మిని, శ్రీపతి శబ్దములవలనఁ బరికరము, 2. పద్మిని శబ్దమున శ్లేష 3. పద్యమున నర్థాంతరన్యాసము.

4-22. తాత్పర్యము : కార్చిచ్చను పరశురామునివలనఁ జెటిలిన వెదుళ్లను రాజులవంశములు గల పర్వతముల సమూహమను క్షత్రియుల కోవ యొక్క క్షేత్రములలో వర్షాగమమను బ్రాహ్మణ ప్రసాదమువలన మఱల వంశ వృద్ధి రాజిల్లెను.

విశేషము : పరశురాముఁడు క్షత్రియకులముల నిరువదియొక్కమాఱు నఱకఁగా నిర్వంశమయ్యెను మఱల నా క్షత్రియస్త్రీల గర్భములందు బ్రాహ్మణుల యనుగ్రహమున వంశవృద్ధియయ్యెను ఈ కథ భారతమున నాదిపర్వమున నున్నది.

4 – 23 తాత్పర్యము : అంబుదములు సముద్రమందలి నీరు త్రావఁగా నందలి రత్నములు కూడఁ గబళింపఁబడినవి. యఱుగక మఱలఁ గ్రక్కఁగా వెలువడి ప్రకాశించుచున్న వనునట్లుగాఁ బచ్చికబయళ్లలో వడగండ్లు, నాల్ల్రపురుగులు, నేరేడుపండ్లును బ్రకాశించినవి.

విశేషము : సముద్రము రత్నాకరము మేఘములు వేసఁగిలో సముద్ర జలముల నాస్వాదించును. వర్షఋతువున వడగండ్లు కురియును పచ్చికబీళ్లలో నాల్ల్రపురుగులు తిరుగుచుండును. నేరేడుపండ్లు రాలుచుండును.

4 – 38. తాత్పర్యము : మన్మథుని శిలీముఖములవంటి తమ్మి మొగ్గలు గానవచ్చుట వలనఁబద్మవనముల సౌరులు చనుమొలకలు మొలచిన కన్నెవడుచులవలెఁ గనిపించెను.

4 – 39 తాత్పర్యము : శ్రీకృష్ణుఁడు రాధిక యధరమునఁ జేసిన దంతక్షతముల రేఖలవలెఁ గ్రొత్త మంకెనపూలపైఁ దుమ్మెదలు వ్రాలియుండుట తోఁచెను.

4 – 40. తాత్పర్యము : రాధ మెడకు సామ్యము కాలేక పాంచజన్య మోడి యెటకో డాగఁబోయి, యామె భర్త శత్రువనియేమో వృషభకంఠధ్వని యందుఁ జేరినది. అలంకారము, ఉత్ప్రేక్ష

4 – 46 తాత్పర్యము : సాటిలేని తపస్సును వేసఁగియందు మిక్కిలి వాఁడి మీరిన పుండరీకుఁడను సూర్యుఁడు వికసింపఁజేయు కమలముల వికాస మెపుడును వాడిపోని తావితో నింపు గలిగియుండఁగా – మీఁది పద్యముతో నన్వయము.

ఇందు శ్లేషాలంకారమును బులుసువారు చెప్పినారు. అది సరి కాదు· పద్యమందలియే శబ్దమందును శ్లేష పుట్టుటలేదు తపస్తపము, ధరణీసుమనస్త పనుఁడు – అను తావులలో రూపకాలంకార మున్నది. కమల వికాసము వేయుట కన్వయింపఁబడుటచేఁ బరిణామాలంకారమున్నది

4 – 47. ఆద్యశివ + అధిష్ఠితమై, ఆద్యశివా + అధిష్ఠితమై = ఆది శివునకు, నాదిశక్తికి నధిష్ఠానమై – ఒకే పదమున శ్లేషలో సిద్ధించుటవలన శివ శక్త్యభేద స్థానముగా సహస్రారము కీర్తింపఁబడినది.

ఉద్యత్ = పైకి వచ్చుచున్న – ఊర్ధ్వగతి పట్టుచున్న. జ్యోతిర్విలాస యుతమై = జ్యోతిర్విద్యయొక్క విలాసములతోఁగూడినదై.

స్వశిరఃపదోద్భవమై = 1. తన శిరోమార్గమునందుఁ బుట్టినదై. 2. 'తన' యను భావమే శిరస్సు మార్గమున నుద్భవమందినదై – స్వయం భువై.

తాత్పర్యము : ఆది శివశక్తుల కభేదస్థానమయి, యూర్ధ్వమార్గము చూపు జ్యోతిర్ధ్యానము కలదియయి, తన శిరస్సున నుద్భవించి స్వయంభువుగా దారి చూపునదై నిర్దోషభావమైన సహస్రారమున – మీఁది పద్యమున కన్వయము, అలం. శ్లేష. పరికరము.

4 – 48. నాలుఁగు రెండుమూలలన్ = ఆరుకోణములయందును – షట్చక్రములందును, యంత్రమందలి షట్కోణములందును, కుటిలత దాల్చు = వంపులు తిరిగియుండు – ఆరువంపులు తిరిగియుండు. మబ్బుఁ గ్రక్కుచున్ = పరవశత్వమందుచు.

తాత్పర్యము ; సహస్రారమునుండి జొటజొట ధారగాఁ గారుచుఁ బొంగు చున్న యమృత రసము నెప్పటికప్పు డాస్వాదించుచు షట్చక్రముల యందును వంపులు తిరుగుచున్న కుండలిని గగుర్పొడుచున ట్లుద్బోధించుచుఁ దన కుడిచెవిలో వినిపించు మేఘగర్జనవంటి నాదమును విని పరవశత్వమందుచు – మీఁది పద్యమున కన్వయము.

4 – 50. తాత్పర్యము : బ్రాహ్మణులలో హంస యనఁదగినవాఁడగు పుండరీకుఁడు ప్రకాశమానమగు యోగమను నది యందు సౌఖ్యమున నోలలాడు చున్నాఁడు. ఆ నదికి గురుజనభక్తియుఁ గృష్ణభక్తియును రెండు తీరములు. పాపములను చెట్లసమూహ మా నది యందు లీనమై మునిగిపోయినది. అతఁడు జ్ఞానానందమగు 'చిత్' అను తమ్మితూఁడుల నాహారముగాఁ జేసినాఁడు.

విశేషము : 'భూమిసురహంసము' 1. నీరక్షీర వివేచనమువలె నతఁడు చిదచిద్వివేచనము చేసిన విశిష్టహంసము. 2. ప్రాణాయామసిద్ధిచే హంస మంత్రమయమైన, యుచ్ఛ్వాస నిశ్శ్వాసలో సిద్ధుఁడు. అద్వయమునందు గురు భక్తివి, గృష్ణ భక్తిని న్యాసము చేసినాఁడు. అవియే యితని యోగసింధువున కుదరులు – హం – సో – యను మంత్రాక్షరములు. అందు హం – శబ్దమున నిశ్శ్వాసము, సో – శబ్దమున నుచ్ఛ్వాసము, యోగికి వ్యాపారితమగును. అప్పు డతని శ్వాస మొక హంసముగా నతని వాణికి వాహనమగును. యోగము పరిపూర్ణమై జీవి ప్రజ్ఞ దేవుని ప్రజ్ఞగా మార్పు చెందినప్పు డతని శ్వాసము 'సోహం' అని విపర్యాసమగును. అప్పు డతని శ్వాసదేహములు – అనఁగా సకారహకారములు - వీడిపోయి సోహంలోని యచ్చులు మాత్రము 'ఓ – మ్' అని నిరాలంబమునఁ గలసిపోయి 'ఓమ్' మిగులును. అప్పు డంతర్బహిఃప్రజ్ఞ లలో నతని జీవుఁడుండడు. తత్స్థానమున నతని దేహాదివ్యూహములం దంత ర్యామియే యుండును. ఇదియే మోక్షమని ముక్తియని సిద్ధియని నిర్వాణమని వివిధ సంప్రదాయములవారు చెప్పుదురు. నరమేధమని క్రతువులు చెప్పును. Crucifixion అని క్రీస్తు అనుయాయులు చెప్పుదురు.

4 –51. తాత్పర్యము : బ్రాహ్మణుఁడగు పుండరీకు నెదుట బ్రహ్మ నిలఁబడెను. అతని మొగములు వేదములను మాణిక్యము లుద్భవిల్లుటకు గనులు. తన కమండలు జలములు విష్ణువున కర్ఘ్యపాద్యాదికమును సమకూర్చు నూటచెలమ. తన మనస్సునఁ దోచిన దేదియైన రూపొంది యస్తిత్వమందును. తాఁ గట్టిన వస్త్రము సృష్టించుదీక్షకై కట్టినదన్నట్లు రంగు దిరుగఁగా, సరస్వతి యాయనకు వింజామరము వీఁచగా నామె చనుదోయి యతని యొరగుగా నా బ్రహ్మ వచ్చి నిలఁబడెను.

విశేషము : దీక్షావస్త్రము రంగు దిరుగుట సహజము. ఇచ్చట నా వస్త్రమజినము. అది కప్పుదేరుట యనఁగాఁ గృష్ణాజినము నల్లని మచ్చలతో నున్నదని యర్థమే కాని 'చాలరోజులవఱకును విడువరాని దగుటచే అది మురికి కలదయి నలుపెక్కిన దనుట' యని బులుసువారి యూహ నరికాదేమో !

4 –54, 55. విశేషము : 'జగజ్జననస్థితిలయకారణ జనినజునిన్, అను టలోఁ ద్రిమూర్త్యాత్మకమైన పరమాత్మనే పుండరీకుఁడు చూచి బ్రహ్మయందుఁ బూజించెను గాని బ్రహ్మయందు బ్రహ్మత్వము, దేవతలయందు దేవత్వము ఖండ దృష్టితోఁ బొంది యుండలేదని చెప్పుట. కనుకనే 'అనర్చిత తదితరుఁడు' అను విశేషణ మావశ్యకమైనది.

4 – 56. విశేషము : ఇందలి స్తుతియంతయు నంతర్యామికిఁ జెంది నదే గాని బ్రహ్మ – చతుర్ముఖబ్రహ్మ – కుఁ జెందినదిగాదు. వేదములు, పురాణములలో ఋషులు చేసిన వివిధ దేవతాస్తుతు లన్నియు నొకే యంతర్యామి యొక్క వివిధ దేవతాత్వమును నుతింపును. ఈ స్తుతియు నా సంప్రదాయము ననుసరించి రచింపఁబడినది.

4 – 57. తాత్పర్యము : తూర్పున వెలువు సూర్యోదయమును సూచిం చును. పద్మగంధము పద్మాకరమును సూచించును. ఓంకారము నుచ్చరించుట యొక మంత్రము నుచ్చరింపఁబోవు స్థితిని సూచించును. అట్లే శ్రీపతి వచ్చుటకు నీ రాక సూచకమయ్యెను.

విశేషము : 1. ధ్యానమునందు వెలుఁగు గనిపించుటనఁగా యోగికి జ్ఞానానంద సూర్యోదయమైనట్లే. 2. యోగపద్మముల యామోదము – అను భూతి – యోగానందము యొక్క సమగ్రత్వమును సూచించును. 3. వేదము గాని, మంత్రముగాని ప్రణవము లేనిదే యుచ్చరింపఁబడుట జరుగదు. మఱియు యోగికాని ప్రణవోచ్చారణ మొనర్పలేఁడు. అది యొనర్పఁగలిగినవానికిఁ బ్రత్య క్షరము మంత్రత్వమందును. 4. సృష్టిలోఁ జతుర్ముఖ సృష్టికి మూలము నెఱిఁగినవాని కంతర్యామి యనుభూతమగుట తథ్యము.

4. 58 – 59. అర్చాదులయందున్ = 'పూజ మొదలగువానియందు' – బులుసు.

అర్చారూపక్షేత్రతీర్థ దైవతమూర్తులందను నర్థము సమంజసము. ప్రత్య క్షమైన యొక దేవతయొక్క జ్యోతిర్మయ రూపమును విగ్రహముగా స్వీకరించి నప్పుడు ప్రత్యక్షమైనంత సులువుగా నితర భౌతిక విగ్రహాదులయం దారోప్య మానుఁడు కాడు. చేతనవంతములైన మూర్తులయం దంతర్యామిభావన పద్యఃఫలము. బ్రహ్మవచ్చుట యనఁగాఁ బుండరీకుఁడు బ్రహ్మను జూచు స్థితినందుట. ఏ దేవతయుఁ బ్రత్యక్షమగు లక్షణ మిదేయని సంప్రదాయము చెప్పును. ఆ స్థితికి వచ్చినాఁడవి గమనించి పుండరీకుని "వాసుదేవ ప్రియుఁడు"గా బ్రహ్మ గమనించినాఁడు.

4 – 61. విశేషము : 1. మున్నె యాయన నిను నేలినాఁడు – జీవుఁడు దేవుని గూర్చి తపస్సు చేయుట యనఁగా దేవుఁడతని ననుగ్రహించుటయే. తపస్సు చేయు సంకల్పము దేవుఁ డిచ్చినదేగదా . కనుక నిట్టి తపస్సు చేయు బుద్ధి నిచ్చి యాయన నిన్నేలినాఁడని భావము. 2. చతుర్థసంపద – పురుషార్థ ములలో నాల్గవదియగు మోక్షము. స్థితులలో నాలుఁగవది యగు తురీయస్థితి వాక్కులలో నాల్గవది, పరమాత్మ నుచ్చరించునదియగు తురీయమగు పరావాక్కు.

4 – 65. తాత్పర్యము : పై విధమున వితర్కించుకొనుచుఁ . దన మనస్సును లేదివి మీమాంసయను నడవియందుఁ ద్రిప్పుచుండఁగాఁ దన దక్షిణ నేత్రమను పద్మదళ మదరెను. అది శుభసూచకము.

విశేషము : నిజ దక్షిణేక్షణవనజచ్ఛదము – శ్లేష – జననము లేని – – దేవుని - దాక్షిణ్య వీక్షణమగు వనమాలికయాకు భవరోగ భేషజము. మృగము వనమునఁ ద్రిప్పుచున్నాఁడు గనుక దానికి మంచిమేతగా నీ వనజచ్ఛదము మెదలినది. అది శుభసమూహములను సూచించును.

4 – 67. విశేషము : 1- యథాకాలప్రబుద్ధుండై = కాలానుగుణమైన మెలకువ కలవాఁడై – అనుగుణమైన తపస్సిద్ధియు జ్ఞానానందానుభూతియుఁ దురీయస్థితియం దాత్మదేవతా దర్శనము చేసి మేల్కాంచినవాఁడై. 2. పూర్వాశ్రిత సిద్ధాశ్రమంబున = పూర్వము నెలవుకొనియున్న తన తపస్సిద్ధికరమగు నాశ్రమమున. పూర్వ + ఆశ్రిత = తూర్పుదిక్కు నాశ్రయించియున్న – సిద్ధుఁడగు సూర్యాంతర్వర్తి యాశ్రయించియున్న స్థానమున. ఆధ్యాత్మికముగా సూర్యోదయము కలుగు హృదయకమలాంతస్థిత స్థానమున. 3. బద్ధపద్మాసనాసీనుండై = బంధింపఁబడిన – న్యాసము, ప్రాణాయామము, ధారణము, సమాధి యనువానిచేఁ బ్రాణగతి బంధింపఁబడిన – పద్మమను హృదయపద్మమను – నాసనమున నాసీనుండై.

3 – 68. విశేషము : 1. చతుర్దళాఢ్యము = నాలుఁగుదళములు కలది – ఆత్మనామవన చ్చతురక్షరములు కలది. చూ. 3 – 133. పద్యమునకు వ్యాఖ్య. 2. వాదిమసాంతాక్షరయుతమగు = వకారము మొదలు సకారము వఱకు. వ – శ – ష – స యను వర్ణము లాత్మనామమున న్యాసము చేయఁబడుట షట్చక్రభేదన కుండలినీ యోగసాధనలో నొక భాగము.

3 – 68 నుండి 74 వఱకు. ఇందు వరుసగా మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధి, ఆజ్ఞా, సహస్రారచక్రములందు జరుగు యోగసాధన క్రమము, తదనుభూతియు వర్ణింపఁబడినది.

3 – 75. ఇందుఁ బైఁ జెప్పబడిన షట్చక్రముల ద్వారమున సప్తమ స్థానమగు సహస్రారమును జేరిన కుండలినీయోగానుభూతి వర్ణింపఁబడినది. – చూ. 1 – 99, 100 పద్యముల వివరణము.

4 – 76. ఇందుఁ బరమ భాగవతోత్తములగు ఋషీంద్రు లాచరించు యోగమార్గ విశేషము – షట్చక్రభేదనముకన్న భిన్నమైనది వర్ణింపబడినది. ఈ మార్గ మవలంబించు సాధకుఁడు సహస్రారమున నెలకొనఁడు. మఱల ననాహతమునకు దిగి, పురాణ పురుషుని బాహ్య ప్రపంచమందలి యాబ్రహ్మ పిపీలికమునందును దర్శించుచు సమాధి స్థితిని వదలక వర్తించును. అట్టివాఁడు కారణజన్ముఁడై సోదర జీవరాశుల నుద్ధరింప నిమిత్తముగా జననమరణాత్మక ప్రపంచములోనికి దిగి వచ్చి వర్తించుచుండియు నందుఁ జిక్కువడఁడు. ఇతర జీవులు కర్మ బద్ధులై జన్మించి జీవితమును నడుపుదురు. ఇతఁడు మాత్రము సంకల్పజమైన జనన, జీవన, మరణాత్మకమగు నానుపూర్విలోఁ గార్యకారణ సంబంధము లేక వర్తించును. వేద, పురాణ సమ్మతమైన యుత్తమ పదవి యిదియే.

అట్లు వర్తింపవాని ప్రజ్ఞలో జీవుఁడుండక పురాణపురుషుఁ డుండును ఈ స్థితి నందినప్పుడు గాని "కనుదెఱవి తనదు లోసం గను తేజము ప్రోలఁగాంచుట" – 4 – 78 జరుగదు.

4 – 79. టీక. లలితపదార్పణాలంకృతమహి = 1. లలితములైన యడుగులుంచుటచే నలంకృతమైన భూమి కలవాఁడు. 2. లలితమైన పదము – భగవద్వాచ్యమగు నాత్మనామము – నర్పించుటచే – భగవంతునకే యర్పించుటచే – నలంకృతమైన యీ జగత్తు – అంతర్యామిగాఁ జేయఁబడిన జగత్తు కలవాఁడు. దళితోపరిత్వగుజ్జ్వలదంశుమత్ప్రలా స్తంభాభిరామోరు దండయుగళ – 1. పై పొలు యొలుపుటవలన నిగనిగల కాంతులతోఁ గూడిన, పండ్లగెలలోఁ గూడిన యరటి చెట్టు స్తంభములవలెనున్న తొడలజంట కలవానిని – ఇట నతని మొలత్రాటి మువ్వ లఱటిగెలతోఁ బోలిక చెందినవి. 2. చీల్చబడిన పై పొలు– తన కన్న భిన్నమైన జగత్తున్న దను నజ్ఞానము. దీనినే ఐతరేయము 'objectivity' యని వేదవిదులు వర్ణింతురు అగుట వలనఁ బ్రకాశించు కిరణముల ఫలము – (చిదానందము) – స్తంభించుట యట్లభిరామమైన తొడలు గలవానిని. వరదానముద్రాబ్జభరణ భూషితకటిన్యస్త కుంచితసమున్నతభుజాఢ్య – 1. వరమిచ్చు భంగియను దమ్మి పూవును – (లేదా వరమిచ్చు ముద్ర గల చేతితోఁ దమ్మిపూవును) – ధరించి భూషణయుతమైనది, కటియందుంచఁబడినది, ముడువఁబడినదియనగు చేతితో నాధిక్యమందిన వానిని. 2. వరదానముద్రచే షట్పద్మములను ధరించి పోషించునట్టి, ముడువఁబడిన భుజము గలవానిని – (యోగి యొక విధముగా నా భుజమును ముడిచి గుప్పిడుపట్టి తనహృత్పద్మస్థానమునను, మఱియొక చేయి నడుమునను ధరించుటవలన నభయమను ముద్ర (attitude) సిద్ధించును).

విశేషము : దైవానుభూతి మహానుభావముయొక్క నిర్భరత్వమువలనఁ దొలుత నాకోశ స్థితియుఁ బరువెత్తుటయుఁ గలుగును.

4 – 86. టీక. భవ్యభేషజతతుల్ = 'గొప్ప మందుల సమూహములు" . ... 'మర్యాదన్' – 'మర్యాదతో' – బలుసు. భవ్య భేషజతతులనఁగ భవమునకు సంబంధించిన రోగములకుఁ జికిత్సాపరంపరలు. మర్యాదన్ = హద్దులలో.

తాత్పర్యము : నీ యవతారంబులు సూర్య కిరణములు – అజ్ఞాన దుఃఖాంధకారహరణములు – లేదా సూర్యుడు నివాసముగాఁ గలవి – సూర్యాంతర్వర్తి యగు సర్వాత్మయే సకలావతారములుగా దిగివచ్చును – అవియే సిద్ధించిన మంత్రములు – మంత్రము లావశ్యకము లేక యవతార కీర్తనము చేసినచో ముక్తి కలుగును. చంద్రకాంతులు – అమృతస్పర్శగలవి – మంచి శ్రేష్ఠమైన రతనాల వరుసలు – స్వయంప్రకాశములు. అంతర్యామి యగు నగ్నిని రత్నధాతముఁడని శ్రుతులు కీర్తించును. ఋగ్వేదము. 1 – 1 – 1. : భవరోగముల భేషజముల వరుసలు, నాదము లనఁబడు జగత్ప్రాణములను ధరించిన మేఘములు – కరుణను, జీవనమును వర్షించునవి. ఇట్టి నీ యవతార విశేషములు లోకములకు

క్షేమము కలిగించి పరిపాలించును, లోకములను ధర్మపు హద్దులలో నిలుపును, లోకహితములైన చర్య లాచరించుటలో నగ్రగణ్యమైన సంభారము కలవి.

4 – 91. టీక. జయవిజయ పూర్వవిభవ = 'విజయము పూర్వముగా – ముందుగా గల సంపద కలవాఁడా' – బులుసు. జయ విజయులతోఁ గూడిన వైభవము గలవాఁడా! – ద్వారపాలక సహితముగా వైకుంఠమున నివసించు వాఁడా! – యని చెప్పుట యుక్తము.

4 – 94. విశేషము : మోడ్పునకేలు – తిక్కన 'గారవంబున మొగంబును' వంటి ప్రయోగము.

4 – 96. టీక : పితృహితోద్యముఁడు = 'తండ్రికి హితమైన ప్రయత్నము కలవాఁడు' – బులుసు. తల్లిదండ్రులకు హితమైన యుద్యమము కలవాఁడనుట యుక్తము.

4 – 97 నుండి 103 వరకు. విశేషము : ఇందు భగవద్గీత, భాగవతము, విష్ణుపురాణములలోని పరమ భక్తి ధర్మములు క్రోడీకరింపఁబడినవి.

4 – 124. తాత్పర్యము : పాపములను బోఁగొట్టుటలో విష్ణుభక్తి తగును గాని, దాని యంతగా మునిరాజు లేర్పఱచిన ధర్మశాస్త్ర ప్రాయశ్చిత్తములు సమర్థములు గావు. విష్ణుభక్తిముం దవి యలసములు. పాముల గాఢమైన కాటులు మంత్రవదోచ్చారణమునఁ బోవును గాని వస్త్రములతోఁ దుడిచినఁ బోవునా?

4 – 134. మువ్వంక మురువు = 1. మూఁడు వంకలు వచ్చునట్లు – త్రిభంగి – చక్కఁదనముతో, 2. మూఁడురంగుల యందముతో – రజోగుణ మెఱుపు, తమోగుణము నలుపు, సత్త్వగుణము తెలుపు –. 3. మూఁడు వర్ణముల యందముతో – అ – ఉ – మ – లతో –. 4. మూర్తిత్రయ తత్త్వముతో.

తిర్వీధులు = తిరు + వీధులు = శ్రీపథములు, దివ్యపథములు, పెద్దలు వెడలు మార్గములు. ఏండ్లవెలయు ప్రాయంబుగల కొయ్య = సంవత్సర స్వరూపమున వెలువడు వయస్సుగల శాశ్వతమూర్తి – కాలాతీతుఁడయ్యుఁ గాలస్వరూపుఁడు.

4 – 148. తాత్పర్యము : గృహలక్ష్మి యగు నీ సుశీలకు నేర్పుగాఁగస వూడ్చుటయే నిన్నటి యలంకారములను దొలఁగించుట, ఆవుపేడతో నలుకు నలంకారమే సుఖస్నానము, చక్కని నిండుకుండలను బూజాభావమున నేర్పఱచుటయే నిమ్మపండ్లవంటి స్తనముల కలంకారము, అన్నము వండుటకు రాజఁబెట్టిన నిప్పు పొగయే సంస్కార సుగంధ ధూపము, సింహద్వారము తెఱచి యుంచుటయే వెడదకన్నుల నలంకరించుకొనుట, గుమ్మమును బూజించుటయే పెదవుల నలంకరించుకొనుట, కుండలను వస్త్రముచేఁ గప్పుటయే తెరచీర గలిగి యుండుటయై తోఁచెను.

4 – 196. టీక : పెఱవితంతువులన్ = 'విధవలైన ఇతరుల భార్యలను' — బులుసు.

'విధవరాండ్రగు పరస్త్రీలను' అనుట యుక్తము.

5 – 25. తాత్పర్యము : యుద్ధము చేయుచున్న మహిషాసురుని దన కాలి బొట్టన వ్రేలి చివరిభాగముతోఁ ద్రొక్కిపట్టి వాని శరీరమును మర్దనచేసి – తిలకము రంగరించినట్లుగ దీసి – పెట్టుకొనిన యా నెత్తురుబొట్టువలె జ్యోతిర్మయ మగు మూఁడవకన్ను నుదుటిపైఁ గల దుర్గ స్వర్గఫల మిచ్చునది – దుర్గ దుర్గతి హారిణియని శ్రుతులు పలుకును. పాండురంగఁడామె నుత్తరవు వాకిట నిలిపి నాఁడు.

5 – 74. టీక : వృషలీపతి = 'శూద్రస్త్రీభర్తయైన శూద్రుఁడు' – బులుసు. శూద్రస్త్రీభర్తయే గాని యతఁడు శూద్రుఁడు గాఁడు. భ్రష్టబ్రాహ్మణుఁడని యతని నామము, కథాసందర్భము చెప్పుచున్నవి. ఇందతని పాపముల పరిగణనము చేయఁబడినది. మఱియు శూద్రుఁ డనుటకు వృషలీపతియను పదము వాడుట సంభావ్యము కాదు.

5 – 77. విశేషము : అవిషము అను పదము జలములను నర్థమునఁ జిత్రముగాఁ బ్రయోగింపఁబడినది. అతఁ డాచరించిన పాపములకు విషమని చమత్కృతి.

